
మూడవ సహస్రాబ్దికి ఒక భవిష్య కథనము

శ్రీమాతారవింద వచనామృతం



Les annonciateurs du monde supramental

"అతిమానస ప్రపంచ వార్తావహులు"

అఖిల

అఖిల భారత పత్రిక, జనవరి, ఫిబ్రవరి 2000

మూడవ సహస్రాబ్దికి ఒక భవిష్య కథనము

అసతో మా సద్గమయ।
తమసో మా జ్యోతిర్గమయ।
మృత్యోర్మా అమృతం గమయ॥
ఓం శాంతిః శాంతిః శాంతిః॥

(బృహదారణ్యకోపనిషత్తు)

జడము నుండి సత్య జీవనానికి,
చీకటి నుండి జ్యోతిస్సునకు,
మృత్యువు నుండి అమృతత్వానికి, నడిపించు.
ఓం శాంతి, శాంతి, శాంతి

(బృహదారణ్యకోపనిషత్తు)

तथास्तु అట్లే అగు గాక

Sri Aurobindo

శ్రీమాతారవిందుల రచనల నుండి సంకలనము

విషయసూచిక

విభాగము I : మర్మ ప్రణాళికా ప్రకటన

విభాగము II: 'అహం' ను తొలగించి దివ్యచైతన్యానానికి పట్టాభిషేకం చేయటమెలా?

విభాగము III: ఆధ్యాత్మిక యూగాగమనము

విభాగము IV : అతిమానస అవతరణకు పర్యవసానం

విభాగము V : ఉషోదయ కిరణ పుంజాలు

అనుబంధం

అనంతత్వం వైపుకు మరొక అడుగు

శ్రీఅరవిందుల వచనామృతము

భారతదేశంలో పూర్వఋుమల సంప్రదాయ పద్ధతి లోనే శ్రీఅరవిందుల యోగవిధానం ప్రారంభమైంది; ఈ దృశ్యమాన జగత్తుకి ఒక పరమార్థం ఉంది. అన్నిటి లోనూ ఉండే ఆత్మ ఒక్కటే. అది శాశ్వతమైనది. సమస్త జీవరాసులు ఆ పరమాత్మలో ఏకీభూతంగా ఉంటాయి. అయితే చైతన్యము లోని ఒక విభక్తత వల్ల అవి మూలం నుంచి వేరై ఉంటాయి. అదే మనః, ప్రాణ, శరీరాలలో నిజతత్వాన్ని కప్పివేసిన అజ్ఞానం...

ఇక్కడ భూమి మీద పదార్థజగత్తులో ఆ పరాత్పరుడు చిక్కుబడి ఉన్నాడని శ్రీఅరవిందుల బోధనాసారము చెపుతున్నది. దానిలో నుంచి బయటపడే విధానమే పరిణామ క్రమము. ఇంతవరకూ జడంగా ఉన్న దానిలో చైతన్యం కలిగింది. వెంటనే అది స్వయం ప్రేరకంగా విస్తరించుకుంటూ పోయి గొప్ప పరిపూర్ణత్వం పొందాలని అన్ని వైపులా వృద్ధి చెందింది. ఈ విధంగా వృద్ధిపొంది విడుదలైన చైతన్యం ఎక్కిన మొదటి మెట్టు ప్రాణం, రెండవది మనస్సు. అయితే మనస్సు దాకా వచ్చిన పరిణామ క్రమం ఆగిపోదు. ఈ విధంగా పదార్థం లోని చైతన్యం క్రమంగా విడుదలై ఇంకా ఘనంగా సాగాలనుకుంటుంది; అది ఆత్మానువర్తిగా, అతిమానసము (Supermind) గా రూపొందాలనుకుంటుంది. అతిమానస పురుషని ఆవిర్భావమే పరిణామ క్రమంలోని తదుపరి దశ. ఈ విధంగా పరిణతి పొందినప్పుడు చైతన్య జీవిని నడిపించేది చిదాత్మ శక్తే కాగలదు. ఇక అప్పుడు పదార్థంలో నున్న పరమాత్మ దాన్ని వదిలించుకొని అందులో నుంచి పూర్తిగా బయట పడగలడు, ప్రాణి లోకంలో పరిపూర్ణత వ్యక్తం కాగలదు.

*

పృథ్వీ సమస్యకు పరిష్కార మార్గం: మనకి దృగ్గోచరమయ్యే ఈ సకల జగత్తుకి నిగూఢమైన కారణం చైతన్యమూర్తియైన ఆ పరమాత్మ జడ పదార్థంలో చిక్కుపడి ఉండటమే (అంటే తన శక్తిని తగ్గించుకొని ముకుళనం చెందడమే). బాహ్యానికి అపరిష్కృతంగా కనిపించినా మహాశక్తి శాలిని, మహోగ్రవేగ వాహినియైన జడ ప్రకృతిలో నిగూఢంగా ఉన్న అనంత చైతన్యం, శక్తి విడుదలై క్రమపరిణామం పొందటమే ఈ ప్రాపంచిక సమస్యకు పరిష్కారము. ఆ పరదైవతం ఇచ్ఛా పూర్వకంగా ఈ పృథ్వీ జీవితాన్ని తనకు నివాస స్థానంగా ఎంచుకొన్నది. అంధకార బంధురమైన చెరసాలగా ఉన్న ఈ తన నివాస స్థానాన్ని ఒక దివ్యసౌధంగా, స్వర్గాన్ని అందుకోగల దేవాలయంగా మలుచుకోవాలనేది యుగాల తరబడి కలిగిన ఆ దైవ సంకల్పము

*

మానవుడు చేరవలసిన తదుపరి గమ్యం: మానవుడు పరిణామ క్రమంలో ఒక మధ్యస్థ జీవి మాత్రమే. సృష్టి మానవునితో ఆగిపోదు. మానవుని లోనూ, ఇంకా మానవుని దాటి అతిమానస జీవి స్థాయిని చేరే దాకా అంచెలంచెలుగా అనేక మెట్లున్నాయి.

పృథ్వీ పరిణామంలో సాధించవలసిన తరువాతి కార్యము మానవుడు అతిమానస జీవుడిగా తయారు కావటమే. మనం చేరవలసిన గమ్యం అదే. కష్టాలతో కూడిన పరిమిత మానవ జీవితానికి స్వేచ్ఛను ప్రసాదించే సూత్రం కూడా అదే. అది అనివార్యము. పదార్థ జగత్తులో పరదైవతం ఉద్దేశించేది అదే; ప్రకృతి మాత ప్రక్రియల పరమార్థమూ అదే.

ఈ పదార్థమయ ప్రాణి ప్రపంచానికి రానున్న మహా దివ్య తేజోమయ భవిష్యత్తు అప్పుడే తళక్కుమని మెరుస్తూ కనిపిస్తోంది. అదే మానవుడు దివ్యమానవుడుగా రూపాంతరము చెందగల సాధ్యతను సూచించే ప్రథమ సంకేతపు మెర మెర: పదార్థమయమైన చిక్కుల పంజరం నుంచి పరదైవం విముక్తి పొందగలడనే ఒక ఆశాకిరణము. మనుష్య ప్రపంచంలో అతిమానసజీవి ప్రత్యక్షంతో ఆ ఆశ సఫలీకృతం కాగలదు.

పృథ్వీమాత ఘోషించి ఆహ్వానిస్తే ఆ పిలుపు వెనువెంటనే ఆ పరమాత్మకు చేరగలదు. అద్భుతమైన రూపాంతరీకరణం కావాలనుకుంటే ఇదే క్షణం లోనే సంప్రాప్తం కాగలదు కూడ.

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వి. ఆర్. శాస్త్రి

∴

మర్మప్రణాళికా ప్రకటన (Revelation of the Hidden plan)

శ్రీఅరవిందుల 'సావిత్రి' నుండి

Man shall desire to climb to his own heights.
The truth above shall wake a nether truth,
Even the dumb earth become a sentient force.
The Spirit's tops and Nature's base shall draw
Near to the secret of their separate truth
And know each other as one deity.
The Spirit shall look out through Matter's gaze
And Matter shall reveal the Spirit's face.
Then man and superman shall be at one
And all the earth become a single life.
Even the multitude shall hear the Voice
And turn to commune with the Spirit within
And strive to obey the high spiritual law:
This earth shall stir with impulses sublime,
Humanity awake to deepest self,
Nature the hidden godhead recognise.
Even the many shall some answer make
And bear the splendour of the Divine's rush
And his impetuous knock at unseen doors.
A heavenlier passion shall upheave men's lives,
Their mind shall share in the ineffable gleam,
Their heart shall feel the ecstasy and the fire.
Earth's bodies shall be conscious of a soul;
Mortality's bondslaves shall unloose their bonds,

Mere men into spiritual beings grow
And see awake the dumb divinity.
Intuitive beams shall touch the nature's peaks,
A revelation stir the nature's depths;
The Truth shall be the leader of their lives,
Truth shall dictate their thought and speech and act,
They shall feel themselves lifted nearer to the sky,
As if a little lower than the gods.
For knowledge shall pour down in radiant streams
And even darkened mind quiver with new life
And kindle and burn with the Ideal's fire
And turn to escape from mortal ignorance.
The frontiers of the Ignorance shall recede,
More and more souls shall enter into light,
Minds lit, inspired, the occult summoner hear
And lives blaze with a sudden inner flame
And hearts grow enamoured of divine delight
And human wills tune to the divine will,
These separate selves the Spirit's oneness feel,
These senses of heavenly sense grow capable,
The flesh and nerves of a strange ethereal joy
And mortal bodies of immortality.
A divine force shall flow through tissue and cell
And take the charge of breath and speech and act
And all the thoughts shall be a glow of suns
And every feeling a celestial thrill.
Often a lustrous inner dawn shall come
Lighting the chambers of the slumbering mind;
A sudden bliss shall run through every limb
And Nature with a mightier Presence fill.
Thus shall the earth open to divinity
And common natures feel the wide uplift,
Illumine common acts with the Spirit's ray
And meet the deity in common things.
Nature shall live to manifest secret God,
The Spirit shall take up the human play,
This earthly life become the life divine.

తలచి మానవు డెక్కు నా ధర్మ గిరుల
పుడమి బలమైన శక్తిగా మురువు జూప

ఉన్నతంబైన నిజముల నెన్నగాను
దాపులో నున్న నిజముల తట్టి లేపు.

భౌతికతమారనధ్యాత్మ భావ జాల
సీమయై ముందు వెన్కల చేర రాని
నిజములవ్వల నివ్వల తోచగాను
మనుజుడెంచును దానినె మహితమైన.

ఒక్కటై యుండ దైవపు చొక్కమైన
తీరులో తెన్నునంతట తిరుగు లేక
మనిషి పురుషోత్తముడు చేరు యరల లేని
యొక్క టైనట్టి యక్షాన యొరుసు కొనుచు.

ఉర్వి యొక జీవనది వోలె పర్వులెత్త
జీవులాత్మతో యైక్యత చేరగాను
దివ్య సూత్రాల నొడబడి తెరువుగొనగ
విందురందరు దివ్యమై చెందురవము.

జగములో నున్నతాశలె చలనమొంద
మానవత్వము గుండెల మాటు నున్న
ఆత్మతా స్ఫూర్తి మేల్కొల్పి నంతలోనె
ప్రకృతి తెర వెన్క నున్నట్టి భవ్యమైన
దివ్యతత్త్వపు శీర్షము తెలియవలెను.

దివ్యమైనట్టి యానంద భావ భార
ములను మోయుచు నీ జగమున్న వారు
కానుపించని తలుపుల కవ్వలైన
సవ్వడుల పురుషోత్తము జక్కగ విని
యుత్తరంబుల నీవలె యొక్కసారి.

దివ్యమైనట్టి యున్మాద తేజరాశి
మానవుల గుండెలోతుల మరుగు నుండి
పొంగి పొరలుచు దీప్తులు నింగికెగయ
పొందవలె దివ్యానందము పొందు కాంతి.

పాంచ భౌతిక దేహాలు సరమయైన
యాత్మ యునికిని గుర్తించి యన్ని యెడల
మర్త్య బంధన జాలము మరల రాగ
ముక్తి నందగ వలయును యుక్తి మీర.

యోగ సాధన లేనట్టి భోగులైన
మానవులు కూడ దివ్యమౌ మానమందు
జీవతత్త్వము పొందగ చెన్ను మీరు
దివ్యతత్త్వ మేల్కొల్పు తెలియ వలయు.

ప్రకృతి శిఖరాల తాకగ బలము మీరి
నాధి బౌద్ధిక భావనలన్నియంత
ప్రకృతి లోతుల లోపల సుకృత మయిన
మేలుకొల్పొకటి యచట కలుగవలయు.

నేత యౌచును బతుకు నసత్య మొకటి
మనము కాయము కర్మల మాటలన్ని
శాసనము చేయ మానవ జాలమెల్ల
మింటి యంచుల చేరుచు మీరునట్లు
దేవతల పొంత నున్నట్లు తలవ వలెను.

అంధకారము చెండాడి యన్ని చోట్ల
వెల్గునాజ్ఞాన వాహిని వెల్లి విరియ
నవ్య జీవన భావము దివ్యముగను
వెలుగు రానట్టి మనముల చెలగుచుండ.

జ్ఞాన వాహిని పొరలిన మనము లందు
ఆశయపుటగ్ని రగులగ యతిశయించి
మర్త్యతా జ్ఞాన భావాల వేరుపరచు
నగ్ని మండగ వలయును నందరి యెడ

ఎడద లోతులె యగ్నితో చెరల వీడ
మానవులు పిల్వ తెలియని ఘనత మీరు
అంతులేనట్టి భావాల నంత వారు
విందురెల్లెడ దివ్యమౌ నాదములను.

అంతరంగాన జ్యోత్స్నలె యంతులేని
రీతి విలసిల్లు దివ్యమౌ లీలవంటి
నాదమెంతయొ వినుచును నాద బిందు
కళల యనుభూతి నందిన కర్మి యందు.

దివ్యతత్త్వము నిండిన తేజములతో
ఎడదలన్నియు నిండగ ముడులు వీడ
మానవేచ్ఛయె మారును మహితమైన
దైవ సంకల్ప మూర్తిగా దళితమవక.

మర్త్య బంధాల వీడిన మానవులును
దైవసంకల్ప బంధము తలచు వారు
నొకటి యైనట్టి యధ్యాత్మ వీకదలచ
దివ్యమౌ తెల్వి బలముగా తెలియ రాగ.

మాంసలంబైన దేహాలు మనుజులందు
నున్న నాడులు మారుచు నున్నతమగు
దివ్యానందామరత్వాల తెలియజేయు
చిన్నె కానెంతో యాశ్చర్య శైలి యందు.

నరము లందును నణువుల నన్నిటి యెడ
పొర దివ్యపు శక్తియే పొరపు లేక
వాక్కు కర్మల శ్వాసల వట్టిదవని
దివ్యశక్తికి యదుపున తేగ వలయు.

సౌర కాంతుల యోచనాజాల మందు
మీర భావనలన్నియు వెరగుపరచు
దివ్యానందాల డోలికల వగ్గనంత
దేహ భాగాల దివ్యత్వ తేజమలరు.

ఎడద లోతుల సూర్యుని పొడుపలలర
నిద్రితంబైన బుద్ధిని నిజము జూడ
మేలుకొల్పెడు సంరంభమాలసతము
దివ్యానందము నిండు నా దేహమంత.

ప్రకృతి నిండగ నా విరాట్పురుషతత్త్వ
మంత యీ భూమి దివ్యతా మార్గమవగ
నైజమైనట్టి ప్రకృతి నాశమొంద
తొలగు సంకుచితంబైన తోవలన్ని.

మానవుల చర్యలన్నియు మహితమైన
దివ్యకాంతితో నిండగ దివ్య తత్త్వ
భావమన్నిటి జూడగ ప్రకృతి యగును.
కానరానట్టి పురుమని చిన్నెవోలె.

చేర లేనట్టి యీ విరాట్పురుమడెపుడు
ప్రకృతి గమ్యముగా గను బతుకు లోన
సూత్రమవగా మనధ్యాత్మ సూత్రములవె
దివ్యజీవనమౌ మర్త్య జీవనమును

అనువాదం: డా॥ కె. సత్యమూర్తి

అహం, నీ కాలం చెల్లింది

శ్రీమాతృవాణి

శతాబ్దాల తరబడి మానవాళి ఈ ఘడియ కోసమే ఎదురు చూస్తోంది. అది రానే వచ్చింది. కాని అది చాలా క్లిష్టమైన సమయం.

మన మందరము ఈ భూమి మీద, విశ్రాంతి కోసం, భౌతిక సుఖాలనుభవించడానికే వున్నామని, నేను మీకు చెప్పజాలను. ప్రస్తుత సమయం అందుకు తగినది కాదు. నూతన సృష్టి కోసం సిద్ధమవడం కోసం మనము యిక్కడ వున్నాము.

నీవు, ఈ క్షణంలో ఈ భూమి మీద, ఇక్కడకు నీవు ఎన్నుకొన్న విధంగానే వచ్చి వున్నావు. కాని ఈ విషయం నీకు గుర్తు ఉండదు. ఆ సంగతి నాకు తెలుసును. నీ కర్తవ్య నిర్వహణకు పూనుకో, నీ బలహీనతలను, పరిధులను అధిగమిస్తూ శ్రమించి నీ 'అహం' కు 'కాలం చెల్లింది' అని చెప్పు. మనకు ఇప్పుడు 'అహం'కు బదులు, దివ్యచేతన్యమే గల జాతి కావాలి. జాతిని అభివృద్ధిపరచి 'దివ్యచైతన్య స్థితి' ని కలిగిన అతిమానస జీవి ఆవిర్భవించాలి.

*

అహం యొక్క ఆధిపత్యం అంతమొందాలి — అనేది ఖచ్చితమైన నిబంధన. 'అహం' యిప్పుడు మన పురోగతికి అడ్డంకి. 'అహం' ఉన్న చోటులో దానికి బదులుగా దివ్యచైతన్యం రావాలి. శ్రీఅరవిందులు దీనినే 'అతిమానస స్థితి' అన్నారు. మనము కూడా దీనిని 'అతిమానస స్థితి' అంటేనే ఎట్టి సందిగ్ధత లేకుండా వుంటుంది. మనము దైవత్వము అనగానే, అందరూ దేవుణ్ణే తలచుకుంటారు. దీని వలన ప్రతి విషయమూ నిష్ప్రయోజనమై పోతుంది.

*

మొదట మానవాళి సృష్టి జరిగినపుడు 'అహం' ఐక్యపరిచే శక్తిగా ఉండేది. అహం చుట్టూ జీవి యొక్క వివిధ పరిస్థితులు నెలకొని వుంటాయి. కాని ఇప్పుడు 'దివ్య మానవత్వము' ఆవిర్భవిస్తూనప్పుడు అహం అదృశ్యమైపోయి, చైత్యపురుషునికి దారి ఇవ్వాలి. ఈ చైత్యపురుషుడు భగవంతుని జోక్యం వల్ల క్రమముగా రూపొంది మానవునిలో 'దివ్యత్వము' ను ఆవిర్భవింపచేస్తుంది.

ఈ చైత్యస్థితి ప్రభావము వల్లనే మానవునిలో దివ్యత్వము ప్రకటితమై దివ్యమానవ జీవితానికి నాంది పలుకుతుంది.

చైత్యము శాశ్వతమైనది. దీని వల్లనే భూమి మీద అమరత్వము సిద్ధింపగలదు.

కాబట్టి ఇప్పుడు ముఖ్యముగా మనము చైత్యమును కనుగొని, దానిలో ఐక్యము చెంది, 'అహం' ను వెళ్లగొట్టేట్లు చూడాలి. ఈ అహం, బయటకు గెంటబడడమో, దానంతట అది అంతరించడమో జరగాలి.

*

అహం బైటకు పోవాలి. తప్పదు. అదొక్కటే దారి. 'నేను' అనే భావము అంతరించాలి. ఇంకేమీ వుండకూడదు. అది చదునుగా (చేతితో సంజ్ఞ చేస్తూ) ఒక నున్నని, మడతలు లేని, అద్భుతమైన పరిణామము గలిగినట్లు పతనం చెందాలి. అది మాటలలో చెప్పజాలని, ఒక గొప్ప, స్థిరమైన పరిస్థితి. "నీవనుకున్నది నీవు, సాధిస్తావు" (మాటలకందనిది). అది ఒక

గొప్ప అనుభూతి. శరీరమనేది లేనట్లు, అది ఉపకరించు ఒక వస్తువు మాత్రమే అయినట్లు ఉండి, ఎట్టి ఒత్తిడికి లొంగదు. (సంజ్ఞ) ఈ విశాలమైన చైతన్య స్థితి. అనుభవైక వేద్యము (శ్రీమాత తన చేతులను జాపారు) చివరకు నీవు చూస్తావు (చూపు). అది ఎట్టి రూపములతో కూడిన దృశ్యము కాదు. అది ఒక ఖచ్చితమైన మహత్తర శక్తి. అది ఒక ఒత్తిడి కలిగిన ప్రకంపనము. ఈ ప్రపంచము ఆ శక్తి క్రింద పెనుగులాడుతూ ఉంది. తరువాత ఆ శక్తి, బహిర్గతమై, విశ్వమంతా వ్యాపిస్తుంది. ఇది నిజంగా చాలా ఆసక్తికరమైన విషయం.

ఇది ఒక్కటే పరిష్కారము. మరేదీ లేదు. మిగతావన్నీ, ఆకాంక్షలు, భావనలు, సంభావ్యతలు. అది ఇంకా ఒక అతీతశక్తి గల వ్యక్తి మాత్రమే, అతిమానస స్థితి కాదు. అది ఒక మహోన్నత మానవత్వము. అది సర్వ మానవాళిని పైకి తీసుకుపోతుంది. కాని అది మన యోగానికి ఉపయుక్తము కాజాలదు.

ఇది ఒక స్పష్టమైన చిత్తరువు. మానవాళి పైకి రావాలనుకుంటే దేనినో ఒక దానిని పట్టుకుని వదలదు. కదలకుండా పైకి రావాలని చూస్తుంది. ఏమీ సమర్పించకుండా, ఏదో పొందాలనుకుంటుంది. అలాగ వీలు లేదు. తనను తాను సమర్పించుకోవాలి. అహంని వదలి పెట్టాలి. అప్పుడు ఆ దివ్యశక్తి తనంతట తాను దిగివచ్చి తన స్థానాన్ని ఆక్రమిస్తుంది.

ఇది పూర్ణమైన రహస్యము సుమీ.

ఉదాహరణకు మానవాళి, దివ్యచైతన్యాన్ని బలవంతంగా క్రిందికి దిగలాగాలని చూస్తుంది. (సంజ్ఞతో నుదుటిని చూపిస్తూ) ఇది బాగున్నది. కాని సరియైనది కాదు. అన్ని రకాల సాధ్యా సాధ్యాలను శోధించాలి. అప్పుడు కాని మానవాళి అసలు విషయాన్ని అర్థం చేసుకోలేదు. అదొక్కటే ('అహం' ని త్యజించడం అన్న దానికి శ్రీమాత, చేతులను విప్పి చూపిస్తారు). మనం 'అహం' అంతర్ధానమయ్యే వరకు భగవంతుని ముందు వినయంగా మోకరిల్లాలి.

నిజానికి, 'అహం' అంతర్ధానమవడమే — అతి కష్టమైన పని: దాన్ని మాయం చేయడానికి శిక్షణ అవసరం

అనువాదం: చావలి రామమూర్తి

∴

ఒక గొప్ప శిల్పి ఒక దేవాలయాన్ని చక్కగా నిర్మించాడు. ఆ దేవాలయము "చూశారా నా గొప్పతనము, నా అందము. నా స్థిరమైన పటుత్వము. అందరూ నన్ను మెచ్చుకోవాలి" అంటే, నీవేమంటావు? ఆ దేవాలయము తన యొక్క గొప్ప లక్షణాలన్నిటిని తానే సంపాదించినట్లు చెపితే, ఎంత హాస్యాస్పదంగా వుంటుంది? కాని అదే, మనము, నిత్యమూ చేస్తున్నాము. ఆ దేవాలయములాగానే మనము కూడా మనని నిర్మించిన చిచ్ఛక్తిని విస్మరిస్తున్నాము. ఆ మహోన్నత వైభవోపేతమైన శ్రామికుని యొక్క నిర్మాణ శక్తిని గ్రహింప లేని హీనస్థితిలో మనము ఉన్నాము. ఒక 'నిర్మాణము' తన 'అస్తిత్వము' నకు తానే కారణ మన్నట్లు, మనము గూడా దివ్యకార్యాన్ని మనకు ఆపాదించుకుంటున్నాము.

శ్రీమాత

అహం యొక్క అవరోధాలను అధిగమించి చైత్యపురుష సాక్షాత్కారము పొందటమెలా?

శ్రీమాతృవాణి

మొట్ట మొదట నీవు, నీ శరీరము నుండి, జీవిత పరిస్థితుల నుండి, వేరుగా ఉన్న దానిని కనుక్కోవాలి. ఇది మానసికస్థితి నుండి, నీవు మాట్లాడే భాష నుండి, నీవు నివసించు పరిసరముల నుండి నీ అలవాట్లు, ఆచారముల నుండి, నీవు పుట్టిన దేశము నుండి, నీవు పుట్టిన యుగము నుండి జనించదు. నీవు నీలో అంతర్గతమైన, పరిమితిలేని పరిణామముగల, ఎడతెగని నిరంతర చర్య గల, సార్వ జనీనత కలిగిన, భావమును కనుగొనాలి. అప్పుడు నీవు నీలోని భావాలను వికేంద్రీకరించి, పెంపొందించి, అన్ని వస్తువులలోనూ, వ్యక్తులలోనూ నివసిస్తావు. వ్యక్తుల మధ్య నున్న సరిహద్దులు సమసిపోయి, తొలగిపోతాయి. నీవు వారి ఆలోచనల్నే ఆలోచిస్తావు. వారి భావాలతో చరిస్తావు. వారి అనుభూతులనే అనుభవిస్తావు. ఇలాగే అందరి జీవితాల్ని నీవు జీవిస్తావు. నీలో నిస్తబ్ధముగా వున్న జీవశక్తి ఉత్తేజము పొందుతుంది. రాళ్ళు కదులుతాయి. మొక్కలు సుఖదుఃఖాలకు స్పందిస్తాయి. జంతువులు కూడా మాటలకు అందని భాషను వ్యక్తీకరించి, తమ స్పష్టమైన భావాలను తెలియజేస్తాయి. ప్రతి వస్తువులోనూ ఒక అద్భుతమైన కాలము, పరిమితి లేని జీవశక్తి గోచరిస్తుంది. ఇది చైత్య వికాసమునకు ఒక కోణము మాత్రమే. ఇంకా ఎన్నో అనుభవాలు కలుగుతాయి. వీటన్నిటి తోటి సహాయముతో అహం, స్వార్థము ఒక్క ఎల్లలను, నీ బాహ్యవ్యక్తిత్వము యొక్క గోడలను, నీ ప్రతిస్పందనల నిష్ప్రయోజనమును, నీ అసమర్థమైన మనోబలమును, నీవు అధిగమిస్తావు.

అయితే, నేను, ఇంతకు ముందు చెప్పినట్లు, ఈ వికాసమునకు మార్గము సుదీర్ఘము, దుర్గమమూ అయినవి. దారి నిండా, అపరిష్కృతమైన సమస్యల వలయాలు పరుచుకుని వుంటాయి. వాటిని ధృఢ నిశ్చయంతోనే అధిగమింప వలసి ఉంటుంది. అది, ఎవరూ చరించని, ఒక క్రొత్త ప్రదేశమును వెదకు. ఒక క్రొత్త విషయమును వెదకు. ఒక అన్వేషకుని యొక్క గమనము లాంటిది. చైత్యస్థితి కూడా అటువంటి అన్వేషణే. క్రొత్త ఖండములను కనిపెట్టే సాహసము, ఓర్పు, దీనికి కూడా కావాలి. ఎవరైతే ఇందుకు ధృఢ నిశ్చయులై వుంటారో, వారికి ఉపకరించే కొన్ని సలహాలు చెపుతాను.

అన్నిటిలో మొదటిది, అతి ముఖ్యమైనది మనస్సు. ఆధ్యాత్మిక విషయాలను నిర్ణయించే శక్తి లేనిది. దీని గురించి చాలామంది గతంలో చెప్పారు. బహు కొద్ది మంది తప్ప ఎవరూ ఆచరణలో పెట్టలేదు. ఈ దారిలో పయనించాలంటే మానసిక అభిప్రాయాలకు కలిగే ప్రతి స్పందనలను త్యజించడం అత్యంత ఆవశ్యకము.

నీ కోసం ప్రత్యేకముగా సుఖాన్ని, సంతృప్తిని, ఆనందాన్ని, సంతోషాన్ని కోరవద్దు. ప్రగతి కోసం జ్వలించే జ్వాలగా సాగిపో. నీకు లభించిన ప్రతిదాన్ని, నీ ప్రగతికి ఉపయోగించు. వెంటనే కావలసిన ప్రగతిని సాధించు.

నీవు ఏమి చేసినా, సంతోషముగా చేయి. సంతోషము కొరకు చేయకు. ఎప్పుడూ ఆందోళనా, భయభ్రాంతులకు లోను గావద్దు. అన్ని పరిస్థితుల లోనూ ప్రశాంతముగా వుండు. ఎల్లప్పుడూ కావలసిన ప్రగతిని సాధించడానికి సంసిద్ధుడవై, కాలం వృధా పోకుండా ఉద్యమించు.

భౌతిక సంఘటనలను పై పైన అర్థం చేసుకోవద్దు. అవి ఒక విషయమును గూర్చి వేరొక రకముగా, గజిబిజిగా కనిపిస్తుంది. ఈ క్రమములో మనము అసలైన సత్యాన్ని గ్రహించ లేము.

ఎవరి ప్రవర్తననూ, అతని స్వభావాన్ని, ప్రవర్తనని మార్చగలిగే శక్తి వుంటే తప్ప, విమర్శించ వద్దు. మార్చగలిగితే విమర్శ లేకుండా మార్చు.

ఏమి చేసినా, ఎలాగ చేసినా, నీ గమ్యాన్ని మరవవద్దు. ఇందులో గొప్ప, అల్ప తారతమ్యం లేదు. నీ అన్వేషణకు సహాయపడేవి, అడ్డుపడేవి అన్నీ నీకు ముఖ్యమే. అందుచేత నీవు ఆహారాన్ని భుజించేటపుడు, నీవు తినే ఆహారము, నీ శరీరమునకు, నీ అన్వేషణకు తగినదని, ఎటువంటి శక్తి, ఆధారము, పట్టుదల, స్థిరత్వమును కలిగించాలో అనే విషయమును గురించి కొన్ని క్షణాలు ఆలోచించు.

అలాగే నీవు నిద్రించే ముందు, నిద్ర వల్ల నీ అలసిన శరీరం కండరాలకు, మెదడుకు ఎటువంటి ఉపశమనము కలగాలో, నీవు మేల్కొన్న తర్వాత తిరిగి చురుకైన శక్తిని పొంది, నీ అన్వేషణా మార్గమును కొనసాగించేలా, కొద్ది క్షణాలు ఆలోచించు.

అలాగే, నీవు మాట్లాడే ముందు, మాటలు బయటకు వెడలే ముందు, ఆ మాటలను క్షుణ్ణముగా పరిశీలించి, అవసరమైన వాటినే వుపయోగించి, నీ అన్వేషణ యొక్క ప్రగతి మార్గమునకు హాని కలిగించని విధముగా, తోడ్పడు మాటలని మాట్లాడటానికి, స్థిరముగా ఆలోచించు.

మొత్తానికి, ఏ పరిస్థితులలోనూ, నీ జీవిత గమ్యాన్ని, ప్రయోజనాన్నీ ఎప్పుడూ విస్మరించకు. నీ అన్వేషణ కొనసాగించే ఆత్మశక్తి నీ పైన, నీవు చేసే ప్రతి పని పైనా, "ఒక కాంతి పక్షి నీ పైన సంచరిస్తూ, నిన్ను ఆవహించునట్లు"— ప్రభావిస్తుంది.

ఇట్లు అవిశ్రాంతమైన ప్రయత్నమును నీవు కొనసాగించినప్పుడు, నీ అంతరంగ కవాటము తెరుచుకుంటుంది. అప్పుడు నీవు కళ్లు మిరుమిట్లు గొలుపునట్టి ఒక వైభవ తేజాన్ని సందర్శిస్తావు. అప్పుడు అమరత్వపు స్థిరత్వము వైపు కొనిపోబడతావు. బాహ్యమైన రూపములన్నీ, చిరిగి పోయిన గుడ్డలను పారవేసినట్లు, నీవు ఒక స్థిరమైన అమరత్వపు సిద్ధిని పొందుతావు. అన్ని బంధాల నుండి విముక్తి పొంది, నిశ్చలముగా నీవు నిలబడతావు. లేదా, ప్రకృతి విధించిన, తప్పుకోలేని, భరించలేని, పరిస్థితుల బరువు క్రింద నలిగి పోతూ, నీవు శ్రమించాల్సి వుంటుంది. క్రుంగి పోవాలసి వస్తుంది. ఇప్పుడు నిశ్చలత్వముతో, నీవు, నీ విధి గమ్యము వైపు సాగిపోగలవు.

ఈ వాంఛల బానిసత్వము నుండి, భవబంధాల నుండి విముక్తి పొందడమే, స్వచ్ఛమైన పరిపూర్ణత కాదు. శిఖరాన్ని చేరడానికి ఇంకా సోపానాలు వున్నాయి. ఆ సోపానాలను కూడా కొన్ని పద్ధతుల ద్వారా, అనుసరిస్తేనే, భవిష్యత్తు యొక్క ద్వారాలు తెరుచుకుంటాయి.

చైత్యజీవితమే, అమరత్వమని చెప్పవచ్చు. అంతులేని కాలము, పరిమితి లేని అంతరాళము, ఎప్పుడూ ఎడతెగని అభివృద్ధిని సాధించే మార్పు, ఎడతెగక కొనసాగే విశ్వరూపములు, ఇది ఒక అనంతమైన అంతు తెలియని, సృష్టికి అతీతమైన దేశ కాలాతీతంగా వుంటుంది. నీవు ఈ చైత్య స్థితిని పొందుటకు ఈ చైత్యములో జీవించుటకు, నీలోని 'అహాన్ని' పూర్తిగా విసర్జించాలి. ఆధ్యాత్మిక జీవనానికి, అహం ఎంత మాత్రమూ పనికి రాదు.

ఇందులో సంపూర్ణ ఆత్మ సమర్పణయే అత్యంత ఉపయుక్తమైన, చురుకుగా ఫలితాన్నిచ్చే మార్గము.

అనువాదము: చావలి రామమూర్తి

అహం ఇంత వరకూ సహాయకారే,
ఇక నుండి మాత్రము బంధమే

శ్రీఅరవింద వచనామృతము

విశ్వజీవనంలో పురోగామి పరిణామ క్రమంలో శరీర భాగానికి బంధింపబడ్డ మానసిక, ప్రాణిక అహంకార ప్రథమావిర్భావం, పదార్థం కంటే బయట ఒక చైతన్య వ్యక్తిని నిర్మించే సాధనం. ఈ విశ్వ జీవనంలోనే దివ్య సాఫల్యం కోసం ఈ పరిమితమైన అహంతను విలీనం చేయటం ఒక నియతియే. అందుకే ఈ చేతన వ్యక్తికి అతీతమైన అస్మిత గానీ, తన నిజ వ్యష్టిని తెలుసుకునే సాధనం. ఈ జంట కదలిక — మిథ్యాభూతమైన తాత్కాలికమైన అస్మితకు, దాని నుండి విముక్తమైన సత్య చేతన యొక్క వైశాల్యం లోకి పరిక్రమించటానికి ప్రాతినిధ్యం వహిస్తున్నది.

*

అచేతన యొక్క పరిణామ రూపం పదార్థం. అప్పుడు జడస్థితిలో ఉనికి కాన వస్తుంది. చైతన్యం పదార్థంలో ఉన్నా స్ఫుటం కాలేదు. అది తొలుత ప్రాణిక స్పందనల రూపంలో జీవం పోస్తుంది. అప్పుడు అపరిణత రూపాలలో ప్రాణం వెల్లివిరుస్తుంది. పదార్థంలో నుండి అనేక రూప పరిణామాలను పొందుతూ తన్ను గుర్తించేందుకు ప్రయత్నిస్తుంది. ఈ రూపాలు అన్నీ క్రమ పురోగతికి అనుగుణంగా నిర్మించుకున్నది. సమగ్ర అభివ్యక్తికి కారణమవుతవి. మనుష్యునిలో శక్తిని సమకూర్చే చైతన్యం స్పష్టంగా తన నెరిగిన వస్తుతత్త్వ మెరిగిన బుద్ధిగా కాన వస్తుంది. కాని సమన్విత చైతన్యావిష్కారానికి ఒక వరంగా, భావస్ఫుటమైన శక్తిగా తొలుత అది ఆవిర్భవిస్తుంది. ఆ సమన్వితశక్తి ఆవిర్భవించటమే ప్రకృతి లక్ష్యం.

మనుష్యుడు విశ్వంలో తన ఉనికిని ప్రతిష్ఠించుకొంటాడు. అది అతని తొలి కర్తవ్యం ఇంకా అతడు తను పరిణమించటం, యింకా తనకు తాను అతిక్రమించటం అతని లక్ష్యం. తన పాక్షిక వ్యక్తిత్వాన్ని సమగ్ర వ్యక్తిత్వంగా వికసింప జేయవలసి ఉన్నది. తన చుట్టూ ఉన్న ప్రకృతిపై అధికారాన్ని పొందటమే కాక ప్రపంచములో ఐక్యమును, సమరసాన్ని సాధించటం అవసరం. తన వ్యక్తిత్వాన్ని ధరించటమే కాక విశ్వచేతనగా ఎదిగి సృష్టి యొక్క ఆధ్యాత్మిక ప్రీతిగా రూపొందాలి.

తన 'అస్మిత' ను దృఢంగా సంపూర్ణంగా ఎరిగి ప్రకృతి పరిణామ గమ్యంలో ఒక నిర్దిష్టమైన సుసంపన్నమైన స్థితిని సంపాదించుకోవాలి. ఈ క్రమంలో మొదట తన అహంతను ప్రధానంగా విస్తరింప జేసుకుంటాడు. ఈ పరిణామంలోని అహంకార దశలో కలిగే మార్పులు తన చైతన్యాని కంటే తనకు ముఖ్యమైనవి కాదు. ఇక్కడ చైతన్యాన్ని దృఢంగా స్థాపించటానికి ఇవి దోహదం చేసే అవకాశాలు. అందుకే తొలి పరిణామంలో మత ధోరణులు అల్పస్థాయి ఉనికి ఏర్పడుతుంది. దేవుడు, దేవతలు మనుష్యుల కోసమే ఏర్పడినట్లు భావించటం తిరుగుతుంది. వారిని తమ వాంఛలను తీర్చే ఉపకరణాలుగా, ప్రపంచంలో తమ అవసరాలను కోర్కెలను తీర్చే సహాయకులుగా భావించటం జరుగుతుంది. ప్రాథమికమైన అహం స్వరూపం దాని పాపాలు, అతిక్రమణలు, మోటులక్షణాలు కలిగి ఉన్నా ఏ విధంగానూ పట్టించుకోనక్కర లేదు. అది మనుష్యుని తొలి కర్తవ్యాలకు ఆవశ్యకమైంది. ప్రకృతి యొక్క యాంత్రిక కార్యాలకు లోనై 'గుంపు చేతనకు' లొంగిపోయి అధమ ప్రకృతి నుండి తనను స్ఫుటం

విడమరచుకునే యత్నంలో తన వ్యక్తిత్వాన్ని ఎరుగటం అవసరమే. మనిషి తన వ్యక్తిత్వాన్ని ప్రకృతి కన్నా విధిగా నిర్దిష్టంగా శక్తిమంతంగా నిర్ధారించుకోవాలి. తనలోని శక్తిని లేక ప్రీతులు మనుష్య శక్తులకు అధికాధికంగా వ్యక్తమయ్యేటట్లు చేస్తూ ప్రకృతినీ, ప్రపంచాన్నీ అధికమైన అధికారంలో శక్తిలో అనుగమించాలి. తన లోని సదసద్వివేచన ఈ ప్రాథమిక ప్రయోజనం కోసమే అతనికి ప్రసాదింపబడ్డది. తన వ్యక్తిత్వాన్నీ, ఉనికినీ శక్తినీ అభివృద్ధి పరచుకోక పోతే తన ముందున్న బృహత్తరమైన ఉన్నతమైన విస్తృతమైన దివ్యలక్ష్యాలను సఫలంగా అందుకునే గొప్ప కార్యానికి ఉద్యుక్తుడు కాలేడు. అవిద్యలో తన్ను నిల్వరించు కుంటేనే, జ్ఞానంలో నిర్దుష్టంగా తనను నెలకొల్పుకోగలడు.

అందువల్లనే ప్రకృతి ఈ అహంకారాన్ని కనిపెట్టింది. దీని వల్ల అతడు అచేతనంలో విడివడటానికీ, సజీవ బుద్ధిలో, జీవశక్తిలో స్వతంత్రంగా జీవించటానికీ ఆత్మలో సత్పదార్థంతో చుట్టూ వున్న ప్రపంచంలో తనను సమన్వయించు కోవాలి. కాని దానిలో మునిగిపోయి తన ఉనికి లేకుండా ప్రభావ రహితంగా ఉండి పోర్దాదు. వ్యక్తి విశ్వ వ్యక్తిలో ఒక భాగమే అయినా దాని కన్నా అతీతమైన వాడు. అతడు అతీతం నుంచి దిగివచ్చిన ఆత్మపదార్థం. జడభూమికకు సమీపంలో ఉండటం వల్ల, తన సహజమైన ఉన్నత చేతనకు సుదూరం కావటం వలన ఒకేసారి తాను అతీతంగా వ్యక్తం కాలేడు. సత్పదార్థంగా ఆత్మగా తాను ఎదుగటానికి ముందే ఆతడు ప్రాణిక మానసిక అహంతగా ఎరిగి ఉండాలి.

అయినా అహంత వ్యక్తిత్వం ఎరుగటం, తనను ఎరుగటం కాదు. నిజమైన ఆత్మిక వ్యక్తిత్వం — మానసిక, ప్రాణిక, శారీరక అహంతలు కానే కాదు. క్రియాశీలమైన మొదటి కదలికలో అధిక భావం సంకల్పం, శక్తి, స్వాభివ్యక్తి యొక్క సామాన్య జీవితానికి సంబం ధించిందే. అందువల్ల తనలోని అస్పష్టమైన అహంతా వ్యక్తిత్వం అడుగున చొచ్చుకొని తన్ను తాను తెలుసుకొనే ప్రయత్నం చేయవలసి ఉన్నది. కాక పోతే అతడు ప్రకృతి ప్రాథమిక శిక్షణ దగ్గరే ఆగిపోయి, లోతైన విస్తృతమైన బోధలను గ్రహింప లేక తన ప్రాయోగిక ప్రావీణ్యం ఎంత ఉన్నా అతడు జంతువుల కంటే కొంచెం ఉన్నతమైన వాడు మాత్రమే అవుతాడు. తొలుత అతడు తన మానసిక దశను ప్రాకృతికాంశాలను అంటే — అహంత, బుద్ధి దాని ఉపకరణాలు, ప్రాణము, శరీరము వీటిని గ్రహించి — తన సంపూర్ణమైన ఉనికి ప్రాకృతికాంశాల కంటే, తన లక్ష్యం అహంతా పూర్ణం అయినా స్వవిశ్వాసం తృప్తులకు అతీతమైనవని గ్రహించాలి.

మనుష్యుడు దృశ్యమానమైన తన ఉపరితల వ్యక్తిత్వానికి — ప్రకృతికీ ఈశ్వరుడికి నడుమ ఉన్న సంబంధానికి అతీతంగా తనను భావించుకోవటంతో ఉన్నతమైన ఆత్మ జ్ఞానంతో సంబంధం ఏర్పడుతుంది. కాలబద్ధమైన శాశ్వతత్వాన్ని ఎరిగి, ఈ జీవనం సంపూర్ణం కాదు. అవగాహన చేసుకుని నిశ్చయంగా తన స్వీయమైన అన్వేషణకు ఆత్మ అమృతత్వమే అని గ్రహించటం ఉన్నాయని, ముందు వెనుకా ఉనికి ఉందనీ తన అవిద్యను తొలగించుకొని, తన్ను తాను విస్తరించుకొని, కాలం యొక్క తక్షణ చలనాల నుంచి తన అనంతత్వపు పరిధిలోకి వెళ్ళాలని తెలుసుకోవాలి. తన పై పొరల్లోని మెలకువ తన లోని స్వల్ప భాగమేననీ ఉన్నత చైతన్య శిఖరాలను కొలిచే అభ్యాసం చేయటం రెండవ అడుగు. ఆ విధంగా అతడు మానసిక అవిద్యను తొలగించుకోవటం ప్రారంభిస్తాడు. మూడవ అడుగు ఉపకరణమైన బుద్ధి కంటే, ప్రాణం కంటే శరీరం కంటే తనలో ఏదో గుప్తంగా ఉందని తెలుసుకోవటం. అది చావు లేని, స్వయీ ప్రవృద్ధమయ్యే వ్యష్టి ఆత్మ అనీ గ్రహించాలి. అది తన ప్రకృతికి ఉపకరించేదీ, అవికారమైంది, అనంతమైంది. తన ఆధ్యాత్మిక వ్యక్తి తన లోని భిన్న భిన్నాంశాలేమిటో తెలుసుకోవాలి. తనలో ఉన్నదంతా తన లోని అధమ ప్రకృతికీ, ఉన్నత

ప్రకృతికీ మధ్య అనుసంధానమైన తత్త్వాభివ్యక్తి అని వివేచించ గలగాలి. తన లోని ఆధ్యాత్మికతనూ ఆత్మనూ గ్రహించటం అంటే ఈశ్వరుణ్ణి ఎరుగటమే. అశాశ్వతమైన దాని కంటే, అతీతమైన చిత్పదార్థం ఒకటి ఉందని తెలుసుకుంటాడు. చిత్పదార్థాన్ని విశ్వ చేతనలో దర్శించి అది ప్రకృతి అడుగున ఉన్న దివ్యత్వపు ఉనికి అని గ్రహిస్తాడు. తన బుద్ధి, విశ్వచేతన, వ్యక్తిత్వము ఇవన్నీ బహుముఖాలైన పరాత్పరుని గురించి ఊహకు భావనకు అభిముఖంగా విచ్చుకుంటుంది. విశ్వం అహంకారిక మౌలిక అజ్ఞానం అతని మీద తన పట్టు సడలించటం ప్రారంభం అవుతుంది. తన ఉనికి విస్తృతమైన ఆత్మ జ్ఞానంతో మలుచుకోవటంలో అతని దృష్టి సమగ్రమై జీవన లక్ష్యం, ఆలోచన, కార్యకలాపం క్రమంగా పరివర్తితములౌతాయి. తనను గురించిన తన ప్రకృతిని గురించిన, తన జీవన లక్ష్యాన్ని గురించిన వ్యావహారిక అజ్ఞానం తొలగి పోతుంది. అతడు తన పురోగతిలో ప్రాణికమైన పరిమితమైన ఎరుక వల్ల కలిగే అసత్యం నుంచి, దుఃఖం నుంచి విముక్తుడై సత్యమైన సంపూర్ణమైన ఉనికిని స్వాయత్తం చేసుకుని అనుభవించే దశను చేరుకొంటాడు.

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

∴

గుప్త యోజన

ఎంతటి దీర్ఘ నిశీథమైనా —
ఆ చిన్ని అహంత కల్పించుకున్న ముసుగును, అప్పుడున్న ముసుగును కలలు కనను.
ప్రకృతి నిర్వహించే విశ్వక్రియకు అంతిమ ఫలాలు అవి
ఈశ్వరుడు అనావృతం చేస్తాడు జీవన యోజనలో.

మహత్తరమైన ఉనికి పని చేస్తున్నది ఆమె ఎదలో
సుదూర విజయోత్సవానికి అది సంసిద్ధ మవుతున్నది చాలా నాళ్లుగా.
దైవం తేజోవంతమైన అనంత వ్యక్తియై
శిలలోనైనా మృగంలో నైనా ప్రవ్యక్తి కోసం
ఎదురు చూస్తున్నది.

విచ్ఛిన్నం చేస్తున్నది మనస్సు గీచిన పరిమితులను
ఎరుకగల హృదయాన్ని సాక్షిగా చేస్తున్నది
ప్రతి జడ భావంలోనూ ఎన్నాళ్ళుగానో
ప్రకటిత మవుతున్నది సంవృతమైన ప్రకృతి.
రహస్యమయమైన పథకాన్ని సఫలం చేస్తూ
మనిషిలోని జగద్వ్యక్తి
ప్రకటిస్తున్నది అమృతత్వాన్ని.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య

ఆధ్యాత్మిక యుగాగమనము*

[ఈ విభాగములో శ్రీఅరవిందాశ్రమము త్వరలో ప్రచురించనున్న 'మానవావర్తము' (శ్రీ వెంపటి కృష్ణమూర్తి గారిచే అనువదించబడిన శ్రీఅరవిందుల ఉద్గ్రంథం HUMAN CYCLE) నుండి సంపాదకుడు ఏర్చికూర్చిన విభాగాలున్నవి.]

పరిచయము

'ఆర్య' పత్రికలో The Psychology of social development *అనే శీర్షిక క్రింద ఆగస్టు 1916 నుండి జూలై 1918 వరకు ధారావాహికంగా వెలువడిన శ్రీఅరవిందుల వ్యాసాలను 1949 సంవత్సరములో* Human Cycle *(మానవావర్తం) అను కొత్త మకుటం క్రింద గ్రంథ రూపంలో వెలువడింది.*

మానవ సమాజం ఐదు విస్పష్ట దశల ద్వారా కాలచక్రంలో ప్రవర్తిస్తుందని శ్రీఅరవిందులు ప్రతిపాదించి, చరిత్రలోని ఉపపత్తుల ద్వారా నిరూపించారు. ఆ దశలు: 1. Symbolic *(ప్రతీక దశ.) 2.* Typal *(ఒక నమూనాకు చెందిన దశ) 3.* Conventional *(సాంప్రదాయిక దశ) 4.* Individual *(వ్యక్తి ప్రధాన దశ) మరియు 5.* Subjective *(అంతర్నిష్ఠ దశ).*

శ్రీఅరవిందుల పూర్ణయోగం కేవలం కొందరు వ్యక్తుల కోసమో, భారత దేశానికి మాత్రమే కాకుండా యావన్మానవాళి అభ్యుదయం కోసం చేపట్టినది. సకల మానవ సమాజం దివ్యజీవన, ఆధ్యాత్మిక దిశలో ప్రయాణిస్తే తప్ప ప్రపంచానికి మనుగడే లేదని వారు విశ్వసించారు. వ్యక్తిగత అహంకారమే కాక సామూహిక అహంకారం కూడా నిర్మూలమవాలని ఆకాంక్షించారు. నాగరికతతో పాటు ఆటవికత కూడా పెరుగున్న దాన్ని చూచి వారు ఇలా ఆక్రందించారు: "మాధుర్యం, ప్రకాశం, సౌందర్యం, నైతిక వైభవం, రసముల విలువలు — వీటికి పూర్తిగా విలువ లేకుండా పోయింది". ఈ పరిస్థితిని సరిదిద్దాలంటే అంతర్నిష్ఠ, బహిర్నిష్ఠ జీవితాలలో ఆత్మ సత్యానుభవానికై అన్వేషణ జరుగుతున్న దశయే ప్రస్తుత మానవ దశ అని శ్రీఅరవిందులు వక్కాణించారు. జిజ్ఞాసువులు, సాత్వికులు అయిన ప్రజలను నిర్వేదం నుండి తప్పించి, దైవం వైపు పురోగమింపజేసే, తన 'పూర్ణ' యోగాన్ని ప్రవచించి, దాని సాధన మార్గాన్ని వివరించి, మానవాళికి వినూత్న సంభావ్యతలను చూపి, క్రొత్త ఊపిరి పోసిన ఋషి పుంగవుడు, ద్రష్ట, స్రష్ట, శ్రీఅరవిందులు. దాని వివరాలను ఈ "శ్రీఅరవిందుల వచనామృతా" న్ని చదివి, పాఠకులు ఆస్వాదించగలరు.

— సంపాదకుడు

* ఉప శీర్షికలు సంపాదకునివి

జీవితం పై బహిరంతర్నిష్ఠ అవలోకనములు*

శ్రీఅరవింద వచనామృతం

[విజ్ఞాన శాస్త్రవేత్తకు సంబంధించినంత వఱకు "అంతర్నిష్ఠ" (Subjective) అనగా తన వ్యక్తిగత, యదేచ్ఛమైన అభిప్రాయమనియును, "బహిర్నిష్ఠ" (Objective) మనగా అమూర్తత్వము మరియు సర్వసమ్మతమైన విషయమనియు అర్థములు చెప్పబడినవి. అంతర్నిష్ఠ దృక్పథముతో విషయములను చూచినప్పుడు కేవలము ఒక వ్యక్తి యొక్క ఇష్టాయిష్టములపైనను, తనదేయైన ప్రత్యేక స్వభావ, వికారముల పైనను, తన విశ్వాసములు, నమ్మకము పైనను ఆధారపడి, సులభముగా తన భావములను మార్చుకొనుటకు వీలు కాకుండా సుదృఢముగా నుండును. విజ్ఞాన శాస్త్రవేత్త తాను పరిశోధించి కనుగొనిన విషయములు సర్వజనామోదములు కావలెనని గాఢముగా వాంఛించుటచే తన ప్రకృతి నుండి "అంతర్నిష్ఠ" దృష్టిని సమూలముగా త్రోసిపుచ్చి, సత్యజ్ఞానాన్వేషణ కేవలము అమూర్తత్వమై, నిష్పాక్షికమై, యదార్థముల పై ఆధారితమై ఉండగోరును. శాస్త్రవేత్త తన బయట నున్న ప్రకృతిలోని కొలవబడదగిన దత్తాంశముల పైననే పూర్తి విశ్వాసముంచి మానవుని బహిరింద్రియముల ద్వారా మెదడుకు చేరే సమాచారమునే విశ్వసించి ఒక సిద్ధాంత మేర్పరచును.

ఇక సాంఘిక శాస్త్రవేత్త అలా కాకుండా "అంతర్నిష్ఠ" పదాన్ని ఎల్లప్పుడూ అగౌరవ సూచనార్థంలో ఉపయోగించడు. తఱచు, నైతిక విలువల్ని, చారుతరమైన రుచులపైన, మత విశ్వాసములపైన, జీవితపు సర్వోచ్ఛ ఆదర్శముల పైన ఆధారపడి, వేర్వేరు సమాజములలో తమ తమ దేశ, కాల పరిస్థితుల కనుగుణంగా, చారిత్రాత్మక పరిస్థితులపై గూడ నాధారపడి ఎంతో కాలంగా నిలచిన విలువలు, సత్యాలను గూర్చి అతడీ పదాన్ని వాడుతుంటాడు.

ఇటీవలి పాశ్చాత్య సాంఘిక శాస్త్రవేత్త ధోరణిలో చాల పరిమిత దృష్టితో కాకుండా శ్రీఅరవిందులు "అంతర్నిష్ఠ" పదానికి అతి విశాలమైన గంభీరమైన ఆధ్యాత్మిక విలువగల అర్థంలో వాడుతారు. 'ఆత్మ' కు 'చైతన్యాని' కి సంబంధిత అర్థంలో వాడినప్పటికీ ఎంతో మూలాభూత రూపంగా వాడుతూ, సత్తుకూ, చిత్తుకూ, ఏ ఒక్క ప్రత్యేక దృష్టి కోణానికి పరిమితి చేయక అతి విశాల దృష్టితో వాడుతారు. శ్రీఅరవిందుల దృష్టిలో ఆత్మ, చైత్య పురుషుడు అనంత రూపాల్లో ఏ విధంగా ప్రస్ఫుటమౌతాడో అట్టి అంతరంగ సాధనకు సంబంధించి "అంతర్నిష్ఠ" అనే పదం వాడటం జరిగింది. ఇది కేవలం వయ్యక్తికమే కాక, సమిష్టి జీవనానికీ, విశ్వాత్మకు కూడా చెందిన విషయమని మనం గ్రహించాలి. విశ్వాతీత పురుషోత్తమునిక్కూడా చెందిన విషయం సుమీ. అది మూర్తత్వమూ, అమూర్తత్వమూ కూడా. ఎందుకంటే పరిమిత అహంకార వ్యక్తిత్వము సంపూర్ణంగా వినాశనమొందినా 'ఆత్మ' వస్తువు అనేక స్తరాల్లో సత్-చిత్-ఆనందం నుండి 'ముకుళనం' ప్రక్రియ (involution) ద్వారా దిగి వస్తూ చివరికి 'అచేతన (inconscience) స్థితికి చేరును. దీనికి వ్యతిరేకమైన విధానంలో పరిణామ క్రమంలో అచేతనా స్థితి నుండి మెట్లెక్కుతూ అతిమానస దివ్యచైతన్యానికి చేరుకొనును.

శ్రీఅరవిందుల దృష్టిలో మన విలువలూ ఆదర్శాలూ, మన అంతర్నిష్ఠ చైతన్యానికి భావ రూపాలే అయినప్పటికీ, అవి ఏకకాలంలో విశ్వాత్మకమూ, అమూర్తకమూ, అతి సాధారణమూ అయినందున, వయ్యక్తమయ్యునూ సర్వ సమ్మతములే. మన విలువల్లో నిస్సందేహంగా వయ్యక్తిక,

* ఉప శీర్షికలు సంపాదకునివి

సామాజిక సూత్రములు ఇమిడి వున్నప్పటికినీ అవి వివిధ రూపములు ధరించగలగటం చేత వాటిని అమూర్తమూ, విశ్వ జనీనము అని చెప్పవచ్చును.

— కిషోర్ గాంధీ "శ్రీఅరవిందుల సామాజిక తత్త్వ శాస్త్రము, నవశకము" నుండి]

జీవితం పై బహిర్నిష్ఠదృక్పథం:

మానవాలోచన చేష్టితముల లోనికి ప్రవేశించు అంతిర్నిష్ఠ వాదము దృక్పథములో మన జీవిత స్వభావ గమన శక్తులలో గొప్ప మార్పు తెచ్చిననూ, బహిర్విషయములలో ఈ భేధమేమియు మొదట కనిపింపదు. దేహ, ప్రాణ, మనశ్శక్తులతో వ్యక్తి సంఘ సంకీర్ణ స్వభావము పై ఆధారపడి వాని సాఫల్య సామరస్య ధర్మాన్వేషణము చేయుటకే బహిరంతర్నిష్ఠ వాదములు యత్నించు చున్నవి. వ్యవచ్ఛేదాత్మక హేతువు నాధారముగా గొని నడచు బహిర్నిష్ఠ వాదము ఈ సమస్య నంతటినీ బాహ్య యంత్రదృష్టితో చూచును. అది ప్రపంచము నొక వస్తువుగా, పదార్థముగా, సంకీర్ణ యంత్రపరిశీలన పర్యావలోచన సమయమున లక్షణ సామగ్రిగా బహిరన్వయము చేయు హేతువు నవలంబించి అధ్యయనము చేయదగిన ప్రగమముగా వీక్షించును. వ్యక్తి పై గాని, సంఘము పై గాని ప్రసరించునట్టి అనేక నిర్ణీత శక్తుల వలెనే, యాంత్రిక సూత్రముల వలెనే ఈ ప్రగమ ధర్మములు కూడ సమీక్షింపబడును. శాస్త్రము తన సూత్రములను సమన్వయము చేసినట్లే ఇవియును హేతు పరిశీలితములై గ్రహింపబడిన పిమ్మట ఎవరి సంకల్పము చేతనైననూ వ్యవస్థీకరింప బడవలెను. తన సంకల్ప హేతు బలముచే గానీ, ఇతర సంకల్ప హేతు బలముచే గానీ వ్యక్తి ఈ నిబంధనలకు అధీనుడు కావలయును. అట్లే బాహ్య జీవిత భిన్న యంత్రసామగ్రిచే నియతమైన సామూహిక సంకల్ప హేతుబలముల చేతనో, తానొక భాగముగా నున్న ఇతర సంఘముల సంకల్ప హేతు బలముల చేతనో ఈ నిబంధనలకు సంఘమధీనము కావలయును. అందుచే ఆధునిక రాజకీయాలోచనములలో దేశ ప్రభుత్వమును వ్యక్తి సంఘముల కంటె భిన్నస్వరూపముగా పరిగణించు చున్నారు. ప్రకృత్యంతరంగ నిర్దేశానుసారాభివృద్ధిని మాని ఆత్మ నిర్దిష్టోచత్వ శ్రేయో లాభములను మనుష్యులపై మోపుటకు, వాని చారితార్థ్యమునకై వారిని శిక్షించుటకు కూడ దేశ ప్రభుత్వమునకు స్వామ్యమున్నదని పరిగణింపబడినది. జీవితమన్నది ఒక యాంత్రిక సంస్థ ద్వారమున సరిదిద్దబడి మానవ యత్నముచే సామరస్య సమగ్రత్వములు కలదిగా నిర్వహింప బడ వలెను. వ్యక్తి హేతువుచే దర్శితమై, నిర్ణీతమైననూ, వ్యక్తి ఇచ్ఛచే అంగీకరింపబడి ఆదేశింపబడినను ఈ సూత్రము వ్యక్తి బాహ్యమనెడి యూహా బహిర్నిష్ఠ వాదములో ప్రబల మైనది. దాని ఆచరణమంతయు నిర్వహణ వ్యవస్థా సమగ్ర రూపమైన యాంత్రిక ధోరణిలో నున్నది.

జీవితం పై అంతర్నిష్ఠ దృక్పథం:

స్వవశమై వర్ధమానాత్మ చేతన దృష్టిలో సర్వమును వీక్షించునట్టిదై అంతరంగము నుండి బయట వెడలునది అంతర్నిష్ఠ వాదము. ధర్మము మనయందే కలదు; ఆత్మగతమై, సంభవ నీయమై యున్న మన తత్త్వమును గూర్చి మొదట అవ్యక్తముగా, పిమ్మట అర్థవ్యక్తముగా, చివరకు పూర్ణ వ్యక్తముగా పెరిగి అభివృద్ధి పొందు ఆత్మసృజన వ్యాపారమే జీవితము. దినదిన ప్రవర్థమాన సంవేదన సాక్షాత్కారములును, తత్ఫలితమైన స్వస్వరూప సంస్కరణమును దాని ప్రగతి లక్షణములు, హేతు సంకల్పములు, ఫలకారులైన ఆత్మ వ్యాపారములు; హేతువు ఆత్మసంవేదన వ్యాపారము; సంకల్పము ఆత్మప్రాబల్య రూపనిర్మాణ శక్తి. ఇంతే కాక హేతువును, బుద్ధిగత సంకల్పమును ఆత్మ సంవేదన సాక్షాత్కార సాధనము లందలి భాగములే. అంతర్నిష్ఠ

వాదము మన వైయ్యక్తిక స్వభావములను విశాల బాహ్యార్థ దృష్టితో వీక్షించి అనేక జ్ఞాన శక్తులను సఫలీకరణ శక్తులను గుర్తించుటలో సుముఖమైనది. దాని ప్రథమ ప్రసారమే బాహ్యాత్వ బహిర్నిష్ఠలకు దూరమై, హేతువ్యాపారమున ప్రధానమొనరించి, జీవశక్తి, జీవేచ్ఛల ఉత్తమత్వమునుద్ఘాటించి, వీనికి విరుద్ధముగనున్న బుద్ధిశక్తుల నిరసించి, ధిషణాత్మక హేతువు వలె విశ్లేషింపక, మిథ్యాకరణము లేక, పై పై దృశ్యములను సమర్థింపక, యాంత్రిక ధోరణిలో సమ్మేళనము చేయక, ఈ రోజులలో స్వతః స్ఫురణమని పిలువబడుచున్న అంతర జ్ఞానమును సమర్థించును. కాని, సంక్షేపముగా, స్వతః స్ఫురణమన్న మాటకు దర్శన గ్రహణ రూపాత్మ చైతన్య భావమనియే కాని సత్య స్వభావ శక్తి విమర్శనము చేయు యంత్ర ధోరణి కాదని అర్థము. అంతర్నిష్ఠ వాద ప్రవృత్తి యంతయు బాహ్యాంతరములలో అంతః కేంద్రము నుండి ఆత్మ సత్య వీక్షణ స్థితిలో జీవితము గడుపుటయే.

మానవజాతి పురోగమనంలో ప్రస్తుత దశ:

ఈ దశలో మానవుడు తానొక గంభీర సచేతన జీవేచ్ఛగా భావించుకొని, దేహము పరికరముగా మనశ్శక్తులను పరిచారకులుగా గణించును. మానవాలోచనము పై అనేక రీతులలో గొప్పగా చెప్పుకొనదగిన ప్రభావము చూపుచున్న ప్రాణశక్తివాద ప్రముఖ వైవిధ్యములో ఇది ఒకటి. ఇప్పుడిప్పుడే ఆవిర్భవించి ప్రసిద్ధమగుచున్న అంతర్ముఖాదర్శ వాదము దీనికావల యున్నది. ఇది మానవుని మత, రస, స్వతః స్ఫురణ, సహానుభావ, భావమయ స్వభావమును సఫల మొనరించుటకు యత్నించును. ఇట్లు చేయుటయే మన సంపూర్ణత యని, మన లక్ష్యమని ఎంచి దీనికి దేహ ప్రాణ స్థితులనధీనము చేయును. ఇవి యన్నియు తమంత తాము విలువ గలవి కాక అంతర్ముఖ జీవితము నుండి ప్రసరించు రూపములకు సంకేతోపకరణములుగా మాత్రమే ఎన్నబడును. ఈ నూతనోద్యమములో దేహ, ప్రాణ వశము కాని ఆత్మాన్వేషణము, గూఢతత్త్వము, మర్జ్ఞేయ పారమార్థికత్వము కూడి యున్నవి. ఈ ఉద్యమము వ్యక్తి వాద భౌతికబుద్ధి వాద ప్రాభవము పిమ్మటిది కావున ఆధునిక జీవితమునకు క్రొత్త దై దాని యధార్థ శీల సరణులను ప్రగాఢ మొనరించును.

మనస్సు, ప్రాణము, దేహము కేవలము పరికరములు మాత్రమే:

కాని దీనిలో కూడా అంతర్ముఖత్వము దూరముగా ప్రయాణించి మనస్సు కంటె మిన్నయైన ఆత్మను కనుగొన వచ్చును. అప్పుడీ ప్రపంచములో ఆత్మాభివ్యక్తికి మనః ప్రాణ దేహములు పరికరములు మాత్రమే అగును. ఈ పరికరములు స్వస్థితిలో సమానములు కావు గాని అవసరములో సమానములే. ఇట్లగుటచే వీని సమగ్రతా సామరస్యైక్యములు ఆత్మాభివ్యక్తి లోని భాగములై మన జీవిత యదార్థ లక్ష్యమునకు అత్యావశ్యకములగును. అయినను, ఈ లక్ష్యము మనః, ప్రాణ, దేహములను వాని కొరకు మాత్రమే కాక, మన అందరిలో ప్రతి ప్రాణియందును, వస్తువునందును, ఏకైకమయ్యు, బహు రూపములలో నున్న రహస్య దైవత మును, తేజోమయాత్మను బహిరంతర్జీవితములలో ఆవిష్కరింపజేయు ఆధారముగా, పరికర ములుగా పెంపొందింప వలసి యున్నది. జగదతీత విశ్వపురుషుని సంతోష శక్తి ప్రణయ తేజ స్సౌందర్యములలోనికి వ్యక్తి సంఘ జీవితము సచేతన వికాసము పొందునట్లు క్రమ పరిణతము చేయుటయే మానవాదర్శము.

∴

ఆధునిక నాగరికత అంతర్నిష్ఠ దృష్టి వైపు మళ్లు దశ

శ్రీఅరవింద వచనామృతం

అంతర్నిష్ఠ జీవితములో పొరపాట్లు, దోషములు సాధ్యమే:

సంకేత ప్రతి రూప సంప్రదాయములను దాటి వ్యక్తి సత్య ధర్మములకు బాహ్య విశ్వ ధర్మములలో గల సంబంధమును స్థూలముగా కనుగొనుటకు దృష్టి సారించి బాహ్య పరి జీవితాంతరములను పరిశీలించి అంతరంగ జీవితమునకై మానవజాతి ప్రయత్నించు సంకటా వస్థయే మానవాభివృద్ధిలో అంతర్నిష్ఠయుగమగును. జీవిత విశ్వములు విషయాశ్రితములు అను దృష్టితో జీవించుట మాని విషయజ్ఞానము ఆత్మేతరమని ఆత్మ జ్ఞానాంతరంగముల వైపు పోవు యత్నమిది. అంతర్నిష్ఠ ఎట్టి దగునో ఆత్మజ్ఞానము నందెంత దూరము పోవుదుమో అన్న విషయముల మీదనే సర్వమును ఆధారపడి యుండును. వీనిలో యుక్తాన్వేషణము వలని ఫలితములెంత దూరాధిరూఢములో మార్గభ్రంశము వలని ప్రమాదములు కూడ అంతటివే అగుట దీనికి కారణము. సంకేత ప్రతిరూప సంప్రదాయ దశలు తమ చుట్టును నిర్మించుకొన్న స్వపరిచ్ఛేద కుడ్యముచే ఈ ప్రమాదముల బారిని పడవు. ఈ గోడయే అనాత్మజ్ఞతయను కారాగారము కాగా దానిని పడగొట్టి ప్రమాద భూయిష్టమయ్యు ఫలవత్సాహసమైన అంతర్ము ఖత్వ మవలంబింపబడును.

ఏ చేతనాత్మలో, ఏ చేతనాత్మ వలన, జీవిస్తున్నాము?:

ఒక మాదిరి చేతనాత్మ కాత్మజ్ఞానమున్నచో మన వ్యక్తిత్వంలో మామూలుగా ముందర కనిపించు రకరకపు తత్త్వములున్నను వానిలో ఒక్కటి మాత్రమే నిగూఢమై యథార్థముగా నున్నదని తెలియును. పైకి కనిపించునదే యథార్థమైనదని పొరబడుట సామాన్య భ్రాంతి. మానవుడు తన మతి స్వభావము ననుసరించి పడుచు లేచుచు బాధలకు గురియగుట కిదియే మూలకారణము. వ్యక్తిగా కాని సంఘ దేహ చిత్తావయవముగా గాని మానవుడంతర్ముఖుడై బ్రదుక నెంచినపుడు పై సత్యమతనికి వర్తించును.

అంతర్నిష్ఠత వైపు నవ్య నాగరికత దృష్టి సారింపు:

ఆధునిక నాగరికత అనుసరించు విలక్షణ గతిలోని అర్థమిది. ఎప్పటి కప్పటికి తడవు కొనుచున్నను, తక్కువగాకున్నను, అంతర్ముఖస్థితి నుండియే ప్రకృతి పొంతకు గమనము ప్రారంభించినాము. శిశువు మనుష్యుడుగా పెరుగుటలో అతని చిత్తవృత్తి తెలిసికొని బోధన శిక్షణ పద్ధతులు తదనుగుణముగా కల్పించుట మన విద్యా లక్ష్యమైనది. శిశువు తన మేధా రస భావ సామర్థ్యములతో సంఘజీవిత ప్రవృత్తులను చక్కదిద్దుకొనునట్లును సాయమొనరించుటయే నూతనాదర్శము. ఇది పాత లక్ష్యమునకు మిక్కిలి భిన్నమైనది. తిరస్కరించు మస్తిష్కము లోనికి పాతగిల్లిన వ్యుత్పన్నతను నింపుటయు, నిగృహీతములై నిలద్రొక్కుకొను ప్రవృత్తులను స్థిర కర్కశ ప్రవర్తన సూత్రముల కఠినము చేయుటయు వారి లక్ష్యము[2]. పగతీర్చుకొనుటకు

---

[2] నియంతల దేశములలో ఈ అభివృద్ధి దారుణ పరాజయమును పొందినది. సంఘ ప్రాముఖ్యమే గాని వ్యక్తి స్థితి లేదని వారి వాదము. స్వల్ప స్వాతంత్ర్యమేని కల దేశములలో ఈ నూతన విశాల దృష్టి ఇంకను నిలబడి యున్నది.

గాని, పరుల కుదాహరణముగ గాని దుర్మార్గులని, ధర్మ విచ్ఛేదకులని శిక్షించుట, బంధించుట, భయపెట్టుట, ఉరితీయుట, భౌతిక నైతిక బాధలు పెట్టుట మున్నగునవి పురస్సర సంఘములకు బొత్తిగా నచ్చుట లేదు. వారి పరిస్థితులను, ఆంతరంగిక లోపములను, వంశక్రమ ప్రాప్త లక్షణములను అంగీకరించి వారి నర్థము చేసికొని పాడు చేయుటకు బదులు పరిణితులను చేయుటకే నేడు సుముఖత్వము పెరుగుచున్నది. సాధారణముగ సమూహమును, జాతిని, సముదాయమును సంఘములోని అంతర్ముఖ ప్రాణులుగా వాని పెరుగుదలను సహజాభివృద్ధిని పరిణతము చేసి ఫలవంత మొనరించు విధి సంఘమునకున్నదని మనమెంతుము. ఇంత వరకు మంచిదే. ఈ నూతన సమాలోకనము వలన లభించునట్టి గొప్ప జ్ఞానము, యధార్థ గభీరత, ప్రాజ్ఞ మానవత్వము మిన్నవి యగుట స్పష్టము. కాని ఈ కొత్త దారిలో మన జ్ఞానానుభవముల సీమలను తీవ్ర ప్రమాదభ్రంశ ప్రాప్త్యవకాశములును వాని వలెనే విస్పష్టములు

∴

అసలైన అంతర్ముఖత్వము

శ్రీఅరవింద వచనామృతం

పాలిత పాలక జాతులలో ఏవైనను చేయు బుద్ధిపూర్వక పరిణతి యత్నమును ముఖ్యముగా అంతర్ముఖమైన జర్మనీ జాతి యొక్క మహత్తరానుభవమును చూచినచో ఈ ప్రమాదము లెచ్చట బయలుదేరునో తెలిసికొనగలము. మొదటి ప్రమాదము వ్యక్తియుగములో నుండి చారిత్రకముగ అంతర్ముఖ యుగమావిర్భవించునపుడుద్భవించునట్టిది. వ్యక్త్యహంకారమునే, సామూహికాహంకారముగా మార్చుట వలన కలుగునట్టి గొప్ప ప్రమాదమే మొదటి భ్రంశము. అహంకారమే ఆత్మ కాదనేడి, అందరి ఆత్మయు అద్వైత భావాత్మకము కాగా విశ్వాత్మక దైవములో ఆత్మ ఒక భాగమనెడి రెండు ముఖ్య మనస్తత్త్వ సత్యములను తెలిసికొని జీవించినప్పుడే వ్యక్తి స్వీయ ధర్మము నెరుగ గలడు. అహంకార బుద్ధి, ప్రాణశక్తి, దేహ దారుఢ్యము మున్నగు వాని పరమాభివృద్ధి గాని, మనోభావ, దేహలాలసల పరమ సంతుష్టి గాని నిరాకరించి తనలో నున్న దివ్యత్వము విజ్ఞతా శక్తి ప్రణయ సర్వగతత్వ సామర్థ్య పారమ్యములలో వికసింప జేయుటయు, ఈ వికాసము నుండి సృష్టి గత సౌందర్యా నందములను తాను సాక్షాత్కరించు కొనుటయు వ్యక్తి సఫలత్వమగును.

ఆత్మజ్ఞానము లేనన్ని నాళ్ళు మనమీ రీతిగనే చేయుదుము. కాని ఇంకొక రీతిగా చేయమను మాట నిస్సందేహమే. భగవద్దత్తమైన ప్రవృత్తిచే బ్రదుకుచూ ఆత్మానభిజ్ఞతలో నున్న మనుష్యులును, జాతులును, అహంకార పూరితాలోచనా చరణములతో కూడిన జీవితము తప్ప అన్య మెరిగిన వారు కారు. ప్రకృత్యనుభవములు నేర్పిన సహజావ బోధాత్మ నిగ్రహ నీతులతో, శాసన నిరోధములకు లోబడి అహంకారముతో జీవించుట నిర్జీవ స్థితి కంటె కొంత మేలు గదా. అంతర్నిష్ఠమనగా ఆత్మజ్ఞానాంతస్తత్త్వముల తోడి జీవితము కొరకైన యత్నము. కొత్త పేరులతో పాత తప్పులనే చేయుచున్నచో ఏమి లాభము? వ్యక్తి యనగా మానవ పరిణామములో ఆవిర్భవించుటకు సిద్ధపడుచున్న దివ్యవ్యక్తిత్వముగాని అహంకారము కాదని మనము గ్రహింపవలెను. స్వీయాంతర సత్య ధర్మముల నంతర్ముఖముక నభికాంక్షించు మానవులహంకార జీవన సంకల్పముల తోడి ఇంద్రియ సంతృప్తిని మాని, ఈ దివ్య వ్యక్తిత్వావిర్భావ సౌహిత్యములనే వాస్తవిక లక్ష్యముగా స్వీకరింపవలయును.

ప్రస్తుతము మిగిలిన వానిని వదలి వేసినను, తన్ను తానుగ మాత్రమే కాకుండ తోడి వారితో దృఢ సంబంధ స్థితిలో నున్న దానినిగ వ్యక్తి గ్రహించుటయే రెండవ చేతనాత్మక సత్యము. మనలో నున్న తత్త్వమే వ్యక్తి గతముగ విశ్వ వ్యాప్తముగ నున్నది. ఈ రెండునూ దేని దారిలో అది, ఆత్మ వికాసమును పొందవలసి యున్నను అన్యోన్యాలంబన రహితముగ అవి కృతార్థములు కాలేవు. మనము అహంకారేంద్రియాతీతాత్మ స్వరూపులమని, మన జీవిత రూపములలో ఆత్మ పర భేదము లేదని, మన అహంకారము తన్నుకొని తలక్రిందులైనను మనలో మనకు తప్పింపరాని మార్మిక దృఢసంబంధమున్నదని యథార్థమైన అంతర్ముఖత్వము మనకు బోధించును. 'నేను' అనబడు ఆత్మయే పరమాత్మ స్వరూపమని, ఆ పరమాత్మ నెరిగి సచేతన తాద్రూప్యమును పొందుటయే మన జీవిత ప్రయోజనమని, వ్యష్టి సమష్టి రూపములలో నున్నదియు పరమాత్ముడే యగుట వలని అన్యోన్యైక్యము నంగీకరించి ప్రత్యక్షీకరించు కొన్ననాడే మనకు నిజమైన ఆత్మ వికాసము కలదని ప్రాచీన భారతీయులు కనుగొనిరి.[3]

కాని ఈ రెండు సత్యములు వ్యక్తికి, జాతికి కూడ వర్తించును. జర్మనీ అంతర్ముఖత్వములోని మొదటి ప్రమాదమిచ్చుటనే యున్నది.

∴

అంతర్నిష్ఠ యుగాగమనము

శ్రీఅరవింద వచనామృతం

తార్కిక మరియు భౌతిక ఫలాపేక్ష వాదములు నూతన శకానికి దారి తీస్తున్నాయి:

దీనిని మించిన జ్ఞాన మవసరమైనపుడు అతడు తనలో నున్న కొత్త శక్తులను, ఉపకరణములను చూడవలసి వచ్చును. తన్ను తాను తెలిసికొనుటకు ఆత్మ విమర్శనము కంటె ఆత్మ చైతన్యము, పై పై భ్రమణముల కంటె ఆత్మ నిహిత జీవిత క్రియలు ఉపకారులని అతడు భావించును. పై పై మనోభావములకు వెనుకనున్న వానితో సాంగత్యము పొంది, హేతువును కాంతిమంతముగ జేసి, తన్మూలమున క్రియలను శక్తిమంతములుగా జేసి ఈ జ్ఞానోపలబ్ధి కతడు యత్నించును. ఈ దారిలో హేతు జ్ఞానము స్వతః స్ఫురణ జ్ఞానమునకు, గభీరాత్మావగమమునకు వశమగును. ఆత్మ చైతన్యమునకు, ఆత్మ సాక్షాత్కారమునకు ఉపయోగ ప్రమాణము లొంగి పోవును. ప్రపంచ మనుష్య బహిరంతర్జీవితములలో నిగూఢ క్రియాత్మకములైన ధర్మ సంకల్ప శక్తుల ననుసరించి జీవించుటకు బాహ్య ప్రకృతి ధర్మావలంబి జీవిత విధానము దారి ఇచ్చును.

ప్రపంచము అంతర్నిష్ఠ దశ వైపు వడివడిగా మారుతున్న వైనము:

ఈ ధోరణులన్నియు మలినములై, తొలి దశలో సరిగా పెరుగనివై యున్నను, నేటి ప్రపంచములో అతి త్వరితముగా వృద్ధి చెందుచున్నట్లు కనిపించుచున్నవి. ఇవి బలిష్ఠములై వెలువడినచో వ్యక్తిత్వ సృష్టములైన హేతూపయోగ దశల నుండి మానవాభివృద్ధి ఇతోధికాం

---

[3] అన్యోన్యాలంబన మింత తప్పని సరిగ లేని సత్య స్వరూపము వేరొకటి కలదు గాని — అది ఆధ్యాత్మిక పరిణామ గోచరముగా తప్ప, ప్రస్తుత విషయమున కేమాత్రమును పనికి రాదు.

తర్ముఖ సంఘము వైపునకు పోవుచున్నదని అర్థము. పాత విధులను విచ్ఛిన్నము చేసి, పాత ఆలోచనా ప్రమాణములను ప్రతిఘటించి నేటి ఆలోచనా ప్రవాహము విస్తృత గభీర మార్గముల లోనికి పోవుచున్నది. పందొమ్మిదవ శతాబ్దము నందలి ఐహిక వాదము నూతనమై గంభీరమైన ప్రాణ ధర్మ వాదమునకు దారి ఇచ్చినది. ఈ నూతనవాదమనేక రూపములను పొందినది. జీవిత మూల ధర్మములని 'నీషే' (Nietzche) చెప్పిన 'జీవసంకల్పము', 'శక్తి సంకల్పము', ఆత్మాతీతముగ జీవితమునకు ప్రాధాన్యమిచ్చిన బహుసూత్ర వాదము; జ్ఞానదీప్తుల కంటె క్రియా శక్తులకు ప్రాధన్యమిచ్చిన జీవితానుకూల్య వాదమును ఇట్టివే. మొదటి ప్రపంచ యుద్ధమునకు ముందు యూరపులో, ముఖ్యముగా ఫ్రాన్స్, జర్మనీలలో మనుష్య జీవితాలోచన ముల నిమత్తముగ ప్రబావితము లోనరించిన ఈ ఆలోచన ధోంణులూరకే బుద్ధి ప్రాధాన్యము నుండి జీవిత క్రియల వైపునకు పోయినవి మాత్రమే కావు. అల్పమనస్కులిట్లనిపించునట్లు చేసిరనుట నిజమే; కాని అంతర్ముఖమై మనః ప్రధానమైన మార్గములో విశ్వ ప్రాణతత్త్వము నర్థము చేసికొని తదనుగుణముగ జీవించుటకివి ఒక యత్నము చేసినవి. వీని వెనుక నుండి పురాతన హేతు ప్రధాన బుద్ధిత్వము నశించిన చోట నవీన స్వతః స్ఫురణ వాదము బయిలుదేరినది. ఇప్పటికిది తన శక్తి తత్త్వములను స్ఫుటముగా నెరుగదు. జీవిత రూప ప్రభావముల ద్వారమున జీవితాతీత విషయముల నన్వేషించుచు ఇది అప్పుడుప్పుడు ఆత్మ తత్త్వ సంవృత ద్వారములు తడవి చూచినది.

అంతరంగలో నూతన లోకావిష్కారణ బాహ్య ప్రపంచంలో ఒక నూతన లోకాన్ని జీవితంలో, సంఘంలో సృష్టిస్తుంది:

ఈ ఉద్యమము నందధిక సృజన శక్తి రష్యాలో ప్రకటితమైనది. పూరాతన బహుర్ముఖ త్వమును తానాక్రమించినట్లే ఈ అర్థ రహిత ప్రాణ వాదమును మనస్తత్త్వ స్వతః స్ఫురణ ప్రధానములైన సంగీత సాహిత్య కళలాక్రమించినవి. నూతన తాత్త్విక స్వతః స్ఫురణ వాదము వలె ఈ ఉద్యమము కూడా పై పొరలను ఛేదించి వస్త్వంతర్గతమైన ఆత్మను మనస్సుతో అవగతము చేసికొనుటకు యత్నించినది. ఇది చాల వరకు శక్తిహీనమై, అయధార్థ బోధ సమన్వితమై ప్రారంభ దశలో నున్నది. కాని ఇది మానవ మనస్సును కట్టి యుంచిన బంధముల నుండి విడిపించి నూతన జీవిత సంఘ ప్రపంచములను సృష్టింప జాలిన దిక్కునకు ప్రయాణింప జేసినది. బాహ్య హేతు సూత్రములను విడనాడి వస్త్వంతరన్వేషణాభిముఖములై సాహిత్య కళలొక కొత్త దారి తొక్కినవి.

లోతైన అంతరాత్మ మన ముందుంచుకొన్న ఉద్యమానికి నాయకుడు కావాలి:

వ్యక్తి సమష్టి జీవితములను వ్యవస్థీకరించి బాహ్యాంతర జీవితములలో చేతన క్రియాంకురములు పొడమునట్లు చేయగల ఈ అస్పష్ట నూతన ధోరణులే జాతికి ఆశాజనక ములుగా నున్నవి. మొదటి ప్రపంచ యుద్ధమునకు పూర్వము శిశు పోషకాభివృద్ధి విద్యావిధాన విషయములలో ఉద్భవించిన కొత్త ఊహాలలో ఇవి సుస్పష్టములైనవి. పూర్వ విద్యావిధా నములో బాలబాలికల వ్యక్తి విశేషములను చివరకు నెట్టి బలవన్నిర్దిష్ట మార్గములలో శిక్షణ నిచ్చి విద్యకరపుటయే ముఖ్యము. కుటుంబ జీవితములో బాలుర వ్యక్తిత్వము ననగ ద్రొక్కి బలవంతముగ వారి అలవాటులను, ఆలోచనలను, స్వభావమును తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్ణయించిన ధోరణిలో పరంపరగా వచ్చు ఊహాలకో వ్యక్తి లాభములకో, ఆదర్శములకో అనుగుణముగా మార్చి వేసెడి వారు. బాలుర మనస్తత్త్వము ననుసరించి వారి బుద్ధిశక్తులు, నైతికశక్తులు వీలైనంత వరకు పెంపొందించ వలెనని తెలిసికొనుట అభివృద్ధి లక్షణము. ఇది

వ్యక్తి ప్రధాన వ్యవస్థకు సన్నిహితమగుటచే శ్రేష్టమైనది. ఐనను ఇది ఫలవంతము కాలేదు. బాలురనగా ఉపాధ్యాయుడు బోధించి సరిదిద్ద వలసిన వారని భావించుటయే దీనికి కారణము. మానవుడు తనకు తానభివృద్ధి చెందు ఆత్మ స్వరూపుడని, విద్యార్జనములో జననీజనకోపాధ్యాయులతనికి తోడ్పడవలసిన వారు మాత్రమేనని, అతని బుద్ధి నీతి కళాత్మక శక్తులు అతనితో పాటు స్వచ్ఛందముగ పెరుగవలసినవే కాని, వస్తువులకు రూప సృష్టి చేసినట్లు చేయదగినవి కావని చిట్టచివరకు స్వల్పముగా గోచరించినది. ఆత్మ అనగా నేమియో ఇంకను తెలియదు. బాలుడైనను, మనుష్యుడైనను, అతని యదార్థ చేతనను, అంతరాత్మను కనుగొనునట్లు సహాయ పడుటయే రహస్యమనియు తెలియదు. దానిని ముందరకు రానిచ్చి, అదియే మార్గదర్శిగా భావించినచో, విద్యా భారమును మన నుండి తానే వహించి, మన ఊహానుభవమునకు, బాహ్య పద్ధతులకు అలవాటు పడిన దృక్పథమునకు, అతీతమైన నిగూఢ శక్తులు కల మానసిక వ్యక్తి అభివృద్ధికి అది మిక్కిలి తోడ్పడును. ఈ కార్యమును నిర్వహించుటకీ నూతన విద్యా పద్ధతులనువగు మార్గములోనున్నవి. దేహ ప్రాణముల వెనుకనున్న చైత్య పురుషునితో సన్నిహితత్వము కలిగి అతని శక్తులపై ఆధారపడినచో అది మానవవుడాత్మ స్వరూపుడని, దైవము యొక్క చిచ్ఛక్తి యని, ఏతన్నరావిష్కంణమే విద్యా లక్ష్యమని నిగూఢ సత్య వ్యక్తి ధర్మ వశం వద జీవితమే సర్వమానవ లక్ష్యమని, నిరూపించుట కుపకరించును. మత, సాంఘిక, ప్రతీకములలో పూర్వులీ జ్ఞానమునే వ్యక్తీకరింప నెంచిరి. ఈ నష్ట జ్ఞానాభిముఖమగు మార్గమును చూపు నదియే వ్యక్తిత్వ ప్రాధాన్య వాదము. మానవుని ఆంతరానుభవమును గభీర మొనరించి, జాతికి అంతర్దృష్టిని, ఆత్మ జ్ఞానమును అశృత పూర్వముగ తిరిగి కల్పించి సాంఘిక సామూహికాభివ్యక్తిని గొప్ప పరిణామము చెందించుటతో ఇది సమాప్తమగును.

వ్యక్తికి సమాంతరంగా జాతులు కూడా పురోగమిస్తయి:

ఆత్మాభివృద్ధి నన్వేషించుటయే వ్యక్తి జీవిత ప్రధాన ధర్మము, ప్రయోజనము. సగమో, సాంతమో తెలిసి గాని, మనకగ తెలియకుండగాని తన్ను తాను తెలిసికొనుటకు, తన ధర్మ శక్తులలో సాఫల్యము పొందుట కెప్పుడు అది యక్తముగ పరిశ్రమించును. దానిలోని ఈ లక్ష్యము ప్రాధమికము, యుక్తము, గత్యంతర హీనము. ఏలయనగా వ్యక్త వ్యానుష్టానములన్నియు అయిన పిమ్మట, మానవుడు శాశ్వత సత్య జీవ శక్తియు, ఆత్మావిష్కార తత్త్వ రూపియునగును గాని కేవలము నశ్వర మనః ప్రాణ దేహ సమాహారమై రూపుమాసి పోవు వాడు కాడు. అదే విధముగ ఆత్మ సఫలీకరణము నన్వేషించుటయే సంఘ జన సమూహ జాతుల ప్రధాన ధర్మము, ప్రయోజనము. తన్ను తాను కనుగొనుటకు, తన నిగూఢ శక్తుల నన్నింటిని సంపాదించుకొనుటకు, ఆత్మావిష్కార రూప జీవితమును గడుపుటకు అది పరిశ్రమించును. దీనికిని అదే కారణము; ఇది కూడా ఒక ప్రాణి; శాశ్వత సత్య జీవితశక్తి; విశ్వతత్త్వాత్మావిష్కారము; తనలో నున్న విశ్వతత్త్వ సత్యార్థ శక్తులను చేతనైనంతలో వ్యక్తీకరించి సఫల మొనరించుటకే ఇది జీవించి యున్నది. వ్యక్తికి వలెనే సంఘమునకు, జాతికి, దేహము, సాంగ జీవితము, నైతిక కళాత్మక చిత్తవృత్తి, పెరుగుచున్న మనస్సు, ఆత్మ కలవు. పై చిహ్నములకు, శక్తులకు వెనుక, వాని కొరకే, ఇవి బ్రతికి యుండును. వ్యక్తి వలెనే ఇది కూడా ఆత్మ కలిగి యున్నదని చెప్పుట కంటె ఆత్మ స్వరూపమనియే చెప్పవచ్చును. ఇది ఒక సమూహాత్మ; ప్రత్యేక వ్యక్తిత్వము నొందిన పిమ్మట క్రమ క్రమముగా ఆత్మోన్ముఖమై సాకల్య మనః క్రియాత్మవ్యంజక సాంగ జీవితములో తన్ను తాను కనుగొనును.

అంతర్ముఖ మానవ యుగము చక్కని ఫలితములు పొంద వలెనన్నచో జాతుల యందాత్మజ్ఞతతో పాటు పరాత్మజ్ఞత కూడ ఆవశ్యకము. సంపత్సమాలోచనములలో మాత్రమే కాక ఆత్మీయాధ్యాత్మిక పరస్పర గౌరవ సహాయ లాభములలో సహితమీ దృష్టి ఉండవలెను.

అంతర్నిష్ఠ యుగము – దివ్యజీవన శకానికి పూలబాట

శ్రీఅరవింద వచనామృతం

ఆధునిక ప్రగతి స్వభావపు ననీనాంతరాభిముఖత్వములో, ఇప్పుడే ప్రారంభమగుచున్న మహి తాంతర్నిష్ఠాభిముఖత్వములో భద్రతరమైన ఆశ వున్నది. ఈ అభిముఖత్వముచే అది మానవ యధార్థ సత్యము అతని ఆత్మ యందే దృశ్యమగునని గ్రహింపవచ్చును. అది వాస్తవముగ అంతర్నిష్ఠ యుగము మనల నచ్చటికి తీసికొనిపోవునని నిశ్చితము చేయదు గాని, యుక్తముగా ఉపయోగించినచో తదభిముఖమై అది మనకు ప్రాప్తి సన్నాహము చేయును.

*

అంతర్నిష్ఠ యుగము క్రియా రంగము నందు రూపు దాల్చు భావచ్ఛాయలు ప్రతి రూపాత్మక సంఘ వ్యవస్థానము నాక్రమించు సూచనలగపడుచున్నవి. మానవ యుగములో నూతన శకోదయ కాంతులు మన పై ఇప్పుడే ప్రసరించుచున్నట్లు కనిపించుచున్నది.

*

స్ఖలనములతో, సందేహములతో, అపసరణములతో, అన్య స్వకీయ క్రౌర్య పరంపరలతో కూడిన ఈ అన్వేషణము నందు సత్య ప్రమాద యుక్తా యుక్త బలాత్కార విప్లవాసహ్యా సమాయోగా ద్యనేక సమ్మిశ్రణములో, విసంవాద వర్గీకరణ బలాత్కార సమాయోగ సంఘర్షణములను మాని స్వాతంత్ర సామరస్య ధర్మముల ననుసరింప జేయజాలిన జ్ఞాన విస్తృతి గాని, మనో మార్దవము గాని, స్వభావ శుద్ధి గాని అతని కింకను లేవు. కని విని ఎరుగని వేగముతో జ్ఞానము పెరిగి వ్యాపించుచున్నప్పుడు, విడదీయరాని భ్రాంతి పూరితములగు చిక్కులతో కూడిన అస్తిమితైక్యము నొందిన జాతులన్నియు దగ్గరకు చేర్చ సాక్షికైక్యముతో నున్నపుడు, పరస్పర మర్ధము చేసుకొనుటకు బలాత్కరింపబడి తమ్మును, మానవ జాతిని, దైవమును, ప్రపంచమును అర్థము చేసికొనుటకు ముందుకు త్రోయబడుచున్నప్పుడు, మనుష్యులకును, జాతులకును ఆత్మ సాక్షాత్కార భావము సచేతనముగా ప్రస్ఫుటమగుచున్నప్పుడు, ఇదియే అంతర్నిష్ఠ యుగము చేయవలసిన పని. అట్టి యుగములో తన్ను తాను సత్యముగ తెలిసికొని, ఆత్మ వికాసాదర్శ సూత్రమును కనుగొని, అహంకారపూరిత స్వభావము వలని కష్టములచే దాని ననుసరింపలేక పోయినను, పట్టు విడువక వ్యక్తి సంఘ స్థితిని రూపొందించు సూత్రముగా దాని నుత్తరోత్తరముగా మార్చుటకు మార్గమును క్రమ క్రమముగా కనుగొనవలెను.

*

జాతిలో ఇప్పటికీ అపరిపక్వముగా ప్రారంభదశలో నున్న బీజప్రాయాధ్యాత్మికము సంతృప్తికరమగునట్లు వికసింప జేయుట సాధ్యమగునన్న విషయము మినుకు మినుకు మను ప్రబోధంతోగాని ప్రథమ గంభీర నిగూఢ శక్తితోగాని సూచించునదియే అంతర్నిష్ఠ యుగము. నిజమైన సాంఘిక సమగ్రతకు వ్యక్తి, సంఘముల ఆత్మయు, జీవితమును ఇంతకంటె గంభీర విశాల మహత్తర పరమార్థీ భూతాంతరవగాహనము కలిగి, ఇంతకంటె ఎక్కువగా ఆధ్యాత్మిక దీప్తి పై ఆధారపడి అన్ని సమస్యలు తుది పరిష్కారమునకు ఆధ్యాత్మిక మార్గముల నవలంబించిన నాడే వీలగును. స్వేచ్ఛా నిబంధనము గాని, అర్థ పరమార్థ బుద్ధితో కూడిన మతవాది పురోహిత మతప్రవక్తలలో ఒకడు గాని పరిణతాధ్యాత్మిక మానవ ప్రాభవపూరిత

నిగ్రహ ప్రభావ నాయకత్వమును గాని జాతిని దివ్యముగా నడపగలుగునని ఆశింపవచ్చును. ఆధ్యాత్మికముగా మారిన సంఘము మాత్రమే వ్యక్తి సామరస్యమును, సంఘ సుఖమును సమకూర్చగలదు. లేదా దైవ రాజ్యమును భూమి మీద స్థాపించి మానవ మనో హృదయములలో దైవమే మానవ జాతిని పరిపాలించునట్లు చేయు దైవ శాసనమును స్థాపింపగలదు; ఈ మాటలకు భావోద్వేగ హేతువులు దురర్థము చెప్పుటకు వీలున్నను ఇవియే ఈ భావమును చక్కగా వ్యక్తీకరించునవియై ఉన్నవి.

∴

మానవ పరిపూర్ణత్వానికి మార్గము

శ్రీఅరవింద వచనామృతం

ప్రాణవ్యక్తి నిత్య వర్తనములో ప్రకృతిని విశ్రమించి ఒక విధమగు సమగ్రతను సాధింపగలదు కాని ఆ సమగ్రత నిరుద్ధాభివృద్ధితో తన పరిమితులలో సంతృప్తమై యుండును. అది ఇట్టి దానిని వృక్ష జంతు సంతతిలో సాధింపగలదు; వానిలో దేహ ప్రాణములే ఉపకరణ లక్ష్యములుగా నుండుటయు, అవి వాని కావల ఏమున్నదో చూడకపోవుటయు దీనికి కారణము. ఇట్లు మానవులలో సాధించుట శక్యము కాదు. ఏలయనగా మానవుని లోని ప్రకృతి తన దేహప్రాణాలంబనమును దాటిపోయినది. అది అతనిలో తత్త్వ దీపప్త్యభిముఖ జీవిత వికాస రూపమైన మానసమును పెంపొందించినది. ఇట్లు జరిగిన పిమ్మట దేహ ప్రాణములు పరికర మాత్రములే కాని లక్ష్యము కానేరవు. అందుచే భౌతిక జీవిత కాంతిహీన వర్తమానము ననుసరించుటలో మానవ సమగ్రత లేదు. అది మానసిక వ్యక్తి యొక్క విస్తృత వర్తనములో కూడ లభింపదు. మనసు కూడ ఉపకరణ మాత్రమై తనలో పనిచేయుచున్న ఒకానొక శక్తిని చేరుటకు ప్రయత్నించును. ఈ శక్తి మానసాతీతమై మనోగత బుద్ధికి అతీత చేతనమగు విస్ఫార సత్యముగా నున్నది. శాశ్వత సమగ్రతత్త్వోన్మేషమునందే మానవ సమగ్రత కలదు.

జంతు వృక్షములలోని ప్రకృతి యొక్క నిమ్న సమగ్రత వానిలో ఒక్కొక్కటి తన ప్రాణ సత్యమునకు సహజ ప్రేరణతో, అతర్కితముగా, ఈషచ్చైతన్యముతో విధేయమగుటచే సిద్ధించు చున్నది. ఆధ్యాత్మికముగా మారిన మనుష్యుడు తన యధార్థ స్వభావమును గ్రహించి, ఆత్మైక్యమును సాధించి, సాక్షాత్కృత వ్యక్తి సత్యమునకు ప్రయత్నరహిత విధేయతతో ఉండుట వలన ఆధ్యాత్మిక జీవితము యొక్క ఉన్నత సమగ్రత సిద్ధించుచున్నది. ఏలయనగా, ఈ అప్రయత్న సిద్ధి సహజ ప్రేరణాత్మకముగాని, అర్ధచేతనాత్మకముగాని కాక స్వతః స్ఫురణాత్మకమై, సంపూర్ణ సాంగ చేతనాత్మకమై యుండును. అది ఆధ్యాత్మిక దీప్తి స్వతః ప్రవర్తిత సూత్రమునకు అత్యున్నతాఖండ సత్యమునకు, అతివిశాల సౌందర్యమునకు, సహృదయమునకు, శక్తికి, ప్రహర్షమునకు, ప్రణయమునకు, ఐక్యమునకు సంతోషముగా విధేయమై ఉండుట అగును. జీవితమునందు వర్తించు ఈ శక్తి యొక్క లక్ష్యము సర్వ జీవితాభివృద్ధి కలనోప భోగరూపమై ఉండి తీరవలయును. కాని ఈ అభివృద్ధి దివ్యావిష్కార కలనమై, వస్తుతత్త్వ పారమార్థికోపభోగమై యుండును. ఈ పారమార్థికోపభోగము జీవితమునందలి దేహ ప్రాణ మనస్సంకేతముల నుపయోగించును కాని వానిపై ఆధారపడి యుండదు.

తత్త్వము మనో జీవిత రూపములను ఛేదించి వెలువడి తన సర్వజ్ఞ తేజోమయోన్నతికి నెగయునట్లు చేసి ఆ దీప్తి తరంగముల నుండి వాని పైకి ప్రసరించి దానిని గ్రహించి తన రూపములోనికి పరిణమింప జేసినప్పుడే మానవునికి సత్య స్వాతంత్ర్య సమగ్రతలు సిద్ధించును.

మనమిప్పటికే గమనించినట్లు, వాస్తవముగా మన స్థితిలో మనో బుద్ధులు మూల శక్తులు కావు. అవి అర్థ సత్యములను, అనిశ్చితత్త్వములను మాత్రమే అంతంత మాత్రముగా గుర్తించి ఆ సంతృప్తిహీన వలయములో తిరుగాడు చుండును. మనః ప్రాణములలో బుద్ధిరస నీతి క్రియా భావేంద్రియ ప్రాణ దేహ చర్యలలో నిగూఢమై తాదాత్మ్య స్వతః స్ఫురణములచే వీక్షించి ఈ అన్నింటికీ అవి పరిగమింపజాలిన సత్య నిశ్చయ స్థైర్యముల నిచ్చునట్టి శక్తి ఒకటి కలదు. మన సకల చర్యలకును, శాస్త్ర వేదాంతములకును వెనుక దీనిని ఇప్పుడిప్పుడే మనము అస్పష్టముగా చూచుచున్నాము. కాని ఈ శక్తి తన కొరకు కాకుండ మనో జీవితముల కొరకు, తన సహజ దీప్తిచే కాకుండా దాని రూపములలో పనిచేయవలసి యున్నంత కాలము ఈ అవగమమును మనము మహితముగా ఉపయోగింప లేము; ఈ ఆంతర యక్షుని వలని సహజ లబ్ధిని పొందలేము. మానవుడు తానిప్పటికే అభివృద్ధి చేసినదంతయు, యుక్తముగనే అయినను రిక్తముగ తాను గర్వపడు తన బుద్ధిని, అపర్యాప్తముగ వక్కాణించి, ఇటు పై ఈ మహిత దీప్తిని కనుగొని ఆవిర్భవింప జేసి, స్వేచ్ఛతో ఉండునట్లు చేయుటయే! తన సర్వవ్యాప్త ప్రకృష్ట కరణీయమని ధైర్యముగా చెప్పగలిగిన నాడే ఆధ్యాత్మికాతిమానుష వ్యక్తిత్వ మార్గము మానవునకు వివృతమగును. అప్పుడతని వేదాంత కళా శాస్త్ర నీతి సంఘ స్థితి జీవితా న్వేషణములు, మనోజీవితములు తమ కొరకే వలయాకారముగ వర్తింప జేయునట్టివి కాక, మనో జీవితముల కతీతముగా నున్న మహిత సత్యమును ప్రాపింప జేయు సాధనములై, దాని శక్తిని మనుష్య జీవితములోనికి తీసికొని వచ్చు ఉపకరణములుగా మారును. మనము ఆత్మ రూపముల మగుటకు, మన సమగ్రతా సత్య ధర్మమును గ్రహించుటకు మన సత్య వ్యక్తిత్వములో, దివ్య స్వభావములో, సంతృప్త స్థితిలో సత్యముగా జీవించుటకు, యోగ్యమగు మార్గములో ఉందుము.

∴

సంఘస్థితుడైనను, తద్భిన్నముగా నున్నను మానవునికి సమగ్రతను గూర్చిన ఏకైకమగు చివరి ఆశ ఆధ్యాత్మికత్వములో నున్నది; ఈ ఆధ్యాత్మికత్వము తన ప్రత్యేక సంతృప్తి కొరకు భౌతిక క్రియాకలాపములకు విముఖమైనది కాక దాని నతిక్రమించి, అంగీకరించి, సఫలీకరించును. మానవుని హేతువు, రసము, నీతి, ప్రాణతత్త్వము, దేహతత్త్వము, జ్ఞానాభిప్స, సౌందర్యాకర్షణము, ప్రణయావశ్యకత, సమగ్రతాభిముఖ ప్రేరణ, వ్యక్తి జీవిత శక్తి సామగ్ర్యాకాంక్ష మున్నగు వానిని తనలో చేర్చుకొనునట్టి ఆధ్యాత్మికత్వము ప్రాప్తి సౌష్ఠవము చాలని శక్తులకు దాని దివ్యార్థమును, దాని దైవత విధులను చూపి పరస్పర సమన్వయము చేసి, చీకటి వెలుగులలో గుడ్డిగా చూపు చెదరి ప్రయాణించు వానిలో ప్రతి దానికి మార్గమును ప్రకాశింపజేసి కేవలాత్మాభిమానాతి శయముతో కూడిన మానవ హేతువు గూడ అంగీకరించునట్టి శక్తి యగును. లేదేని ఈ హేతువే ఒకనాడు ఆ ఆధ్యాత్మికత్వమును, పరమ ప్రమాణముగా నంగీకరించి తన అత్యంత దీప్తిని, అనంత మూలమును దానిలో చూడవచ్చును. ఏలయనగా, పర్యవసాన ములో అదియే సక్రమ చరమ ప్రక్రియగా మానవుడు వ్యక్తి సంఘ రూపములలో సాధింపనెంచు సర్వస్వాభివృద్ధి సాఫల్యముగా స్ఫురించును.

ఆధ్యాత్మిక యోగాగమనము

శ్రీఅరవింద వచనామృతం

ఏకకాలమందే సాధ్యమయి తీరాల్సిన రెండు నియమాలు:[1]

ఈ అధ్యాత్మిక పరివర్తనము సిద్ధింప వలయునన్నచో, మిక్కిలి కష్ట సాధ్యముగా ఏకకాల సంతృప్తి నపేక్షించు రెండు నియమములను సంయోజింప వలసి యున్నది. తత్త్వ రూపములో తమ్ము వీక్షించుకొని, వర్థిల్లి, పునస్సృజనము చేసి కొనగలిగి, వారి ఊహను, తదీయ శక్తిని సామాన్య జనులకు నివేదింప గలిగిన వ్యక్తియు, వ్యక్తులును ఉండవలయును. తన సహజ లోపములచే బలాత్కరింపబడకుండ, తన సన్నాహము లోని లోపముచే నిశ్చిత పరివర్తనము రాక పూర్వమే దారిలో వెనుక పడకుండ, ఈ ఊహా శక్తులను స్వీకరించి సఫలముగా సమీకరించుకొని అనుసరించుటకు సిద్ధమై, సఫలముగా చేరునట్టి సమూహము, సంఘము, సమాజ మనస్తత్త్వము, కనీసము సామూహిక దేహాంగములు ఈ సమయములో ఉండి తీరవలయును. అట్టి యౌగపద్యము తాత్కాలికౌత్సుక్యముచే సృష్టింపబడినట్లు కనిపించినను వాస్తవముగా అట్టి దెప్పుడును జరుగ లేదు.

మానవుని ఆరోహణకు భృగు మహర్షి తత్త్వాన్వేషణ ఒక దృష్టాంతము:

వరుణ పుత్రుడైన భృగువు యొక్క అన్వేషణములను గూర్చిన విపులార్థవంతమగు ఉపాఖ్యానములో ఉపనిషత్తునందు వర్ణితమగు సహజ వ్యవస్థను మానవ తధ్యాత్మ రూప సత్యాన్వేషణమునకై తేలికగా అనుసరింపవచ్చును. అతడు ప్రారంభమునందు భౌతిక పధార్థమునే, భౌతిక వ్యక్తినే, బాహ్య వ్యక్తినే సత్య తత్త్వముగా ఏకైకాత్మగా కనుగొనెను. పిమ్మట జీవితమును, ప్రాణవ్యక్తిని ఆత్మ తత్త్వమైన సత్యముగా అతడు దృఢీకరించెను. తృతీయోపక్రమములో మానసమును, మనో వ్యక్తిని ఈ సత్యముగా అతడు నిర్ణయించెను. ఆ పిమ్మట మాత్రమే మానసాతీత సత్య చేతన ద్వారమున అప్రముఖాంతః స్థితి నతిక్రమించి శాశ్వతానంద స్థిత సృజనాత్మక సత్యమును చేరి పైవన్నియు దాని కోశములుగా గమనింప గలిగెను. కాని మానవ సమూహము వరుణ పుత్రుని వలె అంతటి దీక్షతో అంతటి మార్దవముతో ఉండలేక పోవచ్చును. అన్వేషణ యెచ్చటైనను ఆగిపోవచ్చును.

మానవ జీవితమును ఆధ్యాత్మికంగా ఉదాత్తం చేయుటలో విఫలమగుటకు కారణములు:

పదార్థము నుండి తత్త్వము వైపున కిట్లు కష్టముతో ఆరోహించుట మానవుని అభివృద్ధిలో ఒక ఆవశ్యక దశ కావచ్చును. మానవ జాతిని ఆధ్యాత్మికముగా చేయుట కొరకు గత కాల యత్నములు విఫలము లగుట కిది యొక ముఖ్య కారణము. వారు మానవుని ఒక విధమగు త్వరితాద్భుతముచే ఆధ్యాత్మికముగా చేయుటకు ప్రయత్నించిరి. అట్లు జరుగుటకు వీలున్నది. కానీ ఈ అద్భుతము మధ్యగతములగు ప్రస్థములను చేరకుండగా, వానిని వశీకరించుకొన కుండగా పైకి లంఘించినచో అది చాల కాలము నిలువ లేదు. ఇట్టి యత్నము వ్యక్తుల విషయములో కృతకృత్యము కావచ్చును. పూర్వజన్మ సంస్కారము కలవారికి ఇట్లు జరుగునని హైందవాలోచనము వచించును. ఇది సాధారణ జన సమూహ విషయములో కృతకృత్యము

[1] ఉప శీర్షికలు సంపాదకునివి.

కాదు. కొలదిమందిని దాటిన పిమ్మట తత్త్వము యొక్క శక్తిమంతమగు అద్భుతము క్షీణించును. ఆంతర శక్తిచే పరివర్తింప లేనిదైన ఈ నూతన మతము యంత్రాంగముచే రక్షింపనెంచి తన సాధనముల యాంత్రిక వర్తనములో చిక్కువడి, అర్థహీనమై, శీఘ్రముగా, లేక నెమ్మదిగా, నశించును. ఐహిక మానవుని భౌతిక మానసమును ప్రముఖము చేసి వానితో వర్తించు ప్రాణ బుద్ధి మనః పరమార్థ యత్నములన్నియు అట్టి గతికే అధీనములగును. ఈ యత్నము తాను సృష్టించిన యంత్రాంగమునకు వశపడి దానికి దాస్యోపహారత్వములను భజించును. యాంత్రిక ధోరణిలో నున్న ఐహిక ప్రకృతి అట్టి హింసాత్మక యత్నములపై ఆ విధముగా కసి తీర్చుకొనును. తన ధర్మమునకు వారు అభ్యుపగమములు చూపునంత వరకు తాను ఆధిపత్యము వహించుటకు వేచియుండును. మానవ జాతి ఆధ్యాత్మికముగా మారవల యునన్నచో అది సాధారణ జన సమూహము నందు దేహ ప్రాణమయముగా ఉండుట మాని సత్యమనశ్చైత్యమయముగా ఉండవలయును. ఆ విధమైన సామూహిక ప్రగతి పరివర్తనములు సాధ్యములగునా యని ప్రశ్నింపవచ్చును. సాధ్యము కాని చో మానవ జాతి నాధ్యాత్మికముగా చేయనెంచు సమస్త యత్నములును గగన కుసుమ సదృశములైనవే.

నాగరికతా చక్రపు భావి సిద్ధికై ఆశాంకురము:

నాగరికతా చక్రము దాని భూత వర్తమానోర్ధ్వ రేఖపై పదార్థ తత్త్వముల నడుమనున్న ఉన్నతోన్నత శక్తి పరిశీలనముల ద్వారమున ధృఢ భౌతిక జ్ఞానము నుండి అనుసరించు చున్నదన్న విషయమున కిది భావి సిద్ధి సూచనము. ఆధునిక కాలములో మనుష్య బుద్ధి "అన్నం బ్రహ్మ" అన్న ఏకైక సత్యము పై ఆధారపడి ప్రపంచ జీవితముల యందు ప్రగాఢముగ వర్తించుచు, ఐహికత్వ ప్రాప్యముల నన్నింటిని మొదట నిశ్శేషము చేయుట కాకర్షింప బడుచున్నవి. అది పిమ్మట స్థితిని పదార్థ స్రష్టగా, మహిత వికాసపర జీవిత స్పందనముగా భావించుటకు ప్రారంభించి "ప్రాణం బ్రహ్మ" అను మౌలిక సత్యాధారము పై స్థితితో వర్తించుటకు శక్తి కలదైనది. అప్పుడే బీజప్రాయముగా బాహ్యామానసము కంటె మహితాత్మావిష్కారాత్మాగమాంతర్మానసమును స్థితి స్వామ్యశక్తిగా కనుగొని "మనోబ్రహ్మ" అను మౌలిక సత్యాధారము పై మన జీవిత మార్గ ప్రాప్యములలో వర్తించుటకు మంచి వీలు కల్పించు నట్టి మూడవ భావమున్నది. ఈ భావము లొకదాని నొకటి వెనువెంటనే అనుసరించి ఒక్కొక్క ప్రస్థములో ప్రాప్య శీఘ్రోన్మీలనమును కలిగించినచో అది కూడ ఒక భావి సిద్ధి సూచనమగును. అట్లు జరిగినచో మనము ఒక్కొక్క దశలో శతాబ్దముల తరబడిగా కాలక్షేపము చేయనక్కర లేదనియు, మనలోని నిమ్న చేతన ప్రకృతి ఆయత్తముగా ఉన్నదనియు అది నిరూపించును.

ఆధ్యాత్మికయుగావిష్కరణ సాధ్యమగుటకు
ముందుగా ప్రకటితము కావలసిన ఒక రహస్యము

మూడవ దశలో, మానసికాంతర్నిష్ఠ యుగములో, ఏకైక సత్యమై, బహు విధోక్తి వ్యక్త గూఢమై యున్న "అయమాత్మా బ్రహ్మ" అన్న దాని తత్వ ప్రవర్తనము యొక్క అప్రముఖ శక్తి మాత్రమే మానసమనెడి భావము బలవత్తరమైనప్పుడు సత్య రహస్యము కనుగొనబడును. అప్పుడు మాత్రమే యదార్థ నిశ్చిత కృషి ప్రారంభమై అన్ని దిశల యందును జీవిత ప్రపంచము లధీతములై, విజ్ఞాతములై, తత్త్వాత్మావిష్కారాత్మావగమ రూపములుగా వ్యవహృతములగును. అప్పుడు మాత్రమే మానవ జాతి యందాధ్యాత్మిక యుగము సాధ్యమగును.

∴

ఆధ్యాత్మిక సమాజము

శ్రీఅరవింద వచనామృతం

*ఆధ్యాత్మిక సమాజము 'సత్' కు సంబంధించిన ఏ మూడు సారసత్యములను సాక్షాత్కరింప జేయగలదు?**

ఆధ్యాత్మిక మానవ సంఘము మూడు జగత్సార సత్యములను, తద్విరుద్ధరూప ప్రకృతి సర్వస్వముచే గుప్తములైన వానిని, అందుచే ఇప్పటికీ మానవ జాతి సమూహామునకు కేవల శబ్ద స్వప్నప్రాయములుగా ఉన్న వానిని, దైవము, స్వాతంత్ర్యము, ఐక్యము అను దానిని ప్రారంభ స్థానములుగా చేసికొని, వానిని సాక్షాత్కరింప జేసికొనుటకు యత్నించు నన్నచో ఇప్పటికి చాలును. ఈ త్రితయమును ఏక రూపమే. దైవ సాక్షాత్కారము లేని ఐక్య స్వాతంత్ర్య సాక్షాత్కారము గాని సర్వ ప్రాణిగతోత్కృష్టాత్మ ప్రాప్తి యగు దైవ ప్రాప్తి లేని ఐక్య స్వాతంత్ర్య ప్రాప్తి గాని ఉండవు. తమ కేంద్రము చుట్టు నిమీలిత నేత్రములతో పిల్లి మొగ్గలు వేయుచు, ఐక్య స్వాతంత్ర్యముల నుండి తప్పించుకొన జూచు మనలోని విభజన దాస్య యత్నములనే ఐక్య స్వాతంత్ర్యములను పేరుతో పిలుచుచున్నాము. దైవదర్శన ప్రాప్తులు కలిగినప్పుడే మానవుడు సత్య స్వాతంత్ర్యైక్యములను తెలిసికొనగలడు. ఇది ఇంకే రీతిగను శక్యము కాదు. నిజ్ఞాతుడగుటకే భగవంతుడు వేచియున్నాడు. ఆయన కొరకు మానవుడు సర్వ దేశముల యందును దివ్య విగ్రహ నిర్మాణము చేసి అన్వేషించు చున్నాడు. కాని ఎల్లకాలము నందును అతడు స్వీయమానసాహంకార జీవాహంకార ప్రతి రూపములనే వాస్తవముగా కనుగొని సఫలముగా ప్రతిష్టించి పూజించు చున్నాడు. ఈ అహంకార కేంద్రము పరిత్యక్తమై, ఈ అహంకారానుధావనము సమాప్తమైనప్పుడు మానవుడు తన బహిరంగాంతరంగ జీవితములో ఆధ్యాత్మికత్వమును సాధించు ప్రథమ యధార్థావకాశము లభించును. అది చాలదు. కాని అది ఒక ప్రారంభమై, సత్య ద్వారమై అంధ ప్రవేశము వంటిది కాదు.

ఆధ్యాత్మికముగా మారిన సమాజము ఏ విధంగా అహంకారమును నిర్మూలించును?

ఆధ్యాత్మికముగా మారిన సంఘము, ఆధ్యాత్మిక వ్యక్తులు అహంకారమును మాని ఆత్మలో జీవించునట్లే, సమూహాహంకారమును మాని సమూహాత్మలో జీవించును. అహంకార పూరిత స్థితి నుండి కలుగునట్టి ఈ విమోచనము దాని ప్రథామాతిప్రముఖ లక్షణముగా ఉండును. కాని ఆకార రహిత బృహద్విగ్రహ ప్రాంగణ వేదిక పై తన ఆత్మను బలి పెట్టుటకు బలాత్కృతుడగు యజ్ఞపశువు వలె, మానవుడు తన వైయక్తిక సంకల్పాభీప్సలను, అమూల్య బహుశ్రమ సిద్ధ వ్యక్తిత్వమును, సామూహిక సంకల్పము కొరకు, సంఘాహంకార లక్ష్యముల కొరకు, ఆత్మ నాశము చేసికొను విధమున ఇప్పటి కాలములో వలె బ్రతిమాలుట వలననో, బలాత్కరించుట వలననో ఈ అహంకార నిర్మూలనము జరుగదు. అట్లు చేసినచో అది అనల్పాహంకారము కొరకు స్వల్పాహంకారము చేసిన త్యాగమగును. ఈ అనల్పత్వము రూపములోనే కాని గుణ విస్తృత్యౌదార్యములలో కానక్కర లేదు. వ్యస్తాహంకార రాశి రూపమైన సామూహికాహంకారము తరచుగా వ్యక్త్యహంకారము కంటె జుగుప్సావహాటవికాభి

---

* ఉప శీర్షికలు సంపాదకునివి

చారార్చనము వంటిదై అల్పదేవత వలె ఖండన మండన యోగ్యమగును. అహంకార వినాశముచే సర్వగత సంపూర్ణ సమాగ్రాత్మను అన్వేషించి దానిలో జీవించుచు సమగ్రతా రూపము లోనికి పెరుగుటకై ఆధ్యాత్మిక మానవుడు యత్నించును. సర్వా శ్లేషక విశ్వాత్మకత్వముతో అతడు తన ప్రకృతి యొక్క సచేతన పరిధిలో ఇట్లు చేయుచున్నప్పటికిని ఇది వైయక్తికముగా మాత్రమే అని గుర్తింప వలయును. రెండవ యుగమగు శక్తి యుగము నందు విష్ణువు రాజు లోనికి అవతరించుననియు, మూడవ దానిలో స్మృతికారి శాసనకారులయందవతరించుననియు, సత్యయుగము నందు యజ్ఞపురుషుడుగా, అనగా ప్రాణిహృదయాంతరాళావిష్కృతాచరణ ప్రభువుగా అవతరించుననియు ప్రాచీన భారతీయ గ్రంథములు చెప్పుచున్నవి. ఎచ్చటనో దూర స్వర్గమునందు కాక మన లోననే భగవంతుని కనుగొనుట వలన ఫలితముగా ఈ దైవ సామ్రాజ్యము లభించునన్న మాటకు ఆధ్యాత్మిక యుగమగు సత్యా యుగము నందలి సంఘ స్థితి ఫలరూపమై, బాహ్యాకారమై ఉన్నది.

ఇట్టి సమాజపు సర్వ స్వ ములకు ప్రథమ లక్ష్య తత్త్వమేది?

అందుచే ఆధ్యాత్మికత్వ శైశవ స్థితిలోని సంఘము మానవునిలోని దివ్యాత్మను కనుగొని ఆవిష్కరింప జేయుటయే తన ఆచరణ విద్యా జ్ఞాన శాస్త్ర నీతి కళా రాజకీయ యార్థిక నిర్మాణ ప్రథమ లక్ష్య సర్వస్వముగా చేయును. వేదకాలము నందలి ఉన్నత వర్గ సాంస్కృతిక విద్యలో కొంత వరకు జరిగినట్లే, విద్యా సర్వస్వముతో సంభవించును. సర్వవిధ జ్ఞానమును అది తన సీమలోనికి పరిగ్రహించును. కాని కేవల ప్రాపంచిక సాధకత్వము కాక ఈ ఆత్మావగమాత్మాభి వృద్ధులే సర్వ వ్యాప్త లక్ష్య తత్త్వములుగా చేయును. ప్రపంచ ప్రకృతులను వాని ప్రక్రియలలో అర్థము చేసికొని ఐహిక మానవ ప్రయోజనముల కొరకు వాని నుపయోగించుటకై కాక సర్వ వస్తు బహిరంతరూర్ధ్వా వరముల యందును, తన్మూలమున ప్రపంచగత దైవమును, అవ గుంఠనయవని కాంతరిత తత్త్వ మార్గములను తెలిసి కొనుటకై అది భౌతిక చైత్య శాస్త్రముల నధ్యయనము చేయును. సాంఘిక ధర్మమున కనుబంధముగా గాని, దానిని పాక్షికముగా సరిదిద్దుటకు గాని మానిసి మూకల, మందల, యొక్క అజ్ఞా సహ్యా నిబంధనమగు సాంఘిక ధర్మము నాచరణ ధర్మముగా ప్రతిష్ఠించుటకు భిన్నముగా మానవుని యందు దివ్య స్వభావము నభివృద్ధి చేయుటయే నీతి లక్ష్యముగా చేయును. బహిరంతః స్థితి రూప ప్రతి పత్తి మాత్రమే కాక బాహ్యాకారముల వెనుకకు పోవు ప్రముఖ సృజనాత్మక నేత్రముతో వీక్షించి దృశ్యాదృశ్య వస్తు రూపములలో సంజ్ఞావ గుంఠనవత్త్ర ముఖ రూపములలో ఉన్న సత్యా సౌందర్యముల నున్మీలించుటయే కళా లక్ష్యముగా చేయును.

దాని సామాజిక తత్త్వ మేమిటి?

ఆధ్యాత్మికముగా మారిన సంఘము, తన సాంఘిక శాస్త్రములో వ్యక్తిని, ఋషి నుండి పాపిష్టుని వరకు, నిపుణ నిర్మిత యంత్రాంగముచే పరీక్షింపబడ వలసిన సాంఘిక సమస్యాం శములుగా గాని, సాంఘికాకారములోనికి మణగి పోవలసిన, లేక విధ్వస్తము కావలసిన సాంఘిక సమస్యా భాగములుగా గాని గణింపక వలలో చిక్కుపడి రక్షింపబడ వలసిన బాధావశాత్మలుగా, వర్థిల్లుచున్న వర్ధనమునకై ప్రోత్సహింప బడవలసిన ఆత్మలుగా, ఇప్పటికి వర్థిల్లని అపరాత్మలు స్వీకరింపదగు శక్తి సహాయముల నీయ గలిగిన ప్రవృద్ధాత్మలుగా పరిగణించును.

దాని యొక్క ఆర్థిక మరియు రాజకీయ తత్త్వముల ధ్యేయమేమిటి?

దాని ఆర్థిక లక్ష్యము సహకార స్పర్థలతో కూడిన బహుళోత్పత్తి యంత్రాంగమును సృష్టించుట మాని ఒక్కొక్క మనిషికి అత్యంత సాధ్యమగు పరిమాణములో వాని స్వభావమున కనుకూలమగు క్రియా ప్రహర్షమును ప్రసాదించి ఆంతరంగికాభివృద్ధికి స్వతంత్ర విశ్రాంతి నిచ్చి సరళ సంపన్న సౌందర్యమయ జీవిత ప్రదమగును. దాని రాజకీయములలో అది జాతులను స్వదేశాంతర్గత జీవిత సీమలోనివిగా, నియత సాయుధ ప్రభుత్వ మహోద్దామ యంత్రములుగా, తద్యంత్రార్థమే మానవులు దానిని తమ విపులాత్మగా, దైవముగా పూజిం చుచు జీవించి, రణభేరి నిస్వానము చెవిని పడినంతనే దాని పూజావేదిక పై ఇతరులను కడతేర్చి తాము కడతేరుటకు, సిద్ధపడి, ఆ యంత్రమును యథాస్థితముగా, శక్తిమంతముగా అధికాధిక విపుల సంకీర్ణ క్లిష్ట సాధకత్వ పరిపూర్ణతలతో ఉండునట్లు చేయుటకే అని గణింపదు. ఈ జాతులను, రాష్ట్రములను, వాని పరస్పర సంబంధములలో, ప్రశాంత సమయములలో ఒకరి పై ఒకరు విషవాయు ప్రసారములు చేయు ఘాతుక యంత్రములుగా, యుద్ధసమయములలో ఒకరి పై ఒకరు సాయుధ సమూహములతో నిరాయుధ జనసహస్రముల పై ముట్టడించునట్లుగా, ఆధునిక యుద్ధరంగము నందు బహు శత్రుఘ్న శకటాయుధముల వలె ఉద్గిరదస్త్ర ప్రయోగముల తో సంపూర్ణ నియుక్త మనుష్యుల వలె గణింపదు. అది జనములను సమూహాత్మలుగా, మానవ సమూహములలో స్వయం దర్శన యోగ్య నిగూఢ దివ్యత్వముగా, వ్యక్తి వలెనే తమ స్వభావము ననుసరించి వర్ధిల్ల వలసిన సమూహాత్మలుగా, ఆ అభివృద్ధిచే మానవ సాధారణ క్రియా కలాపము నందు ఒకరి కొకరు, జాతి సర్వస్వమునకు సహాయము చేయవలసిన వారుగా గణించును. వ్యక్తి యందును, సమూహము నందును దివ్యాత్మను కనుగొని, దాని విపులో దార సంపన్న గభీర ప్రాప్యములను అంతరంగ జీవితము నందును, బాహ్య క్రియా ప్రకృతుల యందును సాక్షాత్కారింప జేయుటయే ఆ క్రియా కలాప లక్ష్యము.

మానవాభ్యున్నతికి స్వాతంత్ర్యమేల ఆవశ్యకము?

మనుష్యుడు తన యందును, జాతి తనలోని ప్రజల యందును కల దైవము లోనికి వృద్ధి పొందవలసి యున్నది. అది బహిరంగారోపణీయ నిబంధన బాహ్య భావములలో ఒకటి కారాదు. అందుచే మానవజాతి యొక్క ఆధ్యాత్మిక యుగము నందు వర్ధమానాంతరంగిక స్వాతంత్ర్య ధర్మము మిక్కిలిగా గౌరవింపబడును. మానవుడాత్మ జ్ఞానమునకు చూపు మేర దూరము లోనికి రాకుండగా, దాని కభిముఖుడు కాకుండగా ఉన్నంత కాలము బాహ్య బలాత్కారము నుండి తప్పించుకొనలేడు. అట్లు చేయుటకై అతడొనరించు యత్నము లన్నియు వ్యర్థములగును. అతడట్లున్నంత కాలము పరులకు, తన కుటుంబమునకు, వర్ణమునకు, కులమునకు, 'చర్చి' కి, సంఘమునకు, జాతికి, నిరంతర దాస్యము చేయక తప్పదు. అతడన్య విధముగా ఉండ జాలడు. వారు కూడ తమ అపరిణయ యాంత్రిక బలాత్కారమును అతనిపై మోపకుండగ జీవింపలేరు. అతడును, వారును, తమ అహంకారమునకు, నిమ్న ప్రకృతికి దాసులగుటయే దీనికి కారణము. ఇతరుల బలాత్కారము నుండి తప్పించుకొనుటకు అవసరమైన ఆంతరంగిక స్వత్వమును, ప్రతిష్ఠింప దలచిన తత్త్వ బలాత్కారమును మనము సంభావించి దానికి విధేయులమై యుండవలయును. మనము నిమ్న ప్రకృతిని స్వేచ్ఛా కింకరముగా, సచేతన దీప్తిమత్పరికరముగా, మనలోని దివ్య భావ సహచర ముగా, సహ ధర్మచరముగా ఉదారయ్యును ఆత్మావశ్య భాగముగా చేయవలయును. ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము వైయక్తిక మనః ప్రాణములను అహంకారపూరితముగా దృఢీకరించుట కాక

మన యందును, పరిసర వర్తుల యందును ఉన్న ఈ దివ్య సత్యమునకు విధేయమగునట్టిది. కావున ఈ అధీనత మన స్వాతంత్ర్యావశ్యక నియమమగును. అప్పుడు కూడ భగవంతుడు మనలోని సహజావయవ స్వాతంత్ర్యమును మన్నించి, వాని స్వభావములో అవి వర్థిల్లుటకు వీలు కల్పించి, ఆసహజాభివృద్ధిచే, స్వవినాశముచే కాదు, అవి తమలోని దివ్యత్వమును తామే కనుగొనునట్లు చేయునని చెప్పవలసి యున్నది.

ఈ సత్యమును మానవ జాతి యందలి ఆధ్యాత్మిక యుగము దర్శించును. యంత్ర సామగ్రిచే అది మానవుని సమగ్రుడగునట్లు చేయుటకు గాని, అతని అవయవముల నన్నింటిని బంధించి ఋజుత్వములో ఉంచుటకు గాని ప్రయత్నింపదు. అది సంఘ సభ్యునకు రక్షక భటునిలో, అధికారిలో, సైన్యాధికారిలో, అనగా సాంఘికత్వాధికారి రాజ్యములో గాని, కార్మిక ప్రతినిధి రాజ్యములో గాని అతని ఉన్నతాత్మను ప్రదర్శింపదు. అంతః స్థిత తత్త్వము యొక్క ఆంతరంగిక దివ్య బలాత్కారమును మేల్కొలిపి మానవ జీవితమునందు సాధ్యమైనంత వరకు బాహ్య బలాత్కార లక్షణమును తగ్గించుటయే దాని లక్ష్యము. ఈ లక్ష్యము కొరకే అది తన మొదటి పరికరముల నన్నింటిని ఉపయోగించును. పర్యవసానములో అది ముఖ్యముగా, ఏకైకముగా ఆధ్యాత్మిక బలాత్కారము నుపయోగించును. ఆధ్యాత్మిక వ్యక్తియే ఈ బలాత్కార మును తన పరిసర వర్తుల పై ఉపయోగించునన్నచో ఈ విషయమునందాధ్యాత్మిక సంఘ మెట్లు చేయునో చెప్పనక్కర లేదు. మన ఆంతర ప్రాతికూల్య బాహిర తిరస్కారములెంత అధికముగా నున్నను, ఇది మనుజ స్వభావములో నుండి దివ్యత్వము లోనికి వికసించు శక్త్యభిలాషలను, దీప్తి బలాత్కారమును ప్రభోధించును. సమగ్రముగా ఆధ్యాత్మికమైన సంఘమునందు, ఆధ్యాత్మికారాజకవాది స్వప్నమందు వలె, జనులందరును నిరతిశయ స్వాతంత్ర్యము తో ఉందురు. ప్రారంభ నియమ మీ విధముగా సమాచరితమగును. కావున అట్లు సంభవించును. ఆ స్థితిలో ప్రతి మనుష్యుడును స్వీయ ధర్మస్థితిలో ఏకా ధర్మస్థితిలో, దివ్య ధర్మస్థితిలో ఉండును. అతడు స్వార్థ ప్రయోజనముల కొరకు మాత్రమే ముఖ్యముగా, పూర్తిగా జీవించు అహంకార స్వరూపుడు కాక దివ్యత్వములో జీవించు ఆత్మ స్వరూపుడగు టయే దీనికి కారణము. అహంకార విముక్తమగు అతని దివ్య స్వభావ ధర్మముచే అతని జీవితము నడపబడును.

అట్టి సమాజములయందు స్వాతంత్ర్యము మరియు ఐక్యత ఎట్లు సమన్వయమగును?

తత్త్వమునందలి తృతీయాంశమైక్యమగుటచే మానవ సంఘము వ్యక్తుల వ్యస్త చర్యల లోనికి విభజింపబడినదని కూడ అర్థము చేసికొనరాదు. ఆధ్యాత్మిక జీవితము రూపరహితము కాని సచేతన వివిధైక్య వికాసము. ప్రతి మానవుడును తన వ్యక్తిత్వ ద్వారమున దివ్యత్వము లోనికి వికసింప వలయును. ఇట్లు వికసించుచున్న కొలది అధికాధిక స్వాతంత్ర్య మావశ్యకమై సమగ్ర స్వాతంత్ర్యము సమగ్ర జీవిత నియమ చిహ్న రూపమగును. తానీ విధముగా తన యందు దర్శించు దివ్యత్వము నతడు మిగిలిన అందరి యందును సమానముగా, ఏకతత్త్వముగా దర్శించును. అందుచే ఇతరుల తోడి వర్థమానాంతరైక్యము అతని వ్యక్తిత్వమున కావశ్యకమై ఆ సమగ్రైక్యము సమగ్ర జీవిత నియమ చిహ్నరూపమగును. తనయందే కాక సర్వుల యందును దివ్యత్వమును వీక్షించుట, తన వైయక్తిక విమోచన సమగ్రతలే కాక ఇతర విమోచన సమగ్రతల నన్వేషించుటయు ఆధ్యాత్మిక వ్యక్తి యొక్క సంపూర్ణ ధర్మము. అన్వేషింపబడు దివ్యత్వము ఏకైక దైవము కాక తన యందలి పృథగ్దేవత మాత్రమే అయినచో, భగవదన్వేషణము స్వార్థపూరితమైనచో దాని ఫలితము 'గెథే' (Goethe) వర్ణించిన నిర్జరాహం

కారము వలె, 'నిషే' ఊహించిన రాక్షసాహంకారము వలె, నిషిద్ధాన్య ప్రవేశ ప్రాసాదము లోని పృథగాత్మ జ్ఞానము వలె, ఉన్నత స్తంభాగ్రవాసి సన్న్యాసి తత్త్వము వలె ఉత్కర్షా పూరితా హంకారమగును. సర్వగత వీక్షణము గలవాడు సర్వోపగత దైవమును ప్రణయ సేవాతత్త్వముతో ప్రతిఫల నిరపేక్షముగ సేవించును. అనగా అతడు తన స్వాతంత్ర్యమునే కాక అన్యుల స్వాతంత్ర్యమును, తన సమగ్రతనే కాక ఇతరులు సమగ్రతను అన్వేషించును. అతడు విపులతమ విశ్వాత్మకత్వము నందు మాత్రమే తన సమగ్ర వ్యక్తిత్వమును సంభావించును, విశ్వాత్మక జీవితముతో అభిన్నముగ మాత్రమే తన జీవితమును సంపూర్ణముగ భావించును. అతడు స్వార్థము కొరకు గాని, సంఘ రాష్ట్రముల కొరకు గాని, వ్యక్తి సమూహాహంకారముల కొరకు గాని జీవింపక అంత కంటె మహత్తరమగు తనలోని దైవము కొరకు, విశ్వములోని దివ్యత్వము కొరకు జీవించును.

ఈ సత్యముల నేమరక ఈ త్రివిధ త్రిమూర్త్యాత్మక తత్త్వముచే ప్రచోదితుడై, తత్ప్ర చోదనాభిలాషతో కూడిన వాడై సామాన్య మానవుడున్నపుడు ఆధ్యాత్మిక యుగము ప్రవేశించుటకు సిద్ధముగా నుండును.

∴

పూర్ణయోగ అగ్రగాముల కొక శంఖారావము

శ్రీఅరవింద వచనామృతం

అంతర్నిష్ఠ యుగము ఆధ్యాత్మిక సంఘములో తన నిర్గమన ద్వారమును, సాఫల్యమును కనుగొన వలెనన్నచో, ఉన్నత వికాస స్థాయిలో మానవజాతి వెలువడ వలెనన్నచో, మానవ జాతిలోని సాధారణాధ్యాత్మిక ప్రబోధాభీప్సలు ఆవశ్యక విపుల సంచాలక శక్తులుగా మాత్రమే వుండక ఇంత కంటెను గొప్పదైన కార్య సాఫల్యము కలిగించు శక్తి కావలెను. ఆధ్యాత్మిక ప్రతి రూపములో మానవ వ్యక్తిత్వము శక్తి మత్పున స్సృజనము పొందవలయును.

మానవత్వమున కొక ఆదర్శమున్నపుడు చాలవరకు అది ఒక అభీప్సగా మాత్రమే, పాక్షిక ప్రభావముగా మాత్రమే అంగీకరింపబడి అట్లే ఉండి పోవును. ఆదర్శము జీవిత రాగమును మార్చుటకే తప్ప సంపూర్ణ జీవిత రూప నిర్మాణము చేయుట కనుమతింపబడ లేదు. అది తరచుగా తన వాస్తవిక తత్త్వమునకు ప్రత్యక్ష విరుద్ధములైన వానికి సమర్థనముగా, సంరక్షణముగా సైతముపయోగింప బడినది. ఈ ఆదర్శతత్త్వమును మూర్తీభవించునట్టిదిగా తలంపబడిన, చాల తేలికగా తలంపబడిన, సంస్థలు సృష్టింపబడినవి. ఒక ఆదర్శముండి, దాని కొరకు ఉద్దిష్టములైన సంస్థలు క్రింద జనులు జీవించుచున్నచో అంతే చాలునన్నట్లు తలంపబడినది. ఇచ్చట ఒక ఫలానుమేయ ప్రయోజన సూత్రమును విస్తరించి గభీరమొనరిం చినచో మనము సృష్టించినదే సత్యమనియు, ఈ అర్థములో మన లోపల మనమేది సృష్టింతుమో, అనగా మనము ఏదిగా పరిణమింతుమో అదియే సత్యమగును. నిస్సందేహముగా తత్త్వ స్వర్గములలో మన ప్రమేయము లేకుండగా ఆధ్యాత్మిక సత్యము శాశ్వతమమై యుండును. కాని అది ఐహిక సత్యముగా పరిణమింపక, జీవిత సత్యముగా జీవింపబడక మానవజాతికి నిష్ప్రయోజనమగును. మనకు పైన దివ్య సమగ్రత ఎల్లప్పుడును వున్నది. కాని ఆధ్యాత్మికత్వమనగా మానవుడు తన చేతనలో దివ్యుడై, బాహ్యాంతరముల యందు దివ్య

జీవితమును గడుపుట అని అర్థము. ఈ మాట కింత కంటే తక్కువ అర్థము చెప్పినచో అది ఎల్ల అననురూప పరామర్శమో ప్రతారణమో అగును.

మానవ జీవితములో వ్యక్తి పరివర్తనము చేతనే ఇది సాధ్యమగును. కావున ఆధ్యాత్మిక యుగాగమనమునకు ముందు సాధారణ మానవ బుద్ధి ప్రాణ దేహ స్థితిలో తృప్తిలేని వారై వాస్తవిక మానవ లక్ష్యముగా ఒక మహిత వికాసమును వీక్షించి దానిని తమలో సఫలీకరింప యత్నించి, ఇతరులను దాని వైపుకు తీసికొని పోయి, దానిని జాతి పరిచ్ఛిన్న లక్ష్యముగా చేయునట్టి అధిక సంఖ్యాక వ్యక్తులు రావలసి యున్నది. ఆధ్యాత్మికాగ్రేసరముగ మానవ జీవిత సర్వస్వమును పరివర్తించుటయే ముఖ్యము. మానవుని స్వర్గారోహణము దీనికి పరిష్కారము కాదు. తత్త్వాంతర మానవారోహణమును, సాధారణ మానవతాంతర తత్త్వావతరణమును ఏత దైహిక ప్రకృతి పరిణామ పరిష్కారములగును. ఇదియే మానుష్యకము తన చిరకాలాస్పష్ట బాధాపూరిత గమనమునకు పరాకాష్ఠగా వేచియుండునట్టి అన్వర్థ నూతన ప్రాదుర్భావము. యత్కించిన్మరణానంత ముక్తి ఆ పరాకాష్ఠ కానేరదు. ఈ ఆధ్యాత్మిక పరివర్తనములో విశ్వాసమును, దానిని జీవితములో ఆచరించు యత్నమును, ఈ జీవితములోనికి మార్చదగిన ఎట్టి జ్ఞానమునైనను, — ఇది అభిప్రాయ రూపములో నున్నను మునిగిపోలేదు, — అవి ముఖ్యముగా గణించును. యంత్రాంగముచే గాని, బాహ్యసంస్థలచే గాని ఈ మార్పు సిద్ధించుననెడి ప్రమత్తాలోచనమును అది ముఖ్యముగా చేయనే చేయవు. దానిని ప్రతి మానవుడును ఆంతరంగికముగా జీవించిననే కాని అది జాతికి వాస్తవము కానేరదని అవి గ్రహించి ఎప్పుడును విస్మరింపవు.

మానవ జీవితమెంత విస్తృతమో ఈ కర్తవ్యమంత విస్తృతము కావున మార్గదర్శిత్వమును వహించు వ్యక్తులు జీవిత సర్వస్వ మును తమ సీమగా స్వీకరింతురు. ఈ పురోగమన తత్పరులు ఎట్టి దానినైనను విజాతీయముగ గాని, తమ సీమకు బాహ్యముగా గాని గణింపరు. బుద్ధిరస నీతి సత్య ప్రాణ దేహమయ జీవితమే కాక మానవ జీవితమునందలి ప్రతి అంశమును ఆధ్యాత్మికత్వము చేపట్టవలయును. అందుచే వీనిలో ఏది అయినను, వీని నుండి ఉద్భవించు ఎట్టి చర్యలైనను, అవి తత్త్వ పరివర్తనము కొరకు, రూపాన్యథాకరణము కొరకు ఎంతగా దృఢీకరించినను అవి వాని యెడ ద్వేషమును గాని, జుగుప్స గాని వహింపవు. మన స్వభావము లోని ప్రతి శక్తియు తన పరివర్తనమునకు సముచితములగు సాధనములను కనుగొనుటకు అవి యత్నించును. సర్వాంతర్యామియై దైవమున్న సంగతి గ్రహించి తత్త్వాత్మ వగమ సాధనములుగా అన్నియు పరివర్తితము కాగలవని అవి తలంచును. సాధారణ మానసమును ఆధ్యాత్మిక మానసముగా పరివర్తించుటయును, ఆ మానసమును మరల తన ఉన్నతోన్నత స్థానము లోనికి, అధికాధిక సమగ్ర సంచరణము లోనికి వివృతమగునట్లు చేయుటయును ప్రభూతావశ్యకతగా అవి తలంచును. ఈ నిశ్చిత పరివర్తనము చేయబడుటకు పూర్వము స్ఖలన వశ బుద్ధి హేతువు నిర్దుష్ట తేజోమయ స్వతః స్ఫురణముగా పరివర్తితమై, అచ్చటి నుండి ఉన్నత స్థానములగు ఉన్మనము లోనికి ఋత చేతనము లేక సర్వజ్ఞత్వము లోనికి ఆరోహింపవలయును. అనిశ్చిత స్ఖలనాత్మక మానసము నిశ్చిత స్వతః స్ఫురణము లోనికి ఉన్నత దివ్య సర్వజ్ఞ సంకల్పము లోనికి, చైత్య మాధుర్యము లోనికి, "హృదయే గుహాయాం", హృదయకుహరము లోనికి, ఆత్మ దీప్తి జ్వలనముల లోనికి ఆరోహించి మన ప్రాణతత్త్వములోని అపరిణిత భావములను, కర్కశాహంకారములను, స్వత్వపూరిత వాంఛలను, పరుసవేది వలె మార్చివేయ వలెను. గతకాల యత్న సిద్ధ జ్ఞాన సాధనములతో ప్రారంభించి, వాని నుపయోగించి, ఆధ్యాత్మిక నాయకుల ప్రస్థానముండును. కాని ఎట్టి ఆవశ్యక ముఖ్య పరివర్తనమును లేకుండగా వారు దానిని స్వీకరింపరు. ఇప్పటికి తెలిసిన వానినే గాని, దృఢ

గతానుగతిక వ్యవస్థలను గాని, దృష్ట ఫలసముదాయములను గాని అంటిపెట్టుకొని వుండక ప్రకృతిలోని తత్త్వవిధానమును వారనుసరింతురు. నిరంతర పునరవగమము, మనోగత నూతన సూత్రీకరణ విపుల సమన్వయములును, ఇతః పూర్వమవగతము కాని, నియతము కాని మహిత విస్ఫార సత్యముచే తన అంతరాళములలో ఒక బలవత్తర పునరాకృతి నిర్మాణమును, మానవుడు భావి మహిమ వైపునకు ప్రయాణించునప్పుడు, మన గతకాల సిద్ధులలోని తత్త్వ మార్గములై యున్నవి.

ప్రకృష్టాశగా, ప్రాప్య భవితవ్యముగా ఇది మానవ దృష్టికి గోచరించుచున్నది. మానవ మానస ప్రగతి తన మార్గములో ఈ ప్రాప్యమును మరల ప్రవృద్ధము చేయునట్లు కనిపించుచున్నది. ప్రాదుర్భవించు దీప్తి పెరిగినచో, ఈ ప్రాప్యమును ఆత్మ విశ్వ సాక్షాత్కారము చేయుట కన్వేషించు వ్యక్తుల సంఖ్య పెరిగి, వారు సముచిత మార్గమును సమీపించినచో, నిగూఢ దివ్యత్వముగా మనుజుని యందున్న తత్త్వము వర్ధమాన దీప్తి శక్తి రూపమై, పైనుండి మానవ జాతిలోనికి, దీప్తి శక్తులు బలిష్ఠముగా నున్న మహావ్యక్తుల లోనికి, ఇప్పటికి అదృశ్యమై,అగ్రాహ్యమైయున్న భగవదవతారముగా సంపూర్ణముగా అవతరించును. ఇప్పటి పరిమితులలో నుండి మానవ జీవితమును విపుల విశుద్ధ జ్యోమండలముల లోనికి తీసికొనిపోవు సన్నాహము చేయ పరివర్తనము అప్పుడు సఫలమగును. ఐహిక వికాసము తన మహిత గమక శక్తి నుద్గమింప జేసి దివ్య ప్రగతిలోని ఉన్మీలనాత్మక ప్రసరణమును సాధించు నట్లగును. జంతుతత్త్వము నుండి ఆలోచనాభిప్రాయత మానవ ప్రాదుర్భావము ఈ దివ్య ప్రగతిలో అమిత దూర ప్రాపణీయాస్పష్ట సన్నాహము మాత్రమే.

అనువాదము: వెంపటి కృష్ణమూర్తి ('మానవావర్తము' నుండి), సి.కె. రామనాథ చెట్టి

∴

నూతన శకారంభావిష్కరణ

శ్రీమాతృ వాణి

శ్రీఅరవిందులు ఇలా అన్నారు. — సృష్టి నిర్మాణంలోని మూల రహస్యం ప్రధానంగా — దివ్యత్వం. విశ్వము దివ్యం. సృష్టి సర్వమూ దివ్యమే. కనుకనే మూలంలో గుప్తంగా ఉన్న ఆ దివ్యాంశ వెలుగు ఎప్పుడో ఒక రోజున బహిర్గతం కాక తప్పదు. తనను కప్పి ఆవరించిన పొర ఎంత దళసరిగా ఉన్నా దానిని ఛేదించుకొని ఆ వెలుగు బయటకు పొడుచుకొని వస్తుంది. ఇంతవరకు సాగి వచ్చిన సృష్టి — విశ్వము దాని నిర్మాణమే మనకు తెలుసు. కానీ ఆ నిర్మాణ శక్తి అనంతం. దేనికి మానవుడు మకుటాయమానంగా ఉన్నాడో అట్టి మనః ప్రపంచం తర్వాత మరొక సత్యం వ్యక్తమౌతుంది. దానికి శ్రీఅరవిందులు చేసిన నామకరణం 'అతి మానసం' (supermind) లేదా అతీత మనశ్చైతన్యం. నిజానికి, పరిణామ క్రమంలో మానవుని తరువాత కాబోయే సృష్టి ఈ అతీత మనో ఆవిర్భావమే. ఈ ప్రపంచాన్ని ఉన్నదున్నట్లుగా చూచాక రాబోయే మెట్టు అదే నన్నది చాల సహజ విషయం......

ఆ గమ్యాన్ని చేరుకొనే మార్గాలనేకం. గమ్య ప్రాప్తి సంభవిస్తే మార్గాలన్ని సుపథాలే. ఉన్న దానితో గాఢంగా అసంతృప్తి వహించి — దాని నుండి బైటపడాలన్న తపన — మరొక ఉన్నత శిఖరం చేరుకోవాలన్న తీవ్ర సాధన ఉంటే — ఇది సాధ్యమే — ఇదీ అనుకూల

జీవితమును గడుపుట అని అర్థము. ఈ మాట కింత కంటే తక్కువ అర్థము చెప్పినచో అది ఎల్ల అననురూప పరామర్శమో ప్రతారణమో అగును.

మానవ జీవితములో వ్యక్తి పరివర్తనము చేతనే ఇది సాధ్యమగును. కావున ఆధ్యాత్మిక యుగాగమనమునకు ముందు సాధారణ మానవ బుద్ధి ప్రాణ దేహ స్థితిలో తృప్తిలేని వారై వాస్తవిక మానవ లక్ష్యముగా ఒక మహిత వికాసమును వీక్షించి దానిని తమలో సఫలీకరింప యత్నించి, ఇతరులను దాని వైపుకు తీసికొని పోయి, దానిని జాతి పరిచ్ఛిన్న లక్ష్యముగా చేయునట్టి అధిక సంఖ్యాక వ్యక్తులు రావలసి యున్నది. ఆధ్యాత్మికాగ్రేసరముగ మానవ జీవిత సర్వస్వమును పరివర్తించుటయే ముఖ్యము. మానవుని స్వర్గారోహణము దీనికి పరిష్కారము కాదు. తత్త్వాంతర మానవారోహణమును, సాధారణ మానవతాంతర తత్త్వావతరణమును ఏత దైహిక ప్రకృతి పరిణామ పరిష్కారములగును. ఇదియే మానుష్యకము తన చిరకాలాస్పష్ట బాధాపూరిత గమనమునకు పరాకాష్ఠగా వేచియుండునట్టి అన్వర్థ నూతన ప్రాదుర్భావము. యత్కించిన్మరణానంత ముక్తి ఆ పరాకాష్ఠ కానేరదు. ఈ ఆధ్యాత్మిక పరివర్తనములో విశ్వాసమును, దానిని జీవితములో ఆచరించు యత్నమును, ఈ జీవితములోనికి మార్చదగిన ఎట్టి జ్ఞానమునైనను, — ఇది అభిప్రాయ రూపములో నున్నను మునిగిపోలేదు, — అవి ముఖ్యముగా గణించును. యంత్రాంగముచే గాని, బాహ్యసంస్థలచే గాని ఈ మార్పు సిద్ధించుననెడి ప్రమత్తాలోచనమును అది ముఖ్యముగా చేయనే చేయవు. దానిని ప్రతి మానవుడును ఆంతరంగికముగా జీవించిననే కాని అది జాతికి వాస్తవము కానేరదని అవి గ్రహించి ఎప్పుడును విస్మరింపవు.

మానవ జీవితమెంత విస్తృతమో ఈ కర్తవ్యమంత విస్తృతము కావున మార్గదర్శిత్వమును వహించు వ్యక్తులు జీవిత సర్వస్వ మును తమ సీమగా స్వీకరింతురు. ఈ పురోగమన తత్పరులు ఎట్టి దానినైనను విజాతీయముగ గాని, తమ సీమకు బాహ్యముగా గాని గణింపరు. బుద్ధిరస నీతి సత్య ప్రాణ దేహమయ జీవితమే కాక మానవ జీవితమునందలి ప్రతి అంశమును ఆధ్యాత్మికత్వము చేపట్టవలయును. అందుచే వీనిలో ఏది అయినను, వీని నుండి ఉద్భవించు ఎట్టి చర్యలైనను, అవి తత్త్వ పరివర్తనము కొరకు, రూపాన్యధాకరణము కొరకు ఎంతగా దృఢీకరించినను అవి వాని యెడ ద్వేషమును గాని, జుగుప్స గాని వహింపవు. మన స్వభావము లోని ప్రతి శక్తియు తన పరివర్తనమునకు సముచితములగు సాధనములను కనుగొనుటకు అవి యత్నించును. సర్వాంతర్యామియై దైవమున్న సంగతి గ్రహించి తత్త్వాత్మా వగమ సాధనములుగా అన్నియు పరివర్తితము కాగలవని అవి తలంచును. సాధారణ మానసమును ఆధ్యాత్మిక మానసముగా పరివర్తించుటయును, ఆ మానసమును మరల తన ఉన్నతోన్నత స్థానము లోనికి, అధికాధిక సమగ్ర సంచరణము లోనికి వివృతమగునట్లు చేయుటయును ప్రభూతావశ్యకతగా అవి తలంచును. ఈ నిశ్చిత పరివర్తనము చేయబడుటకు పూర్వము స్ఖలన వశ బుద్ధి హేతువు నిర్దుష్ట తేజోమయ స్వతః స్ఫురణముగా పరివర్తితమై, అచ్చటి నుండి ఉన్నత స్థానములగు ఉన్మనము లోనికి ఋత చేతనము లేక సర్వజ్ఞత్వము లోనికి ఆరోహింపవలయును. అనిశ్చిత స్ఖలనాత్మక మానసము నిశ్చిత స్వతః స్ఫురణము లోనికి ఉన్నత దివ్య సర్వజ్ఞ సంకల్పము లోనికి, చైత్య మాధుర్యము లోనికి, "హృదయే గుహాయాం", హృదయకుహరము లోనికి, ఆత్మ దీప్తి జ్వలనముల లోనికి ఆరోహించి మన ప్రాణతత్త్వములోని అపరిణిత భావములను, కర్కశాహంకారములను, స్వత్వపూరిత వాంఛలను, పరుసవేది వలె మార్చివేయ వలెను. గతకాల యత్న సిద్ధ జ్ఞాన సాధనములతో ప్రారంభించి, వాని నుపయోగించి, ఆధ్యాత్మిక నాయకుల ప్రస్థానముండును. కాని ఎట్టి ఆవశ్యక ముఖ్య పరివర్తనమును లేకుండగా వారు దానిని స్వీకరింపరు. ఇప్పటికి తెలిసిన వానినే గాని, దృఢ

గతానుగతిక వ్యవస్థలను గాని, దృష్ట ఫలసముదాయములను గాని అంటిపెట్టుకొని వుండక ప్రకృతిలోని తత్త్వవిధానమును వారనుసరింతురు. నిరంతర పునరవగమము, మనోగత నూతన సూత్రీకరణ విపుల సమన్వయములును, ఇతః పూర్వమవగతము కాని, నియతము కాని మహిత విస్ఫార సత్యముచే తన అంతరాళములలో ఒక బలవత్తర పునరాకృతి నిర్మాణమును, మానవుడు భావి మహిమ వైపునకు ప్రయాణించునప్పుడు, మన గతకాల సిద్ధులలోని తత్త్వ మార్గములై యున్నవి.

ప్రకృష్టాశగా, ప్రాప్య భవితవ్యముగా ఇది మానవ దృష్టికి గోచరించుచున్నది. మానవ మానస ప్రగతి తన మార్గములో ఈ ప్రాప్యమును మరల ప్రవృద్ధము చేయునట్లు కనిపించుచున్నది. ప్రాదుర్భవించు దీప్తి పెరిగినచో, ఈ ప్రాప్యమును ఆత్మ విశ్వ సాక్షాత్కారము చేయుట కన్వేషించు వ్యక్తుల సంఖ్య పెరిగి, వారు సముచిత మార్గమును సమీపించినచో, నిగూఢ దివ్యత్వముగా మనుజుని యందున్న తత్త్వము వర్ధమాన దీప్తి శక్తి రూపమై, పైనుండి మానవ జాతిలోనికి, దీప్తి శక్తులు బలిష్ఠముగా నున్న మహావ్యక్తుల లోనికి, ఇప్పటికి అదృశ్యమై,అగ్రాహ్యమైయున్న భగవదవతారముగా సంపూర్ణముగా అవతరించును. ఇప్పటి పరిమితులలో నుండి మానవ జీవితమును విపుల విశుద్ధ ఙ్మండలముల లోనికి తీసికొనిపోవు సన్నాహము చేయ పరివర్తనము అప్పుడు సఫలమగును. ఐహిక వికాసము తన మహిత గమక శక్తి నుద్గమింప జేసి దివ్య ప్రగతిలోని ఉన్మీలనాత్మక ప్రసరణమును సాధించు నట్లగును. జంతుతత్త్వము నుండి ఆలోచనాభిప్సాయత మానవ ప్రాదుర్భావము ఈ దివ్య ప్రగతిలో అమిత దూర ప్రాపణీయాస్పష్ట సన్నాహము మాత్రమే.

అనువాదము: వెంపటి కృష్ణమూర్తి ('మానవావర్తము' నుండి), సి.కె. రామనాథ చెట్టి

∴

నూతన శకారంభావిష్కరణ

శ్రీమాతృ వాణి

శ్రీఅరవిందులు ఇలా అన్నారు. — సృష్టి నిర్మాణంలోని మూల రహస్యం ప్రధానంగా — దివ్యత్వం. విశ్వము దివ్యం. సృష్టి సర్వమూ దివ్యమే. కనుకనే మూలంలో గుప్తంగా ఉన్న ఆ దివ్యాంశ వెలుగు ఎప్పుడో ఒక రోజున బహిర్గతం కాక తప్పదు. తనను కప్పి ఆవరించిన పొర ఎంత దళసరిగా ఉన్నా దానిని ఛేదించుకొని ఆ వెలుగు బయటకు పొడుచుకొని వస్తుంది. ఇంతవరకు సాగి వచ్చిన సృష్టి — విశ్వము దాని నిర్మాణమే మనకు తెలుసు. కానీ ఆ నిర్మాణ శక్తి అనంతం. దేనికి మానవుడు మకుటాయమానంగా ఉన్నాడో అట్టి మనః ప్రపంచం తర్వాత మరొక సత్యం వ్యక్తమౌతుంది. దానికి శ్రీఅరవిందులు చేసిన నామకరణం 'అతి మానసం' (supermind) లేదా అతీత మనశ్చైతన్యం. నిజానికి, పరిణామ క్రమంలో మానవుని తరువాత కాబోయే సృష్టి ఈ అతీత మనో ఆవిర్భావమే. ఈ ప్రపంచాన్ని ఉన్నదున్నట్లుగా చూచాక రాబోయే మెట్టు అదే నన్నది చాల సహజ విషయం......

ఆ గమ్యాన్ని చేరుకొనే మార్గాలనేకం. గమ్య ప్రాప్తి సంభవిస్తే మార్గాలన్ని సుపథాలే. ఉన్న దానితో గాఢంగా అసంతృప్తి వహించి — దాని నుండి బైటపడాలన్న తపన — మరొక ఉన్నత శిఖరం చేరుకోవాలన్న తీవ్ర సాధన ఉంటే — ఇది సాధ్యమే — ఇదీ అనుకూల

అతిమానస స్థితి ఆసన్నమైన తరుణమిది

శ్రీఅరవింద వచనామృతం

దివ్యమానస స్థితి మౌలికంగా దాని యొక్క సత్యజ్ఞాన చైతన్యము నందిమిడి యున్నది. అట్టి చైతన్యమెల్లప్పుడు ఈనాటి పరిణామ కారణభూతము మరియు మనలో నైజముగా నున్న ఆత్మజ్ఞాన లౌకిక జ్ఞానము నుండియు మరియు నిర్మల చేతనత్వము మరియు ప్రపంచములో మన ఉనికి సార్థక్యము నిర్ణయించు అవిద్యా రహితమై యుండును. ఇది సత్య చైతన్యమై నందున సహజముగనే అట్టి శక్తి కలిగి యుండును.

దివ్యమానసిక స్థితి దైవతత్త్వమును, విభూతియునై, వాని యొక్క శాశ్వత సత్య రూపమునై యున్నది.

నిజానికి దృగ్గోచరమగు వస్తువులందు కాకపోయినా అది యొక అవ్యక్త రహస్య జ్ఞాన రూపమైన సత్యము. ఈ సృష్టి యందు అభివ్యక్తము గావించుకొనుటకే పని చేయుచున్నది. ఆ దివ్యశక్తి మనలో ఇంతకు ముందే నిబిడీకృతమై అంతర్యామిగ నున్నది. మనంతట మనమే మన అంతరంగము నందున్న సత్యమును వ్యక్తీకరించుకొనవలయును. ఆ దివ్యశక్తి మనలో దివ్యజీవనము పై కోర్కెను కలిగించు చున్నది. మరియు ఆ దివ్యజీవన రూపకల్ప నావశ్య కతను ఈ భౌతిక యుగములో కూడ కలిగించుచున్నది.

కాబట్టి ఆ అతిమానసికావస్థను, దాని సత్య చైతన్యమును అభివ్యక్త మొనరించు కొనక తప్పదు. ఈ రోజు కాకపోయినా అతి సమీప భవిష్యత్తులోనైనా అది జరిగి తీరుతుంది.

దివ్యమానసశక్తి యందు పరిచ్ఛిన్నము, అశాశ్వతత్త్వము, అపరిచ్ఛిన్న శాశ్వతత్వమును కుదించదు, అడ్డుకొనదు. అంతే కాక అపరిచ్ఛిన్నమునకు అది భిన్నమని తలంచదు. కాని దాని పరిధియందు తనదైన ఛాయా నిత్యత్వము అనుభూతి నొందును. అనిత్యత్వ సంబంధము దాని స్థిరత్వమునకు వ్యతిరిక్తము కాకపోవటమే గాక సహాయకారి కూడ,లేక, తత్కాల, నిత్య అనుభూతి నందును. పరిపూర్ణ దైవత్వము దివ్యమానసము నందున్నదని తేలుచున్నది. దీని, నిజ నిర్ధారణకే ఏ మాయ మంత్రము సిద్ధాంతముతో పని లేదు. దివ్యజీవనము కలిగి యుండుటకు సామాన్య జీవన రీతి నుండి తిరోగమనము చేయనక్కర లేదని ఇందు మూలముగ స్పష్టమగుచున్నది. భౌతిక జీవనములో నున్నను, ఆధ్యాత్మిక జీవనము నందున్నను అది ఎల్లప్పుడు కలిగి యుండును. దివ్యజీవనము, దైవత్వమునకును పరమ సత్యమునకును వ్యతిరిక్తము కాదు. మరియు సత్యము యొక్క ముఖ్య భాగమై సత్య రూపమునై, దాని వ్యక్తీకరణమే గాని మరే ఇతరము గాదు.

దివ్యజీవన మవలంబించి తన్నిష్ఠాపరులగు వారికి చిట్ట చివరి పరిపూర్ణ సత్య జ్ఞాన చైతన్యమును, దాని విలువలను ఆ దివ్యజీవనం అందించుతుంది. అది తన వెంట దివ్యాంతః కరణమును నిర్మల బాహ్య ప్రకృతిని అనుభవమునకు తీసికొని వస్తుంది. ఆధ్యాత్మ జీవితము కొనసాగించుకుంటూ పోయే కొలది భగవత్కాంక్ష గల వాడికి కావలసిన ప్రకృతి శక్తి యుక్తులన్నియూ అనుగ్రహించబడును. అతను మహోత్కృష్ట సత్యమును, అనుభూతి నందగలడు. పరమాత్మ ఉనికిని చైతన్య స్ఫూర్తిని బ్రహ్మానందమును అనుభవమునకు తెచ్చికొనును; మరియు తానే సచ్చిదానందమై విరాజిల్లును. అతను దివ్యమూర్తియై సర్వ వ్యాపి యగును.

అవ్యక్త చైతన్యములో తనదైన ప్రకృతి గలిగి అంతయును, సర్వమూ తానైనట్లుగ భావించును. జగత్తు నందు తనను తనలో జగత్తును చూసుకొనుచు సర్వాంతర్యామిగ తనను తాను తెలిసికొనును. సర్వ సౌందర్యరాసియగు పరబ్రహ్మానందానుభూతి నంది అతిమానుషమగు

అద్భుత శక్తి వలెను గ్రహించును. అంతమునందు అతను సాయుజ్యము నొందును. ఈ క్రమ పరిణామ దశ కొఱకు అతను తన ఉనికిని త్యజించ నవసరముండదు. లేక ఆత్మ భ్రష్టత్వ నిర్వాణ క్రియలో కొట్టుకొని పోనక్కర లేదు. బ్రహ్మము స్వయం ప్రకాశము సర్వ శక్తిమంతము ఆనందమునై దిగంతములపై నుండి తన లోనికి దిగి వచ్చి తన అంగాంగ కణములందును, అణువణువు నందును నిండి, ఆత్మను, అంతరంగమును స్థూల దేహమును ముంచెత్తు చున్నట్లు అనంత సముద్ర వారాసి చుట్టుముట్టి భువి యంతయు నిండి పోయినట్లుగను, తన అన్ని బాహ్యేంద్రియ కర్మలను ఆవరించి తన సర్వ జీవితమును పరిపూర్ణ దైవత్వముగ చేయుచున్నది. ఇది ఇంకనూ ఇతరత్రా పారమార్థిక చైతన్యము ఎప్పుడైతే అతనిలో అతిమానస చైతన్యశక్తి నిండియుండి సర్వోత్కృష్ట పవిత్రత పరిపూర్ణమునకు చేరుతుందో అప్పుడు దివ్యజీవనము సిద్ధింప జేయును. కాని అంతకు పూర్వమే అతిమానస స్థితి అతని లోనికి దిగి వచ్చి జీవగతిని నిర్దేశము చేయునపుడు దాని యందు తేలియాడు చుండును. అతని సంబంధములన్నీ భగవంతుని తోడివే. త్రిమూర్తిత్వ భగవద్జ్ఞానము భగవద్భక్తి మేల్కొని ఆత్మార్పణము ద్వారా శరణాగతికి దారి చూపును. అతడు భగవత్సామీప్యము, సాలోక్యము, సాయుజ్యము కలిగి దైవత్వమును వీడి బ్రహ్మైక్యము చెందును. పరబ్రహ్మము నందు లీనమగును. భగవంతుడి ప్రేమ మాధుర్యము భగవంతుని తోటి సాంగత్యానందము భగవదైక్యతానందము ద్వైతాద్వైతానందము అతనికి లభించును. అనంతత్వము నందు అంచె లంచెలుగ పొందిన అనుభవము అతని సొత్తగును. మరియు అనంతత్వము కౌగిలి లోని అనంతానందానుభూతి అతనిదే.

ఎవరైతే పరమం నుండి దిగి వచ్చే దివ్యాత్మను పొందుతారో అది వారిలో సత్యజ్ఞాన చైతన్యమును తెచ్చి పుష్కలముగ నింపుతుంది. ఇంతకు మునుపే మనము నిర్ధారించుకున్న ఆధ్యాత్మ నడవడికను, ఇంకా ఇతరత్రా మిగిలియున్న మన అలౌకిక దివ్యజీవనమును, లౌకిక జీవనమును వదలి పెట్టక తీసికొని మానసాతీత కలయికచే రూపాంతరము చేయగలదు. మరియు దివ్యజీవనమును అభివ్యక్తీకరణ చేపడుతుంది. భువి పైన, దివ్యజీవనము, సామాన్య స్థూలజీవితము నుండి వేరుగా, దానితో సంబంధము లేనిదిగా ప్రత్యేకముగ నుండ నవసరము లేదు. మనుషులను వారి జీవితమును మార్పు చేయదగినంత మార్పు చేయుట, ఏ మేరకు ఆధ్యాత్మికతను తేవలెనో ఆ మేరకు దివ్యత్వమును తెచ్చిపెట్టాలో అది తెచ్చిపెడుతుంది. దాని ప్రభావము ఇతరత్రా నడవడిక లక్షణాలపై చూపెడుతుంది. మరియు వ్యక్తిత్వము మన సమిష్టి వ్యాపితము చేస్తుంది. పారమార్థిక సత్యముతో ఆశయాలు అసత్యమును జయించి తేజరిల్లుతూ ఆధ్యాత్మికౌన్నత్యము నిచ్చును. మనస్సును ఒక విజ్ఞాన జ్యోతిగా ప్రకాశింప జేయును. జీవిత అత్యంత సత్యపు లోతులలోనికి ప్రయాణించి మహోన్నతాశయములతో శక్తిమంతముగా చేయును. అన్నిటిని కలుపుకొని ఇప్పటి దాకా చేరలేని గమ్యములను అది చేర్చుతుంది. స్థూల శరీరము గూడ అతిమానసస్థితి చేత తాకబడి దాని నిజరూపమును గుర్తెరుగును. ఎందుచేతనంటే దానిలో స్థూలచైతన్యము యదార్థ సహజగుణమును గుర్తించి మార్పు చేసికొనును. స్థూల శరీర భాగములందు కణము లందు గల అవ్యక్త చేతన జ్ఞానము ఏనాటి కైనా పరిపూర్ణ భౌతిక మార్పునకు దోహద పడుతుంది. అపరా ప్రకృతిలో ఒక మేల్కొలుపు వస్తుంది. మరియు ప్రకృతి చైతన్యము మొదలవుతుంది. అతిలోక వ్యాపకము ప్రపంచ రూపు రేఖలు దిద్దుకొనుటకు పునాది కాగలదు.

ఇదంతయు దివి నుండి భువికి దిగి వచ్చిన దివ్యఆత్మను అవాహనము చేసికొను అనంత జీవకోటి నంతటిని ప్రభానవితము చేయు సత్య జ్ఞాన చైతన్యము యొక్క దివ్య జీవనము సిద్దింప జేసిన కార్యమైనది. దాని తక్షణ ప్రభావము సత్య జ్ఞాన చైతన్యము నొందిన

అందరి పైన పడినప్పటికి, అత్యధికముగా మొత్తము మానవ స్థూల సూక్ష్మ దేహ ప్రకృతి చేతనమును అతిమానస సత్య జ్ఞాన చైతన్యమును మనోవాక్కాయ కర్మల యందు పడి క్రమానుగత దైవికమగు రూపాంతరము చెందును. ఎవ్వరైతే పరిణతి చెందియుండి నిష్కపటముగ నుండి పోవుదురో అక్కడ దీని పురోభివృద్ధికి హద్దులుండవు, ప్రాథమికమైన ఇబ్బందులు కూడ నుండవు. దివి నుండి పడుచున్న అతిమానస చైతన్య జ్యోతిశ్శక్తి, స్థూల శరీరములో ప్రత్యగాత్మ యందు ప్రవేశించి కలుగజేయు పీడనము వల్ల ఆ ఇబ్బందులన్నీ అణగారి పోవును. కాని అతిమానస చైతన్య జ్ఞాన ఫలితము దానిని స్వీకరించగల వారికే పరిమితము గానక్కర లేదు, మరియు అక్కడ తోనే ఆగిపోనక్కర లేదు. అక్కడ స్వల్పమైన మానసిక పరిణామము ఆత్మ స్థితి యందు కలుగ వచ్చును. ఇప్పుడున్నటు వంటి మానవాత్మ స్థానములో అపరిపూర్ణ, పరిమితమైన ఆత్మ ఏదైతే అపమార్గములో పడి సకల అసత్యములకు పొరపాట్లకు దుర్వ్యసనాలకు ఆలవాలమై నటువంటి సకల బలహీనతలు, పొరపాట్లు, అవిద్యతో కూడిన అజ్ఞానంధకారముతో గుడ్డిదైన ఆత్మ యదార్థ జ్ఞాన విషయములకు విపరీతార్థముల నిచ్చి, విజ్ఞాన సందేశములను వక్రీకరించునట్టి స్థితిలో సత్య చేతనాత్మ చేతనము అపుడు ఆవిర్భవిస్తుంది. అది అత్యంత పవిత్రతను గలిగి వెలుగు నిండిన ప్రత్యగాత్మ కోరుకొన్నట్టి ఆదేశములను గ్రహించగల స్థితిలో స్థూల శరీరరము ఉంటుంది. ఈ విధమైన పరిణామము ఏ కొద్దిమంది లోనో గాకుండ జాతి మొత్తమునకు విస్తరిస్తుంది. దీని సంభవము రూపుదాల్చినట్లైతే మానవుడు కలలు గన్న పవిత్రాత్మ యొక్క పవిత్ర జ్ఞానజ్యోతి దాని యొక్క స్వరూప చైతన్యము కల గానే మిగిలిపోదు. సత్యస్వరూపము యథార్థమవుతుంది; మరియు మానవ సమాజము లోతైన అజ్ఞాన అవిద్యా ఊబి నుండి బయటపడుతుంది. ఒక వేళ అతిమానసము నుండి దివ్యమానవ చైతన్యము ప్రథమ సిద్ధాంతముగ ఈ ప్రపంచములో వెలయించినచో పవిత్రాత్మ సిద్ధాంతము ఆదర్శవంతమగును. కాని అది భౌతిక ప్రపంచము నందలి భరోసా మీదనే, సకల పరిణామ శక్తుల స్థాయి, వాటి పరిమితుల లోనే సంభవము గాని మానసిక దుర్బలత్వముతో మనిషి జీవన మార్గములో మార్పు సాధ్యపడదు. అది విస్తరించినప్పుడు మూల ప్రకృతి పరిణామ క్రమము మాత్రము తప్పని సరి.

అనువాదం: ఆలూరి లక్ష్మినారాయణ

∴

ఒక శంపా సుతుడు

శ్రీఅరవింద విరచితము

వహ్ని చరణాలతో దిగి వచ్చాడు ఉజ్జ్వలంగా అతి వేగంగా
ఒక శంపా సుతుడు భూమి మీదకు.
గర్భం లోనే వెలుగు ఉద్భవించింది
మనుష్య రూపం ఉరిమే బలంతో నిండింది.
స్వర్ణ శాంత వేగం, మహత్త, స్వచ్ఛమైన ఉద్వేగం
రెక్కలున్న బలమూ దిగి వచ్చాయి
మర్త్య దేహంలో — ఏక నామంతో — అందరు దేవతలూ నివసించారు.

ప్రతి ఆనంద స్వప్నపు మలుపులో
సంచరింప జేస్తుంది విశాలమైన స్వప్న చాలనం,
కాంతి రహితమైన భూగోళాన్ని నిలిపింది
జీవనం ఉజ్జ్వల వైభవంలో.
సముద్ర హస్తాలు కాల చక్రాలను అందుకున్నాయి మరలా — మనిషి ఆత్మ దేవతలు
స్వీకరించిన అతివేగం గల తేజోమహితమైన రథ సారథి అయింది.
ఝుంఝూ పక్షితమైన అతని జీవన మార్గంలో
ఉన్నత భూమికల వైపు దూసుకు పోయింది ఒక బాకు
ప్రాచీన ఫలకాలు జారి పడిపోయినాయి.
వృద్ధ ప్రకృతి లోని మృత కుడ్యం కూలి పోయింది.

దైవం యువ సౌందర్యం, భావన, దీప్తి గల
కొత్త ప్రపంచంలోకి కొత్తగా వచ్చాడు.
దైవ శబ్దాలు మానవుని పెదవుల పై పలికాయి.
అద్భుతం తొంగి చూచే శ్వేత ఉదయాలలో
హృదయం మేల్కొన్నది.
వాయువే ఉదాత్తమైన ఉడుపు, నిశ్శ్వాసం ఒక ఆనందం
జీవితం దివ్యమైన ఒక క్రీడ

శ్రీఅరవిందులు
అనువాదం: ఆచార్య కోవెల. సుప్రసన్నాచార్య

మూడవ సహస్రాబ్దికి మార్గదర్శకులు శ్రీఅరవిందులే

శ్రీఅరవింద వచనామృతం

మర్త్యత్వంలోకి పురుషోత్తముడు అవతరించి యావన్మానవ జాతిని ఉద్ధరించే వీలు కల్పించే ఆత్మోద్ధరణ లేనట్లయితే, ధర్మగ్లానిని నివారించడానికి అవతారం అనే భావన నిష్ఫలత్వమే. కేవలం హక్కులు, న్యాయం, నైతిక ప్రమాణాలు అనే వాటిని ఋషులు, ప్రభువులు, ప్రవక్తలు వంటి దివ్య శక్తిపుంజాల ద్వారా మాత్రమే అవతార ప్రమేయం లేకుండా దివ్యశక్తి సాధించగలదు. మర్త్యత్వంతో దివ్యత్వ స్ఫోరకతే, ప్రకటనే అవతారం. ఆ అవతార భావనే, తద్భావ ప్రకటనే క్రీస్తుత్వం,కృష్ణత్వం, బుద్ధత్వం అనేవి. వాని ద్వారా మానవ ప్రకృతి నియమాలు మనోవాక్కాయ కర్మలు నియమితమైతే క్రీస్తుత్త్వం, కృష్ణత్వం, బుద్ధత్వం అనే వాని ద్వారా మానవత్వం దివ్యత్వం అవుతుంది. *క్రీస్తు, కృష్ణుడు, బుద్ధుడు మొదలయిన అవతారాలుకేవలం* ఏదో ఒక ధర్మానికో, నియమానికో పరిమితమవడమే కాక వారి అనుయాయులకు కూడా మార్గదర్శకులుగా, మార్గపథంలో కేంద్రబిందువుగా నిలిచి దివ్యత్వానికి ద్వారాకృతు లవుతారు. అందువలననే ప్రతి అవతారంలోను ఒక ఉదాహరణగా, ఒక మార్గదర్శకునిగా, ఒక మార్గంగా, గమ్యంగా నిలిచి ఆ భావననే ప్రజలకు ప్రకటించడం జరుగుతుంది.

నేను చేసిన సాధన నా కొఱకు చేసికొన్నది కాదు. దాని ఉద్దేశ్యం కేవలం ప్రపంచంలో ఒక స్పందన నేర్పరచి (కలిగించి) జ్యోతిర్మార్గం వైపు త్రోవ చూపడమే. అందువలననే నేను అందరికీ ఎంతో ప్రాముఖ్యం గల — అంతరవలోకన, అంతర్వృద్ధి, మానసిక పరిణామాలు, నూతన గమ్యాల ఆవిష్కరణ వంటి — వానిని చూపాను. ఆ ప్రయత్నం అంతా, అందరూ చేయవలసిన చేతలను, నడవ వలసిన నడతలను, ఇదమిత్థంగా రూపించడానికే.

నా కొఱకు నేను దివ్యచైతన్యాన్ని సాధించాలనే ఆకాంక్ష ఎన్నడూ నాకు లేదు. నాకు వైయక్తికమైన ఆకాంక్షగాని, మోక్షము పట్ల ఆసక్తిగాని, అధిమానసికైక్యత్వము గాని అవసరము లేదు. అధిమానసికైక్యత్వం పిదప కూడా నేను కోరుకొనేది, నేను చేసేది లోక సంక్షేమం కోసం, లోక శాంతి కోసం ఇతరులు చేయలేనిది; నేను నా యందే చూపగలిగేది మాత్రమే.

నా అధిమానసికైక్యత్వం పృథ్వీచైతన్యానికి గల అధిమానసికత్వ ద్వారాలు తెరిచే లేదా తెరవడానికి తోడ్పడే తాళంచెవి వంటిదే. అధిమానసికైక్యత్వం దానినే లక్ష్యంగా ఉంచుకొంటే, దాని కొఱకే అది లక్ష్య భూతమైతే — అది వ్యర్థమే.

జగన్నేపథ్యంలో ఉండే ఒక సంకల్పంతో (ప్రతివ్యక్తీ) సంగమించాలి. దీనిని తప్పించు కోవడం, (తప్పించుకోవాలను కోవడం) వివేకం కాదు. దీనిలో (ఆ సంగమంలో) విజయవంతం కావాలనే తీవ్ర ఆకాంక్ష కావాలి. పూర్ణత్వానికి పథమైన ఆధ్యాత్మిక ద్వారాల్ని కనుగొనాలి. అప్పుడే దివ్యతేజస్సు, దివ్యజ్ఞానం, దివ్యశక్తి, దివ్యానందం అవతరిస్తాయి.

అనువాదం: డా॥ కె. సత్యమూర్తి

∴



నీవు సౌందర్యానందాల ప్రతీకవు, కనుక
అంధమైన నా యాత్మ నీ కొఱకు తపించింది
నీ స్పర్శలో ఆత్మ తన అస్తిత్వాన్ని తెలిసికొంటుంది.
దివ్యానంద పరవశాన్ని పొందుతుంది.

చూపుల కందని చోట నేను నిన్ను చూడగలను
ప్రతి స్వరంలో నీ దివ్యానందం వినగలను
ప్రకృతి శైలులలో తీయని మాధుర్యం నన్ను ఆ హృదయం వెంటాడుతుంటే
ఆత్మ నీ వ్యూహంలో చిక్కుకోక తప్పదు.

సర్వ జీవుల శరీరాలు నీ ప్రతీకలే
ప్రతి పత్రం, శిల నీ అనంత హర్మ్యాలే
(ఆత్మ దానిని ప్రేమిస్తూ, స్పృశిస్తూండగా)
దృగవధులు దాటే కళాత్మక ప్రతీకయైన నీవు మాత్రమే
గరుత్మద్వేగంతో నడిచే కాలం నీ దరికి చేరుస్తుంది.

తన శైలిలో నడిచే కాలానికి లక్ష్యం నీవే
ఆగామిభవితవ్యంలో ఉద్వేగ్న స్ఫూర్తి కల్గించే ఆశవు నీవే.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా॥ కె సత్యమూర్తి

సుపథ దర్శని: అమ్మ

శ్రీఅరవింద వచనామృతం

పృథ్వీ చైతన్య పరిణామంలో అతీత మనస్సు (పరాచేతన) ఆవిర్భవించటం సునిశ్చితాంశం. తప్పనిసరి పరిణామం. ఎందుకంటే — పృథ్వీ చైతన్యానికి మనస్సే హిమాలయ శిఖరం కాదు కనుక. అదే భరతవాక్యం కనుక. ఆ పరిణామం జరగవచ్చు. రూపు ధరించటం — కొనసాగటం తప్పదు. ఎప్పుడు? అంటే, ఆ మహా చైతన్యావిర్భావానికి క్రింద నుండి ఒక ఆక్రందన — ఒక ఆర్తితో పిలుపు పై దాకా ప్రాకాలి. ఆ మహా చైతన్యావిర్భావానికి ఎదురు చూడటం, దాన్ని గుర్తించాలన్న తపన — అది దిగివస్తున్నపుడు దానిని ససేమిరా రానివ్వ కూడదన్ని మానసిక దుష్టస్పందన లేకపోవటం — పిలుపుకు పరమార్థమైతే — దానిని పరమ చేతన అంగీకారం ఉన్నప్పుడు — అది ఆవిర్భవిస్తుంది. ఈ క్రింది ఆక్రందనకు — ఆ పై అంగీకారానికీ మధ్యలో దౌత్యం చేసే శక్తి జగజ్జనని సాన్నిధ్యం — శక్తి. అట్లు లేనిదే ఏ మానవ తపశ్శక్తీ — సాధనా, ఆ సత్యపాత్ర మూతను తెరిచి అవరణలను తొలగించి పాత్రను తొలిచీ మలిచీ ఈ మృణ్మయ లోకం లోకి, అజ్ఞాన పాపపంకిలమైన మరణశీలమైన బాధా మయమైన లోకంలోకి తీసుకొని రాలేదు.

అప్పుడు పృథ్వీ చైతన్యమయ సత్యంతో, ప్రకాశంలో నిండిపోయి దివ్యానందధామమై మానవ జీవితమంతా శ్రీకృష్ణ జీవితంగా దివ్యమై పోతుంది.

*

మనం పరమేశ్వరిగా, జగజ్జననిగా — ఎవరిని ఆరాధిస్తున్నామో ఆ తల్లి దివ్యజ్ఞాన జ్యోతి. ఒక చిచ్ఛక్తి. ఈ విశ్వమంతా ఆవరించి ఉన్నది. ఎకమయ్యూ సర్వతోముఖ గమన శక్తిని అనుసరిం చటం అసాధ్య విషయం. వేగవంతమైన మనస్సునకైనా, సర్వాతీత బృహచ్చేతనకైనా సరే. తల్లి మహా చైతన్య స్వరూపిణి. సర్వాతీతమైన పరాశక్తి.

*

ఈ విశ్వ గమనంలో సర్వ కర్మలకు ఆధారంగా ఉన్నది దివ్య తత్త్వమే. అది తన శక్తి ద్వారా ఈ పని చేస్తున్నది. కానీ ఆ మాహాతత్త్వం తన యోగమాయావరణలో జీవుని అహంకారం ద్వారా — అధమ ప్రకృతిలో కన్పించక సర్వ కర్మలు నిర్వర్తిస్తున్నది.

యోగంలోనూ ఆ దివ్యతత్త్వమే సాధకుడూ, సాధనా కూడ. అతని శక్తి తన వెలుగు జ్ఞానము — చైతన్యమూ — ఆనందాదుల ద్వారా, ఆధారంపై ప్రవర్తిస్తున్నది. ఆధారం విచ్చుకోగానే ఆమె జ్ఞానానందాదులను అందులోకి ప్రవహింప చేస్తుంది. తద్వారా సాధన సులభతరమౌతుంది. అధమ ప్రకృతి చేష్టలణగారేంతటు వరకూ సాధకుని వ్యక్తిగత ప్రయత్న మవసరమౌతున్నది.

ఆకాంక్ష — నిరాకరణ — శరణాగతి — ఈ త్రివిధ ఉద్యమం వ్యక్తిగత సాధన కవసరం.

*

తల్లి అవతారావసరమేమంటే పరాచేతన (అతీత మనస్సు) ను పృథ్వీ చైతన్యంలోని కవతరింప చేయటానికి. ఆమె సంపూర్ణంగా ఈ లోకం లోకి రావాలంటే ఆ అవతరణ ద్వారా మాత్రమే సాధ్యం.

శ్రీఅరవిందులు, చరిత్రలో — ఒక బోధకూ — సత్యావిష్కరణకు ప్రాతినిధ్యం వహించ లేదు. పరంజ్యోతి నుండి ప్రత్యక్షంగా ప్రవహించిన సునిశ్చిత కర్మ అది. నేను కేవలమా కర్మను పూర్తి చేయటం కోసమే ఉన్నాను.

శ్రీమాత

అనువాదం: డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు

పూర్ణయోగ సాధన – కొన్ని మార్గదర్శక సూత్రాలు

శ్రీమాతారవింద వచనామృతం

[శ్రీఅరవిందులు తన యోగ పరమోద్దేశాన్ని తేటతెల్లమయేటట్లు వివరించారు. ఈ యోగాన్ని అనుసరించాలంటే ఏ విధమైన నిబంధనావళిగానీ, జపతపానుష్టానం గానీ అనుసరించ నక్కర్లేదు. కేవలం భగవంతునిపై అచంచల విశ్వాసముంటే చాలు. మిగతా యోగములు పరిపూర్తి అయిన తర్వాతే తమ యోగం ప్రారంభమవుతుందని వారొక చోట సెలవిచ్చారు. పూర్ణయోగంలో అతి ప్రధానమైన అతిమానస యోగం సాధ్యమైన తర్వాత అధిరోహించ వలసిన సోపానాలింకెన్నో ఉన్నాయని కూడా వారు చెప్పారు. ఇంత కఠిన సాధన ఎలా సాధ్యం అనుకుంటే దానికి వారొక సులభ మార్గం సూచించారు. తల్లి ఒడిలో నున్న పసి బిడ్డ ఎటువంటి గమ్యాన్ని చేరాలన్నా ఏ విధంగా దాని గురించి విచారించదో ఆ విధంగా సాధకుడు కూడా శ్రీమాత పై తన భారమంతా వేసి ముందుకు సాగితే విచారించవలసిన పని లేదు.]

శ్రీఅరవిందుల ప్రవచనము:

ఇక్కడ ఆచరిస్తున్న యోగానికి మిగిలిన యోగ విదానాలకు ముఖ్యంగా సంకల్పంలోనే తేడా ఉంది. ఇక్కడ సాధన చేస్తున్నది కేవలం సాధారణ అజ్ఞానమయ ప్రాపంచిక చైతన్యం నుంచి దివ్యచైతన్యంలోకి ఆరోహించటం మాత్రమే కాదు, ఆ బృహత్ చైతన్యం యొక్క అతి మానస శక్తిని అజ్ఞానమయ మనస్సు, ప్రాణ, శరీరాల లోనికి తెచ్చి వాటిని పరివర్తన చేయడం, తద్వారా పదార్థమయ జగత్తులో దైవాన్ని ఆవిష్కరింప చేయడము.....

ఈ యోగసాధన ఒక నిర్దిష్ట బోధన ద్వారా గానీ, నిర్దేశిత ధ్యాన అనుష్టాన విధానాలతో గానీ, మంత్ర జపాలతో గానీ కొనసాగదు. అది ఆకాంక్షతో అంతర్గతంగా గానీ, ఊర్ధ్వ ముఖంగా గానీ ఏకాగ్రతతో దివ్యప్రభావానికి, పై నున్న దివ్యశక్తికి, దాని చేతనకు హృదయస్థ మైన దివ్యత్వానికి, ఉన్మీలిత హృదయులై వాటిని వ్యతిరేకించే వాటినన్నిటినీ తిరస్కరించాలి, అడ్డు తొలిగించుకుంటూ కొనసాగవలసి ఉంటుంది. ఎనలేని భక్తి విశ్వాసాలు, ప్రగాఢ ఆకాంక్ష, శరణాగతి ఉంటే ఈ ఆత్మోన్మీలనం జరుగుతుంది.

*

తప్పు దోవ పట్టించే అహంత: నీ స్వభావానికి మూలాధారంగా ఉండే ఒక ముఖ్యాంశాన్ని నీవు గుర్తించవలసి ఉంటుంది. అది నీ అహంకార వ్యక్తిత్వం..... అది వికలం కావటానికెన్నడూ ఇష్టపడదు; తన స్థానాన్ని తన కంటే వాస్తవమైన దానికీ, దివ్యమైన దానికీ ఇవ్వడానికి అసలు ఒప్పదు.... ఈ భాగం ఎన్నడూ యదార్థమైన శరణాగతిని కోరదు; నీవు ఈ భాగాన్ని యథేచ్ఛగా దివ్యమాత హస్తాలకు సమర్పించుకో లేదు. అయినప్పటికీ అతిమానస యోగ మార్గంలో కృతార్థులు కావాలంటే ఇంకొక మార్గం లేదు. ఏదో ఒక సన్యాసిగా, యోగిగా, తపస్విగా ఉండి పోవటం ఇక్కడి ఉద్దేశ్యం కాదు. పరివర్తన ఇక్కడి పరమోద్దేశ్యం. ఆ పరివర్తన నీ స్వశక్తి కంటే అత్యధిక శక్తి సంపద వల్లనే కావాలి. దివ్యమాత చేతిలో పసికూన లాగా ఉండగలిగితేనే అది సాధించగలవు.

*

సంపూర్ణ సర్వసమర్పణ, సమత్వ భావం, అహంభావ నిర్మూలన, అజ్ఞాన విధానాల నుంచి, చర్యల నుంచి స్వభావాన్ని జాగ్రత్త చేసుకోవడం మొదలైనవన్నీ దివ్యసంకల్పానికి కట్టుబడి ఉండటానికి సోపానాలు. అంటే ఏ మాత్రం దాచుకోకుండా సంపూర్ణమైన ఆత్మార్పణం కావాలి.

*

ప్రాణిక విభాగంలో సమర్పణ జరుగుతున్నట్లు ఈ క్రింది చిహ్నాల ద్వారా తెలుసుకోవచ్చు:

1. జీవితమంతా, చేసే పనులతో సహా శ్రీమాతదేననే అనుభూతి పొందడం (ఇది కేవలం ఊహ కాదు, ఆకాంక్షా కాదు). 2. శరణాగతివల్ల, సర్వసమర్పణవల్ల ప్రాణిక విభాగంలో అలౌకికానందం పొందడం; తత్ఫలితంగా నిశ్చల సంతృప్తి. 3. చేసే పనుల మీద, వాటి వల్ల కలిగే ఫలితాల పైనా అహం పూర్వకమైన అనుబంధం నశించడం; దాని స్థానంలో చేసే పనిలో అపరిమితానందం, తన సామర్థ్యమంతా దైవం కోసం వినియోగ పడుతున్నదనే ఆనందం పొందడం.

4. దివ్యశక్తి సహాయంతోనే తాను పనిచేయగలుగుతున్నానని అనుకోవడమే కాకుండా ప్రతి క్షణం దైవం తనను నడిపిస్తున్నదన్నట్టి అనుభూతి.

5. అచంచల విశ్వాసముంటే ఏ పరిస్థితులూ, ఏ సందర్భాలూ సడలించ లేవు. కష్టాలొచ్చినప్పుడు కూడా మనస్సులో అనుమానం పెట్టుకోవడం కానీ లేక పరధ్యాసగా వాటిని సమ్మతించడం గానీ ఉండదు. మనఃస్ఫూర్తిగా ఆ దైవశక్తికి అంకితమైతే ఆ దైవశక్తే ఆ కష్టాలన్నీ తొలిగిం చేస్తుందనే దృఢ నమ్మకం, దానికి గాను ఇంకా ఇంకా నమ్మకాన్ని పెంచుకుంటూ పూర్తిగా శ్రీమాత పైనే ఆధారపడడము.

*

శ్రీమాత మధురోక్తులు:

సర్వ సమర్పణ ఎప్పటి కప్పుడు వివరంగా కొనసాగించాలంటే ఇలా నడచుకోవాలి: ఎల్లప్పుడూ ఆ దైవసన్నిధిలోనే ఉన్నట్లు భావించుకో. నిన్ను నడిపించేదీ, నీ చేత పని చేయించేది ఆ దైవమే ననే భావనతో ఉండు.[1] నీ వ్యవహారాలన్నీ ఆ దైవత్వానికే అర్పించు. మనస్సులో కలిగే ప్రతి కదలికనే కాకుండా, ప్రతి ఆలోచన, అనుభూతి మాత్రమే కాకుండా నీ సాధారణ దినకృత్యాలనన్నింటినీ దైవానికి అర్పించు. అంటే భోజనం చేసే ముందర నీలోని దైవమే నీ ద్వారా భోంచేస్తున్నట్లు భావించాలి. ఈ విధంగా నీ సకల వ్యాపారాలను నీలో ఉన్న దైవం

---

[1] శ్రీమాతరవిందుల ముఖ్య శిష్యులలో ఒకరైన శ్రీ ఉదార్ పింటో ఈ విషయాన్ని గురించి తనకూ శ్రీమాతకు జరిగిన సంభాషణ వివరాలను తెలియచేస్తున్నారు.

శ్రీమాతకు సర్వ సమర్పణ చేసుకోవడం చెప్పినంత సులభం కాదని నేను గ్రహించాను. అది ఎలా సాధ్యమవుతుందని తల్లి గార్ని అడిగాను. దాని కామె "నీవు ఉదయం లేవగానే ఏం చేస్తావు అని అడిగారు. "కాలకృత్యాలు నెరవేర్చుకొని స్నానానికి బయల్దేరుతాన" ని చెప్పాను. "అలా కాదు వివరంగా చెప్పు" మని కోరగా "ముందర పళ్ళు తోముకుంటా" నన్న దానికి శ్రీమాత "పళ్ళు తోముకుంటూ ఏమి ఆలోచిస్తావు. ఏమి ఊహిస్తావు?" అని ప్రశ్నించగా "రోజూ చేసే పనే కదా! ప్రత్యేకించి ఆలోచించేదీ, ఊహించేదీ ఏముంటుంది?" అన్న దానికి ఆమె ఇలాంటి సమయాల్లో అంటే, కాలకృత్యాలు, స్నానం, భోజనం మొదలైన నిత్యకృత్యాలను నెరవేర్చే విధానాన్ని ఇలా చెప్పారు, "నేను నీతో కూడా ఉన్నట్లు భావించుకొని నీవు చేసే పనులన్నిటినీ నాతో పాటు పంచుకో. నీవు చేస్తున్న పనిని ఇంకా బాగా ఎలా చెయ్యాలని నన్నడుగు. చర్చించు. ఏదైనా తింటున్నప్పుడు మనిద్దరం కలిసే ఆ రుచిని ఆస్వాదించుదాము. అప్పుడు నీకే తెలుస్తుంది: మనిద్దరం కలిసి తింటుంటే రొట్టె ముక్క కూడా ఎంత రుచిగా ఉంటుందో"

— ఈ సంభాషణ జూలై 1995 AIM పత్రిక 33, 34 పేజీలలో ప్రచురితమైంది.

దగ్గరకు చేర్చినప్పుడు ఇక నీలో భిన్నత్వమే లేకుండా అంతా సమైక్యతే ఉంటుంది. అంటే నీ స్వభావం కొంత దైవానికి అర్పితమై మిగిలిన భాగం దాని ఇష్టం వచ్చినట్లు సాధారణ విషయాల్లో మునిగి తేలటం ఉండదు. నీ జీవితమంతా మారిపోయి క్రమక్రమంగా పూర్తి రూపాంతరీకరణ కాగలదు. ఈ పూర్ణయోగంలో ప్రతి చిన్న అంశంతో సహా జీవితమంతా పరివర్తన కావాలి, దైవత్వం పొందాలి. ఇందులో ఏదీ అల్పమైనదీ పనికి రానిది లేదు.

*

ప్రశ్న: అమ్మా, నేను ఆధ్యాత్మిక జీవితం గడుపుతున్నట్లు ప్రతి క్షణం గుర్తుండాలంటే ఏం చేయాలి?

జవాబు: అంతటా నిండి ఉన్న ఆ దివ్యత్వం ఎల్లప్పుడూ నీ ఎరుకలో ఉండేటట్లు చేసుకో.

*

నేనెప్పుడూ పై మీదకే దృష్టి సారిస్తాను. ఎందువల్లనంటే అక్కడ ఉండే సౌందర్యం, శాంతం, జ్ఞాన ప్రకాశం కిందికి దిగి రావటానికి సంసిద్ధంగా ఉంటాయి. నీవు కూడా పైకి దృష్టి సారించి అవి క్రిందకు దిగి ఈ భూమి మీద కొలువు దీరేటట్లు ప్రగాఢంగా ఆకాంక్షించు.

క్రిందికి దృష్టి సారిస్తే ప్రపంచంలోని కుళ్ళే కనిపిస్తుంది. అందువల్ల అటుచూడక ఎప్పుడూ నాతో పాటు పైకే చూడు. నీ మనస్సులో ఏదైనా దుఃఖం ఉన్నా అది పటా పంచలవుతుంది.

*

విశ్వాశమనేది ఎంత గొప్పదో అందరూ గ్రహించలేరు. విశ్వాసమొక ఇంద్రజాలం, అది అద్భుతాలను సృష్టిస్తుంది. భగవంతుడు దిగివచ్చి నిన్ను పైకి లేవనెత్తుతాడని నీవు ప్రతిక్షణం ఆశిస్తే నిజంగానే ఆయన దిగివచ్చి నిన్ను పైకిలేపి అక్కున చేర్చుకోగలడు.

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకట్రామశాస్త్రి.

∴

భవిష్య సహస్రాబ్దికి శ్రీమాతారవిందుల సందేశం

జీవన్ముక్తులైన వారు పరతత్వ, పరచైతన్య, పరమానందానుభూతులను పొందేటప్పటి చలన గతిలో ఆ చిదాత్మ పరిణామ ప్రకృతిని లేవనెత్తి సుదీర్ఘ సానువులకు, ఉన్నత శిఖరాలకు కొనిపోయినప్పటికీ దుర్జేయమైన పుంతలు ఇంకా అనేకం ఉంటాయి. అయితే ఈ కొత్త పుంతలను గురించి మనం ఇంకా ఇప్పుడిప్పుడే మాట్లాడుకోవడం యుక్తం కాదు. ఇప్పటి మానవ మేధస్సు భవిష్యత్తును చూసి ఎంతవరకూ వివేకంతో అర్థం చేసుకొని గ్రహించగలదో అంతవరకే వ్రాయటం జరిగియుండవచ్చు

*

ఈ ప్రథమ ఆధ్యాత్మిక సీమల ఆరోహణం దైవప్రస్థానానికి అంతం మాత్రం కాదు, భూమిపై సాధించవలసినది ఇంతటితో సరి అనుకోటానికి వీలులేదు. అతిమానస కక్ష్యలోనే ఇంకా ఉచ్చతరమైన స్థాయిలు ఉండవచ్చు. అందువలనే వేదఋషులు ఆధ్యాత్మిక జీవనమొక నిరంతర ఆరోహణా కార్యమని చెప్పారు.

బ్రహ్మాణస్త్వ శతకృతా
ఉద్వంశం ఇవయామిరే
యత్సనో సాను మారుహద్
భూరి అస్పష్ట కర్త్వమ్

"బ్రాహ్మణులు నిచ్చెనెక్కినట్లు నిన్నధిరోహించెదరు. ఓ శతకృతా! ఒక్కొక్క మెట్టు ఎక్కిన కొద్దీ ఇంకా ఎక్కవలసిన శిఖరాలు సుస్పష్టమౌతూంటాయి". అయితే పునాది గట్టిగా స్థిరపడితే, మిగిలినది క్రమానుగతంగా ఆవిష్కృతమవుతుంది, ఆత్మ దాన్ని అనుసరించి సఫలీ కృతమవుతుంది.

శ్రీఅరవిందులు

*

"అద్భుతమైన నీ వైభవాన్ని, నీ శాసన మహత్వాన్ని ఏ విధంగా పొగడ గలుగుతాము. నీ చైతన్యం యొక్క పరిపూర్ణతను కొనియాడుటకు మా వద్ద మాటలు చాలవు. పరమానందంలో ఓలలాడించే నీ దివ్య ప్రేమవాహినిని వర్ణించ మా తరం కాదు.

అనిర్వచనీయమైన ఈ ప్రశాంతతను కీర్తింప శక్యమే కాదు. నీ నిశ్శబ్ద నీరవ గంభీరతను, మహా శక్తివంతమైన నీ సత్య రూపాన్ని గానం చేయాలంటే పదములు చాలవు.

ఈ ప్రత్యక్ష ప్రపంచమంతా కలిసినా నీ వైభవాన్ని వర్ణించడానికి నీ అద్భుతాలను పొగడడానికీ చాలదు. *ఈ అనంత కాలగతిలో విశ్వం నిరంతరంగా ప్రయత్నిస్తున్నది అందు కోసమే; ఇంకా ఇంకా నీ గుణగానం నిరంతరాయంగా చేయాలని*"

శ్రీమాత

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వేంకట్రామ శాస్త్రి

∴

కోరికలు

శ్రీమాత ప్రవచనములు

అఖిల

అఖిల భారత పత్రిక

మార్చి 2000

కోరికలు — శ్రీమాత ప్రవచనములు


కోరికలు అనగా ఏమి?

కోరికల నివారణ

కొన్ని వివరణలు

యోగము — కోరికలు

భరతవాక్యం



నా ప్రేమానుగ్రహాలు, ఆశీస్సులు నిరంతరం నిన్ను అంటిపెట్టుకునే వుంటాయి.

అయితే నీవు క్రమశిక్షణతో సావధానచిత్తుడవై ఎంతో అప్రమత్తంగా, ఏకాగ్రతతో వున్నప్పుడే వాటి అనుభూతి నువ్వు పొందగలుగుతావు.

కోరికలతో సతమతమవుతూ, చుక్కానిలేని జీవితాన్ని నిరర్థకంగా గడుపుతావో లేక జ్యోతిసీమలలోకి ఆరోహించి నీ నిమ్నప్రకృతిని జయిస్తావో నీ యిష్టం!

జీవితం కోరికల వలయం

మానవ జీవితం కోరికల వలయం. ఆ కోరికలకు అంతు అనేది ఉండదు. కోరికలు తీరటం అనేది కూడ ఉండదు. ఒక వస్తువును కోరినప్పుడు అది దొరికిన వెంటనే దాని మీద మోజు తగ్గిపోయి ఇక దానివంక చూడనైనా చూడకపోవటము మనము చూస్తూనే ఉంటాము. ఒక అందమైన వస్తువును చూసినప్పుడు దాని అందాన్ని చూసి ఆనందించటం మంచిదే. కాని 'అది నాకు కావాలి' అని కోరుకొనుట విపరీతమైన చేష్టయే అవుతుంది. — సంపాదకుడు

సాధకుడు: *మధుమయీ, కొంతమంది పిల్లలు ఏవో అడుగుతూనే ఉంటారు. ఎందుకని?*

శ్రీమాత: ఎటువంటి వస్తువులు?

సాధకుడు: *మామూలుగా ఏవో కంటికి కనపడే మిఠాయిలు మొ॥*

శ్రీమాత: ఓ అదా! చిన్నపిల్లలకి కోరికలు వుండవా మరి? గాలిలో కొన్ని ప్రకంపనములు సంభవిస్తూ వుంటాయి. చిన్న పిల్లలు ఆ కోరికల ప్రకంపనములను పొంది, పట్టలేక వెంటనే "నాకు అది కావాలి, ఇది కావాలి" అని అడుగుతారు. పెద్ద వాళ్ళకి కూడ అటువంటి కోరికలు కలగటం సహజమే. కాని వాళ్లు ఆ విషయాన్ని వెంటనే వెల్లడించరు. అందరూ ఎగతాళి చేస్తారని భయపడతారు. చిన్నపిల్లలు అమాయకులు కనుక టక్కుమని అడిగేస్తారు. అట్లా అడుగుతే ఏమనుకుంటారో అన్న ఆలోచన వాళ్లకి వుండదు. నిజం చెప్పాలంటే కోరికలు అందరికి సర్వసాధారణంగా కలుగుతూనే వుంటాయి. అయితే ఆ విషయం పైకి చెప్పరు సరికదా వాళ్లకివాళ్లు కూడా గట్టిగా చెప్పుకోలేరు. కాని కోరికలు అందరికి కలుగుతాయి. అయితే ఒక చక్కటి వస్తువును చూడగానే దాన్ని సొంతం చేసుకోవాలి అని అనుకోవటం ఒక తమాషా ప్రక్రియ. ఎందుకంటే ఆ వస్తువును

పొందిన తరువాత నూటికి 99 మాట్లు దాని మీద మోజు తగ్గి పోతుంది. అది ఎంత మంచి వస్తువుఅయినా సరే ఇక దాని వంక చూడనైనా చూడరు!

*

చాలా కాలం క్రిందట ప్రభుత్వ స్థానానికి అభ్యర్థిగా కోరి వచ్చిన ఒక వ్యక్తి నాకు జ్ఞాపకమున్నాడు. అతనిని గురించి నాఅభిప్రాయమును కోరి నాకు అతనిని పరిచయం చేశారు. మన ఆశ్రమం, ఇచటి జీవనం, జీవితానికి కావలసిన క్రమశిక్షణా మొదలైన విషయాలపై నన్ను ప్రశ్నించాడు. నిరంతరం ధూమపాన లోలుడే గాక మితిమీరి మద్యం సేవిస్తూ తరచు అలసిపోయి అదుపు తప్పి ప్రవర్తించే వాడు. ఈ పొగ, మద్యం వెంటనే వదలి పెట్టు అని నేనంటే నాకేసి ఆశ్చర్యంగా చూచి తబ్బిబ్బై పొగ త్రాగుడు, మద్య సేవనం లేని జీవితం విలువ లేనిది అని బదులిచ్చాడు. నువ్వీదశలోనే వుంటే ఇక నీకు చెప్పవలసినదేమీ లేదని నేను వెంటనే అనేశాను.

ఇటువంటి వాళ్లు చాలామంది వుంటారు. పొగతాగటం, మద్యపానం సేవించటంకంటే మంచిజీవితం ఇంకొకటి వున్నదని మనకి తెలుసు. కాని మామూలుజనాలకి వాళ్ల కోరికలను తృప్తి పరచుకోవటమే జీవిత ధ్యేయము. స్వేచ్ఛా జీవితమంటే ఇదే అని వాళ్లు నమ్ముతారు.

స్వేచ్ఛానువాదం: టి.యస్. రామచంద్రరావు.

∴

నీకు ఏదైనా ఒక కోరిక కలిగినప్పుడు అది నిన్ను పూర్తిగా ఆవహించేసి నీ మనస్సును, జీవితాన్ని వశపరచుకొని, నిన్ను తన బానిసగా చేసుకుంటుంది.

అనుభవం కలిగినట్లే నియమితి లేని కోర్కెల సాఫల్యం వలన అసంతృప్తి మిగులుతుంది. అంచేత మనస్ఫూర్తిగా కోర్కెల్ని అధిగమించాలి తప్ప అధిగమించినట్లు నటించరాదు. అలా నటిస్తే మరల అసంతృప్తి మిగులుతూంటుంది. కనుక కోర్కెను అధిగమించడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి.

అనువాదం: పూరాణపండ రంగనాథ్

∴

పిల్లలు అడిగినవన్నీ మనమివ్వాలా?

పిల్లల విషయంలో మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఒక ప్రక్క సహజమైన వికాసమును భంగపరచకూడదు. ఒక కంట కనిపెడుతూనే వాళ్ళని యథేచ్ఛగా ప్రవర్తింపనివ్వాలి. కష్టమైన పజిల్సు చేయటం లాంటి సవాళ్ళు యిచ్చి వాళ్ళ సహజమైన, శక్తిని చైతన్యాన్ని ఉపయోగించుకునేందుకు అవకాశాలు కల్పించాలి. విచ్చలవిడిగా ఒదిలివేయటం, పూర్తిగా అదుపు చేయటం — ఈ రెండూ అతిశయోక్తులే. పిల్లలకు మంచి విద్యను గరపటం అనేది అంత తేలిక కాదు. నువ్వు వాళ్ళను నిరంతరం కనిపెడుతూ వాళ్ళ వికాసమునకు ఏది అవసరమో దానిని సమకూర్చాలి. — సంపాదకుడు

పిల్లలు యెల్ల వేళలా ఏదో ఒకటి అడిగే అలవాటును ఎలా మానిపించగలం అని ప్రశ్నించిన వారికి శ్రీమాత యిలా జవాబిచ్చారు.

ఎన్నో మార్గాలు ఉన్నాయి. అయితే బిడ్డ దేనిని ఎందుకు అడుగుతున్నదో గ్రహించాలి. అతడి యిచ్ఛను అడిగి తెలుసుకోవాలి. అతడి భావాన్ని మనం తప్పించివేస్తున్నామేమో అని ప్రశ్నించుకోవాలి. అంటే అతడి భావప్రకటనని, స్వేచ్ఛని

లక్షణమే వేరు. అది కోరికలు సమసిపోయినప్పుడు మాత్రమే వ్యక్తమవుతుంది. జీవుడు వాంఛలకాలవాలమైనంత పర్యంతము, ఆనందం అవగతం కాదు. ఎందుకంటే *అతనిలోకి నిజమైన ఆనందం పైనుంచి దిగివచ్చినా కూడ అతని లోని కోరికలు దానిని కప్పిపుచ్చేసి రూపుమాపుతాయి.*

స్వేచ్ఛానువాదం: టి.యస్. రామచంద్రరావు

∴

కోరికల నిజ స్వరూపము

ఒక గాలి దుమారం వచ్చినప్పుడు దుమ్ము రేగుతుంది. మనం తలుపులు తీస్తే ఇల్లంతా దుమ్ముతో నిండిపోతుంది. కోరికలు కూడా అంతే. బాహ్య వాతావరణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న కోరికలు మన కవాటములు తెరవంగానే మనలోకి ప్రవేశిస్తాయి. అంటే ఈ కోరికలు ఏమాత్రం మన సొంతం కాదన్న మాట. మనకి హఠాత్తుగా కోపోద్రేకములు, హింసా ప్రవృత్తులు కలుగుటకు ఇదే కారణము. అవి నీ మనస్సును ఆవహించి, నీ స్వభావాన్ని, నీ వ్యక్తిత్వాన్ని కప్పిపుచ్చి నిన్ను అధోప్రకృతికి కట్టివేసి నీ అభివృద్ధిని నిరోధిస్తాయి. ఈ విషయాన్ని నువ్వు తెలుసుకున్నట్లయితే తగు జాగురూకతను వహించగలుగుతావు.

— సంపాదకుడు

కోరికలు నీ సొంతం కాదు. నీ నిజవ్యక్తిత్వములోని భాగము కానే కాదు. అవి నీ క్షుద్రప్రకృతికి చెందిన చీకటి ప్రక్రియలు. నిన్ను అంధకార బంధురంలో కట్టిపడేస్తాయి. కోరికలు "నీలోనే పుడతాయి, నీలోనుంచే చెలరేగి బహిర్గతమవుతాయి", అని అనుకోవటం చాలా పొరపాటు. అవి నిమ్నప్రకృతి అనే మహాసముద్రంలో

చెలరేగి ఒకరినించి మరొకరికి సంక్రమిస్తాయి. మనుషులు కోరికలను తమంతట తామే కోరరు సుమా! అవి తరంగాల రూపంలో నీమీదికి దండెత్తి వస్తాయి. ఎవరైతే వాటికోసం ఎదురు చూస్తూ వుంటారో వాళ్లు వాటి తాడింపుకు గురి అవుతారు. కోరికలు మనుష్యులని ఆవహించి వాళ్లని బందీలుగా చేసి వారిలోని విచక్షణశక్తిని నశింప చేస్తాయి. అప్పుడు వాళ్లకి "ఈ కోరికలు నావి. నేను వాటిని తృప్తిపరచాల్సిందే" అని అనిపిస్తుంది

కోరికలు చేసే సందడి: నిజానికి అవి ఫలానామనిషికి చెందటమనే ప్రశ్నే లేదు. మనిషి యొక్క అధోప్రకృతి లోని అసూయ, మాత్సర్యము, ద్వేషము, హింసాప్రవృత్తులు అన్నీ ఈకోవకు చెందినవే. ఇవన్నీ కూడ కెరటాలుకెరటాలుగా నిన్ను పట్టుకొని, ఆవహించి, నీ మీదికి దండయాత్రలు చేస్తాయి. నీ ప్రకృతిని వక్రీకరించి కలుషితం చేస్తాయి. అవి నీసొంత విషయాలు కానే కావు. నీకు చెందిన విషయాలు ఏమాత్రమూ కావు. నిన్ను పరివేష్ఠించి వున్న దుష్టసముద్రము లోనివి. క్షుద్ర శక్తులన్నీ అందులో సంచరిస్తూ వుంటాయి. మనస్సుయొక్క తెలివితక్కువతనానికి చెందిన సందేహాలు, తప్పులూ, కష్టాలు వ్యక్తిని కమ్ముకొని వ్యక్తిత్వాన్నీ, ఉదారతనూ, మంచిఫలితాలనీ నిరోధిస్తాయి. అవి కదులుతూన్న అలలు మాత్రమే. కాని జన్మతోనే పుట్టిన స్వేచ్ఛా స్వరూపపు విలువలుగా అపోహ పడతాము. వీటినే అంటిపెట్టుకొని ఉన్న వారి ననేకులను చూస్తూనే వుంటాము.

*

మధుమయీ! కోరిక ఒక అంటువ్యాధియా?

అవును. నిజంగా ఇది గట్టిగా సోకే జబ్బే. ప్రక్కనున్న వాడికుంటే మనకుకూడా వస్తుంది. ఇలాగే మనిషినుండి మనిషికి సంక్రమిస్తుంది. హఠాత్తుగా ఏదో పైకుబికినట్లు మనలో ఏదో ప్రవేశించినట్లు భావన గలుగుతుంది. దానిని మనము గుర్తించము. ఈ కోరికల వ్యాధిగ్రస్తుల్ని వెలివేసి ఏకాంతంగా ఒక గదిలో

నిర్బంధిద్దామా అన్న ఆలోచన కలుగుతుంది. ఆలాంటప్పుడు మొత్తం అందరినీ నిర్బంధించవలసిందే. (నవ్వుతూ అమ్మ సంభాషణ)

*

మనలో మాయం కాకుండా కేవలం అణగిపోయి వున్న కోరికలు మళ్ళీ మన ప్రోద్బలంతోనే విజృంభించి తృప్తి పొందుతాయి. వీటిని వదల్చుకోడానికి చాలా గట్టి, విస్తారమైన విశ్లేషణ కావాలి.

కోరికలు మానవ జీవితానికి కేంద్రాలు. వాటిని తృప్తి పరచుకుండేందుకు అనువైన పరిస్థితులను ఏర్పరచగల సమర్థత వాటికున్నది.

*

మనం గట్టిగా కోరినది పొందలేకపోతే ఆ కోరిక మననుండి విడిపడి సూక్ష్మరూపంలో ప్రపంచమంతా గిరగిరా తిరిగి పల్టీలు కొట్టి మనకి తెలియకుండానే మళ్ళీ మనలో ప్రవేశిస్తుంది. విపరీతమైన కోర్కెలు గలవానినుండి బయలుదేరే ఈ రూపం ఒక చిన్న వేటకు వెడుతుంది. తన గమ్యాన్ని మాత్రం మరువదు. మనం ఆ విషయాన్నే పూర్తిగా మరచిపోతాం. ఉదాహరణకి మనం పదే పదే తలుస్తాము — ఏదో ఒకదేశం వెళ్ళాలని. అది జపానే అనుకోండి. అనుకున్న విషయాన్ని వదిలేసి మరచిపోయినా ఒక పదేళ్ళ తరువాత అది పసందుగా తయారై ఒక పదార్థంలా వేడి వేడిగా ఒక పళ్ళెంలో సిద్ధంగా మన ముందు వాలుతుంది. దాన్ని మనం మరచి చాలాకాలమవడంతో, మనకిక దానిమీద వ్యామోహం వుండదు. అయినా అది పట్టువదలని విక్రమార్కుడిలాగా తిరిగి వచ్చిందంటే తనపని చేయడానికే.

*

దాచుకున్న కోరికలు తిరిగి పైకి వస్తాయి. అధఃశ్చేతనలో పని చేసిన ఆ కోరికలు మనకు తెలియకుండానే తిరిగి మారువేషంలో వస్తాయి. అవి దైవసంబంధమైనవి ఏమాత్రం కావు.

దైవం నుండి వచ్చేవి మనం సులభంగా గుర్తిస్తాము. అవి మనకు నిర్లిప్తత, శాంతి, స్వేచ్ఛానుభూతులను ప్రసాదిస్తాయి. అట్లా కాకుండా ఎలాగైతేనేమి చివరకి అనుకొన్నది దొరికిందిలే అని నీవు ఎగిరి గంతులు వేసావో అది దైవము నుండి కాదు అని తెలుసుకోవాలి.

స్వేచ్ఛానువాదం: టి.యస్. రామచంద్రరావు

∴

కోరికల పుట్టు పూర్వోత్తరాలు

ఈ జగత్తులోని ప్రతి వస్తువు మన రూపమే అనేది ఆధ్యాత్మిక సత్యము. కాని మానవుడు ఈ విషయాన్ని తన మనస్సుతో గుర్తించలేడు. అందుకని అజ్ఞానంతో ప్రతిదాన్ని సేకరించి తనదిగా చేసుకుందామని అనుకుంటాడు. ఇదే కోరికలకు మూలము. మనం నిజంగా ప్రపంచంలోని వస్తుజాలమంతటితోను తాదాత్మ్యము చెంది (అన్ని నేనే అనే భావన) వాస్తవాన్ని గుర్తించినప్పుడే మనకు కోరికలబారి నుండి విముక్తి కలుగుతుంది. అందుకు మనం వస్తువులను సేకరించే లోభత్వం బదులు ఉదార స్వభావాన్ని అలవరచుకోవాలి. "మొత్తం అంతా నాదే" అని తెలిసినప్పుడు ఇక పాకులాడటమెందుకు?

— సంపాదకుడు

పెరిగి పెద్దది అవాలనే భావన మొట్టమొదటి నుంచి వున్నట్లుగా తోస్తుంది. ఎందుకంటే మొదటి దశలో ప్రేమ అనగా ప్రాణులు ఒకదాని నొకటి కబళించటం ద్వారానో లేక జోడించుకోవటం ద్వారానో ఏదో ఒక విధంగా తమ పరిమాణాన్ని పెంచుకోటంగా తయారయింది. ప్రేమ యొక్క ప్రాథమిక రూపం ఇది — ఇంకొక

దానిని తనలోకి గ్రహించటం. కబళించేందుకు కారణం ప్రేమయే అన్నమాట. అచేతన యొక్క సుదూరలోతులను మనం పరిశీలిం చినట్లయితే కోరికయొక్క మూలం ప్రేమయే అని తెలుస్తోంది. ప్రేమ యొక్క చీకటిరూపం అధమరూపం కోరిక — ఇంకొక దాన్ని తనతో చేర్చుకోవాలనే తపన, ఆకర్షణ, గ్రహించాలనే తపన.

ఒక అందమైన వస్తువును నీ పూర్ణచేతనతో చూసి నట్లయితే నీవు దాన్ని చూసి ఆనందిస్తావు. అది అంతవరకే. అలాంటివి భూమిపై వున్నందుకు ఆనందాన్ని అనుభవిస్తావు. ఇది కళాకారులకూ సౌందర్యాన్వేషకులకూ సహజలక్షణం. ఒక అందమైన మనిషిని, దృశ్యాన్ని చూచి సౌందర్యారాధకుడైన చిత్రకారుడు ఆకదలికలకూ, అందానికీ, సామరస్యానికి ఒయ్యా రానికి ముగ్ధుడౌతాడు! అంతే అక్కడితో సరి. అతనికి సహజంగా పరిపూర్ణ తృప్తి, సంతోషం ఆఅందాన్ని చూడగానే కలుగుతుంది. కాని సగటుమనిషి ఇదేవస్తువునీ, రూపాన్నీ చూచి, వెంటనే 'అది నాకు కావాలి' అని అనుకుంటాడు. ఇది చాలా శోచనీయము. ఈ దౌర్భాగ్యపుకోరికతో ముడిపడ్డ కారణంగా అతనికి సంతోష మనేదే తెలియదు.

*

పూర్ణత్వం నుండి వేరైన భ్రమ వలన మనలో రెండు విధముల భావనలు కలుగుతయి.

మొదట్లో ఆ పూర్ణతతో మమైకం కావాలనే ఒక అపస్మా రకమైన అవసరం కలుగుతుంది. ఈ భ్రమతో గిరిగీసుకొని తనే ఒక కేంద్రంగా అంతా తనదేననుకొనే స్థితిలో ఒకవిధంగా దొరికి నదల్లా చేర్చుకోవడం మొదలవుతుంది. తద్వారా తన వ్యక్తి త్వాన్ని పెంపొందించుకోవాలనే తపనతో బాటు తన పరిమిత బుద్ధితోనో భుజబలంతోనో తెలిసినదల్లా లాగుకోవాలనే ప్రయత్నం జరుగుతుంది.

అంతా కోరికల వలయమే. అలాగ జనించేదే విప్పిచెప్పలేక తనని సమర్థించుకోవాలనీ, అంతా తనకే తెలియాలనే తపన ఇది. అంతా సరిగ్గా గుర్తించగలిగితే అది కబళించడం అవదు. కాని ఈ కోర్కెలజననం ఒక అసంబద్ధ అనివార్యస్థితిగా మారి చివరికి తనచైతన్యాన్ని పూర్ణంతో కలుపుకోవడం దుస్సాధ్యమవుతుంది.

మొదటిదాని పర్యవసానంగా సాధారణంగా రెండవది ఒక సంప్రదాయ భావనతో తనస్వభావాన్ని చుట్టూ చట్రంలా బిగించుకోవడం. ఇది సర్దుకోవడం అనే కోరికతో ఈవిశ్వంలో ఏదోకొంత మనసొంతం చేసుకోవాలనీ, మనలోని మూల పదార్థాలూ ధాతువులూ మనవేననీ అనుకొనే ఒకభ్రమ. తెలిసో తెలియకో వీటిని గట్టిగా పట్టుకోవడమే గాక ఏక కాలంలో ఇంకా క్రొత్తఅంశాలు గ్రహించడం కూడా ఇందులో ఒక లక్షణం. ఒకరికిస్తే గాని నిజంగా విడిపోవడమనే దానికి అర్థం లేదు. ఒకరికి మనం ఇస్తేనే తిరిగి పుచ్చుకొన గలిగేది.

"పెట్టువారికే పుట్టేదన్నా
పెట్టిందే నీ పెట్టుబడన్నా"

అన్న పురాతన సూక్తి వుండనే వున్నది.

అనువాదం: టి. యస్ రామచంద్రరావు

∴

'నేను వేరు' అనే భావనయే కోరికలకు మూల విరాట్. అదే అహం. అహం మాయమౌతే దాంతో పాటు కోరికలూ అదృశ్యమవుతాయి.

వాంఛాతృప్తి అపమార్గం

కోరికలను తృప్తిపరచటం అనేది జల్లెడలో నీళ్ళు పట్టటం లాంటిది. ఈ మాయదారి కోరికలను తీరుస్తున్న కొద్ది కొత్త కోరికలు తలెత్తూతూవుంటాయి! కోరికలను నశింప చేసేందుకు మార్గము ఒక్కటే — నీ దృష్టిని క్రిందినుంచి పైకి మళ్ళించటం. కోరికలు నీ అధోచేతనకు చెందినవి. దానినుండి బయటపడి ఊర్ధ్వచేతనలోకి ప్రవేశించినప్పుడు కోరికలకు అస్తిత్వముండదు

— సంపాదకుడు

'మనస్సుకు ఆలోచనలే కట్టుగొయ్యలు' ప్రాణశక్తి తృష్ణామయం'. "ఇక మనస్సు ప్రాణమయకోశంలోని వాంఛలను సమర్థిస్తుంది". దాని కోసం తర్కమార్గాలు వెతుక్కొంటుంది. వాంఛాపరిపూరణమే ధ్యేయమన్న సిద్ధాంతాలను స్థాపిస్తుంది...... కనుక కొందరంటుంటే విన్నాను. 'కోర్కెలను జయించే ఉపాయం వాటిని తృప్తిపరచటమే' నని. దానికొక సిద్ధాంత కల్పన చేస్తారు. ఈ కోర్కెలు ఒకటా? రెండా? అదొక ఉసుళ్ళ పుట్ట. కోటానుకోట్లు. కనుక కాంక్షలను సంతృప్తి పరచటానికెన్ని జన్మలెత్తాలో?

*

అందుచేత కోర్కెలకు తలవంచటం వాటిని జయించటం కాదు. ఈ కోర్కెలేమో ఇసుకపాతర. త్రవ్వుతున్న కొలదీ వస్తూనే ఉంటుంది. ఒక పార త్రవ్వి బయట పోస్తుండగానే మరొక తట్టెడు తయారవుతూనే ఉంటుంది. ఒక కోర్కెను తృప్తిపరిస్తే దాని క్రిందనే మరొకటి ఊరుతునే ఉంటుంది. కాబట్టి వాటి తల గిల్లివేయటమే ఉపాయం. తద్వారా నేలబారు మనస్సు భౌతిక చేతననుండి సుపర్ణుని లాగా ఊర్ధ్వచేతన కెగిరి పోతుంది.

---

[1] శ్రీఅరవిందులు ఇలా వ్రాసారు — "రూపాంతరీకరణకు ప్రధాన విఘ్నాలు మూడు. అహంకారం — మనస్సు తన భావజాలం గూటిలో చిక్కుకొన్న పిట్ట. అలాగే ప్రాణకోశం — వాంఛల రెక్కలపై ఎగురుతుంది. శరీరమేమో తన అలవాట్లకు బానిస" అని

పైగా వాంఛా పరితృప్తి అసాధ్య విషయం. ఆకాశపుష్పం లాంటిది.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు

∴

వాంఛాదమనం ద్వారా విజయం

కోరికలను అణచివేస్తే అవి మాయమైపోతాయి అనుకోటం చాలా పొరపాటు. కోరికల "జ్యాగ్రఫీ" నీకు తెలియదు అనవచ్చు. అవి చాలా దొంగలు. నీ మనస్సులో నుంచి తరిమివేసిన కోరికలు ఎక్కడికి పోవు. అక్కడినుంచి అవచేతనలోకి దూరి అక్కడ తలదాచుకుంటాయి. తలెత్తేందుకు అవకాశం కోసం వేచి వుంటయి. నువ్వు అక్కడికి వెళ్ళి చూసినట్లయితే, వాటి దర్శనం లభిస్తుంది. అక్కణ్ణుంచి వెళ్ళి రాక్షసులల్లే అచేతనా మహాసముద్రంలో తలదాచుకొని అకస్మాత్తుగా పైకి దుముకుతాయి. చాలా ఏళ్ళ తరబడి సాధన చేసి వ్యసనాలను జయించామనుకున్న యోగుల అనుభవాలే దీనికి తార్కాణం — సంపాదకుడు

కోరిక ప్రాణకోశ సంబంధమైనది. కానీ దానికి బీజం ఆలోచన. దాని ప్రేరణతో అది స్పందించటమారంభిస్తుంది. ఉత్తేజితమౌతుంది. ఉత్సాహం పొందుతుంది. ఆలోచనయే కోరికకు ఒక మానసిక ప్రతిరూపాన్ని (mental formation) తయారు చేస్తుంది. అంతే కాదు. ప్రాణశక్తి పోషణతో దానికి క్రియారూపాన్ని కూడా ఇస్తుంది. జీవికి ప్రాణశక్తే ఉత్సాహశక్తి. చేష్టల కదే మూలం. ఈ రెంటి సమ్మేళనం మరొక మహాశక్తిని సృష్టిస్తుంది. విశ్వంలో ప్రతిదీ అభివ్యక్తి ముఖంగా పయనిస్తుంది. ఈ అభివ్యక్తిని నిరోధిస్తే ఆ విషయాల జవసత్త్వాలు కుప్ప కూలిపోతాయి.

ఆత్మ విజయం కోసం చాలా యోగమార్గాలు ఇంద్రియ దమనాన్నే ఉపాయంగా గ్రహించాయి. మనోభూమికలోని వృత్తులను

ఆలోచనల కదలికలను నరకటం — విషయ వాసనలను క్షాళిస్తాయన్న విశ్వాసం. కేవల భౌతికప్రపంచం వరకే అయితే ఇది సత్యమే. కాని దాని వెనక అవచేతనా లోకముంది. దాని వెనక బ్రహ్మాండమైన అచేతనా లోకమొకటున్నది. నీకు తెలియనిదేమంటే — ఏ బీజం మొలకలే పైకి కోర్కెలుగా కొనసాగుతున్నాయో, వేటిని కత్తిరిస్తే విజయం లభిస్తుందనుకొంటున్నావో — ఆ వాంఛా మూలాలు అచేతనలో ప్రవేశ్ళువారి మరలా పైకి తీగలు సాగటం — అవకాశం కోసం నిరీక్షిస్తూనే ఉంటాయి. కనుక వాటిని సమూలంగా కాల్చటమే పని. ఇందుకే ఏండ్లు పూండ్లుగా యోగాభ్యాసం చేసిన వారు సైతం వాటిని జయించామనుకొంటూ ఉండగానే అచేతన లోకి దిగిన కోర్కెలు మళ్లీ వేరులు హఠాత్తుగా — జవసత్త్వాలను పుంజుకొని ఉవ్వెత్తుగా గుబుళ్ళు గుబుళ్ళుగా అంకురించటం చూస్తారు.

అనువాదం: ఆచార్య తుమ్మవూడి కోటేశ్వరరావు

∴

వాంఛా విజయానికి మహోపాయం

చదువు సంస్కారము కామక్రోధాలనదుపు జేసి, మనిషి పరిధిని పెంచి చేతనాభివృద్ధికి దోహదమవుట నిజమే; కాని కోరికలను చంపుకోవటం వలన వాటి మీద విజయం లభించదు. వాటిని నీ అంతరంగంలో జయించాలి. దివ్యజ్యోతి ప్రకాశించే కోరికలు లేని భూమిక ఒకటి ఉన్నది. నువ్వు అందులోకి వెళ్లి సుప్రతిష్ఠితమైనప్పుడు ఇక ఏకోరికా నిన్ను బాధించదు. అంతే కాదు. ఆ దివ్యశక్తిని నీలోకి గ్రహించుట వలన నీద్వారా అది క్రియాశీలమై ప్రపంచకంలో ప్రచలితమై యున్న దుష్టస్పందనలతో పోరాడుతుంది. ఇక కోరికలు నిన్ను బాధించజాలవు. నీవే వాటిని హతమార్చి ప్రపంచాన్ని బాగుపరచెదవు.

— సంపాదకుడు

సామాన్యంగా విద్య, సంస్కృతి, ఇంద్రియాల సంస్కారము వ్యక్తి వాసనలను, కోర్కెలను — ఉద్రేకాలను జయించే సాధనాలు. వీటిని కాదనటమో లేక త్రోసి వేయటమో సరియైన పద్ధతి కాదు. మరి, వాటిని పదును పెట్టి — సుకుమారంగా పరిశుభ్రంగా పరిణమింపచేసి ఉత్తమ మేధాశక్తి సంపన్నంగా చేయటం సరైన మార్గం. లక్ష్యసాధనకది నిశ్చయ మార్గం. అభివృద్ధికి, పరిణతికి తగినంత దోహదం చేస్తూ అవగాహనతో ఋజుత్వం, సమన్వయం — వంటివి వ్యక్తి సంస్కృతికి, విద్యకు అంగాలు. అదెలాంటిదంటే, మానవులు బుద్ధిని పదును పెట్టుకోవటం లాంటిది. చదవటం, ఆలోచించటం, తులనాత్మక పరిశీలన చేయటం, విద్యాభ్యాసం పటిష్టంగా చేయటం లాంటిదే. ఇలాంటి బుద్ధిమంతులైన వారి మనస్సులు సువిశాలమౌతాయి. వారి చూపులు విస్తృతమైన ఎల్లల దాకా ప్రసరిస్తాయి. ఈ మానసిక అభ్యాసం లేని వారిలో క్షుద్రాలోచనలు — సంకుచిత ధోరణులుండటమే కాక వారిలో వారికే ఒక నిశ్చితాభిప్రాయముండదు సరికదా పరస్పర విరుద్ధాలోచనలు కొట్టుమిట్టాడుతుంటాయి. ఈ పరస్పర విరుద్ధ భావ జాలమే సరైన పంథా అని కూడా అనుకొంటారు కూడా! వీరి మనఃక్షేత్రం చాలా సంకుచితం. బుద్ధిమంతులు — విద్యావేత్తలు — సుశిక్షిత మనస్కులు వేరు. వీరు ఋజు దర్శనంతో — భావ జాలాన్ని రత్నాలను తూకం వేసినట్లు తూచగలరు. భేద సాదృశ్యాలను కొలవగలరు. సకలభావాలూ విశ్వంలోనే ఉన్నాయని చూడగలరు. కొన్ని భావాలకో — సిద్ధాంతాలకో కట్టుబడటమనేది క్షుద్రమనీ దౌర్బల్యమనీ అనుకోగలరు. తాము మునిగినదే గంగ — అన్న ధోరణి వీరికుండదు.

విద్య యథార్థంగా చైతన్య ఆరోహణకు విస్తృతికీ ఒక గొప్ప వరం. అద్భుత సాధనం.

*

తల్లీ! మధురమూర్తీ! బంధాలను, అభిలాషలను జయించే ప్రబల సాధనాలేవి? వాటిని ఒక్క పెట్టుతో సమూలంగా ఛేదించే గొడ్డలి ఏది? లేదా! క్రమ

క్రమంగా ఒక్కొక్క దాన్ని ఏరివేస్తూ పోవటమా!
— ఏది మార్గం?

ఈ రెండూ దుర్బలసాధానాలే. వీటి వల్ల లభించే ఫలిత మేమంటే — నిన్ను నీవు వంచన చేసుకోవటం — నిన్ను నీవు బంగారు లేడిగా మలచుకొని అది వేరైనట్లు నీవే దాని వెంట బడటం — పట్టుకొన్నాననుకోవటం లాంటిది. అంటే తృష్ణా విజయం సిద్ధించిందనుకోవటం. ఇదీ ఆత్మవంచన. అంటే నీవు వాటి పైనెక్కి కూర్చున్నావనుకొంటావు. కానీ అవేమో అవ చేతనలో అణగారిపోయి — సమయం చూచుకొని లావాలాగ పొంగి నీ సర్వ చైతన్యాన్ని నాశనం చేస్తాయి.

నీ లోపల నుండే నీ దుర్బల క్షుద్ర ప్రకృతిని జయించి పాలించే వాడివి కావాలి. ఎలాగా? వాంఛానురక్తులకు చిక్కని చైతన్య సింహాసనాసీనుడవు కావటం ద్వారా చైతన్యం దివ్య ప్రకాశ, శక్తుల ప్రభావంతో మెరిసిపోతుంది కనుక. ఇదొక దీర్ఘ కాలిక శ్రమ. విసుగు విరామ మెరుగని సాధన. ఇందులో చెదరని ధైర్యం, లక్ష్యశుద్ధీ, సడలని శ్రద్ధాసక్తులూ అవసరం.

*

బుద్ధుడు చాలా యుక్తియుక్తంగా అన్నాడు — నీలో ఒకకోర్కె లవలేశం స్పందించినా అది విశ్వవ్యాప్తమవుతుంది. దానికి సిద్ధంగా ఉన్నవారు దానిని స్వీకరిస్తారు. అలాగే నీలో ఏమాత్రం వాంఛాస్వీకరణలక్షణమున్నా సృష్టిలో నిరంతరం తరంగాయ మానమౌతున్న వాంఛాజాలం నీలోకి నీప్రమేయం లేకుండా దానంతటది దిగుతుంది. అందుకే బుద్ధుడిలా ముగించాడు — 'ఈ భ్రాంతినుండి ముక్తుడవు కావాలి. పూర్తిగా ఆ వలను ఛేదించి బైటకు రా', కాని నాకిది అంత సువిశాలంగా తోచదు. ఐతే ఆయన దర్శించిన మార్గమిది. మరొకటున్నది. పరమేశ్వర శక్తితో తాదాత్మ్యం చెందటం. అది విశ్వవ్యాప్తంగా కాసే కోర్కెల ఎండలపై మబ్బుల్లాగా అలముకొని గొడుగులాగా నీడ నిస్తుంది. అప్పుడిక నిన్నా కోరికలు ముట్టుకోలేవు. అంతేకాక

నీ ప్రభావం వాటిపై పడుతుంది. అంటే నీకు తెలియకనే నీలోకి ప్రవేశించే ఆకాంక్షలు నీకు కన్పించటమే కాక నీ ప్రభావంలో అది తమతమ దుర్గుణాలను పరిత్యజించి ఉత్తమభావాలై — విశ్వంలో ప్రసరించి ఇతర మానవులను సైతం సుగుణవంతులుగా పరిణమింప చేస్తూ సృష్టి సాధుగమనానికి తోడ్పడటం జరుగుతుంది. ఇది శ్రీఅరవిందులు చెప్పిందీ, చేసిందీ. మనలను చేయమన్నదీ.

పారిపోవటం కాదు చేయవలసింది. మహాశక్తిని నీలోనికి ఆవహింప చేసుకొని జయించాలి.

నీలో, అటువంటి కోరిక ఏ మూలనున్నా, ఈ మహాశక్తి నీ వ్యక్తిగత ప్రయోజనాల కోసమనుకొన్నా అది లభించదు. నీలోనికవతరించదని గుర్తుంచుకో.

*

ఈ వాంఛా తరంగాలూ, ఇతరుల ఒత్తిళ్ళూ రక్షాకవచానికి[1] సోకుతాయా?

రక్షాకవచం నైతిక మానసిక దృష్టుల కన్వయిస్తుందని భౌతిక — స్థూల దృష్ట్యా నేనన్న విషయమేనా నీవు ప్రస్తావిస్తావించేది? అది కాదు. ఇది వేరే పరిధి లోనిది. ఇది సూక్ష్మమైన భౌతికావరణ. ఇది మనిషిని రుగ్మతల నుండి ఆపదల నుండి అద్భుతంగా రక్షించేది. ఐనా వ్యక్తి వాంఛా స్వరూపుడే. ఎందుకంటే కోర్కెలు మరొక పరిధికి — భూమికకు సంబంధించేవి. కోరిక ప్రాణశక్తి సంబంధమైనదితప్ప భౌతికమైనది కాదు. ఈ రక్షాకవచం ఆ ప్రాణకోశం కంటె స్థూలమైనదే. అది ప్రాణమయపురుమని ప్రాణికప్రపంచంలోకి ప్రవేశించి అక్కడి స్పందనములను పొందకుండా నిరోధించ లేదు.

---

[1] వ్యక్తి ఆవరణ. అది శరీరాన్ని ఆవరించి రక్షిస్తుంది. ఈ సూక్ష్మావరణమును వివిధ సిద్ధాంతాలు, వివిధ నామాలతో పేర్కొన్నవి. నాడీ ఆవరణ — కాంతిశరీరం ఇత్యాదులుగా

ఇంద్రియ విజేత ఎవరో — ఎవరు తన చైత్యపురుషుని దర్శించారో, ఎవరీ చైత్యపురుషకాంతిలో జీవించగలరో, ఎవరు అంతశ్చైతన్యంతో పూర్ణ సంబంధం కలిగి ఉంటారో లేదా ఎడతెగని సంబంధం కలిగి ఉంటారో, వారే వాంఛల నుండి విముక్తి కల్పించగలరు. జ్ఞాన — కాంతి — సౌందర్యావృతి కలిగి ఉంటారు. ఇంత చేసినా ఆకోర్కె ప్రవేశించనూ వచ్చు. అది బయట నుండి వచ్చేది కనుక. కాబట్టి తనను తాను నిత్యమూ కాపాడకొనక తప్పదు. అప్పుడే వాటి నుండి పూర్ణ విముక్తి. ఎంత కనుకలిగి జాగరూకత వహించినా అదొక అంటుజాడ్యంలా తాకుతూనే ఉంటుంది. ఈ జ్ఞాన — కాంతి — పవిత్రతలు కవచంగా వుంటే, కాంక్షలు వాటి శకిన్తి కోల్పోయి నీరసపడి లోనికి అడుగుపెట్ట లేవు. ఆ కవచం లేనపుడవి దాడిగా ముసిరి వెంటనే అంధ ప్రతిస్పందనలను కల్గిస్తాయి. కవచమున్న వారైతే — లోపలకేదుష్టశక్తి ప్రాబల్యంతో అవి ప్రవేశిస్తున్నవో తెలుసుకొని ఆ ప్రవేశాన్ని నిరోధించగలరు. ఇదే అసలైన రక్షావిధానం. జాగృతచేతన, పరిశుద్ధతా కనుగలిగి ప్రవర్తించేది కనుక నిద్రించేది కాదుకనుక దానికి తెలియకుండా ఏదీ ప్రవేశం పొందలేదు. దౌర్భాగ్యమేమంటే మనిషికిదంతా తెలియక పోవటం. అది లోపలకు ప్రవేశించాక దాన్ని బయటకు నెట్టటం సులభం కాదు — సాధ్యమైనా అంతరిక్ష వాతావరణం నుండి ఒక నల్లమచ్చలాగా దిగుతున్నపుడే చూడగలిగితే దానిని తరిమి కొట్టవచ్చు. భౌతిక భూమికలోని రక్షాకవచమీ విషయంలో పనికి రాదు.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు

∴

కోరికల ధాటిని తట్టుకోటమెలా?

కోరికల సంగతి ఎవరికి తెలియదు? ఒక పెనుతుపాను వలె అవి నీ మీదికి వచ్చి విరుచుకుపడతాయి. తుపాను వచ్చినప్పుడు నువ్వేం చేస్తావు? ఒక చెట్టునో గట్టునో గట్టిగా పట్టుకొని కూర్చుంటావు కదా. కోరికల విషయంలో కూడా అంతే. నీ లోపల ఒక లంగరు వేసుకొని ఆ తుపాను వెలిసేంత వరకు కదలకుండా మొండికేసి కూర్చోవాలి. — సంపాదకుడు

కోరికలు, వ్యామోహాలు — ఇవన్నీ మనిషిని నిలువెల్లా తల్లడిల్ల జేస్తాయి. అంతేకాదు అవి ప్రాణం పోసుకొని మనిషిని వెన్నంటి తరుముతూవుంటాయి. మనిషి వ్యక్తిత్వంతోటి అస్తిత్వంతోటి సంబంధం లేకుండా ఇది కొనసాగి వస్తూనే వుంటుంది. మనిషి ప్రమేయం లేకుండా ఇది అతనిని వెంటాడుతూనే వుంటుంది. ఇది ఒక తుపాను వంటిది. మనసులో కోరిక ప్రవేశించనే ప్రవేశించరాదు. కాని ఒకసారి ప్రవేశిస్తే అది అతనిని నిలువునా కుదిపి వేస్తుంది. అందుకని అది వచ్చినప్పుడు చాలా నిబ్బరంగా వుండాలి. నిశ్చలంగా వుండాలి. తుపాను వచ్చి వెళ్ళేక ప్రకృతి అంతా ప్రశాంతంగా మారినట్లు కోరిక అణిగిపోయేక మనస్సు స్థిమిత పడుతుంది. అంతవరకూ ఓపిక పట్టలేక పోయినట్లయితే మాత్రం మనిషి కోరికల సుడిగుండంలో చిక్కుకుని మునుగుతూ తేలుతూంటాడు. కోర్కెలపంజరం నుంచి విముక్తి లభించదు. తుపానులో చిక్కిన వారికి వూపిరి సలపదు. అలాగే కోర్కెల సముద్రంలో ఏమాత్రం చిక్కుకొనక తామరాకు మీది నీటి బొట్టు వలె ఉండగలిగితే కోర్కెలను జయించినట్లే. అలాకాక నీటిమీద తేలియాడుతూ నిలకడలేక ఉండే కార్కు (బెండు) ముక్క వలె మనస్సు కోర్కెల సముద్రంలో కొట్టుకుంటూ వుంటే అది ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక చోట సుడిగుండంలో చిక్కుకుని మునిగిపోతుందితప్ప తన అస్తిత్వాన్ని నిలుపుకోలేదు.

అయితే మనసుకి ఎల్లవేళల ఈ కోర్కెల తుపానుని తట్టుకొని నిలువరించేశక్తి వుండదు. ఎందుకంటే మనస్సు అన్ని వైపులనించి అన్నిరకాల వస్తువులని చూడగలిగిన లోతైన ఒక భూమిక. అలాంటప్పుడు ఒకనొక భావావేశపుటలలని ఎదిరించే శక్తి మనస్సుకి కావాలని ఆశించటం ఎలా? అటువంటి శక్తిని మేలుకొలపటానికి స్థిరచిత్త ముండాలి. భౌతిక వస్తువులు, చర్యలు, ప్రతిచర్యలను గురించి మనస్సు బేరీజు వేసుకొనేటప్పుడు అన్ని వైపుల స్పందనలను విశ్లేషించుకొంటుంది. ఒకప్రక్కనుంచి వచ్చిన స్పందనలవలనే యిది ఉంది. ఇదొక్కటే అనుకొనే ప్రమాదం ఎప్పుడూ పొంచి వుంటుంది. ప్రతిదానిని సమర్థించలేక కోర్కెను తీర్చుకో అని తీర్మానించే స్థితి వుంటుంది.

ఆ దశలో చైత్యపురుషుడు (psychic) అనే ఒక ఆంతరిక చైతన్యం వివేచన కోసం ప్రయత్నిస్తుంది. చిత్‌తో సంబంధం వున్న మనస్సు కోర్కెల పట్ల ప్రతిఘటనశక్తిని సమన్వయపరచ గలుగుతుంది. ఏది సత్యమో ఏది అసత్యమో చైత్యపురుషునికి బాగా తెలుసు. దీనినే సదసద్వివేకం అంటారు. ఇది వున్న మనస్సు చెడుని ప్రతిఘటిస్తుంది. విజయాన్ని సాధిస్తుంది. ఇందుకు మనస్సు ఎల్లవేళలా, చేతనానుసంధానం కలిగి వుండాలి.

చక్కటి సిద్ధాంతాలు వున్నప్పటికీ, మనస్సుకి చాలా చక్కటి అంశాలు తెలిసినప్పటికి, ప్రశంసనీయమైన నియమాలు వున్నప్పటికి, ఒకభావావేశాన్ని అదుపుచేయగల శక్తిని లోన నిర్మించలేదు. ఒకపనిని చేయడం తగదని, చేయకూడదని మనిషి స్థిరసంకల్పం చేసుకొన్నప్పటికి, ఒక్కొక్కసారి అదే జరిగిపోతుంది. ఎందుచేత? ఈ హఠాత్పరిణామానికి కారణం ఏమిటి? అని ఆలోచిస్తే ఇది. "ఇది చెడుపని అయినా ఒకసారి చేసేస్తే ఇక ముందు అలాంటి పనిచేయరాదనే స్థిరభావన మనస్సులో కలుగుతుందనే" తలంపుతో మనిషి ఆపని చేసేస్తాడనిపిస్తుంది.

ఇలాంటి పని చేయడం ఇదే ఆఖరుసారి అని సరిపుచ్చుకోవటం జరుగుతూ వుంటుంది. ప్రతిసారి యిలా సమాధానపరచుకోవటం జరుగుతూనే వుంటుంది.

ఈ సందర్భంలోనే భౌతికమెదడు గురించి, ఆంతరిక మెదడు గురించి మనం ఆలోచించగలగాలి. భౌతికమెదడు బాహ్యావిషయాలవైపు పనిచేస్తూ, ఆంతరికమెదడుతో అనుబంధం కలిగివుంటుంది. ఆంతరికమేధ జతతో భౌతికమెదడు పంపిన అంశాలని విశ్లేషించి మంచిచెడులను నిర్ణయించి అవసరమైన ప్రేరణని ఇస్తూ వుంటుంది. ఈ ప్రేరణని భౌతిక మనస్సు ఒక్కొక్కసారి అనుసరిస్తుంది. ఒక్కొక్కసారి ధిక్కరిస్తుంది. అందుకే ఒక్కొక్కసారి మనిషి సంయమనంతోను మరొకసారి తొందర పాటుతోను వ్యవహరిస్తూ వుంటాడు. ఒక్కొక్కసారి అటు ఇటు ఊగిసలాడి మంచిపనిని వాయిదా వేసి చెడుకోర్కెలను అనుభవించే తొందరపాటు ప్రదర్శిస్తాడు! ఈ ఒక్కసారికి పరవాలేదులే అని దాటేస్తూంటాడు. ఎప్పటికప్పుడే ఇదే ఆఖరుసారి అని కోర్కెలకు బానిస అయిపోతాడు. మరికొందరు నైతిక సూత్రాలను ఆచరించ వీలుకాని అప్రాకృతిక అంశాలుగా కొట్టిపారేస్తారు. ఏమైనప్పటికి కోర్కెలను తీర్చుకొనేవారు, తిరస్కరించేవారు అనే రెండురకాల ధోరణులవారు మనకి స్పష్టంగా కనిపిస్తూంటారు. ఈ రెండు ధోరణులు కూడ ఒకేలా అనిపిస్తాయి. అంచేత సమస్థితిగల ధోరణిని అవలంబించాలి. అలాకానిచో ఆత్మశుద్ధి సాధ్యం కాదు.

ఈ సాధనలో తొలిమెట్టు కోర్కెలని రెచ్చకొట్టే స్పందన లని సాత్త్వికంగా అధిగమించటం. అంటే ఆ పని చేయక పోవటం అనాలి. అసలు ఆజోలికే వెళ్ళను అని నిశ్చయం చేసు కోవాలి. కోర్కెలను అదుపు చేసుకోగలిగినను 'వ్యామోహం' అనేది అంతర్గతంగా రగులుతూనే వుంటుంది. దానిని అదుపు చేయటం చాలా కష్టం. అయినా ప్రయత్నిస్తే వ్యామోహాలని అదుపు చేయవచ్చు. అలా అని గాఢమైన వ్యామోహాలని మనస్సులోనే బంధించి వుంచుకోరాదు. వాటిని కొద్దికొద్దిగా ఉపశమింపచేసుకొంటూ వుండాలి. ఇందువలన వాటివిజృంభణని కొద్దిగా తగ్గించుకో గలుగుతాము. అంతమాత్రంచేత అవి శాశ్వ తంగా పోవు. మళ్ళీమళ్ళీ తలెత్తుతూనే ఉంటాయి. మనిషిని బాధిస్తూనే వుంటాయి. విసిగిస్తూనే ఉంటాయి. అలజడిని, నిరాశని,

నిస్పృహని కలిగిస్తాయి. అంచేత ఉపశమనదశనుంచి ఈవ్యామో హాలను మనస్సునుంచి దూరం చేయాలి. క్రమక్రమంగా వ్యామో హాలు చిక్కి నిష్క్రమిస్తాయి. వ్యామోహాలని ఎలాగైతే కొద్దికొద్దిగా ఉపశమింప ప్రయత్నం చేస్తామో అలాగే వాటి విజృంభణని అదుపుచేసే ప్రయత్నం చేయటం అంత కష్టమేమీ కాదు. ఆంత రికమెదడు ఇచ్చే విశ్లేషణని మన్నించి ప్రవర్తించటమే మనిషి చేయవలసిన పని. బాహ్య భౌతికమెదడు పెట్టే వ్యామోహాలని అధిగమించి ఆంతరిక మెదడు ఇచ్చే ప్రేరణకి ప్రాధాన్యం యివ్వాలి. ఈసాధనవలన కోర్కెలు అణగారిపోతాయి. వ్యామో హాలు విశ్రమిస్తాయి. ప్రకృతిలోని అన్ని శక్తులు మనిషిపై ఆధిప త్యానికి ప్రయత్నిస్తాయి. వాటి విజృంభణను మనిషి అదుపు చేయగలిగితే వ్యామోహాలు తోకముడుస్తాయి. అవి మనిషినుంచి నిష్క్రమిస్తాయి. మనిషి ప్రశాంత చేతస్కుడవుతాడు.

అందుకని ఎవ్వరూ “ముందు నా ఆలోచనలను శుద్ధి చేసుకుంటాను, శరీరాన్ని శుచిగా చేసుకుంటాను. నా ఆచరణను పరిశుద్ధం చేసుకుంటాను. అప్పుడు నా క్రియాకలాపాలని శుద్ధం చేసుకుంటాను” అని భావించరాదు. అలా అనడం, అనుకోవడం పరిపాటి. కానీ ఈ ప్రక్రియలో విజయం అనేది ఏమీ వుండదు. కనుక మొదట భౌతికస్థితినుండి సాధన ప్రారంభించాలి. “ఈపని నేను చేయను. ఈ కోర్కెను నేను కోరను. అన్నిరకాల బాహ్య ప్రేరణలు కలిగినప్పుడు నేను తలుపు వేసేస్తాను. అవి నా కోసం ఇక ఏమాత్రం రావు” అనే ధోరణితో సాధన ప్రారంభిం చటమే సహజమైనపద్ధతి. ఆంతరికలోతునుంచి కాక బాహ్యారంగం నుంచి ఈతరహా సాధన ప్రారంభమయితే కోర్కెలని అదుపు చేయటం, వ్యామోహాలని అధిగమించటం కష్టం ఏమీ కాదు. అంటే బాహ్యప్రేరణలకు లోబడి ఏదీ చేయకపోవటం, ఆలోచిం చకపోవటం అనేవే కోర్కెలపై విజయానికి మెట్లు. ఆత్మశుద్ధికి అంకురార్పణ. ఆలోచించండి! మన సాధన ఎక్కడ ప్రారం భించాలో!

అనువాదం: పురాణపండ రంగనాథ్

కోర్కెలను అధిగమించు

మనం కోరికలను ఇచ్ఛాపూర్వకంగా త్యజించినప్పుడు మనకు ఒకవిధమయిన ఆనందం కలుగుతుంది. అది నీ చైత్యపురుష స్పర్శ! అటువంటి అనుభూతి కోరికలను తృప్తిపరచటం వలన కలగదు. నీ నిస్వార్థత వలన కలిగిన చైత్యపురుష స్పర్శయే దానికి కారణం. — సంపాదకుడు

"కోరికను తీర్చుకోవడం కన్న దానిని అధిగమించడమే మిన్న" — అని ఒకసారి గౌతమబుద్ధుడు ప్రవచించాడు. కోర్కెను తీర్చుకోవడం లోని సంతృప్తి అందరికి తెలిసినదే. కాని దానిని అధిగమించడంలోని అనుభూతి వేరు. అది అవాచ్యమైనది. మరియొక కోవకు చెందినది.

ఒకసారి పారిస్‌లో ఒక తమాషా అయింది. ఆనాటి సంఘటనలోని మనుషులు అంత బాగా గుర్తు లేరు. కానీ ఆ అనుభవంమట్టుకు నన్ను యిప్పటికీ సున్నితంగా వెంటాడుతూనే ఉంది. మాసెనెట్ సమర్పించిన ఒక ఒపెరాలోని ప్రదర్శన అనుకొంటాను. అందులోని ఒక కథాంశం చాలా చక్కటిది. నాటకం చాలా బాగుంది. సంగీతం అసంతృప్తికరంగా ఏమీ లేదు. నాటి లలితకళల శాఖామాత్యులు కూడా దానిని సందర్శించారు. ఆయన ఒక పల్లెకు చెందిన పెద్దమనిషి చాలాకాలం పారిస్‌లోనే ఉన్నాడు. కాని మంత్రి పదవికి కొత్త. అలాగే క్రొత్త విషయాల్ని పరిశీలించడంలో బాలుడి వలె ప్రవర్తిస్తూంటాడు. ఆయన ఒక మహిళను ఆ ప్రదర్శనకు ఆహ్వానించాడు. ఆమెకు తన సీటు యిచ్చేసి తాను మాత్రం వెనుక సీటులో కూర్చున్నాడు. అందుకని ప్రదర్శనను బాగా చూడలేకపోయినాడు. ప్రదర్శనను చూడాలనే కుతూహలం కొలది పదేపదే ముందుకు ఒంగి చూడసాగాడు. ఆయన స్థానంలో కూర్చొన్న ఆ స్త్రీ ఆయన అవస్థని పసికట్టింది. ఆ కార్యక్రమం ఆమెకు నచ్చింది. మంత్రిగారు ఎంత అవస్థపడుతున్నారో అర్థం చేసుకొంది. ఏం మాట్లాడకుండా నెమ్మదిగా

కుర్చీలోంచి లేచి, తన కుర్చీని వెనుకకు జరుపుకొని నిశ్శబ్దంగా వచ్చి కూర్చుంది. ఏదో పరధ్యానంగా ఉన్నట్లు కనిపించసాగింది. ఇందువలన మంత్రిగారు ఆ ప్రదర్శనని చాలా బాగా చూడగలిగారు. ఇక్కడ ఒక అంశాన్ని మనం గమనించాలి.

ఆ మహిళ తన కోరికను అధిగమించి ఆయనకు అవకాశమిచ్చింది. అయితే ఆమె చక్కటి ప్రదర్శనని చూడలేక పోయిందని మనకు అనిపించవచ్చు. కాని ఆమె, కోరికను అధిగమించడం ద్వారా పొందిన విచిత్రమైన ఆనందం, మరొకరికి అవకాశం కల్పించగలిగినామనే సంతృప్తిని ఆమె ద్వారా మాత్రమే మనం తెలుసుకోగలం. ఆ ఆత్మానందాన్ని ఆమె మాత్రమే అనుభవం లోనికి తెచ్చుకోనగలదు. నిజమైన నిస్వార్థతలోని అద్భుతశక్తి అదే.

ఇది ఏదో పుస్తకంలో చదివిన కథ కాదు. స్వయంగా చూసిన సంఘటన. బుద్ధుడు చెప్పిన "కోరికను అధిగమించడం" అనే ప్రక్రియను ఆమె ఆచరణలో పెట్టి అనుభూతికి తెచ్చుకొంది. ఈ సంఘటన తర్వాత ఆ నాటిక వృత్తాంతము నటీనటుల అభినయం, రంగాలంకరణ, సంగీతం అన్నీ మానసిక మేధ నుంచి మంచువలె కరిగిపోయాయి. ఆ మహిళ కోర్కెను అధిగ మించిన సంఘటన, ఆమె ముఖంపై కనిపించిన ఆనందం నన్ను ఆవహించాయి. ఆ ఆనందం, ప్రశాంతత అనిర్వచనీయమైనవి. ఇది ఏ ఒక్కరికో మాత్రమే పరిమితమైన అనుభూతి కాదు. ఎవరైనా సరే ప్రయత్నించవచ్చు! ఆ అతిలోక ఆనందానుభూతిని పొందవచ్చు!

ఈ ఆనందం చైత్యపురుష సంపర్కం వలన కలుగుతుంది. ఒక మనిషి కావాలని ఏదైనా ఒక కోరికను అధిగమించ దలిచినప్పుడు మానసికపరమైన ఒక స్పందన జనిస్తుంది. కోరిక తీరినప్పటికన్న అధిగమించినప్పటి ఆనందానికి చెందిన స్పందన మిన్న. కోరిక తీర్చుకొంటే మరల మరల దానిని పొందాలనే ఆరాటం పుడుతూ ఉంటుంది. దాంతోపాటు ఒక రకమైన అసంతృప్త వేదన మిగిలిపోతుంటుంది. కోరికల వెంట పరుగెత్తే వారికి ఇది నిత్యానుభవం లోనిదే. మితిమీరిన తీపి తింటే చేదు

నిరోధిస్తున్నామేమో అని ప్రశ్నించుకోవాలి. ఒక్కొక్కసారి పెద్దల మనుకొన్న వాళ్లు, అమాయకంగా ప్రశ్నలు వేసే పిల్లల్ని కొడతారు, తిడతారు. అందుకే పిల్లలు తమ ఆశల్ని, ఆలోచనల్ని లోపలే దాచేసుకుంటారు. అందువలన అవి నివృత్తి కావు. "చిన్నపిల్లలుగా ఉన్నంతకాలం మనకేమీ రావురా", అనే ఒక నిశ్చయానికి వారు వచ్చేస్తారు. పెద్దవాళ్ళమయే వరకు వేచివుండాలనే భావన వారిలో స్థిరపడుతుంది.

అందుకే సున్నితమనసులతోనున్న పిల్లల్ని పెంచడం చాలా కష్టం. అలా అని వారిని నిర్లక్ష్యం చేయడం తగదు. వారు అడిగిన వాటిని, కోరిన వాటిని నెరవేర్చే పద్ధతి ఒకటి ఉంది. అయితే ఒకటి తీరితే రెండవ దానిని కోరే ప్రవృత్తి పిల్లలలో సహజంగా వుంటుంది. అది ప్రకృతి సిద్ధమైన ఒక మానసిక స్థితి. కోర్కె అనే దానికి తృప్తి అనేది ఉండదు. ఎప్పటికప్పుడే ఏదో ఒకటి అడిగే పిల్లల్ని అందుకే పెద్దలు మందలిస్తూంటారు.

కొంతమంది మనుషులను "కోరికలను జయించడం ఎలా". అని ప్రశ్నిస్తే, "ఏముంది, వాటిని తృప్తిపరచటమే" అని జవాబు చెప్తారు! కాని కోరికను నెరవేర్చడం కన్న కోరికకు కారణమైన ప్రేరణను అదుపుచేయడం ముఖ్యం. ఇందుకు ఎంతో జ్ఞానం, సహనం ఉండాలి. చిన్నపిల్లలకు యిది ఎలా సాధ్యమవుతుంది?

ఎందుకంటే పిల్లలలో విశ్లేషణాశక్తి, తర్కాసక్తి ఉండవు. పెద్దలు వీటి గురించి వారికి సుబోధనం చేయలేరు. కార్యకారణాల్ని పిల్లలు సక్రమంగా అర్థం చేసుకోలేరు. కనుకనే పెద్దలు పిల్లల్ని "నీతో పెద్ద తలనొప్పిగా ఉందిరా", అని కసురుకొని వారినుంచి తప్పించుకొంటూరు. కాని అది మన సమస్యకి పరిష్కారము కాదు. సరైన మార్గం కానే కాదు. వారి పట్ల సహనంతో వ్యవహరించాలి. పిల్లలేమిటి, పెద్దలే జీవితాంతం పిల్లలవలె ప్రవర్తించే వారున్నారు! అలాంటి పెద్దలకు కూడ హితవు చెప్పడం చాలా కష్టం. వారు కోరిన దానిని మనం

తిరస్కరిస్తే వారు మనల్ని పరిపరివిధాలుగా నిందిస్తారు. 'వాడు సుజ్ఞానైన వాడు కాదురా' అని ముద్ర కొట్టేస్తారు.

పెద్దలైనా, పిన్నలైనా, ఎవరైనప్పటికి వారిలోని వివేచనని మేల్కొల్పాలి. ఆలోచించే శక్తిని జాగృతం చేయాలి. సదాలోచనలనే కల్పించాలి. ఉన్నతశ్రేణి ఆలోచనలు చేసేటట్లు ప్రేరేపించ గలగాలి. ఈ ప్రకృతిని, ప్రపంచాన్ని గురించి తెలుసుకోవాలనే ధ్యాసను కలిగించాలి. నేర్చుకోవాలనే జిజ్ఞాసను ప్రేరేపించాలి. అప్పుడు క్రమంగా బిడ్డ వీటివైపు ఆకర్షితుడై అధ్యయనశీలి, అన్వేషణశీలి అవుతాడు. కష్టమైన పనేదైనా చేయమని అతడికి పురమాయించాలి. కష్టతరమైన దాన్ని సాధించమని ప్రేరేపించాలి. అంతవరకు అతడు చూడని మంచిబొమ్మని ఏదైనా చేయమని పురికొల్పాలి. వాటిని సాధించడంలో బిడ్డ సహనాన్ని అలవరచుకొంటాడు. అతడిలో అంతర్మథనం ప్రారంభమవుతుంది. ఈ ప్రయత్నంలో బిడ్డ బాగా యిబ్బంది పడుతున్నట్లయితే పెద్దలు పూనుకొని సహాకరించాలి. అతడు విజయం సాధిస్తే భుజంచరిచి ప్రోత్సాహించాలి.

కాగా కొందరు పిల్లలు అదే పనిగా తింటూంటారు. తల్లిదండ్రుల్ని, పదేపదే ఏదోఒకటి పెట్టమని వేధిస్తూంటారు. వాళ్ళని అలాగే స్వేచ్ఛగా తిననిచ్చారనుకోండి. కొన్నాళ్ళకు వారు విసుగు చెందుతారు, మానివేస్తారు. అయితే ఏదిపడితే దానిని వేళాపాళా లేకుండా తినడం వల్ల పిల్లలు ఆరోగ్యం దెబ్బ తింటుంది. ఈ విషయమై జాగ్రత్త వహించాలి. అయినా సహనంతో వారిని చక్కదిద్దగలుగుతారు.

నిప్పుపెట్టెలతో చెలగాటం, నదులలో ఈదులాట, గోడలపైన నడకాట, ట్రాఫిక్ రద్దీలో రోడ్డు దాటే సాహసం — వంటివి చాలా ప్రమాదకరం. ఇటువంటి వాటిని ప్రోత్సహించటం చాలా ప్రమాదకరం. అది మృత్యువుని ఆహ్వానించటమే అవుతుంది.

ఇది ఒక గడ్డు సమస్య. పిల్లల విషయంలో వాళ్ళకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, పూర్వపు శిక్షణా పద్ధతులను పట్టించు కోకూడదని, ఎవరికివారు తాజాగా ప్రయోగాలు చేసుకోవాలంటాడు ఒక పెద్దమనిషి. పిల్లలు ప్రమాదాలకు గురికాకుండా పెద్దవాళ్ళ

పర్యవేక్షణలోనే ఆడుకుంటూ ఉండాలనే నా వాదనను వాళ్ళు ఎగతాళి చేసారు. "మీరు అలా చేయడం శుద్ధ తప్పు", అన్నారు వాళ్ళు. "ఒక వేళ వారు చనిపోతే!", అన్న నా ప్రశ్నకు "అలాగే చనిపోనీయి! రి విధిని, ఆత్మ ఎంచుకున్న మార్గంలో జోక్యం చేసుకునే హక్కు నీకెక్కడిది? వారు మూర్ఖమైన పనులు చేయ దలచుకుంటే చేయనీయ్. అవి మూర్ఖపు కార్యాలు అని తెలిసిన రోజున వారు మళ్ళి అటువంటి పనులు చేయరు", అన్నారు. కాని హద్దులు మీరితే ఆ 'మళ్ళీ' రాకపోవచ్చుకూడా (అప్పటికి పిల్లవాడు బ్రతికిఉంటే కదా!)

ఈ సిద్ధాంతము చాలా చిక్కైనది. Each case ప్రత్యేక మైనది. ప్రతి బిడ్డకు ఒక్కొక్క ప్రత్యేకమైన పద్ధతి అవసరము. నిజంగా ఒక బిడ్డకు ఉత్తమమైన విద్యను గరపాలంటే మన మొత్తం కాలాన్ని దానికి వెచ్చించాలి. ఇంకే పని చేయలేము. ఆ బిడ్డకు తెలిసేలా మనము పర్యవేక్షించకూడదు గానీ, అతను సరియైన పని సరియైన సమయంలో చేసేలా అతనికి తెలియ కుండా ఒక కన్ను వేసి ఉంచాలి.

ఈ రెండు అతిశయోక్తుల (ఎప్పుడూ బిడ్డను మన గుప్పిట్లో ఉంచుకొనే పద్ధతి ఒకటి, ప్రమాదాలను గూర్చి కూడా హెచ్చరించనంత స్వాతంత్ర్యము ఇవ్వటం రెండవది) మధ్య మార్గాన్ని కనుగొనాలి. ఇది చాలా కష్టమైనది.

అనువాదం: పురాణపండ రంగనాథ్, గోదావరి

∴

ఇష్టాయిష్టాలుండరాదు అనగా ఏమి?

[యోగమనగా కత్తిమీద సాము. నిరంతరం జాగరూకుడువై మెలకువతో వుండాలి. మామూలు జీవితానికి యోగాభ్యాసానికి చాలా వ్యత్యాసమున్నది. ప్రతిక్షణము ప్రతిసన్నివేశము ఒక పరీక్షలాగ తయారవుతుంది. అనుకున్నది జరిగితే పొంగిపోవటం అట్టుల కానిచో క్రుంగిపోవటం పనికి రావు. నీ అంతరంగాన్ని కట్టి ప్రవర్తించాలి తప్ప అన్యథా కాదు. — సంపాదకుడు]

మళ్లీ అదే ప్రశ్న! అనేకులు నన్ను పదే పదే అడిగిన, తమలో తాము వేసుకుంటున్న ప్రశ్న! ఇందులో ఏమి వ్రాసి ఉందో ముందు చదువుతా, తదుపరి దానిని గురించి మాట్లాడుతా. ఈ ప్రశ్న పైకి ఎంతో న్యాయంగానే కనిపిస్తోంది కదూ!

> *"ఇష్టాయిష్టాలనేవి లేకుండా అన్ని విషయాలలోను తటస్థంగా ఉండాలి". "దీన్ని మనమెలా అవగాహన చేసుకోవాలి? క్రమరాహిత్యం కంటె క్రమపద్ధతిని, అశుచి కంటె శుచిని ఎన్నుకోవడం తప్పు అని అనగలరా? అభిమాన రాహిత్యమంటే ప్రతి ఒక్కరినీ, ప్రతి విషయాన్ని ఒకే విధముగా గౌరవించాలనేనా?"*

ఇప్పుడిక నాసమాధానం వినండి: ఇదంతా వట్టి మాటల గారడి తప్ప మరేమీ కాదు. నీవు 'అభిమానం' అన్న దాన్ని నేను 'ఎన్నిక చేసాను', అంటాను. నీవు అనుక్షణం నీ ముందున్న అనేక ప్రత్యామ్నాయాల్లో ఏదో ఒకదాన్ని వరించక తప్పదు — ఉదాహరణకి, ఏది నిన్ను (నైతికంగా, ఆధ్యాత్మికంగా), క్రిందికి లాగేస్తుందో, ఏది నిన్ను ఉద్ధరిస్తుందో, ఏది నీ ప్రగతికి ఉపకరిస్తుందో, ఏది నిన్ను వెనక్కు లాక్కెళ్తుందో — కాని, దీన్ని నేను 'అభిమానించడం' (having preferences) అనను. Preferences — this means precisely not choosing. ఉన్న ప్రత్యామ్నాయాల్లో ఒకదాన్ని ఎంపిక చేయడం, అంటే ఏది భావ్యమో

ఎంచుకోవడం అని అంటాను. నిరంతరం, అనునిత్యం ఈ (ఎన్నుకొనే) అవకాశం మన జీవితంలో ఎదురౌతూనే ఉంటుంది, ఇది తప్పనిసరి. శుచి, అశుచిల (నైతిక లేదా భౌతిక) మధ్య తుది నిర్ణయం అనుకొన్నంత సులభం కాదు సుమీ! ప్రతిక్షణం నీ ముందర ప్రత్యామ్నాయలు ఎదురౌతూనే వుంటాయి, వాటిలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవడం చాలాముఖ్యమైన విషయం, ఇందులో ఏమాత్రం అజాగ్రత్త వహించినా అది క్షమార్హం కాదు. కాని, ఈ ప్రక్రియను నేను అభిమానించడమని అనను. ఎందుకంటే, అభిమానించడంలో ప్రత్యామ్నాయాలు లేనట్టే ప్రవర్తిస్తున్నాము. ఇక ఎన్నుకొనే ప్రశ్నంటూ ఏముంది? ఏదో ఒక వస్తువును లేక వ్యక్తిని లేక విషయాన్ని తీవ్రంగా అభిమానించి గౌరవించడం లేదా అసహ్యించుకోవడం, ఆకర్షిత మవడం లేదా వికర్షింపబడటం, గ్రుడ్డిగా, అకారణంగా, ఒక ప్రత్యామ్నాయాన్ని గాఢంగా వాంఛించి దానికి బద్ధుడై పోవడం. నీవొక గడ్డు సమస్యను పరిష్కరించాలంటే దానికి ఏదో ఒక ప్రత్యేక విధమైన సమాధానాన్నే కోరుకోవడం, ఇవన్నీ ఈ కోవకు జెందినవే. కాని ఇక్కడ ముఖ్యంగా గ్రహించాల్సినదేమంటే ఈ ప్రక్రియలో ఒక ప్రత్యామ్నా యాన్ని ఎన్నుకోవడమనేది మృగ్యం. 'తా పట్టిన కుందేటికి మూడే కాళ్లు' అన్నట్లుందీ వ్యవహారమంతా. ఇందులో సత్యశోధన నాకు కన్పించడం లేదు, కేవలం మనమనస్సు (తర్కాతీతమై) ఏవైపు ఆకర్షింపబడుతుందో దానినే ఎంచుకోవడం, అంతే. నాకు 'అభిమానం' (preference) అంటే ఏమిటో స్పష్టంగా తెలుసు — అది గ్రుడ్డిప్రేమ, మానసిక ప్రేరణం, స్వతహాగా ఆహ్వానించుకొన్న ఒక బంధం, ఒక భయంకరమైన అచేతన స్థితిలోని మొండిపట్టు — అంతే, నా దృష్టిలో మరేదీ కాదు.

నీవు కొన్ని పరిస్థితుల నెదుర్కొంటున్నపుడు వాటి పర్యవసానమెలా వుంటుందో తెలియక కొట్టుమిట్టాడుతుంటావు, నీకేవో తీవ్రమైన కోరికలుంటాయి. ఒక వైపు నా మార్గదర్శకత్వాన్ని వాంఛిస్తూ, అదే సమయంలో మరో వైపు నీ కోరికకు అనుగుణమైన ఫలితమే రావాలని నిరీక్షిస్తూంటావు — ఇదంతా ప్రత్యామ్నాయాల్లో

ఏది మంచిదో విచక్షించి తెలుసుకోవడమెలా అవుతుంది? అదంతా నీ అభిమానం, అభీప్స, మరేమీ కాదు. ఇక నీ సమస్యకు సమాధానం దొరికినపుడు అది నీ ఇష్టానికి విరుద్ధంగా ఉందనుకో, దానితో సరిపెట్టుకోలేక, సరిపెట్టుకోకుండా ఉండనూ లేక సతమతమౌతూంటావు. అదే గనక ఏ విధమైన పరిష్కారము పైనా ప్రత్యేక అభిమానంగాని, తీవ్రవాంఛగాని లేదనుకో, జగన్మాత ఎట్టి పరిష్కారమిచ్చినా సరే, దాన్ని శిరస్సు వంచి, మనఃపూర్వకంగా సమమైన ఉత్సాహంతో స్వీకరించ గలుగుతావు. అట్లా చేయుడంలోనే వుంది నీ ఔచిత్యమంతా. మరి అట్లా కాకుండా నీకిష్టమైన రీతిలో సమస్య పరిష్కారం కాలేదనుకో. అప్పుడు గత్యంతరం లేక వ్యథతో దానితో రాజీపడక తప్పదు కదా? ఐతే అది నీకు నీవై స్వయంగా ఎన్నుకొన్న పరిష్కారమెంత మాత్రము కాదు. నీ జీవితంలో నిరంతరం సమస్యలు ఎదురుకాక తప్పవు. ఎన్నో పరిష్కార మార్గాలు ఉండకా తప్పవు — శతకోటి రోగాలకు అనంతకోటి ఔషదాలున్నట్లు! కాని, నీవిక్కడ గ్రహించాల్సిందీ, నేర్చు కోవాల్సిందీ ఏమిటంటే, 'నీ మనోవైఖరి' attitude ఎలాగుండాలి అనేది మాత్రమే.

ఒక విధమైన పరిష్కారాన్ని ఎన్నుకోవడమంటే ఒక నిర్ణయాన్ని, కార్యాచరణాన్ని ముందుగానే (విచక్షించకుండానే) నిర్ధారించుకోవడమే. అభిమానం నీ తీవ్రవాంఛకు ప్రతీక. సమాధాన మార్గాలెన్నో వున్నా, దాంట్లో ఒకదాన్ని నీవు స్వీకరించక తప్పదు. కాని అది పర్యవసానాతీతమై, నిష్కల్మషమై ఫలాపేక్ష లేనట్టి సత్యనిష్ఠమైన పరిష్కారాన్ని మాత్రమే నీవు స్వీకరించాలి. మరి నీ నిర్ణయానికి గీటురాయి ఏమిటి? అది కేవలం నీ అంతఃసాక్షి, సత్యభూతమున్నూ. ఆ నిర్ణయం నీలోని అత్యున్నత చైతన్యం నుంచి వెలువడాలి. ఫలిత మెట్టిదైనా నీకు దానితో పని లేదు. నిమ్న చైతన్యంలోని నీ కోరికల కనుగుణంగా పరిష్కారం కోరినావనుకో. అది కేవలం లెక్కలు కట్టి పథకాలు వేయడమే అవుతుంది, లేదా భగవంతునితో బేరమాడటమైనా అవుతుంది, నీ మనస్సులో ఆత్మసాక్షిగా సత్యశోధనతో చేసే నిర్ణయం ఎంత

మాత్రం కాదు. అభిమాన మెల్లప్పుడూ ఫలితంపై ఆధారపడి వుంటుంది, సత్యం మీద కాదు. అది అనేక విధాలైన వికృతా లకు దారితీయ గలదు. ఏదేని ప్రత్యేక ఫలితాన్ని ఆశించి తీసు కొనే నిర్ణయం, నిర్ణయం కాజాలదు, అది నీ వాంఛ మాత్రమే!

ఇక అందరినీ, అన్ని విషయాలనూ ఒకే దృష్టితో చూడ టమంటారా అది ఇంకా తికమకలతో కూడిన విషయం. ఆ సందిగ్ధానికి కారణమేమంటే భగవంతుడు అందరినీ సమానంగా చూడాలనే మూర్ఖత్వం. అంటే విశ్వంలో నానాత్వం, అనేకత్వం ఉండవలసిన ఆవశ్యకతే లేదని భావించడమే. ఇద్దరు వ్యక్తులను మూస పోసినట్టు సృష్టిస్తే అట్టి సృష్టిలోని గొప్పతనమేమిటో? వైవిధ్యమే లేని సృష్టి కూడా ఒక సృష్టేనంటారా?

ఈ అనంతవైవిధ్యమైన విశ్వంలో ప్రతి వ్యక్తినీ, ప్రతి ప్రాణినీ, చివరకు ప్రతి వస్తువునూ ఒకే విధమైన అగాధమైన ప్రేమ, మమైక్యత, విశాల దృక్పథం, సానుభూతి ఉండాలని నీవు ఆకాంక్షించ వచ్చును. కాని ఇదే దృక్పథాన్ని ఒకొక్క సందర్భంలో ఒకొక్క వ్యక్తిపై రకరకాలుగా, అందులోని సత్యంపై ఆధారపడి, (భగవంతుని దివ్య) అవసరం మేరకు నిర్ణయించడం జరుగుతుంది. అన్ని సందర్భాల్లోనూ దివ్యప్రేరణ ఒక్కటే అయినప్పటికీ, అవసరాన్ని బట్టి చేసే కార్యం అనేక విధాలుగా, ఒక్కొక్కసారి పరస్పర విరుద్ధంగా కూడా పైకి కన్పించేట్లుగా ఉంటాయి. కావల్సిందంతా ఉన్నతోన్నత చైతన్యంతో అతిసూక్ష్మమైన సత్యనిష్ఠకు సరితూగే దృక్పథం మాత్రమే — బాహ్యమైన యాదృచ్ఛికమైన పరిస్థితులపై ఎంత మాత్రమూ ఆధారపడి ఉండరాదు. అలా చేసినప్పుడు మనము తీసికొనే ప్రతి నిర్ణయం వెనుక ఉండే సత్యాన్ని దర్శించగలుగుతాము. అన్ని రకాల నిర్ణయాలు కూడా ఒకే అత్యున్నత చైతన్యం నుంచి ప్రవహించిన విచారధారయే అని ద్యోతకమవుతుంది.

పైన చెప్పిన విషయాలు అందరికీ సులభంగా గ్రాహ్యం కావు. చాలా గాఢంగా అగాధ సత్య శోధన చేసి అత్యున్నత చైతన్య శిఖరాల నుండి దర్శిస్తే తప్ప ఈ విషయాలు అర్థం

...వు. అతి ఎత్తైన ఆ శిఖరం లేదా అగాధమైన సత్యసంద్ర ...ంద్రం నుంచి అన్ని విషయాలనూ అన్ని దృక్కోణాలతో ఒకే ...రి పరికించినపుడు తెలిసే సత్యమేమిటంటే సృష్టిలో ఎంత వైవిధ్యం ఉందో, నిర్ణయాలలో కూడా అంతే వైవిధ్యం ఉంటుంది అని. అట్లా లేకపోతే ఏమి జరుగగలదు. అంటే సృష్టికి పూర్వం '...' లోని ఏకత్వానికి తిరోగమించినట్లే! సృష్టిలోకి, అంటే, అభివ్యక్తమైన విశ్వంలోకి ప్రవేశించినక్షణమే వైవిధ్యంలోకి దూసుకుపోక తప్పదు. అంటే మన నిర్ణయాల్లో, కార్యాచరణాల్లో కూడా వైవిధ్యం అనివార్యం. అనేకత్వంలోని నిగూఢ సత్యం ఏమిటంటే, మన కార్యాల్లో, నిర్ణయాల్లో, పోకడల్లో కూడ అనేకత్వం ఉండి తీరుతుందని.

అందుకని నువ్వు అంతిమ ఫలితాన్ని ముందే ఆశించి కర్మల నాచరించరాదు. ఈ సృష్టిలోని అనంతకోటి యవ...రకములకు ఒకే మంత్రం పనికిరాదని నువ్వు తెలుసుకోవాలి. దానికనుగుణంగా నడుచుకోవాలి.

అనువాదం: సి.కె. రామనాథ చెట్టి

∴

కోరికలకు అవసరాలకు భేదము

మనిషి తన కోరికలన్నీ నిజమైన అవసరాలే అని భావించి అవి లేకపోతే చచ్చిపోతాననుకుంటాడు. అయితే ఈ రెండింటికిగల సూక్ష్మభేదాన్ని కనిపెట్టాలి. ఏదైనా ఒక కోర్కె తలెత్తినప్పుడల్లా "అది లేకపోతే ఏమౌతుంది?" అని ప్రశ్నించుకోవాలి. ఈ విధంగా నిన్ను నీవు నిలదీసుకుంటూ పోతే నీ కోరికలు చాలమట్టుకు ఉత్తుత్తివే అని తెలిపోతుంది. — సంపాదకుడు

నిక్కమైన అవసరాలకు, కోరికలకు మధ్య అతిసూక్ష్మమైన తెర ఉండటంచేత వాటిని వేరుపరచటం కొంచెం కష్టమే. యోగ సాధకులకు ఆదర్శప్రాయమేమిటంటే వారు అవసరాల కతీతముగా ఉండటమే. అయినా ఈ వ్యాసము ఎందుకు రాశానంటే తమను తాము తెలుసుకోవాలనీ, అదుపులో ఉంచుకోవాలనీ భావించే సజ్జనులకు కొన్ని ఉపయుక్తమైన సూచనలందివ్వాలనే ఉద్దేశంతోనే.

ఈ రెండు పదాలను విచక్షించాలంటే పెద్ద సమస్యే ఎదురౌతుంది. ఎందుకంటే ప్రాణకోశం మనిషి జీవితంలో కోరికలను పురికొల్పడానికే తయారైంది. అట్లాగే మనిషికి కొన్ని అయినా అవసరాలు సహజంగానే ఉంటాయి. కాబట్టి ఈ రెండిటికీ మధ్యనున్న సూక్ష్మభేదాన్ని గుర్తించాలంటే నిష్పాక్షికత, నిష్కపటం చాలా అవసరం. కాని ఒక వస్తువు గాని విషయం గాని మనకు నిజంగా అవసరమా లేక ఇది ఒక (నిమ్న ప్రకృతికి చెందిన) వాంఛయా అని తేల్చిచెప్పడమెలా? దానికి కావల్సిందేమిటంటే నిన్ను నీవు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలి. నీ హృదయకుహరంలో మూలమూలల్లో శోధించి చూడాలి. ఏదైనా ఒక వస్తువుపై గాని, విషయంపై గాని, ఎవరైనా ఒక వ్యక్తిపై గాని అనురాగ మమకారాలు ఉన్నట్లైతే నీలో తీవ్ర ప్రకంపనాలు ఉదయిస్తాయి. అదిగో అదే నీలోని కామానికి,

---

[1] The science of living

గ్గానికి కొండగుర్తు. ఉదాహరణకి: 'ఈ ఆహారం నాకు అవశ్యకం' అని అనుకున్నావనుకో ఇక అది అవసరమేనని గాఢంగా విశ్వసించి, ఊహించి, తలచి, చివరకి దానికోసం ఎన్ని తిప్పలుపడి పొందేవరకు వదలవు. మరి ఆ ఆహారం నీకు అవశ్యకమా లేక కామనయా అనేది తేల్చుకోవాలంటే నీ అంతరాత్మవైపు తిరిగి నీలో నీవే ఇలా ప్రశ్నించుకోవాలి. 'ఆ వస్తువును పొందకపోతే నాకు వచ్చే నష్టమేపాటిది?' 'అయ్యో, అది లేకపోతే నా జీవితమే వృథా' అని తపీమని సమాధానం వచ్చిందనుకోండి. అప్పుడు అది కేవలం వాంఛమాత్రమేనని నిర్ధారించుకో ప్రతి విషయంలోను ఇలాగే చేయాలి. ఏ సమస్య వచ్చినా సరే, కొద్దిగా వెనుకకు తగ్గి నీ అంతరాత్మ సాక్షిగా 'ఉండాంలే, ఈ వస్తువును పొందటం నిజంగా అత్యవసరమా?', అని నీలో నీవు తర్కించుకోవాలి. అలా చేసినప్పుడు నీలో ఆనందోత్సాహాలు ఉరకలు వేసాయనుకో, అప్పుడు అది కోరికే కాని అవసరంకాదు అని నూటికి నూరుపాళ్ళు నిర్ణయించుకో అలాకాకుండా, 'నేనా వస్తువును పొందను' అని అనుకున్నప్పుడు నీమనస్సు చివుక్కుమన్నా, కుంచించుకొనిపోయినా, నిరుత్సాహ పడినా, అదిగో అది కూడా కోరిక లేక వాంఛయే అని తెల్చుకో

నీలోని ప్రాణిక చైతన్యం నిన్ను వంచించకుండా ఉండాలంటే నీవు ఎల్లప్పుడూ అతి జాగ్రత్తగా శ్రద్ధవహించి ఉండటమే కాకుండా నీలో 'అద్భుతమైన' నిష్కపటస్థితి నెలకొనాలి. 'అద్భుతమైన' అనే విశేషణాన్ని నిన్ను భయభ్రాంతుణ్ణి చేయడానికి నేను వాడలేదు సుమీ. కేవలం నీలో స్వచ్ఛతపై ప్రగాఢ ఆకాంక్ష నెలకొనాలని మాత్రమే అలా చెప్పాను.

*

ఒకరకం వాళ్ళు ఉంటారు. వాళ్లు ప్రతి ఒక్క కోరికపై 'ఆవశ్యకత' అనే రంగు పులుముతారు. ఈ కోవకు చెందినవాళ్ళే ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో తారసపడతారు. వీళ్ళు తమకు కన్పించిన ప్రతివస్తువు తమకు అవసరమనీ, అది లేకపోతే

బ్రతకలేమనీ పూర్తిగా విశ్వసిస్తారు. వారి ధోరణి ఇదిగో ఇలా ఉంటుంది: "అసాధ్యం, ఆ వస్తువు లేకపోతే నేను జీవించలేను. నేను ఏదో రోగానికి గురిఅవుతా, లేదా ఏదో వ్యధకు గురి అవుతా, ఆ వస్తువు లేకుంటే నేనే పనీచేయలేను, నా పనులన్నీ ఆగిపోతవి". కాబట్టి మనము ఆత్మసాక్షిగా, నిష్కపటంగా, ఒక నిర్ణయానికి రావాలంటే ఒక చిన్న ప్రయోగం చేయాలి. "సరే, ఆ వస్తువుతో నాకెట్టి పనీలేదు, అది లేకపోతే ఏమౌతుందో చూద్దాం. తొందరపడి ఒక నిర్ణయానికి రావద్దు"లే అని అనుకోవాలి. ఇది చాలా కుతూహలం రేకెత్తించే ప్రయోగం. ఇలా చేస్తే, నేను ఖండితంగా చెబుతున్నా, వెయ్యిలో 999 సార్లు సరైన నిర్ణయానికి రాగలుగుతారు. అప్పుడు మీలో ఇలా అనుకుంటారు: "ఆ వస్తువు లేకపోతే నాకు వచ్చిన నష్టమేమీ లేదు, అది ఉంటే నాకు ఒరిగింది లేదు. ఇన్నాళ్లుగా "అది లేకపోతే నాకు గడవదు బాబోయ్", అని ఎందుకనుకొన్నానో నాకే తెలియదు! ఇలా సాధన చేస్తే మెల్లిమెల్లిగా, నీలో ప్రగతి రాగలదు.

ఇదంతా నేర్చుకోవడం ఒక శిక్షణాక్రమం. ఇట్టి శిక్షణ ఎంత పిన్నవయస్సులో మొదలుపెడితే అంత మంచిది, అంత సులభసాధ్యం కూడాను. ఎందుకంటే అలా చేసినట్లైతే విచక్షణా పద్ధతికి అలవాటు పడతావు. నీలోని ప్రతిక్రియలను తటస్థ భావంతో బేరీజు వేసి నిర్ధారణ చేసే వివేచనతో కూడిన వ్యవహారజ్ఞానం నీకు అలవడుతుంది. అలా కాకుండా చిన్ననాటి నుంచి కన్పించిన ప్రతివస్తువునూ అవసరమేనని నమ్మి దాన్ని పొందటానికి సతమతమౌతూ ఉంటే, జీవితంలో ఎన్నో కష్ట నష్టాలకు గురికావలసివస్తుంది, ఎందుకంటే అట్టి వారికి విచక్షణాజ్ఞానం ఏమాత్రమూ లేక అజ్ఞాన సముద్రంలో కొట్టుమిట్టాడుతుంటారు. అట్టివారిని ఎవరు రక్షించగలరు?

అనువాదం:సి.కె. రామనాథ చెట్టి

∴

‘కాంక్ష’ — ‘ఆకాంక్ష’

ఆకాంక్ష (అభీప్స) అనగా స్వార్థము లేకుండా ముందు వెనకలు చూడని ఆత్మసమర్పణ. కోరిక ఏమో స్వార్థం కోసం పాకులాట తనవైపు ఆకర్షించుకోవాలనే దృష్టి. ఆకాంక్ష ఏమో ఇచ్చుకోవాలని చూస్తూ వుంటుంది. — దాని లక్షణం ఆత్మసమర్పణ. నిజమైన ఆకాంక్షే వున్నట్లైతే “ఇది కాంక్షయా ఆకాంక్షయా” అనే ప్రశ్నయే వుదయించదు.

— సంపాదకుడు

‘ఆకాంక్ష’ లో ఒక నిస్వార్థమైన ఉద్వేగం, జ్వాలా కనిపిస్తాయి కాని, ‘వాంఛ’ లో అటువంటివి మృగ్యం. కోరిక ఎంతసేపు తన వైపుకు లాక్కొంటుంది. ఆకాంక్షలో నిన్ను నీవు మరిచే గుణం ఉంది. స్వచ్ఛమైన మనోవైజ్ఞానిక శాస్త్రం ప్రకారం యోచించినట్లైతే, ఆకాంక్షలో ఆత్మసమర్పణ గోచరించగా, వాంఛలో స్వలాభేపేక్ష మాత్రమే కనిపిస్తుంది. అభీప్సలో తనను తాను నిస్సంకోచంగా సమర్పించుకోవడం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది — అది భావనలో కంటే, ముఖ్యంగా, క్రియలలోను, స్పందనలోను, ప్రాణిక చేష్టల లోను స్పష్టంగా కనబడుతుంది.

*

ఎప్పుడైతే నీలో సత్యమైన ఆకాంక్ష — నిస్వార్థంగా, నిష్కపటంగా బయలుదేరుతుందో అప్పుడు — ఈ (ఆకాంక్షయా లేక కాంక్షయా అనే) ప్రశ్న ఉదయించనే ఉదయించదు. ఎందుచేతనంటే, ఆకాంక్ష లోంచి ప్రకాశ ప్రకంపనాలు ప్రసారమౌతుంటాయి గనుక. నిమ్న కోరిక హింసాపూరిత తీవ్రఉద్వేగాలకు పుట్టినిల్లు.

*

ప్రశ్న: సాధారణ సంవేదనలో మనము ఏ కార్యములను సరియైనవేనని అనుకుంటామో, అట్టి మన చేతలు, ఆలోచనలు, ఆకాంక్షలు ప్రాణికోద్వేగములు అయిఉండొచ్చు. కాని ఆ విషయాన్ని మనము గ్రహించడమెలా?

ఇది అంతఃస్సాక్షికి సంబంధించిన ప్రశ్న. ఇది సాధారణ, ఇంద్రియాధీన సంవేదనలపై ఆధారపడి చేసే న్యాయ నిర్ణయం వంటిది కాదు. అట్టి నిర్ణయం పూర్తిగా అధమ స్థితికి, అంటే మానసిక స్తరానికి చెందినట్టిది.

కాకపోతే దాన్ని తెలుకోవడానికి నేనొక చిట్కా చెబుతా. అదేమిటంటే నీవు ఏ పనిని చేయాలని నీలో పీకుతూంటుందో దానిని చేయటల్లేదని ఊహించుకో అట్లా ఊహించుకున్నప్పుడు నీకు ఏమాత్రం బాధకలిగినా, అది వాంఛయే అని ఖండితంగా నిర్ధారించుకోవచ్చును.

అనువాదం సి.కె.రామనాథ చెట్టి

∴

యోగము – కోరికలు

కోరికలు మానవునికి సహజమే. యోగమార్గంలో ఉంటే కోరికలు రేకెత్తకూడదంటారు. కాని, నీలో దాగివున్న కోరికలు యోగశుద్ధి ద్వారా బహిర్గతమౌతాయి. కామాది వాంఛలు నిన్ను పట్టుకొని పీడిస్తాయి. వాటికి ఒక్కటే మందు. నువ్వు వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా మొహం అటుతిప్పుకోవాలి అంతే. అవన్నీ మనకి చెందినవి కావని, బాహ్యప్రపంచానికి చెందినవని తెలుసుకోవాలి. వాటిని దైవానికి అర్పించినట్లయితే ఆయనే వాటిని రూపాంతరీకరింప చేస్తాడు. — సంపాదకుడు

యోగసాధన చేసేటప్పుడు నీలో పరిశుద్ధి ప్రక్రియ జరుగుతూంటే అక్కడ గుప్తంగా ఉన్న ప్రేరణలు, వాంఛలు అన్నీ బయటపడతాయి. అలా వచ్చిన వాటిని దాచిపెట్టాలనీ, ప్రక్కకు నెట్టివేయ్యాలనీ అనుకోకుండా ఎదుర్కొని, జయించి పరిష్కరించాలి. యోగాభ్యాసం చేస్తున్నప్పుడు మొట్టమొదటగా మానసిక అజమాయిషీ తొలిగిపోతుంది. అప్పుడు నిద్రావస్థలో ఉన్న కోరికలు ఒక్కసారిగా మేల్కొని స్వేచ్ఛా విహారం చేస్తాయి. మానసిక

నియంత్రణ స్థానంలో భగవంతుని అజమాయిషీ సంస్థాపన జరిగే వరకూ ఉండే విరామసమయంలో ఈ విధంగా జరుగుతుంది. ఇది నీ శరణాగతికీ, మనశ్శుద్ధికీ అగ్నిపరీక్ష. సాధారణంగా ఇటువంటి సమయంలో ఈ ప్రేరణలను, ముఖ్యంగా విషయవాంఛలను మరీ కఠినంగా నిషేధించి అదుపు చేసుకోవాలని చూస్తారు. అంతతీవ్రంగా ఎదుర్కొని బలవంతంగా వాటిని అణిచిపెట్టాలని చూసిన కొద్దీ వాటిమీద ధ్యాస పెరుగుతుంది. అందువల్ల అలా శ్రద్ధ చూపటం మాని వాటినుంచి దూరమైపోవాలి. వాటిని పట్టించుకోవడం మానేసి, వాటి గురించి ఆలోచించటం తగ్గించుకొని, ఒకవేళ ఆలోచన కలిగినా ఉదాసీనంగా, ఏమి పట్టనట్లుగా ఉండిపోవాలి.

యోగశక్తి వత్తిడితో ఈ విధంగా తలెత్తిన కోరికలను, ప్రేరణలను నిర్లిప్త వైఖరితో ఉదాసీనంగా, అవి నీకు సంబంధించిందిగా కాకుండా బాహ్యప్రపంచానికి సంబంధించినవైనట్లు మసలుకోవాలి. వాటిని ఆ భగవంతునికే అర్పించేస్తే వాటిని పరివర్తింప చేసే భారం ఆ దైవమే వహించగలడు.

*

శరీరాన్ని కృశింపచేసి, నీరసింప చేసుకోవడం ద్వారా ఎవ్వరూ వాంఛలను నివృత్తి చేసుకోలేరు. బలము, సమతులనము, శాంతముల ద్వారా మాత్రమే వాటిని అధిగమించవచ్చు.

*

కోరికలలో మంచివాటినీ, చెడ్డవాటినీ విడివిడిగా గుర్తించి, మంచివాటిని స్వీకరించి చెడ్డకోరికలను విసర్జించాలనేది నైతిక వాదన. కానీ ఆధ్యాత్మిక జీవితానికి అటువంటి నిబంధన లేదు. కోరిక లెటువంటివైనప్పటికీ వాటిని అధిగమించి తీరవలసినదే. దైవమార్గంనుంచి నిన్ను దారిమళ్ళించే ఏ అంశాన్నైనా దూరంగానే ఉంచాలి. కేవలం అవి చెడ్డవైనంత మాత్రాన కాదు. ఎందువల్లనంటే ఇక్కడ చెడ్డవని ముద్రపడినవి కూడా సందర్భాన్నిబట్టి వేరొకరికి మంచివి కావచ్చు. ఎటొచ్చీ అవి కాంతిహీనమైన, అజ్ఞాన ప్రేరణలకు సంబంధించినవి కావటం వల్ల నీవు

దైవాన్ని చేరటానికి ఎంచుకున్న మార్గంలో అడ్డు నిలుస్తాయి కాబట్టి వాటినన్నిటినీ విసర్జించాలి. కోరికలనేవి మంచివైనా, చెడ్డవైనా ఒక్కటే. అన్నీ కూడా నిస్తేజమైన అజ్ఞాన ప్రాణిక విభాగంలో నుంచి ఆవిర్భవిస్తాయి. ఇంకా చెప్పాలంటే నిన్ను దైవంతో అనుసంధానం చేయగలిగిన ప్రవృత్తులను మాత్రమే అంగీకరించాలి. వాటి మంచిచెడులను నిర్ణయించేది కేవలం అదే. నిన్ను దైవానికి దూరం చేసే వాటినన్నిటినీ వదిలిపెట్టాలి. అంతేకానీ నీ దృక్పథంతో వాటి మంచిచెడులను నిర్ణయించవద్దు. నీవు చెడ్డగా అనుకున్నవి, దైవమార్గం అక్కర్లేని సాధారణ వ్యక్తికి మంచివే కావచ్చు.

*

యోగానుష్ఠానమంటే పురోగతి సాధించటమని నీవు అనుకుంటూ, యావత్తు ప్రపంచం ప్రగతి మార్గంలో ఉన్నట్లు నమ్ముతున్నట్లయితే కోరికల యొక్క ధోరణినే మార్పుచేయాలి. వాటిని బాహ్యామైన, కృత్రిమ, అహంపూరిత అంశాల నుంచి మళ్ళించి సత్యశోధితమైన నీ ఆకాంక్షతోను సాధనా శక్తితోను జోడించాలి.

అనువాదం: A. వెంకటరామ శాస్త్రి, A. ప్రభావతి

∴

నిష్కామ కర్మ

"ఫలమును ఆశించకయే కర్మలను ఆచరించుట" నిష్కామ కర్మ ఎలా సాధ్యమవుతుంది? దానికి మొదటి సూత్రము "కోరికకు, కర్మకు గల ముడిని సడలించవలెను". ఇక నీవు ఫలాపేక్ష ప్రసక్తి లేకుండానే పని చేసెదవు. ఎందుకంటే నీ బదులు నీకంటే వెయ్యిరెట్లు అధికమైన దైవశక్తియే నీచేత పనులు చేయిస్తుంది! — సంపాదకుడు

అమ్మా? కర్మమార్గం అనుసరిస్తున్నప్పుడు మనం మొదట సడలించ వలసిన చిక్కుముడి కర్మాచరణ

అని శ్రీఅరవిందులు యోగసమన్వయంలో చెప్పారు కదా! పనిచేయడం చిక్కుముడి ఎలా అవుతుంది?

ఎందువల్లనంటే మానవులకు వారు చేసే పనిమీద మమకారం ఉంటుంది కనుక అదే అహంకారపు ముడి. నీవొక పనిచేస్తు న్నావంటే ఒక కోరిక వల్లనే చేస్తావని శ్రీఅరవిందులు చెప్తున్నారు. సాధారణంగా పనిచేస్తున్నావంటే ఆ పని ఏదో విధంగా ఒక కోరిక, లేదా అవసరంతో ముడిపడి ఉంటుంది. అది 'అగత్యం, తప్పనిసరిగా చేసితీరాలి' అని నీవు ఎన్ని రకాలుగా చెప్పినప్పటికీ దాని మూలకారణేమిటని పరిశీలిస్తే, ఒక కోరిక వల్ల కలిగిన ప్రేరణే నీ చేత పనిచేయిస్తున్నట్లు తెలుసుకుంటావు. ఆ విధంగా ఒక కోరికవల్ల కలిగిన ప్రేరణ ప్రభావంతో నీవు పనిచేస్తున్నపుడు ఆ కోరికను తీసేస్తే పని చేయలేవు.

"ఫలాపేక్షపై మమకారం లేకుండా కర్మాచరణ కావించు. పనిచేస్తున్నది నీవు కాదు, నీలో ఉన్న ఆ భగవంతుడే చేస్తు న్నాడు", అని అనుకోమని ఎవరైనా చెపితే, వెంటనే, "అది కష్టం. అలా అనుకుంటే నేనేమీ చేయలేను. ఏదో ఒక అవసరం, ఓ కోరిక ప్రేరణ నాచేత పనిచేయించాల్సిందే", అని అందరూ అంటారు. అందువల్లనే శ్రీఅరవిందులు అలా అన్నారు. గీతా సారాన్ని అనుసరించాలంటే ప్రప్రథమంగా కర్మ, ఫలాపేక్షల మధ్య ముడిని సడలించాలి. ఇవి రెండూ గట్టిగా ముడిపడి ఉండటం వల్ల ఒకదాన్ని విడదీస్తే రెండవది కూడా వచ్చేస్తుంది. అందువల్ల వీటిని జాగ్రత్తగా సడలించి, ఫలాపేక్షను తొలిగించి, కర్మాచరణ కొనసాగించాలి.

ఇది ముమ్మాటికీ నిజం. అదే నీ కర్తవ్యం. ఆ ముడిని సడలించటం ఒక చిన్న ఆపరేషన్ లాంటిది. అది చాలా సులభం, ఆపరేషన్ జరిగాక స్వలాభం ఏమాత్రం లేకుండా నీవు పని చేస్తున్నట్లు, నీ దురహంకారశక్తికి బదులు అంతకు మించిన ఒక

ఉన్నతశక్తి నిన్ను నడిపిస్తున్నట్లు తెలుసుకుంటావు. ఆ విధంగా పనికొనసాగుతుంది. కానీ దాని పర్యవసానాలు మాత్రం నిన్నంటవు.

ఈ విధంగా జరిగినప్పుడు నీ చైతన్యంలో ఒక అద్భుతమైన మార్పు వస్తుంది. అది చాలా స్పష్టంగా తెలుస్తుంది. నీ జీవితంలో మంచివి, చెడ్డవి, అవసరమైనవి, అనవసరమైనవీ అనేక పనులు చేస్తావు. అవి ఏమైనా వాటికి అనేక పరిణామాలుంటాయి. నిజానికి నీవు ఫలితాన్నాశించే పనిచేస్తావు. నీ దృష్టి ఫలసిద్ధిపైనే ఉంటుంది. ఉదాహరణకు (శ్రీమాత మైకు వంక చూపిస్తూ) నేను మైకు వైపు చేయి చాచితే అది మైకునందుకొని మాట్లాడాలనే కదా! ఆ విధంగా చేసే ప్రతి పనికీ ఒక ప్రతిఫలం ఉంటుంది. అయితే నీవు ఈ ముడిని విడదీసి పైనుంచి వచ్చే శక్తిని నీలో పనిచేయనిచ్చి, నీ ద్వారా పని జరిగినప్పుడు ఆ పనికి పర్యవసాన ఫలితాలున్నప్పటికీ అవి నిన్ను అంటవు. ఎందువల్లనంటే ఆ పనిని ప్రచోదించినది పైనున్న శక్తేగానీ నీవు కాదు కాబట్టి. దాని పరిణామాలు కూడా పైకే వెళ్లుతాయి, లేదంటే నీచే పనిచేయించిన ఆ శక్తి ఆ ఫలితాలను కూడా తను స్వాధీనం చేసుకొని ఎక్కడికి పంపాలో అక్కడికి పంపుతుంది. నీవు మాత్రం అవేమీ అంటకుండా, ఆ ఫలితాలను గురించి పట్టకుండా స్వేచ్ఛగా ఉంటావు!

ఈ విధమైన అనుభవం పొందిన వారున్నారు. ఇటువంటి అనుభవాలు మొదట్లో ఒక మెరుపులాగా వచ్చి మాయమైపోతాయి. వ్యక్తి పరివర్తన చెందటానికి పూర్తిగా సంసిద్ధుడైనప్పుడు మాత్రం ఈ అనుభవం స్థిరపడిపోతుంది.

అనువాదం: ఎ. వెంకట్రామ శాస్త్రి, ఎ. ప్రభావతి

∴

నిష్కామ ఆకాంక్ష

నిష్కామ కర్మను గురించి అందరికీ తెలుసు. మరి నిష్కామ ఆకాంక్ష అంటే ఏమిటో? నిజమైన ఆకాంక్షకు రాజసముతో కూడిన ఆకాంక్షకు గల భేదము ఇందులో వివరించబడింది.

— సంపాదకుడు

> *"దివ్యచైతన్యంలో విశ్రాంతి కొరకై ఆకాంక్షించు. అది నిశ్చలంగా మనస్ఫూర్తిగా ఉండాలి. అతితీవ్రంగా ఉండ వచ్చు. అయినప్పటికీ అందులో ఆత్రుత, వ్యాకులత, రాజసికమైన కాంక్ష ఉండరాదు."* అని శ్రీఅరవిందులు *'బేసెస్ ఆఫ్ యోగ'* అనే పుస్తకంలో వ్రాశారు.

వారు ఇక్కడ చెప్పినది అసలైన ఆకాంక్షను గురించి. ఆధ్యాత్మిక జీవితం కావాలని గట్టిపట్టుదలతో, ఉద్విగ్నతతో ఆకాంక్షిస్తే మాత్రం అంతా చెడిపోతుంది. ఈ విధంగా ఆకాంక్షించినప్పుడు ఒకవేళ ఫలితం కనిపించినప్పటికీ అది చాలా కలుషితంగా, చాలా కలగాపులగంగా, అపరిశుద్ధంగా ఉంటుందని వారు చెప్పారు. ఇక్కడ రాజసిక తృష్ణ అనగా తీక్షణత (intensity) కాదు తీక్షణత చాలా విస్తారంగా, నిశ్చలంగా, పరిశుద్ధంగా ఉండి ఆకాంక్షకు చాలా పుష్టిని కలుగచేస్తుంది. దీనికీ రాజసిక తృష్ణకీ, చలనానికీ ఏమాత్రం సంబంధం లేదు.

దీన్ని విశదీకరించాలంటే ఇలా చెప్పవచ్చు. పురోగమిం చాలనే ఆకాంక్ష కలిగిందనుకో. నీ ఆకాంక్షతో కాంక్ష కలిసి ఉంటే పురోగతి చెందితే కలిగే లాభాలను గురించి ఆలోచిం చడం మొదలుపెడతావు. అప్పుడు లభించే శక్తులు, వాటివల్ల నీకు కలిగే గుర్తింపు, నీ జీవన సరళిలో వచ్చే అభివృద్ధ్యాదు లను తలుచుకొని ఆ పురోగతిని కోరుతావు. ఈ విధంగా నీ వ్యక్తిగత కారణాలని ఆకాంక్షతో జోడిస్తావు. ఇలా చూస్తే చాలా కొద్దిమందిలో మాత్రమే కేవలం పురోగమించాలనే దృఢసంక

ల్పంతో కూడిన స్వచ్ఛమైన ఆకాంక్ష కనిపిస్తుంది. అది అంతవ రకే ఉండాలికాని ఇంకాముందుకు సాగి అన్నిరకాల వాంఛలతో మిళితం కాకూడదు. కానీ సాధారణంగా పురోగతిని గురించి ఆలోచిస్తూంటే రకరకాల కోరికలు కలుగుతాయి. దీన్నే శ్రీఅరవిందులు మురికి, మలిన చైతన్యమని చెప్పి ఇందులో ఉన్నత స్థితులు ఇమడలేవని చెప్పారు. అందువల్ల ప్రారంభం లోనే వీటిని వదిలించుకోవాలి. ఎవరికి వారు నిష్పాక్షికంగా, సూటిగా పరిశీలించుకుంటే తమ చైతన్యంలో చాలా కొద్ది విషయాలు మాత్రమే కోరికలతో మిళితం కాకుండా ఉన్నట్లు గ్రహించగలరు. నీలో ఒక ఉన్నత ప్రక్రియ కలిగినప్పటికీ అది కోరికతో కూడే ఉంటుంది. అదృష్టవశాత్తూ దీనికి మినహాయిం పులు కొద్దిగా ఉన్నప్పటికీ సాధారణంగా ఆ కోరిక అనేక రూపాల్లో ఉంటుంది. అది తాను చాలా ప్రముఖుడనే భావన కావచ్చు.

ఇది కొంత వరకూ నయమే. ఎందువల్లనంటే కొంత మందికి తాము గొప్పయోగులై చుట్టుపక్కల వారిని ఆశ్చర్య చకితుల్ని చేయాలనీ, వారిపై పెత్తనం చెలాయిస్తే అందరూ తమకభిమానులుగా మారి గౌరవిస్తారని భావిస్తారు. ఇది స్వచ్ఛ మైన ఆకాంక్ష అవుతుందా!

ఉదాహరణకి నీవిటువంటి ఉన్నతస్థాయికి ఎదిగి పోయావనుకో. ఆ స్థాయినుంచి నిన్ను నీవు చూసుకొని నవ్వు కుంటావు. అది ఒక వ్యంగ దరహాసం. ఎందువల్లనంటే నీకు నీవే చాలా చిన్నగా, అత్యల్పంగా, పనికిరానివాడివిగా వున్నట్లు భావిస్తావు. ఆ తర్వాత పరిస్థితులు మెరుగవుతాయి. అయితే అలా జరగటానికి ఎంతో కాలం పడుతుంది. అంటే నీలో జరుగుతూన్న ప్రక్రియలన్నీ స్వలాభాపేక్షతో కూడుకొని ఉంటాయి. నువ్వొక్క విసురులో విశ్వపుటంచులను అందుకోవాలని ఎగురు తావు. వెనుతిరిగి చూసుకుని ఏమైనా పురోగతి ఉందేమోనని ఆశిస్తావు. కొద్దిపాటి సంతృప్తి కోసం ఎదురు చూస్తావు. కేవలం

అది నీ అంచెనా మాత్రమే అయినప్పటికీ "ఆహా నాఆకాంక్ష ఎంతగొప్పగా ఉంది", అని అనుకుంటావు. అంతే.

అనువాదం: ఎ. వేంకట్రామ శాస్త్రి, ఎ. ప్రభావతి

∴

అమందానందం

నిన్ను నీవు నిష్పక్షపాతంగా పరిశీలించుకున్నట్లయితే కోరికల వలన కలిగే ఆనందము బుద్బుదప్రాయమైనదని తేలిపోతుంది. అప్పుడు నువ్వు చేయవలసిన పని ఒక్కటే. కోరికలకు ఒక నమస్కారం పెట్టి వాటిని తిరస్కరించుకుంటూ పోవాలి. ఇక కోరికలు నీ జోలికి రావు. అల్లంత దూరాన వుంటాయి. అప్పుడు నీవు నీ అంతరంగంలోకి ప్రవేశించిన యెడల అక్కడ నీకు దైవదర్శనము కలుగుతుంది. — సంపాదకుడు

ఇందులో ఒక సూక్ష్మమున్నది. అది ఆనందం.. స్వచ్ఛమైన ఆనందమేమిటో తెలుసుకో, భగవంతుణ్ణే తెలుసుకుంటావు. అని శ్రీఅరవిందులు "మెరుపులు — తళుకులు" అనే పుస్తకంలో వ్రాసారు. ఆ నిర్మాలానం దాన్ని తెలుసుకోవడమెలా?

మొట్టమొదటగా నీవొక విషయాన్ని అవగాహనం చేసుకోవాలి. కోరికలను పెంచుకోవడం, వాటిని పరితృప్తిగావించుకోవడం ద్వారా కలిగే సంతోషం చాలా అస్పష్టంగా, అసంపూర్ణంగా, అసంతృప్తిగా, సంకరంగా ఉంటుందనే విషయం గ్రహించడం. ఇది మొదటి మెట్టు.

విచక్షణాపరులు ఏవి కోరికలో చక్కగా గ్రహించి వాటిని పరితృప్తి గావించే ప్రయత్నాలేమీ చేయకుండా జాగ్రత్త వహిస్తారు. అంతటితో ఊరుకోక వాటిని తిరస్కరించేయాలి.

అలా చేయటంవల్ల కలిగే ప్రథమఫలితాన్ని బుద్ధభగవానుడు తన ప్రథమ నీతిసూత్రంగా పేర్కొన్నాడు. వాంఛాపరిపూర్తి చేయటంకంటే దాన్ని జయించి వదిలించుకోవటంలోనే అధిక మయిన ఆనందముంది. మంచి స్థిరబుద్ధి గల సాధకుడు తప్పని సరిగా కొద్దికాలం గడవంగానే ఈవిషయాన్ని గ్రహిస్తాడు. ఒక్కొక్కసారి చాలా త్వరగానే తెలుసుకుంటాడు. ఒక కోరికను జయించడంలో గల ఆనందం దాన్ని పరితృప్తి చేసుకోవడంలో కలిగే తాత్కాలిక, మిశ్రిత స్వల్పానందంతో పోల్చడానికే వీలు లేనంత ఘనతరమైనదని. ఇది రెండవ మెట్టు.

ఈ విధమైన క్రమశిక్షణ కొనసాగిస్తూ ముందుకు వెడితే అనతికాలంలోనే కోరికలు నీనుండి వైదొలగిపోతాయి. నిన్నే రకంగానూ వేధించవు! అప్పుడిక స్వేచ్ఛగా నీ అంతరంగంలోకి లోతుగా చూసుకొని ఉన్మీలనం పొంది ఆకాంక్షించగలుగుతావు.

ఆనందప్రదాత అయిన ఆ సర్వేశ్వరుని కృపాకటాక్షం కోసం, నీవు మనస్ఫూర్తిగా సర్వసమర్పణాభావంతో, ప్రతిఫలా పేక్ష ఏమాత్రం లేకుండా, ఆత్మార్పణ చేసుకోగలిగితే నీకు ఈ దివ్యానందపు మధురభావన, సుఖదాయకంగా, సన్నిహితంగా, ఉజ్జ్వలంగా హృదయాన్ని నింపగలదు. అదే కలుగబోయే దివ్యా నందోదయానికి వేగుచుక్క. ఆ తర్వాత మార్గం అంతా సులభమే.

ఈ దివ్యానందం ఏ బాహ్యాపరిస్థితులపైగాని, అనుకూల ప్రతికూల పరిస్థితులపైగాని ఆధారపడదు. అది జగత్కారణమైన లీలతో సంసర్గము.

*

అయితే అనాసక్తత లేకుండా కలిగే దివ్యానందం చాలా ప్రమాదము. అది తృటికాలంలో వికటించగలదు. అందువల్ల అనాసక్తభావాన్ని వృద్ధిచేసుకోకుండా ఆనందాన్ని అన్వేషించడం మంచిది కాదు. ప్రథమంగా ద్వంద్వాతీతంగా ఉండటం నేర్చుకోవాలి. సుఖ దుఃఖాలకి, బాధ ఆనందాలకి, ఉత్సాహ నిరుత్సాహాలకి, అతీతంగా ఉండటం నేర్చుకుంటే క్షేమంగా ఆనందపుటంచుల కోసం ఆకాంక్షించవచ్చు.

అనాసక్తత నీలో స్థిరపడనంత కాలం ఆనందం వచ్చినా దాన్ని మామూలుగా కలిగే సంతోషాతిశయమేనని భ్రాంతిపడతావు. నిజానికి ఈ రెండింటికీ ఏమాత్రం సామ్యత లేదు. ఒకదానితో ఒకటి పొరబడటానికి వీలులేకపోవటమే కాక దాని వక్రరూప మని కూడ అనుకోటానికి వీల్లేదు. రెంటికీ పూర్తి వ్యతిరేకము. ఒకటి వస్తే తేలిగ్గా రెండవదానికి మారవచ్చని అనుకోకూడదు. అందువల్ల నీవీ మార్గంలో క్షేమంగా ముందుకు సాగాలంటే శాంతినీ, సంపూర్ణ సుస్థిరతనూ, సమతనూ, చైతన్య విస్తరణనూ సంప్రాప్తించుకోవాలి. కోరికలపై పూర్తి అవగాహన పెంచుకొని ఇష్టాయిష్టాలు, అనుబంధం మొదలైన వాటినుంచి పూర్తిగా విముక్తి చెందాలి. ఈ మార్గంలో సాగాలంటే పాటించవలసిన ప్రథమ నియమం ఇది. ఇక నీ బాహ్యాంతర సమతకు ఎట్టి ప్రమాదము వాటిల్లదు.

అనువాదం: ఎ. వేంకట్రామ శాస్త్రి, ఎ. ప్రభావతి

∴

నీపై విజయం – ప్రపంచానికంతటికీ జయం

యోగమనగా నీపై నీవు విజయమును సాధించట మంటారు. నీలోని ఒక దుర్గుణాన్ని, వ్యసనాన్ని జయించటం వలన దాని ఫలితములు ప్రపంచమంతటా ప్రసారమౌతాయి. నువ్వు ప్రపంచానికి నిజంగా సహాయం చేయదలచుకుంటే, దుర్గుణా లని ఒక దాని తరువాత మరొకదానిని నీలో జయించి పుణ్యం కట్టుకో!

— సంపాదకుడు

నీ అంతరచైతన్యంతోనూ, నీ జ్ఞానంతోనూ ఒక కోరికను అధిగ మించి, తప్పక నిర్మూలించ గలవు. ఈ విధంగా నీలోని మంచి తనం, చైతన్యం, తేజం, జ్ఞానం కలిసి కోరికను విలీనం చేసిన ప్పుడు ఆ కోరికను సంతృప్తి చేసిన దానికంటే ఎన్నో రెట్లు అధి

కమైన ఆనందాన్ని వ్యక్తిగతంగా చవిచూస్తావు. అంతే కాకుండా దానివల్ల ప్రపంచంలో అద్భుతమైన పరిణామాలు కలుగుతాయి. అవి నీకు ఊహాతీతములు. నీవు సృష్టించిన భావనా తరంగాలు వ్యాపించడం ప్రారంభిస్తాయి. పైగా వాటి పరిమాణం పెరుగుతూంటుంది. నీలో నీవు సాధించిన ఈ ఘనవిజయం చిన్నదే అయినా అది ప్రపంచాని కంతటికీ లాభదాయకమవుతుంది. నేను ఇంతకుముందు చెప్పినదదే. వ్యక్తి స్వభావం మారకుండా బాహ్యాడంబరాలకోసం, పేరు ప్రఖ్యాతుల కోసం విద్యాలయాలు, వైద్యాలయాలు కట్టించిన దానికంటె కూడా, ఒక వ్యక్తి తనలో అధిగమించిన ఈ చిన్న విషయాలే ప్రపంచంలో ఘనవిజయాలు సాధించగలవు. అయితే ఈ విషయాలు గర్భితంగా ఉంటాయి కనుక వాటినిగురించి ఎవరికి తెలియదు.

నీవు ప్రపంచానికి మేలుచేయాలనుకుంటే నీలో నీవు చిన్నచిన్న విజయాలను నిష్కామంగా సాధించాలి. ఇటువంటి వాటిని ఎన్ని సాధిస్తే ప్రపంచానికి అంత మేలు. అయితే ఇవి మరీచిన్నవి కాబట్టి ప్రపంచమంతటికీ సరిపోవు.

ప్రపంచమంతా మారాలంటే కోట్లకొలదీ వ్యక్తిగత విజయాలు కావాలి. అయితే నీలో నీవు సాధించిన విజయం మొత్తంతో పోలిస్తే అత్యల్పమే అయినా, అది మిగిలిన వాటితో కలిసి పనిచేస్తుంది. ప్రపంచంలో ఒక నూతనావకాశాన్ని కలిగించినట్లే.

స్వేచ్ఛానువాదం ఎ.వెంకట్రామ శాస్త్రి, ఎ. ప్రభావతి

∴

శ్రీమాత సమగ్ర వీక్షణము

"తానొకటి తలచిన దైవమొకటి తలచును", ఇది మనకు నిత్యం జరిగే వ్యవహారమే. ఎందుకని ఇట్లా జరుగుతుంది? మన హ్రస్వ దృష్టి, సంకుచిత భావములే దీనికి హేతువులు. ఈ విషయాన్ని శ్రీమాత అనంత దృష్టితో విశ్లేషించి మనకు తెలియ జేసారు. చిత్తశుద్ధిగల ఒక మనిషి ద్వారా దేవేచ్ఛ ఏవిధంగా నెరవేరుతుందో శ్రీమాత చాలా స్పష్టంగా సెలవిచ్చారు.

కోరికలను ఎప్పటికీ పూర్తిగా తృప్తిపరచలేము. అది అసంభవము. పోనీ కోరికలను త్యజించగలమా అంటే అదీ చేయలేము — ఎందుకంటే ఒక కోరికను వదిలించుకుంటే ఇంకొకటి తయా రవుతుంది. ఒకవైపు నుయ్యి, మరొకవైపు గొయ్యి. అందుకని మనము కోరికలు లేని ఒక స్థితిని సాధించవలసి ఉంటుంది.

ఈ సందర్భంలో... మనం స్పష్టంగా అర్థం చేసుకోవల సిన విషయం ఒకటి వున్నది — దైవేచ్ఛ అంటే ఏమిటి? మానవేచ్ఛ (కోరిక) అనగా ఏమి? ఈమధ్యన కొన్ని రోజులుగా నాకు ఇటువంటి అనుభూతే కలుగుతోంది. మనస్సు నిశ్చలంగా వుంటుంది. ఏమాత్రం నోరు ఎత్తదు. అప్పుడు దైవేచ్ఛ నాశరీరం ద్వారా, ఈ భౌతిక పరికరాల ద్వారా దానంతటది అదే, చాలా చక్కగా నెరవేరుతుంది. ఇది చాలా సూక్ష్మదృష్టి. మొదట వెలు వడిన దైవేచ్ఛ ఉన్నదున్నట్లు వుండకుండా కోరికగా ఎట్లా మారిపోతుంది? దీనికి కారణాలు ఏమిటి? మనిషి యొక్క కోరికల ద్వారా దైవసంకల్పము ఎటుల కలుషితమవుతుందో చూద్దాము. అది కేవలము ఏదైనా ఒక అవసరం గాని ఒక వస్తువు కోసం ఆరాటపడటం కాని, ఒక దానితో అనుబంధం వలన జరిగేది మాత్రమే కాదు. ఆ విధంగా జరిగిన ప్రేరణ మాత్రమే కాదు. "ఇది దైవేచ్ఛయే కదా!" అని అనుకోవటం వలన గాని, పొరపాటు పడటం వలన కూడ అటువంటి ప్రేరణయే కలగవచ్చు.

మన దృష్టి చాల సంకుచితంగా, పరిమితంగా వుంటుంది. మనకి ఏదైనా కావాలనుకుంటే అది వెంటనే మనకి రావాలి అని అనుకుంటాము. కాని మనకు విశాల దృష్టి కనుక వున్నట్ల యితే, మనకి కలిగిన ప్రేరణ ఏకాకి కాదు కనుక దాని ద్వారా మరి కొన్ని స్పందనములు కూడ కలిగి అంతకంటే చాలా పెద్ద కార్యము నెరవేరే అవకాశమున్నది. నేను చెప్పింది మీకు అర్థమ యిందో లేదో తెలియదు కాని ఇది నా నిరంతరానుభూతి.

మన నిత్యకృత్యంలో జరిగే విషయాల్ని గురించి నేను చాలా స్పష్టంగా పరిశీలించాను. దైవేచ్ఛవలన, ఒక రకమైన స్పందన కలుగుతుంది. దానికి మనము మరియొక స్పందనమును జేర్చెదము. మనము పైనుంచి చూసిన యెడల అదికూడ అచ్చంగా దైవేచ్ఛ ప్రేరితమైన స్పందనము వలెనే కనబడుతుంది. కాని మన కోరిక, వెంటనే తృప్తి పొందదు. దాని బదులు మరియొక ఘన మైన కార్యము, వెంటనే కాకుండా కొంతకాలం తరువాత జరుగుతుంది. ఒక పెద్ద భవనాన్ని కట్టటంలాంటి బృహత్కార్యా లను గురించి నేను చెప్పటం లేదు. "ఇది నాకు కావాలి", అని ఎప్పుడూ జరుగుతూవుండే విషయాల్ని గురించే నేను చెపుతు న్నాను. నీకు ఫలానా వస్తువు కావాలి. అని నువ్వు ఎవరినైనా అడిగావనుకో. అప్పుడు అది అతనికి అర్థంకాక నీకు మరియొక వస్తువును ఇస్తాడనుకో. అటువంటప్పుడు మన విశాలదృష్టి చెదిరిపోకుండా చూసుకోవాలి. ఒకవేళ చెదిరిపోయినట్లయితే మనకి విసుగు, అసంతృప్తి కలుగుతాయి. దైవేచ్ఛను మనము చక్కగా గ్రహించ లేదేమో అనిపిస్తుంది. ఈ "గ్రహించలేమి" తనమే కోరికగా పరిణమిస్తుంది. అచ్చంగా కోరికయే కానప్పటికి, అదే విధంగా స్పందించి, దైవము యొక్క ప్రథమ స్పందనమును గల్లంతుపరుస్తుంది.

మనకి యథార్థమైన దృష్టి వున్నట్లయితే అటుల జరగదు! మనకి కలిగిన కోరికల వలన, వెంటనే అది తీరుటకు బదులు అసలు జరుగ వలసిన మరియొక ఫలితము కలుగుతుంది. నేను చెప్పింది మీకు స్పష్టంగా అర్థం అవుతోందో

లేదో — ఇది కొంచెం జటిలమైన విషయము! దైవేచ్ఛ వలన కలిగే స్పందన ములను, కోరికల వలన కలిగే స్పందనములను వేరుచేయ గలిగిన విశ్లేషణ ఇదియే. విశాలమైన సంపూర్ణ దృష్టి వలన కోరికల స్పందనలను తిరస్కరించ గలుగుతాము. అంతకంటే మహత్తరమైన దూరపుచూపు ఉదయిస్తుంది.

ఈ విషయాన్ని నేను మళ్ళీ నొక్కి చెబుతున్నాను. కోరికనేది నైతికంగా అభిలాషనీయము కాదు, చాలా చెడ్డది అనే వాదనకు స్థానము లేదు. మీకు ఇంకా తమాషా అయిన విషయాన్ని చెప్పమంటారా. మంచిచెడులు, తప్పొప్పులు, ఉచ్ఛ నీచములు అని మనుషులు సాధారణంగా అనుకునే భావము వాస్తవము కాదు! ఈ ద్వంద్వములకు భేదము స్పందనముల విలక్షణత్వములోనే వున్నది. అయితే "విలక్షణత్వము" అనే మాటను నేను చాలా జాగ్రత్తగా ఉపయోగిస్తున్నాను — ఒకటి చిన్నది, ఒకటి పెద్దది అని సూచించుటకు కాదు. దీనిని విలక్షణ త్వము అనవలెనో లేక తీక్షణత్వము అనవలెనో నాకు తెలియదు. శాస్త్రజ్ఞులు రెండు రకముల స్పందనములను ప్రత్యేకించుటకు ఎటువంటి భాష ఉపయోగిస్తారో మరి.

మనమిప్పుడు ఒక విషయమును గుర్తించవలసి యున్నది. ఇది స్పందనములను గురించినది. దైవము నుండి అరుదెంచినట్లి యితే అది ప్రయోజనకారిగా వుంటుంది. ప్రశాంతత, వెలుగు, కర్మశీలత్వము దాని లక్షణములు. కోరిక వలన కలిగిన స్పంద నములు వేరు. అవి పరిస్థితులను వక్రీకరించి, చీకటి గావించి గందరగోళం చేస్తాయి. మేఘావృతంచేసి హింసాప్రవృత్తులను క్రూరమైన పరిణామాలను కూడా సంభవింప జేయవచ్చును. మానసిక ఉద్రేకము లేకపోయినప్పటికి ఈ విధంగా జరుగుతుంది.

భౌతిక రంగము: ఈ రెండు రకముల స్పందనములు పరస్పర ఘర్షణము చెంది, మనస్సు యొక్క ప్రసక్తి లేకపోయినప్పటికి అజ్ఞానపు స్పందనముల వలన ఈ విధమైన పర్యవసానము కలుగుతుంది. ఈ విధమైన స్పందనములు అజ్ఞానపు స్పందనములు.

వాటి పరిధి చాలా చిన్నది, సంకుచితము, పరిమితము — అత్యల్పము. ఇది మానసిక శక్తుల (చెడ్డవాళ్ళ) ద్వారా కాక కేవలం స్పందనముల ద్వారానే జరుగుతుంది.

.(చాలాసేపు నిశ్శబ్దం)

కోరిక అనగా ఒక స్పందనము. కోరికల వలనే కష్టములు వస్తాయని అంటారు. అది నిజమే అనిపిస్తోంది. కోరిక అనగా దైవేచ్ఛకు చేర్చిన ఒక స్పందనము అన్నమాట. అటుల కానప్పుడు, దైవేచ్ఛయే కలుషితము కాకుండా ప్రకటమైనప్పుడు దానికి ఇక ఎటువంటి అడ్డంకులు ఉండవు. అది వెంటనే కార్యరూపము తాలుస్తుంది. అటుల గాక ఆలస్యము, మార్గములోని అవరోధములు, తికమకలు, ఫలితము దక్కక పోవుట మొదలైనవి, కోరికల మాలిన్యము వలన కలిగిన ఫలితములే.

దీనికి ఉదాహరణలు మనం రోజూ చూస్తూనే వుంటాము. బాహ్యారంగములో జరిగే ఒక చిన్నఅంశాన్నే చూద్దాము. ఇక్కడ "బాహ్యా" అనుటవలన మనమొక తప్పుగా భావించరాదు. ఉన్నత చేతననుండి, సత్యచేతననుండి నీవు ఒక మనిషితో "వెళ్ళు" అని చెప్పావనుకో — ఊరికే నేను ఒక దృష్టాంతాన్ని మాత్రమే ఇస్తున్నాను — "నీవు వెళ్లి అతనిని కలుసుకొని ఆ పనిని చేయ" మని చెప్పావనుకో. అతను నీ మాటను సవ్యంగా గ్రహించి, అంతరంగంగా నిశ్చలుడై, సమర్పణ భావంతో ఉన్న యెడల, అతడు వెంటనే వెళ్లి ఆమనిషిని కలుసుకొని, వార్తను అందజేస్తాడు. ఆవిధంగా ఆకార్యము ఎట్టి ఒడుదుడుకులు లేకుండా జరిగిపోతుంది. ఒకవేళ ఆ మనిషి 'అతితెలివి' గలవాడైతే విశ్వాసము లోపించిన వాడైతే, అహంకారము, అజ్ఞానముల ఒరవడికి లొంగిపోయే వాడైనట్లైతే, ఇక మన కార్యానికి స్వస్తి చెప్పవలసినదే. ఎందుకంటే వాడికి కష్టాలే కనపడతాయి. మొండి సమస్యలు ఎదురవుతాయి. వీటన్నిటితోటి అతను తికమకపడి సతమతమవుతాడు. ఆ మనిషి అటువంటి వాడయితే ఈ విధంగా జరగనే జరుగుతుంది. దేవేచ్ఛయే పూర్తిగా వున్నట్ల

యితే అంతా సవ్యంగానే నడుస్తుంది. అటుల కానిచో అసత్యపు మిశ్రితమును పట్టి తికమకలు కలుగవచ్చు. వెంటనే పనికాదు. ఆలస్యమైనా పరవాలేదు కాని అది సక్రమంగా కాక దోషితమై, మారిపోయి, క్షీణించి చివరికి ఆకార్యము నెరవేరనే నెరవేరక పోవచ్చును. కార్యసాఫల్యతకు, అసలు జరుగక పోవుటకు మధ్యన చాలా శ్రేణులున్నాయనుకోండి — మనసువలన కోరిక లవలన కలిగే తికమకలు. ఇటువంటి దోషాలే లేకపోయినట్ల యితే కార్యము వెంటనే జరిగిపోతుంది. ఇటువంటి ఉదాహార ణలు ఎన్నైనా వుంటాయి. వెంటనే ఫలించటం కూడ జరుగు తుంది. అప్పుడందరూ "నువ్వు ఒక అద్భుతమైన పని చేసావు" అంటారు (miracle). కాని అటువంటిది ఏం లేదు. అది అద్భుత మేమి కాదు. ఆ మధ్యవర్తి తన స్వంత తెలివితేటలని జేర్చలేదు కనుక అట్లా జరిగింది అంతే.

ఇది మీకు స్పష్టంగా అర్థం అయిందో లేదో తెలియదు. అత్యల్పమైనవిషయం నుండి ప్రపంచస్థాయిలో చేయవలసిన కార్యమువరకూ ఇదే వరస. తగిన మధ్యవర్తి ద్వారా ప్రపంచక స్థాయిలో ఈవిధంగా జరిగిన కార్యములు చాలా వున్నాయి. అవి ఎటుల జరిగెనో, ఎందువలన జరిగెనో ఎవ్వరూ అర్థం చేసుకో లేరు — ఆ విధంగా ఋజుమార్గంలో చక్కగా జరిగిపోతాయి అంతే. ఈ ఋజుత్వమే లేని యడల ఎంత చిన్న పనైనా సరే ఒక బ్రహ్మరాక్షసిలా తయారవుతుంది.

అందుకని అత్యల్ప విషయం — ఒక చిన్న తలనొప్పి నివారణ దగ్గరనుంచి, ప్రపంచవ్యాప్తమైన బృహత్కా ర్యము వరకు అదే మంత్రం, అదే మార్గం.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి

∴

సంక్షిప్తంగా...

నువ్వు నిష్పక్షపాతంగా సత్యమునే ఎంచుకుంటూ వ్యవహరించుట, నిష్కామంగా కర్మలను ఆచరించుట అనేవి యథార్థచేతనకు, ఆత్మనిగ్రహమును పొందుటకు చాలా ముఖ్యమైన విషయాలు. నిరంతరం సత్యమునే గ్రహించి దానిని ఆవిష్కరిస్తూ వుండాలి. ఏ ఒక్క వస్తువుమీద గాని మనిషిమీద గాని సంఘటనమీద గాని అభిమానము పనికిరాదు. వాటిపట్ల పక్షపాతరహితంగా వ్యవహరించాలి. ఇది సాధారణ మానవులకు కష్టసాధ్యము. అయినప్పటి ప్రియాప్రియములు లేకుండా కేవలం సత్యమునందే ప్రతిష్ఠితమైన మార్గమును అవలంబించటము, నిష్పక్షపాతంగా ప్రవర్తించటము నేర్చుకోవాలి. సత్యానుసారంగా కర్మలను ఎంచుకొనినప్పుడు వాటిని మరి నిష్పక్షపాతంగా నిర్వహించాలి కదా.

ఎదలో ఆకాంక్ష అనే ఒక నిత్యాగ్నిహోత్రాన్ని ఉజ్జ్వలంగా వెలిగింప చేయాలి. నీకు ఏదైనా ఒక కోరికగాని, ఒకదాని మీద మోజుగాని, ఒకమనిషి మీద అభిమానముగాని అంకురించిన వెంటనే వాటిని ఈఅగ్నిహోత్రంలో వ్రేల్చాలి. నీవు నిరంతరం ఈవిధంగా చేసావంటే నీ అంతరంగంలో సత్య చేతన మెల్లిమెల్లిగా మెరవటం మొదలుపెడుతుంది. మొదట్లో అది నీ కోరికలు, అభిమానాలు, ఆకర్షణలు, ప్రియముల చాటున, చాలా వెనక మిణుకుమిణుకుమంటూ వుంటుంది. ఈ సందడి వెనకకు వెళ్లి, అక్కడ చాలా ప్రశాంతంగా, అచంచలంగా, నిశ్చ లంగా రాణించే యథార్థ చేతనను కనిపెట్టాలి.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీప్రసాదమ్మ

∴

ఆరోగ్యపత్రము

జిహ్వాచాపల్యాన్ని జయించటం ఎలా? మానవ జీవితం కోరికల వలయం. కోరికలే మానవుని ప్రధాన వ్యాపకాలైతే అభివృద్ధి ఎక్కణ్ణుంచి వస్తుంది? ఈ వలయంలోంచి బయటపడే మార్గం కనిపెట్టాలి. ఉదా: తిండి సంగతే తీసుకొందాం. కొంతమంది బుద్ధి నిరంతరం తిండి మీదనే ఉంటుంది. తినేందుకు ఏం దొరుకుతుంది? ఎంతసేపవుతుంది? మొ॥ ఆలోచనలే మనసులో దొర్లుతూవుంటాయి. అది నశించాలంటే తిండి ప్రసక్తే ఉండ రాదు. తిండి దొరికినప్పుడు తింటావు. లేనప్పుడు తినవు. అంటే తిండి విషయంలో ఉదాసీనత వహించాలి. మనిషిలో సమత నెలకొనాలి. అంతే గాని తిండిని గురించే ఆలోచిస్తూ ఉండ కూడదు. అట్లాగని తిండిమానేయనూ మానేయకూడదు. తిండి మానేయటం మంచిదే అనే సన్యాసివాదన కూడ పనికి రాదు. తిండిపోతుతనము ఎంత ప్రమాదమో ఉపవాసాలు కూడ అంత ప్రమాదమే. తిండి విషయమును నీ మస్తిష్కములోంచి బహిష్క రించేయాలి. దానికి సూదిమొనంత స్థానము కూడ ఇవ్వరాదు!

అయితే ఇది చెప్పినంత తేలిక కాదు. నీ అంతరంగం లోని చైత్యపురుషుని (నీ ఆత్మ) స్పర్శను పొందటమే దీనికి ఉపాయము. అప్పుడు నీకు ఇటువంటి విషయాలు ఎంత అల్పమై నవో తెలిసిపోతుంది.

*


నీకు కావలసింది తిండి విషయంలో నిర్లిప్తత. అంతే గాని తిండి తగ్గించటము లేక పూర్తిగా మానివేయటం వంటి వైపరీత్యాలు పనికిరావు. శరీరపోషణకు, ఆరోగ్యమునకు తగినంత ఆహార మును నిర్లిప్తంగా, ఉదాసీనత వహించి తినాలి.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీప్రసాదమ్మ

∴

మనిషి యొక్క స్తరములు

(నిన్ను నీవు తెలుసుకో — V)



అఖిల

అఖిల భారత పత్రిక

ఏప్రిల్ 2000

మున్నుడి

ఈ సృష్టి మన భౌతిక నేత్రాలకు కన్పిస్తున్న పదార్థమయ జగత్తుతో సరి కాదు. ఈ భౌతిక భూమికలకు పైన యితర భూమికలున్నాయి. అవి అతిభౌతిక భూమికలు — ప్రాణభూమికలో ఎన్నో పొరలు, అలాగే మనోభూమికలో ఎన్నో పొరలు, అతి మానస చేతనలో పరమపురుషుని ఆనంద చైతన్యశక్తి దశలో ఎన్నో పొరలూ ఉన్నాయి. ఈ పదార్థమయ జగత్తు యొక్క స్థితికి, గతికి మూలములు ఆ అతిభౌతిక భూమికలే. అక్కణ్ణుంచి నిరంతరం ఈ భూమ్మీదకు వర్షించే శక్తులే ఈ జగజ్జీవనమునకు హేతువులు; దానిని అజ్ఞాత స్థాయి నుండి ధగధగాయమైన మహోన్నత స్థితికి పరిణమింప జేస్తాయి. దాని ముందర మానవ మేధ ఒక మిణుగురు పురుగు మాత్రమే

ఆ పరమ జ్యోతిస్సునకు ఈ సాంద్రతమోమయమైన పదార్థ స్థితికీ నడుమ ఆశ్చర్యకరమైన చైతన్యభూమికలు నిచ్చెన మెట్లలాగే వున్నాయి.

రాబోయే పుటల్లో ఈ విషయానికి సంబంధించిన శ్రీఅరవిందుల వివరణలు చూస్తాం.

∴

SRI AUROBINDO AND THE WORLD-STAIR

In a mystical barrage of dynamic light
He saw a lone immense high-curved world-pile
Erect like a mountain-chariot of the Gods
Motionless under an inscrutable sky.
As if from Matter's plinth and viewless base
To a top as viewless, a carved sea of worlds
Climbing with foam-maned waves to the Supreme
Ascended towards breadths immeasurable;
It hoped to soar into the Ineffable's reign:
A hundred levels raised it to the Unknown.
So it towered up to heights intangible
And disappeared in the hushed conscious Vast...
A Seer within who knows the ordered plan
Concealed behind our momentary steps,
Inspires our ascent to viewless heights
As once the abysmal leap to earth and life.
His call had reached the Traveller in Time.
Apart in an unfathomed loneliness,
He travelled in his mute and single strength
Bearing the burden of the world's desire.
A formless Stillness called, a nameless Light.
Above him was the white immobile Ray,
Around him the eternal Silences.
No term was fixed to the high-pitched attempt;
World after world disclosed its guarded powers,
Heaven after heaven its deep beatitudes,
But still the invisible Magnet drew his soul.
A figure sole on Nature's giant stair,
He mounted towards an indiscernible end
On the bare summit of created things.

మనిషి యొక్క స్తరములు

నిన్ను నీవు తెలుసుకో - V

శ్రీఅరవిందుల ప్రవచనములు

అనుబంధం



శ్రీఅరవిందులు

చిత్ యొక్క వివిధ భంగిమలు

చిత్ అనగా మూలచైతన్యము — వికారము చెందని శుద్ధ చైత న్యము. దాని విభిన్న అవతారములను ఈ సృష్టిలో మనం చూడగలము. వాటిలో మనస్సు ఒకటి. దానికి పైన సత్య చైతన్యమున్నది. మనిషి జ్ఞానము మనస్సుతో సరి. అందుకని అతని జీవితానికి సాధారణంగా మనస్సే మకుటము. కాని ఆ సత్యలోకంలో సత్య జ్ఞానమే రాణిస్తుంది. ఆ అతిమానసము **(supermind)** *ఇక్కడ ఆవిష్కారమైనప్పుడు మనిషికి ఇక ఈ గుడ్డి మనస్సుతో పని లేదు. అప్పుడు అతిమానస నాగరిక తను మనం చూచెదము.*

— సంపాదకుడు

ఈ సృష్టి అంతయు దశల వారీగా చిత్ పొందిన అభివ్యక్తి — పరిణామ ధర్మము ననుసరించి దాల్చిన వివిధ రూపములు. ఈ దశలన్నీ మనిషిలో మనకు కనబడతాయి. ఇవియే మనిషి కంటే పూర్వదశలైన అధోరూపములు. అటులనే మనస్సుకంటే ఉన్నత మైన ఊర్ధ్వ భూమికలు కూడా కలవు. అచ్చట సృష్టిలో సర్వ వ్యాపియైన చిత్పదార్థము ఇతర భంగిమలను తాలుస్తుంది. ఇతర ప్రకారములుగా నర్తిస్తుంది. ఇతర ధర్మముల ననుసరించి, ఇతర క్రియా విధానములతో ప్రవర్తిస్తుంది. మనస్సుకు పైన మన ప్రాచీన వేద ఋషులు దర్శించిన సత్య భూమిక కలదు. దాని ధర్మములు మన ప్రపంచపు వాటికంటె భిన్నములు. మనస్సు కంటె భిన్నమైనవి. అక్కడ ఒక పనిని సంకల్పించిన వెంటనే అది నెరవేరుతుంది. ఆ సత్యలోకంలో మనస్సుకంటే అతీతమైన గొప్పశక్తులు — సత్యజ్యోతిశ్శక్తులున్నాయి. అవి సత్యములోనే వర్తిస్తాయి. వాటి క్రియలు సత్యము ననుసరించిచే వుండును. మానవుడు ఏ విధంగా అయితే తన హేతుబుద్ధితోను నైతిక భావములతోను తన జాంతవిక ప్రకృతిని నియంత్రించి జీవిత మును నిర్వహించునో, అదే విధంగా ఈ శక్తులు మానవ లక్షణ ములైన మనస్సు, తార్కిక బుద్ధి, ఆవేదనలు, ప్రచోదనలు, సంవే

దనలను నియంత్రించి లౌకికజీవితంలోకూడ సత్యమునకే పెద్ద పీట వేస్తాయి. సంకల్పము వెంటనే నెరవేరుట సత్యలోకపు ధర్మము. అదే విధంగా ఈ ద్వంద్వములన్నీ will and reason, instinct and impulse, desire and experience, idea and reality పరస్పర పూరకములే గాని భేదప్రతిష్ఠితములుగా వుండవు.

ఈ సత్యభూమిక ద్వారా అంతకంటే పైనగల ఇతర భూమికలను కూడా మనం జేరుకోగలము. అక్కడ మనకు సాక్షాత్ చిత్తే — ఈ చిత్రవిచిత్ర సృష్టికంతకు ఆధారభూతమైన, చేతనాస్తరముల కన్నిటికి మూలస్రోతస్సు అయిన 'చిత్' దర్శన మౌతుంది. అక్కడ ఏకత్వము, సామరస్యములే తప్ప ఘర్షణా వైరములు కానరావు. There will and knowledge and sensation and all the rest of our faculties, powers, modes of existence are not merely harmonious, concomitant, unified, but are one being of consciousness and power of consciousness. ఈ చిత్తు క్రింది స్తరములలోకి దిగినప్పుడు తదనుగుణమైన భంగిమలను పొందు తుంది. సత్యస్తరములో అది అతిమానసము (supermind) గాను మానసికస్తరములో తార్కికబుద్ధి, సంకల్పము, ఆవేశము, సాంవే దనలుగాను పరిణమిస్తుంది. ఇంకా క్రింది స్తరములలో అంధ కారబంధురమైన ప్రాణిక లేక భౌతిక ప్రవృత్తులు, ఆవేదనలు, అలవాట్లుగా మారుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహా శాస్త్రి

∴

చైతన్య స్తరముల పరస్పర ప్రవేశము

మనకు కావలసినది 'పరలోక ప్రాప్తి' కాదు. రక్తిలేని ముక్తితో మనకు పనిలేదు. భూలోకమే అన్ని లోకాలకు ముఖ్యమని, అన్నిటికి కేంద్రమని అన్న ఉపనిషద్వాక్కును మనము విస్మరించ కూడదు. అందుకని ప్రాపంచిక జీవితము మనకు అంగీకారమే. ఈ సృష్టి అంతా భగవంతుని ఆవాసమే కనుక మనకు ఈ జీవితమంటే భయం లేదు. ప్రకృతిలో తెర వెనక దాగి వున్న పురుషుని మనము తెర ముందర ఆవిష్కరింప జేసి ఆయన సామ్రాజ్యమును ఇక్కడ ప్రతిష్ఠించ వలెను.

— సంపాదకుడు

ప్రతిస్తరంలోను భగవంతుని వ్యక్తము చేయుటయే నా లక్ష్యము. ఈ భూతలంపై ఉన్నత చైతన్యాన్ని, దివ్యచైతన్యాన్ని తీసుకొని రావడమే నా లక్ష్యం కాబట్టి ఈ ప్రపంచాన్ని త్యజించి, తప్పించుకొని పారిపోయి సచ్చిదానందం చేరువలో దివ్యానందానుభూతి పొందడమనేది నాకు గిట్టని పని. సాంప్రదాయ యోగాలు చాలా వరకు నా ఉద్దేశ్యానికి వ్యతిరేకములు. దీనికి నేను అనుకొనే కారణం, వారి దృష్టిలో ఈ ప్రపంచం అతితామసిక గుణీభూతమై, ఉన్నత చైతన్యాన్ని అందుకోవడానికి అత్యంత వ్యతిరేకత చూపడం — శ్రీ వివేకానందుల మాటల్లో అది కుక్కతోక ఎప్పుడూ వంకరే అన్నట్లు. కాని నాది ఉపనిషద్ మార్గం. *ఉపనిషత్తుల్లోని మూలాధారమైన సిద్ధాంతము ఏమిటంటే అన్ని ఉన్నత లోకాలకు పునాది ఈ భూలోకమే అనేది.* దీనినే సకల ఉపనిషత్తులు గొంతెత్తి చాటాయి. ఇంకా ముందుకు వెళ్ళి ఉపనిషత్తులు నిశ్శంకగా ఏమి చెబుతున్నాయంటే భూలోకం, ఇతర లోకాలు పూర్తిగా విభిన్నములు అనుకోవడమే 'అజ్ఞానం' అని. *దివ్యచైతన్యావిష్కరణ మరెక్కడో కాక ఈ భూమి పైననే జరగాలని గాఢంగా అవి ఆకాంక్షించాయి, విశ్వసించాయి.* కొంత మంది దీనిని వైయక్తిక సిద్ధిగా పరిగణించారు గాని, తరచి చూసి

నట్లయితే అందులో అంత కంటే విశాలమైన అర్థము గూడా గోచరిస్తుంది.

*

పరబ్రహ్మ సర్వజ్ఞాని. తన పరాప్రకృతితో ఏ అరమరికలు లేకుండా క్రీడించే శక్తి గల ప్రభువు, విభువు. మరి అట్టి పరమేశ్వరునితో మనలోని (చైత్య) పురుషుడు సమాగమం చెందాలంటే ఇప్పుడు మనం ఉన్న ఈ భూతలం పైననే మన గురి, మన ధ్యాస అంతా ఉన్నట్లయితే అది సాధ్యమయ్యే పని కాదు. ఎందుకంటే ఈ బాహ్యప్రపంచం ప్రధానంగా భౌతికము, పదార్థ మయము. దీనిపై నిమ్నప్రకృతికి సంపూర్ణ సార్వభౌమత్వము ఉన్నది. ప్రకృతి తన కార్యాల ప్రచండతాండవంతో తన స్థూల వైభవాలతో కనులను మిరుమిట్లు కొలుపుతూ వుండగా దివ్య పురుషుడు ఒక మూల దాగి కనిపించకుండా పోతున్నాడు. వ్యక్తిలోని చైత్యపురుష (అంతరాత్మ) భాగము పదార్థంలో ముకుళించి ఉన్న అంతర్లీనస్థితిలోంచి పైకి వెళ్ళే ప్రయత్నంలో (భౌతిక, ప్రాణిక ఉపకరణాలతో ప్రకృతి నింపిన అజ్ఞానమనే చీకటి నుండి ప్రకాశం వైపు రావడానికి) నిరంతర సమరం జరుగుతూ ఉంటుంది. ప్రకృతి ఎంతో సూక్ష్మంగా తన మనస్సుపై వేసిన తెరను తెలుసుకొనలేక మానవుడు తాను సర్వస్వతంత్రుడని విర్రవీగుతూంటాడు. మొక్కలు, జంతువులు, లోహాలు, ఖనిజాలు పూర్తిగా భౌతిక, ప్రాణిక చైతన్యాలకు లోబడిన వాస్తవంతో పోలిస్తే, మానవుని స్వాతంత్ర్యము కాస్త మెరుగే. కానీ అది ఇంకా నిజమైన స్వాతంత్ర్యము కానే కాదు. ప్రకృతిపై సార్వభౌమత్వం అంతకంటే కాదు.

మామూలుగా జ్ఞానయోగంలో సాధకుడికి ముక్తి ఎలా కలుగుతుందో చూద్దాం. ఇక్కడ కేవలం రెండు చైతన్య శ్రేణులను గుర్తించ గలిగితే చాలును — ఒకటి ఆధ్యాత్మికం, రెండవది అధిభౌతికమానసం. వీటి మధ్య శుద్ధ హేతువు చోటు చేసుకొని దృశ్యమానమైన ఈ ప్రపంచాన్ని కేవలం భ్రమగా కొట్టిపారవేసి అధిభౌతికమనస్సును దాటి నిజమైన దివ్యచైతన్యాన్ని చూడగల్గు

తుంది. అలా చూచినప్పుడు వ్యక్తి సంకల్పము ఈ ఉన్నత జ్ఞానంతో సాయుజ్యం పొంది నిమ్నప్రకృతిని నిరాకరించి, విసర్జించి, ఆ ఉన్నతస్థాయిలోనే ఉండి, దేహాన్ని, మనస్సును, చివరికి ప్రాణాన్ని కూడ త్యజించి వ్యక్తిగత స్థితి నుండి బయటపడి భగవంతునితో ఏకమైన సాయుజ్య ముక్తిని పొందగలడు. జ్ఞాన యోగానికి ఇదే పరమసత్యము కాదని, ఏకైక మార్గము కాదని తెలుసు. భగవంతుని సృష్టి చాల జటిలమైనదని కూడా తెలుసు. రెండుకంటే ఎక్కువ — అనేక చైతన్యశ్రేణుల ఉనికి కూడ తెలుసు. ఐనప్పటికీ వ్యక్తియొక్క ముక్తికి వాటి అవసరం లేదని వాదించి వాటిని గురించి ఏ మాత్రమూ పట్టించుకోదు. నిజంగా జరిగేదేమంటే, యోగి తన సిద్ధికి తనే ఈ విధంగా అడ్డంకిగా తయారౌతాడు. ఏలనంటే, ఇట్టి యోగసాధనలో కొన్ని ఆకర్షణీయమైన ఆత్మానుభూతులు కలుగుతాయి. ఇక ఆ ఆత్మరతి, నూతన శక్తులు, వీటిలో నిమగ్నుడై భగవంతునిలో సాయుజ్యానికి అఘాత మేర్పడుతుంది. దేవునివైపు నడిచే మార్గంలో పుంఖానుపుంఖంగా వలల్లో చిక్కుకొనే అవకాశాలేర్పడతాయి.

కానీ, మన (పూర్ణ) యోగంలో అంటారా, ప్రపంచమొక యథార్థస్థితి (భ్రమ కాదు). ప్రతి వస్తువులోనూ, చివరికి ప్రాణం లేని పదార్థంలో కూడా భగవంతుని ఉనికిని ఆమోదిస్తాము కనుక మనము వలల్లో చిక్కుకొనే ప్రశ్నే లేదు. మన యోగంలో కూడా భగవంతుని వైపు నుంచి మన ధ్యాసను ఇతరత్రా మళ్ళించే శక్తులనేకం తారసపడుతాయి, కాని వాటిని మనం ధైర్యంతో ఎదుర్కొని అధిగమించగలం. భౌతిక ప్రపంచం, మన ఉనికి ఇంత జటిలమైన సమస్యలే అయితే ఆ సవాళ్ళను ఎదుర్కొని ఆ సమస్యల ముడిని విప్పగలగాలి. అప్పుడే మనకు ఆత్మజ్ఞానము, పురుషుడు ప్రకృతితో క్రీడించే విధానాలు అన్నీ అవగతం అవుతాయి. మనం మన మానసిక శారీరక జీవిత గతులను ఏవిధంగా వశపరచుకొని రూపాంతరీకరింపబూనెదమో, అటులనే ఈ స్తరములన్నిటిని కూడా దైవం కోసం వశపరచుకోవాలి.

ప్రపంచంలో అన్ని దేశాల్లోను మనిషి యొక్క అసలు సత్యమును అన్వేషించి పట్టుకొనే ప్రయత్నం జరిగింది. ఒక రహస్యవిద్యగా రూపుదిద్దుకొంది. ఐరోపాలో యిది 'occultism' అనే నామముతో ప్రసిద్ధికెక్కింది. కాని ప్రాశ్చ్యదేశభాషలలో occultism అనే అర్థమును సూచించే పదము లేనే లేదు. ఎందు కంటే ఈ జ్ఞానము మనకి వింతగాగాక సాధారణమైనదిగానే గోచరిస్తుంది. పశ్చిమదేశస్థులకు అనిపించినట్లు అపరిచితమైన గారడీ విద్యకు మల్లె అనిపించదు. నిత్యజీవితానికి సత్యజీవితానికి మధ్యగల తెర పల్చగా వుండుట వలన, ఆ ప్రత్యేక జ్ఞానమంతా మనకి చాలా సన్నిహితంగానే గోచరిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సి.కె.రామనాథ చెట్టి

∴

చేతనాస్తరములనగా ఏమి?

మనకు తెలిసినది ఈ భౌతికలోక మొక్కటే. భౌతిక లోకపు ధర్మమునుసరించి, మూల సత్యము ధరించిన ఈ రూపమునే మనము 'ప్రకృతి' అని పిలిచెదము. అదే విధంగా ఇతర లోకములలో ఇతర 'ప్రకృతులు' వెలసి ఉంటాయి. ఇవన్ని మనలో కూడ కోశముల రూపములో ఉన్నాయి. మనోమయ, ప్రాణమయ, అన్నమయ కోశములు మన జీవితంలో చాల ముఖ్యపాత్ర వహిస్తాయి. అయితే మనకి వాటిని గురించి తెలియదు. యోగము ద్వారా వాటిని కనుక్కున్నప్పుడు మన జీవితమును, ప్రపంచ సంఘటనలను మనం స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతాము. మన జీవితం ఆత్మజ్ఞానంతో ప్రదీప్తమై ఈ అధోస్థాయి నుండి పెరిగి దివ్యజీవనం వైపు పురోగమిస్తుంది.

— సంపాదకుడు

మనం మొదట తెలుసుకోవాల్సిన విషయము — చేతనా భూమిక లంటే, సత్తాస్తరాలంటే మన అభిప్రాయం ఏమిటి? పురుష ప్రకృతుల సంబంధాల సాధారణ, సుస్థిర భూమిక, లేక వాళ్ళ సంబంధాలకు చెందినదానిలాంటిదే ఐన లోకమని, మన అభిప్రాయం. ఎందుకంటే మనం లోకమని చెప్పేది ఏదైనాగూడా, ఒక వ్యాపక సంబంధం యొక్క చారితార్థ్యం కంటె భిన్నమైంది కాదు, కాజాలదు. దాన్ని విరాట్ సద్వస్తువు, తన సత్తకూ, లేక తన సనాతన తథ్యం, లేక సంభావ్య శక్తికీ, తన సంభూతి శక్తులకూ మధ్య ఉత్పన్నం చేసింది, లేక స్థాపించింది. తన సంభూతితో అనేకవిధ సంబంధాలు గల, దాని అనుభవం పొందే ఈ సత్తనే, మనం 'ఆత్మ' అనీ, లేక 'పురుష' డనీ అంటాం. వ్యక్తిలో మనం దీన్ని 'వ్యక్తిగత ఆత్మ' అనీ, విశ్వంలో 'విరాట్‌పురుష'డనీ అంటాం. సంభూతిమూలతత్త్వాన్ని, దాని శక్తుల్నీ మనం 'ప్రకృతి' అంటాం. కానీ, సత్త, తద్గత చిచ్ఛక్తి, ఆనందమూ 'సత్' యొక్క ఉపాదాన భూతాలైన మూడు తత్త్వాలు. కనుకనే, ఈ మూడు మూలతత్త్వాలతో, ఒకవిధమైన సంబంధం పెట్టుకొనటంకోసం, ప్రకృతి ప్రేరేపించబడుతుంది. వీటికి ఒక విధమైన రూపం ఇవ్వటంకోసం అనుమతించబడుతుంది. వాటి (సంబంధ, రూపాల) ద్వారానే వస్తుతః, ఏ లోకస్వరూపమైనా నిర్ధారిత మవుతుంది. ఎందుచేతనంటే, సత్, స్వయంగానే, తన సంభూతికి ఉపాదాన మవుతుంది, సదా, అవుతూ ఉంటుంది. దీనితో శక్తికి సంబంధం ఉండేటట్లుగా దీన్ని ఒక పదార్థంగా రూపొందించాలిసి ఉంటుంది. శక్తి అంటే, నిశ్చయంగా ఒక సామర్థ్యం. ఆ సామర్థ్యమే పదార్థనిర్మాణం చేస్తుంది. ఆ పదార్థం ద్వారా, ఎన్నిలక్ష్యాలకోసమైనా పని చేస్తుంది. సాధారణంగా మనం 'ప్రకృతి' అని వ్యవహరించే వస్తువే శక్తి. లోకసృష్టి చేయటంలో గల లక్ష్యం, ఉద్దేశం సమస్త సత్తలో, సమస్త శక్తిలో, వాటి సమస్త కార్యకలాపంలో అంతర్నిహితమై ఉన్న చేతన ద్వారానే సాధించబడాలి. తనను తాను పొందటం, జగత్తులో తన ఉనికి (అస్తిత్వం) యొక్క ఆనందం అనుభవించటం ఆ

ప్రపంచంలో అన్ని దేశాల్లోను మనిషి యొక్క అసలు సత్యమును అన్వేషించి పట్టుకొనే ప్రయత్నం జరిగింది. ఒక రహస్యవిద్యగా రూపుదిద్దుకొంది. ఐరోపాలో యిది 'occultism' అనే నామముతో ప్రసిద్ధికెక్కింది. కాని ప్రాశ్చ్యదేశభాషలలో occultism అనే అర్థమును సూచించే పదము లేనే లేదు. ఎందు కంటే ఈ జ్ఞానము మనకి వింతగాగాక సాధారణమైనదిగానే గోచరిస్తుంది. పశ్చిమదేశస్థులకు అనిపించినట్లు అపరిచితమైన గారడీ విద్యకు మల్లె అనిపించదు. నిత్యజీవితానికి సత్యజీవితా నికి మధ్యగల తెర పల్చగా వుండుట వలన, ఆ ప్రత్యేక జ్ఞాన మంతా మనకి చాలా సన్నిహితంగానే గోచరిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సి.కె.రామనాథ చెట్టి

∴

చేతనాస్తరములనగా ఏమి?

మనకు తెలిసినది ఈ భౌతికలోక మొక్కటే. భౌతిక లోకపు ధర్మమునను సరించి, మూల సత్యము ధరించిన ఈ రూపమునే మనము 'ప్రకృతి' అని పిలిచెదము. అదే విధంగా ఇతర లోక ములలో ఇతర 'ప్రకృతులు' వెలసి ఉంటాయి. ఇవన్ని మనలో కూడ కోశముల రూపములో ఉన్నాయి. మనోమయ, ప్రాణ మయ, అన్నమయ కోశములు మన జీవితంలో చాల ముఖ్య పాత్ర వహిస్తాయి. అయితే మనకి వాటిని గురించి తెలియదు. యోగము ద్వారా వాటిని కనుక్కున్నప్పుడు మన జీవితమును, ప్రపంచ సంఘటనలను మనం స్పష్టంగా అర్థం చేసుకోగలుగు తాము. మన జీవితం ఆత్మజ్ఞానంతో ప్రదీప్తమై ఈ అధోస్థాయి నుండి పెరిగి దివ్యజీవనం వైపు పురోగమిస్తుంది.

— సంపాదకుడు

మనం మొదట తెలుసుకోవాల్సిన విషయము — చేతనా భూమిక లంటే, సత్త్వాస్తరాలంటే మన అభిప్రాయం ఏమిటి? పురుష ప్రకృతుల సంబంధాల సాధారణ, సుస్థిర భూమిక, లేక వాళ్ళ సంబంధాలకు చెందినదానిలాంటిదే ఐన లోకమని, మన అభి ప్రాయం. ఎందుకంటే మనం లోకమని చెప్పేది ఏదైనాగూడా, ఒక వ్యాపక సంబంధం యొక్క చారితార్థ్యం కంటె భిన్నమైంది కాదు, కాజాలదు. దాన్ని విరాట్ సద్వస్తువు, తన సత్తకూ, లేక తన సనాతన తథ్యం, లేక సంభావ్య శక్తికీ, తన సంభూతి శక్తులకూ మధ్య ఉత్పన్నం చేసింది, లేక స్థాపించింది. తన సంభూతితో అనేకవిధ సంబంధాలు గల, దాని అనుభవం పొందే ఈ సత్తనే, మనం 'ఆత్మ' అనీ, లేక 'పురుష' డనీ అంటాం. వ్యక్తిలో మనం దీన్ని 'వ్యక్తిగత ఆత్మ' అనీ, విశ్వంలో 'విరాట్‌పురుష'డనీ అంటాం. సంభూతిమూలతత్త్వాన్ని, దాని శక్తుల్నీ మనం 'ప్రకృతి' అంటాం. కానీ, సత్త, తద్గత చిచ్ఛక్తి, ఆనందమూ 'సత్' యొక్క ఉపాదాన భూతాలైన మూడు తత్త్వాలు. కనుకనే, ఈ మూడు మూలతత్త్వాలతో, ఒకవిధమైన సంబంధం పెట్టుకొనటంకోసం, ప్రకృతి ప్రేరేపించబడుతుంది. వీటికి ఒక విధమైన రూపం ఇవ్వటంకోసం అనుమతించబడుతుంది. వాటి (సంబంధ, రూపాల) ద్వారానే వస్తుతః, ఏ లోకస్వరూపమైనా నిర్ధారిత మవుతుంది. ఎందుచేతనంటే, సత్, స్వయంగానే, తన సంభూతికి ఉపాదాన మవుతుంది, సదా, అవుతూ ఉంటుంది. దీనితో శక్తికి సంబంధం ఉండేటట్లుగా దీన్ని ఒక పదార్థంగా రూపొందించాలిసి ఉంటుంది. శక్తి అంటే, నిశ్చయంగా ఒక సామర్థ్యం. ఆ సామర్థ్యమే పదార్థనిర్మాణం చేస్తుంది. ఆ పదార్థం ద్వారా, ఎన్నిలక్ష్యాలకోసమైనా పని చేస్తుంది. సాధారణంగా మనం 'ప్రకృతి' అని వ్యవహరించే వస్తువే శక్తి. లోకసృష్టి చేయ టంలో గల లక్ష్యం, ఉద్దేశం సమస్త సత్తలో, సమస్త శక్తిలో, వాటి సమస్త కార్యకలాపంలో అంతర్నిహితమై ఉన్న చేతన ద్వారానే సాధించబడాలి. తనను తాను పొందటం, జగత్తులో తన ఉనికి (అస్తిత్వం) యొక్క ఆనందం అనుభవించటం ఆ

లక్ష్యం కావాలి. ఏ ప్రపంచసత్త అయినా, సమస్త సంబంధాల్నీ, లక్ష్యాల్నీ ఈ ఉద్దేశంతో తనను తాను పరివర్తితం చేసుకోవాలిసి ఉంటుంది. జగత్-సత్, తన అస్తిత్వ దశల్ని, శక్తినీ, ఆనందాన్నీ వికసితం చేసుకొంటున్న సత్త. ఇది ఇక్కడ అంతర్లయన (involved) స్థితిలో ఉంటే, వీటిని వికసింప జేయాలిసి ఉంటుంది. అవి ఆవృతాలై ఉంటే, వాటిని వ్యక్తం చేయాలిసి ఉంటుంది.

అయితే, మనవెనక ఉన్నదానిపట్ల, నిరంతరం మన మీద ఒత్తిడి చేస్తున్న దానిపట్ల, సాధారణంగా మనం ఎందువల్ల సచేతనులమై ఉండటం లేదు? సాధారణంగా, మనం కేవలం మన భౌతికమైన ఇంద్రియాల్ని ఉపయోగించటమే, ప్రాణలోకాన్ని తెలుసుకొనలేకపోవటానికి కారణం. మనం, తరచుగా శరీరంలో, స్థూలప్రాణంలో, స్థూలమనస్సులో నివసిస్తాం. కానీ, ప్రాణలోకం, కేవలం ఈ ఇంద్రియాల ద్వారా మన సంపర్కంలోకి రాదు. ఈ సంపర్కం, లేక సంబంధం, మన సత్త యొక్క అన్యకోశాలద్వారా ఏర్పడుతుంది, — ఉపనిషత్తుల్లో ఇవి కోశాలనే చెప్పబడ్డాయి, — తరువాత వచ్చిన నిర్వచనాల్లో వీటికి పెట్టిన పేర్లను అనుసరించి చెప్పితే, ఇది అన్య శరీరాల ద్వారా ఏర్పడుతుంది. ఆ కోశాలు, లేక శరీరాలు-మనోమయకోశం, లేక సూక్ష్మశరీరం. దాన్లో నిజమైన మన మనోమయ పురుషుడు నివసిస్తాడు. ప్రాణమయకోశం, లేక ప్రాణికశరీరం స్థూల, లేక అన్నమయకోశంతో ఎక్కువ సన్నిహితంగా సంబద్ధమై ఉంది. అది, దీనితో కలిసి, మన జటిలసత్తకు సంబంధించిన స్థూల శరీరనిర్మాణం చేస్తుంది. ఈ కోశాల్లో, గుప్తంగా మనలో నిరంతరం పనిచేసే శక్తులూ, ఇంద్రియాలూ, సామర్థ్యాలు ఉన్నాయి. మన స్థూలేంద్రియాలతో, స్థూలప్రాణ, మనస్సుల చక్రాల (plexuses) తో సంబద్ధమై ఉన్నాయి. వీటిపైన అఘాతాలు చేస్తాయి (impinge). ఆత్మవికాసంద్వారా మనం వీటిని తెలుసుకొంటాం. వీటిలో మనం జీవితధారణం చేస్తాం. వీటిద్వారా, మనం ప్రాణలోకంతోను, అన్యలోకాలతోనూ సచేతన సంబంధాలు స్థాపించుకోగలుగుతాము. స్వయంగా భౌతిక ప్రపంచసత్యాల, తథ్యాల,

సంఘటనల అధిక సూక్ష్మానుభవం, అధిక అంతరంగజ్ఞానం పొందటం కోసం వీటినిగూడ ఉపయోగిస్తాం. మన సత్తయొక్క స్థూల భౌతికస్తరమే, ప్రస్తుతం మనకు సర్వస్వం. కానీ, పైన పేర్కొన్న ఆత్మవికాసం ద్వారా, మనం దీనికంటె భిన్నమైన ఇతర స్తరాలమీద గూడా, కొంచెం ఎక్కువ తక్కువగా పూర్ణ రూపంతో నివసించ గలుగుతాం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రి

∴

సృష్టి వెనక గల యంత్రాంగము

ఈ సృష్టి ఎటుల జరిగెనో మనకు తెలియదు. క్రమపరిణామము వలన ఈ జగత్తు సంభవించిందని మాత్రమే తెలుసు. దీని వెనుక గల యంత్రాంగ మేమిటి? అసలు రహస్యమేమిటి? పైనుంచి వచ్చిన వత్తిడి వలన క్రిందిస్తరములలో సృష్టి కార్యము జరుగుతుంది. ప్రాణికస్తరము వత్తిడి వలన పదార్థ జగత్తు ఏర్పడింది. మానసికస్తరము వత్తిడి వలన మనస్సు పుట్టింది. ఇక ముందు అతిమానసపు వత్తిడి వలన అతి మానసము (supermind) పుడుతుంది. ఇంకా చెప్పాలంటే పైన వుండే శక్తులు క్రింది లోకములలోకి వాటి ప్రతిరూపములను పంపిస్తాయి. ఆ శక్తులు తమ కార్యములను ఆ ప్రతిరూపముల ద్వారా నెరవేరుస్తాయి. ఇక్కడ జరిగేదంతా పైలోకాలలో పూర్వమే సూక్ష్మరూపంలో తయారుగా వుంటుంది. మనము ఆ లోకాలలో ప్రవేశించి నట్లయితే ఈ తతంగమంతా మనకు తెలుస్తుంది. అంతే కాకుండా మనమప్పుడు పైనుండి దేవత లను ఆహ్వానించి వారిని ఇక్కడ క్రియాశీలము చేయగలుగుతాము.

— సంపాదకుడు

ఈ లోకాలు, లేదా భూమికలను పరిశీలిస్తే అవన్నీ కూడా ఒక అనుబంధిత చలనంతో ముడిపడినట్లు గమనించవచ్చు. ఉన్నత భూమికలు తమ ప్రభావాన్ని అధోభూమికలపై ప్రసరిస్తుండగా వాటికవి తమ వంతుగా స్పందిస్తాయి. ఆ ఉన్నతశక్తికి, దాని చర్యకు అనుబంధితమై తమ పరిధిలో తమకు తాము వ్యక్తీక రించుకుంటాయి. ఆ విధంగా ప్రాణికలోక ప్రభావం వల్ల ఈ పదార్థమయ ప్రపంచంలో జీవరాసులు అవతరించాయి. మనో మయలోకం ప్రభావంతో మనస్సు రూపుదాల్చింది. *ఇక ఇప్పుడు అతిమానసస్థాయి ప్రభావానికి లోనై అతిమనస్సును ప్రభవింప చేయటానికి సమాయత్తపడుతోంది.*

ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే కొన్ని ప్రత్యేక శక్తులు, చలనాలు, తేజస్సులు, ఉన్నతలోక సత్తులు, మొదలుగా గలవన్నీ తమను తాము భూమి మీదకు ప్రక్షేపించుకుని తమకు తగిన అనుబంధిత రూపాలను తయారు చేసుకుంటాయి. ఆ విధంగా కలిగిన సంబంధంతో భౌతిక ప్రపంచంలో తమ చర్య లను కొనసాగిస్తాయి. భూమిపై నున్న జీవులన్నీ కూడా తమ ఉనికికి ఆధారభూతమైన సూక్ష్మశరీరం ద్వారా పైనుండి పని చేసే ఉన్నతశక్తులతో సంబంధాలను కలిగి ఉంటాయి. ఉదాహ రణకు మానవుడు స్థూలశరీరం వెనుకనున్న అనేక సూక్ష్మ భౌతికకోశాలలోని అధిభౌతికస్తరాల చైతన్యంతో జీవనం సాగి స్తుంటాడు. అక్కడి శక్తులు, చలనాలు, సత్తులు అతన్ని ప్రభా వితం చేస్తాయి. ఇక్కడ జీవితంలో జరిగే ప్రతిదానికీ వెనుకగా గుహ్యప్రాణిక స్తరాలలో ముందుగానే ఏర్పడ్డ చలనాలుంటాయి. మనస్సులోకి వచ్చే వాటన్నిటికీ మూలరూపాలు గుహ్యమానస స్తరాలలో రూపాలు, గతులు ముందుగానే ఏర్పడి ఉంటాయి. ప్రగతిశీల యోగమార్గంలో పురోగమించే కొలదీ ఈ విషయాల ఉపయోగము ప్రాముఖ్యత నీకు తెలుస్తుంది.

అయితే ఇదంతా యథాతథంగా కాకుండా కొంచెం వివే చనతో గమనించాలి. ఇదొక నమ్యచలనము. అన్ని రకాల సాధ్య తలు లీలగా ఇందులో ఉంటాయి కాబట్టి అంత సున్నితంగా

సూక్ష్మబుద్ధితో, సుతారంగా చైతన్యదృష్టితో గమనించి దాన్ని హస్తగతం చేసుకోవాలి. దానినొక నియమానుసారం జరిగే గణిత సూత్రంగా భావించకూడదు. ఇంతటి సున్నితతత్వం మరుగు పడిపోకుండా జాగ్రత్తగా రెండు మూడు అంశాలను మాత్రం తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

ప్రతిభూమిక దేనికదే ప్రత్యేక ప్రపంచంగా ఉంటుంది. దీనికి పైనా క్రిందా ఉన్న మిగిలిన క్షేత్రాలతో సంబంధాలున్నప్ప టికీ తన స్వంతగతులు, శక్తులు, సత్తలు రీతిరివాజులు, ఆకృతు లతో తనకోసం, వాటి కోసం, తన నియమానుసారంగా మను గడ సాగిస్తుంది. అది మిగతా శ్రేణులలోని అంశాలను లక్ష్యం చేయకుండా తను అభివ్యక్త మవాలనే కాంక్షిస్తుంది. ఈ ప్రకారం గానే ప్రాణిక క్షేత్రాలను గానీ, సూక్ష్మభౌతిక క్షేత్రాలను గానీ పరికిస్తే వాటిలోని పరంపరలు తమ ఉనికిని కాపాడుకుంటూ భౌతికప్రపంచంతో ఏ సంబంధం లేకుండా, తమ ప్రభావం దానిపై ప్రసరించకుండా మనుగడ సాగిస్తాయి. తదనుబంధిత భౌతిక నిర్మాణ విషయంలో కూడా తమ వంతు కార్యనిర్వహణలో ఏమాత్రం శ్రద్ధ చూపవు. అయితే ప్రాణిక, సూక్ష్మభౌతిక, తదితర భూమికలలో స్థాపితమై యున్నవి మాత్రం కొంతవరకు తమకు అనుగుణంగా ఉండే చలనం భూప్రపంచంలో స్థాపించబడటా నికి సాధ్యత కలుగచేస్తాయి. కానీ భౌతికమైన సృష్టి జరగాలంటే ఇంకా ఎక్కువే అవసరమవుతుంది. నిద్రాణమై నిష్క్రియగా వున్న సాధ్యతను బలసంపన్నమైన సమర్థతగా మార్చగల శక్తి, సృష్టికి కావలసిన ప్రోద్బలము ఉండాలి. దానికి అవసరమైనది భౌతిక ప్రపంచం నుంచి పిలుపు. అంటే ఏదో ఒక శక్తిగానీ వ్యక్తిగానీ పూనుకొని అధిభౌతిక లోకంతో గానీ, దాని భాగంతో గానీ, దాని శక్తితో గానీ సంబంధం పెట్టుకొని క్రిందికి అవతరించే టట్లు దాన్ని కదిలించాలి. లేక అది ప్రాణికలోకంలో గానీ మరే లోకంలో గానీ కలిగిన ప్రేరణే కావచ్చు. అదే విధంగా ఒక ప్రాణికలోకవాసి భూమిపై తన కార్యం కొనసాగించాలనీ, అక్కడ తనకొక సామ్రాజ్యం స్థాపించుకోవాలనీ ప్రేరణ పొందటమైనా

కావచ్చు. లేక తన కక్ష్యలో తను ప్రాతినిధ్యం వహిస్తున్న శక్తుల క్రీడ కావచ్చు. లేక పైనుంచి వచ్చే వత్తిడైనా కావచ్చు. అంటే ఒక అతిమానసశక్తిగానీ, మానసికశక్తిగానీ ఆ లోకంలోనే కొంత సృష్టిచేసి దాన్ని భౌతికప్రపంచంలో ప్రవేశపెట్టే ముందు మార్గ మధ్యంగా ప్రాణికలోకంలో ఆకృతులను చలనాలను తయారు చేయవచ్చు. లేక ఇవన్నీ కూడా ఏకమై పనిచేసినట్లైతే ఎంతో స్ఫూర్తిమంతమైన సృష్టి జరిగే సాధ్యత ఏర్పడుతుంది.

ఇవన్నీ పరికించిన మీదట ప్రాణికలోకంనుంచి గానీ మరే ఇతర లోకాలనుంచి గానీ సృష్టికార్యంలో పాల్గొనేది చాలా స్వల్పభాగం మాత్రమేనని తెలుస్తుంది. అయినప్పటికీ అదికూడ చాలా ఎక్కువే. భూమి తన కఠినసూత్రాలతో తాను ఒకసారి సృష్టించుకున్న దానికన్నా ఎన్నోరెట్లు ఎక్కువ అవకాశాలను ఇది కలగ చేస్తుంది. అయితే ఈ అవకాశాలన్నీ పరిపూర్తి కావు. కొన్ని పూర్తిగా విఫలమైపోయి ఎందుకూ కొరగాని ఒక భావ స్ఫూర్తిని వదిలిపెడతాయి. కొన్ని చాలా గురుతరంగా ప్రయత్నం చేసినప్పటికీ తిరగకొట్టబడి ఓటమి పొందుతాయి. అవి ఏదో కొంత పనిసాధించినప్పటికీ అది ఎందుకూ కొరగాదు. మిగిలి నవి సగం వరకు సృష్టి సాగిస్తాయి. అదే సాధారణంగా జరుగు తూంటుంది. ఎందువల్లనంటే ప్రాణిక, తదితర అధిభౌతికశక్తులు పరస్పర వైరుధ్యంతో సతమవుతూ పదార్థమయ తమస్సు, భౌతిక చైతన్యాల నుంచి ప్రతిఘటననే కాకుండా తమలోని పరస్పర విధ్వంసకర అవరోధాలను అధిగమించవలసి వుంటుంది. కొన్ని మాత్రం చాలా సంపూర్ణమైన, సాఫల్యమైన సృష్టి చేయడంలో కృతార్థత పొందగలవు. ఈ సృష్టిని ఉన్నతభూమికలలో దానికి మూలమైన దానితో పోలిస్తే రెండూ ఒకే పోలికగా ఉండటమే కాకుండా అధిభౌతికానికి మక్కికి మక్కి పదార్థ ప్రతిరూపంగా ఉంటుంది. అయితే అచ్చుగుద్దినట్లున్న ఆ ప్రతిరూపం కేవలం బాహ్యానికి మాత్రమే. ఎందువల్లనంటే సృష్టి పదార్థం వేరై, భిన్నమైన పరిస్థితుల్లో, వేరు నియమాల కనుగుణంగా సృష్టి జరిగినప్పుడు తేడా ఉండకపోదు కదా! నూతనసృష్టి కాబట్టి

దాని విలువ దానికుంటుంది. ఉదాహరణకి అతిమానసలోకం లోని అతిమానస సృష్టి ఏ మాత్రం తేడా లేకుండా భూమి మీద కూడా జరిగిందనుకోండి. ఆ సృష్టికి ప్రయోజనం ఏముంటుంది? అయినప్పటికి పూర్వం ఎక్కడా లేనటువంటి పరిస్థితుల్లో భగవానుడు చరితార్థ మైన నూతన ఆవిష్కారాన్ని పొందటం కూడా ఒక విజయమే.

సూక్ష్మభౌతికలోకం భౌతికప్రపంచానికి చాలా సన్నిహితమే అయినప్పటికీ అక్కడా ఇక్కడా పరిస్థితులు వేరు. సూక్ష్మ భౌతికంలోనున్న స్వతంత్రత, నమ్యత, తీవ్రత, ఆధిక్యత, శక్తి, వర్ణ విధానాలు, అధికమైన బహువిధ కార్యక్రమాలకు ఇప్పటి దాకా ఇక్కడ ఏ మాత్రం అవకాశం లేదు. అయినప్పటికీ ఇక్కడి అవకాశాలు వేరు. అక్కడ స్వేచ్ఛ ఉన్నప్పటికీ ఇక్కడ ఉండే సాధ్యత మృగ్యమే. ఈ సంభావ్యత వల్లనే సృష్టికర్తకు ఇక్కడి సృష్టి జటిలమే అయినా శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది.

*

మిగిలిన లోకాలన్నీ గౌణలోకాలు. ప్రతిదానికీ నిర్ణీతమైన ఒక నమూనా, ధర్మమూ ఉంటాయి. పృథ్విపై మాత్రమే పరిణామం కొనసాగుతుంది కాబట్టి పురోగతికి అది సరైన క్షేత్రము. ఇతర లోక వాసులకు పురోగతి లేదు. ఒక చోటునుంచి మరొక లోకానికి వెళ్ళలేరు. వారి ధర్మానికి వారు కట్టుబడి ఉండిపోతారు.

*

మానవుడు, అతనిలోని భాగాల నిర్మాణంలో రెండు వ్యవస్థలు చురుకుగా పనిచేస్తూంటాయి. ఒకటి కేంద్రస్థమైన చైత్యపురుషుని చుట్టూ ఉండే వలయాలు, కోశాల వ్యవస్థ. రెండవది నిటారుగా ఆరోహణావరోహణలు జరిగే ప్రక్రియ. అదే మానవుడు అధిమానస, అతిమానసస్తరములకు అధిరోహించవలసిన సోపాన మార్గము. మానవత్వంలో నుంచి దైవంగా మారటానికి కల అవస్థాంతర దశలలోని అతిక్లిష్టమైన అధిమానస — అతిమానస స్థాయిలు.

మూలం: శ్రీఅరవిందులు

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకట్రామ శాస్త్రి

భౌతిక జగత్తులో ఊర్ధ్వలోకముల ప్రభావము

భౌతిక ధాతువులోకి ఆత్మమనోప్రాణములు ఎక్కడి నుంచి వచ్చినవి? ఎటుల ఆవిర్భవించినవి? క్రింది నుండి ఊర్ధ్వోన్ముఖంగా బయలుదేరిన పిలుపు ఒకటి. ఈ క్రింది వస్తువును పైకి ఆకర్షించ వలెనని పైనుండి వచ్చిన వత్తిడి రెండవది. అచేతనలో నిక్షిప్తమైన వస్తువును బహిర్గతము చేయవలెననే ప్రేరణ వున్నది. ఆత్మ, మానసిక, ప్రాణిక స్తరములు భౌతికలోకం లోనికి దిగుటకు ఇవియే కారణములు.

ఈ సృష్టియొక్క పుట్టుపూర్వోత్తరములను గురించి మనం విచారించిన యెడల చాలా విచిత్రమైన విషయములు మనకు తెలియగలవు. దీనికి మూలము సచ్చిదానందమే అన్న విషయం తెలుసును గాని తదుపరి తతగంమును గురించి మనకు తెలియదు. సచ్చిదానందమునకు వ్యతిరేకమైన అచేతనలో కూడా దాని అంశము దాగి వున్నది. దాని ప్రేరణ వలన ఈ ఆత్మ మనో ప్రాణ పదార్థములు పుట్టినవా? లేక జీవుడే వాటిని సష్టించెనా? — సంపాదకుడు

ఉచ్చతర లోకములు నిమ్నతర భౌతిక జగత్తునుండి, అనగా భౌతిక నిశ్చేతనలో లీనమైయున్న సచ్చిదానందమునుండి ఉత్పన్నమైన ఒత్తిడిచేత అస్తిత్వములోనికి రాలేదు; అథవా సచ్చిదానందునియొక్క సత్త నిశ్చేతననుండి ప్రాణము, మనస్సు, ఆత్మల లోనికి ఆవిర్భవించి నపుడు, వేనియందు ఈ మూడు తత్త్వములు స్వతంత్రతర క్రీడను గల్గియుండగలవో, ఇంకను వేనియందు మానస అంతరాత్మ తన ప్రాణిక, మానసిక, లేక ఆధ్యాత్మిక ప్రవృత్తులను బలపఱచుకొనవచ్చునో, అట్టి లోకములను లేక భూమికలను సృజింప వలసిన ఆవశ్యకత ననుభవించగా, తదనుభవమునుండి ఉత్పన్నమైన ప్రేరణచేత గూడ ఆ లోకములు అస్తిత్వములోనికి రాలేదు. పోతే అవి మానవ అంతరాత్మ తన స్వప్నరూపమున చేసిన సృష్టి అసలే కాదు. లేక మానవ

జాతి తన సక్రియ సృజనాత్మక సత్తయందు భౌతిక చేతన యొక్క అవధుల కావల చేసిన సంతత ఆత్మ-ప్రక్షేపణలయొక్క ఫలితము కూడాగాదు. కాగా ఈ దిశలో మానవుడు స్పష్టముగా సృజించునది తన స్వీయ సదేహ చేతనయందు ఈ భూమికల యొక్క ప్రత్యావర్తిత (reflex) ప్రతిరూపములను మాత్రమే. అటులే వానిని ప్రతిస్పందించను, వాని నెఱుంగను, భౌతిక చేతనయొక్క క్రియతో వాని భావములు పరస్పరము అల్లుకొనుటయందు సచేతనముగా పాల్గొనను తన స్వీయ అంతరాత్మయొక్క అర్హ తను మాత్రమే. అవును, నిక్కముగా మానవుడు ఈ ఉచ్చతర భూమికల క్రియకు తన స్వీయ ఉచ్చతర ప్రాణిక, మానసిక క్రియయొక్క ఫలితములను లేక ప్రక్షేపణలను సమకూర్చవచ్చును. కాని, అట్లు సమకూర్చుచో, అపుడు ఈ ప్రక్షేపణలు, తమ పైననే ఈ ఉచ్చతర లోకములయొక్క ఒక ప్రత్యావర్తనము మాత్రమే. పృథివీ-మనస్సునకు ఆ భూమికల నుండి దిగివచ్చిన వాని ఏ శక్తులు గలవో, పృథివినుండి ఆ శక్తులయొక్క ప్రత్యావర్తనము మాత్రమే. ఏలన ఈ ఉచ్చతర ప్రాణిక, మానసిక క్రియ స్వీయ ముగా పైనుండి ప్రసారితమైన ప్రభావములయొక్క ఫలితమే. ఇదికూడ సంభవమే: మానవుడు ఈ అతిభౌతిక భూమికలకు కనీసము ఆ భూమికలలో క్రిందివానికి, ఒక విధమగు విషయ గత (మానసిక) అనుబంధమును, ఒక అర్ధ-మిథ్యా స్వభావము గల పరిసరములను సృజించగలడు: ఇవి యథార్థ లోకము లగు టకంటె, అతని సచేతన మనః ప్రాణములయొక్క స్వయంసృష్ట కోశములే యగును. అవి తన స్వీయసత్తుయొక్క ప్రతిబింబ ములు. ఈ ఇతర లోకములను మానసికముగా చిత్రీకరించు కొనుటకు తన జీవితములో మానవుడు చేసిన ప్రయత్నమునకు అనురూపమైన ఒకకృత్రిమ వాతావరణము. తన సచేతన సత్తు నందు మానవునికి గల చిత్రీకరణ శక్తిచేత ప్రక్షిప్తమైన స్వర్గనర కములు — కాని ఈ రెండు ఉపకల్పనలలో నేదియు, తన స్వీయపృథగ్భూత తత్త్వమునందు ప్రతిష్ఠితమై పనిచేయునట్టి ఒక యథార్థ సత్తాభూమిక యొక్క ఒక సంపూర్ణ సృష్టిని తెలుపదు.

ఆ లోకాల ఆవశ్యకత: కావున ఈ భూమికలు, లేక లోక ములు, ఏది మనకు భౌతిక విశ్వముగా గన్పించుచున్నదో, దానితో కనీసము సమకాలీనములు, సహావర్తనములు. భౌతిక సత్తునందు ప్రాణము, మనస్సు, ఆత్మలయొక్క వికాసము వాని పూర్వ-అస్తి త్వము నపేక్షించును — అను నిర్ణయమునకు నడుపబడినాము. ఏలన ఈ శక్తులు ఇచ్చట రెండు సహకార బలములచేత వికసిం చును. 1. క్రిందినుంచి ఊర్ధ్వముఖముగా ప్రవర్తించు ప్రక్రియ, 2. పైనుంచి పైకి లాగునట్టియు, క్రిందిగి ఒత్తునట్టియు శక్తి. ఏలన నిశ్చేతనములో ఏది అవ్యక్తముగా నున్నదో, దాని నటనుండి వెలికి తీసికొని రావలసిన ఆవశ్యకత గలదు. కాగా ఇందునిమి త్తము ఉచ్చతర భూమికలయందు గల శ్రేష్ఠతర తత్త్వముల ఏ పీడనము (ఒత్తిడి) గలదో, అది తనను దాను రూపొందించుకొన ఈ సామాన్య ఆవశ్యకతకు సాయపడుట మాత్రమే కాక, ఏ మార్గములందు అది చివరకు రూపొందునో, ఆ విశిష్ట మార్గముల నది స్థూలముగా నిర్ధారింపవచ్చును గూడ. ఇదిగో, ఈ ఊర్ధ్వ-ఆకర్షక క్రియ, ఈ పీడనమే, పైనుంచి ప్రవర్తించు ఈ నిర్బంధమే భౌతిక భూమికపై ఆధ్యాత్మిక, మానసిక, ప్రాణిక లోకముల యొక్క నిరంతర ప్రభావమును వివరించును. అందుచేత ఇది మనకు స్పష్టమే: ఇది ఒక జటిల విశ్వము. దీని వ్యవస్థయొక్క ప్రతి భాగమునందు ఏడు తత్త్వములు ఓతప్రోతములై యున్నవి. కావున ఎచ్చటెచ్చట అవి ఒకదానితో నొకటి సంపర్కము పొందునో, అచ్చటచ్చట అవి క్రియను, అనుక్రియను నెరపుకొన సహజముగానే ఆకృష్టమగును — అని మనము ఒప్పుకొందు మేని, అప్పుడు అట్టి (పైన చెప్పబడిన) క్రియ, నిరంతర పీడ నము, ప్రభావము ఒక అనివార్య ఫలితము మాత్రమే. అది అభి వ్యక్తి విశ్వముయొక్క స్వరూపమునందే అంతర్నిహితమై యుండ వలెను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: చెలసాని నాగేశ్వరరావు (దివ్యజీవనము)

∴

ఊర్ధ్వ స్తరములు — వాటి ప్రాముఖ్యత

ఆధ్యాత్మిక చైత్యాత్మానుభూతుల (psychic experiences) *యథార్థతను భౌతిక శాస్త్రజ్ఞులు ఒప్పుకోరు. అంతమాత్రాన అవి అసత్యము కానేరవు. అవి ఇంద్రియజ్ఞానానికి అతీతములు. ఎందుకని? అవి భౌతికములు కావు కనుక. మనది భౌతిక లోకము — మన ఇంద్రియముల పరిధి అంతవరకే పరిమితము. కాని ఊర్ధ్వస్తరముల యొక్క ధర్మములు వేరు. వాటిని అతీంద్రియ జ్ఞానముతోనే గ్రహించగలము. మరి వాటి వలన ఉపయోగమేమిటి? పై స్తరములలలోని శక్తులు మనకు మిక్కిలి లాభదాయకములు. మన శక్తితో సాధింపలేని కార్యములు వాటికి సాధ్యములు. మన మహర్షులు, మహాత్ములు ఆ శక్తినే పైనుంచి ఈ ప్రపంచకములోకి కొనివచ్చి ప్రసరింపజేసి క్రియాశీలము గావించిరి.*

— సంపాదకుడు

మన సమస్త ఆధ్యాత్మిక, అంతరాత్మిక అనుభవము, ఉచ్చతర లోకములు, సత్తయొక్క విముక్తతర భూమికలు కలవని సాక్ష్యము నిచ్చుచున్నది. సదా ఒక సంతత మఱియు, తన ప్రధానాంశము లందు ఒక ఏకరూప ప్రమాణమును సమకూర్చుచున్నది. కాగా భౌతిక అనుభవము లేక భౌతిక జ్ఞానముపై ఆధారపడిన అనుభవము మాత్రమే సత్యము; హేతుబుద్ధిచేత చేయబడిన భౌతిక అనుభవముయొక్క విశ్లేషణ మొక్కటియే పునర్నిరూపణయోగ్యము; పోతే తక్కినదంతయు భౌతిక అనుభవము మఱియు భౌతిక సత్తయొక్క ఒక పరిణామము మాత్రమే, దీనికి ఆవల నున్న దేదియైనను హుళక్కి, ఆత్మ-విమోహము అపభ్రమము — అని ఆధునిక విజ్ఞానముయొక్క అధికాంశము వాదించుచున్నది. కాగా మన మీ స్థూలవాదముతో మనను బంధించుకొనలేదు గాన, ఈ పై సూక్ష్మానుభవమును స్వీకరించి, ఈ ఊర్ధ్వ లోకములను అంగీకరించు స్వేచ్ఛ మనకు గలదు. ఈ భూమికలు వ్యావహారి

కముగా భౌతిక విశ్వముయొక్క సామరస్యము కంటె భిన్నమగు సామరస్యములని మనము చూతుము. 'భూమిక' అనే పదము సూచించునట్లు, అవి సత్తాశ్రేణియొక్క ఒక భిన్న స్తరము నాక్ర మించును. అటులే ఆ స్తరము నందలి తత్త్వములయొక్క ఒక భిన్న వ్యవస్థను, క్రమమును అవలంబించును. అది దిక్కాలము లందు మన స్వీయ లోకముతో ఏకమా, లేక దిక్కుయొక్క ఒక భిన్నక్షేత్రమునందును, కాలముయొక్క ఒక భిన్న ప్రవాహమునం దును చరించునా అన్న విషయము మన ప్రస్తుత ప్రయోజన నిమిత్తము విచారించ నవసరము లేదు — వీనిలో ఏది సత్యమై నను, ఆ లోకములు ఒక సూక్ష్మతర ద్రవ్యమునందును, ఇతర గతి విశేషములతోను నడచును. ఇక్కడ మనకు సంబంధించిన విషయ మేమన, అవి భిన్న జగత్తులా, అందు ప్రతి జగత్తు తనలో దాను సంపూర్ణమా, ఏ ప్రకారముగాను ఇతర జగత్తులను తాకదా, దాటదా, ప్రభావితము గావించదా, లేక అంతకంటెను అవి సత్తుయొక్క ఏకమాత్ర శ్రేణిబద్ధ (graded) మఱియు ఓత ప్రోత వ్యవస్థయొక్క భిన్న సోపానములా, కావున ఏకమాత్ర జటిల వైశ్వ వ్యవస్థయొక్క భాగములా? అను దానినే మన మెఱుంగవలెను. అవి మానసిక చేతనయొక్క క్షేత్రములోనికి ప్రవేశించ గలవు — అనే వాస్తవము సహజముగానే పై రెండవ వికల్పము యొక్క ప్రామాణికతను సూచించును, అయితే ఆ సూచన తనకుదానే పూర్తిగా నిర్ణాయకము గాదు. అయినను మనము కనుగొనున దేమన, ఈ ఉచ్చతర భూమికలు సత్తు యొక్క మన స్వీయ భూమికపై ప్రతిక్షణము వాస్తవికముగా పనిసేయుచు, దానితో సంబంధము కల్గియున్నవి. అయితే అవి చేయు ఈ పని సహజముగానే మన సామాన్య జాగరిత లేక బాహ్య చేతనకు దెలియదు. కారణము, ఈ బాహ్య చేతన తన అధికాంశమునందు భౌతిక జగత్తుయొక్క సంయోగములను స్వీకరించి, ఉపయోగించుకొనుటకే పరిమితమై యుండును. కాని ఎపుడు మనము వెనుదిరిగి మన అంతస్థలీయసత్తులో నడుగిడు దుమో, లేక భౌతిక సంయోగముల పరిధి కావల మన జాగరిత

చేతనను విస్తృత పఱతుమో, ఆ క్షణమే ఈ ఉచ్చతర క్రియ యొక్క ఒక అంశము మన ఎఱుకలోనికి వచ్చును. ఇంకను, మానవ జీవుడు, తాను శరీరము నందుండగనే, కొన్ని నిబంధన లకు లోబడి, తనను ఆంశికముగా ఈ ఉచ్చతర లోకములలో నికి ప్రక్షిప్తము గావించుకొనగలడని సైతము మనము కనుగొం దుము. కాగా శరీరమును విడిచినపుడు, అతడు దీనిని మఱింత ఎక్కువగాను, సంపూర్ణముగాను చేయగలిగి యుండవలెను. ఏలన అపుడిక శరీరముతో నిబద్ధమై యుండు భౌతిక జీవనము యొక్క అసమర్థ నిబంధన యుండదు. ఈ సంబంధముయొక్క, ఈ ప్రక్షేపణ సామర్థ్యముయొక్క ఫలితములకు అత్యంత మహ త్త్వము గలదు. ఒక వైపున శరీర మరణము తర్వాత మానవ జీవుడు భౌతికేతరమైన లోకములందు కనీసము తాత్కాలిక ముగా నైననూ నిలుచును — అనే ప్రాచీన సాంప్రదాయమును ఈ ఫలితములు, కనీసము ఒక వాస్తవిక సంభవతగా వెంటనే సమర్థించును. ఇక రెండవ వైపున ఆ ఫలితములు భౌతిక సత్తపై ఉచ్చతర భూమికల క్రియయొక్క ఒక సంభవతను తెఱచి పెట్టును. కాగా ఈ ఉచ్చతర భూమికలు తమ క్రియచేత, తాము అక్కడ ఏ శక్తులకు ప్రాతినిధ్యము వహించునో, ఇక్కడ ఆ శక్తులను, అనగా ప్రాణము, మనస్సు, ఆత్మలను ద్రవ్యమునందు తమ అంతర్లీన స్థితినుండి విడిపించగల్గును — ఈ విడుదలయే ప్రకృతిలోపల నిహితమై యున్న పరిణామాత్మక ఉద్దేశ్యము.

ఊర్ధ్వక్రియ — పరివర్తనము: పార్థివ జీవునిపై తమ స్వీయ భూమికలనుండి ఉచ్చతర శక్తులు, తత్త్వములు నెరపు ఏ సంతత రహస్యక్రియ గలదో, దాని కొొక ఫలితము, ఒక అర్థము ఉండవలెను — ఈ క్రియ, ఏది స్వయముగా నిశ్చేతననుండి జనిం చిన ఈ లోకములోనికి ఆ భూమికల యొక్క ఒక ప్రక్షేపమో, ఆ అంతస్థలీయ ఆత్మ ద్వారా జరుగును. దాని ప్రథమ ఫలితము ద్రవ్యము నుండి ప్రాణ మనస్సుల ఉన్మోచనము: కాగా దాని చరమ ఫలితము సత్తావిషయకమగు ఒక ఆధ్యాత్మిక చేతన, ఒక

ఆధ్యాత్మిక సంకల్పము, ఒక ఆధ్యాత్మిక సంవేదనలయొక్క ఆ
ర్భావము పార్థివ జీవునియందు రేకెత్త సాయపడుట. ఇట్లు రేకె
నపుడు, అతడిక కేవలము తన బాహ్యతమ జీవనమునందు లే
దానితో గూడిన మానసిక వ్యాపారములు, అభిరుచుల యం
మునిగియుండడు. కింతు ఎట్లు లోపలికి చూడవలెనో, తన అంత
సత్తును, తన ఆధ్యాత్మిక ఆత్మను ఎట్లు కనుగొనవలెనో, ప్ర
విని, దాని పరిమితత్వములను అధిగమించుటకెట్లు ఆకాంక్షిం
వలెనో, నేర్చుకొనియుండును. అతడెట్లు లోలోనికి అధికాధికము
పెరుగునో, అట్లు అతని ప్రాణిక, మానసిక, ఆధ్యాత్మిక సీమా
తములు (సరిహద్దులు) విశాలముగా నారంభించును. ప్రాణవ
మనస్సు అంతరాత్మలను తమ ప్రథమ పరిమితత్వములకు క
యుంచిన బంధము సడలును లేక తెగియేపోవును. కాగా మన
ప్రధానుడైన మానవుడపుడు ప్రథమ పార్థివ జీవనమునకు మూ
పడి యున్న ఆత్మ ప్రపంచములయొక్క విశాలతర రాజ్యమున
క్షణము దర్శింప నారంభించును. సందేహము లేదు, అత
ముఖ్యముగా తన ఉత్తలమునందే జీవించినంత కాలము, త
సామాన్య సంకుచిత సత్తయొక్క ఆధారముపైన ఆదర్శమయమ
కల్పనామయము, భావమయమునగు ఒక విధమగు అధినిర్మా
మును (super structure) మాత్రమే తాను చేయగలడు. కా
దేనిని అతని స్వీయ అత్యున్నత అంతర్దర్శనము తన ముంద
తన అత్యధిక ఆధ్యాత్మిక ఆవశ్యకతగా నిల్పియున్నదో,
అంతర్ముఖ గతి నతడు సాధించునేని, అపుడతడు తన అంత
సత్తునందు ఒక విశాలతరచేతనను, ఒక విశాలతర జీవన మున
గనుగొనును. లోపలినుంచి క్రియ, పైనుంచి క్రియ కలిసి ప
చేసినపుడు, అవి భౌతిక సూత్రముయొక్క ఆధిపత్యమును దా
పోగలవు, నిశ్చేతనయొక్క శక్తిని తగ్గించుచు, చివరకు దా
నంతము చేయగలవు. చేతనాక్రమమును మార్చివేయగలవ
ద్రవ్యముయొక్క స్థానమున తన సచేతన ఆధారముగా ఆత్మన
స్థాపించగలవు, చివరకు ప్రకృతియందు దేహము ధరించిన అం

ంత్మ జీవితమునందు తదాత్మయొక్క ఉచ్చతర శక్తులను తమ సంపూర్ణ, విశిష్ట అభివ్యక్తిలోనికి ఉన్ముక్తము చేయగలవు.

అనువాదము: చెలసాని నాగేశ్వరరావు (దివ్యజీవనము)

∴

భౌతిక స్తరము యొక్క విశిష్టత

ఊర్ధ్వ స్తరములు (లోకములు) మన భూలోకము కంటె గొప్పవి. కాని వాటికి భౌతిక మూర్తిమత్వము లేదు. అచ్చట సృష్టి అనునది లేదు. వాటి అభివ్యక్తి భూలోకం ద్వారా జరగ వలసినదే. పూర్వము మానసికస్తరము భూలోకంలోకి దిగి వచ్చి మనసును సృష్టించినది. దాని ప్రభావము వలన మనము మానసికంగా వృద్ధిపొందుటయేకాక పై లోకమునకు పోయి విశుద్ధ మానసమును ఆస్వాదించగలము. అటులనే అతి మానసలోకము దిగివచ్చినప్పుడు భూలోకంలో అతిమానసము ఆవిర్భవించగలదు. అయితే ఈ కార్యక్రమము శూన్యములో జరగదని, మనిషియే దానికి ఉపకరణమని మనం గ్రహించాలి.

— సంపాదకుడు

ఈ ఉచ్చతర లోకములను గుఱించిన మన అంతర దృష్టియందును, అనుభవమునందును అవి ఎవ్విధముగాను భౌతిక విశ్వముపై ఆధారపడి లేవనియు, దాని ఫలితములు గావనియు, అంతకంటెను అవి సత్తుయొక్క మహత్తర రూపములనియు, చేతన యొక్క విశాలతర, విముక్తతర శ్రేణులనియు కనుగొందుము. ఇంకను భౌతిక భూమికయొక్క క్రియ యంతయు ఈ అధికతర ప్రాణాది రూపముల మూలముగా గాక, ఎక్కువగా వాని ఫలితము వలెనే కన్పించును. వానినుండి వ్యుత్పన్నమైనదిగా, తన పరిణామాత్మక ప్రయాసనందు అంశికముగా వానిపై ఆధారపడి

నదిగా సైతము కన్పించును. శక్తులు, ప్రభావములు, ఘటన
అపార శ్రేణులు (ranges) అధిమనస్సు మఱియు ఉచ్చతర మా
సిక, ప్రాణిక శ్రేణులనుండి గుప్తముగా మనపై నవతరించును
కాని వీనిలో ఒక అంశము మాత్రమే, లేక ఎన్నిక చేయబడినదని
చెప్పదగు ఒక భాగము మాత్రమే, లేక ఒక పరిమిత సంఖ్య
మాత్రమే భౌతికప్రపంచము యొక్క భూమికయందు అభినయిం
చగలవు. మఱియు తమను అభివ్యక్తము చేసికొనగలవు. కాగ
తక్కినవి భౌతిక నియమము, రూపములందు తమనుదామ
ప్రకాశింపజేసికొనుటకు, అటులే ఏ పార్థివ* పరిణామము ఏక
కాలమున ఆత్మశక్తులన్నింటి పరిణామము గూడనగునో,
భౌతిక పరిణామమునందు తమ ప్రాత్రను నిర్వర్తించుటక
ఉచిత సమయ, సందర్భములకు వేచియుండును.

ఈశ్వరుడు మన సృష్టి కాడు: ఇతర లోకములయొక్క ఈ
స్వభావము సత్తుయొక్క మన స్వీయభూమికకు, ఇచ్చటి అభి
వ్యక్తియందు మన స్వీయపాత్రకు ప్రధాన మహత్త్వమునీయ
మనము చేయు ప్రయత్నములన్నింటిని భగ్నము గావించును
మన చేతనయొక్క ఒక కల్పనగా మనము భగవంతుని సృజిం
చుట లేదు, కింతు భౌతిక సత్తునందు భగవంతుని ప్రగతిశీ
అభివ్యక్తికి మనము ఉపకరణములు మాత్రులము. అటులే మనమ
అతని శక్తులగు దేవతలను సృజించము, కింతు అంతకంటె
మనము అభివ్యక్తము చేయగలుగు చున్నట్టి ఆంశిక దివ్యత్వమ
నిత్య భాగవత శక్తుల యొక్క ఒక ఆంశిక ప్రతిబింబము
మఱియు నిచ్చట వాని మూర్తీకరణము. ఇంకను మనము ఉచ్చ
తర భూమికలను సృజించుట లేదు. కింతు మనము మధ్యస్థ
లము మాత్రమే. మన ద్వారా అవి తమ ప్రకాశ శక్తి సౌందర్య
ములను, భౌతిక భూమికయందు ప్రకృతిశక్తిచేత వానికి ఏయే

---

* ఇచ్చట 'పార్థివ' అనగా కాలీనమైన ఈ భూలోకమొక్కటే కాదు. దాని
మూలము, ఆత్మకు భౌతికాలంబనము అయిన పృథ్వీతత్త్వము.

రూపము, అవకాశము ఈయబడగలవో, ఆ రూప అవకాశముల యందు ప్రకాశింపజేయును. పైనున్న ప్రాణలోకముయొక్క ఒత్తిడియే మన కిప్పటికే తెలిసియున్న రూపములందు పరిణామ వికాసములను జెంద పృథివీతత్త్వమునందు అంతర్లీనమై యున్న ప్రాణమునకు సామర్థ్యమిచ్చును. ఆ ఒత్తిడి అధికాధికమగుచు, మనయందు తనయొక్కయే ఒక అధికాధిక ప్రకాశనము (revelation) నాకాంక్షింప దానిని (ప్రాణమును) ప్రేరేపించుచున్నది. మఱియు ఒక నాడు మర్త్య మానవుని ఇప్పటి అసమర్థ మఱియు ప్రతిబంధాత్మక భౌతికతయొక్క సంకుచిత పరిమితత్వముల నుండి అతనిని ఉద్ధరించును (అతనిని అమరుని చేయును). అటులే మనోలోకము యొక్క ఒత్తిడియే ఇచ్చట మనస్సును ఆవిర్భవింపజేసి, వికసింప జేయును. మఱియు మన మానసిక స్వయముత్థానమునకు, స్వయంవిస్తారణమునకు ఒక సాధనమును గనుగొన తోడ్పడును. ఇట్లు అది మన బుద్ధ్యాత్మను నిరంతరముగా వృద్ధిపఱచుననియు, ద్రవ్యబద్ధమగు భౌతిక మానసికత యొక్క కారాగార కుడ్యములను భంగించుననియు మనమాశింపవచ్చును. చివరకు, అతిమానస మఱియు ఆధ్యాత్మిక లోకముల ఒత్తిడియే ఆత్మయొక్క అభివ్యక్త శక్తి నిచ్చట వికసింపజేసి, తద్ద్వారా భౌతిక భూమికయందు గల మన సత్తును, దివ్యచేతన యొక్క ఊర్ధ్వశ్రేణుల స్వేచ్ఛా, అనంతతలలోనికి ఉన్మీలితము గావించ రంగమును సిద్ధము చేయుచున్నది. ఈ సంయోగము, ఈ సంపీడన (ఒత్తిడి) యొక్కటియే మనలోపల దాగియున్న సర్వచేతన భాగవత శక్తిని మన ప్రస్థాన-బిందువగు ప్రతీయమాన నిశ్చేతన నుండి ముక్తము గావించగలదు. విశ్వవ్యాపారముయొక్క ఈ క్రమమునందు మన మానవ చేతన ఉపకరణము, మధ్యవర్తి. నిశ్చేతననుండి ప్రకాశ, శక్తుల వికాసమునందు మానవచేతన ఒక దశ — అయితే విముక్తిని సంభవము గావించు విశిష్ట దశ. దీనికి మించిన పాత్రను దానికి మన మాపాదించ జాలము. కాని ఈ పాత్ర కూడ తగినంత గొప్పదే. కారణము,

అది పరిణామశీల ప్రకృతియొక్క పరమ ప్రయోజనమునకు మన మానవజాతిని సర్వ-ప్రముఖము గావించుచున్నది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము:చెలసాని నాగేశ్వరరావు (దివ్యజీవనము)

∴

ఏడంతుస్థుల హర్మ్యము

మానవజ్ఞానము ఇంద్రియాత్మకము — కేవలం పరోక్షజ్ఞానము. మనస్సు ద్వారా గ్రహించబడినది. మరి ఇంతకంటె మేలైన జ్ఞానము ఇంకొకటి గలదా? కలదు. మనది భౌతికలోకము. అందులో భౌతిక పదార్థమే ప్రధానము. అటులనే ప్రాణిక, మానసిక పదార్థములు ప్రధానమైన ప్రాణిక మానసిక లోకములు గూడ కలవు. మన ప్రపంచములో ప్రాణిక మానసికములు భౌతిక పదార్థమును ధరించి వున్నవి. తత్కారణముగా మనకు వాటి నిజస్వరూపము తెలియదు. మనమా లోకములలో ప్రవేశించిన యెడల శుద్ధప్రాణికము, శుద్ధమానసికముల అనుభూతి కలుగును. ఆ అనుభూతులతో పోల్చిన యెడల మన మామూలు జీవితములోని సుఖదుఃఖాదులు ఎందుకు పనికి రావు. స్వర్గనరకములు ఈ లోకముల ఆధారముగా జేసిన రూపకల్పనలే.

ఈ సృష్టి యొక్క రహస్యము భౌతిక వాదమునకు లొంగునది కాదు. దీని వెనుక అదృశ్యలోకములు కలవు. వీటి వివరణ భిన్నసిద్ధాంతములలో భిన్నరీతిగా ఉంటుంది. ఉపనిషత్తులలో వీటిని గురించి అతిసరళముగా మన బంధవిముక్తికి వీలైన విధానములో చెప్పబడి వున్నది. దాని ప్రకారము మనోప్రాణభౌతికములు, సచ్చిదానందత్రయము, ఈ రెంటికి మధ్యగల విజ్ఞానము

లేక అతిమానసికము మూలాధారములు. ఈ ఏడు స్తరముల ద్వారా మానవుడు పురోగమించి ఆధ్యాత్మిక వికాసమును పొందగలడు. మానవుడు క్రింది ఐదు స్తరములే అందుకోగలడు కాబట్టి కొంతమంది స్తరములను ఐదుగానే పరిగణిస్తారు.

*

మానవుడు భౌతిక లోకంలో నివసిస్తున్న కారణంగా ఆతని జ్ఞానం దానికే పరిమితము. భౌతిక జగత్తు యొక్క అభివృద్ధి నందే అతను నిమగ్నమై యుండును. ఇక్కడ ఒక్క క్షణము మనము అసలు భౌతికమంటే ఏమిటో విచారించి చూడవలెను. సచ్చిదానందము అంతర్నిహిత స్థితిలోను, అణువణువుగా చీలి పోయి తనను తాను విస్మరించుకొన్న స్థితినే మనము ద్రవ్యము అని పిలిచెదము. ఈ విధంగా అంతర్నిహిత స్థితిలో మరుగుపడి పోయిన వస్తువును పరిణమింపజేసి, మళ్ళీ వికసింప చేయుటయే మన లక్ష్యము కావలెను. ఈ జడప్రపంచములోని వ్యవహార మంతా దీర్ఘసుషుప్తిలో అచేతనంగా వుండును. కాబట్టి వాటిని తట్టి జాగృతము చేయుటయే భౌతికజీవితము యొక్క ప్రధాన లక్ష్యము కావలెను. జడపదార్థము యొక్క యవనికను తొల గించి అందు బంధింపబడి, అచేతనముగా నున్న ఆత్మకు కళ్ళు తెరిపించి జ్యోతిదర్శనము/జ్ఞానవంతము జేసి సచేతనము కావిం చుటయే దాని యొక్క పరమావధి. మనిషి అనగా ఇటుల బంధిం పబడిన ఆత్మయే కాబట్టి ఈ విధమైన క్రాంతి దర్శనము, ఆత్మ జ్ఞానము ఆతని మహోన్నత లక్ష్యము కావలెను. అదియే ఆతని పరమ సిద్ధి.

*

పదార్థ క్షేత్రములో ప్రకృతిపురుమలకు గల సంబంధమునే మనము సాధారణముగా 'ప్రకృతి' యని వ్యవహరించెదము. ఇచ్చట పదార్థమునదే పై చేయి. అనగా ఇది పదార్థమయ జగత్తు. దీనికి పైన పదార్థేతర ధాతువులు ప్రధానముగా గల లోకములు గలవు. వాటిలో జీవశక్తి లేక ప్రాణశక్తి ప్రధానమైన లోకమొకటి గలదు. అది మనకి పరిచితమైన ఈ పదార్థమయ జగత్తుకంటె

భిన్నము. ఇక్కడ జడపదార్థము ఎటుల వున్నదో అక్కడ ప్రాణ శక్తి వుంటుంది. అనగా అది పదార్థమయ జగత్తు గాదు. ప్రాణ శక్తిమయ జగత్తు. ఇక్కడ పదార్థమునకు ప్రాణం పోయగా మనిషి ఏవిధంగా తయారయినాడో అక్కడ ప్రాణశక్తియే తనకు ఇష్టమైన రూపమును జోడించుకుంటుంది. అందుకని ఆ లోకం లోని ఆకృతులు ఇక్కడి వలె ఘన పదార్థములు కావు. అవి తర ళములుగా, మృదువుగా, నవనీతము వలె వుండును. ఈ ప్రాణ శక్తిపదార్థము యొక్క ధర్మము, ద్రవ్యము కన్నా భిన్నము. అది చేతనారహితమైన జడము గాదు. అవచేతనాత్మకము కూడా కాదు. దానికి మరియొక విధమైన ప్రజ్ఞకూడా వున్నది. తన ఇచ్ఛవచ్చిన రూపమును దాల్చగలదు. తనకు కావలసిన దానిని పొందగలదు. అనుభవించగలదు. ఈ విధంగా తన సామర్థ్యము నకు క్రియారూపము నివ్వగలదు. ఆ సామర్థ్యమేమిటో? అది ఎటువంటిదో? అది శుద్ధప్రాణిక ప్రపంచము. వాంఛా పరితృప్తి, దాని ఇచ్ఛకముల జరుగుబాటు దాని ముఖ్య లక్షణములు. మన పదార్థమయ జగత్తుకంటె అత్యధికమైన స్వేచ్ఛా సామర్థ్యములు గల ఈ లోకాన్ని 'వాంఛా జగత్తు' అంటే బాగుంటుంది. ఏలన అదియే దాని ప్రధాన వ్యాపకము. అది మన భౌతిక జగత్తు కంటే చాల భిన్నమైనది. ఇక్కడ (మన లోకంలో) ఒక వస్తువు తన రూపమును మార్చుకొనలేదు. అక్కడ దాని ఇష్టము వచ్చిన రూపమును దాల్చగలదు!

పదార్థము, ప్రాణలోకము, మానసిక, ఆత్మలోకములు — ఈ లోకముల మధ్య ఒక ధాతువు ఏ రూపము కావలెనన్న ఆ రూపమును దాల్చి లోకసంచారము చేయగలదు. ఈ ప్రకృతి (సృష్టి) లో భిన్న స్తరముల యొక్క అనంతశ్రేణులు కలవు. అయితే వాటి మధ్య కఠినమైన గోడలు గాని దుర్భేద్యమైన అఖా తములు గాని లేవు. ఒకదానిలోకి ఒకటి కరిగిపోవుట వలన, వాటిమధ్య ప్రవేశద్వారములు గలవు. తత్కారణముగా ఆత్మ ఈ అనంతమైన అవకాశమును పురస్కరించుకొని విభిన్న రూపము

లను దాల్చి చిత్ర విచిత్రానుభూతులను పొందుచున్నది. సృష్టి లీల (శివుని తాండవ నృత్యము) అనగా ఇదియే.

వాంఛాలోకముల లక్షణములు: ఏదో ఒక రకమైన భోగమే వాంఛయొక్క లక్షణము కాబట్టి అదియే (వాంఛ) ఈ జగత్తు యొక్క ముఖ్యలక్షణము అయి వుంటుంది. కాని ఆత్మ విశృంఖల నము కానంత వరకు — కోరికలున్నంత వరకు పాపం దానికి స్వేచ్ఛ ఎక్కడిది — దాని అనుభవములలో ఎక్కువ తక్కువలు — అతివృష్టి, అనావృష్టులు ఉండి తీరుతాయి. అందుకని ఆ లోకములలో మనుమలు ఊహించలేనంత నిరంతరమైన సుఖము, దానికి వ్యతిరేకముగా విపరీతమైన బాధా దుఖఃములు సంభవ ములు. మన పురాణాల్లోని స్వర్గనరకములు, అనాదిగా మానవు లను భయభ్రాంతులు చేసిన కథలన్నీ ఈ కోవకు చెందినవే. ఇక్కడ మన మొక విషయమును గ్రహించవలసి యున్నది. మనిషి ఊహించుకున్న స్వాప్నిక విషయములు, ఎంత విచిత్ర ములయినప్పటికి, కొంత వరకు వాస్తవాలకు ప్రతిరూపములే. అయితే వాటికి మనిషి తనకు పరిచితమైన తొడుగులు తొడు గుతాడు కాబట్టి అవి అక్షర సత్యములు మట్టుకు కానేరవు.

ప్రకృతి: ప్రకృతి యనగా కేవలం విభిన్న వస్తువుల సంపుటి కాదు. వాటి మధ్యన పొత్తు వున్నది. దానిలో ఒక ఐక్యత రాణిస్తుంది. భౌతిక వస్తువుకు, ఈ ప్రాణిక లేక వాంఛా జగ త్తుకు మధ్య దుర్భేద్యమైన గోడలు లేవు. అంతేకాదు, ఒక రకంగా అవి పరస్పరాశ్రయములు. కొంతవరకు పరస్పరాధార ములు కూడా. నిజానికి మనభౌతికలోకము ప్రాణికలోకం నుండి ప్రక్షేపించబడి, పిదప దానినుండి వేరుచేయబడినదియు, ప్రాణిక తత్త్వము ప్రాణికేతర పరిస్థితులలో కోరికలను కోరగా, వాటిని నిర్వర్తించుకోవాలనే ప్రయత్నము యొక్క ఫలితమూ అయివున్నది. అది తన భౌతిక ఆశయముల యొక్క సహజ పర్యవసానము.

భూలోక జీవితము: ఈ భౌతికవిశ్వము యొక్క అచేతనా భౌతిక తత్వములపై ప్రాణలోకము వత్తిడి చేయగా, ఈ గడ్డ మీద జీవ రాసులు పుట్టినవి. అధికతరమైన, అతిగంభీరమైన నిజ ప్రాణ పురుమడు (vital being) ప్రాణస్తరములో ఉన్నాడు. వాని యొక్క ఉపరితల సంకుచిత రూపము మాత్రమే మనలో అభివ్యక్తమై యున్న ప్రాణపురుమడు. ఆ నిజ ప్రాణపురుమని ద్వారా మనకు ప్రాణప్రపంచముతో సంబంధము గలదు. ఈ ప్రాణలోకము మన జీవితానికి చాలాముఖ్యమైనది. అది నిరంతరం మన మీద దాని ప్రభావమును ప్రసరింప జేస్తూ వుంటుంది. అంతే గాదు. ఈ భౌతిక ప్రపంచకంలోని ప్రతి చర్యను వెనుకనుండి నడిపించే శక్తి ప్రాణలోకమునదే. మన లోకములోని పంచభూతముల మూలాధారములు కూడ ప్రాణలోకానికి చెందినవే.

*

మానసికస్తరము: ఈ సోపానముల క్రమము ప్రాణలోకముతో సరి కాదు. దానిపైన ఉన్నతతర స్తరములు కలవు. ప్రాణలోకమునుగురించి పైన చెప్పిన విషయములు కొలది మార్పులతో వీటికి కూడా వర్తించును. ఉదా: ప్రాణలోకములోని మూలధాతువు ఏవిధంగా ప్రాణవస్తువు అయివున్నదో, అదే విధంగా మానసిక లోకంలోని మూలధాతువు మనస్సు (ప్రాణిక భౌతికములు కావు). దీని అర్థమేమిటి? మనకు శరీర స్థితమైన మనసుని గురించే తెలుసును గాని ఎట్టి ఆధారము లేక స్వతంత్రంగా వుండే మనసుని గురించి తెలియదు. అక్కడ (మానసిక లోకంలో) బుద్ధి మానసములు స్వేచ్ఛామూర్తులు. అవి వాటి ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించి తమ అభీష్టములను శరీరగత, ప్రాణగత మనస్సు ఊహించలేని రీతిగా — నెరవేర్చుకోగలవు. ఆ లోకపు అధినేత (పురుమడు) శుద్ధమానసము. ప్రకృతిలో తన సంబంధము ఏ విధంగా వుండాలో తనే నిర్ణయించుకొంటుంది. భూలోకంలో ప్రాథమిక వస్తువు పదార్థమే కదా. అదే విధంగా ఆలోకంలో ప్రాథమిక వస్తువు మానసికము — ప్రాణికము గాని భౌతికము కాని కాదు. ఇక్కడ భౌతికధాతువు ఆధారంగా జీవ

రాసులు, ప్రాణులు ఏర్పడిన విధంగానే, అక్కడ మానసిక పురుషుని అభీష్టానుసారము ప్రాణిక భౌతికములు ఏర్పడును. వాటికి కూడ మనస్సు ఉంటుంది. అది మానసికస్తరము మొదట ప్రాణలోకం మీద, తరువాత భౌతికపదార్థగత ప్రాణికముమీద చేసిన వత్తిడియొక్క ఫలితము. మానసికధాతువు ప్రాణలోకంలోదాల్చిన రూపమే మనలోని వాంఛామనస్సు. తన సామర్థ్యము వలన మనలో నిర్దోషమైన నిర్మల (పరిశుద్ధ స్థాయిలో) చైత్యాత్మిక (psychic) మేధాశక్తులను అది జాగృతము జేస్తుంది. అయితే మన ఉపరిగత మనస్సు యొక్క మూలము వేరు. అది అంత కంటె చాల పెద్దదైన అవమానసము (subliminal) యొక్క పాక్షిక ఫలితమే. ఈ మానసిక ప్రపంచం కూడ మన మీద, మన లోకం మీద తన స్వభావాన్ని చూపుతూనే వుంటుంది. దానికి కూడ శక్తులు, మూర్త రూపములు కలవు. మన శరీరము (పదార్థము) ద్వారా మనకు దానితో సంబంధమున్నది. అక్కడ చైత్య, మానసిక లోకములు కలవు. ఈ పురుషుడు శరీర పతనానంతరము ఆ లోకములకు పోయి తిరిగి పార్థివ జీవేచ్ఛ కలుగునంత వరకు అక్కడ విశ్రమిస్తాడు. అందులో కూడ పెక్కు స్తరములు కలవు. వాటిలో నిమ్నతమమైనది క్రింది లోకముల వరకు విస్తరించి వాటితో కలసిపోతుంది. మానసికశక్తి యొక్క పరమోచ్చస్తరము దివ్యలోకములలో కలసిపోతుంది.

*

అతిమానస లోకము: పరమోచ్చలోకములు అతిమానసములు. స్వతంత్రమైన దివ్యబుద్ధి[1] జ్ఞానములకు, సచ్చిదానందత్రయమునకు చెందినవి. ప్రకృతితో ఆత్మ సలుపు ఖేలనము యొక్క ఇరుకు సందులలోను, సంకుచిత పరిస్థితులలోను పురుషుడు పతనము జెందగా కలిగిన ఫలితములే ఈ అధోలోకములు. కాని మనకు

---

[1] విజ్ఞానము లేక బుద్ధి. కాని బుద్ధి అనే పదము మనస్సుకు కూడా వర్తిస్తుంది కాబట్టి జాగ్రత్త వహించాలి. ఈ బుద్ధి అసలైన దివ్యజ్ఞానము యొక్క నిమ్నరూపము మాత్రమే.

ఈలోకములకు మధ్య దుర్భేద్యమైన అఖాత మేదియు లేదు. జ్ఞానకోశము, ఆనందకోశము, కారణ (దివ్య) శరీరముల ద్వారా ఆ లోకములు మన మీద వాటి ప్రభావమును చూపుతాయి. మన మానసిక శరీరము ద్వారా పరోక్షంగా పనిచేస్తాయి కూడా. వాటి (పరమోచ్చలోకములు) రహస్య శక్తులు మన ప్రాణిక భౌతిక జీవితముల మీద కూడ పనిచేస్తాయి. శరీరధారి అయిన ఈ మానసిక పురుషని మీద ఈ పరమోచ్చ లోకములు జేయు వత్తిడి వలననే మనలో దివ్యజీవుడు, స్వయంస్ఫోరక మానసము (intuitive mind) జాగృతమౌతాయి. అయితే, అధిక సంఖ్యాకులలో ఈ కారణ శరీరము స్పష్టంగా ఉండదు. కాబట్టి వారు దానిలో వసించలేరు. అతిమానస స్తరములకు (మానసిక జీవిలో గల అనురూపములు గావు) ఆరోహించలేరు. ఆ లోకములో పూర్ణ చైతన్యమును పొందటమనేది మానవమాత్రునికి మిక్కిలి జటిలము. సమాధి స్థితిలోనే అది సాధ్యమగును. వ్యష్టి పురుషనిలో కొన్ని శక్తులు ఉద్భవించినపుడు కూడా అది సాధ్యమగును. దాని స్వరూపము సాధారణ మానవునికి ఊహించలేని విషయము. పురుషడు ప్రకృతి మీద పూర్తిగా తన ఆధిపత్యమును జరిపినప్పుడు, అటువంటి సంపూర్ణ ఆత్మచైతన్యమును సంపాదించినప్పుడే అది సాధ్యము. ఏలన అప్పుడు మనస్సు ప్రథమ నిర్ణేత కాదు. భేదప్రతిష్ఠితమైన ఈ క్రింది వ్యవస్థను సహితము, దివ్యశక్తియో ఊర్ధ్వశక్తులో నిర్వహించుటవలన వాటిపూర్ణసామర్థ్యమును అందుకోగలుగుతాయి. అప్పుడే అంతర్నిహితమైన వస్తువు యొక్క పూర్ణవికాసము, క్రింది స్థాయిలో వున్న స్థావరముల పూర్ణాభివృద్ధి సాధ్యమవుతాయి. తమాషా ఏమిటంటే పురుషడు వుద్దేశ్యపూర్వకంగానే పృథ్వీజీవితములోని అతిక్లిష్టమైన పరిస్థితులను ఎంచుకొని దానిని దివ్యమయము చేయుటను ఒక సవాలుగా స్వీకరించాడు. ఈ పరిణామమే విధంగా సంభవమైనదో పై వివరణములో చెప్పబడింది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

దివ్యప్రణాళిక

పాంచభౌతిక దేహంనుండి విశ్వాంతరాళంలోకి తొంగిచూసే యోగి మర్త్యత్వం నుండి అమర్త్యత్వానికి; అజ్ఞానం నుండి జ్ఞానానికి; తమస్సునుండి జ్యోతిస్సుకి; దుఃఖం నుండి ఆనందానికి; అసత్తు నుండి సత్తుకి; శబ్దం నుండి మౌనానికి ఎదుగుతాడు. తొలిదశ మాయాచ్ఛాదితం; పరిమితం — కాలం, రూపం, భావం అన్నీ పరిమితం చేస్తాయి. తుదిదశ లేక కట్టకడపటి దశలో, పరిమితి లేదు. ఈ దశల మధ్యగల ఒక ప్రహేళికనే శ్రీఅరవిందులు దివ్యప్రణాళిక అని వ్యవహరించారు.

కేవలం భౌతికమైన దేహంనుండి అనధిగమ్యాశ్రయాఖండిత తత్త్వం (THE SUPREME SELF-CONTAINED ABSOLUTE) వరకుగల స్థితిని నాల్గుదశలుగా శ్రీఅరవిందులు వివరించారు. ఈ స్థితిలో అట్టడుగున శ్రీమద్భగవద్గీతా ప్రోక్తమైన 'పరమేశ్వ రుడు' అనే భావనను, తంత్ర ప్రోక్తమైన 'పరమేశ్వరి' అనే భావనను ఉటంకించారు.

దివ్యప్రణాళిక

A

సర్వము తనలోనే నిక్షేపించుకున్న కేవలతత్త్వము
*పరబ్రహ్మము**

మొదటి దశ — తత్ కేవలతత్త్వపు సర్వాతీత దశ పరమము. పరాత్పరుడు (సర్వమును ధరించిన వాడు. ఆదిమధ్యాంత రహితుడు)

రెండవ దశ — సత్ పరమ స్వయంగర్భిత కేవల అస్తిత్వము. సచ్చిదానందము (సత్, చిత్‌లను అను సంధించే ఆనందము) దాని కేవల ఏక త్వములో ద్వంద్వ తత్త్వములైన సః, సా మరియు చతుర్ముఖతత్త్వమైన 'ఓం'.

మూడవ దశ — అదితి అదితి పరమము యొక్క అవిభాజ్య చిత్‌శక్తి, ఆనందము. దాని సజీవ క్రియా శీలమే మదర్. ఆమెయే పరమప్రేమ, జ్ఞానము, శక్తి, ఆద్యశక్తి — తంత్రప్రోక్త మైన ఆద్యాశక్తి పరబ్రహ్మ.

నాల్గవ దశ — గీతాప్రోక్తమైన పరమేశ్వరుడు = తంత్రప్రోక్తమైన పరమేశ్వరి.

తత్

|

సత్

|

అదితి — శ్రీమాత **(The Mother)**

పరమేశ్వరుడు *పరమేశ్వరి*

|

అభివ్యక్తము

* భారతీయ తత్వచింతన బ్రహ్మ అనియు. ఐరోపాతత్వ చింతన. నిశ్శేషము, నిరపేక్షము, కేవలము లనియు పిలచెదరు.

B

అభివ్యక్తి

I

మొదటి దశ అవ్యక్తము — సచ్చిదానందము, పరబ్రహ్మము అంతర్హితంగా వున్న పరమాత్మ (పరమేశ్వరుడు — పరమేశ్వరి)

రెండవ దశ అదితి. పరమాత్మను తనలో ధరించివున్న మాతృమూర్తి (The Mother). సమస్త లోకములకు ఆధారభూతమైన దివ్యచైతన్య శక్త్యానందములు. పరాశక్తి, పరాప్రకృతి, మహామాయ (యయేదం ధార్యతే జగత్)

మూడవ దశ చిరంతనాభివ్యక్తి (పరమలోకములు: సత్యలోకము, చైతన్యలోకము, తపోలోకము, ఆనందలోకము — మనస్సుకు చెందినవి కావు)

అవ్యక్త పరాత్పరుడు

అదితి — శ్రీమాత (**The Mother**)

శాశ్వతాభివ్యక్తి

పరమేశ్వరుడు + పరమేశ్వరి (ఆద్య మహాశక్తి)

సత్యలోకము చైతన్యలోకము తపోలోకము ఆనందలోకము

దివ్యజ్ఞానము — అతిమానసము

అనంతకాలంలో అభివ్యక్తి

II

నిత్వత్వంలో అభివ్యక్తి

దివ్యజ్ఞానం

సత్యం — ఋతం — బృహత్

అవ్యక్త పరాత్పరుడు

అదితి — శ్రీమాత (The Mother)

(విజ్ఞానేశ్వరుడు — విజ్ఞానేశ్వరి)

సద్ఘనలోకము చిద్ఘనలోకము — తపోఘనలోకము

ఆనందఘనలోకము

శ్రీమాత యొక్క సప్తలోకత్రయము

విజ్ఞాన లోకము

సత్యమానసము

శాశ్వత పదార్థములో సత్యస్వరూపము

కాలీనమైన అభివ్యక్తి

అభివ్యక్తిలోని క్రమస్థాయిలు

పరమాత్మ

|

అవ్యక్త సచ్చిదానందము — సకలమును అభివ్యక్తము చేయగల సామర్థ్యము గలది

|

సచ్చిదానందము యొక్క అభివ్యక్తి

అనంత చైతన్యము యొక్క సోపానములు

1. సత్ (చిత్ తపస్సు, ఆనందము)
2. చిత్ (సత్యము, ఆనందము)
3. ఆనందము (సత్యము, చిత్ తపస్సు)

|

అతిమానసము లేక దివ్యజ్ఞానము

(స్వయంనిశ్చయాత్మకమయిన అనంతచైతన్యము)

మన ఊర్ధ్వాభిరోహణ దృష్ట్యా ఇది సత్యచైతన్యము. క్రింది లోకములోని అజ్ఞానము కంటె భిన్నము.

అధిమానసము లేక మాయ

అధిమానసము అతిమానసము నుండి దిగివచ్చే సత్యమును గ్రహిస్తుంది. అయితే ఈ అధిమానస లోకంలో ఒక్కొక్క సత్యము ఒక్కొక్క భిన్నమైన శక్తిగా గాని భావముగా గాని పరిణమిస్తుంది. ఇవన్నీ పరస్పర ఘర్షణచెంద వచ్చును. లేదా సహకరించ వచ్చును. ప్రతి ఒక్క అధిమానస దేవతకు తన స్వంత లోకముంటుంది. అది తన రాజ్యము. విశ్వలీలలో తనుకూడ తన యొక్క ప్రత్యేక ఖేలనము ద్వారా సఫలీకృతమౌతుంది. అంతా సాధ్యమే. పరస్పర సంఘర్షణము, వైరుధ్య ప్రక్రియల నుండి గూడా భిన్నమైన ఫలితములు కలుగవచ్చును. దీనికి కారణము మనస్సు, ప్రాణము, పదార్థముల ఆవిర్భావము — అజ్ఞానము, అచేతన, అసత్యము, దుఃఖము, మృత్యువు వీటి నిర్వాకములే.

అతిమానసము నుండి మానసమునకు అవరోహణము

అధిమానస జ్ఞానము

(అధిమానస స్థాయికి కుంచించబడిన అతిమానసము. దాని సృష్టి నిజమైనదే అయినప్పటికి దానికి అవధులున్నవి.)

నిజఅధిమానసము

నిర్మాణాత్మకమైన మాయ
(ఆవశ్యకము)

అధిమానస న్యాయము
(సంబంధములను నిర్ణయించునది)

స్వయంస్ఫోరక అధిమానసము
(మిగిలిన రెండు శక్తుల రచనలను గ్రహించగలదు)

మహోన్నత మానసము
(స్వయంస్ఫోరక చైతన్యము)

ఉన్నతమానసము

ప్రదీప్త మానసము

స్వయంస్ఫోరక మానసము

విముక్తమైన మేధ

నిజమానసము (మానవీయము)

వివేచన

సక్రియాశీలకమైన మేధ
భ్రుకుటి కేంద్రము

బహిర్వర్తిత మేధ
కంఠ కేంద్రము

ప్రాణిక మనస్సు

భౌతిక మనస్సు

అధో సృష్టి

మానసము

ప్రాణికము
(ప్రాణికమనస్సు, నిజప్రాణికము, భౌతిక ప్రాణికము)

భౌతికము

ప్రశ్నోత్తరములు

ప్రశ్న: జననీ! మీరు ఇక్కడ "దైవసన్నిధికి చేరినప్పుడు ప్రతివారూ మనస్సులో ఉండే భావనలన్నిటినీ తెంచేసుకోవాలి. కానీ ఆ విధంగా చేయకుండా, మీ అభిప్రాయాలను భగవంతునిపై రుద్ది ఆయనే వాటికి లోబడి నడుచుకోవాలంటారు", అని అన్నారు కదా! అది కొంచెం విపులంగా చెపుతారా?


శ్రీమాత: అది నిజమే. ప్రతివారూ ఎప్పుడూ అలానే అనుకుంటున్నారు. నీవు అర్థం చేసుకున్న దానికి భిన్నంగా ఉంటే దైవం కాదు అనీ, నీకు కావలసినది నెరవేర్చనప్పుడు, నీవు అనుకున్నట్లు చేయనప్పుడు, నీ మనస్సులో అనుకున్న లక్షణాలు కనబడనప్పుడు అది దైవం కానే కాదని అనుకుంటావు. "నేను మనస్సులో అనుకున్నట్లు నీవు చేసిపెడితేనే నిన్ను దైవమని గుర్తిస్తాను", అని అంతా అనుకుంటారు. సహజంగా ఈ విషయం ఎవరూ ఒప్పుకోరు. అంతటి చిత్తశుద్ధి ఎవరికి ఉండదు. కానీ ఇది ముమ్మాటికి నిజం. దీనికి కొన్ని లక్షల ఉదాహరణలు చూపించగలను. మీ అందరిలో కూడా ఇలా చేయనివారు ఒక్కరు కూడా ఉండరు. మీకు తెలియకుండానే అనుకుంటారు — "దైవాన్ని శరణాగతి పొంది ఆ దైవసంకల్పాన్ని నెరవేర్చడానికి నేను సర్వదా సంసిద్ధుడనే. ఒక షరతు ప్రకారమైతేనే ఆయన ఉనికిని, పనిని అంగీకరించగలను. ఆయన నేననుకున్న పద్ధతిలో ఉండాలి, ఆలోచించాలి, భావించాలి, పనిచేయాలి". ఇటువంటి దాన్ని మచ్చుకొకటి త్వరలోనే మీ కంటి ముందు కనబడేలా చేస్తాను. ఇది అబద్ధం కాదు. అతి త్వరలోనే చూపిస్తాను. సరేనా!

ప్రశ్న: మధుమయీ, ముష్టివాళ్ళకి డబ్బు ఇవ్వాలా, వద్దా?

శ్రీమాత: సువ్యవస్థితమైన సమాజంలో ముష్టివాళ్ళుండ రాదు. ఒక వేళ ఉన్నట్లయితే నీకు తోచినట్లు చెయ్యవచ్చును. 'ముష్టి వెయ్యాలి' అని వెయ్యకూడదని రెండు వైపులా వాదించవచ్చును.

మూలం: శ్రీమాత

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వేంకట్రామ శాస్త్రి



aspiration

శ్రీమాత జీవితంలోని ఒక సంఘటన

నీవు మనస్ఫూర్తిగా ఆధ్యాత్మిక జీవితం గడపాలనుకున్నప్పుడు చికాకు కలిగించే అనేక సంఘటనలు ఉప్పెనగా నీ మీదికి వచ్చిపడవచ్చు. నీ ప్రాణమిత్రులతో కలహాలు రావచ్చు. నీ వాళ్ళే నిన్ను ఇంట్లోనుంచి గెంటేయవచ్చు. నీకు లాభించినదే తిరిగి చేజారిపోవచ్చు. ఒకాయనకు ఇలానే జరిగింది: ఆయన ఎంతో ఆకాంక్ష పెట్టుకొని భారతదేశం వచ్చారు. అప్పటికే ఆయన ఎంతో కృషి చేసి జ్ఞానం సంపాదించి యోగం కూడా అభ్యసిస్తూ ఉండే వారు. ఆ రోజుల్లో అందరి దగ్గరున్నట్లే ఆయన దగ్గర కూడా ఒక గొలుసు గడియారం ఉండేది. ఆతని పితామహి ఇచ్చిన బంగారపు పెన్సిలు కూడా ఆ గొలుసుకే వ్రేలాడదీసి ఉంచుకునే వాడు. ఆ పెన్సిలును అతను చాలా అపురూపంగా చూచుకొనే వాడు. అతను ఓడలో ప్రయాణించి ఒకానొక రేవు పట్టణం చేరి నప్పుడు (అది పాండిచ్చేరి రేవో, మరే పట్టణమో? లేక కొలంబో రేవు కావచ్చు) ఒక చిన్న నావలోకి మారవలసి వచ్చింది. ఆ ఓడలో నుంచి ఒడ్డుకు చేరవేసే చిన్ననావలోకి దుమికినప్పుడు కాలు పట్టుతప్పి నిలదొక్కుకోవడంలో చిన్న ఒడిదుడుకు జరగటం వల్ల అతని గొలుసులోని బంగారపు పెన్సిలు జారిపోయి తిన్నగా సముద్రగర్భం చేరిపోయింది! అతనికి చాలా బాధ కలిగినప్పటికీ వెంటనే తెప్పరిల్లుకొని, "ఆహా! ఇది భారతదేశపు మహాత్మ్యమే. భవబంధాలనుంచి నాకు విముక్తి కల్గింది", అనుకున్నాడు. అతి నిజాయితీకల వారికే ఇటువంటి కనువిప్పు కలుగుతుంది. నిజా నికి నిష్ఠాగరిష్ఠులకే కష్టాల ఉప్పెన మరింతగా వచ్చిపడుతుంది. మిగిలిన వారికి మాత్రం అంతా ఆనందమయంగా అందంగా జరిగిపోతూంటుంది. చివరకు మాత్రం అది ఒట్టి భ్రమ అనీ, మోసం జరిగిందనీ తెలుసుకోగలరు. ఎవరికైనా కష్టాలు అధికంగా వచ్చినప్పుడు అతని నిష్ఠాగరిష్ఠత ఋజువవుతుంది.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి. ఎ. వెంకట్రామశాస్త్రి

తల్లిదండ్రులకు పిల్లల విద్యావిషయములు

ప్రతిమానవుడు తన వర్తమాన జీవితపు హద్దుల నధిగమించు మహోన్నత చైతన్యమును తనలో ధరిస్తాడు. ఆ చైతన్యము ఈ మనుమల జీవితం యొక్క స్థాయిని పెంచి దానిని గంభీరము, విశాలము చేయగలదు. నిజానికి మహానుభావులనిపించే వారి జీవితాలను నడిపించేది ఈ ఉన్నత చైతన్యమే. వారి మనుగడ ప్రమేయములను, ఆ ప్రమేయములకు వ్యక్తిగత స్పందనలను — ఈ రెండింటిని ఈ చైతన్యమే నిర్వహించును. మానవ మనోభవ చైతన్యము, తెలిసికొనలేని దానిని, చేయలేని దానిని, ఈ చైత న్యము తెలిసికొనగలదు, చేయగలదు. అది బహిశ్చేతనము యొక్క నిబిడమైన ముసుగు ద్వారా ప్రసరింపచేస్తూ, ప్రాణి కేంద్ర స్థానమున ప్రకాశించు వెలుగు వంటిది. కొందరికి అది చూచా యగా తెలుస్తుంది. అయత్నకృతమైన చేష్టలు, వారి మాటలవలన పిల్లలు దాని ప్రభావములో నుండినట్లు కొన్ని సమయములలో చూపును. తల్లిదండ్రులు ఈ విషయాన్ని అర్థం చేసుకోలేక పోవటం చాలా దురదృష్టకరము. అది ఏమిటో తెలియకపోవుట చేత వారి పిల్లలలో ఏమి సంభవించుచున్నదో అవగాహన లేక పోవుటచేత, వారి దృష్టిని బాహ్య విషయములపై కేంద్రీకరింప చేయుటకు అలవాటు చేసి, అవి మాత్రమే ప్రధానములని ఆలో చించునట్లు చేయుదురు. బాహ్యావిష.ములపై ఆసక్తిని కేంద్రీకరిం చుట సవ్యంగా జరిగినట్లయితే అది ఉపయోగకరమే. భౌతిక, ప్రాణిక, మానసిక విద్యలనెడి మూడు శాఖలు దానికి దోహక ములు. అవి వ్యక్తిత్వ నిర్మాణాత్మకములు. అస్తవ్యస్తమైన అవ చేతన నుండి, సచేతనమైన ఒక వ్యక్తిని తయారుచేయు సాధన ములు. చైత్యవిద్య (psychic education) జీవితము యొక్క అసలు సమస్యకు సంబంధించినది. ప్రాపంచిక జీవితము యొక్క లక్ష్య మేమిటి? జీవనసరళి అంతా ఆ లక్ష్యమునకే దారితీయవలెను. దానిని కనుగొనినప్పుడు వ్యక్తి తన జీవితమును దానికే ఆహుతి చేయును.

ఆత్మవిద్య (చైత్యవిద్య) ను గురించి చెప్పేముందర చైత్య పురుషుడంటే ఏమిటో మొదట తెలుసుకోవాలి. వ్యక్తి యనగా దేశకాలపరిస్థితులలోకి ప్రక్షిప్తమైన ఆత్మ — సర్వోన్నతమైన, అంతర్గర్భితమైన, అనంతమైన సంభవములలోని ఒక రూపము. అఖండము, సర్వతోముఖమునైన చైతన్యము మాధ్యమముగా అఖండ సత్యము, ధర్మము మిశ్రరూపము నొందును. అది క్రమ క్రమాభి వృద్ధిచే చైత్యపురుషునిగా పరిణమించును.

ఇచ్చట సంక్షిప్తముగా చెప్పినది — యథార్థమునకు సమగ్ర వివరణమని నేను చెప్పటల్లేదు — సూచనప్రాయముగా చేయ బడిన సంగ్రహ వివరణము మాత్రమే.

వ్యక్తి యొక్క యథార్థ స్వరూపము అతని చైత్య భూమిక ద్వారానే గోచరమవుతుంది. ఆ భూమిక చాలావరకు వ్యక్తికి తెలియకుండా, గుర్తింపబడకుండా, తెరవెనుక నుండే పని చేస్తుంది. కొద్దిమందిలో మట్టుకు 'ఓహో! ఇది చైత్యాత్మ చేష్టయే', అని తెలిసేటట్లు ఉంటుంది. అరుదుగా అది ఇంకా స్పష్టంగా గుర్తు పట్టేటట్లు ముందుకు రానూ వస్తుంది. దాని కార్యమును సార్థకంగా నెరవేరుస్తుంది. అటువంటి వారు జీవితాన్ని ఏమాత్రం జంకులేకుండా నిర్భయంగా, చాలా దర్జాగా గడుపుతారు. వారి జీవితానికి వారే సారథులు. ఇప్పుడు తెలిసిందా చైత్యవిద్య (psychic education) ఎందుకు అభ్యసించవలెనో — చైత్యాత్మను కనిపెట్టి జీవితానికి ఆధిపత్యము సంపాదించుటకే.

మూలం: శ్రీమాత

అనువాదం: నండూరి వేంకట సత్య రామారావు.

∴

స్త్రీలకు బానిసత్వం నుండి విముక్తి

స్త్రీలు తమను తాము విముక్తి పరచుకోనంతవరకు ఏ చట్టమూ వారిని విముక్త పరచలేదు.

వారిని బానిసగా కట్టిపారేసే విషయాలు:

1. పురుషుని పట్ల, అతని రక్షణపట్ల ఆకర్షణ.
2. గృహజీవితం పట్ల, భద్రత పట్ల కోరిక.
3. మాతృత్వం పట్ల మక్కువ.

ఈ మూడు బానిసత్వములనుంచి వారు విముక్తులయినపుడు వారు నిజంగా మగవారితో సమానం అవుతారు.

మగవారికి కూడ మూడు బానిసత్వాలున్నవి:

1. ప్రతిదాన్ని స్వాధీనం చేసుకోవాలన్న భావన, అధికారం, పెత్తనాల పట్ల వ్యామోహం.
2. స్త్రీల పట్ల సంభోగేచ్ఛ.
3. వైవాహిక జీవితం అందించే సౌకర్యములకు కట్టుబడి పోవటం.

*

మానవ సంబంధాలపై ఆధారపడినదేదైనా కూడా నిలకడ లేనిదిగానూ, బుద్బుదప్రాయంగా, మంచిచెడుల మిశ్రమంగా అసంతృప్తిగానే ఉంటుంది. ఏదైతే దైవంలో ప్రతిష్ఠితమై దైవం ద్వారా నడపబడుతుందో అదే చిరకాలం ఉండి తృప్తినిస్తుంది.

*

నీ ఇచ్ఛను ఆచరించకు. దైవేచ్ఛనే నిర్వర్తించు. ఇతరుల ఇచ్ఛను ఆచరించటం కూడా వినాశనానికే దారితీస్తుంది.

*

నీ ఇచ్ఛను సంపూర్ణంగా దైవానికే సమర్పించు. అపుడు ఏ మానవేచ్ఛ నిన్నంటజాలదు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఆరోగ్యపత్రము

అంతరంగంలో సామరస్యం నెలకొనినప్పుడు, దృష్టినేమాత్రం శరీరం వైపు సారించనపుడు — శరీరం చక్కగా పనిచేస్తుంది. నాకు కొంతవరకు ఆ అనుభవం ఉంది.

మనిషి నిరంతరం సలిపే 'స్వాభిమానమే' వినాశనానికి దారితీస్తుంది. దీనిని చాలాసార్లు గమనించాను. మనిషి తనకు తానే నిజంగా రోగాన్ని కోరి తెచ్చుకుంటాడు. విచ్ఛిన్న చైతన్యము, సంకుచిత స్వభాములే దానికి కారణములు. ఆటంకపరచకుండా మనం అనుమతించినట్లైతే ఆ చైతన్యం, ఆ కటాక్షము మన వెంటనే ఉండి అంతా సక్రమంగా జరిగిపోతుంది. మన అర్భ కత్వం వల్లనే అంతా చెడిపోతుంది. ఈ అహంకారిక చపల త్వము ఎంత చెడ్డదో చూసారా?

*

నేను చెప్పినట్లుగా మన జీవితంలోని ప్రతి ఒక్క కదలిక (అతి సామాన్యమైనది సహితం) అహంకార నిష్ఠమైనట్లయితే అది మన శారీరక సమతౌల్యాన్ని కుంటుపరచి రోగానికి దారితీస్తుంది. దానికి విరుగుడు అహంకారాన్ని రూపుమాపడమే. దాంతోపాటు అనారోగ్యమూ మాయమౌతుంది.

*

శరీరంలోని సమతుల్యం లోపించడం కాని, అనారోగ్యంగా అనిపించినపుడు కాని — అంతరంగనిష్ఠమైన నిశ్శబ్దం పైన నీ దృష్టిని కేంద్రీకరించాలి. దైవకృపపై విశ్వాసం, మంచి ఆరోగ్యంతో ఉండాలన్న సంకల్పం ఉండాలి. అదే సరియైన భావన. '*యద్భావం, తద్భవతి*' అన్నారు కదా!

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

∴

వందేమాతరం

వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం॥

శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం, వరదాం మాతరం॥

సప్తకోటి కంఠ కలకల నినాద కరాళే,
ద్విసప్తకోటి భుజైర్ధృత ఖరకరవాలే,
అబలాకేనే మా! ఏతో బలే!

బహుబల ధారిణీం నమామితారిణీం,
రిపుదళవారిణీం మాతరం॥

తుమి విద్యా, తుమి ధర్మ —
తుమి హృది తుమి మర్మ
త్వం హి ప్రాణాః శరీరే!
బహుతే తుమిమాం శక్తి
హృదయే తుమిమాం భక్తి
తోమారయి ప్రతిమా గడి మందిరే మందిరే॥

త్వంహిదుర్గా దశప్రహరణ ధారిణీమ్
కమలా కమలదళ విహారిణీమ్
వాణీ విద్యాదాయినీ నమామి త్వాం,
నమామి కమలాం అమలాం అతులాం
సుజలాం సుఫలాం మాతరం
వందేమాతరం।
శ్యామలాం సరళాం సుస్మితాం భాషిణీం
ధరణీం భరణీం మాతరమ్॥

బంకిమ్ చంద్ర చటర్జీ

వందేమాతరం గద్యానువాదము

మాతా! నీకు మా వందనములు. నీవు నదీజలములతో, ఫల సంపదలతోనూ, మలయమారుతములతోను, సస్యశ్యామలంగా అలరారుతున్నావు. పుష్పాలంకృతమైన వృక్షములతో శోభిల్లు తున్నావు. నీ రాత్రులు చల్లని వెన్నెలతో పులకితములు. నీవే మధురహాసినివి. మధురభాషిణివి నీవే. మాతా! నీవే వరప్రదా యిని. ఆనందదాయిని. ఏడు కోట్ల కంఠారావములతో, పధ్నా లుగు కోట్ల సాయుధ హస్తములతో తులతూగుతున్న నిన్ను అబల అని ఎవరనగలరు? నీ శక్తులనంతములు. శత్రుసేనలను దునిమి మమ్ములను రక్షించే ఓ మాతా! నీకు వందనములు.

నీవే జ్ఞానము, నీవే ధర్మము, నీవే హృదయము, నీవే ఆత్మవు. నీవే శరీరములోని ప్రాణము. మా బాహువులలోని శక్తివి నీవే. మా హృదయములలోని భక్తివిశ్వాసములు నీవే. నీ మూర్తినే మేము ప్రతి ఆలయములోను ప్రతిష్ఠించెదము. ఏలన నీవే పది ఆయుధములు ధరించే దుర్గవు. పద్మములలో విహ రించే కమలమువు నీవే.

నీవే వాణివి, సర్వవరప్రదాయినివి నీవే. అమలినము, అసమానము అయిన నీకివే మా వందనములు. ఐశ్వర్యదాయినీ, నదీజలములతో, ఫలసంపదలతో అలరారే ఓ మాతా! నీల వర్ణము, నిర్మలము అయిన ఓ మధురహాసినీ, మధురభాషిణీ, ధరణీ, భరణీ, నీకు మా వందనములు

బంకిమ్‌చంద్రుడు ఈ గీతమును రచించి ముప్పైరెండు సంవత్స రములాయెను. అయినా ఇన్నాళ్ళు దీనినెవ్వరు పట్టించుకోలేదు. ఈ దీర్ఘాంధకారములో పడి కొట్టుమిట్టాడుతూ సత్యమార్గము నన్వేషించుచున్న వంగదేశపు ప్రజలు ఒక దివ్యముహూర్త మున 'వందేమాతరం' పాడారు. అంతే అది మారుమ్రోగి, దేశ మంతా జ్వలితమై, దేశభక్తితో ఉర్రూతలాడింది. మాతృదేవత సాక్షాత్కరించింది.

శ్రీఅరవిందులు (1907 లో వ్రాసినది)



ఆశ్రమ క్రీడారంగంలో బుధవారము తరగతి నిర్వహిస్తున్న శ్రీమాత

29 ఫిబ్రవరి – స్వర్ణదినము

29 ఫిబ్రవరి 1956

బుధవారం నాటి సామూహిక ధ్యానములో జరిగిన విశేషము:

నేటి సాయంకాలము దైవము ప్రత్యక్షముగా మనమధ్యన భౌతిక స్థాయిలో మూర్తీభవించెను. నేను ఈ విశ్వమునంతను మించిన బ్రహ్మాండమైన, సజీవమైన ఒక బంగారు రూపము నైతిని. ఈ లోకమును దైవము నుండి వేరుచేసిన బంగారు సింహ ద్వారము నా యెదట ప్రత్యక్షమైనది.

నేను దానిని చూసి ప్రేరేపితమై, "సమయమాసన్నమై నది", అని సంకల్పించి తక్షణమే ఒక పెద్ద బంగారు సమ్మెటను రెండు చేతులతో పైకెత్తి ఒక్క దెబ్బతో ఆ ద్వారబంధమును పటాపంచలు గావించితిని.

ఇక అప్పుడు పైనుండి అద్భుతమైన అతిమానసవృష్టి – చైతన్య వృష్టి, జ్యోతిశ్శక్తుల వృష్టి ఈ భూగోళంమీదికి ధారా ళంగా గుప్పించింది.

*

ఓ పరమేశ్వరా, నీవు ఆదేశించితివి, నేను పాలించితిని.
పృథ్విపై ఒక నూతన భానుడు ప్రాదుర్భవించినాడు
ఒక నూతన లోకము సృష్టించబడినది
గతములో చేసిన వాగ్దానములు తీర్చబడినవి.

*

ఈ క్షణికమైన శరీరానికి జన్మదినోత్సవము జరుపు కొనుట వలన కొంతమంది ముచ్చట్లు తీరవచ్చును.

చిత్ శక్తి ఆవిర్భావమంటారా – అది ఈ సృష్టిలో నిరం తరం జరుగుతూనే ఉంటుంది కాబట్టి దానికి మనము ఎప్పుడు పడితే అప్పుడే జోహారులు అర్పించుకోవచ్చు.

కాని ఒక సరికొత్త లోకము – అతిమానసలోకపు ఆవిర్భావాన్ని కళ్ళారా చూసి ఆనందించటమనేది చాలా అద్భుత మైన అవకాశము. ఎప్పుడో గాని ప్రాప్తించని మహావిషయము.

శ్రీమాత

కోరికలు

శ్రీఅరవిందుల ప్రవచనమలు

అఖిల

అఖిల భారత పత్రిక, మే 2000




కోరికలు

శ్రీఅరవిందుల ప్రవచనములు

అనుబంధం

KSReddy



వాంఛావృత దేహంలో విశుద్ధాత్మ విలాసానికి
వాంఛను కూకటి వ్రేళ్ళతో పెకలించి సన్నద్ధుడయ్యాడు,
ఆ శూన్యాన్ని పరిపూర్ణంగా భగవదర్పితం గావించి.
అంతిమము అనంత శక్తిమంతమునైన రూపాంతరీకరణ
ఆవిష్కృతమయింది.

శ్రీఅరవిందులు (*సావిత్రి, పేజీ* 318)

తృష్ణా మూలాలు

సృష్టిలోని ప్రతివస్తువు అనంతమే కాని స్థూల దృష్టికి అది పరిమితంగానే కనపడుతుంది. దీనికి కారణం అవిద్య — పాక్షిక జ్ఞానము. ఏకత్వమే ఈ ప్రపంచం యొక్క నిజధర్మమైనప్పటికి మనిషి మట్టుకు తను గీసుకున్న గిరులలో బందీ అయివుంటాడు. కాని తను అనంతమే అనే స్ఫూర్తి తన ఆత్మకు వున్నది. అందుకని తనలో స్వత్వ భావమున్నది. దీనిని తీర్చుకొనే ప్రయత్నమే కోరిక. పాక్షిక జ్ఞానము నశించి పూర్ణజ్ఞానము కలిగినప్పుడు మనిషి ఈ ప్రపంచకాన్ని స్థూలదృష్టితో కాకుండా ఆత్మీయంగా దర్శించ గలుగుతాడు. — సంపాదకుడు

అవిద్య అనే గోడలు

వాస్తవంగా 'పరిమితి' అన్నది లేదు. అది అపరిమితి లేదా అఖండత్వంనుండి అవిద్య అన్న గోడలవల్ల ఏర్పడినా మౌలికమైన అఖండ అపరిమేయతలనుండి విడివడ లేదు. ఒకగది గోడల వల్ల ప్రత్యేకమైనదిగా కన్పిస్తున్నా నిజానికది గృహమే. ఆ గది చిన్నదైనా పెద్దదైనా; తెలుపైనా, నీలవర్ణంకలదైనా గోడలను తీసివేస్తే దాని ప్రత్యేకమైన ఉనికి, ప్రత్యేకస్వభావం అదృశ్యమైపోతాయి. అప్పుడు అంతా గృహమే. గది లేనే లేదు!

స్వాత్మ విస్తృతి

ఈ ప్రత్యేకతా భావం ఖండభావన, దానినుండి నిష్పన్నమయ్యే అభివృద్ధి, స్వాత్మ విస్తృతికి సంబంధించిన ప్రేరణలు వెంటనే కోర్కెలను కల్గిస్తాయి. అదే ఆకురూపం ధరిస్తుంది. దాని సంతృప్తి కోసం ఇతర మార్గాలవలంబించటం జరుగుతుంది. ఈ కోరిక — ఇతర మార్గావలంబనం నుండి జరిగే ఆకర్షణ వికర్షణలనే ద్వంద్వ విరుద్ధ భావసంఘర్షణ ఏర్పడుతుంది. నైతిక దృష్ట్యా దీనినే ఇష్టానిష్టాలుగా ప్రేమద్వేషాలుగా చెప్పుకోవటం కద్దు.

మానసిక సౌందర్య విషయం కూడా ఆకలే. ఈ స్వాత్మ విస్తృతి ప్రేరణ తనను తాను పుష్టం చేసుకోవటానికి ఇతర

స్థితుల నన్వేషిస్తుంది. భావావేశంతో ఇతరులను కోరుకోవటం — ఇతరుల ఆలోచనావిధానాలను కోరుకోవటం లాంటి బౌద్ధిక స్థితి, వస్తువుల మనుష్యుల అందాలనాస్వాదించాలన్న సౌందర్య దృష్టి, తాత్త్వికప్రణయం — ఇత్యాది భూమికలన్నింటిలోనూ తృష్ణ స్పందిస్తుంది. అది ఇతరులను తనలోనికాకర్షించటమో తనను ఇతరుల సత్తలోనికి ప్రసరింపచేసుకోవటమో చేస్తుంది.

వేర్పాటుభావము, దాని ఫలితములు

తనను తాను ప్రత్యేకవ్యక్తిగా — స్వతంత్రునిగా తలపింపచేసేది వైయక్తిక అహంకార ప్రవృత్తి. దీని ఫలితమేమంటే విశ్వంతో ఏకత్వం పొందలేక పోవటం. సమత్వ సిద్ధి పొందలేక పోవటం. కానీ, ప్రతి దాన్ని సొంతం చేసుకోవాలనీ, అనుభవించాలనీ అనిపించటమే అహంకారం ప్రధానలక్షణం. అది సంకుచిత పరిధికి లోబడినదైనా సరే, దానినే మనిషి దైవంగా భ్రమిస్తాడు. — అది తన నిజమైన స్వరూపాన్ని గుర్తించలేదు. ఫలితంగా తానితరులతో వేరైపోవటం, తనలో తానూ వేరై మానసిక, శారీరక భాధలనుభవించటం, కోర్కెల ఉద్రేకాలకు ఉన్న శక్తిని వెచ్చబెట్టుకోవటం — అశక్తతా, దౌర్బల్యస్థితికి చేరుకోవటం, అసంతృప్తి చెందటం, తుదకు మృతికి పాల్పడటం — ఇదంతా విషమత — తాను వేరనుకోవటంనుండి ఏర్పడే స్థితి పరంపర.

తృష్ణ దుఃఖానికి మూలం. అసమతా బీజం. ఏది స్వతంత్రమో — ప్రభువో — ఏకమో దానికి తృష్ణ లేదు. అది అవిరుద్ధ భావన లేని యజమాన స్థితి. ఆ భూమికలో భోగానుభవం దాని సొత్తు.

*

తృష్ణావిముక్తి

విశ్వవాసమునునుభవించటం రక్తి. వైరాగ్యమనగా సర్వాన్ని కోరిక లేకుండానే అనుభవించటం. అనగా వ్యక్తి తృష్ణాశూన్యుడై కోరికనుండి విడివడి విశ్వస్థితి ననుభవించగలడు.

భౌతికతను కాదనటం అనగా తననుతాను లుప్తం చేసుకోవటం కాదు సన్యాస ధర్మం. వస్తురూపాలపై ఆసక్తిని వీడి తత్త్వాన్ని వేరుచేసి చూడటం.

ఈ స్వాతంత్ర్యసిద్ధికి అంగాలు అహంకారం నుండి విడివడటం — దీని ఫలితంగా తృష్ణా విముక్తి. ఈ విరక్తి భావమేమంటే సృష్టిలో ఏ వస్తువుపైనా స్వత్వబుద్ధి వుండకపోవటం. ఇంద్రియాల్లోకానీ, హృదయంలో కానీ వస్తువాసన కూడా వుండకపోవటం.

ప్రతి వస్తువు ఆత్మ పదార్థమే

ఈ సమతాదృష్టి ఏకతా దర్శనంపై ఆధారపడి వుంటుంది. ప్రతిజీవీ ఆత్మస్వరూపమేనని చెప్పబడింది కదా! ప్రతివస్తువూ వేరుగా వున్నట్లు కన్పిస్తున్నా అన్నీ ఆత్మపదార్థంలో వున్నవే. పరమాత్మ అన్నిటిని వొదిలి మళ్ళీ పట్టుకొన్నాడు. ఏదీ అతని కౌగిలి నుండి విడివడి వేరుగా లేదు — దానికి బైట ఏమీ లేదని తాత్పర్యం.

కనుక తేలిందేమంటే, మనం అహంకారాన్ని అధిగమించి ఊర్ధ్వభూమికకు విస్తరించాలి. సర్వోత్తీర్ణం కావాలి. అప్పుడే ఆత్మ ఏకత్వ స్థితిని దర్శించగలం. సర్వవిశ్వమూ అప్పుడు ఏకమైన విశ్వచైతన్య భూమికలో వున్నట్లు చూడగలం. అపుడిక భౌతికంగా దానిపై స్వత్వభావన నశిస్తుంది.

పరమేశ్వరునితో అభిన్నుడనన్న భావం దృఢపడినంతనే సర్వవస్తుగతమైన అఖండానందానుభూతి కలుగుతుంది. అప్పుడు కోర్కెతో పనేమున్నది?

సర్వజీవ సమైక్యం సిద్ధించినపుడు వ్యక్తిగత దశలో — విరాడ్దశలో విశ్వాత్మ అభివ్యక్తిలోని ఆనందాన్నే అనుభవిస్తున్నాం. విశ్వజనీన దశలో — విశ్వోత్తీర్ణ దశలో వ్యక్తి స్వతంత్రుడై — పరమేశ్వరుని వ్యక్తస్వరూపమైన విశ్వగతిలో భాగస్వామి కాగలడు.

*

బంధం నుండి విడుదల

కాబట్టి కర్తవ్య మేమంటే మనమహంకారం, తృష్ణ అనే ప్రత్యేక వ్యక్తిత్వాన్ని వదలి పెట్టటం.

ఈ పరిత్యాగ ఫలం సంకుచితత్వ విముక్తి. దుఃఖం నుండి విడుదల. మోహజాలంనుండి బైటపడటం. దుఃఖమంటే విశ్వస్థితి నుండి అహంకారంవల్ల నేను ప్రత్యేక వ్యక్తిననుకోని విడిపోవటం. భయం, దౌర్బల్యం, ఇష్టానిష్టాలు, — వంటివన్నీ వ్యామోహ జన్యాలు. నేను ప్రత్యేకవ్యక్తినన్న భావం నుండి పుట్టేవి. ఈ అహంభావన వల్ల నేనుకాని దానితో సంబంధంపెట్టుకోవటం జరుగుతుంది. ఈ బంధంనుండి విడివడిపో. అంతటా ఏకత్వాన్నే దర్శించు. సర్వవస్తుగతంగావున్న దైవంతో తాదాత్మ్యం పొందు. అప్పుడహంకారమదృశ్యమై పోతుంది. అదిలేదు, ఇదిలేదన్న కోర్కెల సంకెల త్రెంచుకో. దైవసృష్టిలో అతని ఆనందాంశననుభవిస్తే కోర్కెలు — సంతృప్తి, అసంతృప్తులుండవు.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు.

∴

మన బాహ్య జీవన సరళి

మానవుని మూలరూపము ఆత్మ. అది సర్వజ్ఞము. కాని ఆతని ఇంద్రియజ్ఞానము పాక్షికము. ఆతని స్థూలజీవితమును నిర్వహించునది ఈ పాక్షికజ్ఞానమే. ఆతని పరిసరములకు స్పందించి వాటితో వ్యవహరించునదియు ఇంద్రియజ్ఞానమే. కాని ఇది అహంకారజనితము. మానవమనస్సు, తార్కికబుద్ధి కూడ ఈ భజనమండలికి చెందినవే! ఈ అహంకారము యొక్క పరివేషములను చూసి వాటినే మన నిజస్వరూపములుగా భ్రమగొనెదము. ఈ అహంకారజీవి ఎవరో కాదు. ప్రకృతి తన ప్రయోజనములకై సృష్టించుకొన్న వస్తువు. మనము దాని వలయాలలో చిక్కుకొని పరిభ్రమిస్తూన్నంత వరకు స్వేచ్ఛ ఎక్కడిది? మనలో నిక్షిప్తమై వున్న శక్తిని వశపరచుకున్నప్పుడే అది సాధ్యము.

— సంపాదకుడు

మన మీద బాహ్యా ప్రపంచ ప్రభావం

దృశ్యమాన ప్రపంచంలో కంటబడే భౌతికప్రకృతికి సంబంధించిన వివిధాంశములకు, వాని పైపై మెరుగులకు ఆకర్షితులై వానిపై విడవడని మోహాన్ని పెంచుకొని వాటికి లోబడటమే ప్రాధమిక జీవన సత్యం. స్వాభావికమైన మన సాధారణ బాహ్యా జీవనక్రమంలో మనల్ని ప్రభావితం జేసే ప్రథమము, మౌలికము ప్రగాఢమునైన అంశం. ఈ మౌలిక సత్యం మనకు జీవితంలో ఇంద్రియాల ద్వారా ఆవిష్కృత మవుతుంది. ఇంద్రియముల ద్వారా జీవితం ఈ ప్రాపంచిక విషయ సుఖాలకు సమ్మోహితమై, వాటిని పొందటానికి, సొంతం జేసుకోటానికి ఉపక్రమిస్తుంది. ఈ కోరికల నంటుకొని ఉండి ఫలితాలకై ప్రయత్నిస్తుంది గాఢంగా, దృఢంగా, తీవ్రంగా.

మనస్సు, ఇంద్రియములకు బంధీ

మనస్సు తన కత్యంత సహజమైన సకల ఆంతరంగిక సంవేదనలకు, అనుభూతులకు, ఉద్రేకములకు, ప్రతికూల చర్యలకు, ఆవేశకావేషాలకు, ఆలోచనలకు, ప్రకృతి సహజంగా అలవాటుపడిన మానసిక ప్రవృత్తులకు, సున్నితమైన హృదయ స్పందనలకు దాసోహమని వాటిని మన్నించి, ఈ ఇంద్రియ చర్యలకు సానుకూలంగా తలూపుతుంది. వివేక వివేచనా జ్ఞానంగల బుద్ధి కూడా తందాన తాన తానతందాన అంటూ మనసునే అనుసరిస్తుంది — ఇంద్రియలోలత్వానికే డూడూ బసవన్నలా తలూపుతూ, ఆ ఇంద్రియ వలయంలో తా బందీయై. ఈ తరహా జీవనంలో ప్రాణిలోని అంతర సత్వం దృశ్యమాన వస్తు సముచయ బాహ్యా తళుకు బెళుకుల ప్రభావానికి లోబడి, ఆ వలయంలో బందీయై ఉన్నందున ఒక్క నిముసమైన ఆ వలయ పరిధికి మించి, దానిని అధిగమించి దానికి ఇసుమంతయైన భిన్నంగా సత్యావలోకన గావించి స్పందించలేదు సరి కదా, ఆ వలయంలోని చర్యలకు మన ప్రతికూల స్పందనలను, మానసిక అనుభూతులను, ఫలితాలను, ప్రతి చర్యలను సరకుగొనసైన గొనదు. బుద్ధికి ఇంద్రియాలకు

భిన్నంగా వ్యవహరించ లేదు. ఎందుకంటే అది అహంకారావృ తమ్మై, నేను నాది యన్న భావనలో కూరుకోపోయి, తన నిజ స్వరూప తత్త్వా లేమిటో తామఱచి, ఆ సత్యాన్ని శోధించి ఎఱుక పరచు కోవాలన్న స్పృహకూడ కోల్పోయి జడమైంది. కనుక ఈ అహంకార తత్త్వ మాధ్యం ద్వారా బుద్ధి తన వివేక వివేచనా జ్ఞానాల నుపయోగించి మన మనో సంకల్ప దేహేంద్రి యముల మీద ప్రకృతి ప్రభావ సంగ్రహ ఫలితార్థాలను ఆశిస్తుంది. అన్యమనస్సుల సంకల్పముల, నాడీమండల వ్యవస్థల, దేహముల పై ప్రకృతి ప్రభావ సంగ్రహ ఫలితార్థములను గూర్చి సమతుల్యా పరిశీలన గావించి వాటి మధ్య గల తారతమ్యతలను విశ్లేషించి వింగడించి, విశద పరుస్తుంది.

మన అహం ప్రకృతి ప్రభావితం

అందుచేత మనకు జీవితమంటే ప్రకృతి మన అహాన్ని ఎంత మేరకు ప్రభావితం చేస్తుందో, ఆ ప్రభావానికి మనలోని అహంకారం ఎంత మేరకు సానుకూల్యంగా సమాధానమిస్తుందో అంతే. అదే ఈ పద్ధతి జీవనక్రమంలో ప్రాణుల జీవన పరిధి. ఇంతకు మించిన ఎఱుక మనకు లేదు. ఇంతకు మించి మనమేమీ కామేమోనని కూడా అనిపిస్తుంది. మనం అంతేనేమో మరి! పిదప మనలో, ఆత్మ దానికది గూడ ఓ ప్రత్యేకమైన మనోసంకల్పోద్రేకముల మరియు నాడీమండల సంభావనా ప్రతికూలముల ముద్ద యన్న భావం కదలాడుతుంది. మనం మన అహాన్ని విస్తృత పరుచుకొని, కుటుంబంతోను, వంశవర్గ జాతి కుల దేశాలతోనూ అంతకు మించి మానవజాతి తోను, మానవత్వంతోనూ, మానవతా విలువలతోనూ మనం తాదాత్మ్యం చెందగలం. మహత్తరానుభూతిని పొందగలం. అయితే *అహం మాత్రం ఈ విధమైన మారువేషా లన్నింటిలోను మన చర్యల మూలాధారంగా నిలిచే వుంటుంది,* బాహ్యాపదార్థము లతో ఈ విస్తృత వ్యవహార శైలి ద్వారా తాను సంతరించుకొన్న తన ప్రత్యేక సత్తాకు బహుదా సంతృప్తి చెందుతూ.

మన అహంకార వ్యక్తిత్వం ఓ ప్రకృతి సృజనయే

ఇంకనూ మనలో సజావుగా నర్తిస్తున్నదీ, సలక్షణంగా కదులుతున్నదీ మనల్ని కదిలిస్తున్నదీ, ప్రస్ఫుటంగా తన ప్రభావాన్ని మనపై నెఱపుతున్నదీ కూడా మనలోని ప్రకృతి సహజ సంకల్పమే. తన వ్యక్తిత్వపు క్రమానుగత వికాసమునందు సంభవించే వివిధము విభిన్నమునైన పరిణామదశల అవసరాల సంతృప్తికై చేయు సంకల్పమే. బాహ్యాప్రపంచానుభూతులను కైవసం చేసుకోవటానికి ప్రాకృతిక సత్వం తనకుతాను నిర్దేశించుకొనిరూపొందించుకొన్న సంకల్ప సంవిధానమే. ఎల్లవేళలా ఈ కైవస ప్రక్రియ పరిభ్రమణంలో కదలాడే సంకల్పమంతా మన వ్యావహారిక కర్మక్రియల, వాటి ఫలితముల పైన మనకున్న కోరికల, కామ వాంఛల, తీవ్రోద్రేకముల, మఱియు ప్రేమానుబంధముల సంకల్ప గాఢతయే. వాటిపై గల మక్కువ తీవ్రతయే. అంటే స్వాభావికమైన అంతర్ సంకల్పమే. ఇది మన వైయక్తిక సంకల్పమేనంటాం మనం.

అది మన స్వతంత్ర సత్తా కాదు

కాని మన అహంకార వ్యక్తిత్వము ప్రకృతి సృజనయే గాని, అది మన భవబంధ విముక్తాత్మ గాని, జీవన్ముక్తి తత్త్వావిష్కార చలనము గాని, మన స్వతంత్ర సత్తా గాని కాదు, కానేరదు. ఇది యంతయు, సాకల్యంగా ప్రకృతి పరిభ్రమణక్రియా సంవిధానము నందలి భిన్న భిన్న రీతుల విన్యాస పర్యవసానమే. ప్రకృతి యొక్క గుణముల విన్నాణమే. ఇది ఓ తామసిక చర్య కావచ్చు. ఆ అజ్ఞానప్రేరిత తామసిక చర్యల వలన, సర్వస్వతంత్రమైన ప్రజ్ఞాపాటవ పరిపూర్ణమైన ప్రయత్నములను అకుంఠిత దీక్షతో చేపట్టు చొరవ, సామర్థ్యద్యోతకము గాదు. యాంత్రికంగా సాగే విషయ పరిభ్రమణ వలయంలో చిక్కుకొని ఆ అల్ప విషయముల పొందులోనే సంతృప్తి నందుచూ సాగే అచేతన వ్యక్తిత్వమే ఆవిష్కృతమవుతుంది.

తామసికచర్య కాకుంటే, ఇది ఓ రాజసిక క్రియ కావచ్చు. రాజసిక ప్రవృత్తిలో తనకు తాను ప్రకృతికి అనుసంధించుకొని, దాని అధికార వలయంలో పరిభ్రమిస్తూ దానిపై అధికారం చెలాయిస్తూ అది తన సేవల ద్వారా తన కోర్కెలను అవసరాలను తీర్చేలా ప్రయత్నిస్తూంటుంది. నిజానికి పైకి కనిపిస్తున్న తాను చలాయిస్తున్న అధికారం పరధీనతయేనని తెలుసుకొనలేని, క్షణం తీరిక లేక నిలకడ కొరవడి సతమతమయ్యే నిరంతర కార్యనిమగ్నమైన వ్యక్తిత్వం ఆవిష్కృతమవుతుంది. *ప్రకృతినుండి తాను సేవలందుకొంటున్నా వాస్తవానికి తాను ప్రకృతికి దాస్యం జేస్తున్నది నిజం. ఎందుకంటే తన అవసరాలు, కోరికలు, ప్రకృతి యొక్క కోరికలు అవసరాలే కనుక, మనం వాటికి లోబడి యున్నందున మనకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండవు కనుక. మనము వాటికి బందీలమే కాని వాటి నుండి విముక్తులము కాము.*

తమో రాజసిక చర్య కాకపోతే అది ఓ సాత్వికచర్య కావచ్చు. ఇంకా మనం నిరంతర మార్పుల కాలవాలమైన చక్రం మీద పరిభ్రమిస్తున్నాము. అహంకారం ద్వారా సాగుతున్న ఈ పరిభ్రమణంలో మనలోను, చరాచర జీవరాసులన్నిటి లోనూ గల ఓ శక్తిని శిరసావహిస్తున్నామే గాని మనకు దానిని గురించి తెలియదు. మనకు స్వేచ్ఛా లేదు. స్వాధీనతా లేదు.

అయినను జీవులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యములింకను దుస్సాధ్యములు గావు, విముక్తి ఎండమావు గాదు.

అనువాదం: 'అరవిందార్చన'

∴

ఆత్మవాసమును పొందుట ఎలా?

మానవుడు తన నిజస్వరూపమును ఇంద్రియములద్వారా పొందలేడు. మనిషి అనగా ఇంద్రియములనే గుఱ్ఱములచే లాగబడే రథమే గదా. ఆత్మను గుర్తించేందుకు మొదట ఈ ఇంద్రియ బంధములను తెగతెంపులు చేసుకోవాలి. అప్పుడే ఈ చంచలమైన మనస్సుకంటే భిన్నమైనది, బాహ్యాస్పర్శలకు చెదరనిది, స్వతంత్రమైనది, అత్యంత వైభవోపేతమైన వస్తువు ఒకటున్నదని తెలుస్తుంది. దాన్ని జేరుకోవాలంటే మొదట ఈ కోరికల వశీకరణం నుండి బయటపడాలి. కర్మనిర్వహాణములో కర్తృత్వాభిమానము, ఫలాపేక్ష పనికిరావు. అప్పుడు మన కంటే అతీతమైన ఒక మహాశక్తి ముందుకు వచ్చి మన కర్మలను నిర్వహిస్తుంది. మనిషి తన స్థూలప్రకృతి నుండి విముక్తమై తన ఆత్మలో నివసించగలుగుతాడు. — అనువాదకుడు

నీలో ఆత్మ అనే అమూల్య రత్నమొకటి ఉన్న సంగతి నిజమే; కాని దాన్ని పట్టుకోవటమెలా? మన సమస్త జీవితాన్ని — నిత్యకృత్యములతో సహా — ఆత్మకార్యముగా మలిచేందుకు మంత్రమేమిటి? తంత్రమేమిటి?

ప్రథమ మంత్రము

మొదట ఇంద్రియాలను బాహ్యావిషయములకు స్పందించే దురలవాటు నుండి తప్పించాలి. అంతరంగికంలోనే జీవిస్తూ, బాహ్యావిషయముల వెనక దౌడుతీసే ఇంద్రియములను వెనక్కు పిలవాలి. *ఇదే ఆత్మజీవితమునకు ప్రథమ మంత్రము. ఈ ప్రక్రియను సక్రమముగా నిర్వహించినప్పుడు గాని మనము ఆత్మస్ఫూర్తిని పొందలేము.* ఈ ఆత్మ బాహ్యావ్యవహారములకు అతీతము. ఆత్మ తన మూలరూపములో స్వయంసిద్ధము (ఆశ్రయములేకనే వుండగలదు), వైభవోపేతము, అత్యంత అద్భుతము, మన బాహ్యాప్రకృతికి కలవరము చెందని మహాస్వరూపము. కాని మనము వాంఛాలాలసులామైనంత కాలము అది మనకు చిక్కదు!

మానవుని స్థూలజీవితమునకు ఆధారము కోరికయే. ఇంద్రియ భోగానుభవమే కోరికల జీవితము యొక్క పరిధి. అందుకని మనమా కోరికలను వదిలించుకొని ఈ అధమ ప్రకృతికి బానిసత్వము నుండి తొలగిపోయినప్పుడు ఉద్రేకములు, రాగద్వేషములు సమసిపోతాయి. లాభనష్టముల వలన, జయాపజయముల వలన, ప్రియాప్రియముల వలన కలిగే సుఖదుఃఖములకు మూలకారణము కోరికయే కాబట్టి ఇక దానికి మనస్సులో ఆశ్రయముండదు. అప్పుడు మనిషి ఉదాసీనుడవుతాడు. సమతయే అతనిలో రాణిస్తుంది.

ఫలాపేక్షను విస్మరించాలి

అయితే మనమింకను ప్రపంచములో జీవిస్తూ కర్మలను చేయవలసినదే. ప్రాపంచికజీవితం లోని నిత్యకృత్యములుకూడ కర్మలే కదా. అట్టి కర్మలకు ఫలితమును అభిలషించుట మానవ ప్రకృతి యొక్క సహజధర్మము. ఫలాపేక్ష లేకుండా కర్మల నాచరించుట మన ప్రకృతికి నేర్పాలి మరి. అటుల చేయని యెడల కోరికలు, వాటి దుష్పరిణామములు మన నంటిపెట్టుకునే ఉంటాయి. ఈ ప్రకృతి ధర్మమును మార్చుట కెటుల సాధ్యము?

ప్రకృతి వెనకగల మహాశక్తి

మనం మన నిజరూపమును గుర్తించాలి. కర్మలను మన అహంకార వ్యక్తిత్వము నుండి వేరుచేయాలి. ఎందుకని? బాహ్యామానవుడు త్రిగుణముల చేతిలో కేవలం కీలుబొమ్మ కనుక. ఆత్మను ఈ ప్రకృతి ఖేలనము నుండి వేరుచేసి సాక్షిగా మాత్రమే నిలబెట్టాలి. *కర్మలను ప్రకృతి ఖేలనము వెనుకగల మహాశక్తికి అప్పచెప్పాలి. ఆ శక్తి మనకంటె చాలా ఘనమైనది.* ఈ విశ్వసృష్టికంతకు అధిపతి. అయితే మనస్సు తన ఆధిపత్యమును వదులుకోదు. అది ఇంద్రియముల వెనకాల పరిగెత్తటమే కాకుండా ఇచ్ఛాబుద్ధులను కూడ తనతోపాటు తీసుకొనిపోతుంది. ఈ చంచల మనస్సును అచంచల పరచటం మనం నేర్చుకోవాలి. మరికొంచెం లోతుగా పోయి పరమశాంతిని, నిస్తరంగ స్థితిని పొందాలి. *అప్పుడు మనలో నిక్షిప్తమైవున్న ఆనందమూర్తి మనకు ద్యోతకమౌ*

తాడు. ఆయన నిరంతర శాంతమూర్తి. అచంచలుడు. విషయములకు చలించడు. ఆయన చిదానందుడు. బాహ్యకారణము లేకయే తనకు తాను శాశ్వతంగా సంతుష్టిగా ఉండుట ఆతని సహజ ధర్మము.

దాని శక్తి అనంతము

ఈ ఆత్మ మనలోని పరమాత్మ స్వరూపము. అది నిరాలంబనంగా వుంటుంది. మన వైయక్తిక రూపము వలె పరిమితము గాదు. సర్వభూతములందు సర్వవ్యాప్తమై తన అనంతత్వముతో ప్రకాశిస్తుంది. విశ్వకర్మలను నిర్వహించునదియు అదియే. దానిది పూర్ణస్వరూపము. ప్రకృతి ధరించే తాత్కాలిక ఆచ్ఛాదముల వలన అది వికారము జెందదు. పరిమితము గాదు.

మన ఆత్మ స్వరూపమును పొందెదము

మనకు ఆ ఆత్మజ్యోతి దర్శనము లభించినప్పుడు మనమా పరమశాంతిని అచలత్వమును అనుభవించెదము. ఉన్నత స్థాయికి పెరిగెదము. అప్పుడు మన జీవితమును ప్రకృతిగతమైన వికార రూపము నుండి మళ్ళించి మన ఆత్మ స్వరూపమును పొందగలుగుతాము. దీనికి మార్గమేమిటి? ఇంతవరకు సిద్ధించుకున్న శాంతి, సమత, వ్యక్త్యాతీతమైన విరాట్శక్తి మనలో మొలకెత్తి పెరిగినప్పుడు, మన బాహ్యాప్రకృతి నంతనూ కూడ దాని ప్రభావమునకు లోబరచాలి. తత్ఫలితముగా మన ఇంద్రియములు సహితము పరివర్తితమై ఆ పరమోన్నతస్థాయికి పెరుగుతాయి. ప్రాపంచిక విషయముల వలన అవి కలవరము జెందవు. మన మనస్సు నిశ్చలమై, అచలమై, ఆ స్థితి నుండి విశ్వగతిని సాక్షిగా మాత్రమే చూస్తుంది. మన అహము ఏమౌతుంది? ఏమౌతుంది? సముద్రంలో నీటి బొట్టు వలె మాయమై పోతుంది.

అనువాదము: రాయప్రోలు లక్ష్మీనరసింహా శాస్త్రి

∴

కోరికల కారణాలు – నివారణోపాయాలు

కోరికలు లేనివారు ఎవరుంటారు? కోరికలే లేకపోతే దేనికోసం బ్రతకాలి? ఈ ప్రశ్నలు సబబైనవే. జీవితాన్ని కొంచెం లోతుగా పరిశీలిస్తేగాని ఈ ప్రశ్నలకు జవాబులు దొరకవు. మానవుని బుద్ధి ప్రకృతికి వశమై ప్రవర్తించవచ్చును. లేదా ప్రకృతికతీతము గావచ్చును. అంతర్గతమై, ఊర్ధ్వోన్ముఖమై పరమశాంతిని పొందవచ్చును. దీనికి సన్యాసమే మార్గము అని బహుశ చాలమంది అనుకోవచ్చు. కాని సన్యాసము వలన చెట్టును కొట్టివేయుటమే గాని వేళ్ళను పీకటం జరగదు. అనగా బాహ్య సన్యాసం కంటే అంతరంగిక అనాసక్తతే ముఖ్యము .— సంపాదకుడు

బుద్ధి రెండు విధాలుగా వర్తిస్తుంది

బుద్ధికి రెండు పోకడలున్నాయి. ఒకటి అధోముఖం రెండవది ఊర్ధ్వ ముఖం. అధోముఖంగాపోయే బుద్ధి బాహ్యంలో చరిస్తుంది. పలువిధాలుగా పరిగెత్తే ఇంద్రియానుభూతులవైపుగా పోతుంది. త్రిగుణాలలో చిక్కుకొనిపోయిన ఇచ్ఛ వైపుగా వ్యాపిస్తుంది. ఊర్ధ్వముఖంగా పోయేబుద్ధి అంతర్ముఖం అవుతుంది. ప్రకృతి కల్లోలాలకు చలించక, చైతన్యవంతమై, నిశ్శబ్దమైన అంతరాత్మకు చెందిన నిర్వికార నిశ్చలత్వంలో, స్థిర ప్రశాంతి సమత్వాల వైపుగా ప్రయాణం చేస్తుంది.

కోరికలతో ముడి

బుద్ధి అధోముఖంగా పోతున్నప్పుడు మన అంతరంగం ఇంద్రియార్థాల దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఉండి, వస్తువుల బాహ్యస్పర్శలలో జీవిస్తుంది. ఈ జీవితం పూర్తిగా కోరికతో ముడిపడి ఉన్న జీవితం. విషయాలు ఇంద్రియాలను ప్రేరేపించి విశ్రాంతి లేకుండా చేస్తూ తీవ్రమైన కల్లోలాన్ని సృష్టిస్తాయి. ఇంద్రియాలు విషయాలను, వాటివల్ల లభించే సుఖాలను పొందాలనే బలమైన కోరికతో, వెనుకముందు ఆలోచించకుండా బయటకు పరుగెత్తుతాయి. ఆ విధంగా అవి తమతోపాటుగా ఇంద్రియమనస్సును కూడా

"వాయువు సముద్రం మీది నావను లాక్కుపోయినట్లు" లాక్కు పోతాయి.

బాహ్యాగమనం

ఈ బాహ్యాగమనం వల్ల మనస్సు ఉద్రేకాలకు, తీవ్రభావనలకు, ఆరాటాలకు, ప్రేరణలకు లోనవుతుంది. అందువల్ల ఇంద్రియాలు మనస్సును లాక్కుపోయినట్లు మనస్సు బుద్ధిని లాక్కొనిపోతుంది. అప్పుడు బుద్ధి తన ప్రశాంతవిచక్షణశక్తిని, నిగ్రహాన్ని కోల్పోతుంది. నిరంతరం చిక్కుపడుతూ, మెలికలు తిరుగుతూ ఒకదానితో ఒకటి తలపడే త్రిగుణాల గంద్రగోళంలో అంతరాత్మ పడిపోతుంది. ఆ కారణంగా అజ్ఞాన, అసత్య, ఇంద్రియాధీన బాహ్యాజీవితంలో తగులుకొంటుంది. ఈ అధోముఖమైన బుద్ధివల్ల దుఃఖం, ఆగ్రహం, సంగం, తీవ్రభావన ఫలితాలవుతాయి. జ్ఞాన శూన్యుడు శిక్షణా రహితుడు అయిన సాధారణమానవుని బాధామయజీవితం ఈ విధంగానే వుంటుంది.

ఇంద్రియాలే కోరికల మూలకారణం

ఈ కారణంచేత, స్థిర ఏకాగ్రతతో పట్టుదలతో (వ్యవసాయం) మనం ఊర్ధ్వ అంతర్ముఖ బుద్ధినే దృఢంగా ఎన్నుకోవాలి. దీనికి మొట్టమొదటగా మనం దుష్టత్వానికీ దుఃఖానికీ తల్లివేరు అయిన కోరికను వదిలించుకోవాల్సి ఉన్నది. కోరికను విడిచిపెట్టాలంటే కోరికకు మూలకారణం ఏదో దాన్ని విసర్జించాలి. విషయాలను గ్రహించి భోగించాలని ఇంద్రియాలు బయటకు పరుగులు తీయటమే కోరికకు మూలకారణం. అందువల్ల ఇంద్రియాలు బయటకు పోవాలని చూచినప్పుడు వాటిని మనం వెనుకకు లాగాలి. విషయాలనుంచి వెనక్కి రప్పించాలి. తాబేలు తన అంగాలను ముడుచుకున్నట్లుగా ఇంద్రియాలను వాటిమూలాధారంలోకి ఉపసంహారించాలి.

యదా సంహారతే చాయం కూర్మోంగానీవ సర్వశః
ఇంద్రియాణీంద్రియార్థేభ్య స్తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా॥

ఇంద్రియార్థాల నుంచి ఇంద్రియాలను కూర్మం తన అంగాలను ఉపసంహరించుకొన్నట్లుగా ఉపసంహరించుకున్నప్పుడు ప్రజ్ఞ స్థిరం అవుతుంది – అని ఆచార్యుని భావం. ఇంద్రియాలు మనస్సులో శమించాలి. మనస్సు బుద్ధిలో శమించాలి. బుద్ధి అంతరాత్మలో లేదా ఆత్మజ్ఞానంలో శమించాలి. అది ప్రకృతి కర్మను సాక్షిగా పరిశీలించాలే కాని దానికి లోనుగాకూడదు. బాహ్యజీవితం ఇవ్వగలిగిన దేనినీ కోరకూడదు.

బాహ్యసన్యాసం అవసరం లేదు.

భగవానుడు ఇంతవరకు బుద్ధియోగాన్ని ప్రస్తావించటంవల్ల ఆయన బాహ్య సన్యాసాన్ని భౌతిక పరిత్యాగాన్ని ఉపదేశిస్తున్నాడని అపార్థంచేసుకొనే అవకాశం ఉండటం చేత తన తాత్పర్యం అదేమీకాదని శ్రీకృష్ణుడు వెంటనే తెలియజేస్తున్నాడు. సాంఖ్యుల సన్యాసాన్నిగాని, శరీరాన్ని శుష్కింపజేసికొంటూ ఆహారాన్ని కూడా మానివేయాలని ప్రయత్నిస్తూ ఉపవాసవ్రతాదులను పాటిస్తూ కఠిన తపశ్చర్యలను అవలంబించాలనిగాని ఆయన చెప్పటంలేదు. నేను చెప్పే ఆత్మనిగ్రహం - సంయమం అంటే అర్థం ఇది కానేకాదు, అంతరంగ ఉపసంహరణ కామనాపరిత్యాగం మాత్రమే నేను ఉద్దేశించాను అంటున్నాడు భగవానుడు. అంతరాత్మ ఆకృతివహించి శరీరంలో ఉంటున్నది కనుక శరీరాన్ని సాధారణ భౌతిక కర్మ జరిగే నిమిత్తం ఆహారంతో పోషించాలి. ఆహారాన్ని మానుకోవటంవల్ల ఇంద్రియార్థంతో భౌతిక సంబంధం తొలగిపోతుంది గాని ఆ సంబంధం మూలంగా బాధకలిగించే అంతర్గత సంబంధం మాత్రం వదలిపోదు. ఇంద్రియార్థంలో ఇంద్రియం పొందే సుఖం మాత్రం అలాగే ఉంటుంది. అదే రసం. ఈ రసం రాగము ద్వేషము అని రెండు విధాలుగా ఉంటుంది. మనం సాధించవలసింది విషయాలతో భౌతిక సంబంధాన్ని తెంపుకోవటం కాదు. అంతర్గతంగా ఇంద్రియ ప్రతిచర్యగాని బాధగాని లేకుండా భౌతిక సంబంధాన్ని సహించటం. ఆచార్యుడు అంటున్నాడు:

విషయావినివర్తంతే నిరాహారస్య దేహినః
రసవర్జం రసోప్యస్యపరందృష్ట్వా నివర్తతే॥

'ఆహారాన్ని విసర్జించిన వానికి రసమును మాత్రము వదిలి పెట్టి విషయములు నివర్తిస్తాయి. పరమును చూచినవానికే ఈ రసము కూడ నివర్తిస్తుంది' అని శ్లోకార్థం. ఆహారం అంటే కేవలం అన్నాదిఖాద్య పదార్థాలని మాత్రమే గాక ఇంద్రియాలకు విషయాలైన సర్వవస్తువులూ అని కూడ అర్థం. విషయాలతో సంబంధాన్ని మాత్రమే కఠిన తపశ్చర్యలవల్ల దూరంచేసుకున్న వానికి వాటిపట్ల ఉన్న 'రుచి' లేదా రసం మాత్రం మిగిలే ఉంటుందని ఆచార్యుడంటున్నాడు. అది విషయాలనివృత్తి అవుతుందే తప్ప మనస్సు నివృత్తి చెందటంకాదు.

అనాసక్తి అంతరంగంగా ఉండాలి

ఇంద్రియాలను జయించటం అంటే నిజమైన అర్థం ఇంద్రియార్థాలతో సంబంధాన్ని ఇంద్రియాలు తెంపుకోవటం కాదు. అంతర్గతంగా విషయాలపట్ల ఉన్న రుచిని లేక రసాన్ని విసర్జించటమే నిజమైన ఇంద్రియ విజయం. మానసికంగా విషయాలపట్ల రుచిని విసర్జించిన వాడు ఇంద్రియార్థాలతో సంబంధం కలిగినా కలవరవడడు. అతనిలో ప్రతిచర్య ఏదీ ఉండదు. బాహ్యాసన్న్యాసం కంటే ఈ అంతర్గత సన్న్యాసం చాలా గొప్పది. అయితే విషయాలతో ఈ నిష్కామ సంబంధం ఇంద్రియాలను ఇంద్రియ విధానంలో కాకుండా వేరు విధానంలో ఉపయోగించటం సాధ్యమా? సాధ్యమే అని గీత స్పష్టంగా చెబుతున్నది. 'పరందృష్ట్వా' అంటే పరుడైన అంతరాత్మను పురుషుని దర్శించటంవల్ల, అంటే యోగంలో జీవించటం వల్ల ఇది సాధ్యపడుతుంది. బుద్ధియోగంద్వారా సర్వ అంతర్గతస్థితీ పురుషునితో సమాగమమైనపుడు లేదా ఒకటైనప్పుడు ఈ సంపూర్ణ నివృత్తి సాధ్యపడుతుంది. తీవ్రసాధనల వల్ల ఇంద్రియాలకు విషయాలకు మధ్య సంబంధాన్ని ఛేదించగలమేగాని మనస్సు విషయానుభవంద్వారా అనుభవించాలని కోరే రసాన్ని తొలగించలేము.

ఆత్మదర్శనం ఆత్మదర్శనంవల్ల మాత్రమే ఈ పరిపూర్ణ విజయం సాధ్యం అవుతుంది. పరందృష్ట్వా అంటే భాష్యకారులు పరమార్థతత్త్వమైన బ్రహ్మను దర్శించి అని అర్థం చెప్పారు. శ్రీఅరవిందులు పరం అను పదానికి అంతరాత్మ, పురుషుడు అని అర్థం చెప్పారు. ఇక్కడ సాంఖ్య క్రమాన్ని విచారించటం జరుగుతున్నది. బుద్ధికి పరుడైనవాడు పురుషుడు. బుద్ధి యోగం ద్వారా పురుషునితో ఏకంకావటానికి ప్రక్రియను ఇక్కడ ఆచార్యుడు బోధిస్తున్నాడు. అందుచేత 'పరందృష్ట్వా' అనే పదాలకు 'పురుషుని దర్శించి' అని శ్రీఅరవిందులు చెప్పిన అర్థమే సరిపోతుంది. అంతరాత్మ ఆత్మానందంలోనే తృప్తిపడుతుంది. దానికి విషయభోగ రసానుభవం అక్కరలేదు. ఆ ఆనందం ద్వంద్వాలకు అతీతమైనది. ఒకసారి మనం మనలో ఉన్న ఈ పరమస్థితిని చూచి మనస్సును ఇచ్ఛను అందులో స్థిరం చేస్తే, ఇంద్రియానుభవం ద్వారా విషయాల అధీనతలో ఉండే సుఖాలు జుగుప్సలు బదులుగా ఈ ఆనందం నెలకొంటుంది. ఇదే మోక్షానికి నిజమైన దారి.

ఆత్మనిగ్రహం తన్నుతాను శిక్షణకులోను చేసుకోవటం, నిగ్రహించుకోవటం ఎన్నడూ తేలికపని కాదని వేరే చెప్పవలసినపనిలేదు. తమమీద తాము ఏదోవిధమైన నియంత్రణ విధించుకోవటం తప్పదని తెలివికలవారందరికీ తెలిసిన సంగతే. ఇంద్రియ నిగ్రహాన్ని కలిగిఉండమని హితవు చెప్పటం సర్వసాధారణమై పోయింది. కాని సాధారణంగా ఆ విధంగా చెప్పిన హితవు పరిపూర్ణంగా ఉండదు. దానిని ఆచరించే వారు కూడా దాన్ని చాలా పరిమితంగా పాటిస్తారు. వారి ఆచరణ అసమగ్రంగా ఉంటుంది. '*బలవానిన్ద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి*' అన్న మనువు వాక్యాన్ని బట్టి ఇంద్రియ నిగ్రహం ఎంత దుష్కరమో గ్రహించవచ్చు. సంపూర్ణ ఆత్మవిజయాన్ని సాధించాలని శ్రమపడుతున్న ఋషి, నిర్మల వివేక విచక్షణాయుతమైన అంతరాత్మగల వ్యక్తి, ఇంద్రియాలు తనను త్వరపెట్టి తమ వెంట లాక్కుపోతున్నాయని కనుగొంటాడు.

మనస్సు ఇంద్రియాధీనం

బలవంతములైన ఇంద్రియాలను నిగ్రహించాలని ఎంతో ప్రయత్నం చేస్తున్న వివేకి అయిన వాని మనస్సును కూడ ఆ ఇంద్రియాలు బలాత్కారంగా ఆకర్షిస్తున్నవి గదా! ఇంద్రియాలను స్వాధీనం చేసుకోవటం చాలా తేలిక అయినట్లు మాట్లాడుతూ దానికోసం తేలిక మార్గాలను సూచించేవారు ఇంద్రియజయంలో ఉన్న గొప్ప కష్టాన్ని ఎరుగరని దీనివల్ల తెలుస్తున్నది. బలవంతాన అవి మనలను తమ వెంట ఈడ్చుకొనిపోగలవు. ఎందుచేతనంటే మనస్సు సహజంగానే ఇంద్రియాలకు లోబడుతుంది. అంతర్గతమైన ఒక ఆసక్తితో మనస్సు విషయాలను పరికిస్తుంది. వాటిమీద స్థిరపడుతుంది. ఆ విధంగా విషయాలలో బుద్ధి నిమగ్నం అయ్యేటట్లుగా, ఇచ్ఛను ఆసక్తిని వహించేటట్లుగా చేస్తుంది. ఇది సంగానికి త్రోవతీస్తుంది. సంగం వల్ల కోరిక జనిస్తుంది. ఆ కోరిక తీరకపోయినా దానికేదైనా అడ్డంకిగాని వ్యతిరేకతగాని వచ్చినా వ్యాకులతను తీవ్రభావావేశాన్ని ఆగ్రహాన్ని పొందుతుంది. ఈ భావతీవ్రతవల్ల అంతరాత్మ మోహాన్ని పొంది అస్పష్టతకు లోనవుతుంది. బుద్ధి ఇచ్ఛలు, ప్రశాంత సాక్షి అయిన అంతరాత్మను చూడటం, దానిలోనే ఆసీనం కావటాన్ని మరచిపోతాయి. దీని కారణంగా స్మృతి నుంచి పతనం కావటమే గాక బుద్ధికూడ మసకబారిపోయి నాశనం అవుతుంది. తాత్కాలికంగా మన స్మృతిలో బుద్ధి లేకుండాపోతుంది, భావోద్రేకం అనే మబ్బు చాటున మాయమైపోతుంది. అందువల్ల మనమే ఆగ్రహం, తీవ్రభావం, దుఃఖం అయిపోతాము. ఆత్మగా బుద్ధిగా ఉండివాటిని గమనించటం మానివేస్తాము.

ఈ వ్యవహారాన్ని నిరోధించాలంటే ఇంద్రియాలన్నింటినీ సంపూర్ణంగా అదుపులో పెట్టాలి. సంపూర్ణ ఇంద్రియ నిగ్రహం వల్ల మాత్రమే వివేక ప్రశాంతమైన బుద్ధి దానికి అర్హమైన స్థానంలో స్థిరంగా నిలవగలుగుతుంది.

ఆత్మవిజయమే పరిష్కారం

కేవలం మానసిక శిక్షణ ద్వారా, బుద్ధిద్వారా ఇంద్రియ

నిగ్రహాన్ని పరిపూర్ణంగా సాధించటం వీలుకాదు. తనకంటె అధికమైనది, ప్రశాంతిని ఆత్మవిజయాన్ని సహజసిద్ధంగా గలిగినది అయిన దానితో యోగం వల్ల మాత్రమే ఇది సాధ్యపడుతుంది. తన సర్వ ఆత్మను దైవానికి అర్పించి అంకితం చేయటం వల్లనే ఈ యోగం జయప్రదం అవుతుంది అని శ్రీకృష్ణుడు ప్రకటిస్తున్నాడు. 'నాకే అర్పించాలి' అంటున్నాడు.

మనస్సు, బుద్ధి ఆత్మ యొక్క ఉపకరణాలు

సర్వేంద్రియాలను నిగ్రహించి నా యందే తత్పరుడైన యోగిగా ఉండవలసింది. ఇంద్రియాలు ఎవని స్వాధీనమై ఉండునో వాని బుద్ధి మాత్రమే స్థిరంగా ఉండగలదు అని ఆయన భావం. మోక్షాన్ని ప్రసాదించే వాడు మన లోపలనే ఉన్నాడు. మనస్సు కాని, బుద్ధిగాని మన వ్యక్తిగత ఇచ్ఛగాని కేవలం ఉపకరణాలు. అంటే వాటిద్వారా పని జరుగుతుందేగాని వాటంతట అవే మోక్షప్రాప్తి కలిగించలేవు. గీత చరమ భాగంలో చెప్పినట్లు ఆ పరమేశ్వరుని యందే మనం శరణు పొందాలి. ఇది జరగాలంటే ఆయనయే మనసర్వ అస్తిత్వానికీ విషయంకావాలి. ఆయనతో మనకు అంతరాత్మ సంబంధం ఉండాలి. '*యుక్తా ఆసీతమత్పరః*' అన్న వాక్యానికి ఇదే అర్థం. కాని గీత సహజంగా అవలంబించే ధోరణికి అనుగుణంగానే ఇక్కడ పరమేశ్వరునిగురించి ఒక సూచన చేయటం మాత్రం జరిగింది. దానికి సంబంధించిన '*యుక్త, ఆసీత, మత్పరః*' అనే మూడు మాటలను మాత్రం చెప్పటం జరిగింది. ఇకముందు గీత పెంపొందింపబోతున్న 'ఉత్తమ రహస్యా' నికి చెందిన సమస్త సారానికి ఈ మూడు మాటలలో బీజావాపన జరిగింది. సూచనా మాత్రంగానే ఉన్న ఈ విషయం వద్దకు గీత తర్వాత తిరిగి వచ్చి విస్తరిస్తుంది.

ఆత్మలోనే బుద్ధి స్థిరంగా ఉంటుంది

పైన చెప్పినట్లు పురుషునిలో సుస్థిరమైన యోగం ద్వారా ఇంద్రియాలను వశపరచుకొన్న యోగి విషయాలలో ప్రవర్తించి వాటితో సంబంధం కలిగి ఉన్నా, వాటిమీద వర్తిం

చినా, అతని ఇంద్రియాలు అంతర్గత ఆత్మ ఆధీనంలో, ఆ అంతర్గత ఆత్మ (subjective self) అత్యున్నత స్థాయి అయిన పురుషుని అధీనంలో ఉంటాయి. విషయాలు విషయసంబంధాలు వాటి ప్రతిచర్యల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడటం ఉండదు. ప్రతిచర్యల నుంచి స్వేచ్ఛ పొందిన ఇంద్రియాలు రాగద్వేషాల నుంచి బయటపడతాయి. 'ఇది కావాలి ఇది వద్దు' అని చెప్పే కోరికనుంచి తప్పించుకొంటాయి. అప్పుడు మనుష్యునిలో స్థిరత, శాంతి, స్పష్టత, సంతోషదాయక ప్రశాంతి నెలకొంటాయి. దీని పేరే ఆత్మప్రసాదం. ఈ నిర్మల ప్రశాంతి అంతరాత్మ సంతోషానికి మూలాధారం. ప్రశాంత అంతరాత్మను స్పృశించగల శక్తి దుఃఖానికి లేకుండాపోతుంది. ఆత్మశాంతిలో బుద్ధి స్థిరంగా నిష్కామంగా దుఃఖరహితంగా స్థిరం కావటానికి గీత సమాధి అని పేరు పెట్టింది

బ్రాహ్మీస్థితి

ఇటువంటి నిష్కామకర్మయోగి చేరుకొనే పదవిని 'బ్రాహ్మీ స్థితి' అని గీత పేర్కొన్నది. అతడు బ్రహ్మలో స్థిరం అవుతాడు. ప్రపంచబంధాలకే కట్టుబడిన జీవుల దృష్టికి, అనుభవానికి, జ్ఞానానికి, విలువలకు, దృక్పథానికి ఈ స్థితి పూర్తిగా తలక్రిందులుగా తోస్తుంది.

సామాన్యులు అంటే బద్ధజీవులు కల్లోలంతో కూడిన మురికినీటి కాల్వలు. ఏ కొంచెం కోరిక వారిలోకి పరుగెత్తుకొని వచ్చినా తట్టుకోలేక కలవరానికి లోనవుతారు. బ్రాహ్మీస్థితుడైన ముని విశాల అస్తిత్వంకల సముద్రం. దానిలో ఎన్ని ప్రవాహాలు వచ్చిచేరినా అతని అంతరాత్మ విస్తార సామ్యస్థితిలో అణుమాత్రం చలనం ఉండదు.

ఎప్పుడూ నిండుతూ, చలనం లేని స్థితిలో ఉన్న సముద్రంలో జలప్రవాహాలు ఏ విధంగా ప్రవేశిస్తాయో ఆ విధంగా సమస్తమైన కోరికలు బ్రాహ్మీస్థితునిలో ప్రవేశించి తమనామ రూపాలను కోల్పోయి నశించిపోతాయి. అతడు శాంతినే పొందుతాడు. కోరికలను కోరేవాడు అటువంటి శాంతిని పొందలేడు. ప్రపంచంలో ఉన్న సమస్తమైన కోరికలు అతనిలో ప్రవేశించినా

యోగిలో కోరిక పుట్టదు. సామాన్య మానవునిలో నేను నాది అనే భావం నిండి ఉంటుంది. యోగిలో ఇవి ఉండవు.

అనుసరణ: తెన్నేటి పూర్ణచంద్రరావు (శ్రీఅరవిందుల గీతాదర్శనము)

∴

సాధన మార్గం

క్షుద్రస్వభావమును పరిత్యజించాలి

నీవు అహంకార మనోవ్యక్తిత్వంలో ఉన్నంత వరకు సుడిలోపడ్డ కీటకం లాగా అక్కడకక్కడే తిరగటం తప్ప నిజమైన ఫలమేమీ వుండదు. ప్రథమమూ ప్రధాన కర్తవ్యమూ ఏమంటే క్షుద్రస్వభావ సంబంధమైనదాన్ని పరిత్యజించి దృఢ సంకల్పంతో, ప్రజ్ఞతో నీ ఇంద్రియ, శరీర, మనః, సంకల్ప బుద్ధుల కంటె ఊర్ధ్వమైన ఉన్నతవిషయం వైపు మళ్ళటం. ఏది శాశ్వతమో అమృతమో నీ ఆత్మ వైపునకు దృష్టిని మళ్ళించటం. ఆ ఆత్మ వ్యక్తిగతం కానిది, సర్వజీవులందున్నది. నీ సంకల్ప శక్తిని ఇచ్ఛను హృదయము దాని కోర్కెలకంటె, మనస్సు దాని ఆకర్షణ బంధాల కంటే — అతీత తత్త్వం వైపునకున్ముఖం కావాలి. శాశ్వతమైన విషయమేది నీలోవున్నదో, ఏది మార్పుల కతీతమో, శాంతమో, ధీరమో, సమమో, సర్వవ్యక్తులకు విషయాలకు అతీతమో, కర్మబద్ధం కాదో, ప్రకృతి పరిణామానికి లోనుకాదో దానిని, ఆ బ్రహ్మపదార్థాన్ని చేరుకోవాలి. శాశ్వతమైన దానిలో లీనం కావాలి. అదే నీవు కావాలి.

విషవలయంలో తిరగరాదు.

ఆ విధంగా నీ వ్యక్తిత్వాన్ని విశ్వజనీనం చేయగలగట మెప్పుడు సాధ్యపడుతుందంటే అహంకారాన్ని పుష్టం చేసుకోకుండా, దానికి లోబడకుండా, దానికి సంబంధించిన వాటితోతెగతెంపులు చేసుకొన్నాకనే అహంకారగ్రంథి అంటే — కోర్కెల పుట్ట — వాటి నుండి అలలై పొంగే ఆవేశ కావేశాలు ఈ తృష్ణాబంధం వల్లనే

నేను — తాను — నాదీ — వాడిదీ అన్న భావోద్రేకాలకు లోనై తృప్తి, అతృప్తులు పొందుతూ, ఇష్టానిష్టాల సుడిలో తిరుగుతూ ఆశానిరాశల నడుమ ఊగిసలాడుతూ సుఖదుఃఖాల్లో ఉయ్యాల లూగుతూ, నీ సంకుచిత ప్రేమ ద్వేషాలకు లోనై, కోపతాపావేశా లపాలై, జయాపజయాల సుఖదుఃఖాలకు స్థానమై, — ఈ విధంగా విషవలయంలో పడికొట్టుకోవటం జరుగుతున్నది.

ఆధ్యాత్మికతకు వాంఛ శత్రువు

తృష్ణ వల్లనే అస్పష్టత మానసిక అవ్యవస్థ సంకుచితత్వ పరిధికి లోనుకావటం — దురహంకార ద్వేషా వస్తువులను తలక్రిందులుగా చిత్రించుకొని చూడటం, జ్ఞానభాస్కరుని చుట్టూ మబ్బులు కమ్మించుకోవటం — జరుగుతున్నది. తృష్ణ దాని అంగీకారాలు — క్రూరత్వాలు, పాపవృక్షానికి తల్లి వేళ్ళు. తృష్ణాబద్ధుడైనంత కాలం మనిషికి శాంతి లేదు, కాంతివెలుగులు లేవు, శాంత స్వచ్ఛ జ్ఞానమూ లేదు. యథార్థ వ్యక్తి లేడు. ఎందుకంటే, తృష్ణ తత్త్వ విరుద్ధాంశ. కనుక యథార్థ భావానికది చోటు కాదు. మంచి సంవేదనలకు కర్మలకది ఆధారం కాదు. కోర్కె ఏ రంగుల ప్రభావంలో ఉన్నా ప్రజ్ఞావంతులకది ఒక పైశాచిక స్వప్నం. మనస్సునేనిముషంలోనైనా దాని దృఢమూలాల నుండి, క్రిందికి తోసివేస్తుంది. ఆధ్యాత్మిక పరిపూర్ణతకు వాంఛ కేవల శత్రువు.

బాహ్యోద్రేకాలకు చోటివ్వవద్దు

కనుక తృష్ణను సమూలంగా ఖండించు. వస్తు రూపానురక్తిని, స్వత్వబుద్ధినీ, దూరం చేయి. బైటనుండి వచ్చే ఇంద్రియ, మానసిక స్పర్శలను వేరు చేయి. ఉద్రేకాలకు లోను కాక వాటిని త్రోసివేయి. నీలో నీవు చెదరకుండా కూర్చో. బాహ్యోద్రేకాలు నిన్ను లోబరచుకొనే ప్రయత్నం చేసినా — కదలకు. స్థిరంగా ఉండు. నీ స్వభావంలో అంగుళం కూడా వాటికి చోటివ్వ వద్దు. సుఖదుఃఖాలకు ఏమాత్రం చలించకు. ఇష్టానిష్టాలను కోసి పారవేయి. ద్వేషానురక్తులను సమూలంగా నరికి పారవేయి. నీ స్వభావంలో ప్రశాంతతను బాహ్యావిషయ పరిత్యాగ బుద్ధినీ, దృఢంగా

నాటుకో. విశ్వజనీన బుద్ధితో నిశ్శబ్ద శాంతి దృష్టితో సర్వాన్నీ చూడు.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు

*

All that denies must be torn out and slain
And crushed the many longings for whose sake
We lose the One for whom our lives were made.

(Savitri, p. 316)

∴

హెచ్చరిక

యోగః కర్మసు కౌశలమ్మని గీత బోధిస్తున్నది. కర్మలను నేర్పుగా నిర్వర్తించటమే యోగం. అంటే యోగప్రశాంత మనస్కతతో చేసిన కర్మ విజయవంతమౌతుందితప్ప ఆశా — భయాంధకారంలో కొట్టు మిట్టాడుతూ చేసిన కర్మ సఫలం కాదు. ఈ సాఫల్యం కాని కర్మకు కారణం అహంకారంతో చేసే వక్రవిచారణా, తొందరపాటుతో కూడిన ఇచ్ఛ. విశ్వ జనీనదృష్ట్యా విశ్వ జ్యోతిః ప్రకాశంలో చేసిన కర్మయే యోగం. కానీ అదీ వ్యక్తిగత స్వభావంద్వారా జరగవలసిందే. కర్మయోగికి తెలుస్తుంది తనకిచ్చిన శక్తి ఫలబుద్ధి లేని కర్మసాధనమని, కర్మకడుగున నున్న దివ్యభావం — తాను చేయవలసిన కర్మ సామ్యం పొందుతున్నదని. *అతని సంకల్పంలో వ్యక్తిగత వాంఛ లేదు. తనదికాని ధ్యేయం వైపుకు నడిపించే విశ్వజనీన చేతనశక్తి తనను ప్రేరేపిస్తున్నది.* ఆ దివ్యప్రజ్ఞ మార్గదర్శకమైనది. అప్పుడు కలిగే ఫలితం సాధారణ మనోదృష్ట్యా విజయవంతమూ కావచ్చు. కాకపోనూవచ్చు. *కర్మయోగికి మాత్రం ఈ జయాపజయాలతో సఫల దుష్ఫలాలతో నిమిత్తం లేదు. తనను ప్రేరేపించిన వాని నియోగాన్ని తాను నిష్కామంగా చేయుటమే వాని వంతు.* అతనికి విజయంతో

పని లేదు. కేవలం దివ్య సంకల్పాన్ని అనుసరించటమే. ఆ దివ్య ప్రజ్ఞానుసారంగా ఫలితం కలిగినా — కలగక పోయినా బాధ్యత తనది కాదు — ప్రేరేపించిన వానిది.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు.

∴

అసత్య జీవాత్మ కోరికల పుట్ట

మనలో రెండు జీవాత్మలున్నాయి

ప్రకృతికి లోబడి ప్రవర్తించేది 'అహం'. ఎందుకంటె అది ప్రకృతిలో ఒక భాగం. ప్రకృతిలో ఒక భాగంలో స్వాత్మ వివేకం యంత్రం. కాని ఎప్పుడైతే మనశ్చేతనలో స్వాత్మ వివేకం అహంసమన్వయమందుతుందో అప్పుడది అధో జీవాత్మను సృష్టిస్తుంది. అదే అహం స్వరూప జీవాత్మ. కనుక మనం జీవాత్మ అని దేనిననుకొంటున్నామో అది ప్రాకృతిక వ్యక్తి (natural personality). యథార్థ వ్యక్తియైన పురుషుడు కాదు. మనలో తృష్ణామయమైన జీవుడున్నాడే వాడు ప్రకృతి కర్మ కలాపంలో చిక్కుకొన్న పురుషుని చైతన్యము యొక్క ప్రతి బింబం — ఛాయ. అది నిజానికి త్రిగుణక్రియయే కనుక ప్రకృతిలో ఒక భాగమే. మనలో రెండు జీవాత్మలున్నాయని చెప్ప వచ్చు. కోర్కెలపుట్ట ఒక జీవాత్మ. ఇది త్రిగుణ పరిణామశీలం కలది. వాటి సమ్మేళనంతో అనేక మార్పులు పొందుతుంది. అదే కేవలం వాటి నిర్మాణం. అవే దానిని నిర్దేశిస్తాయి. ప్రకృతికీ దాని పణాలకుపైన ఉండి పర్యవేక్షించే శాశ్వత పురుషుడు రెండవ జీవాత్మ. అలాగే రెండాత్మలు. ఒకటి సృష్టమైన అహంకారం. ఇది మనః కేంద్రంలో వుంటూ ప్రకృతి కర్మలకు కారణమౌతుంది. ఇదే మనలో కర్తృత్వబుద్ధికి హేతువైనదీ. నేనిది చేస్తున్నానన్న భావం కల్గించేదీ త్రిగుణమయమూ అయిన సహజ

ప్రాకృతిక వ్యక్తి. యథార్థ వ్యక్తి ప్రకృతికీశ్వరుడై దానిలో వుంటూ పరిణామాల కతీతంగా వుండే వ్యక్తి మనలోని రెండవ ఆత్మ. నీకు స్వేచ్ఛ కావాలంటే వాంఛాత్మయొక్క కోరికలను పరిత్యజించాలి. అహంకారజీవుని వక్రదృష్టిని విస్మరించాలి.

కామాత్మను బుద్ధి అదుపులో పెట్టలేదు

పరస్పర విరుద్ధములై తోచు ఈ గ్రుడ్డి తనము ఈలోతూ హృదయమున కెట్లు కలిగినవి? మానవుని భావాత్మక సత్తకుగల ద్వంద్వ స్వరూప లక్షణమే దీనికి గారణము. ఏలయన, మానవుని హృదయమునందు రెండంతరువు లున్నవి. ముందరి యంతరువు, పశువు నందువలె, ప్రాణసంబంధమైన భావములకు స్థానము కాని, పశుభావములకంటె అవి అనేక విధములుగా పెంపొందియుండును. అహంకార ప్రవృత్తిచేతనూ, అంధప్రాయములైన సహజాపేక్షలచేతనూ, విపరీతములైన ప్రాణ స్పందనలచేతనూ దానిభావములు నియతము లగుచుండును. అధఃపతితమైన ప్రాణశక్తికి సహజములగు కామక్రోధాదులిందు మల్లడిగొని యుండును. వాటికది వశంవదమై వర్తించుచుండును. ప్రాణతృష్ణలయూ భావావేశములయూ ఈ కలయిక మానవునిలో నొక విపరీతమైన కామాత్మను సృష్టి చేయును. సంస్కార శూన్యమైన, ప్రమాదకరమైన, యీ హృదయ లక్షణమునే, బుద్ధి విశ్వసింపక, అదుపులో బెట్టవలె ననుకొనుచున్నది. అది యుక్తమే కాని, దాని యదుపు ఎంతమాత్రమూ స్థిరమైనదికాదు.

నిజమైన ఆత్మ లోన దాగియున్నది

అది యట్లుండ, మానవుని నిజమైన ఆత్మ యీ కామపూరిత హృదయములో లేదు. దీని వెనుక, కానరాక దాగియున్న అసలుహృదయములో, — తేజోమయ గుహాభ్యంతరములో నున్నది. పరాత్పరుని దివ్యతేజః ప్రసార రూపమై, మన యాత్మ అచట నెలకొనియున్నది. చాలామందికి అది యచట నున్నట్లు తెలియనే తెలియదు. ఏలయన, ఆత్మ లందరికినీ కలవు; కాని, దాని నెరిగిన వారునూ, దాని సాక్షాత్కారణానుభవము కలగిన వారును అరుదు. ఆ దివ్యజ్యోతి స్ఫులింగమే మన ప్రకృతి

యందలి అజ్ఞానపదార్థజాతమున కంతకునూ ఆధారముగా నున్నది. దాని నాశ్రయించుకొనియే మనలో నిజమైన మానవుడు, హృత్పురుషు డేర్పడుచున్నాడు. ఈ హృత్పురుషుడంతకంతకు వృద్ధి బొంది, హృదయమాతని దివ్యప్రేరణలతో స్పందించుచున్న కొలది, మానవుడు తనయాత్మను క్రమముగా నెరుంగుచూ, పశుస్వభావమును వీడి, అంతర్యామియగు పరాత్పరుని వెలుగు నందుకొనుచూ, గంభీరమైన జీవన చేతనల జాడలను గ్రహించుచూ, దివ్యప్రేరణతో వర్తించ నారంభించును.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు; కమలాకర వేంకటరావు (యోగసమన్వయము నుండి)

∴

భౌతికప్రాణికము – బౌద్ధికప్రాణికము

ఆయువు అనే అర్థంలో వాడే 'ప్రాణము' కాకుండా ప్రాణికము లేక ప్రాణశక్తి[1,2] అనే ఉపనిషత్తులలో కూడ వివరింపబడిన ఒక శక్తి ఉన్నది. దానిని శరీరములో పనిచేసినప్పుడు భౌతిక ప్రాణికము అని, మానసిక క్షేత్రములో పనిచేసినప్పుడు బౌద్ధిక ప్రాణికము అని వ్యవహరించెదము. మన జీవితమెప్పుడు ద్వంద్వముగా మానసిక శారీరకములుగా వర్తిస్తూంటుంది. ప్రాణశక్తి కూడ తదనుగుణంగా ఏ భంగిమ కావాలంటే ఆ భంగిమను దాలుస్తుంది.

*

1 Life-energy = Vital force = ప్రాణము, ప్రాణశక్తి, ప్రాణికము, ప్రాణికశక్తి.

2 ప్రాణశక్తి లేక జీవశక్తి మనుగడను పాశ్చాత్య విజ్ఞానశాస్త్రము శంకించినది. ఎందువలననగా ఆ విజ్ఞానశాస్త్రము ప్రకృతి యొక్క బాహిర చర్యలకు మాత్రమే సంబంధించినది. భౌతిక, బాహ్యములకు సంబంధించినవి తప్ప మిగిలినవానిని గూర్చి సరియగు జ్ఞానము ఇప్పటికిని లేదు. ఈ ప్రాణము, ఈ ప్రాణశక్తి భౌతికమైనట్టిది కాదు. ఇది అన్నిరూపములకు ఆధారమైనది. అన్ని రూపములను ఆక్రమించినది. ఇది లేకుండ ఏ భౌతిక మూర్తికి స్థితి లేదు. పదార్థజగత్తులోనికవతరించలేదు.

మనోప్రాణిక దైహికములు మానవుని అధోప్రకృతికి జెందిన విషయములు. అవి స్వతంత్రముగా వ్యవహరించలేవు. పరస్పర ప్రభావము కలిగి ఉంటాయి. వీటన్నింటిని సారూప్యము జేసి ఒకే ధోరణిలో ప్రవర్తింప జేయునది ప్రాణికము. మన శరీరం మీద, ఎక్కువగా మనస్సు మీద గాఢమైన ముద్ర వేయునది కూడ ఈ ప్రాణికమే. మన శరీరావయవము లన్నియు యంత్రము లోని భాగముల వలె ఇనప ముక్కలు గావు. అవి చైతన్యవంత ములు. ప్రాణశక్తిచే ప్రేరేపితమై వాటి వాటి ప్రక్రియలను సామ రస్యంతో చాల చక్కగా నిర్వహిస్తూ ఏకోన్ముఖంగా ప్రవర్తిస్తాయి.

మన బుద్ధికూడ చాలవఱకు చైతన్యయుతము, భౌతిక వాసనాయుతము. సహజముగా అది ఉన్నత కర్మలందు మాత్రమే జీవితమునకు లోబడి శరీరసంబంధమానసిక కర్మలకంటె కొంత ఎక్కువ సామర్థ్యము కలది. దీనిని మనము ఈ ఆరో హణ క్రమములో చెప్పవచ్చును. ప్రథమముగా మనము సమగ్ర నాడీమండలము ద్వారా పోయిన భౌతిక జీవశక్తి ఆధారమైన భౌతికప్రాణమును కలిగియున్నాము. అది మన సాకార క్రియకు గుర్తింపునిచ్చును. అందుచే సర్వము జీవుల క్రియాచిహ్నమే కాని స్థబ్ధమైన యాంత్రిక దేహము కాదు. ప్రాణము, శరీరము కలసి స్థూలశరీరము (మొత్తము దేహము) అగును. ఇది బాహ్య సాధనము మాత్రమే. జీవితము యొక్క నాడీశక్తి భౌతిక ఇంద్రి యములతో శరీర రూపమున ప్రవర్తించును.

ఇక అంతరసాధనము లేక అంతఃకరణము — వివేక వంతమైన మనస్తత్వము — ఉన్నది. ఈ మనస్తత్వము ప్రాణశక్తి చేత వ్యాపించును. ఇది జీవితము యొక్క మానసిక వివేకము నకు, జీవితముపై నుండు మానసిక చర్యకు ఒక సాధనమగును. మనస్సు అనెడి ఇంద్రియము నందలి ప్రతికణము, ప్రాథమిక జ్ఞానము, మానసికప్రాణము యొక్క క్రియద్వారా వ్యాపించును. అది బలిష్ఠము లేక ప్రాణాధారమునై, భౌతిక మనస్తత్వమునై యుండును. దీనిచే బుద్ధి, అహములు కూడ ఓడింపబడినవి. అయినప్పటికి ఇవి ప్రా ణాధారము, బలిష్ఠము మరియు భౌతిక

మనస్తత్వములను అధిగమించుశక్తిని మనస్సునకు కలిగించును. ఈ కలయిక ఉదాత్తమానవత్వము, ఇంకను గొప్పదైన, దైవిక సంపూర్ణత్వమునకు ప్రధాన ఆటంకమునయిన క్షోభను కలిగించెడి వాంఛామయ ప్రాణమును సృజించును. చివఱిగా మన ప్రస్తుతపు వివేకవంతమైన మనస్తత్వమునకు మించినది, సరియగు మార్గము, అసంపూర్ణత్వమునకు సహజ స్థానము, రహస్యము, ఉత్తమునైన బుద్ధి కలదు.

కోరికయే మన సమస్తమైన చర్యలకు మూలకారణం; మన విజయాలకు ప్రేరణ. మన జీవితానికి శాపం కూడ అదే! మన మానసిక ప్రక్రియలు — ఇంద్రియాశ్రితమైనవి, భావాత్మకమైనవి, చింతనాత్మకమైనవన్నీ ప్రాణికము యొక్క తాడింపుల నుండి విముక్తమై దాని పెత్తనము నుండి తప్పించుకొన్నప్పుడు వాటి యథార్థమైన రూపమును పొందగలవు. ఇక మానవ జీవితము దినదిన గండంగా నుండ నవసరము లేదు. ప్రాణశక్తి ముక్తమానసము ద్వారా మానవ సమస్య లన్నింటిని పరిష్కరింపగలదు.

అనువాదము: నండూరి వేంకట సత్య రామారావు.

∴

మానసికప్రాణ మొసగిన కురూపము

మానసికప్రాణము మన శరీరమున కొసగిన గొప్ప కురూపమే కోరిక. మనకు లేదని భావించిన దానిని ముఖ్యముగా పొందవలయుననే వాంఛయే కోరికకు మూలము. దానిని వశపరచుకొనుట, సంతృప్తిని పొందుట, పరిమిత జీవితము యొక్క సహజ స్వభావము. అపేక్ష, తృష్ణ, లాలసలు అను వాంఛలు మొదట ప్రాణికస్థాయిలో కలిగి, తరువాత అతిఘనము, శీఘ్రమునై బుద్ధిగతమైన రూపములను ధరిస్తాయి. అనంతపురుషునికి చెందిన యీ అనంతమైన తృష్ణను జోకొట్టి తృప్తిపరచినను అది స్వభావ

ముచే తృప్తినందనిది. మనస్సు అనెడి ఇంద్రియమును మానసిక ప్రాణము ముట్టడించును. ఇంద్రియబోధల యొక్క చంచలమైన ఆశలను తీసికొనివచ్చి, వశీకరణేచ్ఛ, అధికారమును కలిగి యుండుట, విజయము, ప్రత్యంశమునను సంతృప్తి అను వాని వలన భావప్రేరితమైన మనస్సును, ఇష్టానిష్టముల తృప్తి, రాగ ద్వేషముల ధ్వంసము, భయసంకోచము, కోరికల నైరాశ్యము, దుఃఖమువలని హింస, చిన్న చిన్న రుగ్మతలు, ఆనందప్రేరణలతో నింపి, శక్తిమంతమగు మనస్సును ఎదిరించును. ఇవి, వీని సహ కారులు మేధావంతులను, మేధావంతమైన అభిప్రాయములను రూపవికృతము, బలహీనమునైన సాధనముగ మార్చును. సంక ల్పమును కోరికగ, జ్ఞానమును అసంపూర్ణమైనదానిగ, తడబాటు, తొందరపాటు గల అన్వేషకుని పరిమితము, అసహనము, అతి వివేకము, అభిప్రాయము కలవానిగ మార్చును.

కోరిక అన్ని విచారములకు, నిరుత్సాహములకు, ఆపద లకు మూలము. అయినప్పటికి ప్రయత్నము, తృప్తి వలన దానికి అధికమైన ఆనందము కలుగును. ఎందువలననగా అది ఎల్ల ప్పుడు ప్రాణిని తన ప్రయత్నము లోనికి తీసికొని వెళ్ళి మిక్కిలి ప్రయాసపెట్టును. శ్రమ, క్షుధ, పోరాటము, తొందరగా బడలిక పొందుట, తనకు పరిమితులు కలవనే భావన, అసంతృప్తి, తొందరగా నిరాశను పొందుట, వాని వలన కలిగిన లాభములు, అంతములేని విషమమైన ప్రేరేపణ, సంకటము, వ్యాకులము — 'అశాంతి' లను పొందును.

మానసిక ప్రాణమును స్థిరముగ, ఆవశ్యకముగా పవిత్రీ కరణమొనర్చుట వలన కోరికనుండి తప్పించుకొనవచ్చును. అందువలన అన్ని సాధనములలో వ్యాపించుచున్న కోరిక స్థాన ములో నిశ్చలానందము యొక్క మానసిక ఆత్మను యథారీతిగా ఉంచవచ్చును. అది నిర్మలమైనది. స్ఫటికము వంటి మానసిక ప్రాణము, దాని సంపూర్ణత్వము నందిన మనలను, ప్రపంచ మును, ప్రకృతిని స్వచ్ఛముగ కలిగియుండును.

మానసికప్రాణము నందలి లోపమునకు మూలము

మానసికప్రాణము అన్ని ఉన్నత క్రియలను వికారమొన ర్చుటకు వానితో సంబంధము కల్పించుకొనును. కాని వానితో సంబంధము కల్పించుకొనుట యందే దాని వికారము ఉన్నది. పదార్థము వలన ఏర్పడిన దేహమునందలి ప్రాణము యొక్క భౌతిక క్రియల స్వభావము చేతనే అది వికారమగుచున్నది. దేహములోనున్న వ్యక్తి జీవిత మును, విశ్వజీవితము నుండి విడదీయుటను అదియే సృజించి నది. కోరిక, పరిమితి, ఆకలి, తృష్ణ, తాను కానిదాని యందలి కోరిక, ఆనందమునకై తడుములాట, వశీకరణమునందలి ఇబ్బం దులు, భంగములు అనువాని లక్షణములను దానిపై అద్దినది. వస్తువుల క్రమమును క్రమబద్ధీకరించుటలోను, పరిమితమొనర్చు టలోను, అది తనంతట తాను అత్యంతముగా విస్తరించి, జ్ఞానాభి వృద్ధితో ప్రయాస పరిమితమైన వస్తువుగ, అత్యాశగ, క్రమము లేని దానిగ, అస్తవ్యస్తత, వ్యాధులను పుట్టించుదానిగ, అగును.

ఇంతే కాకుండ భౌతికప్రాణము భౌతిక జీవితముపై ఆధారపడి, భౌతికజీవి నాడీశక్తికి తనంతటతాను పరిమితమగును. అందువలన మనస్సుయొక్క క్రియలకు పరిమితమగును. శరీర ముపై ఆధారపడుటకు ఒక కొలికి అగును. అలసత, అశక్తత, వ్యాధి, క్రమరాహిత్యము, అశుచి, అల్పత్వము, అనిశ్చియములకు లొంగును. భౌతికమనస్తత్వ క్రియల అంతర్థానము కూడ సాధ్య మగును. మన బుద్ధి స్వయంశక్తిచే శక్తిమంతమయినది అగుటకు బదులుగా ప్రాణమును, దేహమును స్వతంత్రముగా అదుపులో నుంచకలిగిన ఉపయోగము, సంపూర్ణత్వమును కలిగించగల చైతన్యవంతము, నిర్మలమునై తుదకు మిశ్రనిర్మాణముగా కన్పిం చుచున్నది. ఇది ప్రబలముగా భౌతిక ఇంద్రియములచే పరిమి తమైన భౌతిక మనస్తత్వము. దేహగత ప్రాణము యొక్క అధి కారయుత వాంఛ, (కోరిక) లకు, ఆటంకములకు లొంగినది.

లోపమును సరిచేయుట

ఒక విధమగు అనుభవముచే, అంతర మానసిక క్రియల విశ్లే

షణ వలన విముక్తి పొందుటచే ఇది యొక ప్రత్యేకశక్తి యని తెలియును. స్వతంత్రకార్యాచరణకు, మానసిక భౌతికప్రాణముల భేదము తెలియుటకు దీనిని ప్రత్యేకింప వలయును. కాని బుద్ధి యందలి భావము, ఆలోచనల ప్రసార మార్గము, దాని సూచనలు ఆదేశములకు విధేయము. భౌతికప్రాణమును బుద్ధి యొక్క అదుపులో నుంచుటకు సార్థకమైన విధేయమైన సాధనముగ ప్రాణము అప్పుడగును. ఈ అదుపు మన క్రియల యొక్క స్థితికి విపరీతమే అయినప్పటికి సాధ్యమే. కొంతవఱకు (యోగ) నిద్ర యొక్క అద్భుతములో నిది కనిపించుచున్నది. అయినప్పటికి ఇవి అనారోగ్యకరములైన అస్వాభావికములగును. ఎందువలననగా అచ్చట సూచనలు, ఆదేశములిచ్చు భిన్నమైన బుద్ధియగును. కాని సర్వజీవుల ప్రత్యక్ష ఆధిపత్యమును మహోన్నతాత్మయే గ్రహించుటచే అవి స్వాభావిక క్రియలగుచున్నవి. యథార్థము, ఉపయుక్తమునైన భావము, సంకల్పమున్న మహోన్నత మనస్సంబంధస్థితి వలన దీనిని నిర్దోషముగా అమలుచేయవచ్చును. మానసిక చింతనల తలపు ఆధ్యాత్మికమైనప్పటికి మిక్కిలి శక్తిమంతమైన ప్రతినిధిగ దానిని చేయవచ్చును.

అనువాదము: నండూరి వేంకట సత్యరామారావు

∴

భోగేచ్ఛ యొక్క క్షుద్ర రూపమే కోరిక

భగవంతుడు భోగనిమిత్తమై ఈ ప్రపంచాన్ని సృష్టించుకున్నాడు. మానవుడనగా భగవంతుని ప్రతిరూపమే కదా! కాని అంతటి భోగము ఈ ప్రపంచంలో ఎక్కడా కనపడదే. దీనికి కారణం ఏమిటి? దైవసంకల్పమే ఈ ప్రపంచానికి మూలము. కాని ఆ సంకల్పము (దైవేచ్ఛ) వికృతమై 'మానవేచ్ఛగా (కోరిక) తయారైనది. అనగా కోరిక యొక్క మూలస్వరూపము దైవేచ్ఛయే. ఈ కోరికలని దైవసంకల్పాలుగా పరిణమింప జేయడమెలా? కోరిక

లను వదలివేస్తే నిర్జీవమైన సన్న్యాసిజీవితమే మిగులుతుంది కదా! మనకి కావలసింది ఇది కాదు. శారీరక జీవితంలో దైవసంకల్పాన్ని నెరవేర్చుట. — సంపాదకుడు

కోరికలే జీవితానికి ఆయువు పట్టు; కోరికలను ఆపివేస్తే జీవితం వ్యర్థం; కోరికలను తృప్తిపరచటమే సంతోషదాయకము; వాటిని వదిలివేస్తే మనిషి ఎందుకు పనికిరాని సన్న్యాసిగా తయారవుతాడు — అనే భావములు జనసామాన్యంలో ప్రబలి వున్నయి. కాని ఆత్మ చేసే ఈ యాత్రకి దేవేచ్ఛయే అసలైన కారణం. దీని వికృత రూపమే కోరిక.

ప్రాపంచికానుభవం ద్వారా ఆత్మ ఆనందాన్ని పొందాలనుకొంటే అది కేవలం ఆ స్థాయికి చెందిన సంకల్పంలోనే సాధ్యమవుతుంది. తృప్తికోసం తహతహలాడి సంతోషించడం అనేది ఆ సంకల్పం భౌతికమైన వికృతిరూపాన్ని పొందడమే. అసంగమైన సంకల్పాన్ని, వాంఛను, జ్యోతిర్మయమవాలనే అంతస్సంకల్పాన్ని, బాహిరమైన కామాన్ని, బుద్ధి శరీరాల స్పందనా వైవిధ్యాలను వేరుపర్చడం ఎంతో అవసరం. మన దైనికానుభూతులలో యీ రకమైన వైవిధ్యాన్ని గ్రహించలేకపోయినట్లయితే, ఆత్మహత్యాసదృశమైన నాస్తికత్వాన్ని గాని, కేవలం జీవించడాన్ని గాని; అనిశ్చితమైన, అసహజమైన, క్షణికమైన రాజీని యీ రెండింటి మధ్య ఏర్పరచుకోవటం జరుగుతుంది. అనేకమంది యిదే చేస్తారు. వారిలో అతి తక్కువమంది దైవికతను అణచివేసి నాస్తికత్వాన్ని అనుసరిస్తారు.

ఎక్కువమంది సమాజం ఏర్పాటు చేసిన కట్టుబాట్లలోను, ఒత్తిళ్ళలోని ఏ రకమైన జీవనానికి అలవాటు పడి ఉంటారో ఆ రీతిలోనే జీవించే స్పృహను పెంపొందించుకొంటారు. మిగిలిన వారు నైతికమైన పవిత్రతను, కామియయిన బుద్ధి శరీరాల భౌతిక సాంగత్యానికి మధ్య సమతుల్యత ఏర్పరచుకొని, దానిని సదాలోచనకు, ఆరోగ్యమైన ఉనికికి బంగారు బాటగా భావిస్తారు. కాని యీ మార్గాలేవీ మనం కోరుకునే

సంపూర్ణతను గాని, జీవితంలో దివ్యసంకల్ప భావాన్నిగాని యివ్వలేవు. భౌతిక శరీరంలో దాగియున్న ఆత్మను ఊర్ధ్వోన్ముఖం చేసే ప్రాణాన్ని (వాయువును) అధోముఖం చేయడం అంటే జీవిత పరమార్థాన్ని చంపుకొన్నట్లే. బతకడంకోసం బతకాలి అనుకొనడం అసంపూర్ణతతోను, అసమగ్రతతోను తృప్తి పొందడం. ఈ రెండు మార్గాల మధ్య రాజీకి రావడం — గమనం మధ్యలో రాజీపడి — అటు భౌతికతను, ఇటు దివ్యతను పొందకపోవడమే. వాంఛతో వాంఛాగ్నితో, నిరాశా నిస్పృహాలతో నీరవత్వంతో ఓడిన స్థితికన్న, వికృతం కాని అసంగమైన సంకల్పాన్ని స్వేచ్ఛగా, నిశ్చలంగా, స్థిరంగా, శక్తివంతంగా ఉండే స్థితిని పొందవచ్చు.

అంతర్గతంగా ఆనందమైన సంకల్పాన్ని, తాపత్రయానికి లొంగి, పరిమితమై, పరాభూతమై ఉండనప్పుడు, నియంత్రిస్తూ, శత్రువులా ప్రాణంపై దాడిచేసేబుద్ధి నుండి వేరుచేసి — సంకల్పంతో కూడిన ప్రాణాన్ని ఒక నమ్మకమైన పరికరంగా మార్చుకొనవచ్చు.

ఈ గొప్ప విషయాలను కూడ మనం వాంఛ అని పిలవవచ్చు. ఆ స్థితిలో తాపత్రయంకన్న వేరైన దివ్యకామనను, తత్సంబంధమైన స్థాయిగల అంశాలను కూడ వాంఛ అని నామమాత్రంగా లెక్కించపడానికి అవకాశం ఉంది. అందువలన స్వభావ సంసర్గ, చర్యాత్మకమైన వైవిధ్యాల దృష్ట్యా దీనికి వేరు వేరు పేర్లను ఉంచడం మంచిది.

ప్రాణాన్ని సంగత్వం నుండి వేరుచేసి, మన నిసర్గ స్వభావాన్ని బాధాకరమైన అహంకార, తాపత్రయాలతో గలదిగా కాక, అసంగమైన బుద్ధికి లొంగిన పరికరంగా ఉంచుకొనడం పరిశుద్ధతలో తొలిమెట్టు.

అనువాదం: డా॥ కె. సత్యమూర్తి.

∴

ప్రాణశక్తి యొక్క నిజ లక్ష్యములు

కామాత్మ యొక్క చేష్టలు

ప్రాణకర్మలను ఆధ్యాత్మికముగా నిర్వర్తించుట సులభము కాదను మాట నిజము. అజ్ఞాన భూయిష్టమైన తన ప్రయోజనములను నెర వేర్చుకొనుటకై మనలో జీవేచ్ఛ యనునది ఒక అయథార్థమైన కామాత్మను సృష్టిచేసి, యథార్థమైన అంతరాత్మజ్యోతిస్స్ఫులిం గముయొక్క స్థానమున దానిని నెలకొల్పినది. అదియే, ఈ చిక్కున కంతకునూ మూలకారణము. ఈ కామాత్మయే మన ప్రాణకర్మలనన్నింటినీ ప్రేరేపించి వక్రింపజేయుట ఆరంభించు చున్నది. నైతికవర్తనులూ ధార్మికవర్తనులూ నైనవారినిగూడ — త్యాగశీలురుగనూ, భూతదయాపరులుగనూ చెలామణి యగు వారినిగూడ — ఈ కామాత్మయే అల్లిబిల్లిగా పెనవైచికొని నడు పుచుండును.

పృథగ్భావనచేయుచుండు అహంకారాత్మయిది. పృథగ్భా వముతో స్వోత్కర్షను ప్రకటింపజేసికొనుట కది యెల్లప్పుడునూ ప్రేరేపించుచుండును. బట్టబయలుగనో, లేక తళుకులీనెడి ముసు గుల చాటుననో, తన స్వత్వమును, తన భోగమును, తన విజయమును, తన సామ్రాజ్యమును విస్తరింపజేసికొనుటకే మనల నుద్వేగపరచుచుండును. ప్రాణమయ ప్రకృతియందలి ఈ యశాంతిని, అపశ్రుతిని, వైపరీత్యమును తొలగించవలెననిన, మన లోని *యంతరాత్మకు — హృత్పురుషునికి నాయకత్వము లభిం పవలెను.* అహంకారపూరితమైన కామాత్మను విచ్ఛిన్నము చేయవలెను.

జీవితములోనే సంసిద్ధి

ఇట్లనుటచే, జీవితమునే నిరోధించి, దాని సహజసంసిద్ధి దానికి కలుగ కుండ చేయవలెనని కాదు. మనలో, బయటికి గోచరించు నీ కామాత్మ వెనుక, అంతరమున, యథార్థమైన ప్రాణసత్త కలదు. దానిని విచ్ఛిన్నముచేయక, పరిస్ఫుటమొనర్చి, దివ్యప్రకృతిశక్తిగా దాని నిజప్రవృత్తిని వెలికిదెచ్చి విడుదల చేయవలసియున్నది.

మన యంతరాత్మ ఆధిపత్యమున నిట్లీ యథార్థ ప్రాణసత్తను ప్రబలమొనర్చినగాని, ప్రాణశక్తియొక్క ఆశయములకు దివ్యసంసిద్ధి చేకూరదు. *వస్తుతః ఈ యాశయము లెప్పటివలెనే యున్ననూ, వాని యంతర్లక్ష్యమూ, బాహ్యలక్షణమూ మాత్రము రూపాంతరము చెందును.* సాధారణ ప్రాణశక్తివలె దివ్యప్రాణశక్తికూడ అభివృద్ధికొరకూ ప్రతిష్ఠకొరకూ ప్రవర్తిల్లుననుమాట నిజము. కాని, ఆ ప్రతిష్ఠ బాహ్యస్థమైన క్షుద్రవ్యక్తిది కాదు. అంతర్గతుడై యున్న పరమపురుషునిది. ఆ యభివృద్ధి యథార్థమైన పరమ పురుషత్వములోని కభివృద్ధి.

విశ్వములోనే దివ్యానంద భోగము

అహంకారమును వశంవద మొనర్చుకొని విచ్ఛిన్నము చేసినగాని యీ పరమపురుషావిష్కారము జరుగదు. *ఇదియే జీవితముయొక్క యథార్థలక్ష్యము. ఇందు అభివృద్ధికి స్థానమున్నది. కాని, ఆ యభివృద్ధి, ప్రకృతియందు — దేహమనః ప్రాణములయందు — అంతరాత్మ సాధించెడి యభివృద్ధి. అట్లే, ఇందు సకలమునూ తనదిగా ఆకట్టుకొనుట యున్నది. కాని, అది అహంకార కామనతో ఆయావస్తువులను వస్తువులుగా గ్రహించి ఆకట్టుకొనుట కాదు. వానియందలి దివ్యత్వమును దివ్యానుభూతిచే గ్రహించి యాకట్టుకొనుట. అదే విధముగ, భోగము, సంగరము, విజయము, సామ్రాజ్యాధిపత్యము — ఈ లక్షణము లన్నియూ నిందు గోచరించును. కాని, ఆ భోగము విశ్వములో దివ్యానందభోగము. ఆ సంగరము తమ శ్శక్తులతోడి సంగరము. ఆ విజయసాధన ఇచ్ఛాజ్ఞాన ప్రేమ శక్తులచే అజ్ఞానక్షేత్రములపై విజయసాధన. ఆ సామ్రాజ్యాధిపత్యము ఆత్మ సామ్రాజ్యాధిపత్యము, బాహ్యాభ్యంతర ప్రకృతులపై అడ్డులేని ప్రభుత్వాధికారము.*

*

జీవితంలోనే పూర్ణతాసిద్ధి

చైత్యపురుషుని ప్రాణం — ప్రాణికమనస్సు లేదా తృష్ణామయజీవాత్మ — ఉన్నది. ఇదీ తన పరిపూర్ణతనాకాంక్షిస్తుంది. ఇక్కడ కూడా ప్రాథ

మికావసరమేమంటే మానసికమైన ప్రాణసామర్థ్య సమగ్రత. తన కర్తవ్య నిర్వహణ సమర్థత. ఆంతర చైత్యపురుషుని జీవనంలో పూర్ణతాసిద్ధి కోసం ఎదురయ్యే ప్రేరణలు, శక్తులను స్వాధీనం చేసుకొని శక్తి, స్వాతంత్ర్యం, పరిపూర్ణతలను సాధించటానికి వాటినే సాధనాలుగా చేసుకోవాలి. మన పరిపూర్ణతకు కావల సిన ధైర్యస్థైర్యాలు, జీవనయానంలో దృఢసంకల్పం. ఏవి మనం శీల — వ్యక్తిత్వశక్తులుగా చెబుతున్నామో అవన్నీ ఇవన్నీ వాటి పూర్ణశక్తి సామర్థ్యాలకోసం చైత్యపురుషుని ప్రాణశక్తిపై ఆధార పడి జవసత్వాలతో పైకి పొంగుతుంది.

చైత్య పురుషునిలో సుస్థాపితం కావాలి

ఈ పూర్ణత్వంతో పాటు, చైత్యపురుషునిలో సుస్థాపితమైన సుఖసంతోషాలు — స్పష్టత, పవిత్రత లుండాలి. ఆ స్పందశక్తి తుఫాను వంటి అసంస్కృత శక్తి కారాదు. శక్తి సామర్థ్యాలుండాలి. దానితో పాటుగా క్రియ ఉండాలి. ఇవి స్పష్టత, సంతుష్టి పవిత్రలతో సమన్వితం కావాలి. వీటి కన్నిటికీ *అడుగున ఆనందావేశం పీఠంగా వుండాలి. తృష్ణామయుడైన జీవుడు వ్యత్యస్తమైన కోర్కెలను వదలి విషమతను త్యజించి వాటిలో ఒక సమత, ఒక న్యాయం, ఋజుత్వం సాధించాలి. అప్పుడవి దివ్యానంద తరంగాలుగా, స్పందనలుగా పరిణమిస్తాయి. అంతదాకా హృదయం మీద, మనస్సులో, ఆత్మలో వాటి ఒత్తిడి ఉండరాదు.* ఆత్మనుండి అలలై శాంతమనస్సు, పవిత్రహృదయం ద్వారా పొంగే ప్రతి ఆజ్ఞలను, ప్రేరణలను తటస్థంగా క్రియాశీలంతో స్వీకరించాలి. ఆ ప్రేరణల ఫలమేదైనా స్వీకరించే మనోదార్ఢ్యముండాలి. ఏ సుఖానుభవమైనా సరే అది అర్థమా! పూర్ణమా! శూన్యమా! అన్న వివేచన లేకుండా స్వీకరించగలగాలి. ఎందుకంటే ఆ ఫలితం మన యజమాని అనుగ్రహం కనుక. యజమాన్యం — భోగానుభవం — దాని ధర్మం; ప్రయోజనం స్వధర్మం. అది హింసింపరానిది. దాని స్వీకరణ శక్తిలో బద్ధకం కానీ, అలసట కానీ అణగార్చటం కానీ, జడత్వం కానీ శూన్యత్వం కానీ వుండరాదు. ఆ భోగానుభూతి

సారతః ఆత్మానందం కావాలి. కానీ అది సర్వాన్ని ఆదరించి మానసిక, భావావేశ, క్రియాత్మక, ప్రాణిక, దైహిక భూమికల లోని సంతోషాన్ని ఉన్నతీకరించాలి. ఊర్ధ్వీకరించాలి. వీటికోసం, దానిలో సమన్వయ సామర్థ్యముండాలి తప్ప అసమర్థ్యం, జడత్వం ఉండరాదు. ఇలా వుంటే అద్భుత భావసాంద్రతలను భరించలేదు. అప్పుడు ఆత్మ, — మనస్సు — హృదయం — సంకల్పం — శరీరం — ఈ భూమికలన్నీ నిర్వీర్యములైపోతాయి. పూర్ణత్వం — నిర్మలపవిత్రత — సంతోషం — సమత్వం స్వాధీనం చేసుకొని అనుభవించటానికి శక్తిసామర్థ్యాలు — అన్న చతుర్విధాత్మక[1] పరిపూర్ణత చైత్యపురుషుని ప్రాణశక్తి లక్షణం కావాలి.

అనువాదం: కమలాకర వేంకటరావు (యోగసమన్వయం నుండి); ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు

∴

ఆచరణాత్మకమైన మార్గదర్శక సూచనలు

అన్ని సామాన్య ప్రాణిక కదలికలు నిజమైన సత్తాకు విదేశీ యమైనవి. అవి బయటనుండి ప్రవేశిస్తాయి. ఆత్మకు సంబం ధించినవి కావు. ఆత్మలో పుట్టినవి కావు. సాధారణ ప్రకృతి నుండి వచ్చే తరంగాలు అవి.

కోరికలు బయటనుండి వస్తాయి. అవచేతనా ప్రాణికం లోకి ప్రవేశిస్తాయి. ఉపరితలానికి చేరుతాయి. అవి ఉపరితలా నికి వచ్చినప్పుడు, మనస్సుకు వాటిని గూర్చిన స్పృహ ఏర్ప డినప్పుడు, మనలో ఆ కోరికపట్ల ఎరుక ఏర్పడుతుంది. అది మన స్వంతకోరికే అని అనుకుంటాము. ఎందుకంటే అది ప్రాణికం

---

[1] పూర్ణతా — ప్రసన్నతా — సమతా — భోగసామర్థ్యాలు.

నుండి మనస్సులోకి చేరిందని మనం భావిస్తాం. అది బయట నుండి వచ్చిందని తెలియదు. ప్రాణికానికి చెందినది, సత్తాకు చెందినది, దానిని బాధ్యురాలుగా చేసింది కోరిక కాదు. విశ్వ జనీన ప్రకృతినుండి సత్తలోకి వచ్చే తరంగాలకు, సూచనాత్మక మైన ప్రవాహాలకు ప్రతిస్పందించే అలవాటు అది.

*

కోరికను త్రోసిపుచ్చడం అనగా కవ్వింపు చర్యలకు లొంగ కుండా వుండటమే. నిజమైన ఆత్మకు, అంతర్గత ప్రకృతికి ఏ మాత్రం సంబంధంలేని 'విదేశీ అంశం' గా చైతన్యం నుండి దానిని త్రోసిపుచ్చడమే. కోరిక సూచనలను త్రోసిపుచ్చడం కూడా ఈ తిరస్కారంలో ఒక భాగం. సూచనగా వచ్చిన చర్య నుండి విరమించుకోవడం — అది సరియైన చర్య కాకపోతే — యోగనియమాలలో చేర్చి తీరాలి. తప్పు మార్గంలో, మానసిక, తాపసిక సూత్రంతో, లేదా కఠినమైన నైతిక సూత్రంతో దీనిని సాధిస్తే అది (నిగ్రహం) అణచివేత అంటారు.

నిగ్రహానికి, అంతర్గత తిరస్కారానికి మధ్యగల తేడా, మానసిక, నైతిక సంయమానికి, ఆధ్యాత్మిక ప్రక్షాళనకు మధ్య గల తేడా వంటిదే.

*

నిగ్రహానికి, ఆత్మ సంయమానికి మధ్య తేడా ఇది: "కోరకుండా ఉండలేను. కాని కోరికను సంతృప్తిపరచను", అని ఒకటి అంటుంది. "నేను కోరికను తిరస్కరిస్తాను. కోరికను తృప్తిపరచడాన్ని తిరస్క రిస్తాను" అని రెండవది అంటుంది.

*

నీ సిద్ధాంతము తప్పు. కాంక్షను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం వల్ల కొద్దికాలం పాటు ప్రాణికానికి విశ్రాంతి నివ్వవచ్చును. కాని అదే సమయంలో కాంక్ష పుట్టడానికి హక్కు ఇస్తుంది. *అది ఏమాత్రం తగ్గదు. సూక్ష్మరూపాలలో అంతర్గతంగా తృప్తి పరుస్తూ నిగ్రహం చేయడం చికిత్స* కాదు. బాహ్యమైన విధంగా కాంక్షను వ్యక్తం చేయడం కూడా మంచి చికిత్స కాదు. వ్యక్తి

గనుక కృతనిశ్చయంతో వుంటే, పూర్తి సంయమనం గనుక జరిగితే, కాంక్షను వ్యక్తం చేయకపోవడం పరిపూర్ణంగా సంభవమే. అప్పుడు ఈ నియంత్రణ (సంయమం) నిగ్రహం అవదు. అంతర్గతంగాను బాహ్యంగాను తిరస్కరించడమే అవుతుంది.

*

నీ చేతన నుండి కోరికను, ఈర్ష్యను బహిష్కరించాలి. ఇంకో మార్గం లేదు.

*

పూర్తిగా కోరికను త్యజించడానికి చాలా కాలం పడుతుంది. కాని, స్వభావం నుండి ఒకసారి దానిని త్రోసిపుచ్చితే, అది బయట నుండి వచ్చే శక్తి అని, తన పంజాను ప్రాణికంలోకి, భౌతికంలోకి దింపుతుందని నీవు గ్రహించగలిగి నప్పుడు, దానిని తొలగించుకోవడం మరింత తేలిక. అది నీలోని భాగం అని, నీలోనే వ్రేళ్ళూనిందని భావించడానికి నీవు అలవాటు పడ్డావు. అందువల్ల దాని కదిలికల్ని అణచడం మరింత కష్టమవుతుంది. దాని పాతకాలపు నియంత్రణను రూపుమాపడం కష్టసాధ్యమవుతుంది.

*

నీవు చేసే పనిలో, చివరికి సాధనలో సైతం కోరిక మిశ్రమం అవుతుంది. సందేహం లేదు. అదే అసలు కష్టం అంతా. కోరిక అసహనమైన ప్రయత్న కదలిక తెస్తుంది. కష్టం వచ్చినప్పుడు నైరాశ్యం, తిరుగుబాటు చెలరేగుతాయి. తక్షణమే ఫలితం ఉండదు. ఇతర గందరగోళం, కల్లోల భావాలు ఎదురవుతాయి. ఆకాంక్ష అన్నది కోరిక రూపంలో ఉండకూడదు. అంతర్గత ఆత్మ అవసరం అన్న భావన ఉండాలి. భగవంతుని వైపు తిరగాలన్న, భగవంతుని అన్వేషించాలన్న ప్రశాంత సుస్థిర సంకల్పం వుండాలి. ఈ కోరికల మిశ్రమాన్ని రూపుమాపడం తేలిక గాదు. ఎవరికీ కూడా తేలిక కాదు. కాని అందుకు సరియైన సంకల్పం వుంటే సాధ్యపడుతుంది. నిలకడగా ఉన్న శక్తి సాయంతో దీనిని సాధించవచ్చును.

*

మంచి కోరికలు ఉంటే, చెడ్డ కోరికలు కూడా వస్తాయి. ఆకాంక్షకు, సంకల్పానికి చోటు వుంది. కాని కోరికకు స్థానం లేదు. కోరిక ఉంటే బంధం ఏర్పడుతుంది. అంతే కాదు దాంతో బాటు వాంఛలు, ఫలనాది కావాలని పట్టుపట్టడం, సమత స్థితి లేక పోవడం, కోరిక ఫలించనందుకు ఆవేదన అన్నీ వస్తాయి. అవన్నీ యోగసాధనకు విరుద్ధమైనవి.

*

ప్రతిభూమికలో సొంతంగా సత్యాలు ఉన్నాయి. వాటిలో కొన్ని మరింత ఉన్నత భూమికలో సత్యాలు కానే కావు. ఉదాహరణకు: కోరికలు, అహం అన్నవి మానసిక, ప్రాణిక, భౌతిక అజ్ఞాన భూమిక లోని సత్యాలు. అక్కడ అహం, కోరిక లేని మనిషి తమోగుణాలతో కూడిన మరమనిషి అవుతాడు. మనం ఉన్నత భూమికలకు చేరినప్పుడు అహం, కోరిక సత్యాలుగా నిలబడలేవు. అవి అసత్యాలుగా మారి నిజమైన వ్యక్తిని, నిజమైన సంకల్పాన్ని ఛిన్నాభిన్నం చేస్తాయి. ఇక్కడ కాంతి శక్తులు, చీకటి శక్తుల మధ్య పోరాటం ఒక సత్యం. అయితే మనం ఇంకాపై శిఖరాలు చేరినప్పుడు, మరింత అల్పమైన సత్యంగా బలహీనపడి, అతిమనస్సులో ఏమాత్రం సత్యం లేకుండా అంతర్హితమవుతుంది.

స్వేచ్ఛానువాదం: కె. యజ్ఞన్న

పిల్లల మనస్సు పెద్దవాళ్లకు మల్లె కరుడు కట్టుకోపోయి ఉండదు.; చాలా స్వేచ్ఛగా వుంటుంది. ఇది వాళ్లకు కలిగే ఆలోచనలలోను, ఊహా చిత్రాలలోను, వాళ్లు కనే కలల్లోను ప్రతిబింబిస్తుంది.
పిల్లలు ఆత్మతో దగ్గర సంబంధాన్ని కలిగి వుంటారు. చైత్యపురుషునికి **(psychic being)** *చేరువగా ఉంటారు. వాళ్ళ కళ్లల్లోను, చేష్టలలోను ఇది ద్యోతకమవుతుంది.*

— శ్రీమాత

విశ్వమే కామం – ఆ విశ్వమే ప్రకామం

1908-09 సం॥ ల మధ్యకాలంలో శ్రీఅరవిందుల వారు రచించిన లఘు కవిత "Kama" కు అనువాదమిది.

(ఓ భావనాలహరి ప్రకారం, కోరిక సృష్టికి దాని స్థితికి మూలం. సకల వస్తు సముదాయం అజ్ఞానప్రేరితమైన కోరికచే సృష్టింపబడి, దానిచే కొనసాగింపబడుచున్నది. అందుచేత ఈ దృశ్యమాన జగత్తులోని చరాచర జీవరాసులన్నీ కోరిక యొక్క సంకల్ప సంజనితములే, సంరక్షకములే. అంచేత కోరికలకు దూరంగా వుంటే అజ్ఞానానికి అతీతుడవుతాడు. అలాగే అజ్ఞానం నుండి విముక్తమవటం వల్ల ఆశావలయం నుండి విముక్తుడవుతాడు. అప్పుడు దృశ్యమాన జగతి నధిగమించి ఆత్మ దివ్యసత్యం లోనికి ప్రవేశిస్తుంది. తీరని కోరికల వలయ పరిభ్రమణ విముక్తులైతే అనంత సత్యం సాక్షాత్కరిస్తుంది. దివ్యచైతన్యం సొంతమవుతుంది. ఇక్కడ కామం దివ్యసత్యనిలయం నుండి నిష్క్రమింపజేసి జీవులను నిత్య సత్యదూరులను గావించుటకు, సచ్చిదానంద వలయం నుండి వెలువడెడు ఓ శక్తిగా అభివర్ణించబడింది. *ఆ కోరికలను త్యజించినట్లైతే మరలా జీవులు విశుద్ధాత్ములై సచ్చిదానంద స్వరూపులవుతారు. ప్రవిమలానంద పరం జ్యోతి స్వరూపులై పరిఢవిల్లుతారు. కోరికల వలయంలో కోరి పడితే దుఃఖ సముద్రంలో చిక్కుపడతారు. కోరికల వలయం నుండి విముక్తులయితే విమలానంద స్రవంతులలో ఓలలాడు తారు. కోరికే సుఖదుఃఖాలు రెండిటికీ మూలం. తస్మాత్ జాగ్రత్త! మానవుడా తెలిసి మసలుకో!!*)

నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ సువిశాల నిర్జన భూములారా!
— నిర్వ్యాపక క్షేత్రములారా!!
అడవిగాచిన వెన్నల సామ్రాజ్యాలకు నెలవైన ఓ ఉపరితలావృత
అంభోరాసులారా! — దప్పి దీర్చలేని సలిల సమూహములారా!
వాంఛా సమ్మోహితులై, వ్యసనాల బందీలై అరిషడ్వర్గావృతులైన

వివిధ సజీవ రూపాకృతులలో బహుళంగా పురోభివృద్ధి
నందండి పునరుత్తేజితులవండి.
నా ఊపిరిని జీవుల హృదయాంతరాళం లోనికి సొగయజేస్తాను,
అప్పుడు భావావేశ ప్రపూర్ణ స్పందనా రవళుల తీవ్రతతో
మధురాకర్షణా విజృంభిత పవనాలు ప్రశాంతతను భంగపరుస్తవి,
నిశ్శబ్దం సుశ్రావ్యమైన ఆలగోడు బాలగోడులా అభివ్యక్తమవుతుంది.
అనంత విశ్వమూ సృజన సంశోభితమై, బాహ్య జీవన క్రమం
మహోజ్జ్వలంగా ఉదయిస్తుంది.
నా హృదయగోళం నుండి ద్వాదశాదిత్యులు ప్రజ్వరిల్లి నిర్దయా
పూర్ణ శూన్యంలోనికి ప్రవేశింతురు గాక!
మాయాజాల వలయంలో నలుచెరగులా నర్తిస్తూ నక్షత్రాలు
దివారాత్ర పడుగు పేకలతో, జీర్ణమయ్యే జీవితమనే సాలెగూడు
నిర్మాణం సాగింతురు గాక!
ఎందుకంటే నేను ప్రేమను, నేను తీవ్ర ఉద్వేగాన్ని — ఉద్రేకాన్ని
నేనీ విశ్వాన్ని సృష్టిస్తాను. ఏకైక బ్రహ్మము నేను.
నా సంకల్పం వివిధాకృతులను పొందుతుంది;
నేను మార్పొంది, పరిభ్రమించు చక్రమై పరుగులెడతాను,
చక్రవేగాన్ని మించి పందెంవేసి ఉరుకుతాను,
విశ్వం నాతో పరుగిడుతుంది. నేను దానిని పరిరక్షిస్తాను
ఎందుకంటే నేను ప్రేమను. నేను పరిభ్రమించి పరిభ్రమించి
అలసి విశ్రాంతికై ఆగినప్పుడు విశ్వం చుట్టచుట్టుకొని
తిరిగి శూన్యంలోనికి వెనుదిరుగుతుంది
ఆనందము, పరిహాసము — రెండూ — చెట్టాపట్టాలేసుకొని
నాతో కలసి నడుస్తాయి. నేను బాధా దుఃఖాలతో చెలిమి
చేస్తాను — కలసి ఆడుతాను.
నేను శ్రీకృష్ణతాండవ కేళిని, కాళిక కరాళ నృత్యాన్ని
తేజో గంభీరతలు నావి — మహత్వపటుత్వం, ప్రసన్న
ప్రభుత, నా కాణాచి.
నేను హృదయాన్ని, కేరింతలు కొడుతూ మహదానంగా
ఆడుకొనే అప్రమేయ చిన్నారుల్లా మలచగలను,

వస్తువుల ఆత్మను, పరమానంద సంభరితమైన స్త్రీ మూర్తిలా
రూపొందించగలను.
ఆకలి దప్పులారా! ఆవిర్భవించి ప్రపంచాన్ని రూపుదిద్దండి!
ఆనందమా! దిగువనజేరి దాని కాధారభూతమై బలాన్ని చేకూర్చు
ఓ ఆకాశమా! మార్పును సంతరించుకో. శాశ్వత ప్రరిభ్రమణం
నుండి పరిపూర్ణంగా వికసించు
ఓ వస్తువులలోని చైతన్యమా!
ఓ అగ్నీ! ఐంద్రజాలిక వర్ణాంభోధిలో అనంతంగా, ఇంద్రధనుర్
కాంతికిరణ తరంగాలు!
నీ ద్రవాంశం, సృష్టింపబడిన సమస్త వస్తువులలో,
ఇంద్రియాలను సంతృప్తి పరచటానికి రంగు రుచి వాసనా
కలిగి వుండనీ!
ఓ స్థిరాకృతి గల వసుంధరా! సకల ప్రాణులలో ప్రవేశించి,
నీవు విశ్వానికి ఆసరాగా నిలువు — విశ్వభ్రమణానికి చేయూతవై
అలా ఆకలి దప్పులూ, వస్తు చైతన్యమూ, ఆనందమూ, నింగీ
నేలా నిప్పూ
నాతో సహకరించినప్పుడూ,
నేను వెన్వెంటనే మానవులనుత్సాహోల్లాస సంభరితులను
గావించటానికి
సంతోషాన్ని బట్వాడా చేస్తాను.
వెన్వెంటనే సమన్వయానికి సార్వభౌమత్వానికి, న్యాయధర్మా
లను సరఫరా చేస్తాను.
ఇదంతా అనుకున్నదనుకొన్నట్లు జరిగితే, జనావళి నా
సౌందర్యాన్ని, యుక్తతను, ధన్యాత్మతను అవగతం చేసుకొంటే
నేను వారి కోరికల వలయంలో నా ఉనికిని రహస్యంగా దాచి
ఈ శాశ్వత తరిమివేత న్యాయాన్ని నిలుపుతాను నిలదొక్కుకొనేలా.
"ఎవరు నా నుండి విముక్తులవుతారో, వారు అన్నివేళలా
పట్టు సాధించి పరిపాలిస్తారు — సంకల్ప సిద్ధి నందుతారు.
ఎవరు నన్నే వెన్నంటి ఉంటారో వారు భంగపడుతారు,
పతనమవుతారు, పతితులై — బాధా సర్ప ద్రష్టులై"

అనువాదం: 'అరవిందార్చన'

కోరిక, దాని ఔచిత్యము

మూల సత్త అఖండము. కాని ఈ సృష్టి ఖండము. ఈ ఖండ పదార్థము మళ్ళీ తన అఖండతను చేరుకావాలనే తృష్ణయే కోరిక — మానవుని లోభత్వమునకు మూలకారణము. ఈ కోరిక సంస్కారము చెందుతూ పోయి పోయి చివరకు "సర్వము తానయైన వాడు" అని నిరూపించుకుండేంత వరకు కొనసాగుతూనే వుంటుంది. మార్గములో అనేక అవతారము లను తాలుస్తుంది. 'అన్నీ నాకే కావాలి', అనే భావము 'అందరికి నేను ఇవ్వాలి', అనే భావానికి దారితీస్తుంది. క్రమ క్రమంగా మానవుడు దైవానికి అర్పించుకొనగా దైవము కూడ మానవుని లోనికి దిగివస్తాడు. సృష్టిలో పరస్పర దురాక్రమ ణకు బదులు పరస్పరప్రేమ, ఖండత్వము స్థానే అఖండత, మృత్యువు పోయి అమృతత్వము రాణిస్తాయి. ఇదియే ఈ సృష్టిలో కోరిక యొక్క ఆవశ్యకత, దాని పర్యవసానము.

— సంపాదకుడు

కోరికకు ప్రేరణ ఏమిటి?

పదార్థ మాధ్యమం ద్వారా సచ్చిదానందము పొందే క్రమవికాసమే ఈ సృష్టి. పదార్థమంటే ఏమిటి? అణువణువుగా చీలిపోయిన మూలసత్త్వమే గదా. అది స్వస్వరూప ప్రాప్తికై అనుభవించే తృష్ణయే కోరిక. జీవలక్షణం గల అణువు తన వైయక్తికమైన ఉనికిని కొనసాగించుకుంటూ, అభ్యుదయం సాధించుకోవడానికి చేసే నిరంతర యత్నమే కోరిక. అదే దాని పరమార్థం.

అల్లుకున్న అనుభవ సమాహారం, అలుముకున్న స్వాధీ నత సర్వస్వంతో పాటు విలీనత, సారూప్యం, అనుభోగం వంటి వాటి ఇబ్బడి ముబ్బడి ద్వారా భౌతిక, జైవిక, నైతిక, మానసిక పరమైన ప్రగతే దీని ఉనికికి అనివార్య ప్రేరణ. అది ప్రాథమి కమైనదీ, నిర్మూలించ వీలు లేనిదీ కూడాను.

అఖండ వస్తువు, ఖండమైనప్పటికీ ఖండముల మధ్య గల అనుబంధమూ, స్వత్వభావమూ ఎక్కడికిపోవు. దానిలో

నిబిడీకృతమయ్యే ఉంటాయి. నిబిడీకృతమైన ఈ చైతన్యాన్ని అనుభవైక వేద్యం చేసుకోవడానికి గల ప్రేరణే దివ్యసృష్టికి స్ఫూర్తి. ప్రతీ ప్రాణిలోను గూడు కట్టుకున్న స్వార్థ వ్యామోహాన్ని ఉద్రేకపరిచేది కూడా ఇదే! ఇది అనివార్యమే కాదు, ఔచిత్య మైనదీ, అభిలషణీయమైనదీ కూడాను. అందుకని పెరుగుదల, విస్తరణల ద్వారా జీవనరంగంలో క్రియారూపమును పొందు తుంది.

భౌతిక ప్రపంచంలో ఈ అనుభూతిని ప్రకృతి నుండి పోషణద్వారాను, ఇతరులనో, వారు కలిగి ఉన్నదానినో సొంతం చేసుకోవడం ద్వారాను మాత్రమే పొందడం సాధ్యం అవుతుంది. కనుక కామన దాని అన్ని రూపాల్లోను విశ్వవ్యాప్తంగా ఔచిత్య మైన ఆవశ్యకతే అవుతుంది.

ఇచ్చిపుచ్చుకోవడం, క్రియ-ప్రతిక్రియ, పరిమిత వనరుల సిద్ధాంతాల ప్రకారం ఈ పదార్థ ప్రపంచంలో చివరికి సంభవించే క్షయం, మరణం అనేవి జీవితాన్ని పూర్తిగా నియంత్రిస్తాయి. కాబట్టి ఏది తీవ్ర ఆతృతను కలిగిస్తుందో దాన్ని అంత ఆత్రం గానే తీర్చుకోవాలి.

కోరిక అవసరం ఏమిటి?

చేతనా మానసంలో అవచేతనావస్థ అనేది ఉంటుంది. ఆ స్థితిలో కలిగే నిరంతర కామన ఉన్నత రూపాలను సంతరించుకుంటుంది. జీవసంబంధమైన విషయాల పట్ల ఈ కామన, మానసికపరమైన జీవితంలో తీరని కోరిక గాను, ఆలోచనాత్మకమైన బౌద్ధిక జీవితంలో విరామం లేని నిరంతర సంకల్పంగాను రూపొందుతుంది.

కోరికకు గల ఈ చలనం అలా కొనసాగుతూనే ఉంటుంది. ఉండాలి కూడాను. అయితే ఒకటి మాత్రం జ్ఞాపకం ఉంచుకోవాలి. ఆదిమధ్యాంతరహితుడైన జగత్కర్తతో అనుసంధానాన్ని పెంచుకుంటూ, వ్యక్తి తనను తాను నియంత్రించుకోగలిగే స్థాయికి పూర్తిగా ఎదిగే వరకు మాత్రమే కోరికల ఈ సంచారం ఉంటుంది.

కోరిక అనేది మీట వంటి ఓ సాధనం. దివ్యజీవన ఆశయానికి గమ్యమైన స్వీయజ్ఞానం అనేది ఈ విశ్వంలో దీని ద్వారానే సఫలం అవుతుంది. కాబట్టి దాన్ని చంపుకోకూడదు. ఎందుకంటే అది దివ్యజీవన ఆశయానికి వ్యతిరేకమే అవుతుంది. అనంత సత్త్వమును జేరుకుండేంత వరకు ఈ ప్రక్రియ కొన సాగవలసిందే. కాబట్టి ఈ దివ్యసంకల్పాన్ని నిరాకరించటం అజ్ఞానమే అవుతుంది.

ఏది ఏమైనా కోరికలను సక్రమంగా తొలగించుకోవడానికి మార్గాలు లేకపోలేదు. దీనికి ప్రధానంగా మూడు విధానాలు ఉన్నాయి. అనంత సత్త్వం పట్ల అభిలాషను పెంచుకోవడం మొదటిది. దైవికపరమైన సాఫల్యం ద్వారా కోరికను సంతృప్తి పరచుకోవడం రెండోది. అనంతమైన పరమానందాన్ని సర్వత్రా కలిగి ఉంటూ, అంతులేని సంతృప్తిని పొందుతూ ఉండడం మూడోది.

అయితే దీనికి తగ్గట్టుగా కోరిక స్వరూపం మారవలసి ఉంటుంది. ఒకరిని ఒకరు కబళించుకునే ఆబతో కూడిన కామన స్థాయినుండి పరస్పరం ఒకరి కోసం ఒకరు ఆనందాన్ని త్యాగం చేసుకుంటూ ఇచ్చిపుచ్చుకునే అనుభోగ స్థాయికి ఎదగవలసి ఉంది. అప్పుడు వ్యక్తి ఇతరులకు ఇచ్చి ప్రతిగా ఇతరులనుండి దాన్ని పొందగలుగుతాడు. ఒకరివల్ల ఒకరు పరస్పరం సంతృప్తి చెందేటట్లు దిగువ స్థాయివారు ఉన్నత స్థాయివారికి, అలాగే ఉన్నతస్థాయివారు దిగువ స్థాయివారికి సమర్పించుకుంటూ ఉంటారు. *మానవుడు దివ్యత్వానికి సమర్పించుకుంటే దివ్యత్వం మానవునికి వశమౌతుంది. వ్యక్తి తన సర్వస్వాన్ని విశ్వానికంతకు సమర్పిస్తే, అందుకు ప్రతిఫలంగా విశ్వజనీనమైన దివ్య అనుభూతిని పొందుతాడు.*

కాబట్టి, కామన సిద్ధాంతం క్రమేపి ప్రేమ సిద్ధాంతానికి తావు ఇవ్వాలి. అలాగే భిన్నత్వ సిద్ధాంతం ఏకత్వానికి, మరణం అమృత తత్వానికి పురోగమించాలి.

ఇదే అవసరం. ఇదే ఔచిత్యం. ఉన్నత స్థితీ ఇదే! కోరికకు స్వీయ సాఫల్యం అంటే కూడా ఇదే! విశ్వంలో ఇదే జరుగుతూ ఉంటుంది.

అసమర్థత లక్షణం ఏమిటి?

దివ్యజీవన మనుగడలో కాలంతో తను కదులుతూ, ఆవరణను తను ఆవరించుకుంటూ, పరిమితి-అపరిమితాలైన ఆనంద సచ్చిదానందాల పరిధిలో సాధించడం కోసం వ్యక్తిలోని దివ్యశక్తి ప్రేరణే కోరిక. అహంకారాన్ని ప్రేరేపించే ఓ పొర కోరికను ఆవరించి ఉంటుంది. అది జీవితం మూడో లక్షణమైన* అసమర్థత నుండి సరాసరి ఆవిర్భవిస్తుంది. దీనినే అసమర్థతా సిద్ధాతం అంటారు.

పరిమితికి లోబడి పనిచేసే అపరిమిత శక్తే ఈ జీవితం. పరిమిత స్థాయిలో వైయక్తికమైన చర్య ఎంతటి బలహీనమైనదైనా, ఎంతటి నిరర్థకమైనదైనా, మరెంతటి అవరోధకారి అయినా — అటువంటి ప్రతీ చర్య వెనుకా సర్వశక్తి మయమైన అతిచేతన — అవచేతనల మొత్తం ప్రమేయం ఉంటుంది. కనుక పరిమితస్థాయిలో వ్యక్తిపరమైన బాహ్యాచర్య అంతటా దాని సర్వశక్తిత్వం తప్పక కనిపిస్తుంది. అయితే అది పరిమిత సమర్థతతో పాక్షిక శక్తిగా మాత్రమే పనిచేస్తుంది

ఆ సర్వశక్తిత్వం అనేది లేకుండా బ్రహ్మాండలో ఏ ఒక చిన్న సంఘటనా కూడా జరిగే అవకాశం లేదు. సర్వశక్తిత్వం, సర్వజ్ఞత — వీటి ఆజ్ఞ ప్రకారమే విశ్వం మొత్తం ప్రక్రియలో ప్రతీ ఒక చర్యా, కదలికా జరుగుతుంది. అది వస్తువులలో అంతర్లీనమైన అతిమానసంగా పనిచేస్తుంది.

అయితే వైయక్తికమైన జీవశక్తి తన స్వీయ చైతన్యానికి పరిమితమై అసమర్థమై ఉంటుంది. ఈ వైయక్తిక జీవశక్తి తన చుట్టూ ఉన్న ఇతర వైయక్తిక జీవశక్తుల సమూహానికి వ్యతిరేకంగా పనిచేయవలసి ఉంటుంది.

---

* మృత్యువు, కోరిక, అసమర్థత అనేవి విభక్త జీవితానికి సంబంధించిన లక్షణత్రయం

అంతేకాదు. అనంత జీవిత సంకల్పము, సరళుల మొత్తంతో స్వీయ సంకల్పమూ, సరళి వెనువెంటనే ఏకీభవించని పరిస్థితుల్లో అనంత జీవితానికి చెందిన అదుపు, నిరాకరణలకు లోబడి కూడా వైయక్తిక జీవితశక్తి పని చేయవలసి ఉంటుంది.

కాబట్టి వైయక్తికమూ, విభక్తమూ అయిన జీవితానికి గల లక్షణాలు మూడింటిలో అసమర్థతా లక్షణమైన శక్తి పరిమితి మూడోది అన్నమాట.

మరోటి ఏమిటంటే — స్వీయ పెరుగుదల, స్వాధీనతల ప్రేరణ దాని ప్రస్తుత శక్తితో గాని సామర్థ్యంతో గాని బేరీజు వేయదు. ఆ అవసరం దానికి లేనే లేదు. కాబట్టి స్వంతం చేసుకోవాలనే ప్రేరణకూ, సొంతం చేసుకోగలిగే శక్తికి మధ్యగల అఖాతం లోంచే కోరిక పుడుతుంది.

ఈ స్వత్వేచ్ఛ, తనకు కావలసిన వాటిని సదా సొంతం చేసుకోగలిగినప్పుడూ, తన ధ్యేయాన్ని హాయిగా సాధించుకున్నప్పుడు అటువంటి తేడా ఉండదు కాబట్టి — అప్పుడు కోరిక అసలు పుట్టనే పుట్టదు. దేనికీ కూడా తాపత్రయపడకుండా ప్రశాంతత సంతరించుకోవడంతో పాటు స్వీయ స్వాధీనతను సాధించుకున్న సంకల్పం మాత్రమే దివ్యసంకల్పం అవుతుంది.

ఎప్పుడైతే మనస్సు అవిద్య నుండి విముక్తమవుతుందో అప్పుడు పరిమితీ ఉండదు, ఈ కోరిక రాక్షసీ ఉండదు. ఇంతెందుకు అసలు కోరిక ఆవశ్యకతే ఉండదు.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

∴

నీకు ఏదైనా వాంఛ ఉన్నట్లయితే ఆ వాంఛిత వస్తువు నీ మనస్సును, జీవితాన్ని ఆవహించేస్తుంది. నీకు తిండి మీద వాంఛ వుంటే తిండికి బానిసవయిపోతావు!

శ్రీమాత

మామూలు సుఖమును దివ్యానందంగా మార్చుట

నీరవమైన భౌతికత అనే కప్పు (నివురు)లో నుండి వెలువడ్డ అహంకార పూరితమైన మానవ వ్యక్తిత్వంలో దివ్యతేజోభావం కేవలం తటస్థమై, అంతర్గతమై, ఉపస్పృహ సహితమైన అహంకారమనే విషబీజాలను, పుష్పాలను, దాని సుఖదుఃఖాలను దాచుకొన్న విశాలమైన మృత్తిక వంటిది. ఋగ్వేదంలోని ఒక ప్రతీక ప్రకారం దివ్యాగ్ని భౌతిక మూలాలను భస్మీపటలం చేసినట్లు, *నిగూఢంగా మనలో రహస్యంగా చరిస్తూండే యీ వాంఛావృత తత్త్వాన్ని దివ్యస్పృహ భక్షిస్తుంటే యీ సుఖదుఃఖాలకు మూల ప్రాయమై, కారణభూతమై యున్నప్పటికీ నిర్నిద్రమైన ఆ ఆనందేచ్ఛ నూతన రూపాలలో అవతరిస్తుంది.* ఆ రూపాలు వాంఛకో, తాపత్రయానికో చెందినవి కావు. అది కేవలం మానవ సుఖాలకు బదులుగా దివ్యానందాన్ని ఏర్పరచే ఆత్మసంతృప్తి మాత్రమే. మానవుల మౌలికభావంలోనే యిటువంటి ఆలోచనలు, స్పందనలు ఉండటం వలననే యీ రకమైన మార్పు సుసాధ్యమయింది. జీవితాన్ని ఆనందపరిచే సంతోషభావాలు, బాధలకన్న తక్కువ కాకపోయినా, అవి వైవిధ్యం వలన, అజ్ఞానం వలన, అహంభావం వలన వెలికి రావడం లేదు.

అనువాదం: డా॥ కె. సత్యమూర్తి

∴

చివరి మాట

మన ఉనికిని నిలబెట్టుకునేందుకు కోరిక అవసరమన్నమాట నిజమే. కాని అదే కోరిక చివరకు ఆకలి ద్వారా కాకుండా ప్రేమద్వారా తన పిపాసను తీర్చుకోవటం నేర్చుకోవాలి.

*

ఎప్పుడైతే మనం భోగలాలసత్వానికి అతీతంగా ఎదుగుతామో అప్పుడే మనం ఆనందాన్ని పొందగలుగుతాము. *గతంలో కామనయే మన సాధనం. ఇప్పుడు కామనయే మన విరోధి.*

*

నీవు కోరిక, అహంకారముల పాలనలో ఉన్నంతవరకు నిన్ను దైవానికి సమర్పించుకొనలేవు. యోగములో సిద్ధిని పొందలేవు.

*

ప్రియమైన వస్తువులను పరిత్యజించుట ఊహాతీతమైన ఆనంద వైభవమును పొందుటకే. కొందరు విధినిర్వహణ కోసం వైరాగ్యులైతే, కొంతమంది మనశ్శాంతి కోసం; కొంతమంది దైవ సాన్నిధ్యమును పొందుట కోసమైతే, కొందరు చిత్రవధానుభూతి కోసం వైరాగ్యమును అవలంబించెదరు. కాని ఇవన్నీ పాక్షిక ప్రయోజనములే. *నిజానికి వైరాగ్యము పూర్ణస్వాతంత్ర్యమునకు రాచబాట. సంపూర్ణానందమునకు సాధనము.*

*

కోరిక వలన గాని అనుబంధము వలన గాని సాధకుడు ప్రేరేపితము కారాదు.

పరమశాంతిలో సంచరించే దివ్యసంకల్పము,
పరంజ్యోతినుండి జాలువారే జ్ఞానవాహిని,
పరమానందము నుండి ప్రసారమయ్యే పులకరింపు,
ఇవియే ఆతని దీపికలు కావలెను.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

∴

క్లిష్ట సమయాలలో

నీవు ఆడుకుంటూ ఉండగా ఆకస్మికంగా ఏదో పొరపాటు జరుగుతూ ఉన్నట్లు, నిర్లక్ష్యంగా ఉన్నట్లు, చేస్తూన్నపనికి ఒక్కొక్కప్పుడు ప్రతిబంధకాలు అడ్డుకుంటూ ఉన్నట్లు గ్రహిస్తావు. అలాటప్పుడు అప్రయత్నంగా *మంత్రంలా ఓశబ్దాన్ని పలుమార్లు ఉచ్చరించే అలవాటు చేసుకుంటే అది అసాధారణమైన ఫలితాన్ని సిద్ధింప చేస్తుంది.* నీవే ఎన్నుకో నీ మంత్రాన్ని; లేదా ఏ కష్ట సమయంలోనో దానంతటదే నీకు స్ఫురణకు వచ్చేస్తుంది. కష్టాలు దాపురించినపుడు బాధ, ఆందోళన, ఏమి జరుగుతోందో తెలియని సంకట పరిస్థితులలో కూడ *ఆకస్మికంగా మంత్రంలాంటి శబ్దం నీలోలోపలనుంచి పెల్లుబుకుతుంది.* ఇది ఒక్కొకరిలో ఒక్కోవిధంగా సంభవిస్తుంది. నీవు గుర్తు పెట్టుకొని నీకు కష్టం ఎదురైనపుడల్లా నీవు నీ మంత్రోచ్చారణ చేస్తూ ఉంటే అది నీకు చాలా ఆటోమేటిక్ అవుతుంది. ఉదాహరణకు నీకేదో అస్వస్థత కలుగుతోందనో, చేసేపని నీవు సక్రమంగా చేయలేకపోతున్నావనో, ఏదో ఉపద్రవం రాబోతోందనో భావన కలిగినపుడు అనాలోచితంగా అసంకల్పంగా ఆ మంత్రం నీలోపలినుంచి పెల్లుబికి రావాలి.

నీ మంత్రాన్ని నీవే ఎంచుకో. ఎందుకంటే నీలోని ప్రగాఢ ఆకాంక్షని అది స్పష్టీకరిస్తుంది. ఆ మంత్రం అనేది ఒకే మాట కావచ్చు. లేదా రెండు మూడు మాటలైనా కావచ్చు. కాక ఒక వాక్యము కావచ్చు. పరిస్థితిని బట్టి మారుతుంది. కాని అది నిన్ను ఆ పరిస్థితిలో మేలుకొలిపే నాదం కావాలి. ఆ నాదం నీకు ఉన్నప్పుడు ఏలాటి క్లిష్టపరిస్థితినైనా కూడా సునాయాసంగా అధిగమించగలుగుతావు. నేను నీకిది నమ్మకంగా చెప్తున్నాను. నిజంగా నీవు ఏదైనా ప్రమాదాన్ని కాని ఎదురుదాడిని కాని ఎదుర్కొనవలసి వచ్చినా, ఒకవేళ నిన్ను ఎవ్వరైనా హతమార్చాలనుకున్నా కూడా నీవేమీ ఉద్రేకపడకుండా ఆందోళన లేకుండా

నిశ్చల మనస్సుతో నీ మంత్రోచ్చారణ చేస్తూ ఉండు. నిన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరు.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

∴

తల్లిదండ్రులకు ప్రత్యేకం:

పిల్లల పెంపకము

పిల్లలు అమాయకులు

అంతరంగంలో నిగూఢమై ఉన్న దైవాన్ని బహిర్గతము గావించి జీవన సారథ్యము ఆయనకు అప్పచెప్పుటయే జీవితము యొక్క యథార్థ కర్తవ్యము. అయితే అధిక సంఖ్యాకులలో ఈ దైవాంశము దట్టమైన పొరలతో కప్పబడి వుంటుంది. కొంతమంది బాలురలో మట్టుకు ఇది పుట్టినప్పుడే కొంతవరకు వికసితమై వుంటుంది. అట్టి శిశువులలో చైత్యపురుషుడు జాగృతమై వుంటాడు. అతని ప్రభావము ఆ బిడ్డలలోని ఆకాంక్ష (aspiration) లోను, వాళ్ళు కనే కలల్లోను ప్రత్యక్షంగా కనపడుతుంది. ఆ పసివాళ్ళ ప్రపంచంలో సౌందర్యము, న్యాయము, ధర్మము, మంచితనము — ఇవే తారాడుతూ వుంటాయి. ప్రతివాళ్ళూ చిన్నప్పుడు దుఃఖము, ద్వేషము, అంధకారము, దుష్టత్వము మొ॥ వన్నీ నశించాలని, కథలన్నీ సుఖాంతం కావాలని కోరుకుంటారు. గాలిలో ఎగరటం, ఎక్కడకు కావాలంటే అక్కడకు వెళ్ళి వాలటం, అన్యాయాన్ని పోగొట్టి న్యాయాన్ని చేకూర్చటం. రోగులను నయం చేయుటం లాంటి మంచి మంచి విషయాలను గురించి కలలు కంటూ వుంటారు. కాని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పసివారి కలల ఆశాజ్యోతుల మీద నీళ్ళు జల్లి ఆర్పేస్తూ ఉంటారు. “అవి కలలే — నిజాలు కావు. అలా జరగడం అసంభవం” అంటారు. ఇదేనా

పెద్దవాళ్ళు చేయాల్సిన పని? "అవును. ఆ కలలో లాగే నీ ఆశయం సఫలం అవుతుంది. నీ ఆశయం నెరవేరాలంటే, నీలో ఉండే ఆ సామర్థ్యాన్ని కలుసుకోవాలి. అదే నీ ఆశయసిద్ధికి కావలసిన బలం యిస్తుంది. నీ జీవన విధానానికి బాట వేస్తుంది. నిన్ను తీర్చి దిద్దుతుంది. అందరూ భ్రమగా చిత్రించే ఆశయాన్ని నిజం చేస్తుంది" అని చెప్పాలి. బోధించాలి.

లౌక్యం పేరుతో పిల్లల అమాయకత్వాన్ని చెరచరాదు

అంతే కాని హీనమైన బడుగు మందబుద్ధిని — వివేకం పేరుతో — పెంచి పోషించే అవివేకాన్ని నూరిపోయరాదు. అంతా సజావుగా సాగుతున్నప్పుడు "ఇవాళ బాగుంది. కానీ ఎప్పుడూ అలాగే జరుగబోదు", అనడం — దయాదాక్షిణ్యాలు చూపే వ్యక్తిని గూర్చి "ఈ రోజున అతడు మంచివాడేమో కాని, భవిష్యత్తులో కూడా ఈ మంచితనం ఉండకపోవచ్చు", అని కువిమర్శ చేసి ప్రతిపక్ష భావన కల్పించడం — ఎవరైనా నేర్పుగా దేనినైనా సాధిస్తే "అతడు రేపు కూడా ఇలాగే సాధించగలడనే నమ్మకం లేదు" అని నిరుత్సాహపరచడం — పసివారి శక్తిని ఉత్సాహాన్ని నాశనం చేసే రసాయనాల వంటివి — వారి ఆశయాలను, నిశ్చయాలను, ధైర్యాన్ని మొగ్గలోనే త్రుంచివేసే ప్రక్రియలు.

పిల్లల ఉత్సాహాన్ని పెంచాలి

బాలుడు మంచి ఉత్సాహంతో ఉన్నపుడు ఆ వుత్సాహాన్ని అణగద్రొక్కవద్దు. "జీవితము ఎల్లప్పుడూ ఆనందమయంగానే ఉండదని నీ వెరుగుదువు కదా!" అని చెప్పవద్దు. వానిని ఇంకా ఉత్సాహపరచవలె. "ప్రస్తుతం కొంత వైకల్యం ఉన్నట్లు అనిపిస్తుంది కాని దీని వెనుక కూడా అందము ఉంది. అది బయల్పడడానికి ప్రయత్నిస్తున్నది. దానినే నీవు అభిలషించి, ఆకర్షించు కోవాలి. దానినే విశ్వసించి నీ ధ్యేయంగా ఏర్పరచుకోవలె" అని ప్రబోధించాలి.

చిన్నప్పుడే సద్బుద్ధులను నెరపాలి

బాల్యావస్థలోనే ఇది తల కెక్కిస్తే, తరు

వాత కన్పించే లోటుపాటులను — విద్యా వ్యాసంగం లోని లోపాలు, మందబుద్ధి, దురలవాట్లు, నిరాశావాదం, దీనత్వం, మానసిక అలసట, కృపణత్వము, — ఎదుర్కోడం కష్టతరం కాదు. అలాంటి పరిస్థితులు ఏర్పడినపుడు, "పరిస్థితుల పరిమితికి బానిసనై, చేతకానివాని లాగా, దుష్టప్రభావానికి లోనై, కాలము వ్యర్థము చేసితిని", అని లక్ష్యసాధన కుప్రక్రమించాలి. నీలో నీవే యీ నిశ్చయాలను ప్రేరేపించుకోవలె. నీవు ఆకాంక్షిస్తున్నది నిశ్చయంగా నిజమే. అదే నీవు కోరేది.

శరీర కణాలు వికసించుట

ఈ ధోరణితో పయనిస్తే, విశ్వాసం — ఆత్మవిశ్వాసం — నీ శరీరపు జీవకణాల్లో విజృంభిస్తుంది. నీ శరీరంలో ఈ ఆలోచనా స్పందనలు స్పష్టంగా నీకే గోచరిస్తాయి. నీ ఆత్మశక్తి సహకరిస్తే, బలాన్ని ఇనుమడింప జేస్తుంది. నిర్దేశిస్తుంది. త్రోవ చూపుతుంది. అంతటితో మానసిక పరిమితులు అదృశ్యమౌతాయి.

చిన్నపిల్లలెవ్వరైనా అన్ని శక్తులు తనకు ఉన్నట్లు, పరిసరాలన్నీ అందంగా భాసిస్తున్నట్లు కల వచ్చిందని అంటే, ఏనాడూ, "అలాగా! కాని నిజజీవితం ఎప్పుడూ అలా ఉండదు" అని అనవద్దు. అది చాలా తప్పు. దానికి బదులుగా "జీవిత విధానం అలాగే ఉండాలి, ఉంటుంది" అని తప్పక చెప్పాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: రంగనాధ ఆత్రేయ

∴

స్త్రీలకు ప్రత్యేకం:

విడని అనుబంధంలోని అంతరార్థం

మీ ఐహిక జీవితాలు, మీ లౌకిక అవసరాలు సమైక్యం కావడానికి; మనుగడలో కష్టసుఖాలు, జయపరాజయాలు సంయుక్తంగా అనుభవించే భాగస్వాములు కావడానికి — పునాది అనేది ఒకటుంది — అది వివాహం. అయితే కేవలం అది మాత్రమే చాలదన్నది మీకు విదితమే!

అనుభవాల్లో మీరు సమైక్యం చెందడానికి; రుచులు, అభిరుచులు ఒకటిగా చేసుకోవడానికి; ఒకరితో ఒకరు ఒకరికోసం ఒకరై సర్వవిషయాలలో సహచరులు కావడానికి — అది మంచిది; అది అవసరం కూడాను. అయితే అది మాత్రమే చాలదు.

మీ అంతరాంతర అనుభూతుల్లో ఒకటై, జీవితంలో ఎన్ని విఘాతాలు ఎదురైనా విడిపోకుండా, అసహన, ఆవేశ, అసంతృప్తులకు అతీతంగా పరస్పరం అనురాగ ఆప్యాయతలను పెంచుకుంటూ; సర్వ సమయాలలో, సకల సందర్భాలలో కలిసి మెలిసి ఆనంద పరమానందాలు పంచుకుంటూ; ప్రతి సంఘటనలోను ఒకరిలో ఒకరు శాంతిని, ప్రశాంతిని, ప్రమోదాన్ని పెంపొందించు కోవడానికి — అది ఉత్తమమైనది. అది పరమోత్తమమైనది. అది తప్పనిసరి. అయినా అది మాత్రమే చాలదు.

మీ మనసులు మమైక్యం చెందడానికి; భిన్నస్వరాలు లేకుండా మీ భావనలు శ్రుతిపక్వం కావడానికి; మీ మీ మేధో విన్యాసాలు, పరిశీలనలు ఇచ్చిపుచ్చుకోవడానికి — ఇంతెందుకు — ఒక్క మాటలో చెప్పాలంటే — మీరు ఉభయులు సంతరించుకున్న విజ్ఞాన సంపదను మరింత విస్తృతం, సుసంపన్నం చేసుకోవడం ద్వారా సారూప్యం సాధించుకోవడానికి — అది శ్రేష్టమైనది; అది పరమావశ్యకమైనది. అయినప్పటికి అది మాత్రమే చాలదు.

వాటన్నిటిని మించి, అంతరాంతరాల్లో, మధ్యంతరాల్లో, శిఖరాగ్రాల్లో — ఇలా ఎటు చూసినా — పుట్టుక, ప్రదేశం, పరిసరాలు, విద్య వంటి వాటికి అతీతంగా నిత్య ప్రకాశమాన మైన పరమ సత్యం ఒకటి ఉంది. అదే మన ఆధ్యాత్మిక ప్రగతికి ఆది మూలం. కారణమూ అదే! కర్తా అదే! మన జీవితాలకు శాశ్వత దర్శకత్వం వహించేదీ, మన గమ్యాలను నిర్దేశించేది కూడా అదే! మీరు సమైక్యం కావాలన్న సూత్రంలో అదిగో అదే ఇమిడి ఉంది. ఆకాంక్షలోను, అభివృద్ధిలోను ఒకటి కావడం, ఒకే స్థాయిలో ఆధ్యాత్మిక మార్గంలో ముందడుగు వేయడం — విడని ఆ అనుబంధం లోని అంతరార్థం ఇదే!

*

ప్రాణిక (vital), భౌతిక విషయాలపట్ల ఉండే ఆసక్తి పురుషుల్లో ఉన్నంత ఎక్కువగా మహిళల్లో ఉండదు. అంతే కాదు, పురుషుల్లో ఉండే డాంభికమైన మానసిక నటన కూడా వారిలో ఉండదు. అందుకని వారికి వారి చైత్యపురుషుని కనిపెట్టి జీవితమును దాని యధీనము గావించుట పురుషుల కంటే చాలా తేలిక

సాధారణంగా వారికి వారి మనోభావాల్ని మాటల్లో వ్యక్తం చేయడం తెలియదు. అయితే దాన్ని వారు అనుభూతుల ద్వారా అభివ్యక్తం చేయగలరు. తెలివిగల కొంతమంది చేతలలో సైతం వ్యక్తం చేయగలరు.

*

పిల్లల్ని సక్రమంగా పెంచలేక పోయామని మీరు వాపోతూ ఉంటారు. మీరు చదువుకున్న వారే! 'సంస్కారం' ఉన్న వారే.....! అయినా ఏం లాభం? వారి పట్ల శ్రద్ధ వహించడానికి మీకు తీరికే లేదు. మీ అర్ధాంగికి తీరిక ఉన్నా ఆమెకు చదువు లేదు; సంస్కారం లేదు. ఆమె ఎందుకూ పనికిరాదు మరి!

సరే; మరి ఆమె ఈ పరిస్థితికి బాధ్యులు ఎవరు అంటారు?

ఇరవైఅయిదేళ్ళుగా ఆమె మీతో జీవితం పంచుకుంటు న్నది కదా! మరి ఈ పాతికేళ్ళలో ఆమెను విద్యావంతురాలిగా చేయడానికిగాని, మీ 'సంస్కారాన్ని' అలవరచడానికి గాని మీరు

ఏం చేశారు? ఖచ్చితంగా ఏదీ లేదు. అసలు ఆ భావనే మీకు రాలేదు. అవునా! ఆమె విద్యకోసం రోజుకి ఒక్క గంట అయినా మీరు వినియోగించి ఉంటే ఈ పాతికేళ్ళలో ఆమెలో ఎంతో తేడా వచ్చి ఉండేదన్న ఆలోచనే మీకు రాలేదు.

మీకు సౌకర్యాలు సమకూర్చి, మీకు సంతానాన్ని సమర్పించే యంత్రంగానే మీకు ఆమె మిగిలి పోయింది. మీరు ఆమెను మీ పరిధిలోకి తీసుకో లేకపోయారు. ఆమె అభివృద్ధికి మీరు చేసింది శూన్యం.

పైపెచ్చు "ఓ చదువూ లేదు; ఓం సంస్కారం లేదు" అంటూ మీరు మీ స్వాతిశయంతో ఆమెను నిందిస్తూనే ఉన్నారు. ఆమె లోపాలు అన్నింటికి మీరే కారణం అంటాన్నేను.

శ్రీమాత ప్రవచనాలకు అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

∴

ప్రశ్నోత్తరములు:

పత్రికా పఠనము

ప్రశ్న: మన సాధనలో వార్తాపత్రికలు చదవటం మానేయవలెనా? చాలామంది సాధకులు, సీనియర్లు, ఆఖరికి మీరు కూడా పేపర్లు చదువుతున్నారే మరి. వాటిని చదవటం మానేస్తే ఏమీ తెలియని పామరులైపోమా మరి?

జవాబు: ఈ విషయంలో అందరికీ ఒకే నియమము వర్తించదు; వారి వారి సాధనా స్థాయి మీద ఆధారపడి వుంటుంది. నేను పేపర్లు చదువుతాను అన్న మాట నిజమే. కాని శ్రీమాత విషయంలో అటుల కాదు. ప్రత్యేకంగా ఏదైనా విషయం చూపిస్తే తప్ప ఆమె పేపర్లు చదవరు. 'క' అనే ఆయన ఒక సంవత్సరం పాటు పేపర్లు చదవటం మానేస్తే చాలా లాభం పొందుతాడు! ఈ విషయంలో సాధనకు ఏది అవసరమో విచారించాలి. పేపర్లు చదవటం వల్ల మనస్సు చెదిరిపోయి బుద్ధి బహిర్ముఖమైనట్లయితే చదవటం మానేయాలి. ఒక వేళ సాధన తటస్థమై మంద

మైపోయినట్లయితే పేపరు చదవటం వంటి చేష్టలు చేసినా పరవా లేదు. ఒక వేళ చేతనాస్థాయి పెరగటంవలన చెదరిపోవుట, తరిగి పోవుట, బహిర్గతమవుటలాంటి ప్రమాదాలకతీతమైనప్పుడు కూడా పేపర్లు చదవవచ్చు. ఇక నా విషయమంటారా — ప్రపంచ సంఘటనలు నా కార్యము మీద ఎట్టి ప్రభావమును నెరపునో అన్నది చాలా ముఖ్యమైన విషయము. అందుకని ప్రపంచక ములో ఏం జరుగుతోందో తెలుసుకోవటం నాకు చాలా అవసరం. అంతే కాని కేవలం కుతూహలం కోసం కాదు.

శ్రీఅరవిందులు

ప్రశ్న: వార్తాపత్రికలను ముట్టుకోకూడదని మీరంటారా?
జవాబు: అలాగని నేనెప్పుడూ చెప్పలేదు. పేపర్లో వుండేదంతా నమ్మకండి అని చెప్పాను అంతే. ఎందుకంటే సత్యము దీని కంటే పూర్తిగా భిన్నమైన విషయము.

*

పత్రికలు చదవాలా?

కొంతమంది సోమరిపోతులుంటారు. వాళ్ళకేమి నేర్చు కోవాలని ఉండదు. ఊరికే వూసుపోక వార్తాపత్రికలు, మామూలు పత్రికలు, పుస్తకాలు, నవలలు చదువుతారు. వాళ్ళకు జీవితమంటే కాలక్షేపం చేస్తూ బతకటమే తప్ప అంతకంటే లోతైన అవగాహన గాని అభివృద్ధి చెందాలనే అభిలాషగాని వుండదు.

కొంతమంది ప్రపంచంలో ఏం జరుగుతుందో మానవుడు ఏవిధంగా పురోగమిస్తున్నాడో తెలుసుకుండేందు కోసం పత్రికలు చదువుతారు. ఈ సమాచారం కోసం వాళ్ళు రేడియో కూడా విన వచ్చు. సినిమాలు చూడవచ్చు.

కొంతమంది భాషను, మంచిశైలిని నేర్చుకుండేందు కోసం పుస్తకాలు చదువుతారు. అట్టివారు ప్రమాణమైన సాహిత్యాన్ని జాగ్రత్తగా ఎంచుకోవాలి.

కొంతమంది శాస్త్రాలను నేర్చుకుండేందుకోసం పుస్తకాలు చదువుతారు. వాళ్ళు వారికిష్టమైన శాఖలలో విజ్ఞానశాస్త్రము, తర్కశాస్త్రము, లలిత కళలు మొ॥ వాటిని ఎంపిక చేసుకోవచ్చు.

కొద్దిమంది మట్టుకు జీవితమంటే ఏమిటో దాని ఉద్దేశ మేమిటో, లక్ష్యమేమిటో తెలుసుకోవాలనుకుంటారు. అట్టివారికి శ్రీఅరవిందుల గ్రంథములు మాత్రమే పఠనీయములు.

ఆశీస్సులు

శ్రీమాత

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

∴

ఒక సంఘటన:

కీర్తికాంక్ష

కీర్తికాంక్ష వలన యోగులనేకులు భ్రష్టులైనారు. చాలాకాలం ఆ కీర్తికాంక్ష కీటకంలా లోపల దాగి ఉండి తొలుస్తూ ఉండగలదు. అనేకులు దివ్యపథం నైజం తెలియకుండానే పయనానికి పూనుకుంటారు. కాని వారికి కొన్ని శక్తులు ప్రాప్తించగానే వారి కాంక్షలు తీవ్రరూపం తాలుస్తాయి. ఆదిలోనే వాటిని తుంచివేయనందువల్ల వచ్చే దుష్ఫలితమే అది.

అద్భుతశక్తులు సిద్ధించిన ఒక యోగి వృత్తాంతం చెపుతుంటారు. ఒక రాత్రి విందు భోజనానికి ఆ యోగిని కొందరు ఆహ్వానించగా అక్కడికి ఆయన వెళ్ళారు. రకరకాల భోజన పదార్థాలు ఒక పెద్ద బల్లపైన అమర్చబడినాయి. అక్కడున్న ఆయన శిష్యులు ఆయనను తన శక్తులతో ఏదైనా విచిత్రమైనది చూపించమని అడిగారు. తన శక్తులు చూపించరాదనే విషయం యోగికి తెలియకపోలేదు, కాని ఆయన లోపలున్న కాంక్షా బీజం అట్లాగే ఉండటం వల్ల "ఆ ఏముంది, ఏదో అమాయకంగా అడిగారు. ఈ స్వల్ప విషయాన్ని ఇటువంటి మహిమలు సాధ్యమేనని నిరూపించి చూపవచ్చు, ఆ విధంగా భగవంతుని మహాత్మ్యం బోధించవచ్చు", అనుకున్నాడాయన. వెంటనే తన శిష్యులతో, "ఆ బల్ల తీసేయండి. బల్లపై పరచిన బట్ట దానిపైన వున్న

భోజనపాత్రలు అవన్నీ అట్లాగే ఉండనీయండి. బల్ల మాత్రమే తీయండి", అన్నాడు. "అదేమిటి, అట్లా చేస్తే అన్నీ కిందపడి పోతాయే!" అని ఒక్కసారిగా శిష్యులు అరచినంత పనిచేసారు. యోగి మళ్లీ గట్టిగా చెప్పాడు ఆదేశిస్తున్నట్లు. బట్ట కింద బల్లను తీసేశారు శిష్యులు. అద్భుతం! బల్ల లేకపోయినా అది ఉన్నట్లు గానే భోజనపాత్రలు బట్టతో సహా యథాతథంగా ఉండిపోయి నయ్. అది చూస్తున్న శిష్యుల ఆశ్చర్యానికి అంతులేదు. కాని ఒక్కసారిగా ఆ యోగి గంతేసి "నాకే శిష్యుడూ ఎప్పటికీ అక్క ర్లేదు, ఎప్పటికీ వద్దు. అయ్యో, ఎంత తప్పు చేశాను! నా దైవాన్నే మోసగించానే", అని పెద్దగా అరుస్తూ బైటకు పరుగెత్తాడు. తన స్వార్థప్రయోజనాలకు దివ్యశక్తులను వినియోగించానే అన్న వేదన యోగి హృదయాన్ని నిప్పుల కుంపటి చేసింది.

ప్రాప్తించిన దివ్యశక్తులను ప్రదర్శించటం ఎప్పటికీ తప్పి దమే. దీని అర్థం ఆ శక్తులకు ప్రయోజనం లేదని కాదు. అయితే అవి దైవంనుండి ఎట్లా సంభవించినయ్యో అట్లాగే వినియోగ మవ్వాలి. అవి భగవంతునితో ఐక్యమై వస్తాయి. వాటిని భగవ దేచ్ఛ ననుసరించే వినియోగించాలి, అంతేకాని ప్రదర్శనకు కాదు.

మూలం: శ్రీమాత స్వేచ్ఛానువాదం: వి. సుబ్బరామ శర్మ

∴

వందేమాతరం:

భారతీయ సంస్కృతి యొక్క మౌలిక భావన

మన అస్తిత్వం వెనుకగల సత్యం ఆత్మ అని భారతీయ సంస్కృతి గుర్తించింది, అలాగే మన జీవితం ఆ ఆత్మ పెరుగుదల మరియు పరిణామమని కూడా గుర్తించింది. మన సంస్కృతి శాశ్వత త్వాన్ని, అనంతత్వాన్ని, పరమతత్వాన్ని అంతటినీ చూడగలుగు తుంది. అన్నిటి వెనుకగల రహస్యమైన అత్యోన్నతమైన ఆత్మను

గుర్తిస్తుంది. దానినే అది భగవంతుడనీ, శాశ్వతుడనీ, వాస్తవ స్వరూపుడనీ పిలుస్తుంది. మానవుని ఆత్మస్వరూపిగా, ప్రకృతిలో భగవంతుని శక్తిస్వరూపునిగా చూస్తుంది.

ఈ ఆత్మవైపు మానవుని చైతన్యం క్రమానుగతంగా నడవటం, భగవంతునివైపు, విశ్వాత్మవైపు, శాశ్వతునివైపు, అనంతంవైపు, ఒక్క మాటలో చెప్పాలంటే — మానవుని సాధారణ, అజ్ఞానమైన, స్వాభావిక అస్తిత్వంనుంచి ప్రకాశవంతమైన దైవిక ప్రకృతిగా అభివృద్ధి చెంది, ఆధ్యాత్మిక చైతన్యం వైపుగా పెరగటమే ఈ జీవితపు ప్రాముఖ్యత మరియు మానవజీవితాదర్శం అని భారతీయ ఆలోచనా విధానం భావిస్తుంది.

భారతదేశానికి, దాని తత్వశాస్త్రానికి తల్లీనతను కలగచేసే ప్రేరేపణ, దాని మతానికి నిలకడను కలిగించే శక్తి, దాని నాగరికత, సంస్కృతుల వెనుకగల మౌలిక భావన ఏది?

ఎల్లప్పుడూ అది, ఆ ఆదర్శపూర్వక స్ఫూర్తి లేదా ఆత్మను గురించిన ఆధ్యాత్మిక దృష్టి, భగవంతుడు, ఆత్మ, విశ్వచైతన్యానికి దగ్గర కాగలగటం, విశ్వాత్మక దృష్టి, విశ్వాత్మక స్పృహ మరియు భావన, ఒక విశ్వజనీన భావం, ఇచ్ఛ, ప్రేమ, పరిమితమై, అజ్ఞానంతో బాధపడే అహంకార తత్వాన్ని విడనాడటంలో గల ఆనందం, ఈ అతీత, శాశ్వత, అనంతభావన వైపుకు దూసుకు పోగలగటాలు — ఇవే మనకు మౌలిక భావనలు.

అలాగే మానవుని చైతన్యపూర్వక ఆత్మస్వరూపునిగా, ఆ విశాల అస్తిత్వపు శక్తిస్వరూపునిగా రూపొందించటం — ఇవే భారతీయ మౌలిక భావనలు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కాకుమాని తారానాథ్

∴

కోరికలను పూర్తిగా వదిలించుకున్నప్పుడు గాని మనిషి ఆనందమును పొందలేడు. నీకు కోరికలను తీర్చుకొన్నప్పుడు సంతోషము, విలాసము కలుగవచ్చును కాని, అది ఆనందము కాదు. ఆనందము యొక్క లక్షణమే వేరు. మనిషిలో వాంఛలు పూర్తిగా లుప్తమైనప్పుడు గాని అది కలగదు. నీవు వాంఛా జీవిగా వున్నంతకాలం ఆనందాన్ని పొందలేవు. ఒకవేళ ఆనందము పై నుంచి నీలోకి దిగివచ్చినప్పటికి, నీలోని వాంఛలు దానిని వెంటనే గల్లంతు పరుస్తాయి.

శ్రీమాత

సమాచార పత్రం

షిమోగాలో కర్ణాటక స్టేట్ కమిటి 29 జనవరి 2000 నాడు సమావేశమై కర్ణాటక రాష్ట్రములోని కార్యక్రమములు గురించి చర్చించుకొనిరి. శ్రీ ప్రదీప్ నరంగ్, శ్రీ సబ్నిస్ గార్లు ఒక పబ్లిక్ మీటింగులో ప్రసంగించిరి. ఢిల్లీలో 12, 13 ఫిబ్రవరి తారీఖులలో హిందీ ప్రాంతముల ప్రతినిధులు 60 మంది సమావేశమై కార్యక్రమములను త్వరగా నిర్వహించుటకై కొన్ని నిర్ణయములు తీసుకొనిరి. U.P స్టేట్ కమిటి వారు శ్రీఅరవిందులు సతీసమేతముగా నైనిటాల్‌ను సందర్శించిన దినము శతవార్షికోత్సవమును 29 మే 2001 నాడు జరుపుటకు నిశ్చయించిరి. మహారాష్ట్ర కమిటీ వారు జనవరి 14-17 తేదీలలో సమగ్ర విద్యావిధానమును గురించి శ్రీ శ్రద్ధాలు రనడే (శ్రీఅరవిందాశ్రమము) ఆధ్వర్యమున ఒక శిబిరమును నిర్వహించిరి. నాగ్‌పూర్‌శాఖ వారు 13, 14 ఫిబ్రవరి 2000 తేదీలలో శాఖా స్వర్ణోత్సవమును జరుపుకొనిరి. “Divine Grace, Thy goodness is Infinite. We bow before Thee in gratitude” అనే శ్రీమాత ప్రవచనములను స్మరించుకొనిరి. డా॥ కరణ్‌సింగ్ “Word Roses” అనే సూవినీర్‌ను ఆవిష్కరించిరి. రాంచి (బీహార్) లో వారి అతిథి గృహంలో The Mother's room కట్టి ప్రారంభోత్సవ

శరీరము — భౌతిక పురుషుడు

(నిన్ను నీవు తెలుసుకో — VI)



అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2000

ముందు మాట

"శరీరం అచేతనా సృష్టి. అది స్వతః అచేతనం లేదా అర్థ చైతన్య వంతం. మొదట అచేతనామయ పదార్థ రూపంగా ప్రారంభమై, ప్రాణంపోసుకుంది. జడపదార్థం సజీవమయింది. మనస్సును వృద్ధి చేసుకుంది. చెట్టులోని అవచేతన నుండి, ప్రాథమిక అవశేష మనస్సు నుండి, జంతువు యొక్క అసంపూర్ణ మేధనుండి బౌద్ధిక మనస్సును వృద్ధి చేసుకుంది. పరిపక్వమై పూర్ణమైన మేధగా వృద్ధి పొందింది. మన సమగ్ర ఆధ్యాత్మిక ప్రయత్నానికి అది భౌతిక పునాదిగా, ఉపకరణంగా, పాత్రగా నిలిచి ఉన్న మాట నిజమే కాని దానికున్న జాంతవిక లక్షణాలు మన ఆధ్యాత్మిక పరిపూర్ణత్వానికి అవరోధంగా నిలుస్తాయి. కాని అది ఆత్మను సంపాదించుకొని దానికి ఉపకరణంగా నిలిచిందంటే మరింత వృద్ధి చేసుకోగల శక్తి శరీరానికి తప్పకుండా ఉన్నదన్నమాట. అది ఆత్మకు ఆలంబనంగా, ఆత్మకు వ్యక్తీకరణంగా నిలుస్తుంది. భౌతిక పదార్థంలో నిక్షిప్తమైన ఆధ్యాత్మికతను బహిర్గతం చేయ గలదు. దేవతలకు నివాసభూమియై రాణించగలదు. సగం చైతన్య వంతం కాకుండా పూర్తిగా, సమగ్రంగా చైతన్యవంతం కాగలదు. ఆత్మతో కొంత ఏకత్వం సాధించగలదని మనం గ్రహించ వచ్చును."

శ్రీఅరవిందులు భవిష్యత్ జోస్యం చెప్పినట్లు, భౌతిక పదార్థం యొక్క భవిష్యత్ వికాసం దృశ్యాన్ని ముందు పేజీల లోని వ్యాసం ఆవిష్కరించగలదు.

ఇదిగో శ్రీఅరవిందుల పిలుపు:

"నిరామయ శిల నుండి మనోశిఖరాలు చేరుకొన్న ఓ మానవా!
ఇంకా జయించని అద్భుతావహ ఔన్నత్యాల వైపు తిరుగు"

శరీరము – భౌతిక పురుషుడు

శ్రీఅరవిందుల ప్రవచనములు

అనుబంధం

ఇతర వ్యాసాలు

భౌతిక చైతన్యము

మానవుని నిర్మాణము చిత్రమైనది. అతనిలోని మానసిక, ప్రాణిక, భౌతిక విభాగములకు తల్లులు విశ్వమానసిక, ప్రాణిక, భౌతికశక్తులు. అనగా వాటి వాటి మూలనిధులన్న మాట. అక్కణించి ఎంపికజేసిన మోతాదుల కూర్పుతో మనిషి నిర్మాణము జరుగుతుంది. మనిషిలోని కేంద్రచైతన్యము వీటిని ఉపయోగించుకుంటుంది. చైతన్యము అనగా తెలియుట. మనసుకు తెలియుట ఉన్నట్లుగానే శరీరానికి కూడా తెలియుట ఉంటుంది. అదే భౌతిక చైతన్యము, విశ్వభౌతికములోని భాగము. అందుకని శరీరము మనస్సు యొక్క ప్రసక్తి లేకుండానే తన చేతనతో పనిచేయగలదు. మానవుడు ఇంతవరకు సాధించిన విజయములు పైస్తరముల నుంచి వచ్చిన మానసిక, ప్రాణిక శక్తుల చలవయే. ఇంకా పైన గల అతిమానస లోకముల ద్వారా భవిష్య బృందావనమును ఏర్పరచుట ఈ యోగము యొక్క లక్ష్యము.

— సంపాదకుడు

మనిషిలోని విభాగములు

మనిషి స్వరూపము చిత్రమైనది. పైకి కనపడే ఈ ఆకారం ఎన్నో స్తరములతో కూడుకొనిన — అన్నమయ, ప్రాణమయ, మనోమయ స్తరములతో కూడుకొనిన — సంపుటి. ఆ స్తరములన్నీ వాటి వాటి ప్రత్యేక చైతన్యం కలిగి వుంటాయి. అయితే జాగ్రదావస్థలో మనస్సు, ఇంద్రియములు వాటిని వేర్వేరుగా గుర్తించలేవు. వాటికి అన్నీ కలగాపులగంగానే తోస్తాయి. శరీరం సంగతే తీసుకుందాము. తనదైన స్వీయచైతన్యం దానికుంటుంది. దానితోనే తను వ్యవహరిస్తుంది. మనస్సు యొక్క ఇచ్ఛతో నిమిత్తము లేకుండా, ఒక్కొక్కప్పుడు దానికి విరుద్ధంగా కూడా పనిచేస్తుంది. ఈ శరీర చైతన్యం గురించి మన బాహ్యమనస్సునకు తెలిసింది బహు స్వల్పము, అపరిపూర్ణమూను. ఇది ఘటనలను మాత్రమే చూడగలదు తప్ప వాటి కారణాలను గురించి తెలుకోలేదు. *శరీరానికి గల ఈ ప్రత్యేకమైన చైతన్యం గురించి తెలుసుకోవడం; దాని*

కదలికలను, పైనుండి లోపలనుండి దానిపై పనిచేసే శక్తులను గమనించడము, గ్రహించడం, దాని అత్యంత గూఢమైన అంత శ్చేతనాప్రక్రియను సైతం నియంత్రించడం, నిర్దేశించడం, వానిని గురించి నేర్చుకోవడం — ఇదంతా యోగంలోని అంశమే. శరీరానికి గల ఈ చైతన్యం మనలో వ్యక్తీకరించబడిన భౌతిక చైతన్యంలోని ఒక అంశము మాత్రమే. అది — విశ్వాత్మకమైన భౌతిక ప్రకృతి యొక్క నిగూఢ చేతనాశక్తుల నుండి మనము ఏర్చి, కూర్చి నిర్మించుకున్నదే.

భౌతిక చైతన్యము

ఈ ప్రకృతికి వైశ్వాన్వికమైన భౌతిక చైతన్యమొకటున్నది. దానిచే నడిపించబడుతూ, దానిలోని అంశంగా యుండే మన సొంతమైన చైతన్యమూ యున్నది. దీనినే ఆ మూలపురుషుడు, తనను తాను ఈ భౌతిక ప్రపంచంలో వ్యక్తపరచుకోవడానికి ఆలంబనంగాను, ప్రకృతిలోని శక్తులు, వస్తువులు వాని కదలికలతో సూటిగా వ్యవహారించడానికి వీలుగాను ఉపయోగిస్తాడు. ఈ భౌతిక చైతన్యాస్తరము ఇతరస్తరములనుండి వాటి శక్తులను, ప్రభావాలను పొంది తదనురూపాలను తన క్షేత్రంలో నిర్మిస్తుంది. అందుకే అసలు మనస్సుతోబాటు మనకు ఒక భౌతికమనస్సు, ఒక ప్రాణికమనస్సు ఉన్నవి. అలాగే అసలు ప్రాణికముతోబాటు మనలో ఒక భౌతిక ప్రాణిక విభాగము — అనగా నాడీసత్తా కూడా ఉన్నది. ఈ రెండునూ అధికముగా స్థూల దేహ భాగముచే నియంత్రించబడుతవి. కాని ఇదంతా మన అనుభవానికి అవచేతనంగా యుంటుంది.

భౌతిక మనస్సు

ఇది భౌతికంగా ఉండే వస్తువులు, సంఘటనలకు మాత్రమే కట్టుబడి ఉండే దినుసు. అది వానినే చూస్తుంది, అర్థం చేసుకుంటుంది. వాటి నైజానికనుగుణంగా వానితోనే వ్యవహారిస్తుంది. కాని ఉన్నత శక్తులకు బహుప్రయాసతో ప్రతిస్పందిస్తుంది. తనకు తానుగా అది భౌతికానికి అతీతముగా ఉండే విషయాల్లో సంశయాత్మకంగా వ్యవహారిస్తుంది. వాటి సూచనలను కూడా తెలు

సుకోలేదు. ఒకవేళ ఎప్పుడైనా ఆధ్యాత్మిక అనుభవాలు కలిగినా వాటిని వెంటనే మర్చిపోతుంది. వాటి అనుభూతులు, ఫలితాలు కూడా మాసి పోవుటచే వానిని నమ్మడం దానికి కష్టమౌతుంది. ఉన్నత ప్రాణిక భాగముల శక్తితో భౌతిక మనస్సును ఉద్దీపింపజేయుట ద్వారా నేటి మానవాభ్యుదయము, నాగరికత, ఏ విధంగా ఘటిల్లినయ్యో అదే విధంగా ఇక ముందర ఉన్నత ఆధ్యాత్మిక, అతిమానస స్తరముల చైతన్యముతో వాటిని పరిపక్వము గావించుట ఈ యోగము యొక్క లక్ష్యము.

ప్రాణిక భౌతికము

ఇది మన భౌతికతత్త్వము యొక్క నాడీస్పందనలకు వాహనంగా ఉంటుంది. స్వల్పములైన అనుభూతులు, కోరికలు, బాహ్యాభౌతిక జడ జీవనపు తాకిడులకు గలిగే అన్ని ప్రతిచర్యలకు ఇదే సాధనము. అవి దీని క్షేత్రములోనే జరుగుతాయి. అందుకే ఈ ప్రాణిక భౌతిక విభాగము (అసలు ప్రాణికంలోని అత్యంత క్షుద్రమైన భాగం యొక్క ప్రోద్బలంతో) మన బాహ్యాజీవనములోని అల్పత్వ చలనములకు ప్రతినిధిగా నున్నది. యోగం ద్వారా బాహ్యాచేతనను పరివర్తన చేసే మార్గంలో ప్రాణికభౌతికం యొక్క మామూలు ప్రతీకారాలు, అల్పత్వ మూర్ఖ చేష్టలు మనల్ని తప్పి పడవేసే ప్రధాన కారణాలుగానున్నవి. శరీరానికి, మనస్సుకు కలిగే బాధలు, వ్యాధులు దీని పుణ్యమే.

స్థూల శరీరము

ఇక స్థూలజడానికి వస్తే దాని స్థానమేమిటో వివరించే పనిలేదు. అది స్పష్టమే. కాని ఒకటి మాత్రం గుర్తుంచుకోవాలి. దానికి కూడా స్వంతంగా చైతన్యమొకటి ఉంది. అంగములకు, కణాలకు, కణముల అల్లికలకు, గ్రంథులకు, అవయవములకు యుక్తమైన మసగ చైతన్యము ఇదే. మసగ సీమలను ప్రకాశవంతము చేయడాన్ని, ఉన్నత స్తరములకు ఉపకరణముగా తీర్చిదిద్దే మహాప్రక్రియనే యోగంలో మనము శరీరానికి ఎఱుక కలిగించడము అని వ్యవహరిస్తాము.

*

ఇదే (జడపదార్థము) భౌతికంలోని పరమ భౌతికమైన వస్తువు. ఇది కాకుండా మానసిక భౌతికము, ప్రాణిక భౌతికము, జడ భౌతికము కూడా ఉన్నవి.

*

భౌతిక చైతన్యం గురించి నేను చెప్పేటప్పుడు భౌతిక మనస్సు, భౌతిక ప్రాణికము మరియు అసలు శారీరక చైతన్యము అని నాభావము. (జడపదార్థ చైతన్యము) భౌతికచైతన్యంలో వేఱే భాగము. చెప్పాలంటే భౌతికమనస్సు సంకుచితము, మితము, తఱచు మూఢమునై యుంటుంది. కాని జడము గాదు. దీనికి విరుద్ధంగా పదార్థ చైతన్యం జడము, మఱియు చాలా వరకు అవచేతనము (subconscious) — ఏదైనా శక్తి నడిపిస్తేనే చురుకు పుడుతుంది. లేకపోతే స్తబ్ధము, స్థాణువునై యుంటుంది.

అనువాదకులు: వై.యస్.వి.యస్. మూర్తి; యస్. వై. సోమయాజులు

భౌతిక (అన్నమయ) పురుషుడు

అసలు పురుషుడు అంటే ఏమిటి? మూలచైతన్యము. అది క్రింది లోకములలోకి దిగివచ్చినప్పుడు ఆ లోకపు ధర్మోచితమైన రూపమును తాలుస్తుంది. మనిషి అనగా మనోప్రాణదైహికముల సంపుటి. ఈ మూడు విభాగములలోను ముగ్గురు పురుషులుంటారు. వారు మూలపురుషుని ప్రతిరూపములే అగుట వలన వారి శక్తులు దివ్యములు, అనంతములు. అయితే మన మనస్సు, ప్రాణము, శరీరము మట్టుకు వాటి యొక్క పాక్షికాభివ్యక్తులు మాత్రమేగాని పూర్ణస్వరూపములు కావు. మాధ్యము వలన కుంచించబడినవి. మనస్సును నిశ్శబ్దపరచినప్పుడు మనము నిజమానసిక పురుషుని ఎరుగగలము. అటులనే ప్రాణిక శారీరక నియమనము ద్వారా వాటి నిజరూపములను తెలుసుకొనెదము.

— సంపాదకుడు

మనలోని పురుషులు దైవాంశములు

మూలసత్త్వము ఏకమే అయినప్పటికీ అనేకముకూడాను. అదే న్యాయం మనకీ మనలోని విభాగాలకు కూడా వర్తిస్తుంది. పురుషుడు ఒక్కడే; కాని ప్రకృతి భంగిమలకు అనువైన వేషాలను ధరిస్తాడు. *మన సత్తలోని ప్రతి విభాగానికి ఆత్మ యొక్క ఒక శక్తి అధిష్ఠానంగా ఉంటుంది.* మన సత్తలోని అన్నమయ, ప్రాణమయ, మనోమయ పురుషులను తగినంత లోతునకు పోయినపుడు మనం కనుగొనెదము. మనస్సునకు మనోమయ పురుషుడు గలడు; మన ఉపరితలంలోని ఆలోచనలు, అవగాహనలు, చర్యలలో తన ముద్రను వేస్తూంటాడు. అదే విధంగా మనలోని ప్రాణికజీవి మన క్షణికోద్రేకాలలో, భావాలలో, కోర్కెలలో, జీవన కార్యకలాపాలలో తనదైన ప్రత్యేక ముద్రను వేస్తాడు. ఇంకా చెప్పాలంటే మనలోని అన్నమయజీవి మన అలవాట్లలో, సహజజ్ఞానంలో, జీవనశైలిలో (formulated activities of our physical nature) తనదైన ప్రత్యేక ముద్రను వేస్తాడు. మనలోని ఈ జీవులన్నీ ఆత్మ యొక్క శక్తులే. అవి తాత్కాలికంగా పరిమితంగా వ్యక్తమవుతున్నప్పటికీ నిజానికి పరిమితములు కావు. మనలో వ్యవస్థీకృతమైన ఈ శక్తులు స్వల్పమే అయినా, అవి ఒక తాత్కాలిక మానసిక, ప్రాణిక, భౌతిక వ్యక్తిత్వాన్ని సృష్టిస్తున్నాయి. ఇది మనలోని చైత్యపురుషునితో బాటు పెరిగి అభివృద్ధి చెందుతుంది. వీటి ప్రభావం బాహ్యంలోకి వచ్చేసరికి అన్యోన్యంగా పెనవేసుకొని, దేని ముద్ర దాని కున్నప్పటికీ ఒక సమిష్టి బాహ్యసత్తను సృష్టిస్తాయి. ఇదివాటన్నిటి మిశ్రమమునై, పైకి పట్టువదలనట్లున్నా పరిమితానుభవంగల జీవనాని కుపకరించే క్షణిక రూపకల్పనలను సర్దుబాట్లను చేసుకుంటూ ఉంటుంది.

*

యథార్థ పురుషుడు

మనము మన మనస్సు లేదా బుద్ధినుండి విడిపోయి ఒక నిరపేక్ష సాక్షిగా దానిచర్యలను దర్శించినపుడు, లేదా మన ఇచ్ఛాశక్తితో మనస్సు యొక్క కదలికలను నిరోధించినపుడు — మనస్సులో ఉండే

ఆత్మ లేదా పురుషుడు మనమేనని తెలుసుకుంటాము. అదే విధంగా మన జీవన కార్యకలాపాల నుండి విడిపోయి, ఒక నిరపేక్ష సాక్షిగా జీవనాన్ని దర్శించినపుడు దాని వెనుక నుండే శుద్ధ ప్రాణికసత్తను — ఆ పురుషుణ్ణి దర్శిస్తాము. మన దేహావిషయమూ అంతే. మన దేహామునుండి దాని అక్కఱల నుండి, కోర్కెల నుండి వెనక్కు తగ్గి భౌతిక చైతన్యమును సద్దు చేసి సాక్షిగా క్రియాశక్తి చర్యలను గమనించినయెడల, ఒక సత్యమైన శుద్ధ భౌతికసత్తను — ఆ పురుషుని దర్శించగలము.

*

భౌతికము మనోప్రాణికములను మొద్దుబరుస్తుంది

మనకు మొదట ఈ భౌతికాత్మ శరీరానికి మాత్రమే పరిమితమై ఉన్నట్లు తోస్తుంది — దానికావల కాదు. ఏ విధమైన ప్రాణిక చర్యలైనా మానసిక వ్యవహారములైనా దాని ప్రమేయం లేకుండా జరుగునట్లనిపించదు. ఈ అన్నమయ పురుషుడు జడప్రకృతిలో అంతటా ఉన్నాడు. శరీరంలో కూడా వ్యాపించి ఉన్నాడు. అజ్ఞాతంగా శారీరక క్రియల్ని పరిచాలితం చేస్తాయి. ఈయన ఈ శరీరం యొక్క అనుభవానికి సంపూర్ణమైన ఆధారం. మానసికంగా సచేతనం కానివాటి నన్నింటినిగూడా, అనుప్రాణితం చేస్తాడు కానీ, మనోమయ పురుషునిలో ఈ అన్నమయపురుషుడు ప్రాణమయుడు, మనోమయుడుగూడా అవుతాడు. ఈ అన్నమయపురుషుడు ప్రాణిక, మానసిక సత్తకు సంబంధించిన, ప్రకృతి నియమాలకూ, శక్తిసమార్థ్యాలకూ సంబంధించిన కొంత భాగాన్ని పొందాడు. కానీ, ఈయునకు వాటివల్ల లభించింది పరోక్షం. అది ఆయన మూలప్రకృతిమీద పైనుంచి రుద్దబడిందా అన్నట్లు ఉంటుంది. అది, భౌతికసత్తకూ, దాని ఇంద్రియాలకూ, నియమాలకూ, కార్యాలకు అధీనమయ్యే ఉపయోగించబడుతుంది. మన మానసిక, ప్రాణికభాగాల మీద, శారీరక, భౌతిక ప్రకృతియొక్క ఈ ఆధిపత్యమే, 'మనఃప్రాణాలు భౌతికశక్తి దశలు; వాని కేవల ఫలాల్ని, వాటి కార్యకలాపాల నన్నిటినీ, ప్రాణిశరీరంలో భౌతికశక్తిక్రియల

ద్వారానే, వ్యాఖ్యానించవచ్చు', అని భౌతికవాదులు చేసే ఈ సిద్ధాంతాన్ని ఋజువు చేస్తున్నట్లు మొదట అనిపిస్తుంది. వాస్తవంలో, మనఃప్రాణాలు, శరీరానికి పూర్తిగా అధీనమై ఉండటం, అవికసితమైన మానవత్వ విశేషం. మానవునికంటె భిన్నమైన, నిమ్నశ్రేణికి చెందిన ప్రాణిలోమాత్రం, ఇది ఇంకా ఎక్కువ పరిమాణంలో కన్పిస్తుంది.

భౌతిక పరిధుల నతిక్రమించుట

అధిక వికసితమైన మానవత్వం, సత్తాగతమైన ప్రాణిక, మానసిక భూమికల నుంచి లభించే సమస్త శక్తుల్నీ, అనుభూతుల్నీ అతిశ్రేష్ఠంగా, స్వతంత్రంగా మనం ఉపయోగించ గల అవకాశాన్ని మనకు ఇస్తుంది. సహాయం పొందటంకోసం, ఈ గుప్తభూమికలవైపుకి మొదటినుంచి ఎక్కువ మొగ్గుతాం. కామనామయమైన లోకంనుంచి లభించిన మహత్తరమైన బలాలు, శక్తులద్వారా, మానసిక, బౌద్ధిక స్తరాలనుంచి ప్రాప్తమైన మహత్తర, సూక్ష్మతర మానసిక బలాలద్వారా, శక్తుల ద్వారా అన్నమయపురుషుని మూలప్రకృతిని మన వశం చేసుకొని, దాన్లో పరివర్తనం తీసుకువస్తాం. ఈ వికాసం యొక్క సహాయంవల్ల మనం మృత్యువుకూ, పునర్జన్మకూ మధ్య ఉన్న సత్తయొక్క ఉచ్చతర శిఖరాల్ని ఆరోహించటానికి సమర్థుల మవుతాం. ఇంకా ఎక్కువ అత్యున్నతమైన మానసిక, ఆధ్యాత్మిక వికాసంకోసం, స్వయంగా పునర్జన్మను గూడా, ఇంకా బాగా, ఇంకా తీవ్రగతితో ఉపయోగించుకోగలుగుతాం. కానీ, ఈ విధంగా జరిగినప్పటికీ, ఇప్పటివరకు మన జాగ్రత్ సత్తకు సంబంధించిన చాలా పెద్ద భాగాన్ని నిర్ధారించే మన భౌతిక సత్తలో మన కర్మను ప్రేరేపించే లోకాల, భూమికల నిశ్చిత జ్ఞానం పొందకుండానే పని చేస్తాం. భౌతిక సత్తయొక్క ప్రాణ భూమిక, మానస భూమిక, మనకు నిస్సందేహంగా తెలుసు. కానీ, వాస్తవికమైన ప్రాణస్తరాన్ని, మానస స్తరాన్ని, లేక మన సాధారణ చేతనయొక్క తెరవెనుక మన స్వీయ సత్త అయిన ఉచ్చతర, విశాలతర ప్రాణమయ, మనోమయ పురుషుణ్ణి ఎరగం.

వికాసానికి చెందిన ఉన్నత స్థితిలోనే, మనం ఆ పురుషుణ్ణి తెలుసుకొంటాం. యోగంద్వారా, ఆత్మచేతనాన్ని, ఆత్మప్రభుత్వాన్ని ఉన్నతం, విశాలమైందిగా చేస్తూ, అన్నమయ పురుషునికి అతీతంగా పోయే ఈ శక్తి, ఊర్ధ్వభూమికల్లో ఉచ్చతర పురుషుణ్ణి పొందే ఈ శక్తి, కొంచెం ఎక్కువ తక్కువ పరిమాణంతో సొంతం చేసుకొనబడుతుంది.

అనువాదం: యస్.వై.సోమయాజులు; వై.యస్.వి.యస్. మూర్తి; జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రి (యోగసమన్వయం నుండి)

భౌతిక చేతనాస్థాయిలో సాధన

మన యోగము జీవితమును పరిత్యజించునది కాదు. శరీరము మనకు బంధనము కారాదు. జీవితమును పరివర్తింప జేయుటయే దాని ప్రధాన లక్ష్యము. సాధకుడు అంతరంగికముగా సిద్ధులను పొంది ఆనందలోకమును దర్శించవచ్చును. కాని అది ఒక స్థాయి మాత్రమే కదా. అనంతరము తాను దర్శించిన ఆ దివ్య జ్యోతిశ్శక్తులను భౌతిక శరీరంలోకి కూడ తీసుకొని రావలెను. దానికి భౌతిక స్థాయిలో సాధన చాలా అవసరము.

— సంపాదకుడు

> **దివ్యజ్యోతిశ్శక్తులు భౌతికస్థాయిలోకి దిగిరావాలి**

సాధన మానసిక, ఊర్ధ్వ ప్రాణిక స్తరముల నుండి భౌతిక చేతనలోనికి దిగివచ్చినపుడు ఈ వ్యతిరేకశక్తులు విజృంభిస్తాయి. సాధారణంగా మొదట పొందిన గాఢానుభవాలు పలచబడడం, తటస్థమైన స్తబ్ధత (inertia) లోకి దిగిరావడం జరుగుతుంది. ఈ స్తబ్ధతే విమోచనం పొందని భౌతికనైజానికి పునాదిరాయి. అచ్చుటకే దివ్యానందము, శక్తి, కాంతి దిగివచ్చి సమస్తమునూ పరివర్తన చేయవలసియున్నది. అదే ఈ స్తబ్ధతను, అవిద్యను తరిమిగొట్టి దేదీప్య

మానమైన శక్తిని, పరిపూర్ణ ప్రకాశాన్ని స్థిరమైన ఆనందాన్ని ప్రతిష్ఠించవలసి యున్నది. చిక్కులు వచ్చేది ఇక్కడే — మనస్సులో గాని ఊర్ధ్వప్రాణికంలోగాని కాదు. అక్కడకూడా విజయం కల గాలి, నవలోక స్థాపన జరగాలి.

*

భౌతిక సత్తను తృణీకరించ వలసిన అవసరము లేదు. అదికూడ ఆవిర్భవించడానికి ఉద్దేశించబడిన దానిలో భాగమే.

*

పదార్థగత చేతన జడము

నీవు వర్ణించేది పదార్థ చేతన. అది హెచ్చుగా అవచేతనము. చేతనం కలిగిన కొద్దిభాగము యాంత్రికంగా నుంటూ అలవాట్లచేత, నిమ్న ప్రకృతి శక్తులచేత మందకొడిగా చరిస్తూ ఉంటుంది. అవే బుద్ధి హీన, జ్ఞానశూన్య చలనాలను చర్విత చర్వణం గావిస్తూ నిర్ణీత మైన నిబంధనలకు, దైనందిన జీవన విధానానికి కట్టుబడి ఉంటుంది. మార్పుకు ఇష్టపడదు. దివ్యకాంతిని గ్రహించ నిచ్చ గించదు. ఆ ఉన్నతశక్తిని మన్నించదు. ఒకవేళ అంగీకరించినా అప్పుడది నేర్పు లేక యుంటుంది. మఱి యొకపరి నేర్చినా ఆ దివ్యబల ప్రకాశాలచే సంప్రాప్తించిన ప్రక్రియను వేరే నూతన యాంత్రిక క్రమంలోనికి మళ్ళిస్తుంది. అలాగ దానిలోని ముఖ్యా ధారాన్ని, జీవాన్ని బయటకు లాగి పారేస్తుంది. అది గూఢము, బుద్ధిహీనము, సోమరి, అజ్ఞానభరితము మరియు జడము, అంధ కారము, తమస్సు యొక్క మాంద్యమూను. ఈ ద్రవ్యచేతన లోనికే ముందుగా మనం ఆ ఉన్నత (దివ్య, ఆధ్యాత్మిక) శక్తి ప్రకాశా లను, ఆనందాన్ని పిమ్మట ఆ అతిమానస సత్యాన్ని ఆహ్వానిం చడమే మన యోగం యొక్క ధ్యేయం.

*

దివ్యశక్తిని ఆహ్వానించుట

నీకు కలిగిన అనుభూతి అత్యంత భౌతిక మైన చేతన. అది ఇంచుమించు అందరి లోనూ ఇలాగే ఉంటుంది. దీనిలో పూర్తిగా కాని, కేవలంగా కాని ప్రవేశించినపుడు పశువులాగ అనుభవ

మవుతుంది. ఒకప్పుడు గూఢంగాను, చంచలంగాను, వేరొకప్పుడు స్తబ్ధముగాను, బుద్ధిహీనముగాను అనుభవమవుతుంది. ఏ స్థితిలో నైనా అది ఆ దైవానికి తెలియచుకొనలేదు. ఉన్నత చేతనను, ఆ దివ్యశక్తి దానిలో ప్రవేశ బెట్టినపుడు మాత్రమే అది సమూలంగా మార్పు జెందుతుంది. ఈ విషయాలు ప్రదర్శనమైనపుడు, అవి బహిర్గతమయినవని కలవరపడకుము. మార్పు జేయడానికే అవి ఉన్నాయని గ్రహించుము.

వేరేచోట చెప్పినట్లే ఇచటకూడా నిదానమే ప్రధానము. చేతనను శాంతముగా నుంచుకోవాలి. దాన్ని కలవర పడకుండాను, కల్లోలిత మవకుండాను చూసుకోవాలి. అట్టి నిశ్చలత లోనికి ఆ దివ్యశక్తి నాహ్వానించి ఈ అజ్ఞానాన్ని తొలగించి మార్పు తేవాలి.

*

భౌతికంలో స్తబ్ధత, అజ్ఞానము, అశక్తత, వీటి మొండితనాన్ని ఎదుర్కొనవలసి యున్నది. ఇటువంటి స్థితిలో చేయవలసిందల్లా, ఇంకా జగమొండిగా ఉండి మన స్థిరమైన ప్రయత్నాన్ని కొనసాగించడమే — ఏ మాత్రము వ్యాకులతతోకూడిన ప్రయాస లేకుండా నిలకడతో పట్టుబట్టుటయే — ఇంతటి దృఢమైన ప్రతిఘటనలో కూడ విశాలము, శాశ్వతమునైన ప్రవేశాన్ని పొందవచ్చును.

*

స్తబ్ధత ఏర్పడినపుడు తబ్బిబ్బుపడకుండా ఉండడమే మొదట ఆచరించవలసినది. ఇక రెండవది — నీవు ఎగువగాని, దిగువ గాని తాదాత్మ్యము చెందకుండా దానినుండి వేఱుపడడం. ఇక మూడవది — స్తబ్ధత నుండి ఉత్పన్నమయిన దేనినీ నీదిగా గుర్తించక త్రోసిపుచ్చడము,

ఈ విధంగా చేసినపుడు నీలో ఇంకా నిబ్బరంగా ఉన్న దానిని గుర్తిస్తావు. ఈ నిబ్బరమైన భాగంద్వారా, శాంతి, శక్తి, కాంతి, జ్ఞానము — ఈ స్తబ్ధత లోనికి తీసుకురావచ్చును.

*

నిశ్చలమైన క్రియాశక్తిని సమతా, శాంతి స్థాయిలోని కధికంగా అవరోహింప జేసినప్పుడు మాత్రమే భౌతికము యొక్క మొండి లక్షణము నిర్మూలింపబడుతుంది.

భౌతికము యొక్క సహజ లక్షణము స్తబ్ధత. దీని వల్ల ప్రాణశక్తులకు మాత్రమే ప్రతిస్పందించడం జరుగుతుంది. ఊర్ధ్వ శక్తులకు స్పందించలేదు. పరిపూర్ణ సమానత్వము, శాంతి ఉన్న పుడు, స్తబ్ధత ప్రభావము, వ్యాప్తి ఉండదు. అట్టి స్థితిలో ఉన్నత చైతన్యం యొక్క శక్తిని క్రమంగాగాని, త్వరగా గాని ఈ స్తబ్ధత లోనికి ప్రవేశబెట్టి దానిని మార్చవచ్చును.

*

తమస్సును దూరంగా ఉంచుటకు శరీరవ్యాయామము చాలా అవసరము. నీవు దాన్ని ప్రారంభించినందుకు సంతోషమే. అలాగే కొనసాగిస్తావని నమ్ముతున్నాను. దివ్యశక్తి దిగివచ్చి రూపాంతరీకరణము గావించినప్పుడే భౌతికతమస్సును వేళ్ళతో సహా తొలగించగలం. కాని క్రమం తప్పకుండా వ్యాయామం చేసినట్లయితే శరీరం తమోమయం కాకుండా ఉంటుంది.

అనువాదకులు: వై.యస్.వి.యస్. మూర్తి; యస్. వై. సోమయాజులు

దివ్యజీవనానికి దివ్యశరీరం

భూలోకంలో దివ్యజీవనమును పొందుటకు శరీరాన్ని తిర స్కరించనవసరం లేదు. ఈ శరీరంలోనే దివ్యచైతన్యము నిక్షి ప్తమై ఉన్నది. ఈ చైతన్యాన్ని శరీర వ్యాయమము ద్వారా, క్రీడల ద్వారా జాగృతము చేయవచ్చును. రూపాంతరణ ప్రక్రియ ద్వారా భౌతిక పదార్థము కూడా దైవశాసనమునకు విధేయము కాగలదు. అప్పుడు శరీరము కూడా దివ్యప్రేరణను పొంది దివ్యజీవనమునకు చక్కటి వాహికము కాగలదు. మనస్సు కూడా తడుముకోవలసిన పనిలేదు. ఎందుకంటే అది కూడ

అతిమానసజ్యోతితో ప్రదీప్తమై దివ్యసత్యమును, దివ్యదృష్టిని పొందగలదు. — సంపాదకుడు

భువిని దివిగా మార్చుట

మానవావతారము సర్వాంగసిద్ధిని పొందవలెనన్నచో అది కేవలము అంతరంగిక జ్ఞానదీప్తి ద్వారా లభించునది కాదు. మన భౌతిక విభాగమును వదలిపెట్టుటకు వీలు లేదు. "*శరీరం ఖలు ధర్మసాధనం*", అని కదా ఆర్యోక్తి. శరీరమే భౌతికాలంబనము. ధర్మసాధనమునకు పరికరము. ధర్మమంటే ఏమిటో మనం స్పష్టంగా తెలుసుకోవాలి. మనం ప్రతిపాదించేదంతా — ప్రతి ఆదర్శము, దాని ఆచరణ మార్గము, క్రియారూపము — ఇదంతా ధర్మమే.

భూలోక జీవితాన్ని దివ్యజీవనంగా పరిణమింపజేసి ఈ భూలోకాన్ని దివ్యధామంగా మార్చుటయే మన ఆదర్శము. అయితే ఈ మర్త్య శరీరంలో అది సాధ్యమా? కానేకాదు కాబట్టి మనమీ శరీరమును కూడ రూపాంతరీకరణము చేయాలి. అనగా దాని అవయవములను వాటి రూపురేఖలను పరివర్తింపజేసి, దాని సామర్థ్యమును పెంచుకొని మనమింత వరకూ కనీవినీ ఎరుగని ఒక నూతన రూపమును పొందుట ద్వారానే అది సాధ్యము.

మొదట భౌతిక చైతన్యం జ్యోతిర్మయం కావాలి

శరీరానికి, మనస్సుకి సంబంధించిన భౌతిక చైతన్యానికి గల సాపేక్షతా పరిపూర్ణత్వాన్ని నేను గత సందేశంలో సూచించాను. అది ప్రసాదించే జీవితం, వ్యక్తిత్వం వల్ల శరీరంలోని సహజ స్వీయ సామర్థ్యాలు జాగృతమై అభివృద్ధి చెందుతాయి. శరీరాన్ని సంస్కరించే వ్యాయామం ద్వారాను, సాధనాల ద్వారాను ఈ స్థితి సిద్ధిస్తుంది. కనుకనే వాటి పట్ల ప్రత్యేకమైన శ్రద్ధను, అవగాహనను కలిగించడానికని వాటిని మనం ఈ ఆశ్రమంలో ప్రారంభించాము.

భౌతిక చైతన్యం అభివృద్ధి చెందుతూ ఉండాల్సిందే. అది మన యోగంలో చాలా ముఖ్యమైన అంశం. దానికి శారీర వ్యాయామము, సంస్కారము, చాల ముఖ్యం. ఆరోగ్యం, దారు

ఢ్యం, అనుకూల్యం — ఇవి ప్రాధమికమైన అవసరాలు. వీటిని పొందటానికి శారీరక పటుత్వము అనువైనదిగా ఉండాలి.

ఈ భౌతిక ప్రపంచంలో దివ్యజీవనం ఎలా సాధ్యమవుతుంది? ఆధ్యాత్మిక శిఖరము, భౌతిక ప్రాతిపదిక — ఈ రెండింటి సంగమము వలన. ఈ జీవితానికి ప్రాతిపదిక పదార్థమే కదా! కాబట్టి ఆ పునాదితో సహా ఆత్మ ఆధ్యాత్మిక ఉన్నతులకు ఆరోహణం చెందుతుందే తప్ప, ముఖ్యమైన ఆ పునాదిని త్యజించదు. అట్టడుగున భౌతికపదార్థం — పైన ఉన్నతంగా ఆధ్యాత్మికం — ఈ నిమ్నోన్నతాలు రెండింటిని ఆత్మ అనుసంధానం చేస్తుందన్న మాట.

భౌతిక పదార్థపు దివ్యీకరణము

దివ్యచైతన్యం దిగివచ్చి (అవరోహణం) పదార్థాన్ని ఆవరిస్తే, అప్పుడు దాని తేజస్సును, విశిష్టతను, శక్తిని ఈ శరీరం సంతరించుకుంటుంది. ఫలితంగా ఈ భౌతిక ప్రపంచంలోనే దివ్యజీవనం పొందేలా రూపొందుతుంది. ఇలా రూపొందడం అంటే మనలో ఇంతవరకు పదార్థ రూపంలో నిబిడీకృతమై ఉన్న ఆధ్యాత్మికతను బహిరంగం చేసే ఒక పరికరం కావడం అన్నమాట. అంతే కాని పదార్థానికి ప్రతికూలమైన చైతన్యం కాదు. పదార్థానికి అవరోధంగాను, ఆధ్యాత్మికతతో బంధించే సంకెలగాను భావించే సూక్ష్మాతిసూక్ష్మమైన మార్పు కానే కాదు. అది పదార్థానికిగల శక్తిని గాని, దాని పద్ధతులనుగాని తొలగించదు. పైగా వాటిలో నిక్షిప్తమై ఉన్న వాటి సామర్థ్యాలను బయటకు తెస్తుంది. పెంపొందిస్తుంది. అంతేకాదు వాటికి గల సహజమైన దివ్యత్వానికి మరింత మెరుగు పెట్టి మరింత బహిరంగపరుస్తుంది.

జీవితం అతిమానసము యొక్క ప్రతిబింబము

దివ్యీకరణశీలమైన ఏ ఒక్క అంగమును దివ్యజీవనం నిరాకరించదు. పైగా వాటన్నింటిని తనలో విలీనం చేసుకుంటుంది. వాటిని పెంపొందించి పరిపూర్ణతను కలిగిస్తుంది. జ్ఞానాన్ని పొందడానికి మనస్సు మథనపడుతున్నప్పటికీ, అది

ఇంకా అజ్ఞాన స్థితిలోనే ఉంటుంది. అది పురోగమించి అతిమాన సిక తేజస్సును, సత్యాన్ని సంతరించుకోవాలి. అప్పుడు వాటిని తీసుకువచ్చి మన ఆలోచనలతోనూ, దార్శనికతతోను, ఆత్మావ లోకనంతోను రంగరించాలి. మన జ్ఞానేంద్రియాలు వాటి అంత ర్గత బహిరంగ చర్యల్లో పరమసత్యం ప్రస్ఫుటం అయ్యేలా ఇది జరగాలి.

మానవజీవితం నేటి వరకు అంధకారమయమై, అస్ప ష్టమై, అయోమయంగానే ఉంది. జీవితంలో నిస్తేజమైన అధమ ఆలోచనలు అనేకం అలుముకుని ఉన్నాయి. కాబట్టి ఈ జీవితం ప్రేరణలను, లక్షణాలను ఉత్తమంగా భావించి, తేజోమయం చేసు కొని, అతిమానస దివ్యజీవనానికి విశిష్టమైన ప్రతిరూపంగా తయారు చేసుకోవాలి. భౌతిక చైతన్యంగాను, భౌతికరూపంగాను ఈ శరీరం దాని ఉనికిలోను, అపురూప ఆలోచనల్లోను పరి పూర్ణత్వాన్ని పొందాలి. చివరికి దివ్యలోకాలనుండి తేజస్సును, సౌందర్యాన్ని, దివ్యానందాన్ని జీవితంలో నింపుకోవాలి. ఈ విధంగా దివ్యజీవనము దివ్యదేహమును తాలుస్తుంది.

మానవ ప్రకృతి దివ్యశక్తుల కాలవాలము కావాలి.

ఆధ్యాత్మికత వైపు మళ్ళా లనే ఆకాంక్ష పొందే స్థాయికి, మార్చే శక్తికి లోను కాగలిగే పరిస్థితికి చేరుకోవడం కోసం పరిణామ ప్రక్రియ దివ్యత్వాన్ని నేరుగా కలుసుకో గలిగే స్థాయికి జేరాలి.

అధమ స్థాయిలో ఉండే మానవ ప్రకృతి మార్పు చెందాలి. మనస్సు తేజోమయంగా రూపొందాలి. జీవితం శక్తిమంతం కావాలి. అది సక్రమ కార్యాచరణకు పరికరం కావాలి. దాని సర్వ శక్తులను సక్రమంగా వినియోగించుకో గలగాలి. ప్రస్తుత సంకుచిత సామర్థ్య స్థితి నుండి — చర్యలో స్వీయసాధనా శక్తిని, జీవితంలో ఆనందాన్ని ఇచ్చే ఉన్నతిని హాయిగా చేరుకోవాలి. అప్పుడు మాత్రమే దివ్య పరిపూర్ణత్వం, సర్వ పరిపూరణత్వం సాధ్యం అవుతాయి.

ఉత్తమ మానవత్వ సిద్ధికి అవరోధంగాను, ఆటంకంగాను ఉండే పరిమితులకు అతీతంగా పనిచేసే ఓ పరికరంగా శరీరం రూపొందాలి. దానికోసం శరీరం దాని క్రియను, ప్రక్రియను, సామర్థ్యాలను ఒకే విధంగా మలుచుకుంటూ పరివర్తన చెందాలి.

ఈ సమగ్ర పరివర్తనలో మానవసాధనాలకు, శక్తులకు సంబంధించిన ఉన్నతిని కూడా మనం సాధించాలి. అలా అని వాటిని మినహాయించాలని కాదు. నూతన జీవితంలో భాగంగా, వాటిని వాటి సంపూర్ణ సామర్థ్య స్థాయికి పెంపొందించుకొని వినియోగించుకోవాలి.

*

సర్వాంగ పరిపూర్ణ ప్రాప్తియే దివ్యజీవనము యొక్క నిరంతరావేదన కావాలి. ఎందుకంటే జీవితంలోని ఏ ఒక్క లేశాన్ని మినహాయించకుండా పొందే పూర్ణానందము దివ్యజీవనములోని భాగమే. శరీరము — ఈ జడ భౌతికావయవము కూడా దివ్యానందాన్ని పొందవలసిందే. జీవితంలోని ఆనందాన్ని అది కూడ ఆస్వాదించాల్సిందే. సర్వమంగళానుభూతితో ఓలలాడ వలసిందే.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు.

శరీరము యొక్క రూపాంతరీకరణము

యోగమనగా దైవముతో కలయిక. విడిపోయిన రెండు చివరలు తిరిగి సమాగమము జెందుట. మనిషి అనగా మనోప్రాణిక దైహికముల సంపుటి. అవి ప్రకృతి గతములు. ప్రకృతి శాసనమునకు విధేయములు. మనోప్రాణికములు యోగము వలన సమాధి స్థితిలో దైవసాక్షాత్కారమును పొందగలవు. దాని ప్రభావమునకు లోనై కొంత పరివర్తనమును సాధించగలవు. కాని ఈ శరీరము జడము. దానిలోని పదార్థము అచేతనము. కాని మన యోగములో మనిషిలోని ఏ అంగమును మినహా

యించుటకు వీలు లేదు. శరీరము కూడా దివ్యప్రేరణకు లోనై సిద్ధిని పొందవలసినదే. రూపాంతరీకరణము జెంది దైవకార్యమునకు సాధనము గావలసినదే.

శరీర కణములు సహితము దివ్యజ్యోతికి పాత్రలై ఈ దివ్య "దీపావళి" మహోత్సవములో పాల్గొనవలసిందే.

— సంపాదకుడు

మనది పూర్ణయోగము. మానవ జీవితమును దివ్యజీవనముగా పరివర్తింప జేయుటయే మన లక్ష్యము. మానవ ప్రకృతి దివ్య ప్రకృతిగా రూపొందాలి. దైవము మానవునిలో ప్రత్యక్షంగా ప్రతిబింబించాలి. మానవుని నిజ స్వరూపము ఆత్మ. కాని ఈ ఆత్మ వికాసమునకు మనోప్రాణిక దైహికములు ప్రతిబంధకములు. దివ్యజీవనమునకు గుదిబండలు. వీటిని పరిశుద్ధము జేసి పదును బట్టాలి. అప్పుడే దివ్యజీవనమునకు సజీవ సాధనములు కాగలవు. ఈ పరిశుద్ధీకరణ ప్రక్రియ మొదట మనస్సు అనగా అంతఃకరణములో మొదలవుతుంది. అప్పుడు మనస్సు సత్యమును సూటిగా దర్శించి దానిని ప్రాణికము లోనికి కూడా ప్రసరింప జేస్తుంది. ఈ ప్రక్రియ మానవ ప్రయత్నము ద్వారా జరుగునది గాదు. ఆతని శక్తి కతీతము. కేవలం దివ్యశక్తి వలననే అది సాధ్యము.

శక్తి మూల మిదం జగత్ — 'శక్తి' లేనిదే అసలు ప్రపంచమే లేదు. అన్ని పనులు 'శక్తి' వల్లనే జరుగుతాయి. కర్మలకు మనస్సు, ప్రాణం, శరీరం అనేవి పరికరాలు. పూర్ణయోగం కర్మలను విస్మరించదు కనుక అటువంటి ప్రశ్నే లేదు. అయితే ఈ కర్మలు దివ్యచైతన్య సారథ్యంలో జరగాలంటే ఆ పరికరాలు దోషరహితాలై పవిత్రతను సంతరించు కోవాలి. అంతే కాదు; ఉన్నతమైన అటువంటి పనులు చేయగలిగే స్థాయికి అవి ఎదగాలి కూడాను. చివరకి అవి ఆధ్యాత్మిక రూపాంతరీకరణము, అతిమానస రూపాంతరీకరణము జెందాలి.

శరీరము యొక్క కీలకమైన పాత్ర: భౌతికమైన చర్యల కోసం ఈ శరీరం బాహ్యాపరికరంగానే గాక, మనుగడకు అవ

పరమైన అంతర్గత క్రియలు అన్నింటికీ కూడ భూమికగా కూడా ఉంటుంది. *మానసిక లేదా ఆత్మ ప్రక్రియలన్నీ భౌతిక శరీరం మీద కొన్ని ప్రకంపనములను కలుగ జేస్తాయి. అవి అక్కడ ఒక రకమైన శారీరక సంజ్ఞల రూపంలో రికార్డు అవుతాయి.* ఈ భౌతిక శారీరక యంత్రంద్వారా కనీసం కొంతవరకైనా బాహ్య ప్రపంచంలో అభివ్యక్తమవుతాయి. అయితే మానవ శరీరానికి గల ఆ సామర్థ్యానికి ప్రాకృతికమైన కొన్ని పరిమితులు ఉన్నాయి. అంతేకాకుండా శరీరానికి దానికి చెందిన అవచేతన అనేది ఒకటి ఉంటుంది. మనస్సుకి, ప్రాణానికి సంబంధించిన పూర్వపు అల వాట్లకు, స్వభావానికి అది మూఢ విధేయత కలిగి ఉంటుంది. కాబట్టి ఇది సహజంగానే ఉన్నతమైన, విశిష్టమైన మార్పును నిరాకరించి అడ్డుకుంటుంది. మొత్తం ప్రకృతి సమూలంగా మార దాన్ని అయినా కనీసం నిరోధిస్తుంది.

పూర్ణయోగమునకు శారీరక పరివర్తనము అనివార్యము: దైవిక లేదా ఆధ్యాత్మిక, అతిమానసిక క్రియలు సులువుగా నిర్వ హించగలిగి భవిష్య దర్శనం చేయగలిగే స్థితిని మనం సంత రించు కోవాలంటే శారీరక ధర్మం పూర్తిగా పరివర్తన చెంద వలసిందే.

పరిపూర్ణత్వాన్ని కోరుకొనే సాధకులు ఈ శరీరాన్ని ఒక గుదిబండగా భావిస్తూనే వచ్చారు. దాంతో వారు శరీరం పట్ల విముఖత చూపుతూ ఉండటం, ఐహిక జీవితంపట్ల, ఈ శరీరం పట్లా వెగటుభావాన్ని కలిగి ఉండటం, కోరికల్ని అణ చుకుంటూ ఉండడం, వాటికి దూరంగా ఉంటూ ఉండడం — ఇవన్నీ పరిపాటే.

అయితే పూర్ణయోగం విషయంలో ఇది సరియైన పద్ధతి కానే కాదు. *మన కర్మలన్నిటిని నిర్వహించడానికి ఒక పరిక రంగా ఈ శరీరం మనకు లభించింది. దాన్ని సంపూర్ణంగా విని యోగించు కోవాలే గాని అశ్రద్ధ చూపకూడదు.* దాన్ని బాధిం చడం గాని, కృశింప జేయడం గాని, అంతమొందించడం గాని తగదు. అది నిర్దుష్టంగా లేకపోతే, మొరాయిస్తే, మొండితనంగా

ఉంటే, దాని భాగాలైన ప్రాణికం, హృదయం, మనస్సు, ఆలోచన కూడా ఆ రకంగానే ఉంటాయి. కనుక వాటితో పాటు ఈ శరీరం రూపాంతరీకరణం చెంది, ఆధ్యాత్మికంగా సంస్కరింపబడాలి. కొత్త జీవితాన్ని, కొత్త హృదయాన్ని, కొత్త మనస్సుని మనకు మనమే సంతరించుకుని తీరాలి. కనుకనే కొత్త శరీరంగా మార్పు చెందాలనే ఒక ప్రత్యేకమైన ధ్యేయంతో ఉన్నాం.

శరీరం ఊర్ధ్వ శక్తులను జీర్ణించుకొనవలెను: ఈ శరీరము జడము. దాని పరిణామము శ్రమతో కూడిన పని. ప్రప్రథమంగా దాని బాహ్యాంతరంగాలలో మార్పు రావాలి. అంతరంగికంగా జాగృతమై దైవ స్ఫూర్తిని పొందాలి. బాహ్యావర్తనములో కూడ అది పెల్లుబికి రావాలి. దాని సారథ్యము ఊర్ధ్వచేతనయే వహించాలి. అది ఆధ్యాత్మిక శక్తికి ఒదిగి వుండాలి. తన జడత్వముతో మనోప్రాణికాదుల దివ్యపరిణామమునకు అడ్డుతగుల కూడదు సరికదా తనుకూడా వాటి ప్రభావమునకు లోనై తదనుగుణంగా నడచుకోవాలి.

ఇక్కడ కొంచెం వివరణ ఇవ్వవలసి ఉంది. సంగీత రంగానికి వెళదాం — ఓ రాగాన్ని ఆవిష్కరించాలి అంటే దానికి సంబంధించి నిర్దిష్టమైన స్వరాలను, నిర్దిష్టమైన క్రమంలో నిర్దిష్టమైన స్థాయిలో ప్రయోగించాలి. ఈ సూచనలు సంజ్ఞారూపంలో ఉంటాయి. ఇవి తప్పనిసరి అయిన నియమాలు. వీటిని అధిగమించడానికి వీల్లేదు. సంజ్ఞారూపమైన ఈ నియమాలనే సంగీత పరిభాషలో స్వరసంపుటి అంటారు. సంగీత విన్యాసాలన్నింటికి ఈ స్వర సూచికలే ప్రధాన భూమికలు. నియమాలను బట్టే స్పందనలు ఉంటాయి. అయితే ఒకటి. స్వరసంపుటి ఉన్నతమైనదే అయినా దానిని అదే విధంగా ఆచరించ గలిగే సామర్థ్యం పరికరాలకు కూడా ఉండాలి. అట్టి విధేయతే లేకపోతే స్పందన నిర్దుష్టంగా ఉండదు.

దీన్నే శరీరానికి కూడా అన్వయించుకోవచ్చు. మన శరీరం విషయంలో ఆజ్ఞలు ఇచ్చే మనస్సు, ఆత్మా — ఈ రెండూ కావలసిన విధంగా రూపొందాలి. అంతే కాదు. ఇవి ఇచ్చే సంజ్ఞా

రూపమైన ఆజ్ఞలను యథాతథంగా ఆచరించేటట్టు పరికరాలైన అవయవాలను అలవాటు చేయాలి. దీనికి శిక్షణ అవసరం.

దైవప్రసాదితమైన మానవ వీణపై సరిగమల గమనాన్ని నిర్దేశించే శక్తి ఈ శరీరానికి, భౌతిక చైతన్యానికి గల సంజ్ఞా సూచికలకు ప్రస్తుతం అమితంగా ఉండనే ఉంది. ఎటొచ్చీ — భావచైతన్యం నుండి, అంతరాత్మనుండి, ఐహిక జీవితానికి ఆవల ఉండే విశిష్ట విన్యాసాల నుండి మనం పొందే ఈ స్వరాలను గంభీరంగా ఆవిష్కరించ లేకపోతున్నాం. వాటి ఔన్నత్యాన్ని, శక్తిని, సరియైన బాణీని సంతరించుకో లేకపోతున్నాం. ఈ పరిస్థితి మారాలి. ఉన్నత బాణీలను స్వీకరించి, రూపొందించ గలిగే నైపుణ్యాన్ని ఈ శరీరమూ, ఈ భౌతిక మనస్సూ పెంపొందించుకోవాలి. అవేకాదు — ఆ మహాప్రకృతి మన జీవితంలోను, శరీరంలోను ఆవిష్కారము జెందవలసి యున్నది.

శరీరము దివ్యశక్తిని తనలో ధరించవలెను: మనస్సు, దాని ఆలోచనలు, సంకల్పం శరీరాన్నీ, జీవితాన్ని నిర్దేశించడం ఇటువంటి పరివర్తనకు తొలి మెట్టు. అటువంటి నియంత్రణను సంపూర్ణం చేయడమే యోగం. ***అయితే ఆ తరువాత, మనస్సు తన స్థానాన్ని ఆధ్యాత్మికతకు, ఆధ్యాత్మిక శక్తికి, అతిమానసానికి, అతిమానసశక్తికి అప్పజెప్ప వలసి ఉంటుంది.***

మనోప్రాణిక దైహికములు: ఆధ్యాత్మికత ద్వారా లభించే ఎటువంటి శక్తిని అయినా భరించి, దాని చర్య ఏమాత్రం చెదిరిపోకుండా, అసలు వృధా కాకుండా, ఏ రకమైన చీలికలు లేకుండా జాగ్రత్తగా ఉంచుకోగలిగే పరిపూర్ణ శక్తిని శరీరం పెంపొందించుకొని తీరాలి.

ఆధ్యాత్మికం గాని, ఉన్నత మనస్సు గాని, లేదా ప్రాణికం గాని కలిగించే ఎటువంటి తీవ్రతను అయినా శరీరం తట్టుకోగలగాలి. ఆ గమన వేగం వల్లా, ఒత్తిడి వల్లా యాంత్రిక పరికరాలు ఏ భాగం కూడా ఉద్రేకానికి లోనుకాకుండా, దెబ్బ తినకుండా, అస్తవ్యస్తం కాకుండా, బ్రద్దలై పోకుండా, స్వీకరించ

గలగాలి. అంతేకాదు. దాన్ని స్వీకరించి శక్తివంతంగా వినియోగించుకో గలిగే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి.

ఎందుకంటే — సరియైన సాధన లేకుండా యోగాన్ని ఆచరించేవారు, తగని విధంగా గాని, హడావుడిగా గాని శక్తిని ఆహ్వానించే వారు మానసికంగా, ప్రాణికంగా, నైతికంగా దాన్ని భరించలేరు. దాని ధాటికి మస్తిష్కమూ, ప్రాణిక ఆరోగ్యం, నైతిక స్థాయి దెబ్బ తింటూ ఉండడం తరచుగా జరుగుతూనే ఉంటుంది.

కాబట్టి పొందిన శక్తి ఏ విధమైన మార్పు లేకుండా, తగ్గిపోకుండా, దాని ధ్యేయాన్ని ప్రాధాన్యాన్ని తప్పుగా అర్థం చేసుకోకుండా ఆధ్యాత్మిక లేదా తదితర అసాధారణ ప్రభావాల సంకల్పం ప్రకారం అతి సహజంగాను, సులువుగాను, సక్రమంగాను పనిచేసే సామర్థ్యం కలిగి ఉండాలి.

భౌతిక చైతన్యంలోను, బలం లోను, వ్యవస్థ లోను ఇటువంటి ధారణ శక్తిని కలిగి ఉండే ప్రత్యేక సామర్థ్యమే అతి ప్రధానమైన సిద్ధి, శారీరక పరిపక్వత.

ఇటువంటి పరివర్తనల ఫలితంగా ఆత్మకు పరిపూర్ణమైన పరికరంగా శరీరం తయారౌతుంది. అప్పుడు ఆధ్యాత్మిక శక్తి తను ఏది సంకల్పిస్తే దానిని అదే విధంగా శరీరంలోను, శరీరం ద్వారాను చేయగలుగుతుంది. అపరిమితమైన మానసిక క్రియలను, మరింత ఉన్నతస్థాయి అతిమానసిక ప్రక్రియలను నిర్వహించ గలుగుతుంది. ఇటువంటి కార్యక్రమములో అలసట వల్లగాని, అసమర్థత వల్లగాని అయిష్టం వల్లగాని, వికలము వల్లగాని శరీరం ఏమాత్రం మభ్యపెట్టకుండా ఆ శక్తి నిర్వహిస్తుంది.

జీవశక్తి పూర్తి వెల్లువను అది శరీరంలో నింప గలుగుతుంది కూడా. సాధారణ జీవలక్షణమైన సంఘర్షణ, అసమానత అనేదే లేకుండాను, అసమర్థ భౌతిక పరికరానికి జీవిత ప్రేరణలు ఉపయోగించే అవసరం లేకుండాను పరిపూర్ణమైన ఈ ప్రాణమయ శరీరంతో మహత్తర కార్యాన్ని చేస్తుంది. ఆనందాన్ని అందిస్తుంది. అంతే కాదు — శరీరము యొక్క పాశవిక లక్షణాల వల్ల ఏ విధంగానూ నాశనం చెందని, పతనం చెందని విధంగా

ఆధ్యాత్మికమైన అంతరాత్మ యొక్క సంపూర్ణ చర్యలను నిర్వహించగలుగుతుంది. ఉన్నత తపోజీవన నిర్దేశ సూత్రాలకు అనుగుణంగా శారీరక కృత్యములను, భావవ్యక్తీకరణను నిర్వహించగలుగుతుంది.

ఇలా చెపుతూ ఉంటే చాలానే వస్తాయి. శరీరంలో గొప్ప ఉత్సాహం పుడుతుంది. బలం, సత్తువ నిండుగా ఉంటాయి. ప్రకాశం ఉంటుంది. ఉపాయం ఉంటుంది. శరీరాన్ని, నరాలను సమస్థితిలో ఉంచగలుగుతుంది. మొత్తం శారీరక వ్యవస్థలో భరించే శక్తితో పాటు స్పందించే శక్తి కూడా ఉంటుంది.

శరీరానికి చైతన్యం కలిగించే మహత్వ, బల, లఘుతా, ధారణ, సామర్థ్య — అనే మూలతత్వాలు ప్రస్తుతం ఈ శరీరానికి మించిన విషయములు పరివర్తన ఫలితంగా అవి అత్యంత స్పందన శక్తిని పుంజుకుని సమర్థవంతంగా తయారౌతాయి.

అయితే ఈ శక్తిపాతం బయటకు కనిపించేది కాదు. భుజబలమూ, కండ పుష్టి కాదు. అది ప్రారంభంలో అపరిమితమైన జీవశక్తి లేదా ప్రాణశక్తిగా ఉండే లక్షణం కలిగి ఉంటుంది. ఆ తరువాత ఈ ప్రాణశక్తిని పోషించుకుంటూ, వినియోగించుకుంటూ ఉన్నతమైన ఉదాత్తమైన ఆత్మశక్తి శరీరంలో పనిచేస్తూ ఉంటుంది.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు.

శరీర విన్యాసము — నూతన చేతనావిష్కరణ

ఈ శరీరము ధర్మమాచరించుటకు సాధనమన్న మాట నిజమే. కాని దానికి అంతకు మించిన ప్రయోజన మొకటున్నదని మనకి తెలియదు. ఈ సందర్భంలో మనమొక సంగతి గుర్తించాలి. శరీరము పరాయి వస్తువు కాదు. మనిషిలోని భాగమే. మరి దాని గతి ఏమిటి? అది కూడా చేతనకు ఒక వాహనమే కదా? అందుకని మనం దాన్ని పూజ్యభావంతో చూడాలి — నిర్లక్ష్య

పరచరాదు. దాన్ని సర్వాంగ సౌష్ఠవంగా తీర్చిదిద్దాలి. దాని ఆరోగ్యాన్ని కాపాడాలి. కాని అంతటితో సరి కాదు. ఈ సృష్టి యొక్క తొలి దశ అచేతన. కాని ఇది చేతన యొక్క యవనికయే. మన శరీరము కూడా అంతే. అచేతనలో నిక్షిప్తమైన చైతన్యమే ఈ అద్భుత శరీరాన్ని తయారు చేసింది. అటులనే ఈ శరీరం కూడ తన చేతనా కౌశల్యంతో పరిణామము చెంది పరమోన్నత స్థాయి నందుకోగలదు. ఇది కేవలం అంగసౌష్టవం కాదు. శరీరావయవాలు మార్పు చెంది నూతన రూపాన్ని దాల్చి నూతన ప్రక్రియలను చేయగలవు. ఇది ఏ విధంగా సాధ్యమో చూద్దామా మరి! — సంపాదకుడు

యోగములో క్రీడల ప్రాముఖ్యత

"ఆధ్యాత్మిక తత్వాన్వేషకుల కోసం ఏర్పడిన ఈ ఆశ్రమంలో క్రీడల ఆవశ్యకత ఏమిటి? ఆధ్యాత్మికతకూ, క్రీడలకూ పొంతన ఏమిటి?" అని చాలామంది అడుగుతూంటారు. దీనికి ఒక సమాధానం నేనదివరలో ఒక చోట చెప్పాను. — సాధారణ జీవితం గడిపే మానవుల కార్యకలాపాలకూ, ఈ ఆధ్యాత్మిక సంస్థకూ ఉండే సంబంధాన్ని గురించి నేనక్కడ వివరించాను, అదే దీనికీ వర్తిస్తుంది. దైహిక శిక్షణ ఒక జాతి జీవిత విధానానికీ, అంతర్జాతీయ జీవనానికీ చాలా ప్రయోజనకారిగా ఉంటుంది. అయితే మనం పైకి కనిపించే ఈ ప్రథమ ప్రయోజనాలను అధిగమించి, శారీరక సౌష్టవంతో సహా వ్యక్తి జీవితం కూడా సంపూర్ణసిద్ధి పొందగలదనే ఆకాంక్ష వైపు దృష్టిని సారించి చూస్తే అసలు సమాధానం బోధపడుతుంది.

శారీరక శిక్షణ

ఆశ్రమ జీవితంలోకి క్రీడలు మొదలుగా గల శిక్షణా కార్యక్రమాలు ప్రవేశపెట్టడం చూస్తే ఆ పద్ధతులు, వాటివల్ల కలిగే ప్రయోజనాలు వ్యక్తిలోని నిమ్నతర భూమికల పురోగతి కోసమేనని అర్థం చేసుకోవచ్చు. శరీరానికి, మనస్సులోని కొన్ని భాగాల అభివృద్ధికీ శిక్షణ అవసరమని నేనదివరకు రాసిన దాంట్లో వివరించాను. ఇది ఏ

విధంగా, ఏ దిశలో సాధించవచ్చో కూడా అందులో సూచించాను. అయితే ఈ అవధుల్లో సాధించే ప్రయోజనము సాపేక్షితం మాత్రమే. ఇంతకంటే విశిష్టంగా ఉండాలంటే మాత్రం ఉన్నతశక్తులుగానీ, దైవికశక్తి గానీ తోడ్పడితేనే సాధ్యపడుతుంది. అయినప్పటికీ మానవ పరిధిలో సాధించగలిగినది చాలా ఉంది. దాని విలువ కూడా సామాన్యం కాదు. ఒక్కొక్కసారి చాలా అధికంగానే ఉండవచ్చు. మానవ మేధాశక్తితో సంకల్పశక్తితో సాధించిన అద్భుతాలు దాని అభివృద్ధికి నిదర్శనాలుగా ఉన్నాయి. అవి మనలను దైవానికి సగం దూరందాకా తీసుకొని వెళ్ళగలవు.

మానవునిలో అతిచేతనా వికాసమే పరిణామ ప్రక్రియ లక్ష్యము

మానవ శరీరము అచేతన వల్లనే ఏర్పడిందని లోగడ చెప్పుకున్నాము. స్వతహాగా అది కూడా అచేతనమే. దాని లోని కొన్ని భాగాలు, నిగూఢంగా జరిగే చర్యలు మాత్రం అవచేతనకు చెందినవి. అవచేతనము అని మనం అంటున్నది సాక్షాత్తుగా భగవంతునికి నిలయం. అద్భుతంగా విశ్వరచన చేసిన రహస్యచైతన్యానికీ లేదా ఆ పరచైతన్యానికీ ఇది ఉపకరణము. ఆ అచేతనము తనకు ఒక కార్యక్షేత్రంగా పదార్థాన్ని సృష్టించుకుంది. ఈ జడ పదార్థము, ఈ అచేతనము పనిచేసిన తీరు మహాద్భుతము. తమ లక్ష్యసాధనకై అవి పరికరాలను ఉపయోగించిన తీరు, అవి సృష్టించిన అద్భుతాలు, కల్పించిన సౌందర్యపు రాసులు పరమాశ్చర్యాన్ని కలుగ చేస్తాయి. భగవంతుడు లేడని అజ్ఞానంతో వాదించే వారికి ఇదే సమాధానం. భౌతిక ప్రపంచంలో ప్రతి మూలా ప్రతి చర్యలో, పరాచైతన్యపు అంశమూ, చైతన్యశక్తీ నిక్షిప్తమై ఉన్నాయి అనేందుకు ఇదే తార్కాణం. అదే మన దేహంలో కూడా ఉంది. ఆ చైతన్యాన్నీ, శక్తినీ మనలో వికసింప జేసుకోటమే సృష్టిలో పరిణామ లక్ష్యము, మన జీవిత రహస్యము.

శరీర చైతన్యమును జాగృతము చేయుట

ఈ శారీరక పరిపాకము రెండు నియమాల ననుసరించి సాగాలి. మొదటిది సాధ్యమైనంత సంపూర్ణంగా

3

దైహిక చైతన్యాన్ని జాగృతం చేయడం, రెండవది ఎన్నో విధా లుగా, ఎంత సంపూర్ణంగా వృద్ధి చేయగలరో అంతగా దాని సామర్థ్యాలను పెంచి వెల్లివిరిసేటట్లు చేయడం. అచేతనచే సృష్టించబడిన శరీరం ఆ కారణం వల్లనే అన్ని విధాలుగా దానికే పరిమితమై ఉండవలసి వస్తున్నది. అయితే ఆ అచేతనలో నిక్షి ప్తమై వున్న చైతన్యంతోనే విజ్ఞానం, శక్తి, దివ్యానందము ప్రవర్ధ మాన మవుతున్నయి. ఈ విధంగా మానవ పరిణామ గతిలో ఒక స్థితికి చేరిన ఈ అంశాలను ఎంత వరకూ సాధ్యమో అంత వరకూ ఉపయోగించుకుంటూ వ్యక్తి లోని శక్తినీ ప్రత్యేక స్వభా వాన్నీ బట్టి ఎంత ఉన్నత శిఖరాలకు చేరగలడో అంతవరకూ చేర్చాలి. *దృశ్యమాన ప్రపంచంలోని ప్రతివస్తువులోను ఒక శక్తి పనిచేస్తూ ఉంటుంది. నిమ్న సృష్టిలో చైతన్యరహితంగా గానీ లేక మాంద్యతవల్ల మందకొడిగా గానీ పనిచేస్తుంది. కానీ మానవులలో మాత్రం మొదటినుంచీ చైతన్యవంతమై ఉంటుంది.* దాని సామర్థ్యాలు కొంతవరకూ జాగృతంగానూ కొన్ని అర్థ జాగృతం గానూ, అంతర్గర్భితంగానూ ఉంటాయి. నిద్రిస్తున్న వాటిని మేల్కొలిపి, జాగృతంగా ఉన్న వాటిని పూర్తి చైతన్య వంతం చేసి కార్యోన్ముఖంగా తయారుచేయాలి. అంతర్గర్భితంగా ఉన్న వాటిని బహిర్గతం చేసి శిక్షణ నివ్వాలి.

> **మనస్సు యొక్క స్థాయి పెరిగి అతిమానసముగా పరిణమిస్తుంది**

సృష్టి పరిణామం మానవ పరి పూర్ణతతోముగుస్తుందా? బాహ్యా నికి జడమయంగా కనిపించే ఈ జగత్తులో చైతన్య ఛాయలు కని పించడమూ, దానితో బాటుగా వ్యక్తిలో తేజస్సు, శక్తి అభివృద్ధి చెందడమూ సృష్టి పురోగమిస్తున్నదనడానికి నిదర్శనం; దాని ముఖ్యోద్దేశం కూడా అదే. అయితే శారీరక వికాసం కలిగి, సామ ర్థ్యాలు పెరిగి, మన గలిగే యోగ్యతను పొందడం అనివర్యమే అయినప్పటికి పరిణామ ప్రక్రియ యొక్క ముఖ్యోద్దేశమది కాదు. చైతన్యం ఇంకా ఇంకా జాగృతం కావడం, ఉన్నత స్థాయిల నందుకోవడం, దాని క్రియాక్షేత్రమును విస్తరించడం పరిపూర్ణ

ారు మార్గము. సమగ్ర దైహిక పరిపూర్ణత కావాలన్నా ఈ నియమానుసారమే జరగాలి. మనకి ఇప్పుడు తెలిసిన మానసిక స్థాయిలకు మించిన ఉన్నత స్థాయిలు అనేకం ఉన్నాయి. ఆ మనోభూమికలను మనం ఏదో ఒకనాడు చేరుకొని అక్కడ నుంచి ఇంకా పైకి పోయి మహోన్నతమైన చిదాత్మ అస్థిత్వాన్ని పొందాలి. ఆ విధంగా ఉద్గమిస్తున్న సమయంలో మనలోని అధోభాగాలు కూడా వాటి ప్రభావాన్ని అందుకునేటట్లు తయారు చేసి ఆ పరమ చైతన్యపు కాంతినీ, శక్తినీ అందులో నింపుకోవాలి; శరీరమంతా సంపూర్ణంగా చైతన్యంతో నిండిపోయేటట్లు చేసు కోవాలి; అది చైతన్యమే రూపుదాల్చినట్లుగా దానికి ఉపకర ణంగా తయారు కావాలి; అదే భగవంతుని చైతన్యాత్మక చిహ్నము, భగవంతుని ముద్ర, భగవద్ శక్తి కావాలి.

శరీర ప్రక్రియలు

ఆ విధంగా పరిపూర్ణత త్వరగా ఉద్ధతి పొందే సమయంలో శరీరం యొక్క క్రియాత్మక శక్తి, పరిధి ఇంకా భగవత్కార్యాన్ని అర్థం చేసుకొని సేవించగల సామర్థ్యం కూడా అధికం కావాలి. దానితో బాటుగా శరీరాన్ని భగవంతుని అధీనంలో ఉంచటం కూడా ఎక్కువ కావాలి. అభివృద్ధి చెందిన భాగాలలోనూ, శక్తిని పుంజు కొన్న భాగాల పనితీరులోనూ, ఇంకా పూర్తి ఇంద్రియాత్మకమైన యాంత్రిక అచేతన చర్యలుగా కనిపించే స్వయంచాలక ప్రతి స్పందనలతో సహా అంతటా నమ్యత్వమే కనిపించాలి. నిజమైన పరివర్తన ఉంటేనే తప్ప ఇది జరగదు. నిజానికి ఈ విధమైన మనః ప్రాణ శారీరక పరివర్తన కోసమే ప్రకృతి పరిణామం రహస్యంగా ముందుకు సాగుతోంది. ఈ పరివర్తన జరగనియెడల పృథ్వీజీవితంలో సంపూర్ణమైన దైవత్వం సిద్ధించదు. దైహిక పరి వర్తన జరగటానికి దేహమే కర్తృత్వమును వహించవచ్చును. పరివర్తన చెందేదీ, పరివర్తింపచేసేదీ కూడా దేహమే.

పరివర్తన పూర్తి కాకుండా కొంతవరకూ దైవత్వం ఆవి ర్భూతం కావచ్చు; భౌతిక చర్యలు జరపడానికీ ఆ నిష్క్రియాత్మక, అపరిపూర్ణ చైతన్యస్వరూపమైన దేహాన్నే ఒక ఆఖరు సాధనం,

లేక ప్రధాన సాధనంగా వాడుకొని దైవత్వం వ్యక్తమవుతుంది. సంపూర్ణ చైతన్యపూరితమైన దేహం భౌతిక పరివర్తన కోసం సరైన విధానాలను, పద్ధతులను తెలుసుకొని కృషి చేయగలదు. అయితే చైతన్యపు పరాకాష్టలో భగవంతుని దివ్యకాంతి, శక్తి సృజనాత్మకానందం అనుభవమై శరీరానికి ప్రోద్బలమిస్తాయి. అయినప్పటికీ శరీరం కూడా తన వంతు కృషితో ఆత్మావిష్కారాన్ని, సిద్ధిని పొందగలదు. ఆ విధంగా తన స్వంత పరివర్తనలో పాలుపంచుకోవటమే కాక మొత్తం వ్యక్తి సమగ్ర పరివర్తనకి కర్తృత్వం వహించగలదు. ఇది కూడా సమగ్ర దైహిక పరిపూర్ణతలో భాగమే; పరిపూర్ణత పొందినదనడానికిదే నిదర్శనము.

స్వేచ్ఛానువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకట్రామ శాస్త్రి

భౌతిక జీవి యొక్క ఆధ్యాత్మీకరణము, కృతార్థత

సాధారణంగా మానవ జీవితము దుర్భరము తృప్తిరహితము. మానవుడు ఆత్మ యొక్క అభివ్యక్తే అయినప్పటికి ఆత్మవైభవమును అనుభవించే శక్తి అతనికి ప్రస్తుతం లేదు. శరీర మాధ్యమంలో అది కుంచించబడుతుంది. ఆ లోటును తీర్చుటకు అతిమానసిక శక్తియే సమర్థవంతము. కేవలం మనసులోనే కాకుండా భౌతికంలోకి కూడా అది ప్రవేశించి పనిచేసినప్పుడు శరీరం కూడా ఆత్మానందంతో ఓలలాడుతుంది.

— సంపాదకుడు

ఆత్మ — జీవితముల సంబంధములో నూతనాధ్యాయము

సాధన పరిపక్వమైన దశలో విజ్ఞాన చైతన్యము పైనుంచి దిగివస్తుంది. అప్పుడు చేతనలో ఒక మహత్తరమైన పరివర్తనము (a reversal of consciousness) సంభవిస్తుంది. దైవమునకు మనస్సు — జీవితము — పదార్థములకు మధ్య వినూత్న సంబంధము — అతి ప్రమాణము

విశిష్టము అయిన సంబంధము ఏర్పడుతుంది. తత్ఫలితముగా ఆత్మకు — ఆత్మ నివసించే శరీరానికి గల సంబంధము కూడా సుసంపన్నమై reversal — నూతన స్థాయినందుకొంటుంది. ప్రస్తుత జీవన విధానంలో — అత్యంత ఉత్తమంగా, లేదా అత్యంత అధమంగా — మనస్సు ప్రాణశక్తి ద్వారా ఆత్మ తనలో తాను అభివ్యక్తం చేసుకుంటుంది. లేదా తరచుగా తన ఆధారంగా మనస్సు, ప్రాణశక్తి పనిచేయడానికి అనుమతిస్తుంది. ఈ చర్యకు శరీరం ఉపకరణంగా ఉంటుంది. కాని శరీరం ఆత్మను శిరసా వహిస్తూనే, పరిమితమైన సంభావ్య తల ద్వారా మనస్సు, ప్రాణం యొక్క స్వీయ వ్యక్తీకరణలో పరిమితం చేసి, నిర్ధారిస్తుంది. శరీరం తన భౌతిక ఉపకరణ క్రియ ద్వారా పొందిన లక్షణం కూడా దానికి కారణభూతమవుతుంది. ఇది కాకుండా శరీరానికి తన సొంత కార్యాచరణ నియమం, ఒక కదలిక, ఒక సంకల్పం లేదా తనదైన అవచేతన శక్తి లేదా సగం మేరకు ఆవిష్కృతమైన చైతన్యశక్తి కదలికకు సంబంధించిన నియమం ఉన్నది. ఈ నియమాన్ని అవి పాక్షికంగా ప్రభావితం చేస్తాయి లేదా మార్పు చేస్తాయి.

శరీరములో ఆత్మ సామ్రాజ్యము

కాని దివ్యజ్ఞాన (gnostic) చైతన్యస్థితిలో, జీవన విధానంలో ఆత్మ సంకల్పమే నేరుగా శరీరకదలికలను, నియమాన్ని నియంత్రించి నిర్ధారిస్తుంది. అగమ్యత, అస్పష్టత, ప్రాతికూల్యం, మంద ప్రతిస్పందనలతో నిండిన అచేతనా పునాది అతిమానస అవతరణ ప్రభావంతో నిమ్న లేక ఆధారభూతమైన అతీత చేతనగా మారుతుంది. జ్ఞానోపలబ్ధి పొందిన ఉన్నత మనస్సు, అంతఃస్ఫూర్తి, అధిమనస్సు స్థితిలో సైతం అప్పటికే "విజ్ఞానం*" — భావనకు (idea) "ఇచ్ఛాశక్తి" కి శరీరం ప్రతిస్పందించేందుకు చాలినంతగా స్పృహను పొందుతుంది. భౌతిక భాగాలపై మనస్సు

---

* అంతఃస్ఫూర్తి (intution) మనస్సులో పనిచేసే .విజ్ఞానం దీనినల శ్రీఅరవిందులు అని అంటారు.

యొక్క చర్య అవశేషాత్మకంగా, కల్లోల స్థితిలో చాలా వరకు అసంకల్పంగా వుంటుంది. అటువంటి మనస్సు యొక్క చర్య గణనీయమైన శక్తిని పొందుతుంది. కాని అతిమానస యథార్థ భావన (real-idea) లో ఉన్న చైతన్యం అది. అదే సమస్తాన్ని నియంత్రిస్తుంది.

శరీరము యొక్క ఆత్మీకరణము కృతార్థత

ఆత్మ, శరీరం మధ్య నెలకొన్న ఈ కొత్త సంబంధం ఫలితంగా, దివ్య జ్ఞాన పరిణామం వల్ల భౌతిక జీవితంలో ఆధ్యాత్మీకరణ, పరిపూర్ణత్వం, సాఫల్యత ఆవిష్కరించ బడుతాయి. మనస్సు జీవితానికి అది ఏ లక్ష్యాన్ని సాధించిందో, భౌతిక శరీరానికి కూడా అదే లక్ష్యాన్ని సాధిస్తుంది. ఈ పరివర్తనవల్ల, అస్పష్టత, బలహీనతలు, పరిమితులు అధిగమించవచ్చు. వాటి సంగతి ఏమైనప్పటికీ, శరీరచేతన సహనంతో కూడిన సేవకి అవుతుంది. దాని సంభావ్యతల దృష్ట్యా, వ్యక్తి జీవితం శక్తిప్రదమైన ఉపకరణం అవుతుంది. తన కోసం అది చాలా కొంచెమే అడుగుతుంది. శరీరం కోరేది మరి కాస్త ఆయుష్షు, ఆరోగ్యం, బలం, భౌతిక పరిపూర్ణత్వం, శారీరక ఆనందం, దుఃఖాల నుండి విముక్తి, సౌఖ్యం. ఈ కోరికలు నీచమైనవి కావు. అక్రమమైనవి కావు. ఆమోదయోగ్యం కానివి కావు. ఎందుకంటే, రూపురేఖలు సహజసిద్ధంగా ప్రసరించే శక్తి, ఆనందాలు, ఆత్మ యొక్క అభివ్యక్తీకరణలను ఆ కోరికలు పదార్థ క్షేత్రంలో సుసాధ్యం చేస్తాయి. దివ్య జ్ఞానశక్తి శరీరంలో పనిచేసినపుడు, ఇవి శరీరంలో నెలకొల్పబడతాయి. భౌతిక మనస్సు, భౌతిక జీవితం నాడీమండల శ్రేణిపై శరీర వ్యవస్థపై బాహ్యశక్తుల వత్తిడి వల్ల వాటి వ్యతిరేక లక్షణాలు వస్తాయి. ఈ శక్తులను ఎలా ఎదుర్కోవాలో తెలియని, లేదా వాటిని సక్రమంగా ఎదుర్కోలేని శక్తితో ఎదుర్కోలేని అజ్ఞానం నుండి అవి ప్రభవిస్తాయి. ప్రతిస్పందనలను అపభ్రంశం పాలుచేసి, తప్పు పద్ధతిలో ప్రతి క్రియకు పూనుకొనే అస్పష్టత వల్ల అవి ఉద్భవిస్తాయి.

శరీర మాధ్యమం ద్వారా అతిమానసిక ప్రక్రియలు

ఈ అజ్ఞానం స్థానే నెలకొనే అతి మానస స్వీయకార్యాచరణ, స్వీయ ఆవిష్కరణ చెందే ఎరుక, జ్ఞానం శరీరంలోని దెబ్బతిన్న అస్పష్టతకు లోనైన అంతఃస్ఫూర్తి సహజాతాలను విముక్తం చేసి, సుస్థిరం చేస్తాయి. మరింత చైతన్యవంతమైన కార్యాచరణతో వాటిని వికాసవంతం చేస్తాయి. ఈ మార్పు వల్ల చక్కని భౌతిక దృక్పథం, వస్తువులు, శక్తుల విషయంలో సక్రమ సంబంధం, సక్రమ ప్రతిక్రియ ఏర్పడుతాయి. మనస్సు, నరాలు, శరీర వ్యవస్థలో చక్కని లయబద్ధత ఏర్పడుతుంది. అది శరీరంలోకి ఉన్నతమైన ఆధ్యాత్మిక శక్తి తీసుకొని వస్తుంది. విశ్వజనీన ప్రాణికశక్తితో ఏకీకృతమైన మరింత మహనీయ ప్రాణశక్తిని తీసుకొని వస్తుంది. భౌతిక ప్రకృతికి సంబంధాలు దేదీప్యమానమైన సామరస్యం, శాశ్వత విశ్రాంతిలోని ప్రశాంత అనంత స్పర్శ అది సాధిస్తుంది. తన దివ్యతరమైన బలాన్ని, సౌఖ్యాన్ని దానికి ఇస్తుంది. ఇది చాలా అవసరమైన, మౌలికమైన పరివర్తన. ఇది ఎలా ఉన్నప్పటికీ చైతన్యశక్తి యొక్క మహోన్నత బలాన్ని మొత్తం చైతన్యం నిండా నింపి వేస్తుంది. శరీరాన్ని ఆవరించే అస్తిత్వంలోని సమస్త శక్తులను ఈ చైతన్యశక్తి జీర్ణించుకొని సమన్వయం చేస్తుంది.

మనస్సు, ప్రాణికం, భౌతికస్థితిలో అభివ్యక్తమైన చైతన్యశక్తి, అపరిపూర్ణత్వం, బలహీనత, తనపై ప్రసరించిన విశ్వజనీన శక్తిని స్వీకరించడంలో అశక్తత, లేదా సంకల్పం ద్వారా తిరస్కరించడం, స్వీకరించినా, జీర్ణించుకోడానికి, సమన్వయం చేసుకోడానికి వ్యక్తమయ్యే అశక్తత — అదే బాధలకు, దుఃఖాలకు హేతువు.

అనువాదం: కె. యజ్ఞన్న

సత్యచైతన్యము – దివ్యశరీరము

యోగులు పరమసిద్ధులను పొందవచ్చు. ఊర్ధ్వలోకములను సందర్శించవచ్చు. కాని కళ్లు తెరవగానే ఈ శరీరం, ఈ అచేతనావస్తువు దాపరిస్తుంది! దీనిని సంస్కరించటమెలా? ఈ సృష్టి వెనక సత్యచైతన్యమున్నది. అది సర్వసమర్థవంతమైనది. దానిని ఆహ్వానించి క్రియాశీలము గావించినచో మన సమస్యలన్నీ తీరిపోవును. శరీరము చేయవలసిన పని అదే. ప్రస్తుతం శరీరమును నిర్వహించునది భౌతిక చైతన్యము. ఇది రాయిలాంటిది. కాని భౌతికమైన చైతన్యమును సత్యభానునితో ఉద్దీపింప చేసినప్పుడు, ఈ జడ శరీరము కూడ దాని ప్రభావమునకు లోనై జ్ఞానవంతమవుతుంది. దానికి కూడ చేతన అబ్బుతుంది. దానిదిక కేవలం భౌతిక సౌందర్యమే కాదు. శరీరం దివ్య సర్వాంగ సౌష్ఠవముతో భాసిస్తుంది. శరీరకణములు సైతము ఆనందముతో పొంగి పొరలుతూ ఉంటాయి!

— అనువాదకుడు

మనిషి సమస్యలన్నిటికి సత్యచైతన్యమే పరిష్కారము

మనస్సు పనిచేసే విధానము వేరు. సత్యచేతన కార్యము వేరు. మనస్సు యొక్క కార్యము చర్మ చక్షువులపై ఆధారపడి ఉంటుంది. సత్యదృష్టి సత్యానుసారముగా ప్రవర్తిస్తుంది. ఈ సృష్టి అచేతనా జన్యము. అచేతన అనగా చైతన్యము లేనిది. ఈ అవచేతనలో కూడ గురితప్పకుండా పనిచేసే శక్తి ఉండటం ఆశ్చర్యకరమైన విషయము. పరిణామ ప్రక్రియ ద్వారా ఈ చరాచర సృష్టినంతా ఏమాత్రము తడబడకుండా ఆవిష్కరింప జేసింది ఈ అచేతనయే! కాని ఇప్పుడు జరగబోయే ఈ సత్యచేతనా ఘట్టంలో అమోఘము, అద్భుతము (perfect perfection) అయిన రీతిలో మూల సత్త్వము ఆవిష్కృతమౌతుంది. అంతేకాదు. పరమాత్మయే ప్రత్యక్షంగా ఈ భూమ్మీదికి ఇంకా ప్రత్యక్షంగా (supreme total perfection) దిగివచ్చునా అనే ప్రశ్నకు “అవును”, అని చెప్పే అవ



"పరమాత్మ శిఖరాలు, ప్రకృతి పునాది — వాటి
భిన్నత్వంలో నిగూఢంగా మెరిసే మహా సత్యాన్ని సమీపించి,
ఇరువురూ ఒకే దైవత్వమని గ్రహిస్తాయి.
భౌతిక పదార్థ నేత్రాల ద్వారా పరమాత్మ వీక్షిస్తుంది.
భౌతిక పదార్థం పరమాత్మ వదనాన్ని ఆవిష్కరిస్తుంది....

*

ఈ శరీరం సైతం భగవంతుణ్ణి స్మరిస్తుంది."

శ్రీఅరవిందులు

కాశం కూడా లేకపోలేదు. మనమా శక్తిని ఇక్కడకు దింపుకో గలిగితే ఇక మన సమస్యలన్నీ తీరిపోయినట్లే. మానవాళి మూడు పువ్వులు, ఆరు కాయలుగా పరిణమిస్తుంది. వ్యక్తి వికాసము, జాతి వికాసము, సమాజ కళ్యాణము అన్నీ సాధ్యమే. మానవుని అంతరంగికంపై, ప్రకృతి శక్తులపై, వాటి నిర్వహణము, ఉప యోగములపై ఆధిపత్యము — ఒకటేమిటి — సమస్తమైన కార్య ములపై సంపూర్ణ విజయము కూడ సాధ్యమవుతుంది.

శరీరంలో దివ్యసౌందర్యానందముల ఆవిష్కరణ

మానవుడు ఈ విధంగా అనూహ్యమైన పరిపుష్టత నందుకొన్న తరువాత, మానవ జీవితము అవధులు దాటి దివ్యజీవనముగా కూడ పరిణమించగలదు. జడపదార్థము నిజంగా అంత జడము కాదేమో అనిపిస్తుంది. ఎందుకంటే తనలో నుంచే జీవులను, ఆలోచనాశీలమైన మనస్సును తయారు చేసుకొన్నది కదా. *అదే విధంగా పరమాత్మ యొక్క దివ్యజ్యోతిని తనలోకి దింపుకొని తన అచేతనత్వ మును పోగొట్టుకుంటుంది. తన లౌకిక శరీరాన్ని పూర్తిగా చైత న్యవంతము జేసి ప్రత్యక్షంగా ఆత్మను ఆవిష్కరింప జేసుకొం టుంది.* ఈ శరీరము సుభిక్షమై సుస్థిరమై ఆయురారోగ్యములతో అలరారుతుంది. మానవుని శక్తి పెరుగుతుంది. కర్మకౌశలము ఉన్నతోన్నతమౌతుంది. భౌతిక చేతన యొక్క స్థాయి పెరుగు తుంది. దాని పర్యవసానములు ఎల్లెడల కనబడతాయి. సర్వత్రా ప్రతిఫలిస్తాయి. శరీరము యొక్క శక్తిసామర్థ్యములు ఎదగ గలి గినంత స్థాయి వరకు ఎదిగి వాటి ఎల్లలను స్పృశిస్తాయి. కార్య రంగంలోకి దుముకుటకు సంసిద్ధంగా వుంటాయి. వాటికి చేత కానిదేమియు వుండదు. పరాజయముండదు. శరీరము ఇప్పుడు తనకున్నదాని కన్నా అధికతమమైన శక్తిని పుంజుకుంటుంది. లోని ఆత్మయొక్క శాసనమును శిరసావహించుటకు తగిన ఉప కరణమై భాసిల్లుతుంది. అంతేకాదు. దివ్యసౌందర్యానందములను ప్రపంచంలో వెదజల్లుటకు తగిన ప్రాత్రయై ప్రకాశిస్తుంది. ఆత్మ సౌందర్యానందములను తనలో ప్రతిబింబించుకొని తద్వారా జడ

పదార్థమునకు కూడా దివ్యచైతన్యము, నిరంతరానందములను కలుగ జేస్తుంది. ఈ విధంగా దివ్యీకరింపబడిన శరీరము పరి పూర్ణత నొందుతుంది.

ఇదంతయు ఒకేసారి సాధ్యము కాకపోవచ్చును. ఒకవేళ దివ్యజ్యోతిశ్శక్త్యానందములు మానవోపరిభాగంలో సుప్రతిష్ఠితమై, వాటి శక్తిని మనోప్రాణ దేహములలోకి పంపించి, శరీరకణము లను పునర్నిర్మాణము కావించి, జాగృతము చేయుట ద్వారా అది సాధ్యమైనా కావచ్చును. అప్పుడు మార్గము ఆవిష్కారమై మనిషిలో జరగవలసిన పరిణామమంతయు సాధ్యమవుతుంది. భౌతిక శరీరము కూడా ఈ దివ్యపరిణామమునకు అర్హురాలే.

ప్రకృతి పరివర్తనము

ఈ దివ్యపరిణామము అనవరతంగా కొన సాగుతూనే వుంటుంది. ప్రకృతి పురోగమ నమునకు అవధులు లేవు. ఆత్మ ఇంకా ఎత్తైన శిఖరములను విశాలసీమలను అందుకున్నప్పుడు పరమ సత్యము, పరమతత్త్వము, పరమచైతన్యము, పరమానందము లను కూడా సంతరించుకుంటుంది. కాని ఈ సుదూరమైన పరి ణామములను గురించి ప్రస్తావించుట ఇప్పుడు అప్రస్తుతం. భవి ష్యత్తులో జరుగనున్న పరివర్తనములను గురించి మానవమేధకు అర్థమయ్యేంతవరకు, ఉద్దీపమైన మానవచేతనకు అందినంత మేరకు ప్రస్తావించటమైనది.

సత్యచైతన్యము జడపదార్థములోకి దిగివచ్చి, దానిని ఉద్దీపింప జేయగా ఈ అద్భుతమైన ప్రయోజనములన్నియు కలు గుతాయి. పరిణామప్రక్రియ యుగయుగాలుగా పడిన శ్రమకు ఇది తగిన ఫలితమే అని చెప్పాలి. *పదార్థములో నిక్షిప్తమైన దైవము ఆకాంక్షించి ఊర్ధ్వలోకములను అందుకొంటుంది. ప్రకృతి ఆధ్యాత్మీకరింపబడి అద్భుతమైన విజయములను సాధిస్తుంది.* ఈ పరివర్తనము సర్వాంగమైనది. జడపదార్థము యొక్క స్థితి గతులను సహితము రూపాంతరీకరించునది. భౌతిక చైతన్యము మానవ దేహమును అత్యంత వైభవోపేతమైన ఈ దివ్యశరీర ముగా పరిణమింప జేస్తుంది.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

దివ్యశరీరము

ఈ సృష్టికి చరమదశ మానవుడు కాడు. పరిణామ ప్రక్రియ మానవునితో అంతము కాదు. ఈ సృష్టి అనంతము. పరిణామ సోపానము కూడ అంతే. మరి ఈ నూతన మానవుడు ఎట్లా వుంటాడు. ఆతని రూపురేఖలేమిటి? 1956 లో జరిగిన అతిమానసావతరణముతో ఈ అతిమానవునికి అంకురార్పణ జరిగింది. అయితే ఆ శక్తి ఇంకా సూక్ష్మభూమికలోనే వున్నది. కొంతమంది సాధకులు ఈ విషయమై శ్రీమాతను ప్రశ్నించారు. కొంతకాలం ఓపిక పట్టమని ఆమె సలహా ఇచ్చారు! మనిషి కంటె కొంచెం ఎక్కువ తెలివితేటలు, ఎక్కువ భుజబలము కలిగి ఉంటాడా? అదేమి గాదు. మనిషికి ఆ దివ్యమానవునికి నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా వుంటుంది. ఈ దివ్య మానవుణ్ణి గురించి, ఆతని శరీరాన్ని గురించి శ్రీఅరవిందులు ప్రవచించిన విషయములను చదువుదామా!

— సంపాదకుడు

పరిణామక్రమంలో మానవుడు ఒక ప్రయాణ సత్రము. అతను కూడా పరిణామశీలియే — పరిణతి జెంది మానవాతీతమైన మరొక జీవిగా అవతరించవలసి ఉన్నది. ఈ పరిణామ ప్రక్రియ ఇప్పుడు త్వరితగతిని జరుగుతున్నది. అయితే నూతన మానవుడు విచిత్రమైన వింతరూపమును దాల్చడు. నేటి మానవుడు సారుప్యమైన మార్పును చెంది దివ్యమానవునిగా రూపొందుతాడు. కొంగ్రొత్త హంగులతో దివ్యశరీరమును ధరిస్తాడు.

ఈ పరిణామము జరుగుటకు అనువైన అవయువములు, విభాగములు మానవుని శరీరంలో సిద్ధముగానే ఉన్నాయి. దివ్య జీవన ప్రక్రియలకు అవసరమైన రీతిలో కొంత పరిణామము చెంది ఉన్నాయి కూడా. అవి ఆయా రూపాలలోనే మరింత పరిణామం చెంది పరిపక్వము కావాలి. ప్రస్తుతము వాటికి గల అవధులు తొలగిపోవాలి. వాటికిగల క్షయము, లోపములు, జాడ్య

ములు పోవాలి. వాటి స్ఫురణశక్తి, క్రియాశీలత్వము నేటి హద్దులను అధిగమించాలి. శరీరం కొత్త సమర్థతలను సమకూర్చుకోవాలి.

నేటి మానవుడు ప్రస్తుతం యంత్రముల సహాయంతో తన సామర్థ్యమును విస్తరించుకుంటున్నాడు. *కాని నూతన మానవుడు తన స్వశక్తి చేతనే దీనినంతా సాధించగలుగుతాడు. తనలోగల ఆత్మశక్తి ద్వారా, సూటిగా అంతర్గత ఆధ్యాత్మశక్తి ద్వారా వీటిని మించిన ప్రయోజనములను సాధించగలడు.* ఈ శరీరం కొత్త పద్ధతులు అవలంబించుకోవచ్చు. ఇతర శరీరాలతో అన్యోన్య సంబంధములకై నూతవ సాధనములను[1] సృష్టించుకోవచ్చు. కొంగ్రొత్త జ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చు. నవదృక్ప థాన్ని అలవర్చుకోవచ్చు. కొత్తశక్తుల్ని పుంజుకోవచ్చు. కొత్త విషయాల్ని సమకూర్చుకోవచ్చు. తన స్వభావానికి అనుకూలంగా సాధనాలను సమకూర్చుకోవడం, వెల్లడి చేయడం శరీరానికి అశక్యం కాదు. దూరాన్ని దగ్గర చేసికొనేందుకు తగ్గించు కొనేందుకు ప్రాకృతిక సామగ్రిని కూర్చుకోవటం కష్టం కాదు. ప్రస్థుత శరీర అస్తిత్వానికి అతీతమైన దాన్ని అవగాహన చేసికోవటంలో యిబ్బందేం ఉండదు. అంతకు మించి వ్యవహరించటం అసాధ్యం కాదు. జడమైన ఈ శరీరం అనుమతించలేని సృజనాత్మకతను, అతి సూక్ష్మాలను పెంపొందించుకోవడం అసాధ్యం కాదు. ఇవిగాక అగణితమైన శక్తులు దృగ్గోచరం కావచ్చు. ఊహకుమించి, వీలైనంత అత్యున్నతంగా అగణితంగా యీ శరీరం ఓ సాధనంగా మారవచ్చు. సత్యచేతన తొలి స్పర్శ నుండి పరిణతినొంది ఆరోహణక్రమంలో అత్యున్నత శిఖారా లను అందుకోవచ్చు.

అతిచేతన సరిహద్దులను అధిగమించగలదు. అభివృద్ధి సాధించగలదు. భావప్రకాశకమైన జీవితాన్ని అనుభవించవచ్చు. ఆ జీవితాన్ని ఉన్నతమైన పరిశుద్ధమైన అస్తిత్వం, చేతన, బ్రహ్మ

---

[1] Being felt being even when afar (*Savitri*, p. 187)

నందాలు స్పర్శిస్తాయి. అవి ఉన్నతోన్నత సత్యాస్తిత్వ లోకాలను సంతరింప జేస్తాయి. తపస్సులో గతిశీలత పొందుతాయి. ఆనందము, వైభవ మాధుర్యాలు చవిచూపుతాయి. సృజనాత్మకమైన ఆనందౌన్నత్యాన్ని సంపూర్ణసారాన్ని సమకూరుస్తాయి. భౌతిక జీవం నిరంతరాయ ప్రగతిపథంలో పయనించి పరివర్తన చెంది దివ్యశరీరంగా రూపొందవచ్చు. భూతల స్వర్గాన్ని చూపే దివ్య జీవితానికి అది ప్రతిబింబం లేదా ప్రతిసృష్టి కావచ్చు. ఆత్మ సాక్షాత్కారం పొందే ఉన్నతోన్నత మహిమాన్విత వైభవం పొందే దివ్యజీవితం కావచ్చు.

అనువాదం: *సాహితీ కౌముది* పి. మోహన్

శరీరంలోని ప్రత్యణువులోను భగవంతుడున్నాడు.

*

శరీరము భగవంతునికి నివాసభూమి — కాబట్టి మనమభ్యసించు శరీరశిక్షణాకార్యాక్రమములు, శరీరానికి సంబంధించిన వైద్యాది విద్యలన్నియు దేవతారాధనలే. భగవంతునికి మనం చేసే అర్చనలే. విద్యలు నేర్పే ఆచార్యులు, శరీరాగ్యమును కాపాడే వైద్యులు మన పూజార్లు.

*

రాగద్వేషముల కతీతమై, సమతా సమర్పణలు సమగ్రమైనప్పుడు భౌతిక శరీరము సహితము ఆనందమును ఆస్వాదించగలదు.

శ్రీమాత

శరీరవ్యాయామమును గురించి శ్రీమాత

శరీర వ్యాయామమును గురించి ఎవరికీ సరియైన అవగాహన లేదు. దానిలో క్రొత్త ఏమున్నది అని మీరు అడగవచ్చు. ఈ భౌతిక శరీరం జడమే అయినప్పటికి దాని చైతన్యం దాని కుంటుంది. క్రమశిక్షణ ద్వారా దానిని ఉద్దీపింప జేయవచ్చు. అప్పుడు శరీరావయవములు ఒక నూతన తేజముతో భాసి స్తాయి. వాటి కదలికలు కూడ నృత్యవిన్యాసములను స్ఫురింప జేస్తాయి. శరీరకణములు కూడ దివ్యచేతనతో వెలిగి పోతూ వుంటాయి. కొంతమంది చిత్రకారుల చేతులు వాటంతటు అవే కదులుతూ చిత్రపటమును గీయవూ! వారి చేతులకు చైతన్య ముంటుంది. అదే విధంగా మొత్తం శరీరం కూడా చైతన్యంతో ఉద్దీపనమై సర్వాంగ సౌష్టవంగా భాసిస్తుంది. ఇది నిజమేనా అంటారేమో. ప్రయత్నించి చూడండి. — అనువాదకుడు

ఆత్మ మాటిమాటికి భూమ్మీదికి వచ్చి శరీరమును దాలుస్తుంది. అభివృద్ధి చెందుటకై నూతనానుభూతులను పొందు తుంది. మొదట బీజరూపంలో నున్న చైత్యపురుషుడు జన్మపరం పరద్వారా ప్రవర్ధమానమై సంపూర్ణ చైతన్యమును సాధిస్తాడు. అప్పుడు స్వతంత్రుడై తనకు ఏ విధమైన జీవితము అవసరమో ఆ విధమైన జన్మ నెత్తుతాడు. తదనుగుణమైన దేశకాల పరిసరా దులను ఎంచుకుంటాడు.

శరీరము ద్వారా చైత్యపురుషాభివృద్ధి


ఆత్మ భూలోకంలోకి దిగివచ్చినప్పుడు అజ్ఞానాంధకారములలో నిమజ్జనమై పోతుంది. అందుకని చాలాకాలము ఈ మొద్దు శరీరములోకి కొంచెం చైతన్యాన్ని ఉద్దీపింపచేయటం తోటే సరిపోతుంది. మనము శరీరమును సంస్కరింప జేయుటకు ముఖ్యమైన కారణమిదియే. క్రమశిక్షణతో శరీరాభివృద్ధే కాకుండా ఆత్మకూడా దాంతోపాటు ప్రదీప్తమై పురోగమిస్తుంది.

శరీరకణముల ఉద్దీపనము

శరీరశిక్షణ ద్వారా శరీరకణములు వికసించి చైతన్యవంతములవుతాయి. ఈ విషయము ఎవరికి తెలియకపోవచ్చు. కాని అది నిజము. మన దృష్టిని కండరముల మీద కేంద్రీకరించి వాటిని ఉపయోగించినప్పుడు, అవయవములకు శిక్షణ ఇచ్చినప్పుడు, వాటి కదలికలను, శక్తిని, చురుకుదనాన్ని, నమ్యతను అభివృద్ధిపరచ దలచినప్పుడు ఒక తమాషా జరుగుతుంది. శరీరకణముల చేతనా ప్రమాణము, వాటి యొక్క గ్రహణశీలత ఇంతకు ముందరలేని రీతిగా పెరుగుతాయి. ఈ విధంగా శరీరము యొక్క చైతన్యము అభివృద్ధి చెందుతుంది. శరీర వ్యాయామము యొక్క ముఖ్యోద్దేశమిదియే. శరీర చైతన్యమును పెంచుటకు ఇతర మార్గములు కూడ కలవు. కాని సర్వాంగంగా తీర్చిదిద్దుటకిదే మార్గము. నేను మీకు ఒక విషయాన్ని అదివరకే చెప్పాను. మేధావులు ఏ విధంగా మెదడును పదునుపెట్టుకుంటారో అదే విధంగా కళాకారులు వారి హస్తములకు కూడ చేతనాస్ఫూర్తిని కలుగజేయగలరు. అయితే దీని వలన ఒక్కొక్క అవయవము మెరుగుకావచ్చు కాని మొత్తము శరీరము కాదు. ఈ విధమైన శిక్షణ యొక్క అద్భుత పరిణామాలను నీవు గమనించినట్లైతే శరీరము యొక్క సామర్థ్యాన్ని చూసి నువ్వే ఆశ్చర్యపోతావు. శరీరధారియైన చైత్యపురుషునకు ఇదెంతో ప్రయోజనకారి. సర్వాంగసౌష్టవము, సమరసము అయిన శరీరము చైత్యపురుషునకు చాలా అద్భుతమైన ఉపకరణము. దాని కార్యమునకు మిక్కిలి సహాయకారి.

శరీర వ్యాయామము నభ్యసించు వారందరికీ యీ విధమైన ఉద్దేశము లేకపోవచ్చు. వాళ్ళకీ విషయాన్ని గురించి లేశమాత్రమైనా తెలియకపోవచ్చు. వాళ్ళకి తెలిసినా తెలియకపోయినా ఫలితమిదియే. మీకు సూక్ష్మదృష్టి కనుక ఉన్నట్లైతే క్రమపద్ధతిలో వ్యాయామ విన్యాసములు జరిపినవాడు నడుస్తుంటే ఒక విధమైన వెలుగు, చైతన్యము, జీవము అతనిలో ఉట్టిపడుతూ వుంటాయి. ఇతరులలో వుండవు.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి



శరీర కణాల ప్రార్థన

భగవంతుని కృపాకటాక్షాల వల్ల మనం ఇప్పుడు అచేతన నుండి నెమ్మదిగా బయటపడుతున్నాం. చైతన్య ప్రదీప్తమైన జీవితం వైపు మేలుకుంటున్నాం. మరింత వెలుగుకోసం, మరింత చైతన్యం కోసం ఒక ప్రగాఢమైన ప్రార్థన మనలో ప్రబుద్ధమవుతున్నది.

"ఓ సర్వోన్నత విశ్వాధినేతా! నిన్ను వేడుకుంటున్నాం, ఈ భూమిపై నీ దివ్య ఉపకరణాలుగా జీవించడానికి ఉపకరించే బలాన్ని, సౌందర్యాన్ని, సామరస్య ప్రపూరిత పరిపూర్ణత్వాన్ని మాకు ప్రసాదించు ప్రభూ!"

శ్రీమాత

తమోగుణం

ప్రశ్న: దేనిని 'దైహిక తమస్సు' అంటారు?
శ్రీమాత: నీకది తెలియదా? అయితే నిన్నభినందించాల్సిందే! ఉదాహరణకు ఎప్పుడైనా నువ్వు కూర్చుని ఉన్నప్పుడు పని ఉన్నా లేవాలనిపించదు. "అబ్బ, అదంతా చేయాలా" అనుకుంటూ కూర్చున్న చోటు నుంచి లేవాలనుకోవు — అవునా?
ప్రశ్న: అయితే అది సోమరితనం వంటిదా?
శ్రీమాత: అంతకాదు. కాని సోమరితనం కూడా ఒక రకం తామసమే. అయితే సోమరితనంలో ప్రయత్నించడానికి యిష్టపడని చెడ్డ సంకల్పం ఒకటి ఉంటుంది. తామసికం అన్నది జడత్వం: పని చేయాలనుకుంటారు కాని చెయ్యలేరు.

చాలా కాలం క్రిందటి సన్నివేశం ఒకటి జ్ఞాపకముంది. — కొందరు పిన్నవాళ్ళతో నేను కలిసి ఉన్నప్పుడు నన్ను వాళ్లు "మీరు లేవాలనుకుంటే ఏమాత్రం కష్టపడకుండా ఒక్కసారి దుమికినట్లు లేచి నిలబడతారు. అదెట్లా చేస్తారు? మేమైతే కూర్చున్న చోటు నుంచి లేవాలనుకుంటే అందుకు ప్రయత్నం చేయవలసి ఉంటుందే!" అని అడిగారు. వాళ్ళకది ఎంతో ఆశ్చర్యకరమైన విషయమైతే వాళ్ళ పరిస్థితికి ఆశ్చర్యపడటం నావంతయింది. నేనిట్లా అనుకునే దానిని — "వాళ్లలా ఎందుకుంటారో. ఎవ్వరైనా ఉన్నచోటు నుంచి లేచి పనిచేయాలని నిశ్చయించుకున్నప్పుడు వెంటనే లేస్తారు కదా." అది కాదు, అసలు విషయమేమంటే శరీరం అప్పుడా స్థితిలో ఉంది. లేచి పని చేయాలనే సంకల్పం దానిలో చొప్పించి అది లేచేటట్లుగా చెయ్యాలి. తామసికం అంటే అదే. తామసిక మనేది పూర్తిగా భౌతికమైన విషయం. ప్రాణిక తమస్సు గాని మానసిక తమస్సుగాని చాలా అరుదుగా ఉంటుంది. అది సంసర్గం వల్ల ఎప్పుడైనా కలిగితే కలగవచ్చు. అది ప్రాణిక, మానసిక తమస్సులుగా కాక నరాలకు, మెదడుకు ఎక్కువ సంబంధించి ఉంటుందని నా నమ్మకం.

సోమరితనం అంటారా — అది దేహంలో, ప్రాణికంలో మన స్సులో అట్లా సర్వత్రా ఉంటుంది. సాధారణంగా సోమరులుగా ఉండే వ్యక్తులు ఎల్లప్పుడూ అన్ని సందర్భాల్లోనూ సోమరులుగా ఉండరు. వారికి ప్రీతికరమైన ఆనందకరమైనదేదైనా చెప్పిన ప్పుడు దానిని చేపట్ట టానికి వెంటనే సిద్ధపడతారు.

స్వేచ్ఛానువాదం: వి. సుబ్బరామ శర్మ

మధుమయీ,

నూతన సంవత్సర సందేశంలో "ప్రపంచము గొప్ప పరి వర్తనము కోసం సిద్ధమవుతోంది" అని తమరు సెలవిచ్చారు. అది మానవుని భౌతిక శరీరానికి సంబంధించినదా?

జంతువు తరువాత మనిషి ఏ విధంగా వచ్చాడో అదే విధంగా మనిషి తరువాత వచ్చే జీవి ఇప్పుడు తయారవుతున్నాడు. 1 జనవరి, 1969 నాడు దిగివచ్చిన నూతన శక్తి (చేతన) యే అందుకు తార్కాణము. అందుకు సంసిద్ధముగావున్న వారిలో అది పనిచేయటంతో ఈ పరివర్తనానికి అంకురార్పణ కూడా జరిగింది. ఆ నూతన శక్తి అత్యంత తీవ్రస్థాయికి చేరుకోవటమే కాకుండా అంతకంతకు భౌతిక స్థాయిని కూడ అందుకుంటున్నది. మన కర్తవ్యమును తెలుసుకొని ఆ శక్తిని మనలోకి గ్రహించి క్రియా శీలము చేసినప్పుడే దాని ఫలితములు త్వరగా కలుగుతాయి.

మూలం: శ్రీమాత
అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహాశాస్త్రి

శరీర పురోగమనమునకు శరీరకణములలో శాంతి నెలగొనవలెను.

శ్రీమాత

ఒక వృత్తాంతము:

వక్ర భాష్యాలు

జంతువుల కంటె మనిషి ఉన్నత స్థాయికి చెందినప్పటికి ఒక దృష్టికి జంతువుల జీవితము మనిషి కంటె హేయమైనది కాదు. మనస్సు తెచ్చిపెట్టిన అహంకారము, అసలు విలువలకు అది చేసే వక్ర భాష్యాలు జంతువులకు తెలియవు. దాన్ని లోభత్వమనండి, దుష్టత్వమనండి — నా అనుభవంలోని ఈ వృత్తాంతాన్ని వింటే మీకే తెలుస్తుంది. అది 1958 మే, 3 వ తేది. నేను చాలా గాఢ మైన అతిమానసానుభూతిని పొంది అప్పుడే తేరుకొంటున్నాను. ఈ భౌతిక ప్రపంచం ఇంకా చాలా దూరంగాను మిథ్యగాను వున్నది. ఒకనాడు సాయంత్రం మన క్రీడాస్థలం లోకి ఒక బృందం నా అనుమతిని పొందివచ్చారు. వారు చాలా ధనవంతులు. అవసరమైన దాని కంటే చాలా రెట్లు ధనం గలవారు. వారిలో ఒక స్థూలకాయురాలున్నది. తన లావుపాటి శరీరం కనపడని విధానంగా చీర కట్టుకొంది. కాని నాకు ప్రణమిల్లినప్పుడు చీర జారి బానవంటి ఆమె పెద్దపొట్ట బయటపడింది. అప్పుడు నాకు ఒకటే ఆశ్చర్యం... లోకంలో లావాటి వాళ్ళు ఉంటారు గాని, వాళ్ళను చూసినప్పుడు అసహ్యం పుట్టదు. జుగుప్స కలగదు. కాని ఇప్పుడు అకస్మాత్తుగా ఆ ఉదరభాండంలో దాగియున్న కల్మషము, దౌష్ట్యము అంతా బయటపడినాయి. దురాశ, దుష్ప్ర వర్తన, నికృష్టవాంఛలు, నీచప్రవృత్తులు, జంతుజాలంలో కాన రాని లోభత్వము మొదలైన వాటితో కుళ్ళిపోతున్న పెద్ద పుట్ట కురుపులా తోచింది. అది మూర్తీభవించిన కురూపము. “వినాశ కాలే విపరీతబుద్ధి”, అన్నారు కదా. వెంటనే, నాలో నుండి, వేద ఘోష లాగ “ఓ భగవంతుడా! ఈ ప్రవృత్తి నాశనమవాలి”. అనే ప్రార్థన పెల్లుబికింది.

సమాజంలో లౌకిక పరిస్థితుల వలన కలిగే దారిద్ర్యాన్నీ, బాధలనూ అర్థం చేసుకోగలము. ఆర్థిక అసమానతలూ, సాంఘిక సమస్యలూ పరిష్కారము కావచ్చు. అవుతాయి కూడా. కాని ఈ

దౌర్భాగ్యం — మానసిక దౌర్భాగ్యం, కామనా వైకృత్యము మారవు — మారుటకు ఇష్టపడవు. ఈ వర్గమునకు చెందిన పెద్ద మనుషులు శాపగ్రస్తులు. వారి సర్వనాశనం తథ్యం.

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: రంగనాధ ఆత్రేయ

స్త్రీలకు ప్రత్యేకం:

స్త్రీపురుషుల సంఘర్షణకు పరిష్కారము

పురుషుడు తనే గొప్పవాణ్ణి అనుకొని ఆడదాని మీద పెత్తనం చలాయించాలని చూస్తాడు. ఆడది ఈ పెత్తనాన్ని భరించలేక తిరగబడుతుంది. ఈ పోరాటం అనాదిగా ఏదో ఒక రూపంలో జరుగుతూనే వుంది.

తప్పంతా పురుషులదేనని స్త్రీలు, అదే విధంగా పురుషులు, పరస్పరం నిందించుకుంటున్నారు. నిజానికి, ఈ సంఘర్షణకు రెండు వర్గముల వారూ సమానబాధ్యత వహించాలి. ఒకరికన్న మరొకరు ఘనులూకారు, అల్పులూ కారు. అయితే, స్త్రీపురుషులలోని, ఆధిక్యతా, న్యూనతాభావములు అపోహాలే. మానవజాతిని రెండు విభిన్న వర్గాలుగా విడదీస్తున్న ఈ అపోహను నిర్మూలిస్తేనే ఈ సమస్య పరిష్కరింపబడుతుంది.

ఈ సమస్యా పరిష్కారానికి, లెక్కకు మించిన, సిద్ధాంతాలూ, మార్గాలూ సమగ్ర పరిశీలనానంతరం, వెలువడినాయి. అన్నీ ఉత్తమమైనవే, నైతిక ప్రాతిపదికలే. కాని ఆచరణలో విఫలమైనాయి. రాతియుగం కాలం నుంచి నేటి వరకూ, యీ సమస్య పరిష్కరింపబడలేదు సరికదా, పరిష్కార మార్గంలో ప్రగతి కూడా కనబడదు. కారణం, స్త్రీ పురుషులు యిద్దరూ అవకాశాన్ని బట్టి, పరస్పరాధిపత్యమునో, బానిసత్వమునో ప్రకటించుకుంటారు.

అవును బానిసలే. ఇద్దరూ నిజంగా బానిసలే. వారివారి కోరికలకూ, వ్యామోహాలకూ, అనుబంధాలకూ వీటిని ఎవరు తీర్చగలిగితే వారికి బానిసలు. మగవారిలోని బలదర్పానికి స్త్రీ ఆకర్షితురాలయి, తదుపరి ఇల్లు, భద్రత, మాతృత్వాల కోసం, పురుషునికి బానిస అవుతుంది. ఇక పురుషుడు తన స్వత్వ భావము, అధికార దాహం, వైవాహిక జీవితంలోని భోగములకు, సౌకర్యాలకు, సౌఖ్యాలకు స్త్రీకి దాసుడవుతాడు.

ఈ మానసిక దౌర్బల్యం వలననే, శాసనాలు ఎన్ని చేసినా స్త్రీ విముక్తం కాలేదు. ఆ శాసనాలు నీటి మీద రాతలే అయినవి కనుక, బానిస భావాన్ని అంతరంగికంగా జయిస్తేనే గాని స్త్రీలు విముక్తి కాలేరు. పురుషుల విషయంలో కూడా అంతే. స్త్రీల పట్ల దాసోహ బుద్ధిని అంతరంగికంగా జయించినప్పుడే వాళ్ళకు స్వేచ్ఛ లభిస్తుంది.

మంచి గుణసంపన్నులలో కూడ ఈ భేదభావన అవ చేతనమై (subconscient) ఉంటుంది. ఇదే ముసుగులో గుద్దులాట — బయటపడదు. లోన చావదు. దీనికి మందు ఒక్కటే — మానవమాత్రులు వాళ్ళ సంకుచిత చైతన్యాన్ని అధిగమించి శుద్ధ చైతన్యంతో ఏకత్వం చెంది పరమ సత్యాన్ని దర్శించాలి. వ్యక్తి గతంగా విభజింపబడినట్లు కనిపించే ఖండ చైతన్యమూ, అఖండ చైతన్యమూ ఒక్కటేనని అనుభవపూర్వకంగా గ్రహించాలి. అప్పుడు స్త్రీ పురుషుల మధ్య భేదము రూపంలోనే గాని స్వరూపంలో ఉండదు.

బహుశః మొట్టమొదట ఈ భూమి మీద శుద్ధమైన పురుషజాతి, శుద్ధమైన స్త్రీజాతి స్పష్టమైన వేర్వేరు లక్షణాలు కలిగి వుండవచ్చును. కాని కాలక్రమేణా తరతరాల వారసత్వం ద్వారా ఈ లక్షణాలు చాలావరకు కలసిపోయి మిశ్రమం ఏర్పడింది. తండ్రి ద్వారా స్త్రీ సంతానానికి పురుష లక్షణాలు, తల్లి ద్వారా పురుష సంతానానికి స్త్రీ లక్షణాలు అబ్బినాయి. సంకరజాతి ఏర్పడింది. తత్కారణంగా నేటి జనాభాలో శుద్ధమైన స్త్రీ లక్షణాలు గాని శుద్ధమైన పురుష లక్షణాలుగాని కానరావు. అంతా కలగా

పులగమైంది. అయినప్పటికి కేవలం భౌతిక రూపాన్ని అనుసరించి పోరాటానికి రెండు వర్గాల వారు సిద్ధపడుతున్నారు! ఇప్పుడు ఇరు వర్గముల వారు అన్ని వృత్తులలోను పోటీ పడుతున్నారు కనుక ఘర్షణ మరింత పెరుగుతోంది.

సవ్యమైన పరిస్థితులలో స్త్రీపురుషులిరువురు వారి వారి ప్రత్యేకతలను విస్మరించవచ్చును గాని, ఒక చిన్న కవ్వింపు చాలు — మళ్ళీ జ్వాల రగిలేందుకు....

మూలం: శ్రీమాత

స్వేచ్ఛానువాదం: రంగనాథ ఆత్రేయ

తల్లిదండ్రులకు:

పిల్లల పెంపకం

శ్రీమాతృవాణి:

మీ బిడ్డలు మీ చెప్పుచేతలలో ఉండాలని మీ ఉద్దేశం కావచ్చు. దీనిని గురించిన నిజానిజాలు మీకు తెలుసా? మీరు పెద్దవాళ్లు కాబట్టి మీ అభిప్రాయాలను వాళ్ల నెత్తుల మీద రుద్దటమేనా? ఇదే ప్రకారం ఒక రాక్షసుడు మీ నెత్తి మీద ఎక్కి మిమ్మల్ని హింసిస్తే మీరేం చేయగలరు? మరి మీకు ఒక న్యాయము, మీ పిల్లలకు ఒక న్యాయమూనా?

పిల్లలను పెంచటం చాల శ్రమతో కూడిన పని. పిల్లలను చక్కగా పెంచే తల్లిదండ్రులను కొద్దిమందిని మాత్రమే నేను చూసాను. మీ బిడ్డలపై మీ అభిప్రాయములను రుద్దే నైతిక హక్కు మీకు ఉన్నదా? ఆలోచించండి

పిల్లలను కనే ముందర వాళ్ల అవసరాలను గురించి గాని వాళ్ళకు రాబోయే సమస్యలను గురించిగాని విచారించి తదను గుణమైన సన్నాహాలు చేయాలి కదా.

*

శ్రీఅరవిందుల విశ్లేషణ:

(యుక్తవయస్కుడైనా, కుమారుని భవిష్యత్తును నిర్ణయించే, నియంత్రించే తండ్రి హక్కు — చారిత్రక సత్యము కావచ్చు, కాని నైతిక బాధ్యత ఆధ్యాత్మిక విలువ — లేనిది)

ప్రాచీన పితృస్వామ్య పద్ధతిలో, బిడ్డ, తండ్రికి సంక్రమించిన సజీవ ఆస్తి. బిడ్డ తండ్రి యొక్క సృష్టి — ఉత్పత్తి — తండ్రి తనను తానే బిడ్డ రూపంలో ఉత్పాదించుకొనినాడు. తండ్రి అంటే దైవమే లేక విశ్వాత్మ అనమాట. ఈ బిడ్డకు సృష్టి కర్త. కాని, భౌతికంగా కన్పిస్తున్న తండ్రే ఉత్పాదకు డయినాడు. సృష్టి కర్తకు తన సృష్టి మీద అధికారం ఉంది. అలాగే ఉత్పాదకునికి తన ఉత్పాదన మీద సంపూర్ణాధికారం ఉన్నది కనుక, వానిని తన అభిప్రాయము నకు బద్ధునిగా మలిచే అధికారం ఉన్నది. అంతే కాని పసివాని ఆత్మతో ప్రమేయం లేదు. తండ్రి అభిప్రాయ ములకు అనుగుణంగా శిక్షణ, రూపకల్పన, దిద్దుబాటు జరగవలె గాని, బిడ్డలో నిక్షిప్తమైన సహజేచ్ఛానుసారముగా కాదు. తండ్రి చేపట్టిన వృత్తి కాని, తండ్రి కోరిన వృత్తి కాని చేయవలె — అంతే కాని, బాలుని అభిరుచి, శక్తి, ప్రకృతుల ననుసరించే వృత్తి కానే కాదు. ఇంత ఎందుకు, యుక్తవయస్కుడైనా కూడా, కుమారుని ప్రమేయం లేకనే, మౌలికమైన ఆతని జీవితంలోని విషయాలను స్థిరపరచడం తండ్రి హక్కే. విద్యా విషయంలో కూడా అంతే. ఆత్మ ననుసరించి స్వేచ్ఛగా వికసించవలసిన పసిగుడ్డును ఉపాధ్యాయుడు పోతపోసిన విగ్రహంలా తయారు చేస్తాడు!

తెలుగు అనుసరణ: రంగనాధ ఆత్రేయ

భరతశక్తి

భగవంతుని సృష్టిలో ఒక్కొక్క జాతి ఒక్కొక్క దేవతా స్వరూపము. దాని సంస్కృతికి సిద్ధాంతాలకు ప్రతీక. తను సంతరించుకున్న సిద్ధాంతంతో జీవిస్తుంది. ఈ దృష్టిలో ఇండియా భరతశక్తి. విశిష్ట ఆధ్యాత్మిక భావనకు సజీవ రూపము. ఆ భావన పట్ల ఆమెకు గల విశ్వాసమే ఆమె అసలైన ఆత్మ. జీవగఱ్ఱ. ధార్మికమైన ఆ తత్త్వం వల్ల మాత్రమే అమర జాతులలో ఒకటిగా ఆమె విలసిల్లుతోంది. ఆమె జీవనంలోనూ, పునరుజ్జీవనంలోను విస్మయం గొలిపే పటిష్టమైన శాశ్వత శక్తి ఉంది. ఈ శక్తిలోని పరమ రహస్యం ధార్మికమైన ఆ గుణం మాత్రమే.

*

భారతమాత అంటే ఓ భూభాగం కాదు. ఆమె ఒక శక్తి! ఒక దేవత. అన్ని జాతులకు వాటి ప్రత్యేకమైన ఉనికిని కాపాడుతూ సజీవంగా ఉంచడానికి అటువంటి దేవతలు ఉంటారు. ఆ దేవతలు వారు ప్రభావితం చేసే మానవుల వలెనే వాస్తవమైన వారు. వారి కంటె శాశ్వతంగా వాస్తవమైన వారు. అయితే ఆ దేవతలు ఉన్నత స్తరములకు చెందినవారు. విశ్వాత్మ అంశలు.

ఆ దేవతలు ఇక్కడ ఈ భూమ్మీద ఉండి వారి లీలల ప్రభావం ద్వారా మానవ చైతన్యాన్ని రూపుదిద్దుతారు.

శ్రీఅరవిందులు

*

ఆధ్యాత్మిక విజ్ఞానానికి, ఆచరణకు అయితేనేమి, అలాగే దివ్య సత్యానికి, దానితోగల అనుసంధానాన్ని కనుగొనడానికి అయితే నేమి, ఊహకు అందని కాలం నుండే భారతదేశం నిలయంగా విలసిల్లుతోంది. (కొంతమంది శాస్త్రవేత్తలు క్రీస్తుపూర్వం 8000 సంవత్సరాలు అంటారు) అకుంఠిత ఏకాగ్రతను అత్యున్నతంగాను, అత్యుత్తమంగాను సాధించిన దేశం ఇది. ఈ విధానాలను సంస్కృతంలో యోగం అంటారు. దాన్ని గురించిన బోధలు,

ఆచరణలు ఈ దేశంలో లెక్కలేనన్ని ఉన్నాయి. వాటిలో కొన్ని కేవలం భౌతికపరమైనవి కాగా కొన్ని పూర్తిగా మేధోసంబంధ మైనవి. మతపరమైనవి కొన్ని అయితే, భక్తికి చెందినవి కొన్ని. అయితే పరిపూర్ణ ఫలితాన్ని పొందాలనే ధ్యేయంతో ఈ వివిధ ప్రక్రియలను సమన్వయం చేసినవి మరికొన్ని.

మూలం: శ్రీమాత

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు.

ఆరోగ్యపత్రం:

వ్యాధికి కారణం – చికిత్స

ఈ సృష్టిలో ఏవేవో రకరకాల శక్తులుంటాయి. మానవ శరీరంపై తమ హస్తాలను వేయాలని కోరుకుంటూ ఉంటాయి. వాటికి స్పందించటం దానికి అలవాటే. దానికి జడత్వం ఉంటుంది. అవివేకం ఉంటుంది. వీటివలన వ్యాధి అనే మూల్యం చెల్లించా ల్సిందే. ఒక్క దివ్యశక్తికి మాత్రం శరీరం స్పందించటం నేర్చు కోవాలి. కాని అది అభ్యసించటం దానికంత సులభం కాదు.

*

అది (అంటే శరీరానికుండే నిరంతర బలహీనత) కూడ తమస్సే. ఆ బలహీనత అనే భావాన్ని నెట్టివెయ్యాలి, అప్పుడా దివ్యశక్తి తనంతటతానే తిరిగి వచ్చి మిమ్మల్ని చేరుతుంది. ప్రాణమయ భౌతిక శరీరంలో ఎప్పుడూ ఏదో ఒక పీడ ఉండనే ఉంటుంది. మరింత బలహీనపడటానికి, రోగగ్రస్తమవటానికి అది అవకాశ మిస్తుంది. ఫలితంగా తన విషాదపరిస్థితి పట్ల నెత్తీ నోరూ కొట్టు కొని మొర్రో యని విలపిస్తుంది.

*

వ్యాధి ఏదో ఒక లోపానికి గుర్తు. బలహీనతకు చిహ్నం. లేదా అటువంటి పరిస్థితికి ప్రతీక. భౌతిక ప్రకృతిపై అది అవాంఛ నీయమైన ముద్రలు వేస్తుంది. మరల ప్రాణమయ అధో శరీ

రంలో లేదా భౌతికమైన మనస్సులో అస్పష్టత తోడౌతుంది. అనైక్యత జోడౌతుంది.

వ్యాధిని సమూలంగా దూరం చేసుకోగల్గాలి. ఎలా? శ్రద్ధ ద్వారా; యోగశక్తి ద్వారా; దివ్యశక్తి సమాగమం ద్వారా. ఇది చాలా సవ్యమైన పద్ధతి. అయితే అంత సులభంగా సాధ్యపడే విషయమా? అబ్బే, కాదు. యావత్తు ప్రకృతీ అందుకు స్పందించేందుకు సిద్ధంగా లేదు. ఆ దివ్యశక్తి ప్రభావానికి స్పందించే పరిస్థితి లేదు. మనస్సుకైతే అటువంటి శ్రద్ధ, స్పందించే తత్వం ఉంటే ఉండవచ్చుగాక. కాని శరీరం దాన్ని అనుసరించక పోవచ్చు. లేదా మనసో, ప్రాణశక్తో అందుకు సంసిద్ధత వ్యక్తం చేసినా, శరీరం మాత్రం అందుకు ఒప్పుకోకపోవచ్చు. అంగీకరించినా అది పాక్షికం మాత్రం. ఏమంటే, శరీరానికి ఏదో ఒక వ్యాధి సంక్రమించిందనుకోండి. అటువంటి వ్యాధిని కలిగించే శక్తికి స్పందించటం దానికి అలవాటైపోయింది. అసలు అలవాటు అనగా ఏమిటి? స్వభావానికి గల ప్రధాన ద్రవ్య భాగంలో ఓ ముష్కర శక్తి. అటువంటి పరిస్థితులలో కొన్ని భౌతిక సాధనాలు వాడవలసి వస్తుంది. అయితే, అవి అంత ప్రధాన సాధనాలు కాకూడదు. దైవీశక్తి చర్యలకు కొంత దోహదపడటానికే, భౌతిక ఆలంబనకే. అయితే ఆ మందులు మరీ మత్తెక్కించేవీ, ప్రచండమైనవీ కాకూడదు. అవి శరీరాన్ని కలత పెట్టకూడదు. దానికి లాభదాయకమైనవే వాడాలి.

*

శరీరానికి వ్యాధులు ఎందుకు కలుగుతాయి? మూర్తమైన భౌతిక జీవిలో ఎక్కువభాగం అవచేతనే కాబట్టి ఈ వ్యాధులను సృష్టించే సూచనలు సాధారణంగా అధోచేతన ద్వారా వస్తుంటాయి; అంటే దానికి తనదైన అస్పష్టచేతన ఉంటుంది. అది చీకటిమయం. మూసికొని ఉంటుంది. మనసు దాని కదలికలను గుర్తించలేదు. అక్కడేం జరుగుతుందో తెలుసుకోలేదాయె. అయితే ఒక విషయం. అది కూడా ఒక చేతనే కాబట్టి దానికి గ్రహణ సామర్థ్యత గలదు. మనస్సు, ప్రాణికముల వలెనే అది (అవచేతన) కూడా

బాహ్యప్రేరణలకు స్పందిస్తుంది. దివ్యశక్తి వ్యాధికి విరుగుడు నిచ్చేందుకు అది తెరుచుకొనే అవకాశముండదు. ఏమంటే అందులో చేతనే లేకపోతే స్పందించ లేదు కాబట్టి. ఇప్పుడు ఐరోపా, అమెరికాల్లో ఈ నైజాన్ని గుర్తించినవారు చాలామంది ఉన్నారు. చైతన్యవంతమైన మానసిక సూచనల ద్వారా శరీరగత వ్యాధులకు విరుగుడునిస్తున్నారు. వ్యాధి ఇచ్చిన అస్పష్ట రహస్య సూచనలను శరీరం అధోచేతనలో ప్రతిఘటిస్తుంది. ఫ్రాన్సులో ఓ పేరుమోసిన వైద్యుడు ఉండేవాడు. పట్టువదలని విక్రమార్కు నిలా, ప్రతికూల సూచనలు ఇప్పించటం ద్వారా వేలాది రోగ గ్రస్తులను నయం చేశాట్ట. దీనిని బట్టి వ్యాధికి పూర్తిగా కారణం భౌతికం కాదు; శరీరంలో గల రహస్య చేతనలోని కలతలే కారణమని రుజువౌతుంది.

ప్రాణమయ శరీరాన్ని శాంతపరిస్తే, నెమ్మదిగా సహించు కుంటూపోతే విషాదపు ప్రతి చర్యలనుండి విముక్తి లభిస్తుంది. దీంతో పాటు అదే సమయంలో శ్రీమాతను శరణుజొచ్చాలి. *ఏమంటే శ్రీమాత తమ ఆంతర్యంలో యీ వైనం తెలుసు కున్నంత మాత్రాన చాలదు. ఆమె ముందు సర్వం సమర్పించు కొని అంతా ఆమెకు విడిచిపెట్టాలి. తద్వారా ప్రతిచర్య మటు మాయం కావచ్చు!*

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: *సాహితీ కౌముది* పి. మోహన్

ఈ పరివర్తనమే నీవు కోరుకుంటే

ఈ పరిణామాన్ని నీవు కోరుకుంటే నిన్ను నీవు శ్రీమాతకు ఆమె దివ్యశక్తులకు నిస్సంకోచంగా, నిరాటంకంగా అర్పణ చేసుకో. ఏ అవరోధం రానీయకుండా నీలో ఆమె పనిని ఆమెను చేసుకు పోనీ. ముఖ్యంగా *మూడు లక్షణాలు తప్పనిసరిగా నీలో ఉండాలి. అవి: చైతన్యము, మార్దవము, నిస్సంకోచమైన పరి*

పూర్ణమైన ఆత్మ సమర్పణము. నీ బుద్ధి, అంతరాత్మ, నీ హృదయము, ప్రాణము, నీ శరీరంలోని ప్రతి జీవకణమూ కూడ, శ్రీమాతను ఆమె దివ్యశక్తులను, గుర్తు ఎరిగి ఉండాలి. నీకు తెలియకుండానే, నీలోను, *నీ అసంకల్పిత కదలికలలోను అవయవాలలోను ఆమె పనిచేయ గలదు కాని నీవామెతో మమైక్యం పొంది ఆమెను నీలో సూటిగా క్రియాశీలము గావించినప్పటి ప్రమాణమే వేరు. నీ ప్రకృతంతా ఆమె దివ్యస్పర్శకి ఒదిగి మార్పు చెందేదిలా ఉండాలి.* అంతే కాని అహంకారంతో కూడిన బుద్ధి అవివేకంగా ప్రశ్నిస్తూ, సంశయిస్తూ, ఘర్షణ పడుతూ ఉండ కూడదు. అటువంటి స్వభావం నీ వికాసానికి పరివర్తనకు శత్రువు.

కాని నీలోని ప్రాణిక విభాగము ఒకటున్నది గదా.ప్రతి దివ్యప్రేరణని గట్టిగా వ్యతిరేకించడం దాని లక్షణం. దాని మొండి కోరికలు, ద్వేషభావం, అడ్డుపడుతూ ఉంటాయి. నీలో పాతుకు పోయి ఉన్న అసమర్థత, జడత్వం, మూర్ఖత్వం, అవివేకం, బద్ధకం, గాఢనిద్రలాంటి అలసత్వం యాంత్రికమైన దైనందిన కార్యక్ర మాలు మొదలైనవన్నీ కూడా శ్రీమాత యొక్క దివ్యస్పర్శకి వ్యతిరేకంగా ఆక్రందిస్తాయి. చిత్తశుద్ధితో నీవు చేసే బాహ్యాంతర దండ ప్రణామములు నీలోని అన్ని విభాగాలనూ నవనీతం గావించి పునీతము చేస్తాయి. నీలో అంతటా చైతన్యస్పృహ మేల్కొంటుంది. సదసద్వివేకము, దివ్యకాంతి, దివ్యశక్తి, దివ్యసౌంద ర్యము, సమర సభావము, పరిపూర్ణత -- వీటితో నిండిన దివ్యప్రవాహాలను ఆవాహనం చేసుకోగలిగే ఉచ్చస్థితిలో నీవు నివసించ గలుగుతావు. నీ శరీరం సహితం మేల్కొంటుంది. చివ రికి నీ సుప్తచైతన్యం అతిమానసోన్నత దివ్యశక్తితో సమైక్య మౌతుంది. *శ్రీమాత యొక్క దివ్యశక్తులు క్రిందికి దిగివచ్చి అన్ని వైపులనుంచి నీలోకి ప్రవేశించి అపూర్వమైన దివ్యప్రేమా నందాలతో నిన్ను పరవశింప చేస్తాయి.*

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వరులు

నిన్ను నీవు తెలుసుకో — మరచిపో

రెండు ప్రాచీన ధర్మసూత్రాలు

అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2000

ఇతర వ్యాసాలు

6/7/2000.

ప్రస్తావన

చాలా కాలం క్రితం ఓ కళాశాలలో చదువుకొంటున్న విద్యార్థి రవీంద్రనాథ ఠాగూరుగారి శాంతినికేతనానికి వెళ్ళి, కవీంద్రుని ఆంతరంగిక కార్యదర్శి, ప్రముఖ విద్వాంసులు అయిన డా॥ గురుదయాళ్ మాలిక్ గారిని కలిసాడు. ఆ విద్యార్థి తన వద్ద ఉన్న స్వదస్తూరీ సంతకాల పుస్తకాన్ని (autograph book) వారి కందించి అందులో వారి సంతకాన్ని నమోదు చేయమని అభ్యర్థించాడు. ఆ అభ్యర్థన కాయన స్పందిస్తూ, తన సంతకంతో పాటు "నిన్ను నీవు తెలుసుకో" అన్న సందేశాన్ని నమోదు చేసి ఆ విద్యార్థికా పుస్తకాన్ని తిరిగి అందజేసాడు. పులకాంకితుడై ద్విగుణీకృతోత్సాహంతో రవీంద్ర కవీంద్రుని చెంతకు పోయి తన స్వదస్తూరీ సంతకాల పుస్తకాన్ని అందించాడు, ఆ విశ్వకవి స్వదస్తూరీ సంతకాన్ని అపేక్షిస్తూ. రవిగాంచని చోట్ల సైతం చూడగల ఆ రవికవి తన ఆంతరంగిక కార్యదర్శి నమోదు చేసిన సందేశ తరంగంపై తన అంతరంగ దృక్కులను నిలిపి, కొంత తడవు మందస్మిత వదనారవిందుడై (నిన్ను నీవు తెలుసుకోవటానికి) "నిన్ను నీవు మరచిపో" అని తన సందేశాన్ని అక్షరబద్ధం జేసి, తన ఆంతరంగిక కార్యదర్శి అంతరంగ స్రవంతితో ఏకమై, సమతత్త్వ హృదయాన్ని ఆవిష్కరించాడు, 'అయమాత్మా — పరంబ్రహ్మ' అన్న మహావాక్యానికి తన సంతకంతో ప్రాణం పోస్తూ.

ఈ రెండు ప్రాచీన జీవన ధర్మసూత్రాలు, జ్ఞానసంపన్నతలో అపారమైనవి, అత్యంత మౌళికమైనవి, మూలాధారమైనవి. బీజప్రాయమైన, ముఖ్యమైన ఈ రెండు హితబోధలపై అత్యంత ఆత్మీయమైన ఆప్తవాక్యాలపై శ్రీమాతారవిందుల అభిభాషణలను వారి వివిధ రచనల నుండి సంకలించి తరువాతి పుటలలో మీ కందిస్తున్నాము, మేమత్యంత దృఢసంకల్పంతో మీ వివేక వివేచనలు సువేద్యం కావాలని ఆకాంక్షిస్తూ.

అనువాదం: అరవిందార్చన

శ్రుతి – స్మృతి

ఉషః కాంతుల కలరి శుభోదయాన మేల్కొన్న
నా ఆత్మ విశ్వానికి వీనులప్పగించింది,
ఆ వీనుల బడిందో సుదూర వాణి, ఓ ఏకాంత విహంగం,
స్వర కల్పన కాధిపత్యం వహించని ఓ పాట,
శాశ్వతత్వం లోనికి అకుంఠిక దీక్షతో చొచ్చుకొ పోయిన ఓ
వేడికోలు.

విశ్వపు టేకాంతంలో తన ఱెక్కల సహచరుణ్ణి వినటానికీ,
దేవదూత ఏమి చెప్పనుందో ఆలకించటానికీ
నా ఆత్మ తూర్పుదిక్కు వైపుకు వాలింది
ఆకాశంపై నడిరేయిలో ప్రకాశాన్ని అవలోకించింది
ఆ నిశిలో ఓ రహస్య అహస్సు దానికి కరతలామలకంగా ఉంది.
ఓ ఆలోచనా స్రవంతి నుండి ఆవిష్కృతమైన నక్షత్రాలనది
సువేద్యం గావించుకొంది
అస్తిత్వ స్వరూప స్వభావ స్థితి లయలు దాని కెఱుక.
తరువాత నా స్మృతి పథంలో కదలాడింది —
నేనెలా నిదురనుంచి మేల్కాంచానో,
ఎలా శూన్య గగనానికి రూపకల్పన చేసానో,
ఎలా భువిని నిర్మించానో,
ఏ విధంగా లోతైన మహాంభోధులను రంగత్తుంగ తరంగ
రావములతో రంజిల్ల జేసానో, —
ఓ మనోజ్ఞ దృశ్య కావ్యంలా విశదపరుస్తూ.

అనువాదం: అరవిందార్చన

రెండు ప్రాచీన ధర్మసూత్రాలు

నిన్ను నీవు తెలుసుకో — మరచిపో

నిన్ను నీవు తెలుసుకో — శ్రీఅరవిందుల ప్రవచనములు

నిన్ను నీవు మరచిపో — శ్రీమాత ప్రవచనములు

ఆయన ఎవరు?

తలెత్తి ఆకాశం వంక చూడు. ఆ సౌర కుటుంబాన్ని నక్షత్ర లోకాలని సృష్టించింది ఎవరు? వాటిని వాటి వాటి కక్ష్యలలో గిరగిరా త్రిప్పుతున్నదెవరు? ఈ సృష్టికి పూర్వమున్నది ఎవరు? ఈ గోళాలన్నీ కాలగర్భంలో కలసిపోయిన తరువాత కూడ తన వైభవానికి ఏమాత్రం లోటు లేకుండా పరిఢవిల్లేదెవరు? నువ్వే. అతిప్రాచీనమైన యోగమునకు వారసుడవు నువ్వే. యోగశక్తితో ఈ భువన భాండముల నన్నింటిని నిర్మించినదీ నువ్వే.

ఇది ఈశావాస్యోపనిషత్తుని గురించి గురుశిష్య సంవాదరూపంలో చేసిన వ్యాఖ్యానంలోని భాగము (ఆంగ్లమూలము *SABCL* Vol. 12, pp. 475-76)
— అనువాదకుడు

తలెత్తి ఆకాశం వంక చూడు. ఈ చరాచర జగత్తునంతా వెలిగింప జేసే ఆ సూర్యభగవానుని పరికించు. రాత్రివేళ మిణుకు మిణుకు మంటున్న నక్షత్రమండలాలను తిలకించు. వెన్న ముద్దలల్లే వెలిగి పోతున్న గ్రహరాశులు, ఆ పాలపుంత ఇదంతా ఏదో ఇంద్రజాల మహేంద్రజాలమల్లే లేదు? నిశ్శబ్ద నిశీధిలో ఆకాశాన్ని అలంకరి స్తున్న ఆ జ్వాలాతోరణాల వైభవాన్ని ఆస్వాదించు. ఆ గగనసీమ యందెల్లడలా నిశ్శబ్దమే రాణిస్తూ ఉంటుంది. అయితే అది శూన్యం మట్టుకు కాదు. అది పరమేశ్వరుని నివాసభూమి. ఆ నక్షత్రరాసు లన్నీ మిక్కిలి చైతన్యవంతములు. విరాట్‌పురుషుని విన్యాసములు.

ఖడ్గధారియైన 'ఓరియన్' నక్షత్రరాశి పదివేల ఏళ్ళ క్రింద ఆర్యయుగారంభంలో మన ఆర్య పితామహులకు ఎటుల కన పడెనో నేడు కూడా అదే విధంగా కనపడుతున్నది. అదిగో అగ్ని నక్షత్రం వంక చూడు. ఉత్తరదిశలో కోటానుకోట్ల యోజ నాల దూరంలో ధగధగా మెరిసిపోతున్న 'లైరా' నక్షత్రరాశిని గుర్తించు. ఇంకా మన భూగోళం కంటె చాల పెద్దవి, అసంఖ్యా కములైన ఆ గోళాలన్నీ శరవేగంతో పయనిస్తున్నాయి. ఎక్క

డికి? ఎక్కడికో. ఆ బ్రహ్మదేవునికే తెలియాలి. ఆ నక్షత్రాలన్నీ హిమాలయా పర్వతాల కంటే కూడా ప్రాచీనమైనవి. అవి కూడా అచలములే. శాశ్వతములే. పర్వతముల కంటే ఇంకా ఎక్కువ శాశ్వతములు. వాటి ఆయుర్దాయమెంత? అవి అటుల ఎన్నాళ్ళు రాణిస్తాయి? సృష్టికర్త నిర్దేశించినంత వరకు, ఆయన ఆ విశ్వ వృక్షాన్ని కుదిపి వాడిపోయిన ఆకుల వలె రాల్పించేసేంత వరకు.

కాలప్రవాహము ఎన్నాళ్ళు కొనసాగుతూ ఉంటుంది? అది అనంతము. అటులనే ఆవరణ (దేశము) కూడా అనంతమే. ఈ దేశకాల అనంతత్వాన్ని గురించి విచారించినప్పుడు నీకాశ్చర్యం కలగటం లేదు? ఇదంతా ఆయన (సృష్టికర్త) విన్యాసమే. ఈ సృష్టికి పూర్వమే ఆయన ఉన్నాడు. విశ్వానికి కాలం తీరి పోయిన తరువాత కూడ ఆయన ఉంటాడు. ఆకాశంలో నక్షత్ర లోకాల కావల శూన్యప్రదేశంలో కూడ ఆయన ఉంటాడు. ఇక నీ దృష్టిని క్రిందికి సారించి చూడు. ఇక్కడున్నదెవరో గమనించు. ఆయన ఏడీ? ఎక్కడున్నాడు? నీ దగ్గరే ఉన్నాడు. అక్కడ నడుము వంగిపోయి కర్ర పట్టుకొని నడుస్తున్న ముసలి వాడు ఎవరో చూడు. దేవుడే. ఎండలో కేరింతాలు పెడుతూ ఆడుకుంటూన్న ఆ పిల్లవాణ్ణి చూడు. అతనూ దేవుడే. ఆ కిల కిలారావాలు దేవుని కంఠస్వరాలే. అతను నీకింకా దగ్గిరగా వున్నాడు. నీలోనే వున్నాడు. అతను ఇంకెవరో కాదు. నువ్వే! యోజనాల దూరంలో గగనసీమలలో నక్షత్రాల రూపంలో వెలుగుతున్నదీ నువ్వే. ఆ శూన్య ప్రదేశంలో నిర్భయంగా నడుస్తున్నదీ నువ్వే. యోగశక్తితో నక్షత్ర గమనాలను నిర్దేశించినదీ నువ్వే. సూర్యుడిలాంటి గోళాలతో ముత్యాలహారాన్ని కట్టిందీ నువ్వే. నిశ్శబ్దంగా నేడు నిన్ను నన్ను ఇక్కడ నిల్పోపెట్టి కార్యాన్ని నిర్వహిస్తున్నదీ ఆ యోగశక్తే.

నువ్వెవరనుకుంటున్నావు? ఆ ప్రాచీన యోగానికి వారసుడవు. నీకిక సంశయమెందుకు? బెడద ఎందుకు? విచారించకు. భయం నాస్తి. ఒక్క తృటిలో లోకాలను సృష్టించేవాడు, నిలిపివేసే వాడు నీలోనే వున్నాడు!

ఈ సమస్తమైన సృష్టిలోను నిక్షిప్తమైన మహాశక్తి యోగేశ్వరునిది. ఆ భగవంతునిది. ఆయనే లేకపోతే నువ్వుగాని, నేను గాని, సూర్యుడుగాని, అసంఖ్యాకములైన భువనభాండములు గాని రెప్పపాటులో వెయ్యోవంతు కాలమైనా మనజాలవు. ఆయన ఈ సృష్టి కావలకూడ వున్నాడు. అభివ్యక్తమైన ఈ లోకంలోనూ వున్నాడు. దీని కావల అనభివ్యక్తంగా కూడా వున్నాడు. *అత్యతిష్ఠద్దశాంగులం* అనభివ్యక్త స్థితి కంటే వేరుగా కూడా వున్నాడు. ఈ విషయాన్ని గ్రహించటం కొంచెం కష్టమే కావచ్చు. కాని నీవు దీన్ని గుర్తించాలి. ఈ విశ్వము భగవంతుని స్వరూపమే అని ఒప్పుకుంటూ, దేవుడు మాత్రం ఈ విశ్వము కానే కాదనే విచిత్ర వాదన (Pantheism) ఒకటున్నది. మరి ఈ విశ్వము దేవుడే అయినట్లయితే ఆయన కేవలం ఈ భౌతికపదార్థమేనా? ఖండమూ, అణువణువుగా చీలిపోయి వస్తువులలో మారిపోతూ వుండే పదార్థం మాత్రమేనా? ఇవన్నియు దేవుని యొక్క రూపములే గాని ఆయన స్వరూపము కాదు.

ఇదే న్యాయం ప్రకారం షేక్స్పియర్ (ప్రసిద్ధ ఆంగ్ల నాటక రచయిత) తాను కల్పించిన పాత్రలకు మాత్రమే పరిమితము అన మాట. కాని అది నిజం కాదు కదా. రచనా వ్యాసంగము ఆయన జీవితంలోని ఒక వ్యాపారం మాత్రమే. ఆయన ఆ నాటకాలకంటే ఎక్కువైన వాడే. ఆయన తను సృష్టించిన పాత్రలలోనూ వుంటాడు. ప్రాత్రలకు అతీతంగానూ వుంటాడు. అసలు ఆ నాటకాల ప్రసక్తే లేకుండా స్వతంత్రంగా కూడా ఉంటాడు.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహా శాస్త్రి

ఆకాశంలో ఎంతో వైభవంగా ధగధగా మెరిసిపోయే ఆ జ్యోతిర్లోకాలను చూసేవు కదా. ఇక అంతకంటె అద్భుతంగా మిరుమిట్లు గొలిపే నీ ఆంతరంగిక లోకాలను దర్శించు.

శ్రీఅరవిందులు

సర్వత్రా నీ ఆత్మనే దర్శించు!

అహంకారమే ద్వంద్వాలకు మూలము

పాపపు కూకటి వేరైన అజ్ఞాన కామజనిత మైన అహంకారాన్ని అలానే వుంచి, ఏవేవో పై పై సవరణల ద్వారా నిర్మూలించబూనే ఆదర్శ వాదాల్లో నాకు నమ్మకం లేదు. అహంకార మున్న చోట ఇష్టానిష్టాలుద్భవిస్తాయి. రాగద్వేషాలనేవి అతి ప్రాచీ నమైన ద్వంద్వాల జంట. కోరికలను తీర్చి తృప్తి నిచ్చే దాని పట్ల ఇష్టమూ, కోరికలను అడ్డగించేవాటి పట్ల అయిష్టమూ కలు గుతాయి. కలిమిలేముల పట్ల ఆశా నిరాశలూ; ఆకర్షణా, వికర్షణా; కరుణా, కార్పణ్యమూ; దయ, నిర్దయా; రాగమూ, ద్వేషమూ ఇదంతా అంతు లేకుండా నిరంతరం సాగే ద్వంద్వాల ప్రహస నము. *ఒక జంట నీలో ప్రవేశిస్తే చాలు బిలబిల మంటూ మిగ తావన్నీ దూరుతాయి!*

నీ నిజ స్వరూపము

మన యోగము అతిప్రాచీనమైనది. సనాతన మైనది. నీవట్టి యోగమునకు వారసుడవు. సర్వత్రా నీ అత్మనే దర్శించు. దేన్ని గురించీ భీతి చెందకు, దేనినీ అసహ్యించుకోకు. ఎవరిని గూర్చీ భయ పడకు. ఎవరినీ ద్వేషించకు. *ధైర్యస్థైర్యాలతో నీ పాత్రను నీవు నిర్వహించు. అలా చేయటం వలన నీవు నీ నిజస్వరూపంతో నిలుస్తావు.* ఓడినా గెలిచినా నీవు భగవంతుడివే అవుతావు. — మృత్యువులోనూ, వేదనలోనూ భగవంతుడిగా నిలుస్తావు. అపరా జితుడిగా, అమరుడిగా భగవంతుడిగా గెలుస్తావు. భగవంతుడు దేనికైనా భయపడతాడా? ఆయనను నిరాశ స్పృశించగలదా? ఆయన కంపిస్తాడా — చలించి పోతాడా? ఎప్పటికీ కాదు. ఆ భయము నీ శరీరానిది. నీ మెదడుది. వాటి లోపల అధివసించే నీది గాదు. అవి పొందే బాధనూ, భయాన్నీ ప్రశాంతంగా తిలకి స్తావు. నిజానికవన్నీ తమ్ముతాము యథార్థములని భ్రమించే నీడలు మాత్రమే. *సర్వజీవరాసుల్లోని ఆత్మను దర్శించు. నీ ఆత్మలో సర్వ జీవరాసులనీ దర్శించు. అలా చేస్తే చివరకు*

భయం నిన్ను చూసి భయపడి పారిపోతుంది. నీ స్పర్శ వలన బాధలకు బాధ కలుగుతుంది గనుక, అవి నిన్ను స్పృశించనే స్పృశించవు. మరణిస్తాననే భయంతో మరణం కూడ నీ దరిచేరదు.

అనువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

నీ కర్తవ్యము

నువ్వసలు ఇక్కడ ఎందుకు ఉన్నట్లు? నీ కర్తవ్యమేమిటి? నిద్రాహారములు నీ అసలు కర్తవ్యము కానేరవు. జాంతవిక జీవితము నీ అసలు కర్తవ్యము కానేరదు. అది అంతకంటె ఘనమైనది విలక్షణమైనది అయి ఉండవలెను. సూపర్‌మేన్ లేక అతిమానవుడు నీ లక్ష్యము. మానవుడు అధిష్ఠించవలసిన తదుపరి సోపానము. అయితే నీవీ యాత్రను ఒంటరిగా చేయవలసిన పని లేదు. ఆ ప్రయాణము ఎటుల సేతునో అని వగవ వలసిన పనిలేదు. ఏలన దైవము నీ నేస్తం. దైవమే నిన్ను చేతిలో చేయి వేసి నడిపిస్తాడు. ఆయనే తగిన శక్తిని నీకు సమకూరుస్తాడు. నీ ప్రయాణం సుఖంగా సంతోషంగా సాగిపోతుంది.

— సంపాదకుడు

దైవమునకు పాత్ర

నీవు జన్మ నెత్తినందుకు కర్తవ్యము — లక్ష్యము దివ్యమానవునిగా, భగవంతుని కనుకూలమైన పాత్రగా, సాధనముగా పరిణమించటమే. కనక నీ యత్నమంతా నిన్ను నీవు సంసిద్ధుని చేసుకోవటం, లేదా తత్సంబంధమైన ఆనందం పొందటం లేదా పతనం కావటం. నీ లక్ష్యమూ, జన్మసాఫల్యమూ అదే కావాలి. నీ సుఖసంతోషాలకు గమ్యమేమిటి? నీ ఉనికిలో ఆనందమనుభవించటం — ఔన్నత్య సిద్ధి — తప్ప అన్యం కాదు — కారాదు. గమనశక్తి నీకు ప్రసాదింపబడటం ఉన్నత శిఖరాల నధిరోహించటానికీ, ప్రయాణంలో సంతోషార్థం కూడా — ప్రయోజనం — సిద్ధీ — కూడా నిన్నాకర్షిస్తూనే నీతోనే నడచివస్తున్నవి.

నీ కర్తవ్యము

నీకొక కర్తవ్యమున్నదంటే అది ఇదే. గమ్యమేమంటావా? అదీ ఇదే. సంతోషమే కావాలంటే — ఇంతకంటే ఆనందమేమున్నదట! ఇతర సుఖ సంతోషాలిందులో లవలేశము లంతే. స్వాప్నిక — నిద్రానందాలు లేక ఆత్మ విస్మృతిలో అనుభవించే సంతోషం — ఇవన్నీ ఎంత లోతు కలవి? చీలమండలమంత. *ఆ మహానందమో ఒక అగాధ సముద్రం.* నీ స్థితి — ఉనికి స్వరూపమేమిటంటావా? పరమేశ్వరత్వం — మిగిలినదంతా దానికి ఛాయా రూపం, లేదా, ఒక ఎడారిలో వీచే మరీచిక — ఎండమావులు. నీవు సత్యాన్వేషివైతే ఆ సత్యమిదే. దానిని నీముందు స్థాపించుకో. సర్వగతంగా భావించు. దానిపై విశ్వాసముంచు.

ఒకరన్నారు — చాలా అందంగా — కానీ వారు తెరలో నుండి చూచారే తప్ప — ప్రత్యక్షంగా చూడకనే — ముసుగులో ముఖాన్ని చూచి — యథార్థమనుకున్నారు. నీ గమ్యం, లక్ష్యమంతా ఆ సత్య ముఖ దర్శనం — సత్యంగా పరిణమించటం. వారే అన్నారు. చాలా బాగా — మానవ స్వభావమేమంటే తనను తాను విశ్వోత్తీర్ణం కావించు కోవటమేనని. నిజానికిదే మనిషి స్వభావం — ఆత్మగా పరిణమించటమే భగవత్సంకల్పం. ముమ్మాటికిదే నిశ్చయం.

మనస్సు కతీతము

ఐతే ఏ 'ఆత్మ'ను విశ్వోత్తీర్ణం చేయాలి? ఏ 'ఆత్మ'గా పరిణమించాలి? ఇది జాగ్రత్తగా విచారించదగ్గ విషయం కదా! నీ జారుపాటులకూ, నీ దుఃఖానికీ మూలమంతా ఈ జాగ్రద్వివేక లోపమే. కనుక నీవు దేనిని ఉన్నత దశకు తీసుకు పోవాలంటే, నీవుగా కన్పిస్తున్న దానిని — అదే, మనిషిగా నీవనుకుంటున్న ఈ ఘటాన్ని —. బాహ్యంగా కన్పించే పురుషుణ్ణి: ఈ మనిషెవరు? భౌతిక జీవిత బద్ధుడై అస్వతంత్రుడైన మనోజీవి. పదార్థ — ప్రాణకోశ బద్ధుడు, కాక పోతే మనోబద్ధుడైనా కాక తప్పదు. ఇంతకంటె మహాదాస్యమేముంటుంది? మనస్సునకు సేవకుడు కావటమంటే అబద్ధానికి దాస్యం చేయుటం — సత్యానికి దూరం కావటం. సంకుచిత పరి

ధిలో — కట్టుగొయ్యకు కట్టబడ్డ పశువుగా తిరిగిన చోటనే తిర గటం. నీవే ఆత్మగా పరిణామం పొందాలో అది నీ మనః ప్రాణ పదార్థావరణల కడుగున — మరుగున దాగిన మాణిక్యం. అది దివ్యం — ఆధ్యాత్మికం — సూపర్‌మేన్ — యథార్థపురుమడు — మనోమయ కోశానికావలనున్న సూపరేమేన్. నీ మనస్సునకే కాదు — నీ ప్రాణాలకు — శరీరానికీ కూడా అధీశ్వరుడు. సర్వ లోకపతి. అతని చేతిలో నీవొక పనిముట్టు. *ప్రస్తుతం నీవా ప్రకృతి*

సూపర్‌మేన్

పాదాల క్రింద నలుగుతున్న మట్టివి. ఆ మట్టి బంగారం కావాలి. బద్ధత — ఆవరణ నశిస్తే తప్ప స్వేచ్ఛ రాదు. నీవొక వ్యక్తివి కావాలి తప్ప భిన్న వ్యక్తుల రాశివి కారాదు. నిత్యుడవు, అమృతుడవు కావాలి తప్ప మృత్యు పరాధీనుడవు కాకూడదు. జ్యోతిర్మూర్తివి కావాలి కాని అంధకా సురుడవు కాకూడదు. ఆనంద తాండవ మూర్తివి కావాలి. కరాళ దుఃఖ నృత్యం చేయకూడదు. శక్తిమంతుడవు కావాలి కాని బల హీనుడవు కాకూడదు. అనంతత్వంలో నివసిస్తూ సొంత తత్త్వాన్ని శాసించ గలగాలి. పరమేశ్వరునిలో నివసించు. ఆయన ఉనికిలో భాగస్వామివి కావాలి. నీవు ఆత్మగా పరిణమించటమంటే ఇది అంతా అక్కడనుండే ప్రసరిస్తుంది. ప్రవహిస్తుంది.

నీ ఆత్మలో నీవు స్వేచ్ఛా పరుడవుకా. కనుక మనః ప్రాణ శరీర చైతన్య త్రయంలో స్వతంత్రుడవుకా. ఎందుకంటే ఆత్మ తత్త్వమంటే అమృత స్వరూపం.

పరమేశ్వరునితో — సకల జీవరాశితో ఏకత్వాన్ని, సమ్మై క్యాన్ని పొందు. నీ ఆత్మవైశాల్యంలో జీవించు. అంతేకాని సంకు చితాహం పరిధిలో ఇరుక్కోబోకు. ఆత్మ తత్త్వమంటే ఏకత్వం.

నీవు ఆత్మగా జీవించు. అమృతత్త్వంలో బ్రతుకు. మర ణంలో శ్రద్ధావంతుడవు కావద్దు. ఎందుకంటె నీ వమృతుడవు తప్ప మృత్యుగతుడవు కాదు. మృత్యువు నీ శరీర సంబంధం మాత్రమే. ఆత్మ తత్త్వ మంటే అమృతత్వం.

అమృతుడు కావటమంటే ఉనికిలో, చేతనలో, ఆనం దంలో అఖండంగా, అనంతంగా వుండటం. ఆత్మ తత్త్వమంటే

అనంతత్వం. ఈ సాంత జగత్తు సర్వమూ ఆ అనంతత్త్వ మూర్తిపై ఆధారపడి బ్రతుకుతున్నది. అందులోనే జీవిస్తున్నది.

ఇవన్నీ నీవైనా అన్నీ నీవు కాలేవు. కానీ నీవవి కాక పోతే నీవెప్పటికీ అవి కాలేవు. నీలో నున్నదేదో అది అభివ్యక్తం కావాలి. నీవది కానట్లు బైటకు తోస్తున్నావు తప్ప నీవు నిజంగా అదే కనుక ఈ భౌతిక జగత్తునకే నిన్ను నీవెందుకు బంధించు కొంటావు — పలుపుత్రాడుతో?

మానవుని దశలు

కనుక ఉత్తిష్ఠ — లే — విక్రమించు. సర్వోత్తీర్ణ దశకు ఎదిగిపో. నీవు ఆత్మగా పరిణమించు.

నీవు మానవుడవు. అతని స్వభావం తనను తాను అతిక్రమించటం. అతడు మానవమృగం. వాడు తన ఈ స్థితిని అతిక్రమించాలి. వాడు మేధావి, శిల్పి, సౌందర్యాన్వేషి. వాడు మేధావి కంటే గొప్పవాడైన సత్యద్రష్ట. వాడు శిల్పి కంటె గొప్ప సృష్టికర్త కావాలి. తన సృష్టికి తానే యజమాని. అతడు సౌందర్యాన్వేషి కంటె కూడా సర్వసౌందర్యాన్ని, ఆనం దాన్ని అనుభవించగలవాడు. భౌతిక వ్యక్తే కావచ్చు. తనలోని శాశ్వత పదార్థాన్ని అన్వేషించగలడు. ప్రాణకోశం లోనే సంచరిం చడు. శాశ్వత అనంత జీవితాన్వేషి. మనోజీవి. ఖండజ్ఞాన మూర్తే కావచ్చు. కానీ అతడు అఖండ జ్యోతిస్సును గుర్తించగలడు. కేవల దర్శనమగ్నుడూ కాగలడు.

సూపర్‌మేన్ అంటే ఎవరు

వీటిని స్వాధీనపరుచు కోవటమే అతిమానవుడు (superman) కావటమంటే. ఎందుకంటె మనో దశ నుండి అతిమనస్సు (supermind) దాకా ఎదగటం అదే కనక. దానిని దివ్యమనస్సు లేదా జ్ఞానము — అతిమనస్సు అని ఏవన్నా అను. అది మాత్రం పరతత్త్వ సంక ల్పము — చైతన్యముల యొక్క శక్తీ — వెలుగు కనుక. తత్త్వము అతిమనస్సు ద్వారా చూచి తనను తాను విశ్వంలో సృజించు కొన్నాడు. దాని ద్వారానే వానిలో ఆయన జీవిస్తున్నాడు. వాటిని పాలిస్తున్నాడు. దాని వల్లనే అతడు స్వరాట్టు — సామ్రాట్టు — స్వాత్మపాలకుడు — సర్వపాలకుడు. అతిమనస్సు — అతిమాన

వుడు కనుక మనోదశను అతిక్రమించి పైకి పోవటం విధి — కర్తవ్యం.

అతిమానవుడు కావటమంటే దివ్యజీవనయాత్ర చేయటం, దేవత కావటం; దేవతలంటే పరాత్పరుని శక్తులు కనుక. మానవ జాతిలో నీవు ఆ భగవంతుని శక్తిగా సంచరించు.

దివ్యస్థితిలో జీవించటం, తత్త్వము యొక్క చైతన్యానందాలు, సంకల్ప జ్ఞానాలు నిన్నావహించనివ్వు. నీలో క్రీడించనివ్వు. నీ నుండి ఆడనివ్వు. — ఇదీ దాని అర్థం.

పర్వతాగ్రాన నీ రూపం దేవతారూపంగా చెక్కుకోవటం. నీలో భగవదావిష్కారం పొందటం. సర్వంలో అతడే బహిర్గతం. *నీతో దోబూచులాడుకోవటం. అతనిలో జీవించు. అతని కాంతిలో స్నానం చేయి. అతని శక్తితో కర్మ చేయి. అతని ఆనందంలో తలమున్కలుకా. ఆ అగ్నీ — ఆ సూర్యుడూ — ఆ సముద్రంకా. ఆ సంతోషం — ఆ మహత్త్వమూ — ఆ సౌందర్యమూ కా.*

ఇందులో నీవే కొంచెమైనా చేసావో అతిమానవత్వ సౌధంలో కొన్ని మెట్లెక్కినట్లే!

జంతువు ఒక సజీవమైన ప్రయోగక్షేత్రము. అందులో ప్రకృతి మనిషిని తయారు చేసిందట — అన్నారు. మనిషి కూడా ఆలోచించే — జీవించే ఒక ప్రయోగక్షేత్రమే. అతనిలో అతని సహకారంతో — అతిమానవుడు — దేవతను తయారు చేయాలని ఆమె సంకల్పం. లేదా ఇలా అనవచ్చునేమో — భగవంతునే నిర్మించాలని. ప్రకృతిలో సృష్టి ఒక పరిణామ క్రమంలో సాగుతున్నది. ఆ మూర్తి పదార్థ సృష్టిలో గర్భితంగా వున్నదే. పదార్థంలో తత్త్వం గర్భితంగా వున్నదనటం సత్యమైతే, ప్రకృతిలో భగవచ్చైతన్యం సుప్తంగా వున్నదనటం సత్యమైతే — మనిషిలో దివ్యాంశ వ్యక్తీకృతి — బహిరంతరంగా పరమేశ్వర సాక్షాత్కారం పొందటం, పృథ్వీపై నివసించే ప్రతి మనిషి ధ్యేయమూ — లక్ష్యమూ కావటంలో ఆశ్చర్యమేమున్నది?

సాధారణ మానవ జీవితం — ప్రథమావశ్యకత

మానవుడు ఆటవికస్థాయి నుండి పెరిగి బాహ్యజీవితమును వృద్ధిపరచుకొని నేడు నవ నాగరీకుడుగా తయారయినాడు. అయితే ఆంతరంగికంగా మట్టుకు ఆటవిక స్థాయిలోనే ఉన్నాడంటే చాల ఆశ్చర్యకరమైన విషయము. మనుషులు సాధారణంగా బాహ్యజీవితపు పై పై మెరుగులకే ప్రాముఖ్యతనిస్తారు. కొద్దిమంది మానసికంగా అభివృద్ధి చెంది మానసిక జీవితమే ఉన్నతమైనదని భావించి దాంతోటే తృప్తిపడతారు. వాళ్ళే గొప్పవాళ్ళనుకుంటూరు. కాని మనిషి యొక్క ప్రతిభ అంతటితో సరికాదు. అతని లోపల మనస్సు కంటే గొప్పదైన ఆత్మ పదార్థమొకటున్నది. అది మనస్సున కందునది కాదు. సాధన జేసి దానిని కనిపెట్టుటయే అతను ఇప్పుడు చేయవలసిన కర్తవ్యం. — సంపాదకుడు

మానవుడు ప్రకృతి బద్ధుడు

భౌతికావస్థలోనే మేల్కొన్న సాధారణ మానవునకు — ఆత్మ చైతన్య అగాధతలు — వైశాల్యము — దాగిన సత్యాలు అవగాహనలో లేనట్టివి. అలాంటి వాని మనస్తత్వం చాల సరళం లోతు లేనిది కనుక అతని బ్రతుకున కాధారమైన వస్తు — భావ సంపదంతా ఏమిటి? చిన్నవైనా కోర్కెల సందడి — పెడబొబ్బలు — కొన్ని ప్రజ్ఞా సౌందర్యాసక్తులూ — కొన్ని అభిరుచులూ, సమయమూ సందర్భ శుద్ధీ లేని అల్పాలోచనల మధ్య కొన్ని ముఖ్యాశయాలూ — సిద్ధాంతాలూ, అధిక సంఖ్యాకమైన ప్రాణికావసరాలూ — ఆరోగ్యానారోగ్యాల చక్రభ్రమణాలూ క్రమరహితమై చెల్లా చెదరయ్యే సుఖదుఃఖాల సుడులూ, మనః శరీరాల అస్తవ్యస్తత, అప్పుడప్పుడూ తొంగి చూచే దృఢాన్వేషణలు — అతని ఆలోచనల — సంకల్పాల ద్వారా ఏర్పడేవాని కొంకిబికి రూపాలూ, కొంత క్షమించదగ్గ అక్రమ క్రమం, — ఇదీ అతని సొత్తు. నేటి సాధారణ మానవుడు తన లోపల ఉనికి అంతా — స్వరూ

పమంతా రూపమేర్పడని — అస్తవ్యస్త స్థితే. *ఆనాటి ప్రాచీన మానవుని బహిస్థితి సర్వమూ నేటి మానవుని అంతస్థితిలో మరుగున పడివున్నది.*

*

జీవితం రెండు లోకాల మధ్య ఊయల

మానవుడు ఆధ్యాత్మిక చైతన్యస్థితిని సాధించటం కంటె మహావిషయమేమీ లేదు. బాహ్యముఖీనమైన ఇంద్రియ చైతన్యానికే పట్టం గట్టే మనిషి ఆ భౌతిక సత్త కడుగున నున్న సత్యాని కున్ముఖం కాలేడు. ఈ భౌతిక దృష్టి — విషయాకర్షణలకు గ్రుడ్డివాడై లోబడటం పేరే మన వేదాంతులు అజ్ఞాన మన్నారు. ప్రాచీన వేదాంతశాస్త్రమా అవిద్యను గ్రహించి ఆ మనిషిని ఆధ్యాత్మిక మార్గోన్ముఖుని చేయాలని ఆకాంక్షించింది. మన జీవితాలు రెండు లోకాల నడుమ ఉయ్యాల లూగుతున్నవి. లోలోపల మిణుకు మిణుకు మనే ఆత్మతత్త్వ మొక లోకం. మరొకటి కేవల భౌతిక ప్రపంచం. మానవ జాతిలో నూటికి నూరు పాళ్ళు ఈ భౌతిక చేతనలో తిరుగుతూ ఏ కొంచెమో అంతః చేతనలోకి తొంగి చూస్తున్నది. సాధారణమైన ప్రాణభౌతిక చేతనావస్థల నుండి — అదొక చట్రం కనుక — మనోభావజాల ప్రభావం వల్లనో — లేక దేశ సంస్కృతీ ప్రభావం వల్లనో — కొంచెం పైకి ఎగరగల్గినా — తత్త్వ ప్రపంచానికి చాలా దూరంగానే ఉన్నాడు — సాధారణ మానవుడు. ఈ మనః ప్రపంచ జీవనం — భావోద్రేకాల స్వరూపమైనది. ఇది కొంతకు కొంత భౌతిక జీవన పరిధి కంటె విశాలమే అయినా ఆధ్యాత్మిక జీవనం కాదు. కానీ పాశ్చాత్యులు కొందరిదే ఆధ్యాత్మిక జీవనంగా భ్రమపడ్డారు. ఆ భ్రమకొక కారణం లేకపోలేదు. సాధారణ భౌతిక జీవనస్థితి చాలా స్థూలం. ఈ మనోజీవితం బౌద్ధిక

మనలోని అంతశ్చైతన్యం

మేధా విలసితం. నైతిక ప్రధానం. సౌందర్యమయం — లేదా అన్నీ కలసినది కావటం వల్ల భౌతికసత్తనది కాలి క్రింద త్రొక్కి పారేస్తుంది. కనుక ప్రజ్ఞావంతమైన ఈ జీవితంలో ఒక మెరుపు

వున్నది. భ్రాంతి కిది కారణం. కానీ ఆధ్యాత్మిక జ్ఞానం మనలో ఒక అంతశ్చైతన్య సత్తను పసిగడుతుంది. అది మన లోలోపలి వెలుగు — ఆత్మ. మన యథార్థస్థితి మేధ కాదు. సౌందర్యమూ కాదు. నైతిక — ఆలోచనాత్మక మనస్సూ కాదు. కానీ ఆ లోపలి వెలుగు, చైతన్యం ఆ ఆత్మ తత్త్వానికి పనిముట్లు. కేవలం ప్రజ్ఞా విలసనం కానీ — నైతిక సౌందర్య సంస్కృతి కానీ ఆ ఆత్మ పొలిమేరల్లోకి కూడా పోలేవు. అదీ అవిద్యే. అపరిపూర్ణ స్థితే. భౌతికమైన పై పొరల్లోని జ్ఞానమే. కనుక మన అంతస్తత్త్వమైన ఆత్మ జ్యోతిర్దర్శనమే ప్రథమ కర్తవ్యం. తదన్వేషణమే మనం చేయవలసిన పని.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు

తెర వెనక తతంగము

మనిషికి తన మనస్సు, శరీరము మాత్రమే తెలుసు. అవి ఆతని బాహ్యరూపములు మాత్రమే. అటులనే ఆతని లోపలి రూపము కూడా ఏదైనా ఒకటి ఉన్నదా ఏమి? తప్పకుండా ఉన్నది. అంతే కాదు. అది మన బాహ్యరూపము కంటె మిక్కిలి ఎక్కువైనది. అది యొక మహాస్వరూపము. అది తెలియని వాడు అజ్ఞుడు. ఈ మహాచైతన్యము మనిషి యందెల్లడల వ్యాపించి ఉన్నది. నీవు దానిని గురించి తెలుసుకున్నపుడే నీలోని దైవమును దర్శించ గలుగుతావు. దివ్యజ్యోతిశ్శక్తుల అభిజ్ఞతి ప్రత్యక్షంగా పొందగలుగుతావు.

— సంపాదకుడు

లోని జ్ఞానభాండారము

మన సత్తునందంతటను, దాని సర్వస్తరములందు బాహ్య చేతనతో బాటు ఒక అంతర చేతన కూడ ఉంది. సామాన్య మానవుడు తన ఉపరితల ఆత్మను మాత్రమే తెలిసి ఉంటాడు. ఈ ఉపరితలం చేత ఆవృతమైన సమస్తం పట్ల అతడు మిక్కిలి

అజ్ఞుడు. కాగా ఏది ఉత్తలమందు ఉందో, మనసు గురించి మన కేమి తెలుసునో, లేక తెలుసుననుకుంటున్నామో, దేనిని ఆ మాత్రమే మనమని సైతం అనుకుంటున్నామో, నిజానికి అది మన సత్తుయొక్క ఒక స్వల్ప భాగం మాత్రమే. మనయొక్క ఎంతో బృహత్తరమైన భాగం ఉత్తలానికి అడుగునే ఉంది. లేక ఎక్కువ యథార్థముగా, ముందున్న చేతనకు (అడుగున గాక) వెనుక ఉంది. తెర వెనుక ఉంది. రహస్య (occult) జ్ఞానంచేత మాత్రమే తెలియబడుతుంది. ఈ వెనుక నున్న సమస్తం ఒక మహాసాగరం, మన జాగ్రశ్చేతన దాని ఒక తరంగం లేక తరంగ పరంపర. అది చాలా జటిలం, కావున దానికి ఏ ఒక్క పేరూ పెట్టడం సాధ్యం కాదు. ఈ అంతస్థలీయంలో ఒక భాగం మన జాగ్రశ్చేతనకు దిగువన ఉన్న అవచేతనం — ఒక భాగం దాని స్థాయిలోనే ఉంటుంది, కాని దాని వెనుక ఉంటుంది — దాని కంటె చాలా పెద్దది. ఒక భాగం పైన మనకు అతిచేతనంగా ఉంటుంది. ఇక దేనిని మనం మన మనస్సని పిలుస్తున్నామో, అది ఒక బాహ్యామనస్సు, ఒక ఉత్తల క్రియ మాత్రమే. అది వెనుక నున్న ఒక బృహత్తర మనస్సు యొక్క ఆంశిక అభి వ్యక్తికి ఉపకరణాత్మకం — ఈ బృహత్తర మనస్సు మనకు సామాన్యంగా తెలిసి ఉండదు. లోనికి స్వయంగా వెళ్లినపుడే దానిని తెలుసుకో గలుగుతాము. అలాగే ప్రాణికం గురించి మనకు తెలిసింది బాహ్యాప్రాణికం మాత్రమే. దేనిని మనం లోనికి వెళ్ళి మాత్రమే తెలుసుకోగలమో, అట్టి ఒక రహస్య బృహత్తర ప్రాణి కాన్ని ఆంశికంగా ప్రకటించే ఒక ఉత్తల క్రియ మాత్రమే ఈ బాహ్యాప్రాణికం. ఇంకా అలాగే దేనిని మనం మన భౌతిక సత్తు అంటున్నామో, అది ఒక అధికతర సూక్ష్మతర, అదృశ్య భౌతిక చేతన యొక్క ఒక దృశ్య ప్రక్షేపం (projection) మాత్రమే — ఈ అదృశ్య భౌతిక చేతన ఎంతో జటిలతరం, ఎంతో జ్ఞానవత్తరం, తన స్వీకరణ శక్తియందు ఎంతో విశాలతరం, ఎంతో ఎక్కువగా ఉన్మీలితం, సమనీయం మరియు విముక్తం.

ఆంతర మానసికం రెండర్థాలు

నీ వీ సత్యాన్ని అర్థం చేసుకొని, అనుభవానికి తెచ్చుకోగలిగితే, అపుడు మాత్రమే ఆంతర మానసిక, ఆంతర ప్రాణిక, ఆంతర భౌతిక చేతన అంటే ఏమిటో నీకు స్పష్టపడుతుంది. కాని ఈ ఆంతర పదం రెండర్థాల్లో ఉపయోగించబడుతోందని నీవు గమనించాలి. ఒక్కొక్కపుడది బాహ్య సత్తు — ముసుగు వెనుక, లోపల ఏ మానసిక లేక ప్రాణిక లేక భౌతిక చేతన ఉన్నదో, ఏది వైశ్వ మనస్సుతో, వైశ్వ ప్రాణశక్తులతో, వైశ్వ భౌతిక శక్తులతో సరాసరి సంపర్కమందు ఉంటుందో — దానిని చెపుతుంది. దీనికి వ్యతిరేకంగా ఒక్కొక్కప్పుడు, ఆ ఆంతర చేతనకు ఒక ఆంతర తమ మానసిక, ప్రాణిక, భౌతిక మనే అర్థం మనమిస్తాము; కాని దానిని ఆంతర తమ అనుటకు బదులు సత్య మనస్సు, సత్య ప్రాణికం, సత్య భౌతిక చేతన అంటే బాగుంటుంది. ఈ సత్యచేతన అంతరాత్మకు సన్నిహితం మరియు నది దివ్యజ్యోతికి, శక్తికీ అత్యంత సులభంగా అవ్యవహితంగా అనుస్పదించగలదు.

మనం బాహ్య ఆత్మ నుండి తిరిగి లోనికి వెళ్ళి, ఆంతర సత్తును, ఆంతర ప్రకృతిని ఎరుగకపోతే, ఎట్టి యథార్థ యోగం సంభవం కాదు. సమగ్రయోగం అసలే కాదు. ఏలన, అపుడు మాత్రమే అజ్ఞ, బాహ్య ఆత్మ పరిమితులను భంగించి, మన ద్వారాను, చుట్టును క్రీడించుతున్న వైశ్వ చేతన మరియు శక్తుల సరాసరి ఎరుకను పొందగలము. బాహ్య ఆత్మ బాహ్య స్పర్శలను మాత్రమే సచేతనముగా స్వీకరించుతుంది. మరియు వస్తువులను పరోక్షముగా బాహ్య మనస్సు, ఇంద్రియాల ద్వారా తెలుసుకుంటుంది. అంతేకాక, అపుడు మాత్రమే మనం మనలోని భగవంతుని సరాసరి తెలిసికొననూ, భగవత్తేజముతో, భగవచ్ఛక్తితో సరాసరి సంపర్కమందుండనూ ఆశించగలము. లేనిచో, బాహ్య చిహ్నాలు, ఫలితాల ద్వారా మాత్రమే భగవంతుని సంవేదించగలము. మరియు నిది ఒక కష్టమయ, అనిశ్చిత ప్రకారం, ఎక్కువగా సందర్భాధీనం మరియు అస్థిరం. అది నమ్మకానికి దారి

తీస్తుందే కాని, భగవంతుని సంతత ఉపస్థితి (presence) యొక్క జ్ఞానానికి కాదు, ప్రత్యక్ష చేతన మరియు ఎరుకకు గాదు.

అనువాదం: చెలసాని నాగేశ్వరరావు (యోగం పై లేఖలు)

అంతర్జీవి

మనిషిలో అంతశ్చైతన్యముంటుంది. దాని రూపు రేఖలు తెలియాల్నంటే సాధన చేయాలి. సాధన కొనసాగుతున్న కొద్దీ అది అధికాధికంగా అనుభూత మవుతుంది. మనిషికి మొదట బాహ్యాచేతనయే గాని ఈ అంతశ్చేతనను గురించి ఏమియు తెలియదు. కాని క్రమేపి అది అధికమై, అదే సత్యమని తెలియ వస్తుంది. అప్పుడు బాహ్యావ్యవహారమంతా స్వాప్నికంగా, పసలేకుండా ఉంటుంది. — సంపాదకుడు

సాధారణంగా మానవుని జ్ఞానం ఇంద్రియ జ్ఞానానికే పరిమితం. కాని లోన అంతర్జీవుడొకడున్నాడు. అంతర్మానసము, అంతః ప్రాణికము, అంతర్భౌతికము, ఇంకా లోలోపలి చైత్యము (psychic) *అతని అంగములు.*

*

ఆంతర సత్తు అంటే చైత్య లేక ఆంతరతమ సత్తు అని నా అర్థం కాదు. నేను ఆంతరమానసికం, ఆంతరప్రాణికం, ఆంతరభౌతిక ముసు గురించి ఎందుకు ప్రసంగించానంటే, చైత్యము యొక్క రహస్య స్థావరము చేరుకొనేందుకు వీటి ద్వారా సాగిపోవాలి. బాహ్యాచేతనను విడిచి లోనికి వెళ్లినపుడు చాలా మంది ముందు ఆంతరప్రాణికంలో అడుగుపెడతారు. కాగా కొందరు ఆంతర మానసిక లేక ఆంతరభౌతికంలో ప్రవేశించుతారు. కాని భావిక (emotional) ప్రాణికం అన్నిటికంటే దగ్గిర దారి. ఏలన చైత్యం హృదయ కేంద్రంలో భావికం వెనుకనే ఉంది. అందుకని ఈ

ఆంతర ప్రదేశాల్లో సచేతనుడు కావాలి. అది మన కార్యం నిమిత్తం అత్యంత ఆవశ్యకం; ఏలన ఈ ప్రదేశాలు మేల్కొనకపోతే, అప్పుడు చైత్య సత్తునకు తన కార్యకలాపాల కోసం యోగ్య మరియు పర్యాప్త ఉపకరణ సాధన ముండదు. అపుడు దానికి బాహ్యమానసికం, బాహ్యప్రాణికం, శరీరం మాత్రమే సాధనాలుగా ఉంటాయి, ఇక ఇవి అతి స్వల్పం, సంకుచితం, అప్రకాశం.

*

ఆంతర ఉన్నత మనస్సులు

ఆంతరచేతన అంటే, ఆంతరమనస్సు, ఆంతరప్రాణికం, ఆంతరభౌతికం మరియు వాటి వెనుక ఉండే, ఆంతర తమ సత్తు అయిన చైత్యం. అయితే ఆంతర మనస్సు ఉన్నత (higher) మనస్సు కాదు. బాహ్య లేక ఉత్తల మనస్సు కంటే ఈ ఆంతర మనస్సు వైశ్వశక్తులతో ఎక్కువ సంపర్కం కలిగి ఉంటుంది. ఉద్భుతర చేతనకు ఎక్కువ ఉన్మీలితం, అలాగే అత్యంత గంభీర తరం, బృహత్తర మయిన క్రియాశ్రేణియందు సమర్థం.

*

బాహ్యాభ్యంతర చేతనలు

మానవునిలో సదా రెండు చేతనలు ఉంటాయి — ఒకటి బాహ్యం, దీనియందే అతడు సాధారణంగా నివసిస్తాడు. రెండవది అభ్యంతరం, ప్రచ్ఛన్నం (concealed). దీనిని గురించి అతని కేమీ తెలియదు. *మనిషి సాధన చేసినపుడు, ఆంతర చేతన వికసించ నారంభించుతుంది. అపుడు అతడు లోనికి వెళ్లి, సర్వ విధ అనుభవాలు పొందగలుగుతాడు. సాధన పురోగమించిన కొలది, సాధకుడు అధికాధికంగా ఈ ఆంతర సత్తులో నివసింప నారంభించుతాడు.* కాగా బాహ్య సత్తు అధికాధికంగా ఉత్తరీయ (superficial) మవుతుంది. ముందు ఆంతరచేతన స్వప్నంగా తోచక, బాహ్యచేతన జాగ్రత్ సత్యతగా కన్పించుతుంది. తర్వాత తర్వాత ఆంతరచేతన సత్యత (reality) అవుతుంది; కాగా అపుడు బాహ్యచేతన పెక్కుమందికి ఒక స్వప్నంగా, ఒక భ్రమగా, అథవా ఉత్తరీయం, బాహ్యమయిన ఒకానొక వస్తువుగా మాత్రమే

తోస్తుంది. *అపుడు ఆంతర చేతన గభీర శాంతికి, జ్యోతికి, సంతోషానికి, ప్రేమకు, భగవంతుని సామీప్యానికి, లేక భగవంతుని సన్నిధి, అనగా శ్రీమాత సామీప్యానికి ఒక ఆస్థానంగా నుండ నారంభించుతుంది.* అపుడు మనిషికి రెండు చేతనలు ఎరుకలో ఉంటాయి — ఆంతర చేతన, దాని ప్రతిరూపంలోనికి, ఉపకరణంలోనికి మార్చబడవలసిన బాహ్యచేతన — అనగా బాహ్యచేతన కూడ శాంతితోను, జ్యోతితోను, భగవదుద్వేగం తోను నిండి ఉండాలి.

*

అంతర్జీవి ఆవిష్కారమై కార్యశాలి అవుతేనే గాని రూపాంతరీకరణము సాధ్యము కాదు.

*

బాహ్యమానవుడు భావ వ్యక్తీకరణమునకు సాధనమే గాని నీ అసలు స్వరూపము కాదు. అతను సంస్కారము జెందని నీ పాత ప్రకృతినే వెలయించును కాబట్టి నీవు అతనిని చూసి 'నేనే' అని భ్రమపడ కూడదు. అప్పుడే నీవు అతనిని మార్చి తద్వారా నీలో వెలుగుతుండే నిజవ్యక్తిని ప్రకటించుకో గలుగుతావు.

*

బాహ్య మనోప్రాణిక దైహికములు అల్పములు, లేశమాత్రములే అయినా అప్రధానములు కావు. ఎందుకంటే అవి లోపల ఆత్మకు, బైట ప్రపంచకానికి మధ్య రాకపోకలకు సాధనములు.

*

బాహ్య చైతన్యము శరీరముతో ముడిపడి వుండుట వలన ఇది కూడ పరిమితము. మనస్సునకు ఇంద్రియ జ్ఞానమునకు కట్టుపడి ఉంటుంది. కాని అంతశ్చైతన్యము సంగతి వేరు. దాని దృష్టి వ్యక్తి దృష్టి వలె సంకుచితం కాదు. దానిది విశాల దృష్టి. తెర వెనక జరిగే వ్యవహారము, వ్యక్తిలోను విశ్వంలోను కదులుతూండే శక్తులను అది తిలకించగలదు.

*

నీ అంతర్జీవి బాహ్యాజీవి వలె నీ ఒక్కనికే పరిమితము కాదు. విశ్వమానసము, విశ్వజీవితము, విశ్వపదార్థము దానికి పరిచితములు. వీటన్నిటి ప్రభావమునకు లోనగుట వలన దానికి శాంతి గాని ముక్తిగాని దుర్లభములు. నీవు అంతర్జీవిని చూసి ఆత్మగా పొరపడుతున్నావు.

*

నీలో జరుగుతున్న మార్పు నీ అంతర్జీవి ఆవిష్కరణము. నీ నిజ స్వరూపము. నీలో అది పెరుగుతున్న కొద్దీ నీ చేతన కూడా విశాలమవుతుంది. ఇతరులంటే నీకు కలిగిన నూతన అవగాహన ఈ మార్పునకు తార్కాణము.

అంతశ్చైతన్యము నిశ్శబ్దము

అసలైన అంతశ్చైతన్యము ఒకటి ఉన్నది. అది చాలా నిశ్శబ్దంగా ఉంటుంది. దానికి మనస్సు వలె ఆలోచించాల్సిన పనిలేదు. మనస్సు ఆలోచనలతో సతమవుతూ ఉంటుంది. కాని అంతశ్చైతన్యానికి ఆలోచనలతో పని లేదు. దాని దృష్టి, అవగాహన సూటిగా ఉంటాయి. దానిది ప్రత్యక్షమైన జ్ఞానము. అంతరంగికంగా పొందిన వెలుగు ప్రకారమే అది నడచుకొంటుంది. బాహ్యచేతనకు ప్రత్యక్ష జ్ఞానము లేక పోబట్టే అది బాహ్యదృష్టి మీద ఆధారపడి తర్జన భర్జనలు చేస్తూ ఉంటుంది.

*

చైత్య పురుషుడు

మనిషిలో రెండు స్థాయిలు — రెండు వ్యక్తిత్వములున్నాయని చెప్పవచ్చును. ఒకటి బాహ్యము. ఇంకొకటి అంతరము. బాహ్యమనస్సు, బాహ్యజీవితము, శరీర చైతన్యము బాహ్య మానవునివి. తెర మరుగున గల అంతర్మానసము, అంతర్జీవితము, అంతర్భౌతికములు అంతర్వ్యక్తివి. ఈ అంతర్వ్యక్తి జాగృతమైననప్పుడు నీ యథార్థమైన ఆత్మను, నీ శాశ్వత రూపాన్ని దర్శించగలవు. మన యోగ పరిభాషలో దానిని చైత్యపురుషుడు (psychic being) అనెదము. అది ఆత్మ ఎత్తిన ప్రతి ఒక్క జన్మకు ఆధారభూతమై, ఒక్కొక్క జన్మకు ఒక్కొక్క నూతన మనస్సు, జీవితము, శరీరములను అవలంబిస్తుంది.

ఈ తాత్కాలిక రూపాలకు అతీతమైన పరమాత్మను తిరిగి పొందినప్పుడు ప్రకృతి సహితంగా ముక్తిని, నిమ్నప్రకృతి మీద విజయమును సిద్ధించుకొంటుంది.

*

వాస్తవిక 'ఆత్మ' పై పొరలలో ఎక్కడా కనపడదు. లోలోపలి అఖాతాలలోను, ఊర్ధ్వభాగములలోను మాత్రమే ఉంటుంది. లోని అంతర్మనస్సునకు, అంతఃప్రాణమునకు, అంతర్భౌతికమునకు ఆధారంగా 'అంతరాత్మ' ఉంటుంది. అది విశ్వవ్యాపకశీలము. *మనమభిలషించే ఆధ్యాత్మికసంపదలు — ఆత్మయొక్కయు, సర్వభూతముల యొక్కయు నిజస్వరూపదర్శనము, విశ్వగత ఆనందముయొక్క రసాస్వాదన, ఈ ఇరుకు చెరసాల నుండి స్థూలశరీరము యొక్క విముక్తి దాని ద్వారానే కలుగుతాయి.* కాని ఆత్మ యొక్క పూర్ణస్వరూపము ఇది కాదు. అది వ్యక్తి వెనుక గల ఆత్మ కంటె ఉన్నతము, అతీతము ఐన మహా విషయము.

అనువాదం: Ch. నాగేశ్వరరావు (యోగం పై లేఖలు) R.L.N శాస్త్రి

నీలోని పరమ గురువుని కనుక్కో

మొట్టమొదట, ప్రగాఢమైన మన ప్రయత్నమే — అనేకాశయము లలో మునిగితేలు మన యహంకార ప్రవృత్తియే, — మనలోని యీ పరమగురువును మరుగు పరచుచుండును. సాధన కొంత స్వచ్ఛమై, అహంకార కల్లోలమణగి, ఆత్మజ్ఞాన ప్రసన్నత కలిగి నంతనే, మన లోపల వృద్ధిపొందు వెలుగునకు మూలమెద్దియో తెలిసికొనగలుగుదుము. అంతేకాదు. తికమకలతో గూడిన మన పూర్వ ప్రవృత్తులన్నియూ ఒక నిర్దిష్ట ప్రయోజనమును పురస్క రించుకొనియే ప్రవర్తిల్లిన వనియు, యోగమార్గమున మనము ప్రవేశించుటకు పూర్వమే దైవనిర్దేశానుసారముగా మన జీవితము పరిణతినందుచూ వచ్చినదనియు గ్రహింప గలుగుదుము.

మన సాధక బాధకములయు, జయాపజయములయు వెనుక గల సత్యము క్రమ క్రమముగా మనకు తెలియ మొదలి డును. తుదకు, మన వేదనా దుఃఖముల యాంతర్యమంతయూ సాృద్గతమై మన కపకారకులైన వారందరివలనను మనకు కలి గిన ఉపకారము తేటతెల్లమగును. *మన నడకలో మనము ఎన్ని సార్లు తడబడిననూ, ఎన్ని మార్లు బోర్లపడిననూ, అదంతయూ నిర్దిష్టమైన ప్రయోజనముల కొరకే యని తెలియవచ్చును.* అటు పిమ్మట, దైవమే మనకు మార్గము చూపుచున్నదని, ముందెప్పుడో తెలియుట కాక, ఎప్పటికప్పుడే తెలిసిపోవుచుండును. *సర్వాతీత మైన ఒక దివ్యచక్షువు మన బుద్ధులనూ, విశ్వవ్యాప్తమైన ఒక దివ్యశక్తి మన కర్మ ప్రవృత్తులనూ, విశ్వమోహనమైన, ఒక దివ్యప్రేమ మన రసభావములనూ తీర్చిదిద్దుచున్నట్లు ద్యోతక మగును.*

ఆదినుండియూ మనకు తన దివ్యస్పర్శను ప్రసాదించుచూ తుదకు మన సర్వస్వమును కైవస మొనర్చుకొనగల ఆ దివ్యా నుగ్రహముతో నొక విధమైన యాత్మీయసంబంధ మనుభూత మగును. మన యందా జగత్ప్రభువు — ఆ యాత్మ సఖుడు — ఆ హృదయ వల్లభుడు — ఆ పరమగురువు సదా సన్నిధి చేసి యున్నట్లు గోచరించును. మన యాత్మ చైతన్యము క్రమముగా విపులతరమైన పరచైతన్యముతో సారూప్య సాయుజ్యముల నందు చున్నట్లు స్ఫురించును. ఈ యలౌకిక పరిణామము మన పురుష ప్రయత్న ఫలిత మెంతమాత్రమూ కాదని స్పష్టమగును. నిత్యసిద్ధ మైన పరతత్త్వమే మనలను తన ప్రతికృతులనుగా దిద్దుకొను చుండును. యోగసిద్ధాంతము లెవరిని ఈశ్వరుడని పిలిచినవో, తత్త్వజిజ్ఞాసువు లనపేక్షవస్తువనీ, అజ్ఞేయవాదు లజ్ఞేయుడనీ, భౌతిక వాదులు విశ్వశక్తియనీ ఎవరిని పేర్కొనిరో, ఒక్కడయ్యునూ వివిధ నామరూపములతో నెవడు వివిధ మతములయందు వర్ణితు డయ్యెనో, ఎవడు పరమాత్మయో, పరాశక్తియో, చైత్యగురువై వెలయు అంతర్యామియో, అతడే మన యోగమున కధీశ్వరుడు.

ఈ పరమేశ్వరుని చూచి, తెలిసికొని, తత్స్వరూపులమై, మన బాహ్యాభ్యంతర ప్రకృతుల యందు తదావిష్కారసిద్ధిని బడ యుటకే మనము దేహధారులమైతిమి. చిరగుప్తమైన ఆ ప్రయోజ నము నిప్పుడు మనము తెలిసి సాధించవలసి యున్నది. *మనకు లోపలనూ బయటనూ సర్వత్ర ఆ పరమాత్ముని యెరుక గలిగి యుండుటయే మన జీవచేతనకు చరమ సాఫల్యము. మన బాహ్యాంభ్యంతరములయందు మన మతని సొత్తులమై, అతడు మన సొత్తగుటయే మనము సాధించవలసిన స్వారాజ్య సామ్రాజ్యములు.* సర్వానుభూతుల యందునూ ఈశ్వరునితో క్రీడించగల నిరతిశయ సుఖమునే జీవుడు తనకు తెలియకుండ నన్వేషించుచున్నాడు. పూర్ణయోగ లక్ష్యపు పరమార్థముకూడ నిదియే. తన గర్భస్థమై యున్న ఏ సత్యమును బహిర్గత మొనర్చు టకై విశ్వప్రకృతి ప్రసవవేదన పడుచున్నదో దానినే జీవుడు స్వానుభవమున నభివ్యక్త మొనర్చుకొనవలసి యున్నది. మానవ చేతన దివ్యచేతనగనూ ప్రాకృత జీవనము దివ్యజీవనముగనూ పరివర్తనము నొందుటయే దీని యాశయము.

అంతర్వర్తియైన మన యాత్మేశ్వరుని జాడ తెలిసికొని, దివ్యజ్ఞానానందమయమైన యాతని దివ్యశక్తిని నిరంతరమూ మనలోని కాహ్వానించుకొనుచూ అదియే మనలను పరివర్తనము నొందించగలదనెడి దృఢవిశ్వాసముతో నుండుట కంటె, ఈ పూర్ణసంసిద్ధికి ఉత్తమమార్గ మింకొకటి లేదు.

అనువాదం: కమలాకర వేంకటరావు (యోగసమన్వయం)

మానవుడంటే ఏమిటి?

ఒక ఉపనిషత్కథనం ప్రకారం పరమాత్మ ప్రాణిక జీవులను సృష్టించినపుడు ముందుగా గోవులు, గుర్రాలు లాంటి జంతువు లను సృష్టించాడట. కానీ ఉపనిషత్తులలో ఉదహరించిన ఉన్నత స్వభావ చైతన్యాలు వాటిలో లేకపోవడం చేత దేవతలు వాటితో

తృప్తిపడలేక పోయారు. అంచేత పరమాత్మ దేవతల చైతన్యాలకు మాధ్యమాలు కాగల, వారి వైశ్వ కార్యనిర్వహణకు దోహదం చేయగల మానవుణ్ణి సృష్టించక తప్పదాయెను. ఈ ఉపనిషత్కథనం ద్వారా వివరంగా తెలిసేదేమిటంటే మానవుడు జంతువే అయినా మిగతా జంతువుల కంటె అత్యున్నత చైతన్యము గల వాడు, మున్ముందు రాబోవు మహాచైతన్యానికి తగిన వారసుడు అని.

మానవుడు ఇటు జంతువుల కన్న, అటు దేవతలకన్న మిన్న జంతువులకు మామూలు అవసరాలు (ఆకలి, దప్పిక మొ॥) తీరితే చాలు. ఇక దేవతలు వాళ్ళ ఉజ్వల వైభవాలతో సరి పెట్టుకోగలరు. కాని, మానవుడు అత్యున్నత చైతన్యాన్ని చేరుకునే దాక తృప్తి పడడు. అంచేత ప్రాణిక జీవులలో మానవునికి అత్యున్నత స్థానం వున్నది. తన చుట్టూ వున్న పరిమితులను, బంధాలను ఛేదించుకొని అమరత్వాన్ని పొందటానికి సతతము తహతహ లాడుతూంటారు. అది ఎంత సుదూరమైన గమ్యమైనా సరే దాన్ని చేరుకోవడానికి 'దివ్య ఉన్మాదం' అతని కొక్కడికే గలదు.

కాబట్టి ప్రాణిక ఆత్మకు తన అత్యుత్తమ సంభావతల్ని ప్రకటించుకోవడానికి అంటే 'పురుషుని' ప్రస్ఫుటం చేయడానికి కావలసిన వ్యక్తి కేంద్రం కేవలం మానవుడు మాత్రమే. ఆ మానవుణ్ణి 'మనువు' అనబడే బుద్ధిజీవి (మేధావి) గా, మనోమయ పురుషునిగా, మానసిక వ్యక్తిగా, మనోమయ కోశంలోని చైత్య పురుషునిగా మన పురాతన ఋషులు అభివర్ణించారు. మన సనాతన ఋషి సంప్రదాయమదే. పదార్థంలోని ద్రవ్యాన్ని నామ రూప సహితమైన మాధ్యంగా అంగీకరించ గలిగిన శక్తి మానవునికే ఉన్నది పదార్థంలో నుంచి పరిణామంలో వచ్చిన ప్రాణిక జంతు జీవితం తన అస్తిత్వాని కంటె అధమం. ఆలోచన, సంవేదన, సంకల్పం, ప్రేరణ — ఇవన్నీ కలిస్తే దేనినైతే 'మనస్సు' అని అంటామో అట్టి మనస్సును కలిగిన మానవుడు, తామసిక రాజసికగుణ ప్రధానమైన అన్నమయ, ప్రాణమయ, కోశాలపై

సార్వభౌమత్వం నెరపడానికి గల శక్తిగల వాడయ్యు, క్రమపరిణామంలో ఒక మధ్య భూమిక మాత్రమే కలిగి వున్నాడు. మనస్సు కంటె ఉన్నతమైన అతిమానసిక దివ్య చైతన్యం కోసం నిరంతరం అన్వేషిస్తున్నాడు. తన ప్రస్తుత చైతన్యం కన్న మిన్నయైన చైతన్య మొకటున్నదనే ప్రగాఢ విశ్వాసమే మానవుని జన్మను దివ్యజన్మగా మార్చడానికి పునాది.

మానవుడు దివ్యుడే

తన నిజ స్వరూపములో మానవుడు దివ్యుడే. తన నిజస్వభావంలో, సత్యస్థితిలో, మానవుడు దేహ, ప్రాణ, మనస్సుల నుపయోగించి, వ్యక్తిగత మరియు సామాజిక స్పృహలు, అనుభవాలు కలిగి విశ్వంలో స్వయం వ్యక్తిత్వం పొందుతున్నట్టి ఒక దివ్యాత్మ. అయితే అనంతమైన ఆ సత్త తనంతటతాను పరిమితమైన వ్యక్తిగా రూపాన్ని ధరించాడు. పరిమిత చైతన్యాలలోకి దిగి రావడం చేత అనంతుడు అనేకమైన శక్తుల పరిజ్ఞానాలతో క్రీడించి ఆనందించ గలుగుతున్నాడు. స్వయంగా సనాతనుడైన (దేశకాలాతీతమైన) సచ్చిదానంద స్వరూపుడే ఈ విధంగా కావాలని, విశ్వాత్మగా, వ్యక్తి యొక్క అంతరాత్మగా అధోస్తరాలకు విస్తరించాడు. ఇక ఇప్పుడు జరుగవలసిందంతా ఏమిటంటే వ్యక్తి తనలోనికి దివ్యచైతన్యాన్ని దిగివచ్చేలా భౌతిక ప్రాణిక మానసిక భాగాలను రూపాంతరీకరణం చేయడమే.

వాస్తవిక సత్త అయిన పురుషుడు, సదా స్వతంత్రుడు, ప్రకృతికి ప్రభువు. ఈ స్వాతంత్ర్యం పొందాలని మనం చేసే ప్రయత్నం సముచితమైనదే. అహంకార ప్రధానమైన క్రియా ప్రవృత్తి, దీని స్వాతిక్రమణం యొక్క ప్రయోజనం గూడ ఇదే. కాని వాస్తవికమైన దీని పరిపూర్ణత్వం, స్వతంత్ర అస్తిత్వం యొక్క అహంకార పూర్ణమైన సిద్ధాంతానికి చరమ నిరపేక్ష రూపం ఇవ్వటంలో గాక, పురుషుడు, ప్రకృతి — వీరి పరస్పర సంబంధం యొక్క అన్యపరమోచ్ఛమైన యీ భూమికను పొందటంలో ఉంది. అక్కడ ప్రకృతి అతిక్రమణం జరుగుతుంది. కానీ, దీనిపైన అధికారం కూడా లభిస్తుంది. అక్కడ మన వ్యక్తిగత

సత్త పూర్తిగ సార్థక మవుతుంది. దీనితోపాటు జగత్తుతోనూ, ఇతరులతోనూ మన సంబంధాలు సైతం పరిపూర్ణ సార్థక్యం పొందుతాయి. కనుకనే, భూలోకాన్ని ఏమీ లక్ష్యపెట్టక, అతీతంగా ఉన్న స్వర్గలోకాల్లో వ్యక్తిగత మోక్షప్రాప్తి, మన సర్వోన్నత లక్ష్యం కాదు. ఇతరుల మోక్షం, వాళ్ళు పరిపూర్ణత్వం సాధించటం కూడా అంతే — మన స్వకీయ కార్యం అవుతుంది. మన స్వీయ మోక్ష మెంత ఉందో, అంత దివ్య ఆత్మహితం ఉందనిగూడా, మనం చెప్పవచ్చు. లేకపోతే, ఇతరులతో మన ఏకత్వానికి అర్థం ఏమీ ఉండదు. ఈ జగత్తులో అహంభావపూర్ణమైన సత్తయొక్క ప్రలోభాల్ని జయించటం, మనమీద మన *మొదటి విజయం.* ప్రపంచానికి అతీతమైన స్వర్గాది లోకాల్లో లభించే వ్యక్తిగత సుఖప్రలోభాల్ని జయించటం మన *రెండో విజయం.* జీవితాన్ని పరిత్యజించి, నిర్వ్యక్తికమైన అనంతసత్తలో ఆత్మవిలీనానికి సంబంధించిన ఆనందం పొందాలనే గొప్ప ప్రలోభాన్ని జయించటం *అంతిమ విజయం,* సర్వ శ్రేష్టమైన విజయం. మనం, అంతిమ విజయం తర్వాతనే, మన వ్యక్తిగతమైన సత్తయొక్క సమస్త ఏకదేశీయత (exclusiveness) నుంచి మనం ముక్తులం అవుతాం, పరిపూర్ణమైన ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం పొందుతాం.

అనువాదం: సి.కె. రామనాథ చెట్టి; జనస్వామి సుబ్రహ్మణ్య శాస్త్రి
(యోగసమన్వయం)

మానవజన్మ యొక్క పరమార్థము

ఈ అవిద్యకూ ఒక అవసరమున్నది. ఏ గూఢాత్మ మన లోలోపలి పొరల్లో వెలుగుతున్నదో అదే ప్రకృతిలో ఈ అవిద్య అన్న ముసుగును — వేషధారిలాగా ధరించింది. ఆ ముసుగును తొలగించి కన్పించని ఆత్మను వెతకటమే ఆ వేషధారణవల్ల ఏర్పడ్డది. ఇదొక క్రీడ. అలా కాకపోతే ఈ జగత్సృష్టి ఏర్పడదని కాదు.

కానీ, అది ఈ ప్రపంచం కంటె వేరైన సృష్టిగా ఐయుండేది. అప్పుడది ఊర్ధ్వలోకాలకే బద్ధమై వుండేదేమో? లేదా పరిణామ రహితమైన గౌణ లోకమై వుండేదో? అక్కడ ప్రతి వ్యక్తీ ఆ లోకానికి సహజమైన సంపూర్ణ ప్రకాశంలో ఒదిగి వుండే వాడు. అప్పుడు అధోభూమికతో మొదలై పరిణామ ప్రవృద్ధశీలమైన ఈ సృష్టి అసంభావ్యమై వుండేది. నిత్యస్థితే దాని గమ్యమై వుండేది. ఈ రంగస్థలమప్పుడు కేవలం ఒక నిరంతర స్థితినే కొనసాగించటానికి ఏర్పడినదవుతుంది.

ఇప్పుడలా కాదు. శాశ్వత ఆత్మద్రవ్యానికి విరుద్ధ స్వభావమైన పదార్థ జగత్తులో ఆ సచ్చిదానందం అవతరించి, భౌతిక స్థితి రూపమైన అవిద్యనే ముసుగుగా ధరించి, తన నుండి తానే దాక్కొంటున్నాడు. తన చేతనాశక్తి నుండి తన యథార్థ జ్ఞాన స్థితిని కోల్పోయి, కర్మల్లో వివిధ రూపాల్లో తనను తాను దాచుకొని — బంధించు కొంటున్నాడు. ఆయా రూపాల్లో నక్కిన ఆత్మ క్రమవికాసార్థం అవిద్యా కర్మల నంగీకరించక తప్పలేదు. ప్రాథమిక అవిద్యనుండి క్రమక్రమంగా జాగృతమౌతున్నది కనుక ఆ అవిద్యా జ్ఞానమే. కనుక ఈ అవతరణ పదార్థంలోకి ఆత్మ అను ప్రవేశించటం తిరిగి తనను తాను అన్వేషించి, ఆ కాంతిలో తన తొలి వెలుగు రూపం పొందటం — ఇదే సృష్టి ప్రయోజనం. ఇదొక క్రమవికాసం. అంతే కాని పూర్ణప్రకాశమూ — ఆనందమూ, నిత్యమూ తాండవించే స్వర్గంలోకి హఠాత్తుగా ఎగిరిపోవటం కాదు. లేదా ఈ సృష్టి ప్రయోజనం విశ్వాతీత లోకానందం కోసం కాదు. లేదా తిరిగిన చోటనే తిరిగే గానుగెద్దు జీవితం కోసం కాదు. ఇది నిష్ప్రయోజనం, అసంతృప్తి కారకమైన అజ్ఞానపు డొంకల్లో గమ్యరహితంగా తిరగటమూ కాదు. అక్కడ జ్ఞానలబ్ధి లేదు. ఒక వేళ వున్నా అది పూర్ణజ్ఞానం కాదు. అదే అయితే అప్పుడా అవిద్య సర్వజ్ఞమైన చైతన్యము యొక్క అర్థరహిత చేష్ట అని అనాలి. లేదా బాధాకరమైన, అసహ్యామైన, నిష్ప్రయోజనమైన ఆవశ్యకత అనైనా అనాలి. అలాగైనా దాని కర్థమూ పర్థమూ లేదు. కనుక విశ్వాతీత స్థితి కంటె భిన్నమైన విశ్వస్థితిలో ఆత్మా

న్వేషణ — తద్విరుద్ధ పదార్థ భూమికల్లో శ్రమించి చేయదగ్గది — తదాత్మ జ్యోతిర్ముఖంగా ప్రయాణించి పోవటమే శరీరబద్ధమైన జీవాత్మ సృష్టికి ప్రయోజనం. మానవజాతి అనంత జీవన ప్రయాణంలో — జన్మల మీదుగా వస్తున్న జాతికి ధ్యేయం. కనుక అవిద్య అత్యవసరమే. విశ్వజ్ఞానం తన పై తానారోపించుకొన్నదే అవిద్య అజ్ఞానం కాబట్టి విశ్వం లోని అవిద్య — బ్రహ్మాండమైన దోషమూ కాదు — పతనమూ కాదు. ఒక ప్రయోజనం కోసం వచ్చింది. అదొక శాపం కాదు. ఒక దివ్యావకాశం.

నానాత్వంలో ఘనీభవించిన మహానందోపలబ్ధికై యత్నించటం అనంత స్థితికై అన్వేషించటం — పదార్థం నుండి పరమేశ్వరాలయ నిర్మాణం చేయటం — ఇదీ పదార్థావృతమైన చైతన్యం పై ఆరోపితమైన కర్తవ్యం — బృహత్ కార్యము.

*

ఒక ప్రశ్న ఏమంటే ఈ క్రమ వికాసము యొక్క ఆవశ్యకత ఏమిటి? ఇది మానవ ప్రజ్ఞ కంతు చిక్కని అంశం.

ఈ పద్ధతి సృష్టి — ఆత్మ వ్యక్తీ కృతి — లేదా లీల — ఆసక్తి లేని జీవుల నెత్తిపైన బలవంతంగా రుద్దినదిగా కన్పించదు. ఈ పదార్థంలో బీజప్రాయంగా తత్త్వం గర్భితమై క్రమంగా పొటమరించి — ఆకు తొడిగి — మ్రానై ఫలించే క్రమవికాసం పొందే లక్షణమున్నది. ఎందుకంటె పురుష ఊర్ధ్వారోహణ లేనిదే ప్రకృతి కాలు కదుపదు. కనుక దివ్య పురుషాంగీకారం ఉండి ఉండాలి. లేకపోతే సృష్టి రాదు. అలాగే వ్యక్తిగత పురుషుని అంగీకారం వ్యక్తిసృష్టిని సాధ్యం చేస్తుంది. కానీ ఒకటన వచ్చు. దివ్యసంకల్పానందం కోసం ఇంత బాధామయ క్రమ వికాసం — వైయక్తిక జీవాత్మ పరిణామ కారణం అర్థంకాని ఒక నిగూఢ సమస్య. ఐనా జాగ్రత్తగా మన ప్రకృతి లోకి తొంగి చూడగలిగితే అదేమంత నిగూఢం కాదు. విశ్వమూలం లాగానే అలాంటి కదలికే మనలోనూ వుంది. దీనికి విరుద్ధంగా తనలో తాను దాగుడు మూతలాట ఆడుకొనేటట్లుగా తనను తాను దాచుకోవటం — దాని కోసం మరలా వెతుక్కోవటం — ఎంతో

సంతోషమైన ఆటలాగ — ఎంతో శ్రమతో కూడుకొన్న పని. ఆ శ్రమ తన జాగృత చైతన్యంలో — తెలిసి అనుభవించేది.

మనిషికి శ్రమించి పొందే విజయం కంటె ఆనందం మరొకటేమున్నది. ఇది బాధలను విధ్వంసం చేసి సాధించే సృష్టి లోని విజయం. బాధామయ పరిశ్రమపై పొందే విజయం — జ్ఞాన విజయం. శక్తిలో విజయం. *సృష్టిలోని అసాధ్యాలపై యుద్ధం చేసి సాధించే అద్భుతానందం, కఠిన దుఃఖ విజయం. వియోగా నంతరం పొందే ఆనంద సంయోగం. ఏ ఆత్మ పదార్థంతో విడి విడి పోయామో తుదకు దానిలో లీనం కావటం.* అవిద్యలో ఎంతో ఆకర్షణమున్నది! ఎందుకంటె, అది అన్వేషణా ఫలానం దాన్ని కల్గిస్తున్నది. అపూర్వ దర్శనాన్ని కల్గిస్తున్నది. ఒక మహా విజయ యాత్రను కల్పిస్తున్నది; ఈ ప్రయాణమెంత అందమై నది! వెతుకులాడటం — ఫలాన్ని అందుకోవటం! రాజమకుటం కోసం చేసే సమరం. శ్రమ — శ్రమానంతరం కలిగే ఫలితం! సృష్టి రహస్యమంతా ఆనంద స్థితే అయితే, ఇదీ ఆనందస్థితే! ఇదే సృష్టి కారణం — హేతువు. పైకి కన్పించే పరస్పర విరుద్ధమైన ఈ లీలా కారణాలనేకములుంటే అందులో కనీసమిదొక కారణం. కానీ, వైయక్తిక పురుషుని అభీష్టం కంటె, మూల సత్తలో ఒక లోతైన సత్యమున్నది. అది అవిద్యావరణను కల్పించుకొని ఆ గాఢాంధకారంలోకి దూకటం. తత్ఫలితమే దానికి విరుద్ధమైన సచ్చిదానంద నిశ్చయాత్మక జ్ఞానం — అనంత తత్త్వంలో ఈ అనంత పరస్పర విరుద్ధాత్మక సృష్టి లక్షణం ఒక హక్కుగా వుంటే — ఇదీ అంతే. దాని అభివ్యక్తికి — సృష్టికి ఈ అవకాశం లేకపోలేదు.

మన లోపలా — పైనా — చుట్టూ ఈ ఆనంద బ్రహ్మ స్థితిని భావించ గలిగితే దాని ఏకత్వాన్ని దర్శించి — అన్ని దశల్లో దానిని మనసారా కౌగిలించుకోగలం. దాని ఆనందం — శాంతి — సంతోషం, ప్రేమా — అన్నీ పొందగలం. అప్పుడు విశ్వమంతా పరమాత్మకు శరీరమౌతున్నది. అది కేవలమొక అమూర్త దర్శనమైతే దాని బృహత్తును, అగాధ సంపన్నతను —

అనుభవించే జ్ఞానం మనకు లేదు. ఒక స్నేహితునిగా అతని ముఖం — శరీరం స్పృశించలేం. ఒక ప్రేమికుని స్పర్శ పొందలేం. పరబ్రహ్మ యొక్క ఘనీభూతానందమే అపురుష — అమూర్త స్థితి. *కానీ అక్కడ నుండి మనలను మనం చూచుకొని ఆ దివ్యపురుషుని మాధుర్యాన్ని, అతని సృష్టి నియమన సామర్థ్యాన్ని ప్రశంసించగలం. అనుభవించగలం. మన యజమాని యైన పరమాత్మ యొక్క సాన్నిధ్య సాక్షాత్కారాలే ఆనందం కనుక. దాని బహిః ప్రసార ప్రవాహమే అతని లీలా సౌందర్యం, అపరిమితానందం.*

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు.

అజ్ఞానం నుంచి బయట పడే మార్గాలు

ప్రతివ్యక్తీ సమిష్ట్యచేతన, సమిష్టచేతనలలో చిక్కుకొని పోకుండా బయట పడేందుకే ప్రకృతి అహంకారాన్ని సృష్టించింది. ఇలా విడివడిన వ్యక్తి తన చుట్టూ వున్న ప్రపంచంతో సత్సంబంధం ఏర్పరచుకుని తనకు అస్తిత్వమూ శక్తీ అంటూ ఏమీ లేకపోయినా పరిసరాల్లో కలసి పోకుండా ఒక స్వతంత్ర మానసంగా, ప్రాణ శక్తిగా, జీవాత్మగా, ఆత్మగా రూపొందుతాడు. నిజానికి ప్రతివ్యక్తీ విశ్వపురుషుని భాగమైనప్పటికీ, పరాత్పరుడి నుండి దిగివచ్చిన ఆత్మే. ఈ విషయం వెంటనే వ్యక్తం కాదు. ఎందుకంటే అతడు విశ్వ అచేతనానికి (inconscience) అతిసమీపంగా వున్నాడు. కానీ అతిచేతనానికి (superconscience) వుండవలసినంత సామీప్యంలో లేడు. తనను జీవాత్మగా, పరమాత్మగా దర్శించుకోడానికి ముందు మానస ప్రాణికాహంకారంగా తనను తాను దర్శించుకోవలసి వున్నది.

అయితే తన అహంకారపూరితమైన వ్యక్తిత్వాన్ని దర్శించటమంటే తనను తాను తెలుసుకోవటం కాదు. నిజమైన ఆధ్యాత్మిక వ్యక్తిత్వమంటే మానసికాహంకారము కానీ, ప్రాణికాహం

కారము కానీ, శరీరాహంకారము కానీ కాదు. ప్రధానంగా ఇది సంకల్పమూ, శక్తీ, అహంకార స్వోత్కర్షల యొక్క ప్రథమ చాలనమే. రెండవది జ్ఞానానికి సంబంధించినది. మానవుడు తన అహంకారపు, అజ్ఞాతపు ఉపరితలాన్ని దాటి లోతుగా తొంగి చూస్తూ తనను తాను తెలుసుకోడానికి ప్రయత్నిస్తాడు. ఎప్పటికైనా తన స్వస్వరూపాన్ని దర్శించే రోజు మానవుడికొస్తుంది.

అసలైన 'నేను' ను తెలుసుకునే మహాప్రస్థానాన్ని మానవుడు ప్రారంభించాలి. అలా కాకపోతే ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ఆగిపోయి, ప్రకృతి అందించే గంభీరమైన విస్తృతమైన విషయాలను అందుకోలేడు. అతని ప్రయోగ కౌశలమూ, సమర్థతా ఎంత గొప్పవైనా, జంతువుల కంటే అతడు కించిదధికుడు మాత్రమే. మొదట అతడు తన దృష్టిని మనస్తత్వం మీదకు మరలించి దానిలోని వివిధాంశాలను జాగ్రత్తగా పరిశీలించాలి. అహంకారం, మానసం, దానిలోని వివిధాంశాలు, ప్రాణమూ, దేహమూ మొదలైన వాటన్నిటినీ గమనిస్తూ పోయిపోయి చివరకు వీటన్నిటిని మించి తన అస్తిత్వానికి సంబంధించిన సహజాంశాలకతీతమైన వివరణ మందుకోవలసి వుంది. అంతేకాక అహంకారం యొక్క స్వోత్కర్ష, సంతృప్తులకు సంబంధించిన విషయాలు మాత్రమే కాక తన అసలు ధ్యేయమేమిటో తెలుసుకోవలసి వుంది.

కావల్సిన సమాధానాలు అతనికి ప్రకృతిలో గానీ, మానవ ప్రకృతిలో గానీ లభించవచ్చు. అప్పుడతను మిగతా ప్రపంచానికీ తనకూ వున్న సామాన్యత్వాన్ని సామ్యాన్ని దర్శించవచ్చు. దాని నతడు అతిప్రకృతిలో గానీ, దైవంలో గానీ దర్శించ ప్రయత్నించవలసి ఉంటుంది. అలా పోయిపోయి దైవానికీ తనకూ వున్న ఏకత్వాన్నీ దర్శించవచ్చు. మానవుడు ఒకేసారి రెండు మార్గాల్లో గానీ, రెండు పడవల మీదగాని ప్రయాణం చెయ్యడానికి ప్రయత్నించి, మధ్య మధ్యలో అనిశ్చిత స్థితిలో పడుతున్నాడు. తన రెండు మార్గాల్లోనూ సాగిన పాక్షిక పరిశోధనా ఫలితాలు ఒకదాని తర్వాత మరొకటి వెలువడుతూంటే,

వాటి ఆధారంగా తన అస్తిత్వాన్ని, సృష్టిలో తన స్థానాన్ని నిర్ణయించే ఏదో ఒక పరిష్కారం తనకు లభించకలదనే అనుకుంటున్నాడు.

ఈ విధంగా తానున్న దశలోనే వుంటూ పట్టు విడవకూడా తనను తెలుసుకునే ప్రయత్నం చేస్తూనే, సాఫల్యం చెందటమే తానన్న విషయం తెలుసుకుంటాడు. ప్రకృతి గురించిన విజ్ఞానమూ, భగవంతుని గురించిన జ్ఞానమూ మాత్రమే తానెవరో తెలుసుకోడానికీ, పరిపూర్ణత నందుకోడానికీ తన వైయక్తిక వ్యక్తిత్వంలో ఉత్తమోత్తమ స్థితిని సాధించడానికీ, సహాయకారులవుతాయి. ఎప్పుడైతే ప్రకృతికీ, దైవానికీ తన వ్యక్త స్వరూపమైన ఉపరితల సత్తకూ వున్న సంబంధాన్ని ఆలోచనల కతీతంగా అందుకుంటాడో, అప్పుడతనికి ఉత్తమోత్తమ ఆత్మజ్ఞానం లభించటం ప్రారంభమవుతుంది. జీవితమంటే ఇది మాత్రమే కాదు అని తెలుసుకుని తన యొక్క కాలనిబద్ధమైన నిత్యత్వం, నశించకుండా నిలచి వుండే 'తాను' అనీ ఆత్మ యొక్క అమృతత్వం గురించీ స్పష్టమైన అవగాహన కలిగితే, అతడు తన పురోగమనంలో మరో మెట్టు ఎక్కినట్టే.

భౌతికాని కతీతమైన స్థితులున్నా యనీ, తనకు ముందు వెనుకా జన్మలున్నాయనీ, భూతకాలం లోనూ, భవిష్యత్తులోనూ తనకు అస్తిత్వం వున్నదనీ తెలుసుకున్నప్పుడు అతడు తన కాల నిబద్ధమైన అజ్ఞానాన్ని నివృత్తి చేసుకుంటాడు. తనకు ప్రత్యక్షంగా వర్తిస్తున్న వర్తమానకాలంలోని క్షణాల్ని అమృతత్వమైన కాలంగా అతడు స్వీకరించ గలుగుతాడు. ఉపరితల స్థితియైన జాగృదావస్థ తన యొక్క అస్తిత్వంలో ఒక చిన్న శకలం మాత్రమేనని తెలుసుకొనటం మరొక అడుగు పురోగమించటం. అతడు అనంత గర్తమైన అచేతనపు లోతులకు అరయటం, అవచేతన యొక్క, అంతరంగం యొక్క లోతుల్ని తరియటం, అతిచేతనపు శిఖరాలకి ఆరోహణ చేయటం ఆరంభించాడన్న మాట. అతడు తన మనస్తత్వంలోని అజ్ఞానాన్ని వదిలించుకొనటం ప్రారంభమవుతుంది. ఇక మూడవ దశలో సాధనాలైన ప్రాణం, శరీరాలతో బాటు నిత్య

నూతనమై నిరంతరం అభివృద్ధి చెందే తన స్వభావానికి ఆధార భూతమైన జీవాత్మను మాత్రమే కాక అక్షరమైన నాశనరహిత మైన పరతత్త్వాన్ని (spirit) గురించి కూడా తెలుసుకుంటాడు. ఆధ్యాత్మిక సత్తలోని వివిధాంశాల్ని పరిశీలించి తాను పరతత్త్వం యొక్క వ్యక్త స్వరూపమేయని తెలుసుకుంటాడు. తన లోని పరాపర ప్రకృతుల అనుసంధాన ప్రక్రియలోని భేదాన్ని గమని స్తాడు. పరతత్త్వాన్ని అనుభూతం చేసుకుంటూనే భగవంతుణ్ణి దర్శిస్తాడు. కాలాతీతంగా వర్తించే ఆత్మస్వరూపాన్ని దర్శిస్తాడు. విశ్వచైతన్య కేంద్రాన్ని ప్రకృతి వెనుక, ఈ విశ్వంలోని జీవుల వెనుక వర్తించే దివ్యసత్యంగా దర్శిస్తాడు. అప్పుడతనికి ఆత్మా, వైయక్తిక జీవీ, విశ్వమూ కేవలుడైన నిర్గుణ పరబ్రహ్మ యొక్క వివిధ ముఖాలనే భావం మన స్సులో ఏర్పడుతుంది.

అపుడతని మీద విశ్వం యొక్క, అహంకారం యొక్క తొలి అజ్ఞానం యొక్క దృఢమైన పట్టు వాడటం ప్రారంభమవు తుంది. ప్రవర్ధమానమయ్యే ఆత్మజ్ఞానపు మూసలో తన అస్తిత్వా నికి రూపం కల్పించా లనుకుంటాడు. అప్పుడతని మొత్తం దృక్ప థమూ జీవితాన్ని నడిపించే ధ్యేయమూ ఆలోచనా విధానమూ, క్రియాశీలతా క్రమక్రమంగా రూపాంతరం చెందుతాయి. తనను గురించి తనకున్న యథార్థ అజ్ఞానమూ, అతని స్వభావమూ, అతని అస్తిత్వంలోని ఆదర్శమూ అన్ని క్రమక్రమంగా శమిస్తాయి. మిథ్యాపూరితమైన, బాధామయమైన సంకుచిత పాక్షిక ప్రపంచం నుండి, పరిపూర్ణ అస్తిత్వాన్ని పూర్తిగా అనుభవించి ఆనందించే పూర్ణత్వంలోకి అతడు అడుగు పెడుతున్నాడు.

భావానువాదం ధారా రాధాకృష్ణమూర్తి

> *జడపదార్థము మనకు అచేతనముగా తోస్తుంది. కాని అందులో కూడ సమస్తమైన సృష్టిని అధివ సించియున్న మహాచైతన్యమున్నది.*
>
> *శ్రీఅరవిందులు*

దైవేచ్ఛ ఉల్లేఖించబడే రిక్త పత్రం

ఓ సర్వవ్యాపక సత్యచైతన్యమా! అనంతాత్మ తత్త్వ సాకార
స్వరూపమా!
విమలాంతరంగమా! విశ్వాధారమా!
నే తపస్వినై, నిర్మలాంతరంగుడనై, నిశ్చల సంకల్పుడనై
ఓ రాయని విశుద్ధ పత్రంలా నీ ముందు మోకరిల్లుతాను
ఆ ఖాళీ పుటపై నీ సంకల్పాన్ని నిరాటంకంగా సహజంగా
స్వచ్ఛంగా నిర్దేశించటానికి వీలుగా
నా అంతరంగంలో తాదాత్మ్యమంది నీవే నేనై నేను
నడవటానికి అనువుగా

స్వామీ! పరస్పర సంబంధ శీలమైన ఈ విశ్వంలో నీ పరిపూర్ణా భివ్యక్తీకరణకు సానుకూలపడేందుకు ఏకైక మార్గమదే గాన, ఈ శాశ్వత పునర్నిర్మాణ కార్యక్రమ నిర్వహణ కాటంకంగా పరిణ మించకుండా నిలుపుదల చేసేందుకు వీలుగా గతానుభవాల స్మృతిని కొంతకాలం భావనా వలయం నుండి తీవ్రంగా తొలగిం చివేయాలి. తప్పదు. తలపులలో ఈషణ్మాత్రమైనా, గతం — దాని అనుభవానుభూతుల స్మృతి కదలాడకూడదు, దాని గాలి ఇసు మంతైనా స్పృశించగూడదు.

అమూల్యానుభవానుభూతులను కోల్పోతామన్న భావ నతో విస్తృతమైన, ఉన్నతమైన చైతన్యం నిమ్నస్థితికి దిగజారు తుందన్న భయాందోళనలతో తరచుగా గతానుభూతుల గాఢ పరిష్వంగానికి మొగ్గు చూపుతుంటాడు మానవుడు. ఇది సర్వ సాధారణం.

అయినా, నీ వెవరని అతనికి భయం — ఏమని భయం — ఎందుకు భయం? నీవతని అంతర్యామివి కదా! అంతః సాక్షివి కదా! అది ఏమైనా సరే, కడకు అతని పరిమిత తర్కంలో, వివేక వివేచనా భావలహరిలో దురవగాహమైనదైనా సరే — నీ మార్గం — నీవు చూపిన మార్గం — అతడెందుకు నీవతనికి

నిర్దేశించిన మార్గంలో ఆనంద పరిపూర్ణాత్మతో, సచ్చిదానంద పూర్ణ హృదయుడై, అపారాంతరంగుడై అడుగు ముందుకు వేయడు? వేయ లేడా? — ఏమిటి భయం — ఎందుకు భయం? నీ అభయం కాన లేడా? అంతర్వాణిని వినలేడా? గతం భయం విడిచి అను భవ స్మృతిని మరచి అంతఃకరణ శుద్ధితో నీవాలంబనగా — ఆదర్శంగా నీ జాడలో నీ అడుగులో అడుగు వేసి కదలలేడా? కనిపించే అసత్యాన్ని విడలేడా?

ఓ పరమాత్మా! అవసరమని నీవు భావిస్తే, పాత ఆలో చనా ధోరణులను ఖండించు; గతానుభూతులను రద్దుపరచు; బుద్ధి సంయోగాన్ని కరుగజేయి. తద్వారా నీ సంకల్ప సాధన మరి మరింతగా సఫలమగుట భువిపై నీ భక్త పరాధీన పరిపూర్ణముగ ఆవిష్కృతమగుట సుకరమగును.

అనుసరణ: అరవిందార్చన

నన్ను నానుండి విముక్తిని గావించుము

విశ్వేశ్వరా! విమల తేజోంతరంగమా! విశ్వస్వరూపమా!
పరిపూర్ణంగా ప్రవిమలంగా పటిష్ఠంగా ధైర్యతేజో పరాక్రమ విల సితుడను ప్రశాంత గంభీరచిత్తుడనునై, మొక్కవోని దీక్షతో పురో గమిస్తూ, అవిచ్ఛిన్న దైవానుగ్రహానుభూతినందిన అసలు సిస లైన బలశాలిగా దృఢ చిత్తముగల వ్యక్తిగా నే నెప్పుడు రూపొం దుతాను? *నేను — నాది అన్న బలవత్తర భవ బంధం నుండి విముక్తుడనై 'నా' అన్న వ్యక్తిత్వ స్మృతిని, నాదన్న స్వార్థ చింతనను పరిపూర్ణంగా కోల్పోయి, నేను కేవలం ఆత్మ శక్తిచే దాని కొఱకై దివ్యచైతన్య ప్రేరణతో రూపొందిపబడిన ఉపకర ణమును మాత్రమేనన్న భావన నాలో ఎప్పుడు అభివ్యక్త మవుతుంది?* ఎప్పుడు నా సమగ్ర సమైక్య చైతన్యహిత స్థితి ఇంకెంత మాత్రమూ ఎటువంటి జడత్వంతోనూ కలిసి ఉండక పోవటం సంభావ్య మవుతుంది? ఉచితానుచితజ్ఞత సజావుగా

నాలో స్థిరమై హృదయ పూర్వకమైన నా భక్తిభావనలో దేవునిపై నాకుగల అపారమైన ప్రేమ ఇంకెన్నటికీ ఎట్టి బలహీనతలతోను సంగమించని స్థితి పరిఢవిల్లుతుంది?

స్వామీ! నాలోని ఆలోచనలన్నీ పూర్ణంగా నిర్వీర్య నిస్తేజము లవుతున్న వైనం నాకు చూచాయగా ద్యోతక మవు తున్నందున నేనిప్పుడు ఈ పరిప్రశ్నలతో నీ ముందు నిలిచాను — (సావధానంగా సమాధానాలు వినటానికి) నేను నా చైతన్య పూర్ణ మనోబుద్ధుల కొఱకు గాలించాను. అవి నా కంటబడ లేదు. నా వ్యక్తిత్వం కొరకు ఎఱవేసాను. సానుకూలపడ లేదు. నా ప్రయత్నం ఫలించలేదు. సరే మనో బుద్ధి వ్యక్తిత్వముల జాడ గాంచలేకపోయినా నిరాశ జెందక నా స్వయం సంకల్పం కోసం వెదికాను. ఆ యత్నమూ ఫలించలేదు. ఆపై నీకోసం వెదికాను. నీవు గంభీరమౌనముద్రలో ఉన్నావు.... నిశ్శబ్దం.... అంతటా నిశ్శ బ్దమే.... నిరంతర నిశ్శబ్దమే.... నిశ్చల శబ్దరాహిత్యమే.... నిర్మల మౌనరాగమే....

ఇప్పుడు నీ గళం కదిలినట్లున్నది, నీ పెదవి విప్పారి నట్లున్నది.... నా వీనుల్లో నీ మాట కదలికల సవ్వడి నర్తిస్తున్న ట్లున్నది... నీ కంఠస్వరం వినిపిస్తున్నదనిపిస్తున్నది. "నీకు సమ గ్రంగా సహజ మరణభావన ఎప్పుడూ అనుభవైక వేద్యమయి నట్లు లేదు. నిర్వాణ నిర్యాణ సమస్థితి భావన నీలో పరిఢవిల్లిన వైనం పొడసూపదు. సదా నీలోని ఏదో ఓ అంశం సువేద్యం గావించుకోవాలని రుజువు పరచుకోవాలని, అవగతం చేసుకో వాలని సవ్యంగా అర్థం చేసుకోవాలని తహతహలాడుతున్నది. పరిపూర్ణంగా నిన్ను నీవు సమర్పించుకొనుము. అంతర్ధానమ వటం అధ్యయనం జేయుము. నిన్ను నన్నుండి వేరుపరచే అంతిమ అవరోధాన్ని భగ్నపరచుము. నీ శరణాగతి ధర్మాన్ని నిస్సంకో చంగా ఎట్టి భేషజాలు అడ్డుతగులకుండా నిర్నిబంధంగా, పూర్తిగా నిర్వర్తించుము". హాతవిధీ! ఓదైవమా చాలాకాలంగా నేనీ నిశ్చల స్థితిని నిత్య సత్యాత్మకాచరణ శీలతను కోరుకొంటున్నాను, దానికై పరితపిస్తున్నాను. కాని పొందలేక పోతున్నాను. దయా

మయూ! కరుణాంతరంగా! నీవిప్పుడు దానిని పొందే శక్తిని నా కనుగ్రహించనున్నావా? శరణు శరణు ప్రభో! శరణు!

ఓ శాశ్వతానంద ప్రదాయకా! నా మధుర నాయకా! నాలో దుఃఖాన్నీ తీవ్రతాపాన్నీ ముంచెత్తించే నిరోధక శక్తిని సమూలంగా నిర్మూలించు... నన్ను నా నుండి విముక్తిని గావించు! నేను కాని నేనును, నేననుకొనే భావనను తొలగించు.

అనుసరణ: 'అరవిందార్చన'

నిన్ను నీవు లయం చేసుకో

'నేను' అనే భావన పోయి "అహం" కి ప్రత్యామ్నాయంగా మరి ఇక అక్కడ ఏమీ లేకుంటే మిగిలేదేమిటో తెలుసా? అసలు నిమ్నోన్నతాలు లేని సువిశాల సమతలమే! అదో రకమైన మాటలకు అందని అచంచలమైన చైతన్య స్పృహ. *"నీవు సాధించాలనుకున్నది సాధిస్తావు" (ఇక్కడ మాటలు చాలవు) నిజానికి ఈ శారీరక స్పృహయే ఉండదు. శరీరం కేవలం ఉపకరణంగా మాత్రమే మిగిలి ఉంటుంది. ఆ "ఒక్కటే" (చిత్ శక్తి) అక్కడ ఉండేది. ఇది అంతా ఆ చిత్‌శక్తి ప్రభావమే. ఆ విశాల చైతన్యము నీకు అనుభూతమౌతుంది.* ఒక విశ్వ విశాల వ్యాప్తమైన శక్తి యొక్క స్పందనకు సంబంధించిన దర్శనమది. ఖచ్చితమైన ఒక మహత్తర అతీతశక్తి మరీ మరీ చేసే ఒత్తిడికి ప్రకంపనలకు ఈ ప్రపంచం మెలికలు తిరిగి పోతుంది. ఆ దివ్యశక్తికి ఈ లోకం ఒదిగి ఉంటుంది. లోబడుతుంది. ఆ శక్తి ఆవహించుకుంటుంది. విశ్వవ్యాప్తమౌతుంది.

మరి ఇదే పరిష్కారం; మరొకటి లేదు. ఇక మిగిలేవల్లా ఆకాంక్షలు, తలపులు, ఎదురుచూపులే! ఇదంతా ఇంత వరకు అతిమానవునికి సంబంధించినది మాత్రమే; అతిమానసము కాదు. సాధారణంగా ఉన్నత మానవులు మానవాళి నంతటిని పైకి లేవనెత్తటానికి ప్రయత్నిస్తారు. కాని అది పనికిరాదు.

ఇక్కడ ఒక విషయం సుస్పష్టం. మానవాళి అంతా పైకి ఎగబ్రాకాలని కోరుకుంటారు గాని పాత రూపాలను వదులు కోకుండా అంటిపెట్టుకొని ఉంటారు. సమర్పించుకోరు. పొందాలనే కోరికే! మరి అలా వీలుపడదుగా! తమను తాము లయించుకోవాలి. *అహాన్ని వదల్చుకోవాలి. అపుడు మాత్రమే ఆ తత్త్వము — అనంతశక్తి — ఆవిష్కరింపబడి తన భద్రపీఠాన్ని అలంకరించగలుగుతుంది.*

అసలు రహస్యం అంతా అందులోనే ఉంది.

ఉదాహరణకు — ఇక్కడ ఉన్న మానవాళి బలవంతాన దొరకపుచ్చుకొని పైకి ఎగబ్రాకా లనుకుంటుంది; ఇది చాలా తమాషాగా ఉంటుంది. కాని అసలు విషయం అది కానే కాదు. సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకొని మానవజాతి గ్రహించాల్సిందల్లా ఒక్కటే! తానుగా "నా" అనే అస్తిత్వమే లేకుండా వినమ్రంగా ఆత్మ సమర్పణం కావించుగోగల్గటమే!

నిజానికి తనకు తాను ఎటుల లయించుకోవలనో నేర్చుకోవటమనేది బహు కష్టతరమైనది.

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

మానవ ప్రయత్నం – నూతన శక్తి

ప్రశ్న: శ్రీమాతా! ఈ నూతన శక్తి స్వతంత్రంగా పనిచేస్తుందా? లేక వ్యక్తుల ద్వారా పనిచేస్తుందా?

ఈ రెండికీ భేదము లేదు. ఈ రెండూ పరస్పర విరుద్ధములు కావు. నూతన శక్తి వ్యక్తుల ద్వారా పనిచేస్తుంది. వ్యక్తులను ప్రేరేపించి పనిచేయిస్తుంది. వ్యక్తులను ఉపయోగించుకుంటుంది. వాళ్ళు ఇదంతా తమ గొప్పతనమే అని అనుకుంటే అది చాలా పొరపాటే అవుతుంది. దేవుడు పనిచేస్తున్నాడు గదా, ఇక నేనెందుకు చెయ్యాలి అని అనుకోటం ఇంకా ప్రమాదం. దివ్యశక్తి మానవ ప్రయత్నాన్ని కోరుతుంది. మానవ ప్రయ

త్నము దివ్యశక్తి సాధనములలో అత్యంత కీలకమైనది. దివ్యశక్తి ప్రేరణ వలననే మానవ యత్నము సాధ్యమౌతుంది.

మానవ అహంకారము దివ్యశక్తిని మొదట ఒప్పుకొనదు. "మానవా నీలోనున్నది, నీవు కావు" (దివ్యశక్తి) అంటే — అహంకారం దెబ్బతిని, "నా పనికి, నా శక్తికి గుర్తింపు లేకపోతే నేనెందుకు ప్రయత్నించాలి? ఎవరి కోసం ప్రయత్నించాలి" అని అహంకారంతో విర్రవీగిపోతాడు. అది సహజమే. కాని నిజంగా అలా జరగదు.

నువ్వు చెయ్యాల్సిన పని ఇది. నీ యావచ్ఛక్తితోటి దివ్యశక్తితో సంపూర్ణంగా సహకరించాలి. నీ ప్రయత్నాన్ని కొనసాగించాలి. "నాకంటె వెయ్యి రెట్లు అధికమైన శక్తి నా వెనకాల ఉండంగా నాకేల సందేహం? నేనైతే తప్పులు చేస్తానేమో గాని ఆ శక్తి అటుల గాదు. నాకు ప్రోద్బలమునిచ్చి నన్ను తన ఉపకరణముగా ఉపయోగించుకొంటుంది." అని అనిపించటం కేవలం ఊహ కాదు. నీకు నిజంగానే అట్లా అనిపిస్తుంది. "నాకు ఇక తప్పులు రానే రావు. నేను ఏది చేసినా చక్కని ఫలితములు కలుగుతాయి. నా వంతు ఇప్పుడు పనిచేయునది ఈ అల్పిష్టి మనస్సు కాదు. అత్యంత మహత్తరమైన శక్తి నా వెనక వుండి నా చేత పని చేయిస్తోంది" అని ఆనందంలో ఉరకలు వేయడమే.

అనువాదం: రంగనాథ ఆత్రేయ

మన సాధన ప్రయోజనం ఏమిటి?

ప్రశ్న: మధుమయీ! శ్రీఅరవిందులు, "విముక్తికీ పరిపూర్ణతకూ, సాధన అవసరమే కాని, అది వ్యక్తి ప్రయోజనం కొరకు కాదు, దైవకార్య సాధన కొరకు మాత్రమే." అన్నారు — కాని మనం సాధన చేయునది మన కోసం కాదా?

కానే కాదు. శ్రీఅరవిందులు ఇలా ప్రవచించడం, దైవ నిర్ణయాన్ని మానవుడే సాధించాలని, నొక్కి వక్కాణించడానికే

— మన సాధనా లక్ష్యం సంపూర్ణతయే కాని, వ్యక్తి ప్రయోజనమునకు ఎంతమాత్రము కాదు. దైవాన్ని ఆవిర్భవింప చేయడానికి, దైవకార్యమును నిర్వర్తించుటకు.

ప్రశ్న: *మనం దైవకార్యం ఎందుకు చేయాలి?*

అది దైవనిర్ణయం కనుక. మనది అంటూ ఒక నిర్ణయం లేదు. వ్యక్తిప్రయోజనం కోసం చేసే నిర్ణయం ఎప్పుడూ గురికి బారెడు దూరంలో ఉంటుంది. కనుక *"దైవము, దైవనిర్ణయము, దైవత్వ ఆవిర్భావము దైవవాక్కు", వాటి మీదనే మన దృష్టి. అవే మన — లక్ష్యం, గమ్యం — కాని స్వప్రయోజనం కాదు.*

స్వప్రయోజనం కోరి, యోగసాధన చేసే వారు, "రెండింటికీ చెడిన రేవన్నలు", "స్వామి కార్యం లేదు — స్వకార్యం లేదు. ఇంకా చెప్పాలంటే, ఆధ్యాత్మిక సాధకులలో, అందులో యోగాభ్యాసం చేసే వారిలో చాలామంది స్వప్రయోజనం కోరిన వారే! ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసులు, జ్ఞానులై ఇతరులకు బోధించాలనే ఆసక్తిగల వారు — ఇవి లక్ష్యాలు కారాదు. ఈ లక్ష్యాలను సాధించాలనే వారు కోకొల్లలు. కాని తమను తాము, భగవంతునికి సంపూర్ణంగా నిస్వార్థంగా, దైవాన్నే నమ్మి అర్పణ చేసుకొని యోగభ్యాసం చేసేవారు అరుదు.

అయినా ఈ అర్పణయే సత్యము — నిత్యము. పవిత్రము — పరిశుద్ధము. ఈ యోగమే నేరుగా లక్ష్యమును సిద్ధింప చేస్తుంది.

నీ ఉనికి, నీ లక్ష్యం భగవదర్పణ కొరకే — భగవన్నిర్ణయానికి కట్టుబడి ఉండటం, భగవంతుని నుంచి తాను వేరుకాదనే నమ్మకం సరియైన దృష్టి. ఇదే నీ జీవితాన్ని సరియైన త్రోవలో ముందుకు నడిపిస్తుంది. నీకు అన్ని కోణముల నుండి సంపూర్ణమైన రక్షణ ఉంటుంది. ముఖ్యంగా, "నీ నుండి నీకు" అంటే — నీ స్వార్థం నుండి, అహంకారం నుండి — రక్షణ కల్పిస్తుంది.

అనువాదం: రంగనాథ ఆత్రేయ

దైవసంకల్పము – మానవుని స్వలాభోపేక్ష

మానవుడు దైవానికి ప్రపంచానికి మధ్య వారధి. దేవుడు తన కార్యనిర్వహణమునకు తగిన ఉపకరణమును ఎంచుకొని తన శక్తిని అతనిలోనికి ప్రసరింప జేయును. దాని లౌకిక పరిణామములు ఆ మానవుని సామర్థ్యము మీద, కర్మపరాయణత్వము మీద ఆధారపడి ఉండును. స్వలాభోపేక్ష లేనివాడే, 'నేను' ను పూర్తిగా జయించిన వాడే దేవునికి చక్కటి ఉపకరణము కాగలడు. అట్టి మానవుని ద్వారా దైవము తన సంకల్పమును చక్కగా నెరవేర్చగలడు. ఓ మానవుడా ఇదే నీకు పిలుపు!

— సంపాదకుడు

అనంతశక్తి సంపన్నుడైన ఓ జగన్నాథా!
జగతిని అజ్ఞానాంధకారపు బారి నుండి తప్పించి నిత్య సత్య
సాక్షాత్కార భాగ్యం కలిగించే జ్ఞాన సర్వస్వమా!
హే జగద్గురూ! నీవే ఏకైక సత్యమువు, విశుద్ధ పరమాత్మవు.
కనుక ఓ స్వామీ! నా హృదయ మందిరం లోనికి, నా భావనా
శిఖరం పైకి,
నా ఆలోచనా లహరుల లోనికి, లేశమాత్రమైనా ఎటువంటి
తప్పిదములుగాని, పొరపాట్లు గాని,
అర్థరహిత వ్యాపకములుగాని, ప్రమాద సంభరితములు
ప్రాణాంతకములునైన అజ్ఞాన విన్యాసాలుగాని,
అనతిక్రమణీయ సంఘటనలు గాని కనులు గప్పి
ప్రవేశించకుండునట్లు దయజూపుము.
నీ అనుగ్రహముచే నేను దోషరహితునిగ, ప్రవిమలునిగ నుండు
నటుల జూడుము.

ఆచరణలో నీ సంకల్ప శక్తులకు, మానవ వ్యక్తిత్వం ఓ అనివార్యమైన మఱియు త్రోసిరాజనలేని మధ్యవర్తి.

ఆ వ్యక్తిత్వం ఎంత శక్తిమంతంగా, దృఢంగా నిశ్చయంగా, నిర్భయంగా, సంకీర్ణంగా, సంశ్లిష్టంగా, ఎంత స్ఫుటంగా

మఱియు చైతన్య సంభరితంగా వర్ధిల్లితే, అంత శక్తివంతంగా, ప్రయోజనకరంగా ఉపయుక్తంగా ఆ ఉపకరణం ఉపకరిస్తుంది. ఎనలేని సేవా సహాయ సహకారాల నందిస్తుంది. అయితే వ్యక్తిత్వం యొక్క సహజ నైజం వలనను, దాని ప్రత్యేక లక్షణాల కారణం గాను, అది తన విలక్షణమైన ప్రత్యేక అస్తిత్వమనే ప్రాణాంతక భ్రాంతి వలయంలో సులువుగా బందీ అవుతుంటుంది. తద్వారా క్రమక్రమంగా నీకు, నీ ఇచ్ఛాశక్తి నర్తనశాలకు మధ్య ఓ అడ్డు తెరగా పరిణమిస్తుంది. 'నేను — నాది' అన్న గాఢ వ్యక్తిత్వ భావన తెచ్చేతంటాలంతా, నెరపే దుష్ప్రభావమంతా, చేకూర్చే చేటుంతా, సృష్ట్యాది అభివ్యక్తీకరణలో కాదు. కృతజ్ఞతా భావ సమ ర్పణ లోనే, ఫలితాల నంకితం చేయటంలోనే, తిరిగి పొందిన సర్వస్వాన్ని సమర్పించటంలోనే కీలక సమస్య ఇమిడి ఉంది.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, నమ్మకమైన భృత్యునిగా అంకితభావం గల సేవకునిగా, అపారప్రేమ జూపే పరాభక్తునిగా నీ అనుగ్రహం వల్ల సమకూరిన శక్తులను నీకు పరిపూర్ణంగా చెల్లించక, ఆలోచనా రీతిని ఈ క్రింది విధముగా మార్చుకో వటం. "ఇదంతా సాధించినది నేను. ఇది నా కృషి ఫలితం — కృతజ్ఞతలు మరెవరికో ఎందుకు సమర్పించాలి. అవి నాకే చెందాలి." ఇలా ఆలోచించి పొందిన దాని కృతజ్ఞతాపూర్వ కంగా పూర్తిగా సర్వేశ్వరునికి సమర్పించకుండా ఆ శక్తులలో కొంత భాగాన్ని తన కొఱకు వినియోగించుకోవటం ఉపద్రవ కరమైన భ్రమ, యథార్థంకాని జ్ఞానం, అంధకారపూర్ణ అసత్యం. దొంగా దొరికి పోయావులే. ఇక నీ ఆట కట్టు. ఆచరణ సాఫ ల్యతా ఫలాన్ని, దాని ఫలితాలనన్నిటినీ ద్రోహచింతనతో తారు మారు చేసే, క్రమ క్రమంగా హరింప జేసే హానికరమైన చీడ పురుగది. కుటిల ఆలోచనా స్రవంతి అది. నీచ నికృష్ట మృగ భావన యది.

ఓ భూతేశా! ప్రియాతి ప్రియమైన నా హృదయేశ్వరా! మధుర హృదయా! మనోజ్ఞ స్వరూపా! సదా నన్ను వెన్నంటి నిలువుము. ఏకైక సత్యమైన నా ప్రభూ! నా నుండి 'నేను —

నాది' అన్న భావనను సమూలంగా రూపుమాపు. విశ్వేశ్వరా! విశ్వాధారా! ఈ సృష్టింపబడిన సృష్టి సజీవంగా మనుగడ సాగించినంత కాలం, నీ ఆవిర్భావానికి, అవతరణకు, ఈ జగతిలోన స్వయం వ్యక్తీకరణకు, నీ అభివ్యక్తీకరణకు ఈ 'నేను — నాది' తప్పనిసరి యని నా కిప్పుడు అవగతమయినది. ఈ అహంభావావశ్యకత నీ సృష్టికార్యానికి ఈ జగద్విలాస ఆవిష్కారణకి ఎంత అనివార్యమయినదో గాఢమయినదో తెలిసివచ్చినది, తేట తెల్లంగా.

'నేను — నాది' అన్న దానిని పూర్తిగా అదృశ్యం గావించినా, విడదీయలేని రీతిలో కరగ జేసినా, లేదా తగ్గించినా, బలహీనపరచినా, అది నీ స్వయం వ్యక్తీకరణకు, అవతారావిష్కరణకు పరిమితులు కల్పించినట్లవుతుంది, హద్దులు రూపొందించడమే అవుతుంది. వేరోవిధంగా చెప్పాలంటే ఆ ప్రక్రియను పూర్తిగా లేదా పాక్షికంగా నీకు లేకుండా చేయటమే అవుతుంది. అయితే అత్యావశ్యకంగా, అత్యంత తీవ్రంగా, మౌళికంగా, నిర్ద్వంద్వంగా, నిక్కచ్చిగా, సుస్పష్టంగా నిర్నిబద్ధంగా, అత్యంత భ్రాంతిమయమైన ఈ 'నేను — నాది' యన్న వింగడింపు భావనను, ఉద్వేగాన్ని, గాఢానుభూతిని అణచివేయాలి. ఇది ముఖ్యమైనది. అత్యంత మౌళికమైనది. ఎట్టి ఉదాసీనతా చూపరానిది. ఏ సందర్భంలోనైనా, ఏ క్షణాన నయినా, ఎట్టి పరిస్థితుల లోనైనా, నీకు భిన్నంగా, నీకు బాహ్యంగా 'నేను — నాది' అన్నది అసత్యమని, వేరుగా అది మనజాలదని, దానికెట్టి అస్తిత్వం లేదని, స్వయం ప్రతిపత్తి, శాశ్వతత్వం లేవని మేము మరువకూడదు. ఆ యథార్థ భావన — నీవు లేని 'నేను — నాది' లేనే లేదని, అది ఉత్తుత్తి భ్రమయని — నీవే నీవే నీ ఒక్కడవే సర్వమని, ఈ విశ్వసాకల్యమని, అంచేత సర్వసమర్పణ నీకేనని, మా తలపులనుండి తరలి పోకూడదు — హే భగవాన్! నిత్య సత్య స్మృతి మాలో నిత్యమవ్వాలి.

ఓ నా దైవమా! నా మధురహృదయేశ్వరా! ప్రాణనాథా! ఈ భ్రాంతిని నా హృదయం నుండి పారద్రోలుము. అలా చేయటం వలన ఈ నీ పరిచారకుడు, నీ అభిమాన భృత్యుడు, నీ

కత్యంత ప్రియాతి ప్రియుడైన లెంక, నిశ్శంకగా, నిశ్చయంగా, నిర్భయంగా, వినిర్మలుడై విశ్వాసపాత్రునిగా ఎదగ గలుగుతాడు. అలా రూపొంది విశ్వాసనీయంగా, వినమ్రంగా, సర్వసమర్పణా భావ పరిపూర్ణుడై సంపూర్ణంగా సర్వస్వమూ నీదికాన నీదైన సర్వస్వాన్ని నీకు పునరంకితం గావిస్తాడు, 'నేను — నాది' యన్న స్పృహ లేశమైనా మిగుల్చుకొనక. నిగూఢ నిశ్శబ్ద స్థితిని సంతరించుకొని, ఆ గంభీర మౌనముద్రలో పరికించి, పరిశీలించి ఈ మహత్తర అజ్ఞానాంధకార గాఢతను అవగతం గావించుకొని, ఆ తిమిరాన్ని ఛేదించి అజ్ఞాన వలయం నుండి శాశ్వతంగా నేను విముక్తినందేలా నా కార్యాచరణను తీర్చిదిద్దు. నా హృదయం నుండి అంధకారాన్ని పారద్రోలు. ఆ అంధకార శూన్య హృద యంలో ఎదురులేని నా హృదయాధి నాథునిగా నీ కాంతి మహోజ్జ్వలంగా వెల్లివిరియనిమ్ము.

అనుసరణ: అరవిందార్చన

సంపూర్ణ సమగ్ర సమర్పణ

చైతన్యసాకల్యం నీవు, సర్వవ్యాపకుడవు నీవు
తేజో విస్తృతి సర్వస్వం నీవు, సకలశక్తి సముచయము నీవు
సర్వ వస్తు సముచయాంతరాళాలలోని ప్రశాంతివి నీవు,
ప్రవిమల విశ్రాంతివి నీవు
విశుద్ధత్వాన్నీ విమలౌన్నత్యాన్నీ సంతరింప జేసే
దివ్యప్రేమవు నీవు, ప్రేమ సర్వస్వమౌ పరమాత్మవు నీవు.
అంధకారాన్ని జయించగల అనంత జ్ఞానానివి నీవు
అలోకంబౌ పెంజీకటి కవ్వల నేకాకృతి వెలుంగు వెలుగువు నీవు.

హే భగవన్! నీ నిగూఢత్వాన్ని సజావుగా, సమగ్రంగా, సాకల్యంగా, సువేద్యం గావించుకోవటానికి ఎవరైనా సరే, అపార ధర్మాంభోధి అంతరాళాల నుండి బయలు వెడలిన వారై ఉండాలి. తనకు తాను బంధవిముక్తుడై విశుద్ధునిగా రూపాంతరీకరించు

కోటానికి సాధన ప్రారంభించి ఉండాలి. విముక్తాకాంక్షతో సన్నద్ధుడై తనను తానెరిగి తనను తాను పరిపూర్ణంగా ప్రపత్తి గావించుకోటానికి తాను అసందిగ్ధంగా ఎదగాలి. ప్రస్ఫుటంగా తనను తాను ద్వంద్వాతీతం గావించుకోవాలి. విశుద్ధ మనస్కుడను కావలన్న ప్రగాఢ వాంఛ అకుంఠిత దీక్షలో అంతర్లీనమవ్వాలి. ఎవడైతే తనపై తాను సంపూర్ణాధికారము, స్వేచ్ఛ, నియంత్రణ కలిగి, తనకు తాను ఏకైక యజమానియై ఉన్నాడో అతడే అలా చేయగలడు. వ్యక్తిత్వం రూపొందుకొన్న తరువాత ఆ వ్యక్తి విశిష్ట లక్షణానుసారంగా, ఈ విశుద్ధ రూపాంతరీకరణ సాధనకు పరిసరాల నుండి నిరాకార నిర్గుణ నిరంజన సత్య తత్త్వ స్థితి ఆవిర్భవించటానికి ఎంతటి యత్నం, దీక్ష, కృషి, పోరాటం, పెనుగులాట అవసరమో ప్రస్ఫుటమవుతుంది. దానికి తోడుగా తనను తాను పరిపూర్ణ ప్రపత్తి గావించుకోటానికి నిత్య సత్య తత్త్వంతో విలీనమై అదే తానుగా అడుగిడటానికి ఇంకా ఎంతటి యత్నం, ఎంతటి పోరాటం అవసరమో అవగతమవుతుంది. స్వస్వరూప సాక్షాత్కార సిద్ధి సత్య తత్త్వావగాహనా పటిమపై, తద్వారా ఆవిష్కృతమైన విశిష్ట విశుద్ధ భావాచరణ స్థితిపై ఆధారపడి సఫలత నందుతుంది. నిశ్చల స్థితి, సర్వ సమర్పణా భావనా సిద్ధి.

చాలా తక్కువ సంఖ్యలో జీవులు స్వచ్ఛందంగా సంతోషంగా శ్రమతో కూడిన ఈ ప్రయత్న సాధనకు సన్నద్ధులవుతారు. ఎందుకంటే తద్వారా మరో విధమైన పరిష్కారం మృగ్యమని అవగతమవుతుంది. అలా నిత్యసత్యం ద్యోతకమైన తరువాత, ఊహాతీతమైన పశుప్రాయ సంఘటన లెదుర్కొంటున్న జీవితం మానవులను ఉద్దేశ రహితంగానే ప్రపత్తి మార్గం చేపట్టేలా చేస్తుంది. అంచెలంచెలుగా, క్రమరీతిలో కొలది కొలదిగా నీ కార్యక్రమం సకలావరోధాల కతీతంగా పురోగమించి పరిపూర్ణమవుతుంది.

ఓ పరమాత్మా! నిన్ను వేడుకొంటున్నాను. నా మొరనాలకించు. ఈ వ్యక్తిత్వంలోని సకల విభాగాలని విషయాలని,

కదలికలని పరిపూర్తిగా, సాధికారికంగా సువేద్యం గావించుకొనే పూర్ణచైతన్యాన్ని హస్తగతం గావించుకొనేలా నన్నాశీర్వదించు. అనుగ్రహించు, ఆ విధంగా నన్ననుగ్రహిస్తే నానుండి నేను విముక్తుడనవుతాను. నేననుకొంటున్న ఈ నేను నేను కానని తెలుసుకొంటాను. నీవే నేనని ఎఱుక గలిగి ఉంటాను. అప్పుడు నీవు మాత్రమే ఉనికి గలిగి చరాచర సుఖాభిలాషివై, ఈ అనంత చరాచర జీవుల మాధ్యం ద్వారా నీ సృజనను కొనసాగించ వచ్చు, నీ సంకల్పాన్ని సిద్ధింప జేసుకోవచ్చు.

ఓ అనంత శక్తి స్వరూపమా! అఖిలాధారా! మమ్మి సమస్త అజ్ఞానం నుండి విముక్తులను గావించుము. మా నుండి మమ్ము విముక్తులను గావించుము — తద్వారా నీ విఖ్యాత విరాట్ స్వరూపావిష్కార విభవ ద్వారాలను మేము విస్తృతంగా తెరచి ఉంచటానికి వీలవుతుంది.

అనుసరణ: అరవిందార్చన

బహు పరాక్!

ప్రశ్న: *శ్రీమాతా, కష్టపడి పనిచేస్తున్నప్పుడు మన లోపల నుంచి, "ఆహా! శభాష్ నేనంత గొప్పవాణ్ణి" అని వినిపిస్తుంది. అంతే, ఇక ఆ పని అయినట్లే! ఈ ప్రమాదాన్ని తప్పించటమెలా?*

నువ్వు పనిచేస్తున్నప్పుడు, "ఆహా, నేనెంత బాగా పని చేస్తున్నానో చూడు," అనే పొగరు ఉండకూడదు. నిన్ను నీవు ఎప్పుడైతే ఈ విధంగా ఆత్మస్తుతి గావించుకుంటావో అప్పుడు నీవు పతనమైపోతావు! నీ శక్తి ఉడిగిపోతుంది. ఇది మనుషుల అలవాటు. పని చేస్తున్నప్పుడు, పని చేయనప్పుడు తమను తాము గమనించుకుంటూనే వుంటారు. ఇటువంటి అలవాటు వలన పని దెబ్బతింటుంది. సహజంగా నడవక, దాని ప్రమాణం తగ్గిపోతుంది. నడక కుంటుపడుతుంది. ఇటువంటి ప్రమాదం నుంచి నువ్వు తప్పించుకోవాలంటే, "ఆహా నేనెంత బాగా పనిచేస్తు

న్నానో" అనే మెప్పుగాని, అహంభావము గాని, విమర్శనా దృష్టి గాని పనికిరావు. నిన్ను నీవు వీపు మీద చరచుకోనూ వద్దు, నువ్వు వట్టి దద్దమ్మవని నిందించుకోనూ వద్దు. దూషణ భూషణ ములు రెండూ అనభిలాషనీయములే. *నీలో భక్తి తత్పరతలు ఎంత ఎక్కువగా వెలిగిపోతూ ఉండాలంటే నీవే ఆ భక్తివైపోవాలి. భక్తి (ఆకాంక్ష) మాత్రమే భాసించాలి గాని భక్తుడు కాదు.*

ఈ విధమైన స్థితి ఒక్క నిమిషం కలిగినా చాలు. అది కొన్ని ఏళ్ల తపోఫలితంతో సమానము. *పనిచేస్తున్నప్పుడు ఆ పని మాత్రమే భాసించాలి. కర్త లుప్తమై పోవాలి. అనగా ఈ అహంకారి ఎక్కడా కనపడ కూడదు.* ఇక మనిషి లేడు. ఆకాంక్షజ్వాల మాత్రమే హృదయ కుహరంలోంచి ధగధగాయ మానంగా వెలిగిపోతుంది. తిన్నగా ఆకాశంలోకి చాల ఎత్తు లేస్తుంది. అపుడిక నీ సాధన శరవేగంతో పరుగిడుతుంది. నీవు చాలా దూరం పోగలుగుతావు. అటుల కానిచో, "అయ్యో ఎంత కష్టపడుతున్నానో," అనే స్వాత్మభావము, "ఫరవాలేదులే, ఇంత కంటే ఎవరు ఏం చేయగలరు, అది చాలులే," అని సంజాయిషీ చెప్పుకోవటం, నిన్ను నీవు సమర్థించుకోవటం — ఇటువంటి భావాలు వచ్చి అంతా సర్వనాశనమై పోతుంది.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

స్వీయ విస్మృతి మార్గం

(తమను తాము మరిచిపోవుట)

ఎవరైనా ఎప్పుడూ లేనంతగా పనుల్లో నిమగ్నం అయిపోయి తమను తాము మరవటానికి ప్రయత్నించవచ్చు.

ఏ పని చేసినా దైవార్పణంగా చేయాలి; మొత్తం పుణ్యం కోసం చేయాలి; సంపూర్ణంగా మొత్తం తమను తాము మరచి పోయేంత ఆత్మ సమర్పణ భావనతో చేయాలి. తాము చేస్తున్న పని మాత్రమే మనసులో భాసించాలి.

ఈ విషయం మీకిదివరకే చెప్పాననుకోండి — మీకు తెలుసు. ఏ పని కానివ్వండి, ఎంత చిన్న పనైనా కానివ్వండి — ఆడడం కావచ్చు; ఓ పుస్తకం రచించడం కావచ్చు; ఓ రంగుల బొమ్మ వెయ్యడం కావచ్చు; ఓ పాట పాడటం కావచ్చు; ఓ పరుగు పందెం కావచ్చు; ఏదవనివ్వండి. యిటువంటి పని ఏదైనా సరిగ్గా చేద్దామనుకుంటే, *మీరేపని చేద్దామనుకుంటున్నారో, అదే మీరై పోవాలి. అంటే ఆ పనిలో మునిగిపోవాలి; ఆ పనితో తాదాత్మ్యం చెందిపోవాలి; ఆ పనీ మీరూ ఒకటై పెనవేసుకోవాలి. ఆ పని వేరు, మీరు వేరు కాదు. 'మీరే ఆ పని'.*

చేస్తున్న ఆ పనిని చూస్తూ, పరిశీలిస్తూ, తాము 'వేరు' అనుకోవటం కాదు. ఆ వేర్పాటు భావంతో ఉండిపోయారను కోండి. అంతే, తమరు తమ 'అహంకారానికి' దాసులై పోతున్నా రన్న మాట — అన్న మాట కాదు; ఉన్న మాట. *అట్లా కాకుండా, మీరు, మీరు చేసే పనితో తాదాత్మ్యం చెంది విజయం సాధిం చేరనుకోండి; ఔను, అది అభివృద్ధే! అభ్యుదయమే! ప్రగతే!* ఎంత చిన్న పనుల విషయంలోనైనా సరే దీన్ని పాటించాలి.

ఉదాహరణకు — ఓ మరులు గొల్పే సంఘటన చూద్దాం.... మీరో ఒక సీసా నుండి మరో సీసాలోనికి నీరు మార్చి నింపా లనుకొంటున్నారనుకొండి. దానికి మీరు ఏకాగ్రత పాటిస్తారు. (మీరు అదో క్రమశిక్షణగా ప్రయత్నించవచ్చు ఓ గరిడీగా) బాగుంది; అయితే, మీరు నింపబోయే సీసాయే మీరైనప్పుడు, మీరేసీసాలోని నీరు మారుస్తున్నారో ఆ సీసాయే మీరైనప్పుడు, ఆ నింపుతున్న కదలికే మీరైనప్పుడు, మొత్తం ఆ క్రియంతా మీరే అయినప్పుడు, అంతా సవ్యంగా జరుగుతుంది, సక్రమంగా జరుగుతుంది. కాని, దురదృష్టవశాత్తూ, ఏదో క్షణంలో "ఆహా! యీ పని బాగానే జరుగుతోందే! నేను బాగానే నీరు పోస్తు న్నాను సుమా!" అని ఎప్పుడు మీరు అనుకోవడం మొదలు పెట్టారో అప్పుడు, మరుక్షణం నీరు ఒలికిపోతుంది; చిందేస్తుంది. అంచేత, ఏ విషయానికైనా అంతే, ఏ పని చేస్తున్నా యిది మామూలే! సారాంశం ఏమిటంటే, మనం ఏ పని చేసినా, ఆ పనే

తామైపోతే, పని సరిగ్గా జరుగుతుంది. 'నేను చేస్త న్నాను' అనే 'అహం' మధ్య వస్తే, పని 'గోవిందా! గోవిందా!' ఫటాఫట్, చిందైపోతుంది. ఏమంటారు? అందుకే, పని 'క్రమశిక్షణ' కు చక్కటి పనిముట్టు; సాధనం; మాధ్యమం కూడాను.

'ఎవరో యీ పని చేస్తున్నారు' అన్న భావంలో ఉండి పోతే, ఏ పనైనా సవ్యంగా సాగదు, జరగదు. ఇదిగాక, మీ ఆలో చనలు, మీ తలపులు పలాయనం చిత్తగిస్తే, చక్కర్లు కొట్టూంటే, మీలో, పగిలే వస్తువుల్తో పాటు పడుతున్నామనే భావన చోటు చేసికొంటే, అవి పగిలిపోవటం ఖాయం.

నిజానికి, మీరు వంట చేస్తున్నారనుకోండి, దేన్నో కాల్చేస్తారు; లేదా, బంతి ఆట ఆడుతున్నారనుకోండి, అన్ని బంతులూ గురి తప్పిపోతాయి; ఇదుగో, యిక్కడే, యిందులోనే, పని అంటే 'క్రమశిక్షణ', 'అనుశాసనం' అని తెలుస్తుంది. అంటే మీరే పని చేసినా, ఆ పనీ, మీరూ ఒకటి కానంత వరకూ, విజయం సున్నకు సున్నా, హుళ్ళికి హుళ్ళీ! *అంచేత మీరు బాగా పని చేద్దామనుకుంటే, 'యిది' మాత్రం ఏకైక మార్గం. 'ఇది' అంటే ఏది? పనీ, మీరూ ఒకటేనని చెయ్యడం.*

ఉదాహరణకు ఓ పుస్తక రచయితను తీసికొందాం. పుస్తకం రాస్తూ చూస్తూ, చూస్తూ రాస్తూ కూచున్నాడనుకోండి. ఆ పుస్తకం ఎంత జిడ్డుకారుతుందో ఊహించ లేమనుకోండి. అది పరిమితమైన మానవమేధనే ప్రతిబింబిస్తుంది కాని మానవా తీతమైన విలువలను గాదు.

ఓ చిత్రకారుడు ఓ వర్ణచిత్రాన్ని రచిస్తున్నాడనుకోండి. తను రచిస్తున్న బొమ్మను తనకుతానే పరిశీలిస్తూ, పరిశీలిస్తూ చిత్రిస్తున్నాడనుకోండి; ఆ చిత్రం ఎన్నటికీ 'గొప్పది' కానేరదు. అది ఆ చిత్రకారుని వ్యక్తిత్వానికి ఓ విధంగా ప్రతిబింబమే అవు తుంది; తనే అందులో వ్యక్తం అవుతాడు. దాన్లో 'జీవం' 'హుష్ కాకి!' అవుతుంది; కొట్టవచ్చినట్లుండదు. అంద విహీనం అవు తుంది. అలా కాకుండా, ఒక్కసారి, తాము వెల్లడి చేయాలను కున్న ఆ చిత్రమే తామై పోయారనుకోండి — ఆ కుంచె తామే,

వర్ణచిత్రం తామే; ఆ కేన్వాసు తామే, ఆ చిత్రాంశం తామే, ఆ రంగులు తామే, ఆ విలువ తామే, ఆ భావం తామే, తుదకు ఆ సర్వస్వం తామే అయి, అందులోనే నిమగ్నమై జీవిస్తే, ఆ చిత్రం 'దివ్యం' అవుతుంది. బ్రహ్మాండంగా భాసిస్తుంది.

అంచేత, అన్నిటికి అన్నింటికి మంత్రమొక్కటే! సవ్యంగా చెయ్యాలే కాని, ఏ పనైనా సరే యౌగిక క్రమశిక్షణ కాకుండా ఉండనేరదు, మరల ఏదైనా సరిగ్గా చెయ్యలేకపోతే, 'తపస్సు' సైతం ఎందుకూ పనికి మాలిందైపోతుంది సరికదా మిమ్మల్ని ఏ గమ్యానికీ చేర్చలేదాయె! ఏమంటే మళ్లీ అదే గతి! మీరు చేస్తున్న తపస్సును మీరు పరిశీలిస్తూ, నిరంతరం గమనిస్తూ, "నేను ఏమైనా అభివృద్ధి సాధిస్తున్నానా? దీన్నింకా మెరుగుపర్చ గలనా? నేను విజయం సాధించగలనా?" అన్న మీమాంసలో పడిపోయారో, అది మీ అహంకారమే! ఫలితం మీకు తెలుసా! అది 'ఇంతింతై వటుడింతింతై' అన్నట్లు విజృంభించి, సర్వత్రా వ్యాపించి, మరింకే దానికీ తావీయకుండా చేస్తుంది.

ఎవరికి వారు 'వైశాల్యం' పెంచుకోవాలి; తలుపులు తెరచుకోవాలి. అంటే తమ సొంత వ్యక్తిత్వం వైపు దృష్టి సారించడానికి బదులు తాము చేసే పని పైనే పూర్తి ఏకాగ్రచిత్తులై, ఆ పనే తామైపోవడం ఉత్తమోత్తమ మార్గం.

స్వేచ్ఛానువాదం: *సాహితీ కౌముది* పి. మోహన్

ఆత్మవిస్మృతికి తొలిమెట్టు

" విశ్వము నీకోసమే వున్నది. నీవే దానికి కేంద్ర బిందువు. ఈ విశ్వమంతా నీ చుట్టూ ప్రదక్షిణం చేస్తోంది," అనే భావానికి మనసా వాచా కర్మణా, ఏమాత్రం చోటు ఇవ్వరాదు. నీవు సమస్త విశ్వానికి చెందినవాడివి — అందులోని భాగము. అందు కని నీవు దాంతో తాదాత్మ్యం చెందవచ్చు. అయితే విశ్వానికి

ప్రభువు, కేంద్రము ఆ విశ్వేశ్వరుడే. ఆయన విశ్వాన్ని తనలోనూ ధరిస్తాడు. దాని కతీతుడూ కూడాను.

*

'పుచ్చుకోవడంలో' ఉండే ఆనందం కన్న 'యివ్వడం' లో ఉన్న ఆనందం మిన్న అన్నది అభ్యసన మార్గంలో తొలిమెట్టు.

తమను తాము మరచిపోవడమే అవిచ్ఛిన్నమైన శాంతికి మూలమని అప్పుడు క్రమంగా ఎవ్వరైనా తెలిసికొంటారు. అనంతరం ***'స్వీయ విస్మృతి'*** లో (తమను తాము మరచిపోవడం) 'దివ్యత్వాన్ని' ఎవ్వరైనా సాక్షాత్కరింప జేసికోవచ్చు; అదే నిరంతరం అభివృద్ధి చెందే ఆనందానికి మూలం.

*

సాధారణంగా వ్యక్తి తన అహంకారానికి బందీ అవుతూ ఉంటాడు. ప్రతిసారీ ఆ వ్యక్తి బందిఖానా లాంటి ఆ సంకుచిత పరిమితుల గోడల్ని పగులగొట్టుంటాడు. మరల బహిరంగ వాయువుల్లోకి ప్రవేశిస్తాడు. దేని ద్వారా? — ఆత్మార్పణం ద్వారా — మరో మనిషి కోసమో, లేదా అతడి పరివారం కోసమో, దేశం కోసమో, తన ధర్మం కోసమో..... స్వీయ విస్మృతి ద్వారా అద్భుత ప్రేమానందాన్ని చవిచూస్తాడు ముందుగా. దైవంతో 'బంధం' ఏర్పడిందని తమలో 'ముద్ర' పడుతుంది. అయితే, అతి తరచుగా యీ బంధం క్షణికంగానే ఉంటుంది. ఏమంటే సాధారణంగా మానవాళిలో 'ప్రేమ' అన్నది అహంకార పూరిత కదలికల్తో వెంటనే సమ్మిళితమై 'దాని' పరువు తీస్తుంది; ఆ పరిశుద్ధ శక్తిని కొల్లగొట్టుంది.

*

'అహంకారం' మటుమాయమై, వైభవోపేతమైన పరమపద సామ్రాజ్యాన్ని సాధించటమే నిజమైన 'నిర్వాణం'. మరల యీ మార్గాన్నే, అనుకూల మార్గమనీ, ఆత్మార్పణ మార్గమనీ నేనంటాను. అది సమగ్రం. సంపూర్ణం. బేరసారాలకు లొంగనిది. కేటాయింపులు లేనిది.

సొంత విషయాలు ఆలోచించడం మానుకోవాలి. తమ కోసమే 'బ్రతకటం' విస్మరించాలి. వ్యక్తిగత విషయాల్ని పట్టించుకోకుండా ఉండాలి. అప్పుడు అనుపమానమైన, అతి గహనమైన ఆనందం కలుగుతుంది. అది అనంతం. కరుణా మయం. అతిశక్తివంతం; బ్రహ్మానందమయం; అతిప్రకాశమానం; పరమాద్భుత సౌందర్యవంతం. దీన్నే నిరంతరం స్మరించుకోవాలి.

అది మాత్రమే అభిలాషణీయము. దాన్ని గూర్చే మన తపన. మనకు ఉత్తమ సాధన. మిగతావన్నీ క్షణాలు లెక్కించు కోవటం కోసమే!

*

ప్రశ్న: మనని మనం మరచిపోవటానికి (స్వీయ విస్మృతి) అతి సులభ మార్గమేది?

అది ప్రతి మనిషి యొక్క వ్యక్తిత్వంపై సహజంగా ఆధారపడి ఉంటుంది. ప్రతివారికి తమకు తాము మరచిపోయే ప్రత్యేక మార్గం ఉంటుంది. ఏది తమకు ఉత్తమమైన మార్గమో తమకే అవగతమౌతుంది. కాని కొన్ని సామాన్య సూత్రాలున్నాయి. వాటిని వారివారికి తగిన రీతిలో అన్వయించుకోవచ్చు. స్వీయ విష యాల్లో మునిగిపోవటం బదులు ఏదైనా ఒక వేరు వ్యాపకంలో నిమగ్నం అయిపోటం, ఇంకొకరి లేదా యితరుల విషయాల్లో తల మునకలవటం; లేదా ఏదో కర్మలో లీనమై పోవటం; ఏకాగ్రత కోరే అభిరుచిగల క్రియల్లో విలీనం కావటం మంచిది.

తనను తాను బుజ్జగించుకోరాదు. గతాన్ని త్రవ్వు కొంటూ నెమరువేసి కోరాదు. కలవరపడరాదు. కల్లోలితం, ఆందోళితం కారాదు. వాటికి బదులు, విశ్వంలో అత్యంత అమూ ల్యమైన విషయాలపై మనసును కేంద్రీకరించాలి. తనను తాను వ్యక్తపరచుకోవాలి. ఏదో ఒక మంచి పనిలో నిమగ్నమైపోవాలి. స్వార్థం లేని యింకేదో పనిపై కేంద్రీకరించాలి. అప్పుడే, అది తమను తాము మరచి పోవడానికి అది అతిసులభమైన మార్గం అవుతుంది.

*

మన కర్మల్లో మనల్ని మనం మరచి పోయినంత మాత్రాన మనకు నిజమైన 'నిర్వ్యక్తిత్వం' సంక్రమించదు. ఈ విషయాన్ని మనసులో ఉంచుకోవటం అనివార్యం. కాని వీటినన్నింటినీ మించి, మనల్ని మనం మరచిపోతున్నామనే భావన కూడ రద్దు కావటమే అసలు రహస్యం.

సూక్ష్మంగా చెప్పాలంటే, మీరు నిజమైన 'వ్యక్తి రాహిత్యం' కావలనుకుంటే మీ మనస్సులో 'వ్యక్తిరహితత్వం' అనే భావన కూడ కదలాడరాదు.

*

ధైర్యంగా ఉండాలి. మీ గురించి మీరు ఎక్కువగా ఆలోచించకుండా ఉండాలి. ఏమంటే మీ 'చిన్ని అహంకారాన్ని' మీ పరధ్యానానికి కేంద్రం చేసికొంటున్నారు కాబట్టి. తృప్తి లేక దుఃఖ భాజినులౌతున్నారు కాబట్టి. అన్ని జబ్బులకూ విరుగుడు తమను తాము మరచిపోవడమే కదా!

*

మానవునకు దివ్యానందాన్ని అనుభవించే హక్కుంది. అందుకే గదా దేవుడు వానిని సృష్టించింది. ఏ అహంకార పూరిత చర్య అయినా దానికి శత్రువే. కేవలం నీ కోసమే దాని నన్వేషించావో (ఆనందాన్ని) అది నీకు దక్కదు సరికదా మరింత దూరమై పోతుంది. *నిన్ను నీవు మరచిపోవడం ద్వారా, ఆత్మార్పణం ద్వారా, ప్రతిఫలాపేక్ష లేకుండా ఉంటే నీవా దివ్యానందాన్ని పొందగలవు.* తద్వారా అది అంతటా, అందరి లోనూ ప్రకాశించవచ్చు. అప్పుడే ఆంతరంగిక శాంత్యానందాలు వెల్లివిరువగలవు. అవి నీ సొంతం కాగలవు. అవి నిన్నెన్నడూ వీడవు కూడ. వెన్నంటే ఉంటాయి.

*

ప్రశ్న: *స్వీయ విస్మృతి (తమను తాము మరచిపోవడం) కీ ఆత్మార్పణ కూ తేడా ఏమిటి?*

'స్వీయ విస్మృతి' అహంకారవర్జితమైన 'నిశ్చేష్ట స్థితి' కావచ్చు. కాని 'ఆత్మార్పణ' గతిశీలమైన సామర్థ్యము గలది — అది దైవీ

పరంగా అనుసంధానింపబడితే దాని విలువ సంపూర్ణం. అందులో 'ప్రేమ' అత్యంత పరిశుద్ధంగా ఉండి ఉన్నతోన్నత రూపాన్ని సంతరించుకొంటుంది.

మన ఉనికి సార్థకం కావాలంటే ఏకైక మార్గం — సంపూర్ణ ఆత్మార్పణమే — దైవార్పణమే!

స్వేచ్ఛానువాదం: సాహితీ కౌముది పి. మోహన్

మనస్సు యొక్క అజ్ఞానము, విజ్ఞానము

ఓ ఉదాత్త జననీ! నీ సహనం ఎంతో మహత్తరమైనది
తప్పులను సరిదిద్దడానికీ, తన భ్రమాప్రమాదాల కారణంగా
అజ్ఞానాన్ని విజ్ఞానమనుకొని తప్పుత్రోవలో పడిన వ్యక్తి యొక్క
అనిశ్చిత పురోగతిని చక్కదిద్దడానికీ,
నిన్ను చాదస్తురాలిగా, దూరదృష్టిలేని దానిగా అవతలికి
నెట్టేసిన వ్యక్తిని కూడా
సన్మార్గంలోకి మరలించి పురోగమించే శక్తి నివ్వడానికీ,
నీ కటాక్ష వీక్షణములను ప్రసరింప జేయుచుంటివి.
అతడు చంచలంగా ఇదమిత్థమని చెప్పలేకుండా,
కేవలం నామమాత్రంగా నిన్ను ప్రేమించానని ఒప్పుకున్నా,
నీ యందు పరిపూర్ణ విశ్వాసముంచడానికి
అతని అహంకార పూరితమైన మానస మంగీకరించదు.
అతడు నిన్ను నమ్మడు. నీ సారథ్యము నంగీకరించడు.
యథేచ్ఛగా వర్తిస్తాడు.
అయినప్పటికీ నీ కరుణార్ద్ర పూరిత మందస్మిత
వదనారవిందముతో నీవు పలికితివి.
"మానవుని గర్వానికి కారణమై అతనిని తప్పుత్రోవను పట్టించే
మేధాశక్తి ఏదైతే ఉన్నదో అదే మేధ పరిశుద్ధమై ప్రదీప్తమైనప్పుడు
అతనిని సుదూరము తీసికొని పోగలదు.
విశ్వ ప్రకృతిని అధిగమించి విశ్వేశ్వరునితోను,

విశ్వాతీతమైన దైవముతో కూడా అనుసంధింప జేయగలదు.
ఈ చీలిపోయిన మేధ అతని నుండి వేరైనందువలన,
విశ్వములోని కోటాను కోట్ల మేధలతో బంధనములేని కారణంగా
త్వరితగతిని ఉన్నతోన్నత శిఖరముల నదిష్ఠించగలదు.
ఓ దివ్యజననీ! నీ వాక్కు ఎప్పుడూ సుఖాంసనూ, శుభాశంసనూ,
ప్రశాంతినీ, వెలుగునూ ప్రసాదిస్తుంది.
ఉదార కరుణామయములైన నీ కరకమలాలు,
అపార జ్ఞానాన్ని ఆవరించిన చీకటి తెరలను తొలగిస్తాయి.
ఓ జననీ, నీ పరిపూర్ణ ధారణ వైభవమెంతో ప్రశాంతమైనదీ,
ఉదాత్తమైనదీ, శుద్ధమైనదీ!

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి; R.L.N శాస్త్రి

ఆరోగ్యపత్రం:

వ్యాధికి కారణం:
మనిషిలో సమతౌల్యము లోపించుట

ఉదరసంబంధమైన వ్యాధులకు చికిత్స చేసే ఒక వైద్యుని నేనెరుగుదును. ఇంచుమించు ఉదర వ్యాధులన్నీ నరాల ఉద్రిక్తతవల్లనే వస్తాయని ఆయన చెప్పేవాడు. చాలా మంది ధనవంతులు పని లేనివారు ఆయన దగ్గరకు ఎక్కువగా వెళ్ళే వారు. వారు వెళ్ళి "నా కడుపులో నొప్పిగా ఉంది, జీర్ణశక్తి తక్కువగా ఉంది" అంటూ ఏదేదో చెప్పే వారు. విపరీతమైన బాధలు నొప్పులు అన్నీ వారికే ఉన్నట్లు చెప్పే వారు. ఆయన అన్నీ శ్రద్ధగా వినేవాడు. ఆ విధంగా వచ్చిన ఒక స్త్రీతో ఆయన, "ఆ! నీ స్థితి చాలా సీరియస్‌గా ఉంది, మీరు మేడలో ఏ భాగంలో ఉంటున్నారు? క్రిందనే కదా? సరే, కడుపు నొప్పికి మీరు ఇలా చేయండి. ప్రతిరోజూ ఉదయం లేచి (ఫల హారం చేయకండి, అది మీకు మంచిది కాదు) బాగా పండిన ద్రాక్షగుత్తి నొకదానిని చేత పట్టు

కొని జాగ్రత్తగా బయటకు వెళ్ళాలి. వీధి గుమ్మంలోనుండి కాకుండా, కుర్చీపీట ఉపయోగించి కిటికీగుండా బయటకి వెళ్ళండి. వీధిలోకి వెళ్ళిన తరువాత, రెండు అడుగులకు ఒకటి చొప్పున పళ్ళు తింటూ నడక సాగించాలి. ఎక్కువ తింటే కడుపునొప్పి వస్తుంది. కాబట్టి రెండు అడుగులకు ఒక్క పండు మాత్రమే తింటూ నడవాలి. పళ్ళన్నీ అయిపోయేవరకూ ఆ విధంగా నడవాలి. చాలా పెద్ద గుత్తి తీసుకోడం మరచిపోకండి. ఇటూ అటూ కాకుండూ తిన్నగా నడవాలి. అన్నీ అయిపోయాక నిశ్శబ్దంగా తిరిగి రావాలి. నడిచే రండి, లేకపోతే అంతా మొదటికి వస్తుంది. మీరు ఆ విధంగా చేస్తే, మూడు రోజులలో తప్పక నయమౌతుందని నేను హామీ ఇవ్వగలను" అని చెప్పారు. ఆ విధంగానే తగ్గిపోయింది!

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది వెంకట్రామశాస్త్రి, అమరవాది ప్రభావతి

తల్లిదండ్రులకు:

పిల్లల పెంపకము

తనను తాను తెలుసుకొని తనపై ఆధిపత్యం సంపాదించడమనేది ఒక అమూల్యమైన సంపద. తనను తాను తెలుసు కోవడమంటే తను చేసే చర్యలకూ, ప్రతిచర్యలకూ వెనకనుండే ఉద్దేశ్యాలను తెలుసు కోవడం, తనలో ఏది ఎందుకు ఏ విధంగా జరుగుతుందో కనిపెట్టడము. తనపై తాను ఆధిపత్యం వహించడమంటే తాము ఏమి చేయాలని నిర్ణయించుకుంటారో అది తప్ప వేరొకటి చేయకపోవడం. తనలో విజృంభించే ప్రేరణలను, కోరికలను, ఇచ్ఛకాలను అనుసరించక పెడచెవిని పెట్టడం,

పిల్లలకు నీతిపాఠాలు చెప్పడం అంత అభిలషనీయం కాదు. కానీ అవి చెప్పకుండా ఉండలేము. పిల్లలు పెద్దవుతూంటే కొంతవరకూ నైతిక, సాంఘిక కట్టుబాట్ల ఆవశ్యకతను తెలియ

చెప్పవచ్చు. అలా చెప్పటంవల్ల వారు తమలోని ఉన్నతమైన, సత్యమైన మూలధర్మాన్ని తెలుసుకోగలరు. కాని ఇది తెలుసు కోటం శ్రమతో కూడిన పని అని వాళ్లని హెచ్చరించాలి. కొంత మంది వాంఛాలోలురై విచ్చలవిడిగా ప్రవర్తించే వాళ్లు ఉంటారు. అట్టి వారు "మేము నైతికధర్మాలకు కట్టుబడి ఉండము" అని ప్రగల్భాలు పలకటంతో వాళ్ల అసలు రంగు బైటపడిపోతుంది.

సాంఘిక కట్టుబాట్లను, నైతిక నియమాలను నిర్ణయించే అధికారం అందరికీ ఉండదు. వాటిని మించిన స్థాయిని అందు కున్న వారికే ఆ హక్కు ఉంటుంది. వాటిని తోసి పారేయడం సాధ్యం కాదు. అంతకంటే గొప్ప ధర్మాన్ని స్థాపించ గలిగితే గాని, దానిని త్రోసి పారేసేందుకు వీల్లేదు. కాని అది అంత తేలిక గాదు.

ఏది ఏమైనప్పటికీ ఒక బిడ్డ కివ్వగలిగిన అపురూప కానుక తనను తాను తెలుసుకొని తనపై ఆధిపత్యం సాధించడ మెలాగో తెలియచెప్పడమే.

*

సూపర్‌మేన్ స్థాయికి ఎదగాలంటే రెండు నియమాలు అని వార్యం. అబద్ధాలాడకుండా ఉండటం; తనపై తాను నిగ్రహించు కోగలిగి ఉండటం.

మూలం: శ్రీమాత

అనువాదం అమరవాది వెంకట్రామశాస్త్రి; అమరవాది ప్రభావతి

ఒక వృత్తాంతము:

నరుడు – వానరుడు

అది ఉత్తర ఆఫ్రికాలోని ఆల్జీరియా –

అక్కడ ఒక ఊళ్ళో కొంతమంది అధికారులు ఒక కోతిని చేరదీసారు. ఆ కోతి వారితో పాటే ఉండేది. దాని ఆలనా – పాలనా, అంతా ఆ అధికారులే చూస్తూండేవారు. వారితో పాటే అది కూడ భోజనం చేస్తుండేది.

ఒక రోజు భోజన సమయంలో వారికి ఒక తుంటరి ఆలోచన తట్టింది. వారు అలవాటుగా మద్యాన్ని ఒక గ్లాసులో పోసి కోతికి కూడ ఇచ్చారు. అది ఇతరులు త్రాగటం చూచింది. ఇది ఏదో క్రొత్త పానీయమనే కుతూహలంతో ఆ గ్లాసునిండా వున్న ద్రాక్షసారాను త్రాగింది ఆ కోతి. ఫలితంగా దానికి చాలా జబ్బు చేసింది. ఒళ్ళు అంతా నొప్పులతో క్రిందా మీదా పడి పొర్లాడింది. ఆ విషం వల్ల దాదాపు చచ్చినంత పనైంది. అంటే, అలవాటులేని కారణంగా మద్యపానీయం యొక్క ప్రభావం ఈ శరీరం మీద ఏ విధంగా పనిచేస్తుందనేది యీ సంఘటన ప్రత్యక్షంగా రుజువు చేసిందన్నమాట.

కొద్ది కాలానికి ఆ కోతి కాస్త కోలుకొంది. మరల వారితో పాటు భోజనం చేయడం మొదలు పెట్టింది. తర్వాత ఒక రోజున వారిలో ఒకరు, గ్లాసులో మద్యాన్ని పోసి మరల కోతి ముందర పెట్టాడు. ఆ కోతి, పట్టరాని కోపంతో ఆ గ్లాసును తీసుకొని, ఆ ఇచ్చిన వాని మొహం మీద విసిరికొట్టి, తాను — వానరాన్నని, నరుల కంటే తెలివైన దానినని చెప్పకనే చెప్పుకున్నది. సారాయిలోను, పొగాకులోను విష పదార్థాలుంటాయి. అవి శరీర కణాలలోకి ప్రవేశించి వాటిని పాడు చేస్తయి. సారాయి శరీరం లోంచి పూర్తిగా విసర్జింపబడదు. మెదడులో జేరడం వలన అక్కడి కణాలు పనిచేయవు. మనుషులు పిచ్చివాళ్ళవుతారు. మద్యము అధికంగా సేవించటం వలన అది జీర్ణం కాకుండా మెదడులో ఉండిపోయి డెలిరియమ్ ట్రెమన్స్ — పిచ్చిని కలిగిస్తుంది.

మూలం: శ్రీమాత

(*'అర్క' సౌజన్యముతో*)

నిరంతరం నీవు దైవ సాన్నిధ్యంలో ఉన్న యెడల నీ ఆరోగ్యమునకు ఎట్టి భంగము కలగదు.

శ్రీమాత

స్త్రీలకు ప్రత్యేకం:

పురుషుని అధీనంలో స్త్రీ

పురుషుని అధీనంలో స్త్రీ జీవించడం, స్త్రీలను త్రోసిరాజని పురుషుడు ఆస్తిపై సర్వహక్కులు పొందడం — ఇది ఒకనాటి సాంఘిక జీవనంలోని ప్రత్యక్ష సత్యం. ఇటీవలి కాలంలో ఈ పరిస్థితిని శక్తివంతంగా సవాలు చేయడం జరిగింది. మగమృగప్రాయ మానవునిలో ఈ ఆధిక్యతా భావం ఎంత బలీయంగా మారిందంటే మతం, తత్వశాస్త్రం నుండి కూడా వాటికి ఆమోదముద్ర లభించింది. ఈ పురుషాహంకారం ఎంత మితిమీరిందో ఆంగ్లకవి మిల్టన్ ఇలా వర్ణించాడు — "భగవంతుని కోసమే పురుషుడు సృష్టింపబడ్డాడు. పురుషునిలోని దేవుని కోసమే ఆమె చేయబడింది" ఆహా! చూడండి వైపరీత్యం! ఈ భావన అవశేషాలు ఇంకా అనేక గట్టి పాశాలతో జీవితానికి అంటిపెట్టుకొని వున్న పాత శాసనాల సంకెళ్ళు, కొనసాగిన సహజాతాలు, సంప్రదాయ భావాల కొనసాగింపు వంటి బంధనాలతో ఈ అవశేషాలు వదిలి పెట్టక పోయినా, ఈ భావం కూడా మట్టిలో కలిసిపోతున్నది. తానే సర్వ స్వతంత్రురాలినని స్త్రీ తన హక్కును చాటుకొంటున్నది.

మూలం: శ్రీఅరవిందులు

ఇటీవలి కాలం వరకు మగవారు తామే గొప్పవారమని చాలా తృప్తిగా ఉండేవారు. ఒక శతాబ్దానికి పైగా స్త్రీలు నిరసన ప్రారంభించారు. అంతకు ముందు పురుషులకు వ్యతిరేకంగా ఒక్క మాట ఐనా ఎదురు చెప్పేవారు కారు. చెప్పడానికి వారికి అవకాశం కూడా ఉండేది కాదు. అయితే ఇటీవలి కాలంలో — పూర్వం రోజులలో కాదు — "క్షమించండి కాని మేము నిజంగా సంతృప్తి చెందలేదు" అని స్త్రీలు అనడం ప్రారంభించారు. అంతకు ముందు ఆ విధంగా అనడానికి సాహసిస్తే, బహుశా వారిని ఒక మొట్టికాయ వేసి, "నోరు కదపకు, అది నీకు సంబంధం లేదు" అని హెచ్చరించే వారు. ఏది ఏమైనా, స్త్రీలలో తిరుగుబాటు

వచ్చింది. శతాబ్దం చివరినాటికి, పురుషులు తమను హీనంగా చూడడం పట్ల బాహాటంగా నిరసనను స్త్రీలు వ్యక్తం చేశారు. పురుషులు చేసిన చట్టాలన్నీ పురుషులకే లాభం చేకూర్చడం, పురుషులు నిర్మించిన సామాజిక వ్యవస్థలన్నీ పురుషులకే ప్రయోజనం కావడంతో స్త్రీ ఎప్పుడూ నిమ్నస్థితి లోనే ఉండేది. ఒక్కొక్కసారి పూర్తిగా అయిష్టమైన స్థితిలోనే వుండేది. కొన్ని దేశాలలో ఇప్పటికి ఇదే పరిస్థితి కొనసాగుతున్నది.

నిరసన అందరికీ సంబంధించినది కాకపోవడం వల్ల, అప్పటిదాకా, ఒక వేళ వారు నిరసన చూపితే, అది వ్యక్తిగతం గానో, లేక చాటుమాటుగానో ఉండేది. గత శతాబ్దపు చివరి భాగంలో స్త్రీవాదం అనే ఉద్యమం వచ్చింది. స్త్రీలు తీవ్రరూపంలో పురుషాధిక్యతకు నిరసన వ్యక్తం చేయడం ప్రారంభించారు. "మమ్మల్ని మన్నించండి. అన్ని వ్యవహారాలలో మీరు విఫలు లైనారు. మీరు దేనినీ సక్రమంగా నిర్వర్తించ లేకపోయారు. మీరు చేసిందల్లా పూర్తిగా అధ్వాన్నంగా వుంది. మీలో మీరు కలహించుకోవడం, ఒకరి నొకరు చంపుకోవడం, ప్రతి ఒక్కరిని జీవితాన్ని భరించలేని విధంగా చేయడం తప్ప ఏదీ సాధించలేక పోయారు. మేము ఏదో చెప్పదలచుకొన్నాం. ఇది సరిపోదు. దీనిని మెరుగుపరచి తీరాలి" అని స్త్రీలు నిరసన వాణి వ్యక్తం చేసారు. ఈ విధంగా నిరసన ప్రారంభమైంది. ఇక నిరసన వెల్లువలు, పోరాటాలు, పరిహాసాలు.... మధ్యలో వేళాకోళాలు, వెక్కిరింతలు. స్త్రీలు కాదు, పురుషులే తమను తాము దద్దమ్మలుగా కించపరచుకున్నారు (శ్రీమాత నవ్వులు). చివరికి వారు ఒకటి మట్టుకు సాధించారు. ప్రభుత్వ వ్యవహారాలలో తమ మాట చెల్లుబాటు అయ్యేటట్లు చేసుకోగలిగారు.

ఒకప్పుడు పరువుకు సంబంధించిన విషయం అది. కాని ఇప్పుడు అంతా గుర్తించిన సత్యం. ఇతర దేశాలకన్నా కొద్దిగా వెనుకబడిన కొన్ని దేశాలలో ప్రభుత్వంలో చేరడానికి స్త్రీలకు అవకాశం ఇవ్వబడింది. నాకు తెలిసినంత వరకు స్త్రీలకు ప్రభుత్వ పదవులిచ్చిన తొలిదేశం స్వీడన్. ఈ శతాబ్దపు ప్రారం

భంలోనే నాకా విషయం తెలుసు. అప్పుడు స్వీడన్ పార్లమెంటు లోకి స్త్రీలు అడుగు పెట్టారు. ప్రభుత్వంలో చేరారు. వారు మొదటగా చేసిన పని మద్యనిషేదం. వారు ఎలాగో ఈ పని సాధించ గలిగారు.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

ప్రశ్నలు జవాబులు:

బాహ్య జీవిని[1] ప్రశాంతంగా ఉంచటం ఎలా?

(ఆశ్రమంలో ఒక విభాగంలో కొంత అపశ్రుతి ఏర్పడడం, దాని పర్యవసానంగా తనలో అలజడి రావడం గూర్చి ఒక సాధకుడు 1973, మార్చి 14 న శ్రీమాతకు వివరించాడు. సంభాషణ అనంతరం శ్రీమాత నుడివిన మాటలు ఇవి.)

నిజంగా అది కష్టాలతో గడిచిన కాలం. మనం 'చాలా' ప్రశాంతంగా, 'చాలా' ప్రశాంతంగా, 'చాలా' ప్రశాంతంగా, ఉండి తీర వలసినదేనని నా భావన. నా పాత మంత్రం గూర్చి చెబుతాను. వ్యక్తి బాహ్యచేతనను ప్రశాంతపరిచే మంత్రం:

ఓం నమో భగవతే

ఈ మాటలు మూడు. వాటి అర్థం:

ఓం — *పరమోన్నత జగత్ప్రభువును వేడుకొంటున్నాను.*

నమో — *ఆయనకు నా ప్రణామాలు.*

భగవతే — *నన్ను దైవంగా మార్చు.*

ఆ మంత్రానికి అనువాదం ఇది.

---

[1] ఆంగ్లమూలంలో Being అని వుంది: Being అంటే సత్తా అని కొందరు వాడుతున్నారు. ఆ పదం 'సత్' అనే ధాతువు నుండి వచ్చింది. ఆ పదం చదవటానికి వినసొంపుగా లేదు. సందర్భం బట్టి Being అనే పదం అర్థం మారుతుంది. మార్చుకోవచ్చు.

నా ఉద్దేశ్యంలో సర్వస్వాన్ని ప్రశాంతమొనర్చగల శక్తి ఆ మంత్రానికి ఉంది.

*

ప్రశాంతిలోనే ఎవరైనా తెలుసుకోగలరు. పనిచేయగలరు. అలజడిలో, హింసాధోరణిలో చేసేదంతా వైకల్యం, అవివేకం మాత్రమే. *మనలో దైవసాన్నిధ్యం యొక్క మొదటి సూచన శాంతి.*

ఇతర ప్రదేశాలలో కన్నా మరింత ఉత్తమ రీతిలో పని చేయడానికి, అతిమానస భవిష్యత్తుకు మనల్ని మనం సన్నద్ధం చేసుకోవడానికి మనం ఇక్కడ ఉన్నాం. దీనిని మనం ఏనాడూ మరిచి పోకూడదు. మన ఆదర్శాన్ని సాధించేందుకు వీలుగా, అందరిలో చిత్తశుద్ధి కూడిన సుహృద్భావానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

*

ప్రశాంతి అంటే జడత్వము అనుకుంటున్నావేమో. ప్రశాంతి అంటే స్వీయసంజనిత శక్తి, ప్రశాంత, చైతన్యశక్తి, చిత్తవృత్తి నిరోధం, అసంకల్ప స్పందనలపై సంయమనం.

పనిలో ప్రశాంతి సామర్థ్యానికి మూలం. పరిపూర్ణతకు అనివార్య నియమం.

మూలం: శ్రీమాత
అనువాదం: కె. యజ్ఞన్న

వందేమాతరం:

భారతదేశం వైరుధ్యాలకు పుట్టినిల్లు, నూతన సృష్టికి సిద్ధభూమి

విభేదాలన్నీ చివరికి సమసిపోయి వ్యక్తి హాయిగా జీవించగలుగుతూ ప్రగతి సాధించగలిగే ప్రపంచం కోసం అందరు కలలు కంటారు. మానవజాతి లోని ఉత్తమ గుణాలన్నిటినీ సమరస భావంతో సమన్వయపరచి, ఆలోచనా ఆచరణా ఒకటిగా, భావము

సృష్టి ఒకే చైతన్యంలో ఒకే ఆచరణలో, మిళితమై ఏకత్వం పొందే ప్రపంచం కోసం కలలు కంటారు.

అలాటి హార్షదాయకమైన సమూలమైన పరిష్కార స్థాయికి చేరేవరకు ఇతర దేశాల వలెనే భారతదేశం కూడా తీవ్ర వాదాలకి నిలయంగా, వైరుధ్య వైషమ్యాలకు వేదికగా మిగిలి పోతుంది. కాగా, ఒక విశ్వవిశాల సమగ్ర సమన్వయ సమ్మేళనం ద్వారా ఈ సమస్య పరిష్కరింపబడ గలదు.

నిజానికి, భారతదేశం లోనే కదా విశ్వసృష్టికారిణి, శత్రు సంహారిణి, సమస్త దేవతలకూ మాత, జగదీశ్వరి, వరప్రదాయని అయిన దివ్యమాత పట్ల అచంచలమైన భక్తి విశ్వాసాలతో పరి పూర్ణమైన గౌరవ ప్రతిపత్తులతో సమార్చన కావించడం గమ నించేది?

మరి అలాగే తీవ్రఖండనలు, స్త్రీల పట్ల, స్త్రీవాదం పట్ల తీవ్ర ధిక్కారం, ప్రకృతి, మాయ అంటూ పాడు భ్రమలు, పతనా నికి దైన్యానికి మోసానికి మాలిన్యానికి కారకాలై, దైవత్వానికి దూరం చేసి, భ్రష్టు పట్టించే ప్రలోభాలు — వీటిని కూడా భారత దేశంలోనే కదా మనం గమనిస్తున్నది?

భారతావనిలో జీవితం యావత్తూ కూడా వైరుధ్యాలతో కకావికలై, మనసు హృదయం గాయపడి సతమతమౌతుంది.


వైరుధ్యాలకి ఆలవాలమైన భారతభూమిలోనే వాటికి పరిష్కారం లభిస్తుంది. ఋషి పుంగవులు దర్శించిన సత్యలోక ప్రాప్తి కూడ ఈ పుణ్యభూమిలో జరగవలసినదే.

అధునాతన మానవాళి కష్టాలకు ప్రతీకగా నేడు భారత దేశం నిలిచి ఉన్నది.

భారతదేశం పునరుద్భవమై, మహోన్నతమైన సత్య జీవనం లోనికి పునరుద్ధీపింపబడి తీరుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వరులు; పున్నమరాజు నాగేశ్వరరావు



శ్రీఅరవిందుల స్మృతులు, అభిప్రాయములు

అఖిల

అఖిల భారత పత్రిక – ఆగష్టు, సెప్టెంబరు 2000



శ్రీఅరవిందులు

శ్రీఅరవిందుల స్మృతులు అభిప్రాయములు

(15 ఆగస్టు, 2000)

శ్రీఅరవిందుల 128 వ జన్మదినోత్సవము

విషయసూచిక

ఇంగ్లండులో బాల్య జీవితము

కలకత్తాలో ఆగస్టు 15, 1872 నాడు అరవిందుల జననం. తండ్రికి పాశ్చాత్య భాషా సంస్కారములంటే ఇష్టము, గౌరవము. ఇండియా నుంచి చదువు కోసం, ఇంగ్లండు వెళ్లిన భారతీయుల మొదటి విడతలో అతడొకడు — క్రియాశీలి — కార్యదక్షుడు. తన కుమారులు కూడా తన వరవడిలోనే ఎదగాలని నిర్ణయించినవాడు. కనుక అరవిందుని డార్జిలింగులో, ఐర్లాండు నన్సుల కాన్వెంటులో విద్యాభ్యాసమునకు చేర్పించినాడు.

ఇంగ్లండులో చదువు: 1879 లో అరవిందుని, అతని ఇద్దరు సోదరులను తండ్రి స్వయంగా లండనులో, డ్రెవెట్ దంపతుల ఇంట వసతి ఏర్పరచి, తన కుమారులకు, ప్రాచ్య — ముఖ్యముగా భారతీయ — సంపర్క సంస్కారముల నుండి దూరముగా ఉంచి, పాశ్చాత్య నాగరికతా సంస్కారములతో పెంచవలెనని ఆదేశించి నాడు. సోదరులను అచటనే 'గ్రామరు' స్కూలులో చేర్చగా, అరవిందుడు మాత్రము ఇంటనే డ్రెవెట్ పర్యవేక్షణలో, అతని బోధనతోనే 'లాటిన్' భాషను సునాయాసముగా క్షుణ్ణముగా నేర్చినాడు. గ్రీకు భాషను సెయింట్ పాల్ స్కూలు ప్రధానోపాధ్యాయుడు చక్కగా నేర్పి, అందులో దిట్టరిగా మలచి, స్కూలులో అతి తొందరగా పై తరగతులకు నెట్టినాడు.

మాంచెస్టరులో చదువు: స్కూలు పాఠములు అరవిందునికి కరతలామలకములు. చదువ నవసరము లేకనే ఉత్తీర్ణత పొందేవాడు. కనుక ఆ సమయములో అరవిందుడు ప్రాచీన గ్రీకు లాటిన్ గ్రంథములను, చదువుటకూ, ఆంగ్ల సాహిత్య పఠనమునకు, ఫ్రెంచి సారస్వత అధ్యయనమునకు వినియోగించెను. యూరోపియన్ చరిత్ర ఆదినుండి, మధ్య, నవీన యుగముల పర్యంతము చదివినాడు. ఇటాలియన్, జర్మన్, స్పానిష్ మూల గ్రంథములను ఆ భాషలలోనే చదువవలెనని, ఆ భాషలనుకూడా నేర్చినాడు. ఆంగ్ల కవిత్వము వ్రాయుటకు శ్రీకారము చుట్టినాడు. కింగ్స్ కాలేజీలో, లాటిన్, గ్రీకు భాషానైపుణ్యమునకు సంబంధిం

చిన పారితోషికములను పొందినాడు. ఇదంతా ఒక్క సంవత్స రములోనే!

సెయింట్ పాల్ స్కూలులో చదువుతున్నప్పుడు సోదరులు విడిపోవలసి వచ్చినది. మొదట వారు ముగ్గురూ, 'డ్రెవెట్టు' ముసలి తల్లి యింట ఉండేవారు. అరవిందుని సోదరుడు, మన్ మోహన్ నాస్తికుడు. డ్రెవెట్టు తల్లి క్రైస్తవమత ఛాందసురాలు. నాస్తికుడు ఉండే ఇల్లు నాశనమౌనని ఆమె నమ్మకము. వారి నందరిని ఇల్లు విడిచి పొమ్మని నిర్దేశించినది. మన్‌మోహన్ వేరే నివసించగా, అరవిందుడు, బినయ్ భూషణ్‌లు దక్షిణ కెన్సింగ్ టన్ లిబరల్ క్లబ్బులో ఒక గదిలో ఉండేవారు. అవి చాలా బీదతనము అనుభవించిన రోజులు[1]. తరువాత అరవిందుడు కేంబ్రి డ్జికి వెడలినాడు.

కేంబ్రిడ్జిలో పట్టా (B.A Degree) పొందుటకు అవసర మైన మొదటి పరీక్షను, అత్యధిక మార్కులతో ఉత్తీర్ణుడైనాడు. ఆ విశ్వవిద్యాలయ నియమముల ననుసరించి, పట్టా పొందుటకు ఆ యోగ్యత సరిపోవును కాని, మూడు సంవత్సరముల తరువాతనే ఆ పట్టా (B.A) నిచ్చెదరు. అది కూడా, అరవిందుడు కోరిన ప్పుడు మాత్రమే — అరవిందుడు ఆ డిగ్రీ ప్రయోజనము తనకు లేదని వదలివేసినాడు — ఇట్లు కేంబ్రిడ్జి చదువు ముగిసినది.

ICS విరమించుకొనుట

రెండు సంవత్సరములు ICS పరీక్షకు చదివి, అది పూర్తి చేయు టకు మనస్కరించక తప్పించుకొనుటకు నిశ్చయించెను. అతనికి పరిమిత జీవన విధానము, బానిస బ్రతుకు నప్పలేదు. తన కుటుంబ సభ్యులు, తాను ICS వదులుకొనుటకు ఒప్పుకొనరు కాబట్టి

---

[1] "ఒక సంవత్సరమంతా ప్రొద్దున ఒకటి రెండు సాండ్విచ్చులు, రొట్టె, వెన్న, ఒక కప్పు టీ; సాయంత్రం ఒక పెన్నీ ఖరీదు చేసే అల్పాహారము" — ఇదే మా ఆహారము (శ్రీఅరవిందుల మాటలు).

గుఱ్ఱపుస్వారీ పరీక్షకు హాజరగుట మానివేసి, ఆ అవకాశమును ఇచ్ఛికంగా జారవిడుచుకొన్నాడు.

1908 లో 'లెలే' ను దర్శించక ముందు, అరవిందుని ఆధ్యాత్మిక అనుభవములు

లెలేను దర్శించుటకు ముందు అతనికి కొన్ని ఆధ్యాత్మిక అనుభవములు కల్గినవి. అప్పటికి అతనికి యోగమును గూర్చి ఏమీ తెలియదు. ఉదాహరణకు, భారతదేశమునకు ఇంగ్లండులో చదివిన తరువాత వచ్చినపుడు, మొదటిసారి బొంబాయి రేవులో ఓడ దిగగానే, *అపోలోబందర్‌లో కాలు మోపగానే, "అనంత శాంతి" అతనిని ఆవహించినది.* ఈ అఖండ శాంతి కొన్ని నెలలపాటు అతనిని ఆవహించి యుండెను. కాశ్మీర్‌లో తక్త్-యె-సులేమాన్ శిఖరముపై నడచుచున్నపుడు, శూన్య ఆకాశ అనంతత్వము (vacant infinity) ను, (ఆత్మానుభూతిని) పొందెను: నర్మదా నదీ తీర దేవాలయంలో కాళికాదేవి సాక్షాత్కారమును పొందెను. బరోడాలో బండి దుర్ఘటన సమయంలో అంతరంగము నుండి దేవతా మూర్తి తేజము పెల్లుబికిన దృశ్యమును గాంచెను: ఇవన్నీ సాధన వలన కలిగిన అనుభవములు కావు. అంతరంగమున, తలవని తలంపుగా, ఏర్పడిన అనుభూతులే.

యోగాభ్యాసము: గంగామఠాధీశుని శిష్యుడు ఒకరు సూచించిన విధముగా, గురు సహకారము లేకనే, కష్టతరమైన ప్రాణాయామమును ప్రారంభించెను. దినమునకు ఆరు గంటల పైన మొదట అభ్యాసము చేసెడివాడు.

ఆయనకు యోగాభ్యాసము, రాజకీయ కార్యకలాపములు భిన్నములని తోచలేదు. అయినా గురుముఖముగా అభ్యసించవలెనని తలంచి, గురువు కొరకు వెదకులాడినాడు. ఒక నాగ సన్యాస సిద్ధుని కలసినాడు. ఆ సన్యాసి యోగ సిద్ధుడే — అతడు బారిన్ (శ్రీఅరవిందుల తమ్ముడు) కు, మంత్రచికిత్స చేసి, క్షణములలో మొండి వ్యాధిగా పట్టి బాధిస్తున్న కొండజ్వరమునుండి



శ్రీఅరవిందులు, బరోడా కాలోజీలో ఆచార్యులు
(1906)

విముక్తుణ్ణి చేసినాడు. అయినా, అరవిందుడు ఆ నాగసిద్ధుని గురువుగా స్వీకరించ లేదు. గంగామఠ బ్రహ్మానందుని కూడ కలసినాడు. అతని యోగశక్తిని మెచ్చుకొనినాడు — కాని అత నిని కూడా గురువుగా స్వీకరించలేదు. యోగసాధనలో లెలే ను దర్శించినంతవరకు అతనికి ప్రత్యక్ష గురువు లెవ్వరూ లేరు.
లెలే సలహా: "అంతర్యామికి సంపూర్ణంగా అర్పణ చేసుకొని, శరణు పొంది, దానికి దాసుడై, దాని సలహాను మాత్రమే పాటిం చగల సమర్థత ఉన్నప్పుడు, గురుసహాయమూ, సలహాలతో పని లేదు. అట్టి శక్తి నీలో ఉన్నదా? ఉంటే నా బోధన కూడా అవ సరము లేదు" అని అరవిందునికి లెలే తెల్పినాడు. దానినే తన ధ్యేయముగాను, సాధనగాను అరవిందుడు స్వీకరించినాడు. లెలే వద్ద అచిరకాలమే ఉండెను[2].

రాజకీయముల నుండి వైదొలగుటకు కారణము

నా ఆధ్యాత్మిక కార్యక్రమములకు, రాజకీయ జోక్యము ఉండ కూడదని తలచి రాజకీయములను విసర్జించినాను. నాకు కచ్చిత మైన, దైవాదేశ పిలుపు వినబడినది. దానిని నేను శిరసావహించి తిని. అంతేకాని రాజకీయములు నా కసాధ్యమను భయము వలన కాదు. భయము అన్నది నాకు ఏ కోశమునా లేదు. అయితే, నేను రాజకీయములను ఏ ధ్యేయముతో ప్రారంభించినానో, అది ఇక ముందు నా ప్రమేయము లేకనే నెరవేరగలదని నాకు పూర్తి నమ్మకము ఉన్నది. జయము మనదే, అది ఎవరి వలన అయితే నేమి? మిగిలిన ప్రపంచ రాజకీయ విషయములలో కూడా నా జోస్యము తప్పక నెరవేరగలదు — కొంత కాలము పట్టవచ్చును అంతే.

అక్టోబరు 1932

---

[2] ఇంతవరకు శ్రీఅరవిందులు తనను గూర్చి తాను ప్రథమ పురుషములో వ్రాసికొనినారు.

Bande Mataram

Weekly Edition.

PUBLISHED EVERY SUNDAY.

Price One Anna. **Price One Anna.**

VOL. I. CALCUTTA, SUNDAY, SEPTEMBER 29, 1907. NO. 18.

OUR PICTURE GALLERY.



SJT. AUROBINDO GHOSE.

భరతమాత

ప్రశ్న: మీరు భారతదేశమును "మాతృభావనతోనే సజీవ మాతృమూర్తిగా దర్శించగలను కాని, నిర్జీవ జడపదార్థముగా కాదని వ్రాసినారు కదా! అది నిజమేనా? లేక దేశభక్తి భావనా? కవితా చాతుర్యమా?"

మహాశయా! నేను భౌతికవాదిని కాను. నేను భారతదేశమును కేవలం ఒక మట్టిముద్దగానో లేక జనులకు నివాసభూమి మాత్రంగానో భావింప లేదు. అదే భావన అయితే, ఆ భూభాగము కొరకు శాసన ధిక్కారము చేసి పోరాటమునకు తలపడే వాడను కాను.

అది దేశభక్తి భావనా, కవితా చాతుర్యమే అంటారా! చూడండి, — రక్తమాంసములు, చర్మం, బొమికలు మాత్రమే మీరా? మనసు, అంతరాత్మ మీరు కాదా? అవి మీలో లేవా? వాటికి ప్రత్యేక ఉనికి లేదంటారా? ఆహార, గ్రంథుల చర్య వలన మాత్రమే ఆలోచన ఏర్పడిందనుకుంటే — కవితా చాతుర్యము, దేశభక్తి భావన కూడ అంతే.

స్వతంత్ర భారతం ఎదుర్కోవలసిన సవాళ్ళు

ప్రశ్న: ఈ మధ్య బెంగాల్‌లో హిందువులను, మహమ్మదీయులు చిత్రహింసలకు గురి చేయుచున్నారు. భారతదేశమునకు స్వతంత్రం వస్తే, ఈ మారణకాండ నిలిచిపోతుందా? నాదొక సందేహము. మీ అంచనాప్రకారం భారతదేశమునకు స్వతంత్రం వస్తుందా? భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమును విస్తరింప చేయడానికి భారత దేశము స్వతంత్ర దేశం కాక తప్పదని తెల్పినారు. మీరు ఆ దిశ లోనే పయనిస్తున్నట్లు అనిపిస్తున్నది. మీ ఆధ్యాత్మిక శక్తితో, నిజంగా ఆ పని చేయగల సమర్థులు మీరే అని నా నమ్మకం.

భారతదేశ స్వతంత్రం, ఎప్పుడో నిర్ణయమై పోయినది. అయితే ఏ విధంగా అనేది ఇంకా నిర్ణయించ వలసిన విషయం.

కాని స్వతంత్ర భారతం గమ్యం ఎటు? దాని ప్రయోజనం ఏమిటి? ఇవి దేశానికి ముందు ముందు సవాళ్ళు — ఫ్యాసిజమా? కమ్యూనిజమా? బోల్షివిజమా? గుండాయిజమా? పరిస్థితులు ఆశా జనకంగా లేవు.

16-9-1935

1910 జోస్యము[3]

1907 నుంచి మనం ఒక నూతన శకంలో ప్రవేశించాము. భారతదేశానికి మంచి రోజులు రానున్నాయి. ఒక్క భారతదేశం లోనే కాకుండా యావత్ప్రపంచంలో కూడా గొప్ప మార్పులు రానున్నాయి. దళితులు, దరిద్రులు ఉన్నతులౌతారు. వారిదే పై చేయి అవుతుంది. ఉన్నతులు దిగుతారు. జాతీ, మానవాళీ చైతన్య ప్రభావితులై, నూతన ఆలోచనలతో, కొంగ్రొత్త ప్రయత్నాలతో, మెరుగైన స్థితికి చేరుకుంటారు. ఈ విప్లవాత్మక మార్పుల ప్రభం జనంలో భారత్, స్వతంత్ర భారత్ అవుతుంది.

మానవ నైజము — తుది మాట

కేంబ్రిడ్జిలో ఒక పంజాబీ విద్యార్థి, "మనమంతా అబద్ధాలకోరు లమే" (we are all liars) అన్నాడు. అతను ఎంత నిశ్చయంగానూ, నిబ్బరంగానూ అన్నాడంటే ఒక తత్వవేత్త పలుకులాగ తోచి, మాకు మహాశ్చర్యం వేసింది. నిజానికి అతని ఉద్దేశం "మనమంతా న్యాయవాదులమే" (we are all lawyers) అని. అది ఉచ్చారణ లోపమే అయినప్పటికి నాకు మాత్రం మానవ నైజం గూర్చి

---

[3] జనవరి 1910 లో, కలకత్తాలో కృష్ణకుమార్ గృహములో ఒక తమిళ జాతీయపత్రికా ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రీఅరవిందుల వారు చెప్పిన జోస్యము. వారి అనుమతితో ప్రచురించబడింది.

గుది నిర్ణయంగా తోచింది. అంటే, మానవ నైజం గూర్చి దాని తరువాత చెప్పవలసినది ఏమీ లేదని.

అబద్ధాలు మూడు రకాలు. తెలిసి అబద్ధం చెప్పడం, (1) తెలిసీ తెలియక గొప్పలు పోవడానికి అబద్ధం చెప్పడం. మూడో (2) రకం ఏ ఆలోచనా లేకుండానే, తాను అంటున్నది ఏమిటో తనకు తెలియకుండానే అబద్ధమాడడం. అయితే వీరందరూ దురాచారులే! కొందరు సదాచార దురాచారులు. పాపాత్ములు కొందరూ. మరి కొందరు మిశ్రమం. అయితే హరిశ్చంద్రులు, సుకదేవులు లేరని కాదు — అలాంటి వారి కోసం కాగడా పట్టి గాలించాలి. దుర్లభం.

మనసు దోచే మధుర మందిరం — కాశ్మీరం

మీరు అన్నట్లు కాశ్మీరం నాకైతే భూతల స్వర్గమే. పర్వతాలూ, నదులూ, సరస్సులు, సరస్సులలో బద్ధకంగా ఊయలలూగే ఓడలు, ఓడల మీదే నివాస యోగ్యములయిన గృహములు.... కవికి ఇంతకు మించిన సౌందర్యం దొరకడం అరుదు. కొండల మీది నుంచి, బండల మీదినుంచి ఎగురుతూ దుముకుతూ దిగివచ్చే జీలం నది ఒడ్డున కవన కుతూహలం. అది మనసు దోచే మందిరం. కాని దురదృష్టవశాత్తు, రాత్రనక పగలనక పాలనా పరమైన పనులు చేస్తున్న గైక్వాడ్ ఒకడున్నాడు. నేను, నాలాంటి వారు మరికొందరు వ్రాసి యిచ్చే ఉపన్యాసాలు చదివి, ప్రజల మన్ననలు పొందే వాడు. ఆయనకు అదే స్వర్గము. ఎవరి యిష్టం వారిది.

మీరంటే మాకు భయం బాబూ

ప్రశ్న: అయ్యా! మీ అధిమానస లోకము (OVERMIND) ఎక్కడున్నదో మాకు అంతుచిక్కటల్లేదు. మిమ్మల్నడుగుదామంటే మీరసలే కనపడరు. హిమాలయ పర్వతం మీద సింహాసనం

వేసుకొని కూర్చున్నారు. 'ఈ చిరాకు కొమ్మన మిఠాయి పొట్లాన్ని' ఎలా అందుకోవాలో కాస్త సెలవిస్తారా.

ఏమిటి? ఏమిటేమిటి? నేను ప్రౌఢినా, సింహాసనమెక్కి కూర్చున్నానా. మీకు మతిపోలేదు కదా. మీకెవరికి ఇంగిత జ్ఞానము (common sense) ఉన్నట్లు లేదు. ఒక్కొక్కప్పుడు మన కదే మార్గదర్శక మౌతుంది. అధిమానస యాత్రకి కూడా అది పనికొస్తుంది. ఇంగిత జ్ఞానము అంటే తర్కము కాదు. (ఈ ప్రపంచములో తర్కమంతటి ఘోరమైన విషయము మరొకటి లేదు) — ఏ విషయాన్ని అయినా రాగద్వేషాలు లేకుండా యథా తథంగా దర్శించటమే.

23-2-1935

బాధ — ఆనందము

దివ్యానందమంటే ఏమిటో నీకు తెలుసా? తలకు గాని కాలికి గాని దెబ్బ తగిలితే నొప్పి పుడుతుంది కదా. అయితే ఆ నొప్పిని ఆనందంగా మార్చవచ్చు. నేనిటువంటి ప్రయోగాన్ని చేసి సఫలీ కృతుణ్ణి అయ్యాను. చాలా కాలం క్రిందట ఆలీపూరు జైలులో నన్ను గండుచీమలు కరిచినప్పుడు నాకిటువంటి అనుభూతి కలి గింది. బాధ, సంతోషము అనేవి కేవలం ఇంద్రియ జ్ఞానానికి సంబంధించిన విషయాలు మాత్రమే. నువ్వు ఇంద్రియ జ్ఞానాని కతీతమైనప్పుడు బాధ కూడా ఆనందంగానే మారుతుంది.

13-2-1932

నవంబరు 24, 1938 నాటి ప్రమాద సంఘటన

బహుశ నాకు తీవ్రమైన బాధానుభూతిని కలిగించేందుకే యీ ప్రమాదం సంభవించినదేమో! ఇంతవరకూ నేనుభవించిన బాధలు సామాన్యమైనవి. వాటినన్నింటిని ఆనందముగా మార్చుకోగలి గాను. కాని, యీ ప్రమాదం వలన కలిగిన బాధ చాలా తీవ్రమై

నది. ఈ ప్రమాదం అకస్మాత్తుగా రెప్పపాటు కాలంలో జరిగి, బాధించడం, అందునా బాధ తీవ్రంగా ఉండటం చేత, దానిని ఆనందపరవశంగా మార్చుకొనడానికి కొంత కాలం పట్టింది. అది ఎంత కాలమంటే, "ఓహో నాకు నొప్పి పుడుతున్నదే!" అని ఇంద్రియములు గ్రహించేంత వరకూ మాత్రమే. ఆ తర్వాత బాధ ఆనందంగా మారింది. ఈ ప్రమాదం జరగడానికి కారణం ముందు ముందు తెలుస్తుంది. ఇది నా సమరంలో ఒక ఘట్టమే.

11-12-1938

అసుర మర్దన

అసురశక్తులు నా దర్శనమునకు ఆటంకం కల్గించే ప్రయత్నం చేస్తూనే ఉండేవి. వాటి దాడులను త్రిప్పికొట్టడంలో కృతకృత్యుడనైనాను. ఈ పర్యాయము, శ్రీమాతను రక్షించుటలో నిమగ్నమై, అసురశక్తుల గూర్చి తలంచ లేదు. అవి నా మీదకే దాడి చేస్తాయని అనుకొన లేదు.

ఆశ్రమంలోని దుష్టశక్తులను నివారించడంలో అత్యంత సులభంగా సఫలీకృతుడనైనాను. కాని ప్రపంచంలో కూడ అసుర శక్తులను ఎదుర్కొనుటకు నేను చేసిన ప్రయత్నములు కొన్ని ఫలించినవి. కొన్ని ఫలించలేదు. స్పెయిన్‌లో అద్భుతంగా సాధించేను. జనరల్ 'మియాక' నా కార్యమునకు మంచి సాధనముగా కుదిరినాడు. దివ్యశక్తి పని చెయ్యాలంటే సాధనం సహాకరించాలి. 'బస్కు'లో ఏమీ ఫలించలేదు. 'నెగూస్' మంచి ఉపకరణమే. అతని అనుచరులు మంచి యోధులే కాని ఆయుధాలు కరువైనయి. ".ఈజిప్టు"లో ఫలితము దక్కలేదు. ఐర్లాండు, టర్కీలలో చక్కని ఫలితములు కలిగినవి. ఐర్లాండులో, నేను బెంగాల్‌లో ఏమి చెయ్యాలనుకున్నానో అదే చేసాను. టర్కీ దేశీయులకు నోరు లేదు.

14-12-1938

అనువాదం: రంగనాథ ఆత్రేయ

ప్రార్థన — ఫలితము

ప్రార్థనకు సంబంధించి నిక్కచ్చిగా ఏ నిబంధననూ విధించలేం. కొన్ని మొరలకు ఫలితం దక్కుతుంది. కొన్నిటికి దక్కదు. తార్కాణమా? — 'సంజీవని' సంపాదకులు మా పినతండ్రి కె.కె. మిత్ర పెద్దమ్మాయి ఏ విధంగానూ చిత్రాలు పోయే అమ్మాయి కాదు. మహిమలు మంత్రాల పిల్లా కాదు. పెద్ద ఊహాశక్తి అయినా లేని పిచ్చి మొద్దు. వైద్యులు తమ వద్ద గల అన్ని రకాల వనరుల్నీ వాడేశాక, తాము వాడిన మందులు మరి పనికిరావని పెదవి విరిచేశాక, ఆ అమ్మాయిని వొదిలేశారు. తండ్రి, "ఇక మిగిలింది దైవమే! 'నీవే తప్ప నితఃపరంబెరుగ' మంటూ మొరలిడుదాం. ప్రార్థనే శరణ్యం" అన్నాడు. అనటమే కాదు. ఆచరణలో పెట్టాడు. అంతే, మరుక్షణం నుండి అమ్మాయి తేరుకోవడం మొదలెట్టింది. సన్నిపాత జ్వరం హుష్ కాకి! ఆ చిన్నెలన్నీ చిందై పోయాయి. మృత్యువు సైతం దరిజేర లేక ఉడాయించింది. నా కిలాంటి సంఘటన లెన్నో తెలుసు. బాగు బాగు, మీరడగవచ్చు, అలాటప్పుడు మన మొరలన్నింటికీ సరియైన జవాబు లెందుకు రావని? కాని రావాలనేముంది? అదేమైనా ఒక యంత్రమా? ఒకవైపు నుండి ముడి పదార్థం వేస్తే మరోవైపు నుండి ఉత్పత్తి వచ్చినట్లు, యిటు మొరలిడితే అటు ఫలితాల్ని సరఫరా చేయటానికి! ఇదీ గాక, ఒకే సమయంలో అందరు రకరకాల కోరికలు — పరస్పర విరుద్ధములైన కోరికలను కూడా కోరుతే పాపం దేవుడికి కష్టమే అవుతుంది.

శివతత్త్వం

ఇంతో అంతో కొంత శివతత్త్వం తప్పని సరిగా ఉన్నా, నాకు మాత్రం శైవాదర్శం పట్ల ప్రత్యేకమైన మమకారం లేదు. ధనశక్తిపై వ్యామోహమూ లేదు, తిరస్కారభావమూ లేదు. ఎవ్వరైనా సరే యీ విషయాలను మించి యెదిగి పోవాలి. కచ్చితంగా అలా

ఎదిగినప్పుడే మనకు వాటిపై అధికారం ఉంటుంది. చాలా సుల భంగా వాటిపై పట్టు ఉంటుంది.

15-1-1936

గురుగిరి

మత నియమాలను 'తు' 'చ' తప్పకుండా పాటించటమే మతము అనుకుంటే ఛాందసులు కొంతమంది ఉంటారు. గురువు ద్వారా 'దైవకటాక్షము' (grace) లభిస్తుందని వాళ్లకి తెలియదు. కాని అది నిజము. సాధారణ మానవులు గురువులుగా తయారయితే వాళ్ళకి కొంచెం గర్వం రావచ్చు. అందుకనే నాక్కూడా గురువుగా తయారవటం ఇష్టం ఉండేది కాదు. కాని ఏమైందో చూడు. నాకీ గురుగిరి తప్పింది కాదు. విధి బలీయం!

16-1-1936

చందర్ నాగోర్ ప్రయోగం

ఆ సమయంలో నా మనసులో ఏదో ఒక అభిప్రాయం ఉండేది. బహుశా దాని వెనుక ఒక సత్యమున్నదని నాకు తెలుసు. అయితే అది సఫలమౌతుందనే నమ్మకం నాకు లేదు. ఏదైనా ప్రయత్నం చెయ్యాలని అనుకున్నాను. ఈ అభిప్రాయాన్ని మోతీలాల్‌కు చెప్పాను. అతను దాన్ని పట్టుకున్నాడుగాని తన ప్రాణికాహంకా రాల ప్రభావాల వలన అది మట్టి పాలయిపోయింది.

ఇటువంటి అనేక పాఠాలు నేర్చుకున్నాక నేను తొందర పడి కార్యరంగంలోకి దుమకకూడదని తెలుసుకున్నాను. ఈ యోగానికి మార్గం ముందే నిర్ణయింపబడి ఉండదు. ఒక్కొక్క మెట్టు అనుభవం ద్వారా ఆవిష్కారము కావాల్సిందే.

21-8-1926

త్రిశంకు స్వర్గం — గురుగిరి[4]

ఒకప్పుడు 'క' అనే వానిపై నాకు గొప్ప ఆశలు ఉండేవి. ప్రాణి కాన్ని (vital) పట్టుకొని సాధన చేసే వ్యక్తులు నేను చెప్పిన త్రిశంకు స్వర్గానికి (intermediate zone) చేరుతారు. అక్కడే ఉండిపోతారు. అంతకు మించి పోవ నిచ్చగించరు. ప్రాణికం ఒక అడవి లాంటిది. అటువంటి ప్రాణశక్తి గలవానిని రక్షించటం అత్యంత కష్టదాయకం. బలహీనులను రక్షించటం దానికన్న సులభం. దైవంలో తానున్నాడనీ, తనలో దైవమున్నాడనీ, దైవం హస్తాల్లో తానున్నాడనీ అతడు భ్రమించుకున్నాడు. అందుకని అతనితో కఠినంగా వ్యవహరించాల్సి వచ్చింది. అందుచేతనే అతడిక్కడ ఉండలేక పోయాడు. అతడు వెళ్ళిపోయి చుట్టూ ముప్ఫయి నలభై మంది శిష్యులను చేర్చుకొని గురువై పోయాడు — నా పేరు చెప్పి — అదే నాకు నచ్చలేదు. ఇటువంటి వ్యక్తు లకు గురుగిరి సులభంగా వస్తుంది. దురదృష్టవశాత్తూ అతడి ప్రాణికం పెరిగినంత శక్తివంతంగా, అతడి మనస్సు పెరగ లేదాయె! అతనిది పోరాడే స్వభావం — చింతనా పరునిది కాదు. తరచుగా అతనిపై యోగశక్తిని ప్రసరింప జేయటం జరిగింది. అప్పుడతడు తన తప్పుడు మలుపుల్ని కనుక్కుండే వాడు. కాని, వెంటనే ప్రాణికం వచ్చేసి అతని మనసుని ఆవహించి తప్పుదారి పట్టించేది. అతడి మనసు ఎదగాల్సినంతగా ఎదిగి ఉంటే, అలా జరిగేది కాదు. ప్రాణికం నుండి విడివడటానికి వ్యక్తికి బుద్ధి సహకరిస్తుంది. నిష్పక్షపాతంగా దాని కదలికలను గమనిస్తుంది.

22-12-1938

---

4 శ్రీఅరవిందుల వారి ప్రసంగ నివేదిక — సమర్పణ ఎ.బి.పురాని. (శ్రీఅరవిందుల వారితో సాయం ముచ్చట్లు — సం॥ 1982 పు. 154, 555)

బరోడాలో నాకు నిర్వాణానుభూతి కల్గినప్పుడు, నేను దేశం కోసం పాటుపడుతున్నాను గదా, నాలో ఏ కోరికా మిగల్లేదనే అనుకున్నాను. అప్పుడు నాలోగల ఆంతరంగిక కదలికలను ఎత్తిచూపించే ఓ కంఠాన్ని (అంతర్వాణి) వింటూండే వాణ్ణి. నేను కలకత్తా చేరినప్పుడు (1908) నాలోని విషయాలను వేలెత్తి చూపుతూ యీ గొంతును నేను విన్నాను. నాకు వ్యక్తిగత తృష్ణ ఉండేదని, ఆ విషయం నా ఎఱుకలో లేదని అది చూపింది. కాబట్టి యీ విషయాలు చాలా కాలం వఱకూ దాగియుండగలవు.

27-1-1939

అనువాదం సాహితీ కౌముది పి. మోహన్

సామాజిక మర్యాదలు — ఆధ్యాత్మిక జీవితం

చూడు బాబూ సామాజిక మర్యాదలు ఆచారాలు మామూలు జీవితానికి చెందిన విషయాలు. ఆధ్యాత్మిక మానవుడు తన దృష్టినంతా సాధన మీదనే కేంద్రీకరిస్తాడు. పైపై మెఱుగులకి ఆచారాలకి ఎక్కువ ప్రాముఖ్యత నివ్వక పోవచ్చును. యోగ సిద్ధికి ఆ లక్షణములు తార్కాణము కానేరవు. ఇంకా నయం పట్టు పీతాంబర ధారణ, భరత నాట్యము ఆ జాబితాలో జేర్చ లేదు. మామూలు జీవితంలో కూడ కొంతమంది సత్పురుషులు దయాళువులు బాహ్యాప్రవర్తనను లక్ష్యపెట్టక మోటుగా ప్రవర్తించవచ్చు. అటులనే కొంతమంది సాధకులకు మామూలు జీవితం మీంద పట్టు లేకపోవచ్చు. కొంతమంది మేధావులు వేషభాషలను గురించి నిర్లక్ష్యంగా వుండటం మనం చూస్తూనే వుంటాము. నేనె వరిని చూడనని ఉత్తరాలకి జవాబులివ్వనని నా మీద కూడా,

---

[6] పు 161

అభాండాలు వేస్తూనే ఉంటారు. తన దగ్గరకి వచ్చిన వాళ్ల మీద రాళ్లు విసిరే ఒక మహాపురుషుణ్ణి నేనెరుగుదును. పాపం వాళ్లని తప్పించుకుండేందుకు ఇంకొక మార్గం అతనికి తెలియలేదు. ఆ కారణంగా అతడు యోగి కాని, సిద్ధపురుషుడు కాని కాడని మనం అనలేము కదా. సమిష్టి జీవనంలో ఒకరి మీద ఒకరికి మర్యాద సుహృద్భావము అవసరమనే విషయం సాధకులు కూడా గమనించాలి. అయితే యోగములో సిద్ధికి గాని అంతరంగికానుభూతికి గాని అది చిహ్నము గాదు.

డిసెంబరు 1935

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

యౌగిక ప్రశాంతత – సాత్విక భావము

ప్రశ్న: యోగాభ్యాసము చేసి శాంతిని పొందిన వారు కొంత మంది ఉంటారు. కొంతమంది సహజంగానే సత్వగుణ సంపన్నులై యోగుల వలెనే శాంతంగా ప్రవర్తిస్తారు. అటువంటి వారిలోకి అప్రయత్నంగానే పైనుండి 'శాంతి' దిగి వచ్చి ఆవహిస్తుందా లేక అది వాళ్ల పూర్వజన్మ సుకృతమా?

వాళ్లు పరిణామ క్రమంలో మనస్సులో జీవించే స్థాయికి జేరుకొని ఉండవచ్చు. అయితే సాధనరీత్యా లభించే యౌగిక శాంతి మానసిక శాంతికంటె వెయ్యి రెట్లు గొప్పది. దాని ప్రమాణమే వేరు. మామూలుగా శాంతి వలన మనస్సు ప్రశాంతమౌతుంది. స్పష్టమైన ఆలోచనా శక్తి, ఇంద్రియాధీనత, క్రోపతాపాల కతీతముగా వుండుట దాని లక్షణములు. కాని యౌగిక శాంతి మరియొక దినుసు. అది చాల లోతైనది. గాఢమైన ఫలితములను కలిగిస్తుంది. మనిషిలోకి పూర్తిగా దిగినప్పుడు, అంతరంగంలో ప్రతిష్ఠితమైనప్పుడు, శిరస్సు పై ప్రదేశంలో అనంతమైన శాంతిని అందుకున్నప్పుడు, ఆ శాంతి నాలుగు వైపులా అనంతంగా వ్యాపించినప్పుడు, శరీరాగాథములలోకి చొచ్చుకొనిపోయి కణములలోకి ప్రవేశించినప్పుడు అనుభూతమయ్యే ఆ

నాంతిని ఏమని వర్ణించాలి? ఆ ప్రశాంతత చాలా లోతుగా విస్తృతంగా, చెప్పలేనంత ఘనీభూతంగా తుఫానులు, భూకంపాలు వచ్చినా చెక్కు చెదరకుండా వుంటుంది.

ఒకానొకప్పుడు నేను నువ్వు చెప్పినటువంటి సాత్విక మానవుణ్ణి. తరువాత పైనుంచి 'శాంతి' దిగివచ్చి శరీరంలో ప్రవేశించినప్పుడు సత్వగుణం పోయి నిర్గుణం వచ్చింది. పిదప నిష్క్రియత్వము పోయి త్రైగుణ్యాతీతముగా పరిణమించింది.

శారీరక పరిశ్రమ — శిక్షణ

కొంతమందికి పనులు చెయ్యటం ఇష్టముండకపోవచ్చు. కాని పనిచేసే సమర్థత ఉంటే పనుల మీద ఇష్టం దానంతటదే పుట్టుకొస్తుంది. పనిచేయటం ఇష్టముందా లేదా అనే ప్రశ్న కంటే అట్టి సామర్థ్యముందా లేదా అనేదే ముఖ్యమైన విషయము. పని చేయడం చేతకాని వారు తగిన శిక్షణ పొంది సామర్థ్యమును పొందవచ్చు. పనుల మీద అభిమానం పెంచుకొని రసానుభూతిని కూడ పొందవచ్చు. *ఈ యోగంలో పని చేయుట ఓ గీటురాయి అని చెప్పవచ్చు. ఎటువంటి పని ఇచ్చినా సరే ప్రీతితో స్వీకరించి దైవానికి సమర్పణా భావంతో నిర్వహించ గలగాలి.* ఒకప్పుడు నేను మనస్సుతోనే గాని చేతులతో పని చేయలేకపోయేవాణ్ణి. పిదప పనులను కూడ శ్రద్ధాభక్తులతో చేయటం నేర్చుకున్నాను. తద్వారా నాలో వున్న ఒక పెద్ద లోటును భర్తీ చేసుకున్నాను. ఈ భౌతిక శరీరాన్ని కూడ తీర్చిదిద్ది మంచి ఉపకరణంగా చైతన్యవంతంగా తయారు చేసేను. *మనిషి అన్నాక శారీరక కృషి కూడా చేయగలిగి ఉండాలి. అటుల కాని యెడల మనస్సు బరువెక్కిపోయి భౌతిక శరీరం శిథిలంగాను చాల అచేతనంగాను తయారవుతుంది.* ఏదైనా దెబ్బ తగిలినప్పుడో, జబ్బు చేసినప్పుడో, బలహీనంగా వున్నప్పుడో తప్ప శరీర పరిశ్రమను బొత్తిగా మానేయకూడదు. ఇదీ మన ఆదర్శము.

పనివాళ్ల మీద పర్యవేక్షణ, గోడౌను నిర్వహణ లాంటి కర్మలకు అధిష్ఠాత్రి ఎవరంటావా — కవిత్వ రచన, చిత్ర లేఖనములపై ఎవరైతే వున్నారో వారే, ఆ శక్తే — శ్రీమాతయే.

11-12-1934

ఒక చిట్కా

ప్రశ్న: నేను అదే పనిగా చదువుతూ ఉండటం వలన సాధనా విషయమై ఆలోచించేందుకే టైము లేదు. అవకాశమూ వుండట ల్లేదు. చదువుతున్నంత సేపు బాగానే వుంటుంది. కాని మానేసిన వెంటనే బుర్రలోకి ఆలోచనలు వచ్చి గొడవగా వుంటుంది. సాధన దృష్ట్యా ఇది అంత మంచిది కాదేమో.

నువ్వు చదువుతున్నప్పుడు కూడా సాధనను గురించి మరచిపోకూడదు. మనస్సులోని ఒక భాగంలో చిత్తకేంద్రీకరణ, సాధనాచింతన జరుగుతూనే వుండాలి. ఈ ప్రయత్నం సఫలమైనప్పుడు నీ మనసులో తగినంత సాధనా వాతావరణం ఏర్పడుతుంది. అప్పుడు బయట నుంచి నీ మీదికి దండెత్తి వచ్చే ఆలోచనలు ఆ నేపథ్యంలో కరిగిపోతై. మనస్సులోకి ప్రవేశించకుండా అక్కడికక్కడే ఆగిపోతాయి. *అవతల వేచియున్న నీలోని అవచేతనా శక్తులు* (subconscious forces) *విజృంభించి నీ పని పట్టిస్తాయి.* అంతేకాదు. అవి అవచేతనలోకి కూడా దిగి అక్కడ పీఠం వేసుకొని కూర్చుంటై. నా విషయంలో ఈ విధంగా జరిగినట్లు నేను గుర్తించాను. కనుక నువ్వు కూడా ఈ విషయంలో తగిన జాగ్రత్త తీసుకోగలవు.

27-5-1935

అవచేతనాత్మక కలలు

ప్రశ్న: ఇప్పటివరకూ నా కలలలో ఏమీ మార్పు లేదు. ఇంటి సంగతులు, తిండి విషయాలు, కొత్త వాళ్ళను కలుసుకోవటం,

తిరుగుతూ ఉండటం మొ॥ సాధారణ విషయాలే కలలలో కూడ ప్రత్యక్షమవుతున్నాయి. మూడేళ్ల నుంచి ఇక్కడ సాధన చేస్తున్న ప్పటికి ఈ విషయంలో ఏమాత్రం మార్పు రాలేదు ఎందుకని?

నువ్వు మరిచిపోయిన విషయాలు ఈ అవచేతనలో పాతుకుపోయి అక్కణ్నుంచి కలల రూపంలో ప్రత్యక్షమౌతుం టాయి. ఈ అవచేతన మహామొండిది. జీవితంలోని సంఘటన లన్నీ దానిలో ముద్రితమై ఉంటాయి. ఇటీవల నాకు కూడ నా పాతకాలపు స్వాతంత్ర పోరాటంలోని విషయాలు, బరోడా మహా రాజు దర్శనం, నేను 20 ఏళ్ళ నుంచి తలవని విషయాలను గురిం చిన కలలు వచ్చినై. మానవ జీవితం లోని గత చరిత్రనంతా ఈ అవచేతన తనలో నిలువ చేసుకోవడం బహుశ దాని కర్తవ్యమై ఉంటుంది. దానికి బుద్ధి జ్ఞానములు లేకపోవటం వలన వాటిని వదుల్చుకోలేదు. *పైనుంచి జ్యోతి దిగివచ్చి దానిని వెలిగించేంత వరకు ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంటుంది.*

17-12-1934

ఫ్రెంచి భాషా శిక్షణ

ప్రశ్న: ఫ్రెంచి భాష నేర్చుకుండే వాళ్లు చాలామంది అర్థం చేసుకోకుండా ఊరికే చదువుకొంటూ పోతారని తోస్తుంది. గబ గబా ఫ్రెంచి కథలు, ఇంకా నాటకాలు, నవలలు ఒకటేమిటి — చదివేస్తారు గాని భాషలోని సూక్ష్మ విషయాలు, మాధుర్యము లను గురించి పట్టించుకోరు. దీని బదులు ఒకే పుస్తకాన్ని మళ్లీ మళ్లీ చదువుతే బాగుంటుంది కదా. ఒకేసారి చాలా పుస్తకాలు చదవటం వలన అవన్నీ నిజంగా అర్థమైనట్లే అనుకుంటారు!

చాలామంది ఫ్రెంచి పుస్తకాలు చదివే ఉద్దేశంతోనే ఆ భాషను నేర్చుకుంటున్నారు గాని భాషా జ్ఞానం కోసం కాదు. ఫ్రెంచి భాషని చక్కగా నేర్చుకోవాలనే కుతూహలం వాళ్లకి లేదు. ఒక్కొక్క పుస్తకం చాలామాట్లు క్షుణ్ణంగా ఎంతమంది చదువుతారు? శాస్త్రోక్తంగా చదివే వాళ్లు చాల కొద్దిమంది

వుంటారు. కనీసం రెండు మూడు పుస్తకాలైనా ఆ విధంగా చదవాలి. నేను సంస్కృతం నేర్చుకొన్నప్పుడు మహాభారతం లోని నలోపాఖ్యానము అతి సూక్ష్మంగా చాలా సార్లు చదివేను.

25-3-1937

పరిచయాధిక్యత వలన లోకువ

ప్రశ్న 'ఓం శాంతి' 'paix' లాంటి మంచి మంత్రాల ప్రభావము పరిచయాధిక్యత వలన క్షీణిస్తుంది. ఇది నిజమేనా?

అవును అది నిజమే అనిపిస్తుంది. నేను ఉపనిషత్తుల లోని 'ఓం శాంతిః శాంతిః శాంతిః' మంత్రాన్ని మొదటిసారి వల్లించుకున్నప్పుడు ఎంతో మహిమగా వుండేది. ఫ్రెంచి భాషలో మంత్రాల విలువ ఆ శబ్దాల స్వరూపాన్ని బట్టి, కూర్పును బట్టి వుంటుంది.

యోగ సమన్వయము (The Synthesis of Yoga)

నేను 'యోగసమన్వయము' అనే పుస్తకాన్ని అందరు ఆచరించేందుకని ఉద్దేశించలేదు. ఒక్కొక్క మార్గము యొక్క ప్రత్యేక లక్షణమును వర్ణించి భిన్నమార్గములు ఎక్కడెక్కడ కలుస్తాయో సూచించేను. జ్ఞానమార్గముతో మొదలు పెట్టి కర్మ భక్తి మార్గముల ప్రయోజనములను ఎటుల పొందవచ్చునో సూచించాను. ఇతర మార్గములను గురించి కూడ ఇదే విధమైన సూచనల నందించేను. ఆత్మ పరిపూర్ణతా యోగము (Yoga of self-perfection) పూర్తి చేసాక అన్ని మార్గముల సమాగమము గురించి రాయాలనుకున్నాను కాని అది జరగలేదు. శ్రీమాత (The Mother), యోగదీపికలు అనే పుస్తకాలు సాధనను గురించిన సంపూర్ణ వివరణములు కావు — కొన్ని అంశములను మాత్రమే స్పృశిస్తాయి.

18-5-1936

గీతా వ్యాసములు

ప్రశ్న: మీ గీతా వ్యాసములను నేను మూడు సార్లు చదివేను. కాని మొన్న మళ్లీ చదివినప్పుడు కొత్త కొత్త విషయములు కనపడ్డాయి. ఇంకొకసారి చదివితే మరిన్ని కొత్త విషయములు కనబడటం తథ్యం.

లోతైన జ్ఞానమున్న పుస్తకాలన్నీ అంతే. ఆధ్యాత్మిక జీవనానికి సంబంధించిన విషయాలన్నీ భగవద్గీతలో సంక్షిప్తంగా చర్చించబడ్డాయి. నేను రాసిన వ్యాసములలో ఆ విషయములను గురించి క్షుణ్ణంగా వ్యాఖ్యానించేను.

1-11-1936

శ్రీమాత (The Mother)

యోగదీపికలు, యోగమూలములు, ప్రపంచ ప్రహేళిక అనే పుస్తకాలు నేను రాసిన ఉత్తరములు మొ॥ వాటి నుండి చేసిన సంకలనములు. 'శ్రీమాత' లోని మొదటి భాగము, నాలుగు శక్తులను గురించిన వివరణలు లేఖలు గాదు — విడిగా రాసినవి.

*

ప్రశ్న: 'శ్రీమాత' పుస్తక సమీక్ష నేను మీకు కొన్నాళ్ళ క్రిందట పంపించేను. చూసేరా లేదా?

చూసేను. సమీక్షను చదివితే అది ఒక వేదాంత గ్రంథమో లేక యోగాభ్యాస విధానముల సంపుటియో అనే అభిప్రాయం కలుగుతుంది. కాని దాని ముఖ్య లక్షణమది కాదు. *ఆ పుస్తకము యొక్క వాతావరణమే వేరు.*

1-3-1937

కర్మయోగి ఆదర్శము

ప్రశ్న: 'కర్మయోగి ఆదర్శము' గురించి నేను మీకు పంపించిన సమీక్షను చూసేరా?

చూసేను. రాజకీయాలలో పాల్గొనిన నాటి అరవిందుల వ్యక్తిత్వమే నేటి శ్రీఅరవిందులకు ఆపాదించటం పొరపాటు. నేనా పుస్తకాన్ని క్షుణ్ణంగా రివైస్ చేసేననియు, ప్రపంచ పరిస్థితుల మీద ఈ మధ్య నేను తాజాగా చెప్పిన అభిప్రాయాలు అందులో ఉన్నాయనియు చెప్పింది కూడా తప్పే. నేను 27 సంవత్సరాల క్రిందట చేసిన వ్యాఖ్యలను గురించి నాలో నేటికి కూడ ఏమి మార్పు రాలేదంటే నేనొక మందబుద్ధి నన్నమాట. ఇవన్నీ నీకు ఎవరు చెప్పేరు? నాకు ఇప్పుడున్న ఆధ్యాత్మిక చైతన్యము, జ్ఞానము అప్పుడు లేనే లేవు. తత్ఫలితంగా రాజకీయ విషయాల గురించి గాని, జీవిత సమస్యల గురించి గాని నా దృష్టి మారకుండా ఎట్లా ఉంటుంది? నేనా పుస్తకాన్ని అంత క్షుణ్ణంగా రివైస్ చెయ్యలేదు కూడా ఎప్పుడో రాసిన పుస్తకానికి ఇప్పుడు మెరుగులు దిద్ది సంస్కరించినా గూడా అది ఎందుకూ పనికి రాదు. 'యోగము దాని లక్ష్యములు' అనే పుస్తకం సంగతి కూడా అంతే. ఆ సమీక్షను చూసిన వారికి రాజకీయాలను గురించి తాజాగా నేను వెల్లడించిన అభిప్రాయములని తోస్తుంది. కాని చాల ఏళ్లుగా నేనటువంటి పనేం చేయలేదు.

21-4-1937

యోగము దాని లక్ష్యములు

ఈ పుస్తకం శ్రీఅరవిందుల సాధనలోని పూర్వకాలపు స్మృతులనే సూచిస్తుంది. ఇప్పుడు 20 ఏళ్ల తరువాత నా యోగము నేటి రూపాన్ని దాల్చింది. అందులో పాత విషయాలు కొన్ని మాత్రమే మిగిలి వున్నాయి.

28-10-1934

యోగ సాధన

నేను 'యోగ సాధన' అనే పుస్తకంలో వైరాగ్యాన్ని నిరసించి నట్లు నీ స్నేహితుడు రాసేడు. కాని ఆ పుస్తకం నాది కాదు. అందులోని విషయాలు నా యోగము యొక్క మౌలిక విష యాలు కానే కావు, అని ఎంత మొత్తుకున్నా వినకుండా ప్రచు రణ కర్తలు పుస్తకం మొదట్లో ఆ విషయాన్నే ఎత్తి చూపిం చారు. కాని అది నిజం కాదు[6] 30 ఏళ్ల క్రిందట ఒక తమిళ సిద్ధుడు ఉత్తరాది నుంచి (ఉత్తర యోగి) ఒక యోగి దక్షిణానికి వచ్చి తలదాచుకుంటాడని, పూర్ణయోగాన్ని ఆచరిస్తాడని అది భారతదేశానికి రాబోవు స్వాతంత్ర్యాన్ని సూచిస్తుందని చెప్పేడు. నన్నే ఆ యోగిగా గుర్తించటమైనది. తరువాత అతను చెప్పిన మూడు విషయములు నేను నా భార్యకు రాసిన ఉత్తరాలలో కనిపించినై[7].

ఇదీ సంగతి. అంతేగాని నేను మాయావాదినీ కాను, 'యోగ సాధన' నా రచనా కాదు[8]

తర్కము లేకుండా తత్వశాస్త్రము

ప్రశ్న: తర్కాన్ని గురించి మిమ్మల్ని ఒక ప్రశ్న అడగదలుచు కున్నాను. మీరు తత్వ శాస్త్రంలో శిక్షణ పొందలేదుట కదా? అయినప్పటికీ మీరు గొప్ప తాత్వికులు అయినారు. మరి మీరు 'ఆర్య' పత్రికలో రాసిన గొప్ప గొప్ప విషయాలు ప్రపంచక ములో ఇంకెవరూ రాయలేనంత గంభీరమైనవి కదా. మీరు

---

6 ఈ పుస్తకాన్ని 1927 తర్వాత నిలిపివేసారు.

7 ఆ సిద్ధుని శిష్యుడైన ఒక జమిందారు ఆ ప్రతిని తీసికొని, రచయిత పేరు 'ఉత్తరయోగి' అని పెట్టి తన ఖర్చుతో ఆ పుస్తకాన్ని అచ్చు వేయించాడు.

8 నేనది రాసేటప్పుడు మొదట్లోను, చివరలోను రాజా రామ్‌మోహన్‌రాయ్ ముఖం నాకు కనబడేది.

ప్రవచించిన నూతన సత్యమును గురించి నేను చెప్పటల్లేదు. ఆ వివేచనా శక్తి, హేతువాద పటిమ, వాదనా గాంభీర్యము, రచనా శిల్పములను గురించి నేను అడుగుతున్నాను.

తత్వాచార్యులు సాధారణంగా సుధీర్ఘమైన వాదనల ద్వారా వారి సిద్ధాంతాలను నిరూపించుకుంటారు. కాని నా రచనలలో అట్టి వాదనలు కనపడవు. అవి సర్వమును ఏకత్రాటి మీద నిలబెట్టే బహుముఖమైన జ్ఞాన సమాహారములు. అయితే అవి తార్కిక వాదన మీద కాకుండా సుస్పష్టమైన దర్శన సంపత్తిచే నిరూపించబడినవి.

4-11-1936

నేను వేదాంతిని కాను

ఏమిటి?మళ్లీ నన్ను కోరిన వెంటనే రచనలను కుప్పతెప్పలుగా తయారుచేసే యంత్రమువలె పనిచేయమంటావా? 'వందేమాతరం' 'ఆర్య' పత్రికలను నడిపించాల్సిన గండం గడచిపోయి ఇప్పుడు ఊపిరి తీసుకోగలుగుతున్నాను. ఇప్పుడు ఈ ఆశ్రమం తాలూకు ఉత్తరాల వర్షంతో సతమత మౌతున్నాను. అబ్బా ఇంకా నన్ను వేదాంత గ్రంథాలు, పాఠ్యపుస్తకాలు రాయమంటున్నారా!

ఇక తత్వ శాస్త్రం సంగతి — నేను నీకు ఓ విషయం చెప్పాలి. నేను తత్వ శాస్త్రజ్ఞుణ్ణి ఏమాత్రమూ కాను. మరి నేను చేసిన రచనలంటారా — అది వేరే విషయం. నేను యోగము నభ్యసించుటకు పూర్వము వేదాంతమంటే ఏమిటో నాకు ఊహ కూడ లేదు. ఇదివరలో నేను కవిని, రాజకీయజ్ఞుణ్ణి కాని వేదాంతిని మట్టుకు కాను. అయితే నేను వేదాంతిగా ఎట్లా మారేను? 'క' అనే ఆయన ఒక తాత్విక పత్రికను నడిపించేందుకు నా సహకారాన్ని కోరేడు. 'యోగి' అయిన వాడు ఎటువంటి కార్యాన్నైనా చేయగలగాలి అని నా మతము కాబట్టి నేనా ప్రతిపాదనను తిరస్కరించ లేకపోయాను. కాని ఆ తర్వాత ఏమైందో తెలుసా? నన్నిందులో ఇరికించి ఆ పెద్దమనిషి యుద్ధంలో జేరేం

దుకు వెళ్లిపోయేడు. ఇక ప్రతి నెలా వేదాంతాన్ని గురించి 64 పేజీలు రచించే బాధ్యత నా నెత్తిమీద పడింది. రెండో విషయం — నేను ప్రతి రోజు యోగసాధనలో దర్శించిన సత్యాలను మానవమేధకు అర్థమయ్యే రీతిలో గ్రంథస్థము చేసేను. కాబట్టి అప్రయత్నంగానే అది తత్వజ్ఞాన సహితంగా ఉంటుంది. అంత మాత్రాన నేను తత్వశాస్త్రజ్ఞుణ్ణి ఎట్లా అవుతాను?

కాని 'గ' అనే ఆయనకు ఈ కథనమంతా ఎట్లా చెప్పుకోను. నువ్వే ఆయనకు తగిన సమాధాన మియ్యి. "ఆయన చాల పనిలో వున్నారండి. ఊపిరి సలిపేందుకు కూడ వ్యవధి లేదు. ఒక వేళ మీకు మాట ఇచ్చినా కూడా దాన్ని నిలబెట్టుకోలేరేమో" అనే సమాధాన మేదో ఇచ్చేసెయి.

4-9-1934

వేదాంత గ్రంథముల రచన — పేరు ప్రతిష్ఠలు — ప్రచారము

'చ' అనే ఆయన నన్ను పుస్తకాలు రాయాలని బలవంత పెడితే నేనేమీ చేయలేను. మొదటి విషయం — వేదాంతాన్ని నేను బలవంతంగా రాయలేను. అప్రయత్నంగా ఏద్రైనా వచ్చినట్లయితే నాకు టైముంటే రాయగలను. కాని నా కిప్పుడు టైము లేదు. నేను చేతన, స్వతఃస్ఫురణము (intuition) లను గురించి నా దృక్పథాన్ని వివరించి చెప్పాలనుకున్నాను. కాని దానికేమాత్రం అవకాశం లేదు. అంతకంటె పైనుంచి చంద్రుణ్ణి దింపుకొని చంకని పెట్టుకొని — హనుమంతుడు సూర్యుణ్ణి దింపుకున్నట్లుగా — షికారు వెళ్లటం తేలిక. ఇప్పుడు ఆ చంద్రుడూ లేడూ షికారూ వెళ్లలేను. 'చ' అనే ఆయనకి నేను ఒక వేళ వాగ్దానం చేసినా కూడా దాన్ని నిలబెట్టుకోలేను. లేదని చెప్పటం కంటె అది మరీ ఘోరం.

రెండో విషయం ఏమిటంటే నేను పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడే వాణ్ణి కాను. నేను రాజకీయాలలో కూడా పేరు

కోసమని ఆశించలేదు. తెర వెనుక నుండి మనుషులను ముందరకు నెట్టి వాళ్లకి తెలియకుండానే పనులు చేయించుకుండే వాణ్ణి. కాని బ్రిటిష్‌వారు నా మీద నేరం మోపి నా పేరు పైకొచ్చే టట్టుగా చేసేరు. నన్ను నాయకునిగా గుర్తించారు. ఇంకో విషయం — ప్రచారమనేది పుస్తకాలు అమ్మేందుకు, రాజకీయ విషయాలకి మందులకి కావాలేమో కాని నిజంగా ఒక కార్యమును చేయుటకు అది విషం. ప్రచారం వలన అకస్మాత్తుగా ఆ వ్యవహారం ఒకసారి ఆకాశాన్ని అంటవచ్చు. తరువాత మట్టిపాలు కావచ్చు. లేదా ఒక ఉద్యమాన్ని లేవదీయవచ్చు. మన విషయంలో ఉద్యమమనగా ఒక మతాన్ని స్థాపించటం లేదా అటువంటి ఏదో ఒక భాగవత మౌతుంది. పనిలేని వాళ్లందరూ వచ్చి అందులో జేరుతారు. మన పని పాడైపోతుంది. ఇటువంటి అట్టహాసం వలన పైనుంచి దిగి రానున్న సత్యము భయపడి పారిపోతుంది అప్పుడు దాన్ని కిందికి దింపటం మరీ కష్టమౌతుంది. ఇప్పటి వరకూ వచ్చిన అన్ని 'మతాల' అంతా అంతే. అవి విఫలమైనందుకుకారణం అదే. కాని నన్ను గురించి కొంతవరకు రాయటం తప్పనిసరి అవుతోంది. ఒక నూతన సత్యం దిగి వచ్చినప్పుడు జన బాహుళ్యంలో కొంతమంది దాన్ని వ్యతిరేకించటం జరుగుతుంది. ఈ అసుర శక్తులని ఎదిరించేందుకు నన్ను గురించిన పరిచయం తోడ్పడుతుంది. దాని ప్రయోజనం అంత వరకే ప్రచారం మితి మీరితే ఫలితం దక్కదు. అయితే నాకు నా పేరు పైకి రాకూడదనే పట్టుదల ఏం లేదు. మన లక్ష్యసాధన కోసం ఉచితమైన ప్రయత్నం నేను చేస్తూనే ఉన్నాను.

ఇక నువ్వు చెప్పిన సమకాలీన తత్వశాస్త్ర గ్రంథమాల సంగతి — అది పాశ్చాత్య వేదాంతమైనా సరే భారతీయ వేదాంతమైనా సరే. — ఇటువంటి పుస్తకాలను తయారు చేయటం నిజమైన జ్ఞానాన్ని వెక్కిరించటమే అవుతుంది గాని ప్రయోజనముండదు. యోగనిష్ఠతో దార్శనిక జ్ఞానాన్ని పొందటమే నా వంతుగాని జనసామాన్యం కోసం పుస్తకాలు రాయటం కాదు. ఆ పనిని ఇతరులకు వదిలేసాను. ఒక వేళ పుస్తకాలు రాయటం

మొదలుపెడితే అసలు కార్యానికే భంగం కలుగుతుంది. మరో విషయం నేను చేస్తున్న కార్యమును తర్కశాస్త్రము అనే బదులు దార్శనిక సత్యము అంటే బాగుంటుంది. అది సఫలమైనప్పుడు దాని పర్యాప్తి తనంతట తనే కావించు కొంటుంది. అది విఫల మైనట్లయితే కేవలం ప్రచారం నిష్ప్రయోజనమే అవుతుంది.

ఇదీ నా అభిప్రాయం. ఆ పుస్తకం బయటకు రానీ ఎట్లా వుంటుందో చూద్దాం.

2-10-1934

ప్రత్యేక సంచికల లక్ష్యము[9]

ఈ ప్రత్యేక పత్రికల ప్రయోజన మేమిటి? నన్నొక వింత మృగ మల్లే పేపర్లలోకి ఎక్కించి ప్రజల నాకర్షించేందు కోసం కాదు కదా! పాఠకులకు నా యోగాన్ని గురించి, ఈ ఆశ్రమము యొక్క మూలసూత్రాల్ని గురించి కార్యకలాపాల్ని గురించి నలుగురికి పరిచయము చేయటమే వాటి ప్రధానోద్దేశము. వ్యక్తిగత విషయా లకు వాళ్ళు ప్రాతినిధ్యం ఇవ్వరాదు. నన్ను గురించిన వ్యక్తిగత విషయాలు కూడ వాళ్ళకనవసరం. నా చింతనాధార ప్రబోధనల గురించి ప్రజలు తెలుసుకుండేందు కవసర మున్నంత వరకు నా గురించి చెప్పినా ఫరవాలేదు. కాని వాళ్ళు చేస్తున్నదేమిటి? కేవలం నా జీవితంలోని పైపై విషయాలను ఎత్తి చూపించటమే. సర్క సులో విన్యాసములు చేసే హీరో వలెనో లేక పాత్రికేయులు నిలబెట్టే మనుషులు — బాక్సింగు హీరో జోజోన్సు, డగ్లస్ ఫెయిర్‌బాంక్సు, హెచ్.జి.వెల్సు, కింగ్ జార్జి, క్వీన్ మేరీ, హెయిలీ సెలసీ, హాబ్సు, హిట్లర్, హంతకుడు జాక్ (లేక అతని ఆధునిక అవతారము) ముస్సోలినీల వలెనో నన్ను గురించి రాయటం ఇప్పటికీ ఎప్పటికీ తప్పకుండా నిషేదించాల్సిందే.

24-9-1935

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహా శాస్త్రి

---

[9] కొన్ని పత్రికలు శ్రీఅరవిందులను గురించి ప్రచురించే ప్రత్యేక సంచికలు

తమ జీవిత చరిత్రకారులతో శ్రీఅరవిందులు

నా గతజీవిత సంఘటనల వెనుకగల సత్యము, వాటి నిజ స్వరూపములను గురించి మీకెవ్వరికి తెలియదు — నాకు మాత్రమే తెలుసు.

*

నా జీవిత చరిత్రను రాయాలని మీరు ఎందుకింత పట్టుబడుతున్నారో నాకర్థం కావటంల్లేదు. అది అవసరమా? ఉపయుక్తమా? అది విఫల ప్రయత్నం అయి తీరుతుంది. ఏమంటే మీరు గాని, యింకెవరు గాని నా జీవితం గూర్చి ఏమాత్రం తెలిసిన వారు కారు. అది ఉపరితలంపై మానవాళికి దృగ్గోచరం కానిదాయె.

*

నా జీవిత చరిత్రను అసలు ఎందుకు రచించాలి? అది నిజానికి అవసరమా? నా దృష్టిలో, ఓ మానవుని విలువ, అతడు అభ్యసించినదాన్ని బట్టిగాని, అతడి స్థాయిని బట్టిగాని, యశస్సును బట్టిగాని, కర్మనుబట్టిగాని ఆధారపడదు. అతడిప్పుడేమిటి? అంతరంగంలో ఏమౌతున్నాడు అన్నదే ముఖ్యం.

శ్రీఅరవిందుల రచనలు — అపార్థం

నేను రాసిన విషయాలను ఎవ్వరు అర్థంచేసుకోలేరు. అసలు మనస్సుకే దాని పరిధికి మించిన విషయాలను గ్రహించేశక్తి లేదాయె. అందుకని విషయాన్ని చక్కగా గ్రహించలేక తన సొంత అభిప్రాయాల్ని ఏర్పరచుకొంటుంది. ప్రతి వాళ్లూ సత్యానికి బదులు తమ సొంత అభిప్రాయలను ఏర్పరచుకొంటారు.

*

మానవుల దృష్టి సంకుచితమైనది. సత్యము బహుముఖమైనది. నా ప్రవచనములు రెండవ జాతికి చెందినవి. చర్మ చక్షువులకు అవి భిన్నములుగా లేక పరస్పర విరుద్ధములుగా కూడ తోచవచ్చును. సంకుచిత మానసిక అశక్తతనే జనాలు ప్రమాణంగా

భావిస్తారు. సత్యానికి స్వరూపాలు ఎన్నో. సమదృష్టితో శాంతంగా వీటన్నింటినీ పరికిస్తే తప్ప మీకు నిజమైన జ్ఞానం లభ్యం కాదు.

*

యోగదృష్టితో యీ ప్రశ్నల గూర్చి రాస్తే, తార్కిక ఆధారంపైనే అయినా, సమకాలీన అభిప్రాయాలతో అది చాలా భేదించటం కద్దు. ఉదా: అద్భుతాల గురించి, ఇంద్రియ జ్ఞానపు పరిమితులను గూర్చి నేను రాయడం వీలైనంత వఱకు మానుకున్నాను. ఏమంటే, భౌతిక యింద్రియాలు, వాటి మీద ఆధారపడే హేతువును మించి, భౌతిక శాస్త్రం లేదా హేతువు గుర్తించని ధర్మాలు శక్తులు గూర్చి నేను మాట్లాడాల్సి ఉంటుంది కాబట్టి. ఇతర సిద్ధాంతాల సూచనలు లేదా అర్థం కానేరని వాటిని గూర్చి వెల్లడించాలి గాబట్టి. ప్రజాబాహుళ్యానికి రచించే నా రచనల్లో గాని, సాధకుల కోసం రాసిన వాటిల్లో గాని నేను వీటి విషయం పట్టించుకోలేదు. ఏమంటే అవి సామాన్య జ్ఞాన పరిధిని దాటిపోతాయి కాబట్టి. ఈ విషయాలు కొంతమందికి తెలుసు. కాని, సామాన్యంగా వారు వాటిని గూర్చి నోరెత్తరు కాబట్టి. కాని తెలిసినంత వఱకు అటువంటి వాటిని గూర్చి ప్రజల దృష్టి సులభంగా నమ్మవచ్చు, నమ్మకపోవచ్చు. యిరుపక్షాలా అనుభవ రాహిత్యం లేదా జ్ఞానరాహిత్యం కనిపిస్తుంది.

డిసెంబరు 1935

రచనల చౌర్యము

ప్రశ్న: 'హిందూ' పత్రికలో ప్రచురితమైన 'ఒకానొక' ఉపన్యాసంలో ఆయన తమ అభిప్రాయాలను బహుధా చౌర్యం చేయడమే కాక, తమ వాక్యాలను యథాతథంగా వాడుకున్నారు. ఈ వృత్తిలో ఆయన సిద్ధహస్తుడట. కాని అటువంటి తాత్త్విక సాహిత్య చౌర్యం దండింపబడకుండా ఎలా చెలామణీ అవుతుందో అని నేను అబ్బురపడుతున్నాను. నేను నేరుగా యీ చౌర్యంగూర్చి

తేటతెల్లం చేస్తూ ఆయనకుగాని, 'హిందూ' పత్రిక వారికి గాని వ్రాద్దామనుకొంటున్నాను.

ఇలాంటి పని వల్ల ప్రయోజనం ఉంటుందని నేనను కోను. ఈ చౌర్యాలు తేటతెల్లం. కాని ఆయన తన వెలవెలబోయే వాక్యాలకు నెమలిపింఛాలు సమకూర్చుకోవాలను కుంటున్నారేమో!

23-7-1936

ఆశ్రమంలో శక్తిపాతము — బాహ్య సంఘటనలు

ప్రశ్న: ఏదో విధంగా బాహ్యప్రపంచంపై యిచ్చటి ప్రభావం పడితే, యిక్కడ జరుగుచున్న సంఘటనలకు బాహ్య సంఘటన లకు ఏదైనా సంబంధం ఉంటుందా? ఉదా॥ యిద్దరు మనుమలు యిక్కడి నుండి వెళ్లినారు, ఇటలీవారు తుదకు అబిసీనియాను జయించారని నాకు తెలిసినది. అహ్మదాబాద్‌లో ఓ గూడజ్ఞుని కథ ఉంది (16 వ శతాబ్దికి చెందినదో, ఏమో) అందులో, అతడు చాపలు చేయడం, చించడం — అట్లాగే పగలంతా ఆ నగరం చుట్టూతా కట్టిన గోడ — సరిగ్గా అతడు చాప ముక్కలు పట్టుకు పోతున్న సమయంలో ఆ రాత్రికే కూలిపోయిందట.

ఆ కథలో కొంత నిజముంది. బాహ్య సంఘటనలకూ, యిక్కడికీ సంబంధం లేదని చెప్పలేము. కాని ఈ విధమైన లంకెల గురించి నాకు తెలియదు. యిద్దరు వెళ్ళిపోవడానికీ, అబిసీని యాలో జరిగిన సంఘటనకూ సంబంధమున్నట్లు కనిపించదు.

10-10-1936

శ్రీఅరవిందులవారి శక్తి ప్రయుక్తం

నా శక్తి ఆశ్రమానికీ, దాని పరిసరాలకు మాత్రమే పరిమితం కాదు. ప్రపంచ పరివర్తనకూ, యుద్ధంలో సక్రమ పరిణామానికి బహుధా ప్రయోగింపబడుతుంది. ఆశ్రమపరిధి కావల వ్యక్తిగత ప్రయోజనాలకు, యోగాభ్యాసానికి కూడ అది ఉపయుక్తం. అది

అయితే మౌనంగా జరుగుతుంది. ఆధ్యాత్మిక ప్రక్రియల ద్వారా జరుగుతుంది. ఈ కార్యానికి ఆశ్రమం నడిబొడ్డు.

రుద్ర శక్తి — వాడుక

నేను రుద్రశక్తిని వాడటం నిలిపి వేశాను. దాని ఫలితాలు ఘోరమైనవి. మరల యిప్పుడు చాలాకాలంగా వాడక పోవడం వలన, దాన్ని వాడాలనే ఊహ లేదు. సత్యాగ్రహం, అహింసలవైపు మారి పోయానని కాదు గాని హింసక్కూడా కొన్ని సమస్యలున్నాయి. కాబట్టి రుద్రజ్వాలు నిద్రపోతున్నాయి.

దర్శనానంతరం అనుభూతి హుష్, కాకి!

ప్రశ్న: తమ దర్శనానికి వచ్చినప్పుడు, నేను దర్శిస్తున్నది సాక్షాత్తూ 'శివుణ్ణే' అనిపించింది. నా ఆనందానికి మేరలేదు. ఈ అనుభూతి, యీ చేతన నాకు రెండు మూడు రోజుల వరకూ అట్లానే మిగిలి ఉంది, అనంతరం, మటుమాయమై పోయింది.

దర్శనం రోజున పొందిన అనుభూతి, చేతనోన్నతి మటుమాయమైనాయని మీరు నిస్పృహ చెందటం నిష్కారణం. అవి మాటుమాయం కాలేదు. ఉపరితలం నుండి వెనక్కి మరిలినై అంతే. ఉన్నతతర చేతనగాని, కొంత అనుభూతిగాని లోపించినప్పుడు, సాధారణంగా అలా సంభవిస్తుంది. అలానని కృంగిపోరాదు. జీర్ణం చేసికోనేందుకు కొంత సమయం పడుతుంది. కొంగ్రొత్త అనుభూతికీ, అభివృద్ధికీ నిరీక్షిస్తూ సిద్ధపడాలి.

అనువాదం: సాహితీ కౌముది పి. మోహన్

ఆశ్రమం ప్రతిష్ఠ

ఆశ్రమం ప్రతిష్ఠ గూర్చి మీ భావాలన్నీ చాలా విచిత్రంగా ఉన్నాయి. ఆధ్యాత్మిక కేంద్రంగా చెప్పుకునే ఒక సంస్థ ప్రతిష్ఠ

దాని ఆధ్యాత్మికతపై ఆధారపడి వుంటుంది కాని వార్తాపత్రికలను బట్టిగాని, ప్రసిద్ధ పురుషులబట్టిగాని వుండదు.

30-6-1938

పూర్ణయోగం, మానవాళి ఆమోదం

ప్రశ్న: ప్రపంచంలో మన రూపాంతరీకరణ యోగాన్ని స్వీకరించిన వారి సంఖ్య బౌద్ధమతం, వేదాంతాన్ని లేదా క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారి సంఖ్య అంత ఉండదని నేను భావిస్తాను.

జనసంఖ్య అంత ముఖ్యం కాదు. బౌద్ధమతం, క్రైస్తవ మతం స్వీకరించిన వారి సంఖ్య ఎక్కువ ఎందుకంటే అధిక సంఖ్యాకులు వాటిని మతంగా బహిరంగంగా ప్రకటించుకున్నారు. నూతన (దివ్య) చైతన్యం గనుక అంతమాత్రంతో తృప్తిచెందినట్లయితే అది కూడా చాలా తేలికగా మొత్తం ప్రపంచం నీరాజనాలను, ఆమోదాన్ని పొందగలదు. అది మరింత మహనీయమైన చైతన్యం, 'సత్య చైతన్యం' కాబట్టి దానికి కావలసింది యథార్థమైన పరివర్తనగాని పైపై సింగారాలు కాదు.

29-4-1934

పూర్ణయోగం — నూతనాంశాలు

నా యోగం అన్ని విధాలా సరి కొత్తది అని నేను ఎప్పుడూ అనలేదు. అనేక ప్రాచీన యోగప్రక్రియల సారాన్ని, విధానాలను తనలో ఇముడ్చుకుంది కాబట్టి దానికి నేను పూర్ణయోగం అని పేరు పెట్టాను. దాని లక్ష్యం, దృక్పథం, ప్రక్రియ, సమగ్రతా స్వరూపాలలో దాని కొత్తదనం వుంది. తొలి దశలలో — *ప్రపంచ ప్రహేళిక*[10], *యోగదీపికలు* వంటి పుస్తకాలు లేదా

[10] ప్రపంచ ప్రహేళిక, యోగదీపికలు, యోగపునాదులు అనే పుస్తకాలలో సంకలనం చేసిన శ్రీఅరవిందుల లేఖలను యోగం పైన లేఖలుగా *SABCL* Vols 22, 23 & 24 ప్రచురించాం.

త్వరలో ప్రచురించనున్న *యోగపునాదులు* అనే కొత్త పుస్త కంలో నాపూర్ణయోగం సమగ్రత్వానికి ప్రధానంగా యున్న లక్ష్యం, దాని కదలికలలోని స్ఫూర్తి, అది ఆవిష్కరించే వినూత్న అంతిమ విశిష్టత, దాని మనో వైజ్ఞానిక ప్రణాళిక, దాని పని తీరు తప్ప పాతయోగాల నుండి వేరు చేసేది ఏదీ కనిపించదు. ఈ లేఖలలో క్రమబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా దానిని అభివృద్ధి చేయక పోవడం, చేయలేక పోవడం వల్ల, మానసిక పరిచయం వల్ల లేదా కొంత సాధన వల్ల సంసిద్ధంగాలేని వారు దానిని గ్రహించ లేక పోయారు. అతీత భూమికలలోనికి ప్రవేశించే పూర్ణయోగంలోని అనంతర దశలలోని వివరాలు, పద్ధతులు నేను బహిర్గతం చేయ లేదు. ప్రస్తుతం ఆ పని చేయదలచు కోలేదు.

కొన్ని తాంత్రిక సాధనలు, కొన్ని యోగమార్గాల ద్వారా సంపూర్ణ భౌతిక సిద్ధి పొందడానికి చేసిన ప్రయత్నాలు, నా యోగానికి సంబంధించినవిగా కనిపించే ఆదర్శాలు, ఆశయాలు ఉన్నాయని నాకు బాగా తెలుసు. వాటిని గూర్చి నేను ఉదాహర ణలు ఇచ్చాను. ప్రపంచానికి అతీతంగా భాసించే దైవత్వాన్ని సిద్ధింప చేసుకోవడానికే గాక, ఒక అడుగు ముందుకు వేయడా నికి (పృథ్వీ చైతన్య పరిణామం దీనిని ఇంకా సాధించవలసి వుంది) — మానవాళి ఆధ్యాత్మిక గతం అంతా ప్రకృతి తనలో తాను సిద్ధం చేసుకోవడమేనని నేను నా అభిప్రాయం వెల్లడిం చాను. నా ఆదర్శంతో ఈ ఆదర్శాలు కొంత మేరకు పోలి వున్న ప్పటికీ, నా ఆదర్శంతో కొంత సాదృశ్యం వున్నప్పటికీ, నా యోగ ప్రక్రియను, దాని లక్ష్యాన్ని, పద్ధతిని కొత్త వాటిగా ఆమో దించినా, ఆమోదించకపోయినా, నేను లెక్క చేయను. అది చాల అల్ప విషయం. దానిని ఆమోదించే వారు, సాధన చేసే వారు అదే నిజమైనది అని గుర్తించడం, తాము సాధించిన విజయం ద్వారా దానిని నిజమైనది చేయడం చాలా ముఖ్యం. దానిని కొత్తది అని అనడం, లేక పునరావృతం అని అనడం కాని, లేదా అందరూ మరిచిపోయిన పాతయోగాన్ని పునరుద్ధరించారని అనడం కాని జరిగితే దాని వల్ల నష్టం ఏమీ లేదు.

కొంతమంది సాధకులకు అది కొత్త యోగం అని నేను ఒక లేఖలో స్పష్టం చేశాను. మనకు కావలసినది ఇంతవరకు ఎవ్వరు సాధించని సరికొత్త యోగము గాని పాత యోగాల లక్ష్యం, భావం పునరావృతం చేయడం ఎందుకు? దీనిని ఇంత వరకు ఎవరూ దర్శించ లేదు, అయినప్పటికీ ఇది తప్పకుండా గతంలోని సమస్త ఆధ్యాత్మిక కృషి యొక్క రహస్య పర్యవసానమే.

పాతయోగ ప్రక్రియలతో పోలిస్తే అది కొత్తది. ఎందుకంటే 1) ప్రపంచం నుండి, జీవితం నుండి బయటపడి ఏ స్వర్గం వైపో, నిర్వాణం వైపో ప్రయాణించాలని దాని లక్ష్యం కాదు. జీవితం, అస్తిత్వం, పరివర్తన ఈ యోగలక్ష్యాలు. ఏదో యాదృచ్ఛికమైన, నిమ్నతరమైన లక్ష్యం కాదు. సుస్పష్టమైన కేంద్రీయ లక్ష్యం. పాతయోగాలలో అవరోహణ (descent) వుంటే, అది యోగ పథంలో కాకతాళీయంగానో, లేక ఆరోహణా ఫలితంగానో సంభవించిన విషయం మాత్రమే. ఈ యోగంలో ఆరోహణ అవరోహణకు సాధనం మాత్రమే. ఆరోహణా ఫలితంగా సాధించిన వినూత్న చైతన్య అవరోహణమే సాధనలో అతి ముఖ్యాంశం. తంత్రశాస్త్రం, వైష్ణవ భక్తితత్వం కూడా జీవితంనుండి ముక్తి పొందడంతో ముగిసి పోతాయి. నా యోగలక్ష్యం జీవితానికే దివ్యసాఫల్యతను సమకూర్చుట.

2) వ్యక్తిగత సిద్ధి ఈ యోగ లక్ష్యం కాదు. యావత్ పృథ్వి చైతన్యము ఉన్నతస్థాయికి ఎదగాలి. కేవలం విశ్వాతీత విజయమే కాదు — విశ్వాంతరవిజయం కూడ మనకు కావాలి. పృథ్వి ప్రకృతిలో ఇంకా వ్యవస్థీకృతం కాని, ప్రత్యక్షంగా క్రియాత్మకం కాని ఒక చైతన్య శక్తిని (అతిమానసం supermind) క్రిందికి తీసుకొని రావడం ఈ యోగంలో సాధించవలసి వుంటుంది. ఈ కొత్త చైతన్యాన్ని పృథ్వి ప్రకృతిలో వ్యవస్థీకృతం చేసి, ప్రత్యక్షంగా క్రియాత్మకం చేయవలసి యున్నది.

3) ఈ యోగ ప్రక్రియ లక్ష్యం ఎంతటి పరిపూర్ణమో, ఎంతటి సర్వసమగ్రమో అంతటి (పరిపూర్ణమైన సర్వసమగ్రమైన) లక్ష్యాన్ని సాధించడానికి ఒక పద్ధతిని ప్రకటించి యున్నాము. విశిష్టమైన,

విస్పష్టమైన — ఇతర ప్రక్రియలకు సంబంధించి పాక్షిక చర్య, వర్తమాన సహాయం అందివ్వడం మాత్రమే జరిగే సందర్భంలో పాత ప్రక్రియలు చేపట్టి, సర్వసమగ్రమైన, పరిపూర్ణమైన పరివర్తనకు చైతన్యం లోనూ, మానవ ప్రకృతి లోనూ సాధించడం ఈ నూతన ప్రక్రియ ప్రయోజనం. ఈ పద్ధతిని (సర్వ సమగ్రంగా) లేక అటువంటిది కాని పాతయోగాలలో ప్రవచించడం గానీ, సాధించడం గాని జరగలేదని నేను కనుగొన్నాను. ఒకవేళ నేను కనుగొని వుంటే, — అంతకు ముందే ప్రాచీనులు నిర్మించిన మార్గాలలో, వారు నిర్దేశించిన పథాలలో, పరిపూర్ణంగా పటాన్ని (map) రూపొందించినప్పుడు, కష్టపడి వారు బాటలు వేసినప్పుడు, సురక్షితం చేసి ప్రజలకు బాహాటంగా వెల్లడించినప్పుడు ముప్పై సంవత్సరాల పాటు అన్వేషణ జరపడానికి, అంతర్గత సృష్టిని సాధించడానికి ఒక మార్గం సుగమం చేయడానికి నేను నా కాలాన్ని వృధా చేసి వుండే వాడిని కాదు. నా యోగ ప్రక్రియ పాతదారులలో తిరిగి ప్రయాణించడం కాదు. అది ఒక ఆధ్యాత్మిక సాహసం.

5-10-1935

శ్రీ అరవిందుల యోగసాధన

ఇహలోకము — పరలోకము

భారతీయ ఆత్మను గూర్చి నీవు చేసిన వ్యాఖ్యను 'అతీత ప్రపంచతత్వాన్ని' వదిలి 'ఈ ప్రపంచతత్వం' పై నొక్కి పలికిన మరో సాధకుని వ్యాఖ్యను పురస్కరించుకొని నేను ఒక మాట చెప్పాలనుకొన్నాను. అతను ఏ సందర్భంలో ఈ వ్యాఖ్య చేసాడో, 'ఈ ప్రపంచతత్వం' అంటే అతని ఉద్దేశ్యం ఏమిటో నాకు అర్థం కాలేదు. కాని ఈ విషయంలో నా దృక్పథం ఏమిటో వెల్లడించడం అవసరమని భావిస్తున్నాను.

నేను భారత దేశానికి వచ్చినప్పటి నుండీ నా జీవితం, నా యోగ ప్రక్రియ 'ఈ ప్రపంచతత్వానికీ', 'అతీత ప్రపంచ

తత్వానికీ' ఇరువైపులా ఒక దానితో ఒకటి వేరుపడని విధంగా, సంబంధించే యున్నది. సమస్త మానవ ప్రయోజనాలు ఈ ప్రపంచానికి సంబంధించినవని నా భావన. వాటిలో చాలా వరకు నా మానస క్షేత్రంలో ప్రవేశించాయి. రాజకీయాల వంటి మరి కొన్ని ప్రయోజనాలు నా జీవితంలో ప్రవేశించాయి. బొంబాయిలోని అపోలో బందర్ రేవులో భారతభూమిపై నేను కాలుపెట్టినప్పటి నుండి, అదే సమయంలో — నాకు ఆధ్యాత్మిక అనుభూతులు రావడం ప్రారంభించాయి. కాని అవి ప్రపంచంనుండి వేరుపడని అనుభవాలు. నా అనుభవాల అంతర్గత అనంత ప్రభావం ఈ ప్రపంచంపై ఉన్నది. ఈ భౌతిక విశ్వమంతటా పరివ్యాప్తమైన ఒక 'అనంతం' భౌతిక వస్తురాశిలో, శరీరాలలో నివసించే 'అంతర్యామి' — ఈ భావ సంచయంతో కూడిన అనుభవాలు నాకు కలిగాయి.

అదే సమయంలో సూక్ష్మ భౌతిక లోకాలు, భూమికలలోకి ప్రవేశించిన అనుభవం నాకు కలిగింది. ఆ లోకాల ప్రభావాలు భౌతిక లోకంలో ఉన్నట్లు కనుగొన్నాను. అస్తిత్వపు రెండు భిన్న ధ్రువాల మధ్య రాజీలేని వైరుధ్యం కాని, పదునైన విభేదం కాని ఉన్నట్లు నాకు కనిపించ లేదు. వాటి మధ్య ఉన్నదంతా కూడా అలాగే వైరుధ్య రహితంగా నాకు కనిపించింది. నాకు సృష్టి సర్వస్వం బ్రహ్మపదార్థంగానే కనిపిస్తున్నది. సర్వత్ర దైవాన్ని చూస్తున్నాను. ఈ 'ప్రపంచ' తత్వాన్ని విడిచి పెట్టి, 'అతీత — ప్రపంచ తత్వాన్ని' మాత్రమే ఎంచుకొనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నది. ఆ నిర్ణయంవల్ల వారికి శాంతి లభిస్తే, వారు అదృష్టవంతులు. శాంతి పొందడం కోసం ఈ పనిచేయడం అవసరమని — వ్యక్తిగతంగా నేను భావించడం లేదు.

నా యోగ విధానంలో రెండు లోకాలకు (ఆధ్యాత్మిక, భౌతిక) సమమైన ప్రాధాన్యత వున్నది. వ్యక్తిగత మోక్షం కోసం కాకుండా, భూమి మీద దివ్యజీవనం కోసం, మానవ హృదయాలలో, భువన జీవనంలో దివ్యచైతన్యాన్ని (Divine consciousness) దివ్యశక్తిని (Divine Power) సుస్థిరం చేయాలని భావిం

చాను. పృథ్వి జీవన లక్ష్యాలను, పృథ్వి జీవన రంగాలను ఈ లక్ష్య పరిధి లోనికి తీసుకోవడంవల్ల దాని ఆధ్యాత్మికత కలుషితం కాదని, దాని భారతీయ గుణం మారదని నా విశ్వాసం — ప్రపంచ స్వభావం, యథార్థత, సమస్త జీవనరంగాలు భగవంతుని విషయంలో కనీసం — ఇది నిరంతరం నా అభిప్రాయం, నా అనుభవం. వాటి విషయంలో పూర్ణసత్యం సాధ్యమైనంత చేరువలో అదేనని, అందువల్ల ఆ సత్యాన్వేషణను నేను పూర్ణయోగం అని అన్నాను. ఇటువంటి పూర్ణత్వాన్ని తిరస్కరించడానికి, నమ్మకుండా వుండడానికి ప్రతివానికి తగినంత స్వేచ్ఛ వుంది. పూర్తిగా ప్రపంచాతీత వ్యవస్థ ఆధ్యాత్మికపరంగా అవసరమని నమ్మడానికి ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ వుంది. కాని అది నా యోగసాధనను అసంభవం చేస్తుంది. ఇతర లోకాలు, పరమాత్మ (Supreme spirit) భూమిక, వాటి మధ్య గల ఇతర భూమికలు, మన జీవితంపై, భౌతిక జగత్తుపై వాటి ప్రభావాలు — ఈ పూర్తి అనుభావం నా యోగ ప్రక్రియ పరిధిలోకి వస్తుంది. కాని ఏదో ఒక అంశంలో పరాత్పరుని లేదా ఈశ్వరుని గాని, శివుని, ప్రపంచ అధినేతగా, మనందరి, మన కర్మల ప్రభువుగా శ్రీకృష్ణుని, లేదా విశ్వవ్యాప్త సచ్చిదానంద సాక్షాత్కారం పొందడం — దానిని గురించి మాత్రమే గట్టిగా పట్టుబట్టడం సాధ్యమే. ఈ యోగ ప్రక్రియ ప్రధాన ఫలితాలు సిద్ధింప చేసుకొని, దివ్యజీవన ఆదర్శాన్ని, పరమాత్మచే జయింపబడిన ఈ భౌతిక ప్రపంచాన్ని ఎవరైన ఆమోదించిన పక్షంలో, ఆ ఫలితాలు పొందిన పిమ్మట వాటి నుండి తరువాత పూర్ణఫలితాల వైపు ప్రయాణించడం సాధ్యమే. అస్తిత్వం వెనుక గల సత్యం పైన, అన్ని రంగాల పైన ఈ అభిప్రాయం, ఈ అనుభవంతోనే నేను దివ్యజీవనం, సావిత్రి వంటి గ్రంథాలు వ్రాయగలిగాను. పరాత్పరుని, ఈశ్వరుని సాక్షాత్కారం నిశ్చయంగా అతి ప్రధానమైనది. *బౌద్ధికమైన ప్రజ్ఞతో కాకుండా, ఆధ్యాత్మిక అనుభవం ద్వారా భగవంతుని ప్రేమతో, భక్తి, ఆరాధనలతో సమీపించడం, కర్మలతో అతనిని సేవించడం, అతనిని తెలుసుకోవడం ఇది కూడా పూర్ణయోగ పథంలో అతి ప్రధానమైనది.*

28-4-1949

సందేశం కోసం విజ్ఞప్తికి సమాధానం

ప్రశ్న: ఆగస్టు 15 న వెలువడనున్న 'మదర్ ఇండియా' ప్రత్యేక సంచిక కోసం ఒక సందేశం పంపమని ప్రార్థిస్తూ రాసిన నా లేఖ ఏమైనది? మీ నుండి ఏ సమాధానం లేదు?

ఆగస్టు 15 నాటికి నా నుండి నీవు సందేశాన్ని లభింప చేసుకోవడం అసంభవం అని నీకు వార్త పంపాలని విఫల ప్రయత్నం చేస్తున్నాను. ఈ ఏడాది నా జన్మదినం నాడు సందేశం వ్రాయాలన్న ఉద్దేశం నాకు లేదు. ఆదేశం ఇవ్వగానే సందేశాన్ని పంపడం అసంభవం. నాకు ఆవేశం రావాలి. అయితే ఈ కొద్ది సమయంలో ఆవేశం రావడానికి పెద్దగా అవకాశాలు కనిపిం చడం లేదు. సందేశం ఇవ్వాలన్న ఇచ్ఛ నాకు లేదు. బయట వున్న పత్రికలకు, మేగజైన్లకు — అంటే నా ఉద్దేశ్యం ఆశ్రమం నుండి ఆశ్రమం నడిపే పత్రికలు కాకుండా — ఏ వ్యాసాలూ వ్రాయకూడదన్న నా నియమాన్ని నువ్వు ఎలా మర్చిపోయావు? శ్రీమాత విజ్ఞప్తి మేరకు బులెటిన్‌కు తప్ప కొత్త వ్యాసాలు ఏవీ ఆశ్రమ పత్రికలకు వ్రాయడం లేదు. ఈ నియమాలకు కారణాలు ఉన్నాయి.

ఆ విధంగా వ్యాసాలు వ్రాయడం ప్రారంభిస్తే, నేను నా స్వేచ్ఛను కోల్పోతాను. ప్రతి వ్యక్తి ఆదేశం మేరకు, వ్యాసాలు మాత్రమే కాకుండా, ఆశీస్సులు, బయట వారి ప్రశ్నలకు సమా ధానాలు, సంప్రదాయకమైన చెత్తచెదారం కూడా నేను వ్రాయ వలసి వుంటుంది. ఇక నేను మామూలు రాజకీయవేత్తలాగ అన్ని విషయాలపైనా, అత్యల్ప అంశాలపైన నా అభిప్రాయాలు, అన్ని రకాల విషయాల పైన ప్రవచనాలు ఇస్తూండడం, ప్రజల మని షిగా ప్రజలకు అందుబాటులో ఉండవలసి వస్తుంది. తమకు ప్రత్యేక సందేశాలు పంపాలని ఇప్పటికే తుపాకీ చూపించి 'హిందుస్థాన్ స్టాండర్డ్', 'మద్రాసు మెయిల్' డిమాండ్ చేస్తున్నాయి. ఇంకా ఏ ఇతర పత్రికలు, సొసైటీలు డిమాండ్ చేస్తున్నాయో నాకు తెలియదు. నేను వారి ఆదేశాన్ని మన్నించి సందేశాలు

ఇవ్వాలట. (I have to stand and "deliver" అని శ్రీఅరవిందులు హాస్యోక్తిగా అనడం గమనించాలి) నేను ఇవ్వలేను బాబూ — నీకు నిరాశ తప్పనందుకు విచారిస్తున్నాను. కాని ఆత్మరక్షణ ప్రకృతిలోని మొదటి నియమం కదా.

3-8-1949

అనువాదం: కె. యజ్ఞన్న

ఆగస్టు 15, 1947

ఇది మానవజాతికి నూతన యుగము

15 ఆగష్టు స్వతంత్ర భారతానికి పుట్టినరోజు. ఈనాటితో పాతయుగము అంతమయింది, — మన ఒక్కరికే కాదు, ఆసియాకి, ప్రపంచానికంతటికి కూడ కొత్తయుగము ఆరంభమయింది. ఎందుకంటె మానవజాతి పురోగమనానికి — రాజకీయ సామాజిక సాంస్కృతిక రంగాలలో — కీలకమైన పాత్ర వహించగలిగిన ఒక నూతన శక్తి ఆవిర్భవించినది. నా పుట్టినరోజు — కేవలం నా అనుచరులు మాత్రమే ప్రతి ఏడు జరుపుకుంటున్న దినము ఇంతటి విశేష ప్రాముఖ్యతను సంతరించుకొనుట నాకు ఎంతో తృప్తికరమైన విషయము

భగవంతుని ఆమోదముద్ర

స్థూలదృష్టికి ఇది అదృష్టవశాత్తూ లేదా కాకతాళీయంగా జరిగిన విషయమే అనిపించినప్పటికి అందులో అంతకు మించిన సూక్ష్మమొకటున్నది. అది నా జీవితాన్ని మొదట్నుంచి నడిపించుచున్న దేవత యొక్క అభయహస్తమూ, భగవంతుడు నాకార్యము మీద వేసిన ఆమోదముద్రా అని నా మార్మిక దృష్టికి గోచరమవుతున్నది. వాస్తవమునకు, ఇంచుమించు నేనాశించిన ప్రపంచ ఉద్యమములన్నియు నా జీవితకాలములో సిద్ధించుటను చూడవలయునని ఆశించిన ఆ రోజులలో ఇవి, అసాధ్యమైన కలలుగా కనుపించిననూ, ఈ దినమున అవి, ఫలసిద్ధికి సమీపమందున్నట్లు,

లేదా ఫలించుట ప్రారంభమైనట్లు, నెరవేరు మార్గము నందున్నట్లు గుర్తించగలుగుతున్నాను.

ఈ శుభ ముహూర్తమునకు నన్ను ఒక సందేశ మిమ్మని మీరు కోరియుంటిరి. కాని, నేను ఆ సందేశమిచ్చే పరి స్థితిలో లేను. నా బాల్యము, యౌవన కాలమునందు నేనూహిం చిన లక్ష్యములు, నా ముందుంచుకొనిన ఆదర్శములు ఇపుడు ఫలప్రదమగుటను చూచుచున్నందున, వాటిని గురించిన వ్యక్తి గత ప్రకటనను మాత్రమే చేయగలుగుదును. అవి భావి భారత కార్యభాగము లైనందున, భారతదేశ స్వాతంత్ర్యమునకు సంబం ధించినవని, అందు తప్పనిసరిగా ప్రథమ స్థానము నాక్రమించు కొన గలవని నా నమ్మకము. భారతదేశము మేల్కొనుచున్నదని మొదటినుండి గట్టిగా చెప్పుచునే ఉన్నాను. అది, తన లౌకిక ప్రయోజనములను, విస్తృతిని, ఔన్నత్యమును, శక్తి సంపదలను మాత్రమే నెరవేర్చుకొనుటకు గాక — వాటిని కూడ భారత దేశము విస్మరించరాదు — నిశ్చయముగ ఇతరుల వలె అన్య దేశములపై ఏలుబడిని సంపాదించుకొనుటకు గాక, భగవానుని

మానవజాతికి మార్గదర్శి

కొరకు, ప్రపంచమునకు సహకరించుట కొరకు, సమస్త మానవజాతికీ మార్గదర్శిగా, సహాయకారిగా కూడ భారత దేశము జీవించి, వికసించవలెను.

ఆ లక్ష్యముల యొక్క ఆదర్శముల యొక్క సహజ క్రమమిది: భారతదేశపు స్వాతంత్ర్యము, ఐక్యతను గడించగల విప్లవ మొకటి; ఆసియా ఖండము పునర్జీవించి స్వేచ్ఛగలిగి — గతమున మానవ నాగరికతాభివృద్ధికి తాను నిర్వహించిన అమో ఘమైన పాత్రను తిరిగి నిర్వహింపగలగ వలయును. నూతనము, మహత్తరము, ప్రకాశమానము, ఔదార్యము నగు జీవనమునకు మానవజాతి ఎదగవలయును. అది బాహ్యమున పూర్ణముగ సిద్ధించుటకు, భౌతికముగ ప్రత్యేక ఉనికిగల ప్రజలు — వారి జాతీయ జీవితమును నిలుపుకొనుచు, కాపాడుకొనుచు, అందరు కలిసి ఏకత్వమునకు తేగల అంతర్జాతీయ సమైక్యతపై ఆధార

పడి యుండును. మానవజాతి కంతటికీ ఆధ్యాత్మిక జీవనము నకు వలయు శిక్షణా విధానములను, ఆధ్యాత్మిక జ్ఞానమును భారతదేశము కానుకగ నొసంగవలయును. కడపటిది, ఉన్నతతర భూమికకు చేతనను ఉద్ధరించుట ద్వారా, మానవుడుద్బుద్ధుడై వ్యష్టిగ, సమిష్టిగా పూర్ణత్వమును గురించి కలలు గనుటకు ప్రారంభించినది మొదలు, వానిని కలవరపెట్టి, విసిగించిన జీవిత సమస్య లనేకములు పరిష్కరింపబడు నూతన పరిణామ పథము.

భారతదేశము స్వతంత్రదేశమైనదేగాని, ఐక్యతను బడయ లేదు (అఖండ భారతదేశము కాలేదు) — చీలిపోయి, ఖండములైన స్వతంత్రమే అది. పూర్వమువలె, బ్రిటిషు వారి విజయమునకు కారణమైన విభిన్న సంస్థానములుగ విడిపోయి, మరల అయో మయ స్థితిలో పడిపోవునా యనునట్లు గోచరించెను గాని, అదృష్ట వశాత్తూ, అట్టి ప్రమాద పరిస్థితి నుండి తప్పించుకొనగల అవకా శమిపుడు ధృవపడినది. శాసన నిర్మాణ సభవారు తెలివితేటలతో అవలంబించిన కఠిన పద్ధతి వలన ఛిద్రము, చీలికలు లేకుండా నిమ్నజాతుల సమస్యా పరిష్కారములు సుసాధ్యమొనర్చినది. కాని హిందు, ముస్లిముల మతబేధము నేడు దేశ విభజనగా స్థిర పడేటట్లుగ గోచరించుచున్నది. కాంగ్రెసు నాయకులు, దేశీయ నేతలు ఈ నిర్ణయము శాశ్వతమైనదిగ, తాత్కాలిక పరిష్కారము నకు మించినదిగ అంగీకరించరని ఆశించుదము. ఈ విభజన శాశ్వతమైనదే అయిన యడల భారతదేశము తీవ్రముగ దుర్బ లమైపోవచ్చును. వికలమైపోవచ్చును. అంతఃకలహములకు సదా అవకాశముండును. నూతన దురాక్రమణకు, విదేశీయుల ఆధిప త్యమునకు కూడ అవకాశము లేకపోలేదు.

దేశ విభజన అంతమై పోవాలి

దేశ విభజన అంతరించవలసినదే — ప్రస్తుత తీవ్ర పరిస్థితి సమసిపోవుట వలన గాని, శాంతి, అన్యోన్యతల ఆవ శ్యకతను క్రమక్రమముగ గుర్తించుట వలన గాని, అందరకు సంబంధించిన నిరంతర కార్యాచరణలను చేపట్టుట వలన గాని, మరేదో ఒక మార్గమున ఐకమత్యము ఏర్పడుట వలన గాని —

ఈ విభజన అంతరించి పోగలదని ఆశించుచున్నాము. ఐక్యత ఏ రూపమునన్నైననూ రావచ్చును — దాని సరియైన రూపము ఒక (మతపరమైన) మూల సిద్ధాంతముగ ప్రాధాన్యత గలదిగ గాక, వ్యావహారిక (సర్వమత సమ్మత) మైనదిగ ఉండవచ్చును. ఏ విధమునన్నైనా ఈ విభజన అంతరించి పోవలసినదే — తప్పక అంతరించి పోవును. ఏకము (అఖండము) కాని యెడల భారత దేశ భవిష్యత్తు తీవ్రముగ క్షీణించును. విఫలము కూడ కావచ్చును. కాని అటుల కారాదు.

భారతదేశపు పాత్ర

ఆసియా మేల్కొనినది. అందలి బహుభాగములు విముక్తములైనవి. లేదా ఈ క్షణమున విముక్తములు కానున్నవి. ఇంకనూ దాస్యమందున్న ఇతర భాగములు స్వాతంత్ర్యమునకై తీవ్రముగ పోరాడుచున్నవి. ఏ స్వల్పమో మిగిలియున్నచో అది నేడో, రేపో పూర్తియగును. ఈ విషయమున భారతదేశము తన పాత్రను నిర్వహించ వలసియున్నది. ఆ కార్యము శక్తిసామర్థ్యములతో ప్రారంభమైనది. తద్వారా అది తనకు గల సామర్థ్యమును అంతర్జాతీయ సభయందు తన స్థానమును పొందగలుగును.

తుదకు విజయము తథ్యము

మానవజాతి ఐక్యమగుటకు మొదలిడినది. అది అసంపూర్ణమైనా — నిర్మాణాత్మక ప్రారంభము మాత్రమే — అయిననూ, భయంకరమైన దుస్థితులతో పోరాడవలసియున్నది. ఈ పోరాటము భయంకరమైనదే. చరిత్రానుభవమును మార్గదర్శకముగ అంగీకరించినట్లయితే, విజయము సాధించువరకు ఆ తీవ్రత తప్పనిసరిగా ఉద్భృతము కాగలదు. ఇందున కూడ భారతదేశము ముఖ్యమైన పాత్రను నిర్వహించుటకు మొదలిడినది. విస్తృత రాజనీతిజ్ఞతను వృద్ధిపరచుకొనినట్లయితే — తాత్కాలిక పరిస్థితులకు, తక్షణ అవకాశములకు గాక — భవిష్యత్తును దృష్టియందుంచుకొని ముందడుగు వేసిన; ఆమె ప్రత్యక్షతయే, తామసము — భయాన్వితమైన అభివృద్ధికి; సాహసము — చురుకుదనముగల అభివృద్ధికి మధ్యగల తారతమ్యమును తెలియ

జేయును. ఇందునా ప్రళయాంతక మొకటి జోక్యము కలిగించుకొని ఆటంకములు కలిగించవచ్చును. లేదా చేసినదానినంతనూ నాశనము చేయనూ వచ్చు. అయినను తుదకు విజయము తథ్యము. ఏమైనప్పటికినీ, అనివార్యమైన ఆమె కదలికను, ఆమె సాధించిన దానిని బట్టి, ఐక్యత ప్రకృతి ధర్మమునందు అవసరమైనదని ముందుగనే నిర్భయముగ చెప్పవచ్చును.

అంతర్జాతీయ స్ఫూర్తి

ఇతర దేశములకు కూడ దాని ఆవశ్యకత విదితమైనది. ఆ ఐకమత్యమే లేనట్లయితే మున్ముందు చిన్న చిన్నదేశ ప్రజల స్వతంత్రమెన్నటికిని సురక్షితము కాజాలదు. పెద్దవి, శక్తివంతములైన దేశములు కూడ సురక్షితముగ మనజాలవనుట నిశ్చయము. అటులనే భారతదేశము ఖండములుగ యున్నచో ఆమె రక్షణయందు ఆమెకే నమ్మకముండదు. అందువలననే సర్వమానవ శ్రేయస్సు దృష్ట్యా, ఐకమత్యము ఏర్పడవలయును. మానవ దుర్బలత్వము, బుద్ధిహీనమైన స్వార్థతలు మాత్రమే దానిని ఆటంకపరచుచు, తమకెదురు దైవ ప్రయత్నములు కూడ నిష్ప్రయోజనములని అందురు. ప్రకృతి అవసరమునకు, దైవసంకల్పమునకు వ్యతిరేకముగ అధిక కాలమివి నిలువజాలవు. జాతీయత స్వతః సిద్ధించును. అంతర్జాతీయ భావము, విషయములను స్పష్టముగ చూడగలుగుట అంతర్జాతీయ రూపములు, స్థాపనలు అభివృద్ధిజెందవలయును. ఇరుదేశముల లేదా సంఘపౌరసత్వము వంటివి కూడ పెంపొందవచ్చును. ఈ విధముగ సంప్రదాయములు స్వతఃచేరువకావచ్చును. జాతీయ భావదృక్పథములు తమ తీవ్రతను విడనాడి పూర్ణమైన స్వీయదృష్టితో సమగ్రముగ సమన్వయించు కొనవచ్చును. మానవజాతి 'ఏకత్వము' నూతన శక్తితో ప్రకాశించును.

భారతీయ ఆధ్యాత్మికత ఎగుమతి

ప్రపంచమునకు భారతీయ ఆధ్యాత్మిక ప్రదానమప్పుడే ప్రారంభమైనది. భారతీయ ఆధ్యాత్మికత ఐరోపా, అమెరికాలలో నిరంతరము అధికాధిక పరిమాణమున

వ్యాపించుచున్నది. ఈ ఉద్యమము కాలానుగుణమైన విపత్తులు సంభవించిననూ అందరు అధికమైన ఆశతో ఆశ్రయము లభించు నని కూడ — ఆమె ప్రబోధములకు మాత్రమేకాక, ఆమె ఆత్మ కొరకు, ఆధ్యాత్మిక సాధనకొరకు దృష్టిని భారతదేశముపై నిలిపి యున్నారు.

ఇక మిగిలినదంతా నా వ్యక్తిగత నమ్మకము, భావము, నా ఆదర్శములే, భారతదేశములోను, పాశ్చాత్యదేశములలోను దూరదృష్టిగల మేధావులు వీటిని గురించి ఆలోచించుటకు మొద లిడిరి. ఇతర మార్గములకన్న ఈ మార్గమునందున్న కష్టములు భయంకరములైనవి. అయినా యీ కష్టములు అధిగమించబడు కొరకే వచ్చును. పరమేశ్వరుని సంకల్పమున్న, వాటిని అధిగ మించగలము. ఇచ్చటకూడ అత్మోన్నతి, అంతఃశ్చేతనలద్వారా ఈ పరిణామము జరగవలసియున్నది — ఇది విశ్వావకాశమే అయినా దీని ప్రారంభము, దీని కేంద్రోద్యమము భారతమాతదే కావలెను.

భారత స్వాతంత్రదినమైన ఈ దినమున నా భావమిది. ఇది ఎంతవరకు సంభవము — ఏ విధముగ ఎంత త్వరగా నెర వేరు ననునది, నూతన స్వతంత్ర భారతదేశముపై ఆధారపడి యున్నది.

> ఒక జాతి జీవనానికి అవసరమైన జ్ఞానము భారతదేశములోనే కనిపెట్టబడింది. ఈ రహ స్యాన్ని కొన్నివేల సంవత్సరాలు తనలో దాచిపెట్టింది. ఇతర దేశములు దానిని స్వీక రించుటకు సిద్ధంగా ఉన్నప్పుడు వాళ్లను అనుగ్రహిస్తుంది
>
> శ్రీఅరవిందులు

13 జూలై 1911 నాడు పార్థసారధికి రాసిన లేఖ

మనది సనాతన ధర్మము. మన రాజకీయములు కూడ ఈ సనాతన ధర్మముతో ముడిపడి వుంటాయి. మన దేశ స్వరాజ్యము కూడా అంతే. అందుకనే నిన్ను ఈ కుటిల రాజకీయాలకు దూరంగా వుండమని హెచ్చరిస్తున్నాను. కాని మనం కూడా ఈ పార్లమెంటరీ రాజ్యాంగ విధానాన్ని అవలంబించి దాని యొక్క లోటుపాట్లను గుర్తించటం తప్పనిసరి. అప్పుడుగాని దేశపరిపాలనకి అది ఎంత నిష్ప్రయోజనమో మనకి తెలియదు. ప్రస్తుతం ఈ దేశము ఒక సమిష్టి యోగపు తొలిదశలో ఉన్నది. 1905 సంవత్సరములో పైనుంచి దిగివచ్చిన మహాశక్తుల ఫలితమే అది. ఆ శక్తులు దేశాన్ని తామసికదశ నుండి తట్టి లేపినై కాని దాని పర్యవసానంగా పాత సంస్కారాలు పైకి వచ్చినయి. దేశంలో పాతుకుని వున్న కీడంతా 'నేను కూడా వున్నాను నా సంగతి ఏమిటి' అని విజృంభించి ఆ దివ్యశక్తులను దుర్వినియోగం చేసినయి. దేశంలో నేడు జరుగుతున్న విప్లవాత్మకమైన సంఘటనలు, మనుషులను రెచ్చకొట్టే ఉపన్యాసాలు, సభలు, ఊరేగింపులు, passive resistance, తుపాకులు, బాంబులు, హింసాకాండ మొ॥ అల్లకల్లోలమంతా దాని ప్రతాపమే. దీనిని అణచివేసేందుకు పాలకులు చట్టాలను క్రూరమైన శాసనాలను అమలు చేసారు. ఈ దమనకాండమంతా అపరిశుద్ధమైన రాజసిక ప్రవృత్తి. ఈ విధంగా నిరాశ చెందిన రాజసమునకు పర్యవసానంగా తామసికము బహిర్గతమైనది — ఆంగ్లేయుల స్వేచ్ఛావాదము నుండి మితవాదము పుట్టింది. ఆసియా ఐరోపాల సంకరజాతి బిడ్డ జాతీయవాదము జన్మించినది. విఫలమైన 'బాకునిన్' 'మాజిని' ప్రభృతుల నుండి ఉగ్రవాదము చెలరేగింది. అయితే భగవంతుడు ఈ ఉద్యమాలనన్నిటిని కొట్టిపారేశాడు. ఉగ్రవాదము ఇంకా కొనసాగుతూనే ఉంది గాని ఇది దాని అంతిమదశ. ప్రస్తుతం అదే మన శత్రువు. ఎందుకంటె బ్రిటిష్ పాలకుల దమనకాండను మనకు విరోధమని నేను అనుకోను. అది మనకు సహాయకారియే కాగలదు.

ప్రస్తుతం చెలరేగుతున్న హింసాకాండ, ప్రజలను రెచ్చకొట్టే కరపత్రాలు, మారణహోమము, దేశభక్తి పేరుతో జరుగుతున్న 'ఫెరింగీ కో మారో' అనే నినాదాలు, పన్నాగాలు, ఆధునిక సైన్యాన్ని లాఠీలతోటి, నాలుగు తుపాకులతోటి ఓడించాలనే మూర్ఖత్వము — ఇదంతా రజోగుణము యొక్క విలయతాండవమే. ఈ మూర్ఖత్వము పోయినప్పుడు గాని సత్యము ఆవిర్భవించేందుకు అవకాశముండదు. అప్పుడు ఈ జాతిలో సాత్విక మనస్సు ఆవిష్కారము కావాలి. భారతదేశము పునర్జన్మ నొందుటకు నాందిగా ఆధ్యాత్మికోద్యమము బలాన్ని పుంజుకోవాలి. కాని మార్గంలో కష్టాలు రాక తప్పవు. వాటి నెదుర్కోవాలి. ఈ సంఘటనల ద్వారా దేవుడు మనకి మార్గాన్ని చూపిస్తున్నాడు. అనువైన అనుభవముల నిచ్చి సరియైన పరిస్థితులను కల్పిస్తున్నాడు. మనము అనంతరము సన్మార్గముపై పయనించగలము.

13 జూలై, 1911

నవంబరు 1922 లో సి.ఆర్. దాస్‌కు రాసిన విషయములు

మానవుడు తన జీవితాన్ని ఒక నూతన ప్రాతిపదిక మీద నిలబెట్టి ఉన్నతస్థాయికి ఎదిగేంతవరకు ఈ వృధా ప్రయాస తప్పదు. ప్రపంచం కోసం ఈ ప్రయత్నాన్ని చేసి విజయము సాధించుటయే భారతదేశపు కర్తవ్యమని నేను నమ్ముతున్నాను.

అనువాదం: రాయప్రోలు లక్ష్మినరసింహ శాస్త్రి

జీవిత ఉత్తరార్ధంలో శ్రీఅరవిందుల అభిప్రాయములు

శ్రీఅరవిందులకు 1938 నవంబర్‌లో తొడ ఎముక చిట్లినప్పుడు కొంతమంది శిష్యులు వారిని సేవించుకునేవారు. ఆ రోజుల్లో శ్రీఅరవిందులు — వారి శిష్యుల మధ్య వివిధ అంశాలపై ఇష్టాగోష్టిగా సంభాషణలు జరిగేవి. ఇవి సాధారణంగా సాయం సమయాల్లో జరిగేవి. నిరోద్‌బరన్, ఎ.బి.పురాని వీరిద్దరు ఆ సంభాషణ

లను జ్ఞాపకం ఉంచుకొని అక్షరబద్ధం చేశారు. ఆ తరువాత వాటిని పుస్తకరూపంలో నిక్షిప్తం చేశారు. అటువంటి వాటిలో కొన్నిటిని పొందు పరుస్తున్నాము.

1938 డిసెంబరు 25

ప్రభుత్వ నియంత్రణయందు నాకు విశ్వాసం లేదు. ప్రజలకు కొంత స్వేచ్ఛ ఉండాలని నేను భావిస్తాను. ఎవరి పనులు వారు వారి వారి స్వంత తరహాలో చేసుకునే స్వాతంత్ర్యం ఉండాలి. ఆఖరికి శుద్ధతప్పు అయినాసరే, దానిని చేయడానిక్కూడా వారికి స్వేచ్ఛ ఉండాలంటాను. మనం చేసే తప్పులు, పొరపాట్ల ద్వారా ప్రకృతి మనకి శిక్షణ ఇస్తుంది. పాఠాలు నేర్పుతుంది. తనలోని మంచి చెడులను గురించి ప్రకృతికి బాగా తెలుసు. ఆ మంచి చెడులకు అన్ని అవకాశాలను కల్పిస్తూనే ప్రకృతి మానవుణ్ణి సృష్టించింది. *మానవ జీవితంలో పరిశోధనా స్వాతంత్ర్యం అనేది చాలా గొప్పది. సవాలు స్వీకరించడానికైనా, పొరపాట్లు చేయడానికైనా స్వేచ్ఛ లేకపోతే అసలు ప్రగతే ఉండదు.* (అయితే) ఐరోపాలో ప్రతీదీ యంత్రములచే నియంత్రించబడుతోంది. వారి జీవితం కూడా పరమ యాంత్రికము. వ్యక్తికి స్వేచ్ఛ ఉండదు. ఇక ఎదుగుదల ఎక్కడిది? పరిపాలన సక్రమంగా ఉండవలసిందే. అయితే అందులో వ్యక్తి స్వేచ్ఛకు, తెలివితేటలకు అవకాశం ఉండాలి.

1938 డిసెంబరు 27

ప్రాచీన భారతీయ విధానం సూటిగా జీవితంలోంచి ప్రాదుర్భవించింది. కనుకనే అందులో సకల విషయాలకు, సమస్త ప్రయోజనాలకు తావు ఉంది. దీనిలో రాజుల పాలన ఉంది. ఉన్నత వర్గాలకు స్థానం ఉంది. ప్రజాస్వామ్యం ఉంది. ప్రతీ యొక్క వర్గానికి ప్రభుత్వంలో ప్రాతినిధ్యం ఉంది.

ఐరోపాలో అయితే, అక్కడి పాశ్చాత్య విధానం మేధా ప్రతిష్ఠితం. కాబట్టి అక్కడ ప్రతీదాన్ని హేతువాదమే నడిపిస్తుంది.

స్వేచ్ఛకు గాని, వైవిధ్యానికి గాని అవకాశమే లేకుండా ప్రతీదీ ఖచ్చితంగాను కర్కశంగాను జరగాలని వాంఛిస్తారు. అది ప్రజా స్వామ్యమే అయితే, కేవలం ప్రజాస్వామ్యమే — మరి దేనికీ స్థానం లేదు. బహుముఖంగా స్పందించే కౌశలం ఉండదు.

భారతదేశం ఇప్పుడు ఆ పాశ్చాత్య విధానాన్ని అనుక రించాలని ప్రయత్నిస్తోంది. పార్లమెంటరీ విధానం భారతదేశానికి అసలు పడదు. అయినా సరే, పాశ్చాత్య నమూనాలనే అవలంబిం చటం మనకు మామూలే కదా.

ప్రశ్న: భారతదేశానికి ఆదర్శ ప్రభుత్వ విషయంలో మీ అభి ప్రాయం ఏమిటి?

నా ఉద్దేశం అంటే....! ఒకసారి రవీంద్రుడు రాసిన దాని లాంటిదే. అగ్రస్థానంలో రాష్ట్రపతి ఉండాలి. పాలనా విధానాలు కొనసాగేలా చూస్తూ వాటిని పరిరక్షరించడానికి అవసరమైనన్ని అధికారాలు ఆయనకు ఉండాలి. జాతికి ప్రాతినిధ్యం వహించే ఓ అసెంబ్లీ ఉండాలి. ఉన్నత స్థాయిలో రాష్ట్రాలు అన్నీ సమాఖ్యంగా సమైక్యం కావాలి. అయితే స్థానిక సమస్యలకు అనుగుణంగా శాసనాలు చేసుకోవడానికి తగినంత అవకాశం స్థానిక సంస్థలకు ఉండాలి.

1938, డిసెంబరు 30

జపాను వారికి ఆశ్చర్యకరమైన స్వీయ నియంత్రణాశక్తి ఉంది. వారు నిగ్రహం కోల్పోరు. వాదులాటకు దిగరు. కాని వారి గౌర వానికి భంగం వచ్చిందా.... ఇక అంతే ప్రాణం తీస్తారు. శత్రు వుగా వారు చాలా ప్రమాదకరమైన వారు. జపాను వారు చాలా మర్యాదస్తులు కూడాను.

అయితే ఇవన్నీ గత కాలానివే అనుకోవాలి మరి. ఉన్న తాశయాలను ఆచరణలో చూపిన అంతటి ఉదాత్తులు — ఐరోపా నాగరికత సోకడంతో ఆ పూర్వపు వైభవాన్ని అంతా కోల్పో యారు. ఇది చాల విచారకరమైన విషయం. ఎంతో జాలివేస్తుంది.

ఐరోపా వికృత నాగరికత వల్ల జపానుకు జరిగిన అరిష్టం అది. ఇప్పుడు అక్కడ చాలామంది ప్రజలకు వ్యాపార దృష్టే ఎక్కువ. డబ్బు కోసం వారు ఏ పనిని చేయడానికైనా సిద్ధమే.

ప్రశ్న: అంటే ఐరోపా నాగరికతలో అసలు మంచే లేదా?

అది మానవజాతి నైతిక స్థాయిని దిగ జార్చింది. ప్రాచీనులు వారి ఆదర్శాలను పరిరక్షించుకోవడానికి ప్రయత్నించారు. వాటిని మరింత ఉన్నత స్థాయికి పెంచే కృషి చేశారు. అయితే (మొదటి ప్రపంచ) యుద్ధం తరువాత ఐరోపా తన ఆదర్శాలన్నింటిని కోల్పోయింది. ప్రజలు సంస్కారం కోల్పోయి పెళుసుగా మారారు. స్వార్థపరులుగా తయారయ్యారు. దీని కంతకు వారి వ్యాపార దృక్పథమే కారణమని నేను భావిస్తున్నాను.

1939, జనవరి 18

నేను ఒక ఆధ్యాత్మిక పరిష్కారాన్ని ప్రతిపాదించాను. అది మానవుని ప్రాతిపాదికనే మార్చడానికి ఉద్దేశించింది. ఇది ఏదో ఒక ఉద్యమాన్ని లేవదీయడం కాదు. ఏ కొన్ని సంవత్సరాలకో పరిమితమైందీ కాదు. జీవితానికి పీఠికగా ఆధ్యాత్మికతను సంస్థాపితం చేసుకుంటే తప్ప నిజమైన పరిష్కారం లేదు.

మానవ స్వభావాన్ని మార్చటం — అతని తత్త్వములో మౌలికమైన పరివర్తనము గావించటం మనస్సుకు మించిన విషయం. అందుకని మానవ ప్రయత్నాలు, ప్రణాళికలు విఫలము గాక తప్పవు.

1938, జనవరి 29

(సి.ఆర్) దాసు ఓసారి నేరస్తులను గురించి ఏమన్నారో తెలుసా! "మొత్తం నా న్యాయవాద జీవితంలో పరమ నీచమైన తరహాకి చెందిన నేరస్తులు రాజకీయాలలో తప్ప మరెక్కడా తగల్లేదు".

*

పెట్టుబడీదారీ వర్గాన్ని నిర్మూలించాలని సోషలిస్టులు అంటారు గాని, నిజానికి ఆ వర్గాన్ని నిర్మూలించక పోవడమే మంచిది. జాతీయ సంపదకువారు ఆలవాలం. జాతి ప్రయోజనాలకోసం ఖర్చుపెట్టేటట్లు వారిని ప్రోత్సహించాలి. పన్నుల విధింపు అవస రమే. అయితే మన ఉత్పత్తిని పెంచుకోవాలి. కొత్త పరిశ్రమలు ప్రారంభించుకోవాలి. జీవన ప్రమాణం పెంచాలి. ఇవేవీ లేకుండా పన్నులు పెంచితే అది ఆర్థిక మాంద్యానికి దారి తీస్తుంది.

1939, ఫిబ్రవరి 2

ప్రజలు ఈ రోజుల్లో పార్లమెంటరీ తరహా ప్రభుత్వమనే ఆధునిక ప్రజాస్వామ్యాన్ని కోరుతున్నారు — పార్లమెంటరీ విధానానికి కాలం తీరి పోయింది. ఐరోపాను ప్రస్తుత నికృష్ట స్థితికి తీసు కొచ్చింది ఇదే.

(భారతదేశంలో) మనం పాత పంచాయితీ పద్ధతిని గ్రామాల్లో ప్రారంభించి అక్కణ్ణుంచి ఉన్నతస్థాయి వరకు అమలు చేయడానికి కృషి చేసుకుంటూ రావాలి. పంచాయితీ విధానం, వృత్తి సంఘాలు ఎక్కువగా ప్రజాప్రాతినిధ్యంతో ఉంటాయి. అవి ప్రజల అభిప్రాయాలు కలిగి ఉంటాయి. పార్లమెంటరీ విధానం దీనికి పూర్తిగా విరుద్ధం. ఈ విధానంలో స్థానిక సంస్థల కౌన్సిళ్ళు సరిగా పని చేయలేవు. ఈ కౌన్సిళ్ళకు ప్రజలతో సజీవమైన సంబంధం ఉండదు. కౌన్సిలర్లు కేవలం వేదిక ప్రసంగాలే చేస్తారు. వారి పదవీకాలంలో ఏం చేస్తారో ఎవరికీ తెలీదు. ఆ కాలం పూర్తి అయిన తరువాత ఏమీ మార్పు ఉండదు. మళ్ళీ యథాప్రకార సిద్ధిరస్తు! — అంతే! పదవీ కాలంలో మాత్రం వారు దండీగా దండుకుంటారు.

1939 డిసెంబరు 30

ఒక శిష్యుడు: వందేమాతరం గీతాన్ని జాతీయగీతంగా వ్యతిరే కించే వారు కొంతమంది ఉన్నారు. ఆ గీతంలోని కొన్ని భాగా

లను తొలగించడాన్ని కొంతమంది కాంగ్రెస్ వారు సమర్థి స్తున్నారు.

అయితే హిందువులు తమ సంస్కృతిని విడనాడుకోవాలి అన మాట!

ఆ శిష్యుడు: ఆ గీతంలో దుర్గ వంటి హిందూ దేవతల ప్రశంస ఉంది కాబట్టి అది ముస్లిములకు ఇబ్బందికరం అనేది వారి వాదన.

కాని, అది మతపరమైన గీతం కానేకాదు. అది ఓ జాతీయగీతం. దుర్గని భారతమాతగా భావిస్తారు. అటువంటప్పుడు ముస్లిములు దానిని ఎందుకు అంగీకరించరు? దుర్గ అనేది కవితల్లో వాడే ఒక ప్రతీక, ఒక భావన. హిందూ జాతీయ భావనలో హైందవ దృక్పథం సహజంగానే ఉంటుంది. దానికి అక్కడ స్థానం లేకపోతే ఇక హిందువులు తమ సంస్కృతిని మరిచిపోవాలన మాట. బాగుబాగు. "అల్లా-హో -అక్బర్" ను హిందువులు వ్యతిరేకించరు కదా!

అటువంటప్పుడు హిందువులు తమ దేవతలను ఎందుకు ఆరాధించకూడదు? కాదు గూడదంటే వారు మహమ్మదీయ మతాన్ని స్వీకరించడమో, లేకపోతే ఐరోపా సంస్కృతిని చేపట్టడమో, అదీ కాకపోతే నాస్తికులుగా మారడమో చేయాలి. అంతే.

నేను సి.ఆర్. దాస్‌తో (1923) ఈ విషయం చర్చించాను. బ్రిటిష్ వారు వెళ్ళేలోగానే ముస్లిం సమస్యని ముందు పరిష్కరించాలి, లేకపోతే ప్రజా యుద్ధం ప్రమాదం ఉందని చెప్పాను. దానిని ఆయన అంగీకరించారు. ఈ వివాదాన్ని పరిష్కరించాలని కూడ అనుకున్నారు.

సర్ స్టాఫర్డ్ క్రిప్స్‌కు సందేశం

భారతదేశానికి సంపూర్ణ స్వతంత్ర్యం ఇచ్చేందుకు తొలిమెట్టుగా వలసరాజ్య ప్రతిపత్తి ప్రతిపాదనతో బ్రిటిష్ ప్రభుత్వం సర్

స్టాఫర్డ్ క్రిప్స్‌ను 1942 లో ఇండియాకు పంపింది. ఆ సందర్భంగా శ్రీఅరవిందులు ఈ క్రింది సందేశాన్ని క్రిప్స్‌కు అందజేసారు.

మీ రేడియో ప్రసంగాన్ని విన్నాను. ప్రస్తుతం నా కృషి రాజకీయరంగంలో కాకుండా ఆధ్యాత్మిక రంగంలో ఉన్నప్పటికీ, జాతీయ నాయకునికిగా, భారత స్వాతంత్ర్యం కోసం పనిచేసిన కార్యకర్తగా మీకు నా అభినందనలు తెలియ జేస్తున్నాను. ఈ నిర్ణయాన్ని తేవడానికి మీరు చేసిన కృషిని ప్రశంసిస్తున్నాను.

భారతదేశం తనకు తానే నిర్ణయించుకోవడానికి, తన పూర్తి స్వేచ్ఛను, స్వతంత్ర్యాన్ని, ఐక్యతను వినియోగించుకుని ప్రపంచంలో స్వతంత్ర జాతుల మధ్య సమర్థవంతమైన స్థానం పొందే విధంగా నిర్ణయం తీసుకోవడానికి భారతదేశానికి ఇచ్చిన ఒక అవకాశంగా దీనిని నేను ఆహ్వానిస్తున్నాను.

అన్ని విభేదాలు, వైషమ్యాలు పక్కకు పెట్టి ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకుంటూ నాయకులు ఈ ప్రతిపాదనను అంగీకరిస్తారని నేను భావిస్తున్నాను. బ్రిటన్ భారత దేశాల మధ్య ఇదివరకటి ఇబ్బందులు, ఉద్యమాల స్థానే స్నేహ సంబంధాలు నెలకొనగలవని కూడా నేను ఆశిస్తున్నాను.

స్వతంత్ర జాతిగా తన ఆధ్యాత్మిక శక్తితో సౌభాగ్య వంతమైన జీవితాన్ని మానవ జాతికి భారతదేశం రూపొందించ డానికి వీలుగా, ప్రపంచ మహాసమాఖ్య వైపు ఇది ముందడుగు కాగలదు. మీ కృషిలో ఏ విధంగానైనా ఉపయోగపడగలనేమో ననే భావనతో నేను నా సమ్మతిని బహిరంగ పరుస్తున్నాను[11].

31-3-1942

*

---

[11] క్రిప్స్ ప్రతిపాదనను అంగీకరించి ఉంటే, దేశ విభజనగాని, దాని ఫలితంగా కలిగిన రక్తతర్పణంగాని, భారత-పాకిస్తాన్ యుద్ధాలు గాని జరిగి ఉండేవి కావు. — సంపాదకుడు

1946 నాటి బ్రిటిష్ కేబినెట్ కమిషన్ పై అభిప్రాయం కోసం అమృత బజార్ పత్రిక పంపిన అభ్యర్థనకు శ్రీఅరవిందుల సమాధానం:

స్వచ్ఛందంగా, తనకు తానై వ్యక్తిగతమైన అభిప్రాయాన్ని అభివ్యక్తం చేయడం అనవసరమని శ్రీఅరవిందులు భావించారు. దాని కోసం అధికారికంగా ఆయనను కోరి ఉంటే ఆయన తన అభిప్రాయాన్ని ఇచ్చి వుండేవారు. భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్య ధ్యేయానికి సదా కట్టుబడిన వ్యక్తి శ్రీఅరవిందులు. ఆత్మగౌరవం గల జాతికి అది తగిన ఏకైక ఆశయంగా ఆయన విస్పష్టంగా తొట్ట తొలిగా బహిరంగంగా ప్రతిపాదించారు. సుదీర్ఘమైన యుద్ధపు రోజుల తరువాత నాలుగేళ్ళకు ప్రపంచం మొత్తం మీద విస్తృత మైన సంచలనం, విప్లవాలు ప్రారంభం అవుతాయని, భారతదేశం స్వాతంత్ర్యాన్ని సాధిస్తుందని 1910 లోనే శ్రీఅరవిందుల భవిష్య వాణి తెలియజేసింది. దీనిని వారు అధికారికంగా ప్రకటించారు[12]. ఆ తరువాత కూడా భారతదేశానికి త్వరలోనే స్వాతంత్ర్యం వచ్చి తీరుతుందని, దానిని ఏదీ నిరోధించ లేదని శ్రీఅరవిందులు అంటూ వచ్చారు.

భారతదేశ స్వాతంత్ర్యాన్ని అంగీకరిస్తూ ఆఖరికి బ్రిటన్ ఒక అనుకూలమైన ఒప్పందంతో భారతదేశానికి రాగలదని శ్రీఅరవిందులు పదే పదే భవిష్య దర్శనం చేసేవారు. ఆయన భవిష్య దర్శనం నిజం కావడానికి ఇప్పుడు బ్రిటిష్ కేబినెట్ మిషన్ ఒక సూచన. ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడం అనేది జాతీయ నాయకుల వంతు. దీనివల్ల తక్షణ ఫలితం ఏమైనప్పటికి, భారతదేశానికి విముక్తి ఖాయం.

24-3-1946

---

[12] 1910 జనవరి లో ఈ భవిష్యవాణి ప్రకటనను శ్రీఅరవిందులు తమిళ జాతీయ వారపత్రిక అయిన 'ఇండియా' విలేఖరికి ఇచ్చారు. కలకత్తాలోని కృష్ణ కుమార్ గృహంలో శ్రీఅరవిందులను ఆ విలేఖరి కలుసుకున్నారు. శ్రీఅరవిందులు ధృవీకరణతో అది ప్రచురితం అయింది. *"On Himself"* (*SABCL* Vol. 26, p. 390) అనే గ్రంథంలో దాని పాఠాన్ని చేర్చారు

— సంపాదకుడు.

1948 జూలై 18 లేఖలోని అంశం

ప్రస్తుత పరిస్థితులను చూసి నెత్తిమొత్తుకుంటున్న మీ విలేఖరులకు నేనేమీ శుభసందేశ మివ్వలేను. పరిస్థితులు ఘోరంగా ఉన్నాయి. అవి మరింత ఘోరాతిఘోరంగా తయారౌతున్నాయి. ఏ క్షణంలోనైనా మరింత అధమాధమంగానూ, ఇంకా వీలైతే మరింత నీచాతినీచ పరిస్థితికి దిగజారవచ్చు. ఈ ఆందోళిత ప్రస్తుత ప్రపంచంలో ఎటువంటి వైపరీత్యమైనా సరే సంభవమే అనిపిస్తుంది.

ఒక నూతన ఉత్తమ ప్రపంచం ఆవిర్భవించాలంటే పాత సంస్కారాలు వదిలి పోవాలి. దానికోసం కొన్ని విషమసంఘటనలు జరిగితీరుతాయి. కాబట్టి ఇటువంటి పరిస్థితులు అవసరం అని వారు తెలుసుకోవడం మంచిది. ఇటువంటి పరిస్థితులు ఎంత దారుణమైతే, నూతన ప్రపంచ ఆవిర్భావం అంత త్వరగా జరుగుతుంది. ఈ ఆవిర్భావం ఇక ఏ మాత్రం వాయిదాపడదు. అలాగే ఉషోదయం అనివార్యమని కూడా వారు జ్ఞాపకం ఉంచుకోవాలి.

అంతే కాదు. ఆవిర్భవిస్తుందని మనం ఆశిస్తున్న నూతన ప్రపంచ స్వరూపమే వేరుగా ఉంటుంది. పాత దానికి కొత్త రంగులు పులిమినట్లుగా గాదు. దాని నిర్మాణం లోపలి నుండి, అంతరంగికంనుండి జరగవలసినదే తప్ప బయటి నుండి కానే కాదు. ఈ విషయం కూడా వారు బాగా గుర్తుంచుకోవాలి.

కాబట్టి ఉత్తమమైన మార్గం ఏమిటంటే.... సత్యాన్ని వక్రీకరిస్తూ బయట జరిగే విషయాలలో మరీ ఎక్కువగా లీనం కాకూడదు. నూతన ప్రపంచం, అది ఏ రూపం ధరించినా దానికి సంసిద్ధం అయ్యే విధంగా వారు ఆంతరంగికంగా ఎదుగుతూ సమాయత్తం కావాలి.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు.

ఆరోగ్య పత్రం:

జీవితం పై హేతువు ఆధిపత్యం

కొంతమంది మనుషులు నిర్లక్ష్యంగా ప్రవర్తించి శరీరాన్ని క్షోభ పెడతారు. మామూలుగా జీవితంలో శరీరాన్ని గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు — నిప్పులో చేయి పెడితే కాలుతుంది. నీళ్ళల్లో పడితే మునిగిపోతారు — అందరికి తెలుసు. ఈ విషయాలు మనుషులకు గుచ్చి గుచ్చి చెప్పనక్కర్లేదు. కాని కొంతమంది అజ్ఞానులు జీవితంలో నియమబద్ధంగా ఉండాలన్న విషయాన్ని త్రోసిపుచ్చి విచ్చలవిడిగా ప్రవర్తిస్తారు. తత్కారణంగా వాళ్ల ఆరోగ్యం దెబ్బతింటుంది.

నాకు బాగా జ్ఞాపకం ఉంది. చాలాకాలం క్రితం — ఇక్కడికి ఒకాయన వచ్చాడు — ప్రభుత్వ ప్రతినిధిగా నిలబడదలచుకున్నాడట. ఆ సందర్భంలో నా సలహా కోసం ఆయన్ని నాకు పరిచయం చేశారు.

ఆశ్రమం గురించి, ఇక్కడి జీవితం గురించి, జీవనానికి అవసరమైన క్రమశిక్షణ విషయంలో నా అభిప్రాయం గురించి ఆయన ప్రశ్నించారు. తన ఇబ్బందులను గురించి కూడా చెప్పుకున్నాడు. ఈ వ్యక్తికి నిత్యం ధూమపానం చేసే అలవాటు ఉంది. మితిమీరి తాగుతాడు. ఇట్టిట్టే అలిసిపోయి ఆయాస పడిపోతాడు. ఒక్కొక్కప్పుడు తనను తాను తమాయించుకోలేడు కూడా.

ఆయనతో నేను అన్నాను కదా: "చూడు! ముందు ధూమపానం మానేయాలి నువ్వు. తాగుడికి కూడా దూరంగా ఉండాలి." నేను ఏదో ఘోరమైన విషయం చెప్పినట్టు ఆశ్చర్యంగా నా వైపు చూశాడు. "అయితే, ధూమపానం చేయక, తాగుడూ మానేసి — బతికి ఏం ఉద్ధరించడానికట?" అన్నాడు. ఇదీ ఆయన స్థితి.

"నువ్వు ఇంకా ఆ స్థితిలోనే ఉంటే నీతో మాట్లాడి ప్రయోజనం లేదు" అన్నాను.

ఇటువంటివి చాలా తరచుగానే జరుగుతూ ఉంటాయి. మనకు అవి విపరీతంగా అనిపిస్తయి. జీవితమంటే ధూమపానం, తాగుడు లాంటి వ్యసనాలు మాత్రమే కాదని మనకు తెలుసు. అయితే సామాన్య ప్రజలకు కోరికల సంతృప్తియే జీవిత పరమావధి. అదే వారి స్వేచ్ఛ అవుతుంది. అది వాస్తవానికి ఓ పెడదారి. జీవిత లక్ష్యాన్నే త్రోసిపుచ్చే ఓ వికారం. భౌతిక జీవితంలో ప్రాణిక ప్రేరణను, ఆలోచనను వికలం చేసే ఓ అనారోగ్య జోక్యం. సాధారణంగా జంతువుల్లో సైతం ఉండని జాడ్యమైన ఓ వ్యసనమే!

*

ఇక పొగాకు విషయం — ఇందులో నికోటిన్ అనేది ప్రమాదకరమైన విషం. జీవకణాలను నాశనం చేసే విషం ఇది. మొదటిసారి పొగాకు వాడినప్పుడు ఇబ్బంది పెట్టినా ఆ తరువాత దానిని విషమని ఎవరూ ఓ పట్టాన భావించరు. కనుకనే అది నెమ్మదిగా పనిచేసే విషమని నేను అన్నాను. మొదటిసారి ధూమపానం చేసినప్పుడు అది శరీరానికి పడక, చాల ఇబ్బంది కలుగుతుంది. అంటే "ఇది కూడదు సుమా" అని నీకు తెలియజేస్తూ హెచ్చరిస్తోందన్నమాట. బుద్ధిహీనులు మాత్రం ఈ హెచ్చరికను శరీరానికి గల అసమర్థతగా భావించి ధూమపానాన్ని కొనసాగిస్తూ ఆ విషానికి అలవాటు పడిపోతారు. కాబట్టి శరీరం ఇక ఏ ఎదిరింపు లేకుండా తనను తానే నాశనం చేసుకుంటుంది. అప్పుడు శరీరం ఎదురు తిరిగే ప్రసక్తే ఉండదు.

భౌతికంగాను, నైతికంగాను కూడా ఇదే వరస. *కూడని పనిని ఏదైనా నువ్వు చేసినప్పుడు "వద్దు, వద్దు" అని నీ అంతరాత్మ సన్న సన్నగా చెపుతూనే ఉంటుంది. అయినప్పటికీ ఆ మాటను తోసేసి ఆ పనినే కొనసాగిస్తావు అనుకో — ఇక అప్పటినుండి అలా చెప్పడం మానేస్తుంది నీ అంతరాత్మ.* అప్పుడు నువ్వు ఏ చెడ్డపని చేసినా అంతరంగంలోంచి ప్రతిస్పందనలు ఏవీ ఉండవు. అవును మరి. నీ అంతర్వాణి నీతో మొరపెట్టుకున్నప్పుడు దాన్ని వినకుండా నిరాకరించావు. ఇంకేం

చేస్తుంది. మాట్లాడక ఊరుకుంటుంది. అంతే కదా! ఇక అప్పుడు నీ పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టు అధమంనుండి అధమాధమానికి, రాపిడి నుండి రంధ్రానికి మారుతుంది. అది మాములే!

పొగాకు విషయంలో కూడా సరిగ్గా ఇంతే! మొదటిసారి ధూమపానం చేసినప్పుడు శరీరం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. దాన్ని భరించలేక వాంతి చేసుకుని బయటకు తోసేస్తుంది. అంటే "ఇది నాకు పడదు. ఏ విధంగాను ఇది నాకు వద్దు మొర్రో" అని మొత్తుకుంటుంది. అయినా సరే, నీ మానసిక, ప్రాణిక మూర్ఖత్వంతో ధూమపానాన్ని బలవంతంచేసి తప్పనిసరి చేస్తావు. అప్పుడు ఇక శరీరం ఏమీ చేయలేక క్రమేపి వ్యతిరేకించడం మానేస్తుంది. ఆ విధంగా తను పూర్తిగా విషపూరితమై పాడైపోవడానికి తనే అవకాశం ఇస్తుంది శరీరం. ఫలితంగా శారీరక ప్రక్రియ క్షీణిస్తుంది. నరాల పటుత్వం తగ్గిపోతుంది. ఇక ఏ రకమైన సందేశాన్ని అవి తీసుకెళ్ళ లేవు. అవి విషపూరితం అయిపోతాయి. అప్పుడు వాటికి సందేశాన్ని మోసుకెళ్ళే శక్తి ఎలా ఉంటుంది? ఆఖరికి నరాల బలహీనతతో వణుకు ప్రారంభమౌతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు.

సంతానోత్పత్తి విషయంలో తల్లిదండ్రుల బాధ్యత

శిశువు గర్భంలో పడినప్పటి క్షణంలో తల్లిదండ్రుల చైతన్య స్థితి చాలా ప్రాముఖ్యమైనదని స్పష్టమౌతోంది. ఆ క్షణంలో వారు పరమ నీచ, నికృష్ట భావనలు కలిగి ఉంటే అవి పుట్టిన పిల్లల్లో తప్పక ప్రతిబింబిస్తాయి!

ఆ విధంగా అస్తవ్యస్తంగా తయారై, సరైన పెంపకంలేక పాక్షికంగా ఎదిగిన పిల్లలు (అంటే వారి వ్యక్తిత్వంలో అనేక లోపాలు, లోటుపాట్లు ఉండడం) అర్ధచైతన్యంతో, అర్ధ వ్యక్తిత్వంతో ఉన్న పిల్లలు నిశ్చయంగా తల్లిదండ్రుల చైతన్య లోపం వల్లనే ఆ విధంగా తయారౌతారు. గర్భం కలిగే సమయంలో సరైన చైతన్య స్థితి లేకపోవడమే దానికి కారణము. మరణ ఘడియలలోని చైతన్యస్థితి రాబోయే జన్మకి ఎంత ప్రధానమో గర్భధారణ సమయంలోని తల్లిదండ్రుల చైతన్యస్థితి కూడా అంత ప్రధానమే. అది శిశువుపై గట్టి ముద్రపడి జీవితకాలమంతా ప్రతిఫలిస్తూంటుంది. ఇవన్నీ చాలా స్వల్ప విషయాలుగానే కనిపిస్తాయి. ఆ క్షణంలో ఉన్న మనః స్థితి, ఆ క్షణంలో ఉండే ఆకాంక్ష లేదా క్షుద్రత్వము, ఆ ముహూర్తంలో కదలిన భావములు అంత ముఖ్యమనిపించక పోవచ్చు. అయితే వాటి పర్యవసానం మాత్రం అతి ముఖ్యమైనది. ఆ లవలేశం వల్లనే కదా కొరగాని శిశువు, దుర్మార్గుడు, నిష్ప్రయోజకుడు భూమ్మీదకు ప్రవేశించేది. ఈ విషయం ఎవరికీ తెలియదు.

శిశువు దుష్ప్రవర్తనకి తల్లిదండ్రులు తర్వాత కోప్పడతారు. దండిస్తారు. నిజానికి ఆ శిశువు ప్రవర్తనకి తమని తామే "ఛీ ఇటువంటి బిడ్డకు జన్మనిచ్చే క్షణంలో నేను ఎటువంటి హీనచైతన్యస్థితిలో ఉండి ఉంటానో కదా!" అని తిట్టుకోవాలి అది ముమ్మాటికి నిజం.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకట్రామ శాస్త్రి

తల్లి యొక్క ఆకాంక్ష, తపన, పరిసరములు పుట్టబోవు శిశువుపై అనంతప్రభావమును కలిగి యుండును.

సమాచార పత్రము


యోగం చేసే వాళ్లకి భయం పనికి రాదు. ఈ విషయాన్ని గురించి శ్రీమాత బుధవారం క్లాసులో 15 ఆగస్టు 1955 నాడు ప్రసంగించారు. *"మనిషిలోని మాలిన్యాలన్నిటిని వదిలించుకోని, తనను తాను పునీతము గావించుకొనుట ఈ యోగానికి చాల ముఖ్యము. అటుల చేయనిచో దైవము కూడ నిన్ను రక్షించ లేడు!"*

"భయము చాల చెడ్డది. యోగానికి శత్రువు. ప్రపంచంలో దైవము చేయు కార్యాన్ని పాడు చేసేందుకే ఈ అసుర శక్తులు పుట్టినయి. భయము వారి చేతులలో చాలా బలమైన ఆయుధము. యోగము నిష్ఠగా చేయదల్చుకున్నవారు భయాన్ని ఏమాత్రము దరిచేయ నీయరాదు. చేతనలో దానికే మాత్రము తావీయరాదు. గుండె నిబ్బరంతో ధైర్యంగా ముందుకు సాగిపోవాల్సిందే.

ఈ యోగము చేయువారు చిత్తశుద్ధితో నిశ్శేషంగా ఆత్మసమర్పణ గావించుకోవాలి. దీని అర్థమేమిటనగా స్వలాభాపేక్ష ఏమాత్రము పనికిరాదు. బేరసారాలుండరాదు. 'నీ మీద భారం వేసాను కనుక నువ్వు నన్ను రక్షించితీరాలి' అనే కొంటె వేషాలు, బిరుసుతనం పనికి రావు. భగవత్కారుణ్యము తప్పకుండా నిన్నంటి పెట్టుకొనే వుంటుంది. *కాని, ఋజువుల కోసం నువ్వు ప్రాథేయపడకూడదు. నిర్నిబద్ధంగా తమను తాము సమర్పించుకో గలిగిన వారే ఈ బాట మీద నిర్భయంగా నడవగలరు."*

15 ఆగష్టు 2000 శ్రీఅరవిందుల 128 వ జన్మదినోత్సవము. ఆ రోజు ప్రొద్దున శ్రీఅరవిందుల మందిర దర్శనము, సమాధి దగ్గర ధ్యానము. సాయంత్రము ప్లేగ్రౌండులో కవాతు ప్రదర్శన, ధ్యానము వుంటాయి.

11-13 ఆగస్టు తేదీలలో శ్రీఅరవింద సొసైటీ వార్షిక మహోత్సవాలు, 17-26 ఆగస్టు తేదీలలో డా॥ ఎమ్.వి.నడ్కర్ణి గారి సావిత్రి అధ్యయన సత్ర జరుపబడును.



సాధన యొక్క మూలాధారాలు

అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2000

సాధన యొక్క మూలాధారాలు

శ్రీమాతారవింద ప్రవచనములు

విభాగము I

సాధనకు అవసరమైన మూడు ప్రధాన సూత్రాలు

విభాగము II

సాధనకు అవసరమైన ఐదు ఆంతర్గుణాలు

ఇతర వ్యాసాలు

మీకిది తెలుసా

నిన్ను నీవు భగవంతునికి ఎంత గాఢంగా సమర్పించుకుంటే అంత గాఢంగా ఆయన నీ అనుభవంలోకి వస్తాడు. ఇది ఊరికే మనస్సుకి అనిపించటమో లేక స్ఫురించటమో కాదు. అది చాలా ప్రత్యక్షమైన సాక్షాదానుభూతి. నిన్ను నీవు ఎంత ఎక్కువగా ఇచ్చుకుంటే అంత ఎక్కువగా ఆయన నీతోటి వుంటాడు. అన్ని సమయములలోను నీతోటే ఉంటాడు. నీ పనులన్నిటిలోను, నీ జీవితంలో ఎటుపక్క చూసినా ఆయనే. నీ మనసులో ఆయన నిత్యం కదులుతూనే ఉంటాడు. అందుకని నీ ప్రశ్నలన్నింటికీ వెంటనే జవాబు వస్తుంది. దేవుడు నిర్విరామంగా నీతోటే ఉంటాడు. నువ్వు నడుస్తే ఆయన నీతోటే నడుస్తాడు. నువ్వు నిద్రపోతే ఆయన కూడా నీతోటి నిద్రపోతాడు. నువ్వన్నం తింటే ఆయనకూడా నీతో అన్నం తింటాడు. నువ్వు ఆలోచించే విషయాల్ని గురించి ఆయన కూడా ఆలోచిస్తాడు. నువ్వు ప్రేమించినట్లయితే ఆయన కూడా ప్రేమిస్తాడు. కాని ఆ స్థాయికి చేరేందుకు చాలా సాధన చేయాలి. నిన్ను నీవు సంపూర్ణంగా సమర్పించుకోవాలి. ఆపాద మస్తకం ఏమాత్రం వెలితిగాని ఏవిధమైన సంకోచముగాని లేకుండా జరగాలి. నీకని దేనిని మిగుల్చుకోరాదు. దాపరికం పనికిరాదు.

ఏ విషయమైనా సరే, ఎంత చిన్న విషయమైనా సరే, దానిని గురించి నిర్లక్ష్యం పనికిరాదు. ఎందుకని? నీకు కావలసింది నూటికి నూరుపాళ్ల సంతోషం కనుక. నువ్వు *దైవానికి సమర్పించిన విషయములన్నీ సంతోషంగా పరిణమిస్తాయి. సమర్పించని విషయములు పరిణమించవు.* ఆ మేరకు సంతోషానికి అవకాశాన్ని పోగొట్టుకుంటున్నావన మాట. దేవుడు నీకు కలిగించవలసిన సంతోషాన్ని వృధాపరుస్తున్నావన మాట. ఆయన నీ చెంతకు రాబోవు మార్గంలో గోడలు కడుతున్నావన మాట. నీకు ఆయన నీవద్ద వున్నట్లు తోచదు. నీవాయనకు చెందవు. నీ అల్పమైన కోరికలు, నీకు ప్రియమైన మనుమలు నీ మనస్సులో తారాడుతున్నంత కాలం నీవు దైవానికి చెందే ప్రశ్నే లేదు. నీ ఆలోచ

నలు, నీ సంవేదనలు, నీ కార్యములు, ఆవేశాలు ఇవన్నీ నిన్ను నీవు దైవానికి ఇచ్చుకోకుండా అడ్డుపడతాయి. ఈ వందలాది విషయాలను అంటిపెట్టుకున్నంత కాలం నీవు దైవసాన్నిధ్యాన్ని పొందలేవు. ఇవన్నీ నీకు దైవానికి మధ్య గోడలు కావా? అటులగాక *నీవాయనకు సర్వాంగీణంగా సమర్పించుకున్నావనుకో. నీకంటూ దేనినీ అట్టే పెట్టుకోలేదనుకో. ఇక ఆయన నిన్ను ఒక్క నిముసమైనా వదలడు. నువ్వు ఏం చేసినా ఏం తలచినా ఏ అనుభూతి పొందినా నిరంతరం ఆయన నీవాడే.*

మూలం: శ్రీమాత

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

ఈ సాధనకు ముఖ్యంగా కావలసినది బాహ్యాంభ్యంతరాలలో, దైవానికి, తత్స్వరూపుడైన గురువునకు, శరణాగతి కావడం. ధ్యానము, ఏకాగ్రత, సేవ, కర్మ – ఇలాంటివన్నీ మనకంటే అతీతమైన శక్తి యొక్క పాదాల దగ్గరకు చేరుకోవడానికి ఉపకరించే సాధనాలు లేదా సత్యసోపానాలు. *జగజ్జనని ప్రతి క్షణము ప్రయాణంలో చేయూతనిస్తూ నీకు మార్గంలో కర దీపికగా సహాయపడుతుంది.* ఆ తల్లి దయ నీ అవసరం కొద్దీ నీ స్వభావాని కనుగుణంగా దానంతటది వెల్లివిరుస్తుంది. ఎక్కడ నీకు ఆ తల్లి దయ అవసర మనిపిస్తుందో అక్కడ ఆమె శక్తి నీ కష్టసాధ్యమైన ప్రయాణాన్ని సులభసాధ్యంగా పరిణమింప జేస్తుంది. అప్పుడా మార్గము ఒక వసంతఋతు సౌందర్యాన్ని భాసింపజేస్తుంది. *ఆ తల్లి ప్రేమ, శాంతి, జ్ఞానము, చైతన్యములను సాధకుని యొక్క చేతికి అందేటంత దూరంలో నిక్షేపిస్తుంది.*

*

దివ్యకారుణ్యము, దివ్యశక్తి సర్వాన్ని కరతలామలకం చేస్తుంది. కాని దీనికి కావలసిన దొక్కటే. సాధకునిలో దాన్ని స్వీకరించే పరిపూర్ణమైన అంగీకారం. సాధన యొక్క పరమార్థమంతా ఈ పరిపూర్ణ అంగీకార సమర్పణమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు

మొదటి భాగము:

సాధన యొక్క మూలాంశాలు

ఈ ప్రపంచంలో జరిగే సర్వకార్యములను వెనుక నుండి దేవుడే తన 'శక్తి'[1] (దేవి) ద్వారా నిర్వహిస్తాడు – కాని యోగమాయచే కప్పబడి జీవుని యొక్క అహంకారప్రకృతి ద్వారా నడిపిస్తాడు.

యోగంలోకూడా అంతే. సాధకుడు సాధనకూడ ఆయనే. ఆయన శక్తియే (దేవి) సాధకుని మీద తన వెలుగును, శక్తిని, జ్ఞానాన్ని, చేతనానందములను వర్షింప చేయగా సాధన కొనసాగుతుంది. అయితే అపరప్రకృతి రాణిస్తున్నంతవరకు మానవ ప్రయత్నం తప్పనిసరి.

ఈ ప్రయత్నం ఆకాంక్ష, నిరాకరణ, ఆత్మ సమర్పణ అనే మూడు విధాలుగా వుంటుంది.

శ్రీఅరవిందులు

ఆకాంక్ష లేక అభీప్స[2] (Aspiration)

మానవస్థాయి నుండి మరొక ఉన్నతస్థాయికి ఎదిగే ప్రయత్నమే యోగము. సాధారణ జీవితము మానవునికి తృప్తి నివ్వదు. మనస్సుకు పైన ఉన్న భూమికలద్వారానే అటువంటి తృప్తి లభిస్తుంది. మానవుడు ఆ భూమికలను కాంక్షిస్తాడు. వాటి కోసం తహతహలాడుతాడు. సంవేదన చెందుతాడు – దాని పేరే ఆకాంక్ష లేక అభీప్స. అది మనిషి హృదయాంతరాలలో అంకురిస్తుంది. అక్కడి నుంచి పైకి వచ్చి మనిషిలో సర్వత్రా వ్యాపిస్తుంది. ఈ పిలుపుకు పైనుంచి జవాబు వస్తుంది. అప్పుడు పైనుంచి దిగి వచ్చిన శక్తులు మనిషిని ప్రేరేపిస్తాయి. తత్ఫలి

---

[1] శివ శ్శక్త్యా యుక్తో.... శివుడు శక్తి ద్వారా ప్రవర్తించును.

[2] సంవేదన, ఆకాంక్ష, ఉద్ధత, సత్కామన, అభీప్స (ఉపనిషత్తులలో వాడిన మాట) సత్యకామం. ఆకాంక్ష అభీప్స అనే పదాలు ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయి

తంగా మనిషి ఆకాంక్ష కూడా తీవ్రస్థాయి నందుకుంటుంది. మనిషి యొక్క అన్ని విభాగాలలోకి ఆ శక్తి దిగివచ్చి వాటిని దివ్యకాంతులతో వెలిగింప చేస్తుంది. మనిషి తేజోవిరాజితుడౌ తాడు. సిద్ధి పొందుతాడు. చివరగా పరిణామము, రూపాంత రీకరణము పొందుతాడు. — సంపాదకుడు

శ్రీఅరవింద వాణి:

మనిషి చాలా అప్రమత్తంగా ఉండి నిరంతరం ఆకాంక్షిస్తూ ఉండవలసిందే. బుద్ధిబలంతోటి, హృదయావేదనతోటి, ప్రాణికపు (vital being) అనుమతితోటి ఆకాంక్షిస్తూ, ఆఖరికి భౌతిక చైతన్యము సహితము తన స్వభావమును మృదుపేశలము జేసికొని ఊర్ధ్వ శక్తులకు ఉన్మీలనము కావలసినదే.

*

ఆకాంక్ష అనగా ఊర్ధ్వశక్తులకు — అనగా దైవానికి, దివ్యచైతన్యమునకు పిలుపు.

*

ఆకాంక్ష యొక్క రూపము కోరికవలె ఉండదు. అది అంతరాత్మ యొక్క వేదన. దైవం కోసం నిరంతరం అనుభూతమయ్యే తపన. దైవోన్ముఖంగా పయనము.

*

ఆకాంక్ష అనగా కోరుకొనుట కాదు. స్వార్థబుద్ధితో కాంక్షించటం కోరిక. ఊర్ధ్వచైతన్యమును తనలోకి ఆహ్వానించుకొని తనను ఆక్రమింపించుకొనుటకై జరిపే ప్రక్రియ ఆకాంక్ష. అది ఎంత తీవ్రంగా ఉంటే ఆత్మనివేదన కూడ అంత తీవ్రంగా సంభవిస్తుంది.

*

పశువుకు తన పశుత్వాన్ని గురించిన జ్ఞానముండదు. కాని మనిషి అటుల కాదు. తన అర్భకత్వాన్ని గురించి, పరిమితులను గురించి, వీటిని దాటిపోయి మరొక స్థాయిని అందుకోవాలనే జ్ఞానము తనకున్నది. తదాకాంక్ష మనిషిలో నిక్షిప్తమై వుంటుంది.

జడపదార్థంలో నుంచి జీవము, మనస్సుల ఆవిర్భావము ప్రకృతిపరంగా, అప్రయత్నంగా, అవచేతనాత్మకంగా జరిగిన విషయము. ఉద్దేశపూర్వకంగా జరుగలేదు. జడపదార్థానికి అట్టి శక్తి లేదు. కాని మనిషి విషయంలో తనకంటె ఉన్నతమైన చేతనాస్థాయిని అందుకోవాలనే ప్రేరణ ఉన్నది. తన మనస్సు లోను, జీవితంలోని విభాగములలోను పరిణామ ఆవేదన నిక్షిప్తమై వుండి పైకి పొర్లుతూ ఉంటుంది.

*

మన యహంకార చేతన బాహ్యావిషయముల దగిలి, వాని రూపములకు ముగ్ధమగుచుండును. ఆ మానిసిని సర్వాతీత సర్వగత బ్రహ్మప్రవాహమునకు బాత్రమొనర్చి రూపాంతర మొందించుటయే యోగసాధన. కావున, వెలుపలి మోమిడిన చేతనను అంతర్ముఖమొనర్చుటయందలి ఉద్గాఢతయే యోగసిద్ధికి మూలభూత మనదగును. ప్రబలాభిలాషచే, ఇచ్ఛాశక్తిచే, ధ్యానైకాగ్రతచే, పట్టువదలని పూన్కిచే, ఆ యుద్గాఢత పరిపుష్టము కాగలదు. 'ఈశ్వరుని యందలి ఉత్సాహమున కే నెడమైతి'నని బైబిలులో చెప్పినట్లు, సాధకుడు సర్వాత్మనా అట్టి ఈశ్వరోత్సాహమునకు వశుడు గావలెను. ఈశ్వరప్రాప్తికై అతని హృదయము వ్యాకులమందవలెను. ఆ యుత్సాహవ్యాకులత లాతని యహంకారము నాహరించి, క్షుద్రమూ సంకుచితమూనగు దాని యావరణమును భగ్నమొనర్చి, అందు బ్రహ్మ ప్రవాహమును నిండారనింపుకొనును. ఈ జీవహ్రాదములెంత యగాధములైననూ, ఎంత నింపుకొన్ననూ, సర్వాతిశాయియూ, సర్వాతీతమూనగు ఆ ప్రవాహము తరుగక పొర్లి పోవుచుండును.

*

శక్తి సంభరితమగు నొకక్రొత్త యాధ్యాత్మిక భావవిస్ఫూర్తియూ, ఊర్ధ్వగతి ప్రవణతయూ, జ్ఞానోదయ స్థితియూ సాధకునియందు దీప్తముగావలెను. అతని యంతరమున గలుగు పరివర్తన మాతని యిచ్ఛాశక్తినీ, హృదయాభిలాషనూ ఉద్దీపింపజేయవలెను. యోగము

వలన గాంచదగుసంసిద్ధి యంతయూ నీ మహత్తర సంఘటన మందే బీజప్రాయముగ నిమిడి యున్నది.

కేవలము బుద్ధివృత్తితో నన్వేషించు పరతత్వభావన, బుద్ధితత్వమునెంతగా ఆకర్షించగల్గిననూ, ఫలప్రదము కానేరదు. హృదయముచే నభిలషింపదగినదియూ ఇచ్ఛచే సాధింప దగిన దియూ అది యొక్కటే యనెడి దీక్ష గుదురవలెను. అప్పుడే యిది ఫలప్రదమగును. ఏలయన, ఆత్మసత్యము బుద్ధియందు చింతన సేయదగినదిమాత్రమే కాదు. జీవితము నందనుభవించదగినది. జీవితమునందు దాని ననుభవించవలెనన్న, సాధకుని సత్తయం దంతటనూ సమగ్రమైన యేకాగ్రత గుదురవలెను. ఏకాగ్రతలేని యిచ్ఛతోనూ, సంకోచరహితముకాని బుద్ధితోనూ, అసమగ్రమైన శక్తితోనూ సాధింపబడునది కాదీ యోగలక్ష్యమగు పరివర్తనము. ఈశ్వరాన్వేషణము సేయువాడు అనన్యభావమున ఈశ్వరునికే తనను దా నివేదించు కొనవలెను.

*

నీలోని చైత్యపురుషుడు నీ నిమ్నప్రకృతిని అనగా మనస్సు, ప్రాణిక, శరీరములను దైవశక్తికి ఉన్మీలనము చేయుట కోసం, దివ్యప్రేమ కోసం, దైవసంపర్కము కోసం, హృదయంలో దైవ సాన్నిధ్యము శక్తుల కోసం, దివ్యచైతన్యాన్ని భౌతికశరీరంలోకి ఆహ్వానించి మనోప్రాణిక దైవికములను రూపాతంరీకరింపజేయుట కోసం ఆకాంక్షిస్తాడు.

*

కోరిక వేరు, ఆత్మయొక్క తపన వేరు. కోరిక మనోప్రాణికము లకు జెందినది. ఆకాంక్ష చైత్యపురుష ధర్మము. చైత్యము కోరి కల కోసం ప్రాకులాడదు. దివ్యసంపదల కోసం ఆకాంక్షిస్తుంది; 'నాకు లాభముంటేనే సమర్పించుకుంటా లేకపోతే సమర్పించు కోను' అని అనదు. ఆ ప్రశ్నను పూర్తిగా దైవానికే ఒదిలి వేస్తుంది. గురువును పూర్తిగా నమ్ముతుంది. *ప్రకృతికి వెలుగును చూపిస్తుంది. దోషములను తొలగించి అహంకారము యొక్క పరివేషాలను మూలమూలల నుండి వేటాడి వాటి కదలికలన్ని*

టిని దైవానికి చూపించి సమస్తమైన ప్రకృతిని దైవానికి ఒది గింప జేస్తుంది. మనస్సులోను, ప్రాణికములోను, భౌతిక చైతన్యములోను కూడ ఇదే విధమైన ప్రక్రియను క్షుణ్ణంగా జరిపించాలి.

*

శ్రీమాతృవాణి:

ఆకాంక్ష యొక్క నిజస్వరూపము ఏమిటో అది మనని ఎక్కడికి తీసుకొనిపోతుందో నువ్వు తెలుసుకోవాలి. *నువ్వు ఉద్దేశపూర్వకంగా సరైన చిత్తశుద్ధితో ఆకాంక్షించినప్పుడు నీ చుట్టూ పరిస్థితులు నీ కనుగుణంగా మారుతాయి. నీ ఆకాంక్షను బలపరచి నిన్ను తొందరగా గమ్యానికి చేరుస్తాయి.* నీలోని దోషములను ఎత్తి చూపిస్తాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయాలు సంభవిస్తాయి. నువ్వు తీవ్రంగా ఆకాంక్షించినప్పుడు నీ చుట్టుప్రక్కల పరిస్థితులన్నీ వాటంతటవే మారిపోయి నువ్వు త్వరగా సిద్ధిని పొందేటట్లు చేస్తాయి. *ఏదో ఒక శక్తి నిన్ను ప్రతిక్షణము గమనించి నీకు అనువైన పరిస్థితులను కల్పించి నిరంతరం నీకు సాయపడుతూ ఉంటుంది.*

రాబోవు బులిటెన్ సంచికలో నేను ఒక చిన్న సందేశాన్నిచ్చాను.[3] నువ్వు దైవానికి సీరియస్‌గా 'నాకు నువ్వే కావాలి' అని చెప్పినట్లయితే ఆయనే సందర్భములను తగిన విధంగా ఏర్పరుస్తాడు. ఇక నీవు నీ తీర్మానాన్ని పాటించి తీరాలి. తప్పించుకోలేవు. నువ్వే కదా 'నాకు నువ్వే కావాలి' అని చెప్పేవు. నీలో ఆకాంక్ష నిజంగానే వెలిగిపోతూ ఉంటుంది. అయినప్పటికి నువ్వు ఏవేవో వంద వస్తువులకోసం ప్రాకులాడుతూ ఉంటావు – అవునా? అందుకని ఒకొక్కసారి ఏదో వేరే విషయము వచ్చి కలతపరుస్తుంది. దారిలో అడ్డుగా నిలిచి ఈ ఆకాంక్షను ఫలించకుండా చేస్తుంది. *కాని దైవము అంతకంటే పెద్ద పన్నాగమే వేస్తాడులే. నీకు తెలియకుండానే రహస్యంగా నీకే మాత్రం*

---

[3] "నాకు నువ్వే కావాలి" అని పట్టు పట్టినట్లయితే దేవుడు నీ పరిస్థితులను ఎంత పూర్తిగా మారుస్తాడంటే నువ్వు నీ తీర్మానాన్ని అడుగడుగునా తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

అనుమానం కలిగించకుండా రంగంలోకి ప్రవేశించి అన్ని పరిస్థితులను చక్కపెడతాడు. నిన్ను పూర్తిగా దైవానికి మాత్రమే చెందకుండా అటు ఇటు దారి మళ్ళిస్తున్న సందర్భాలన్నిటిని సరిదిద్దుతాడు. ఇక నువ్వు ఏడ్చి గగ్గోలు పెట్టినా సరే ఆయన దగ్గర నుంచి తప్పించుకోవటం నీ తరం కాదు. కాని తరువాత నిన్ను నీవు నిలదీసి పరీక్షించుకున్నట్లయితే "అవును. నేనేగదా దేవుడు మాత్రమే కావాలనుకున్నాను" అనే విషయము గుర్తుకు వస్తుంది. ఇక ఆయన నీకు చాలా దగ్గరవుతాడు. అదైవికమంతా దూరంగా పారిపోతుంది. ఎందుకని అట్లా అవుతుందో తెలుసా – అది దైవానుగ్రహామే అని ఒప్పుకుంటావా లేదా. ఇంతకీ చెప్ప వచ్చేది ఏమిటంటే, దైవమే కావాలని నువ్వు మనస్ఫూర్తిగా తీర్మానించుకోవాలి. సమగ్రంగా నీలోని అన్ని విభాగాలతోటి నిశ్చయించుకోవాలి అని నేను చెప్పటం లేదు. ఒకవేళ నిజంగా అటుల తీర్మానించుకున్నట్లయితే నీ సాధన యిక పరాకాష్ఠకు చేరినట్లే. అంతవరకు వెళ్లకపోయినా ఫరవాలేదు. 'నాకు నువ్వే కావాలి' అని గట్టి సంకల్పముంటే చాలు.

*

యోగమనగా నీ పాతభావాల నన్నిటిని తుడిచిపెట్టి నిన్ను నీవు పునర్వ్యవస్థీకరించుకొనుట. నీ మనస్సు చేసిన వ్యూహాములను, నీ ప్రాణికపు అలజడులను పూర్తిగా కూల్చివేయాలి. వాటన్నిటిని పూర్తిగా మిగులు లేకుండా నిర్మూలించవలసిందే. ఇక నీ విశ్వాసమే నీకు ఆధారము. నీ గత జీవితాన్ని దాని వ్యామోహాలను బంధనాలను పూర్తిగా మరిచిపోవాలి. అంతే కాదు. నీ చేతనలో వాటికేమాత్రము స్థానమివ్వరాదు. ప్రతిక్షణము నీ బంధనాల నుండి విముక్తుడవై పునర్జన్మను పొందాలి. 'నేను ఫలానా మనిషిని' అని అనుకుండే బదులు నీవు భవిష్యత్తులో ఏది కాదల్చుకున్నావో దానిని గురించి తల్చుకోవాలి. నీ గతచరిత్ర నంతటిని మృతము గావించి తిన్నగా భవిష్యత్తుపై నీ దృష్టిని సారించు. నీ మతము, దేశము, కుటుంబము – ఒకటేమిటి నీ జీవితమంతా అదొక్కటే. ఏదొక్కటే? దైవము. అంతే.

అనువాదము: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి; కె. వేంకటరావు

నిరాకరణ లేక తిరస్కృతి (Rejection)

(దోషములను పరిహరించుట)

యోగసాధనకు దివ్యైశ్వర్యములను అర్థించుట ఎంత ముఖ్యమో నీలోని దోషములను పరిహరించుట కూడ అంతే ముఖ్యము. నీ మనస్సు అతిచంచలమైనది. అందులో సంకల్ప వికల్పములు తాండవిస్తున్నంత వరకు దివ్యసంపదలు నీతో దోబూచులాడ టమే తప్ప నీలోకి ప్రవేశించలేవు. అటులనే నీ ప్రాణిక ప్రతి స్పందనములు (vital movements) కూడ నిన్ను దిగజార్చి వేసి దివ్యకాంతికి మరింత దూరం చేస్తాయి. శరీర విషయంలో కూడ అంతే. సత్యమును అన్వేషించదలచినవాడు తన సత్యాభిలాష ణమును సర్వవిధాల పోషించ వలసిందే. జీవనరంగంలో సంభ వించే ఏ ఒక్క అవకాశమును వృధాపరచరాదు. ప్రతి ఒక్క సందర్భమును దైవము నీ కనుగ్రహించిన ఒక గొప్ప అవకాశ ముగా పరిగణించి దానిని ఉచితరీతిని సత్కరించ వలెను. ఈ విధంగా నిన్ను నీవు పాపప్రక్షాళనము గావించు కొంటూపోతే యోగపథంలో త్వరితగతిని పయనించి గమ్యమును చేరగలవు.

— సంపాదకుడు

శ్రీఅరవిందవాణి:

నిమ్నప్రవృత్తిని (అవిద్య) సదా నిరాకరించుట:

- మానసిక భావములను, అభిప్రాయములను, ఏరి కోరుట లను, అలవాట్లను, నిర్మాణములను నిరాకరించవలెను. అట్లొ నర్పబడిన నిశ్చల మానసమునందు సత్యజ్ఞానమునకు స్వేచ్ఛా యుతమగు అవకాశ ముండును.
- ప్రాణస్వభావముల నిరాకరణ అనగా విషయలంపటతలను, ఆశలను, భావములను, ఉద్రేకములను, అహంకారములను, గర్వములను, డంబములను, మోహములను, పేరాసలను, ఓర్పు లేమిని, పరశ్రేయో దుర్భరత్వమును, సత్యమునందు వైషమ్య భావమును విడిచిపెట్టవలెను. తద్వారా సత్య శక్త్యానంద

ములు ఊర్ధ్వము నుండి నీ ప్రశాంత విశాల దృఢతర సమర్పిత ప్రాణసత్తలోనికి ప్రవహించ వీలగును.

- భౌతికతత్త్వపు నిరాకరణ – అనగా భౌతికము యొక్క మౌఢ్యమును, సంశయమును, అపనమ్మకమును, అజ్ఞానమును, మొండితనమును, అల్పబుద్ధిని, సోమరితనమును, మార్పునొందుట కయిష్టమును, తమమును విడనాడవలెను. అట్లుచేయుట వలన తేజశ్శక్త్యానందములు నిజమైన నిలకడ గలిగి, యంతకంతకు దైవికముగా నిరతాభివృద్ధిగాంచు శరీర మందు సుస్థిరత గాంచ వీలగును.

*

నిరాకరణ – ఆకాంక్షకు అనుబంధం

పైనుండి సత్యము దిగివచ్చినపుడు దానిని గ్రహించుటకు మనిషిలో తగినంత పవిత్రత, స్వచ్ఛత ఎంతేని అవసరము. తన ప్రకృతిలోని దోషములను, మాలిన్యములను పరిహరించుకోవాలి. అపరప్రకృతి యొక్క తాడింపులను వేధింపులను ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా నిరాకరించుకుంటూ పోవాలి. అప్పుడు గాని సత్యము మనలో పనిచేయటం మొదలు పెట్టలేదు. క్రమక్రమంగా మహాసత్యము నీలో వృద్ధిపొందుతున్నకొద్దీ పైనుంచి దిగివచ్చు వెలుగు, స్వచ్ఛత, శక్తులతో సరిసమానంగా నీ ప్రకృతిని కూడా తీర్చిదిద్దుకుంటూ పోవాలి. దానికి విరుద్ధమైన లక్షణాలను ధోరణులను పూర్తిగా తిరస్కరించాలి. వాటికి ఏ మాత్రము తావీయరాదు.

ఇందుకు నిన్ను నీవు ప్రక్షాళించుకొని సిద్ధం చేసుకోవాలి, తీర్చిదిద్దుకోవాలి. ప్రథమదశలో మానవ ప్రయత్నం చాలా అవసరం. నీ వ్యక్తిత్వమంతా, నీలోని అన్ని విభాగములు నువ్వు ఎవరికోసం పరితపించి పోతున్నావో ఆయన మీదనే పూర్తిగా కేంద్రీకరించి వుండాలి. దీనికి తోడుగా మరియొక ప్రక్రియ – నిరాకరణ కొనసాగాలి. నీలో దివ్యసత్యమునకు విరోధమైన ప్రతి యొక్క లక్షణమును నీ లోనించి బహిష్కరించాలి. ఈ విధమైన ప్రక్రియ నీలో కొనసాగి పరిఢవిల్లినప్పుడు నీ ఆలోచనలు,

ఫీలింగ్స్ నువ్వు చేసే పనులు మొత్తమన్నీ దైవానికే ఆహుతి చేయబడతాయి.

*

అయితే ఈ సాధనలో దీనిని వ్యతిరేకించే శక్తులు కొన్ని ఉన్నాయి. దురదృష్టవశాత్తు, ప్రతిరోధముంది, అందునా ఒక మూర్ఖ అంధ కారమయ ప్రతిరోధం. అందుచేత యోగమందు ఒక నిషేధాత్మక అంశం ఆవశ్యకమవుతోంది – మార్గానికి అడ్డువచ్చే వస్తువుల నిరాకరణరూప నిషేధాత్మకాంశం. అంతేకాక మలినము, నిరుప యుక్తము అయిన రూపాలు అంతరించిపోయేందుకు వాటిపై ఒత్తిడి ప్రయోగించవలసి వస్తోంది. ఇక ఏవి ఉపయుక్తము కాని అపరిపూర్ణమో, లేక పథభ్రష్టమో, ఆ రూపాలు తమ సత్యగతిని నిలుపుకునేందుకు, తిరిగిపొందేందుకు వాటిని కూడ నొక్కవలసి వస్తోంది.

అదే సమయాన, యోగాన్ని దాని నిషేధక (negative) గతిని బట్టి కాక, దాని విధాయక (positive) గతిని బట్టే నిర్ణయిం చాలి. కారణం, నిషేధకాంశం తాత్కాలికం, సంక్రమణాత్మకం (transitional) పై మెట్టుకు సాధనరూపం. అది చివరి కుండదు; ఆదర్శం మరియు భవిష్యత్తు దృష్ట్యా విధాయకం మాత్రమే గణన లోకి వస్తుంది. కాగా నిషేధక పార్శ్వానికీ, సంక్రమణాత్మక గతికీ వర్తించే నిబంధనలను భవిష్యజ్జీవిత ధర్మం గాను, యోగ స్వభావ సూచనగాను నీవు తీసుకుంటే, అపుడు నీవొక తీవ్ర అపనిర్ణయమూ, పెద్ద తప్పూ చేసినవాడవవుతావు. ఈ యోగం జీవితాన్ని నిరాకరించదు, లేక భగవంతునికి, సాధకులకు నడుమ సాన్నిహిత్యాన్నీ, సంపర్కాన్నీ నిరాకరించదు. పైగా దాని ఆదర్శం ఇతర భూమికలయందు వలె భౌతికమందు సైతం అత్యంత సాన్నిహిత్య, ఏకతలను, జీవనం యొక్క మహత్తమ దివ్యవిశాల తను, పూర్ణతను, ప్రహర్షాన్ని లక్షించుతోంది.

*

భౌతికమనస్సు, కామనామనస్సు, ఆలోచనామనస్సుల కదలికలను పరిత్యజించుట

భౌతికమనస్సులో చెలరేగే అలజడిని నియమించేందుకు రెండు పద్ధతులున్నాయి. (1) దాంతోటి కుస్తీపట్టి ఆపివేయాలనిగాని అణచి వేయాలనిగాని ప్రయత్నించకూడదు. దానిని గురించి పట్టించు కోకుండా, అంటనట్టుగా ఉండాలి. దాని ఆలోచనల వెంబడిగాని అది కోరుకునే వస్తువుల వెనకాలగాని పరుగెత్తకుండా నీ మనస్సు లోపలి భాగంలో ధీమాగా నిలబడి ఉండాలి. (2) నిశ్శ బ్దంగా, మనస్సును చెదిరిపోనివ్వకుండా సుస్థిరముగా నుండుట. ఈ విధంగా కొంతకాలం నిలదొక్కుకున్న తరువాత భౌతిక మనస్సులోని అలజడి క్షీణించి నిశ్శబ్దమౌతుంది.

*

కామనామయమైన మనస్సును, ఆలోచనాత్మక (చింతనశీల) మైన ఉపకరణంనుంచి గూడా బయటికి నెట్టివేయాలి. దీనికి అన్నిటి కంటే మంచి ఉపాయమేమంటే, పురుషుడు తనను తానుగా ఆలో చనసుంచి, సమ్మతి (opinion) నుంచి గూడా వేరు చేసుకోవటం.

*

చింతనాత్మకమైన మనస్సునుంచి పృథక్కృతం అయ్యే (వేరు చేయబడే) విధానం గూడా, సత్తలోగల మిగిలిన భాగాలనుంచి వేరవటానికి చెప్పబడిన పద్ధతే అవుతుంది. శరీరం, ప్రాణాలలో గల కామనలు, సంవేదనలు, ఆవేశాలు గల మనస్సుతోటి తాదా త్మ్యంనుంచి విముక్తి పొందటం కోసమై చింతానాత్మకమైన మన స్సును ఉపయోగించిన తర్వాత, పురుషుడు స్వయంగా ఈ మనస్సుకు అభిముఖంగా తిరిగి ఈ విధంగా చెపుతాడు – "ఇది కూడా నేను కాను, ఆలోచనను కాను, ఆలోచన చేసేవాడిని గాను, ఈ ఆలోచనలు, సమ్మతులు, కల్పనలు, బౌద్ధిక ప్రయాసలు, దాని ప్రక్షపాతాలు, పూర్వానురాగాలు, మతసిద్ధాంతాలు, సంశ యాలు, స్వ...సంశోధనలు ఇవన్నీ, నా యథార్థ స్వరూపం కావు. ఇవన్నీ, చింతనాత్మక మానసంలో సంభవించే ప్రకృతివ్యాపా రాలు మాత్రమే". ఈ విధంగా ఆలోచన చేసే, సంకల్పించే మన

స్సులో, పరిశీలనగా చూచే మనస్సులో విభాజనం జనిస్తుంది. పురుషుడు కేవల ద్రష్ట అవుతాడు. అతడు తన ఆలోచనా ప్రక్రియను, దాని నియమాల్ని చూస్తాడు, తెలుసుకొంటాడు. కానీ, తనను దానినుంచి వేరుచేసుకొంటాడు. మరల, అనుమంతగా, అతడు మానసిక అంతఃప్రవాహానికి (mental undercurrent) తర్క బుద్ధికి సంబంధించిన జటిలతనుంచి తన పాత అనుమతిని తిరిగి తీసుకొంటాడు. ఈ విధంగా, మొండి పట్టుదలగల రెంటి క్రియల్నీ ఆపివేస్తాడు. అతడు చింతనాత్మక మనోదాస్యంనుంచి విముక్తి పొంది, పరిపూర్ణ నీరవతను పొందటంలో సమర్థుడవుతాడు.

*

అధోప్రాణికపు ముట్టడి నుండి విడుదల

ఈ అధోప్రాణికము చాలా చెడ్డది. నిన్ను పట్టుకొని పీడిస్తూ ఉంటుంది. దీనిని ఒదిలించుకుండేందుకు ఒక్కటే మార్గము. దానిని పూర్తిగా నీ చేతన లోనుంచి బహిష్కరించటమే. దానిని తృప్తిపరచకపోతే అది గొడవచేసి నిన్ను చాలా అల్లరి పెడుతుంది. దాని స్థానములో అంతకంటే గొప్పదైన చైత్యపురుషుని ఆకాంక్షను నిలబెట్టాలి. ప్రాణికమైన కోరికలను (vital clamours) తప్తిపరచకూడదు. అలాగని అడవుల్లోకి పారిపోయి సన్యసించనూ కూడదు. *ఎందుకంటె ప్రాణమయ పురుషుడు చాలా బలశాలి. అతన్ని భగవంతుని పరం చేయాలి. పరమసత్యానికి విధేయము చేసినప్పుడు ఇక కోరికలకు వాంఛలకు అందులో స్థానం ఉండదు.* పగమసత్యం యొక్క ధర్మములు జ్యోతిరానందములు. అందు కోరికలకు ప్రవేశముండదు.

*

వాంఛలను వదలించుకోవటమెలా? వాటిమీద వ్యామోహము ను తగ్గించుకోవాలి. వాటిని నీ అంతరాత్మకు గాని, నిజ జీవికి గాని చెందని పరాయి వస్తువులుగా గుర్తించాలి. కోరికలు చేసే ప్రేరణలను తోసిపారేయాలి. వాటి నిర్దేశములను ఆదరించనే ఆదరించ కూడదు. అటుల సేయక, సన్యాసమార్గములో గాని, నైతికంగా నిషేదించటం గాని చేసిన యెడల అది బలవం

తాన అణచి పెట్టటం అవుతుందేగాని అంతరంగిక నిరాకరణ కానేరదు. ఈ రెండూ రెండు వేర్వేరు విషయాలు. ఒకటి మామూలుగా నిగ్రహించటం, రెండు ఆధ్యాత్మికంగా పరిశుద్ధీకరణద్వారా దానికి ఆస్కారం లేకుండా చెయ్యటం. మనస్సు యొక్క పరిమితులలో ఉన్నంతకాలం నిన్ను కోరికల బెడద పీడిస్తూనే ఉంటుంది. *యథార్థ చైతన్యము అంతకంటె గొప్పది. నువ్వు ఆ చేతనలో నివసించినట్లయితే కోరికలు బైటనుంచి వస్తున్నట్లు తెలుస్తుంది.* విశ్వవ్యాప్తమైన నిమ్నప్రకృతిలో నుంచి నీ మనోప్రాణికముల లోకి చొరబడతాయి. కాబట్టి కోరికలను ఒదిలించుకోవాలంటే మొదట ఆ యథార్థ చైతన్యమేమిటో తెలుసుకోవాలి.

*

భౌతికము యొక్క జడత్వము పై విజయము

సాధన ముందుకు సాగుతున్న కొద్ది ప్రాణికములోకి, భౌతికము లోకి కూడ దిగుతుంది. అప్పుడు ఆ భూమికలలోని శత్రువులను ఎదుర్కోవలసి వస్తుంది. వీటన్నిటిలోను భౌతిక భూమిక మహా మొండిది. జడత్వము, అస్పష్టత, అసమర్థత దాని లక్షణములు. దీని కొక్కటే మందు. అది మొండిగా ఉంటే నువ్వింకా జగ మొండిగా ఉండాలి. ఏమాత్రం చలనం లేకుండా పాషాణంవలె ఉండే భౌతికము ముందర నీ నిశ్చయాన్ని, పట్టుదలని ఏ మాత్రము సడలించరాదు. నిర్విరామంగా నీ ప్రయత్నాన్ని కొన సాగిస్తూనే ఉండాలి. ఎదురుగా పెద్ద గోడ అడ్డువచ్చినా సరే నీ పట్టుదల వలన దానిని ఛేదించవలసిందే.

*

సాధనలోకి దిగినప్పుడు నువ్వు ఒక సంగతి గుర్తుంచుకోవాలి. నీకు సాధన వలన ఉన్నత ప్రకృతితో సంపర్కం కలుగుతుంది. నీ సాధారణ ప్రకృతి (అపరప్రకృతి) వేరు. నీలో చెలరేగే అనుమానాలను నిరుత్సాహములను నువ్వు త్రోసిపారేయాలి. ఎందుకంటే అవి నీ ఉన్నతప్రకృతికి చెందినవి కావు. “నాకేం చేత కాదు, నేను యోగానికి తగను” అనే పిచ్చి పిచ్చి ఆలోచనలన్నీ దుష్టశక్తుల ప్రభావమే. ఎటువంటి అంధకారం అలముకొన్నా

భౌతిక చైతన్యం నిన్నెంత ముంచివేసినా నువ్వు వాటికి లొంగి పోకుండా ఉండి నీ ఆత్మకు విధేయంగా ఉండాలి. దైవము యొక్క పిలుపును జ్ఞప్తి చేసుకుంటూ ఉండాలి. దానినే విశ్వసించి విజయాన్ని సాధించాలి.

*

యోగంలో ఒక్కొక్కప్పుడు అంతా స్తంభించి పోతుంది. ఏం చేయాలో తోచదు. అప్పుడు నువ్వే మాత్రం తల్లడిల్లి పోకూడదు. ఆ పరిస్థితి నుండి నిన్ను నువ్వు వేరు చేసుకోవాలి. నీ యొక్క పై భూమికను, క్రింది భూమికను కూడా అదే విధంగా వేరు చేసుకోవాలి. ఆ స్తబ్ధత వలన కలిగిన పరిణామాలను లెక్క సేయక వాటిని నీకు చెందినవి కానట్లుగా పరిగణించాలి.

నువ్వీ విధంగా చేసావంటే పరిస్థితి ఎంత స్తంభించి పోయినప్పటికీ నీలో ఒకానొక భాగము అచలంగా ఉంటుంది. ఆ విభాగం ద్వారా శాంతిని, శక్తిని – అంతే కాకుండా వెలుగుని, జ్ఞానాన్ని కూడా ఆ స్తబ్ధతలోకి నీవు తీసుకొని రాగలుగుతావు.

అనువాదం: డా॥ ఎ. లక్ష్మినరసయ్య ('మాతృశ్రీ' నుండి); చెలసాని నాగేశ్వరరావు,; జనస్వామి సుబ్రహ్మణ్యశాస్త్రి; ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

సమర్పణ లేక శరణాగతి (Surrender)

నీకు ధనం కనిపించినంత తేలికగా దైవం కనపడదు. కాని దైవాన్ని శోధించి కనిపెట్టి నిన్ను నీవు ఆయనకు అప్పగించుకోవటమే యోగములోని అసలు రహస్యము. మరి ఇది ఎలా సాధ్యము? నీ వ్యక్తిత్వాన్ని, 'నేను' అనబడే సమస్తమైన వస్తువును ఏమాత్రం మొహమాటం లేకుండా నకశిఖపర్యంతము తీసుకొనిపోయి ఆయన పాదాల దగ్గర జేర్చాలి. మనిషి తన కన్న మిన్నయైన దైవశక్తికి పూర్తిగా విధేయమై పోవాలి. ఈ విధేయత మనిషి యొక్క అన్ని విభాగములలోకి విస్తరించాలి. బాహ్యంగా జరిగే ప్రతి చర్యలోను కనపడాలి. లోన సంభ

వించే ప్రతి ఆలోచన, ఆశయము, ఉద్దేశము మొ॥ అన్నీ కూడ దైవదత్తము కావాలి. యోగములోని క్లిష్టమైన ప్రక్రియలను ఎటుల చేయవలెనో అని నీవిక విచారించవలసిన పని లేదు. ఏలన నీ సారథ్యము దైవానికి అప్పగించినప్పుడు నీ బాధ్యతనంతా ఆయనే వహిస్తాడు. అడుగడుగునా నీ విధేయతను ధృవవరచు కుంటూ పోవటమే నీ వంతు. ఇక నేను, నాది, నా ఇచ్ఛ అనేవి నీ గత చరిత్రకు చెందిన విషయాలు మాత్రమే.

— సంపాదకుడు

నిన్ను, నీ ఉనికినంతా, నీ సర్వస్వమూ, నీ చేతనా భూమిక లన్నింటినీ, నీలో జరిగే ప్రతి యొక్క కదలికను దైవానికి, ఆయన శక్తికి సమర్పించుకోవాలి.

*

మన సమస్త చైతన్యాన్ని పరిపూర్ణంగా దైవపరం చేసి, ఆయనపై అపారమైన ప్రేమను పెంచుకొని, సకల సంపర్క సంబంధాలను ఆయనతోనే పెనవైచి, 'మహాప్రభో! నన్ను నీవుగా రూపాంతరీక రించుకొమ్మ' అని ప్రార్థించడమే యిక మనం అనుసరించ వల సిన మార్గము. ఓ విధంగా ఆలోచిస్తే, మనలో క్షేత్రజ్ఞునిగా నివసి స్తున్న దైవమే సాధన సాగించే సాధకుడు, యోగాధిపతి అవు తాడు. ఆ యోగాధిపతియే నీ నిమ్న వ్యక్తిత్వాన్ని, దివ్య రూపాం తరీకరణానికి కేంద్రంగాను, స్వయంసిద్ధికి సాధనంగాను వినియో గించుకుంటాడు. తపస్సు యొక్క ఒత్తిడి వలన, దైవచింతన యొక్క ప్రభావము వలన సర్వజ్ఞుడు సర్వసమర్థుడు అయిన దైవము నీలోకి దిగివస్తాడు. నీ అపర ప్రకృతినంతా దివ్య కాంతితో వెలిగింప జేస్తాడు. తన శక్తితో పరిపుష్టము గావిస్తాడు. ఇక సాధన చేయునది మామూలు మనిషి కాదు. దేవుడే దిగివచ్చి నీ కార్యమును చేబడతాడు.

ఆచరణలో దీని స్వరూపమీవిధంగా ఉంటుంది. అహం కారం యొక్క సువిశాల సామ్రాజ్యాన్ని — దాని పరివేషాలు, సమస్తమైన సంరంజామాతో సహా — అహంకారానికి ఆవల ఒడ్డున ఉన్న పరతత్త్వానికి క్రమక్రమంగా సమర్పించుకోవాలి. దాని

యొక్క కార్యశీలత్వము ఇంత అంత అని చెప్పనలవి కాదు. దాని సంవిధానము అగణితము. దాని ప్రక్రియలు అనివార్యములు.

*

సమర్పణ అనగా ఏమిటో నువ్వు చక్కగా తెలుసుకోవాలి. నీ యొక్క సర్వస్వమును, నీ ఉనికి నంతటినీ భగవంతునికి అర్పించాలి. అనగా ఇక నీ సొంత భావములు గాని కోరికలుగాని, అలవాట్లుగాని ఉండకూడదు. మరి నువ్వేం చెయ్యాలి అనే సమస్య ఎదురవుతుంది కదూ? నీ సొంత భావాల స్థానంలో దివ్యసత్యము ప్రతిష్ఠితమై తన యొక్క జ్ఞానము, ఇచ్ఛ, ప్రక్రియలతో నిన్ను సుసంపన్నము చేయును. నీ స్థాయి దివ్యలక్షణములతో ఉన్నతమగును.

*

మరో విషయము. సమర్పణ అనగా చేతులు కట్టుకొని కూర్చోడం కాదు. సక్రియంగా ఉండాలి. నీ ఇచ్ఛను దైవేచ్ఛకు అప్పచెప్పి నువ్వు దైవానికి చక్కటి ఉపకరణము కావాలి.

*

అయితే ఈ సమర్పణ గ్రుడ్డిగా కాక అప్రమత్తంగా జరగాలి. కొన్ని అదృశ్యశక్తులు నిన్ను దారి తప్పించే ప్రయత్నము చేస్తూ ఉంటాయి. *వీటిని శ్రద్ధగా గమనించి నీ దృష్టినంతను ఏకేశ్వరుని మీద మాత్రమే నిలిపి చాలా జాగ్రత్తగా మసులుకోవాలి.*

*

సమర్పణ అంతరంగము నుంచి జరగాలి. నీ మనస్సుపై శ్రద్ధ వహించి దృష్టిని కేంద్రీకరించి శ్రీమాతకు దానిలో ప్రవేశార్హతను కల్పించాలి. అటులనే నీ ప్రాణికభౌతికములను కూడ 'శ్రీమాతా ఇవి నీకు చెందినవి. నీవు వాటిని పునః సృజించి దైవములోని భాగముగా సేయుము' అని నివేదించుకోవాలి.

*

సమర్పణ అనగా మనోప్రాణికములను అంతరంగికంగా నివేదించుకోవాలని నా ఉద్దేశము. అయితే బాహ్యసమర్పణకు కూడా స్థానమున్నది. సాధనకు సరిపడని విషయాలు ఏవైతే ఉన్నాయో

వాటి నన్నిటిని తు.చ తప్పకుండా సమర్పించవలసిందే. తిన్నగా భగవంతునికి గాని, ఒక వేళ నీవా స్థాయిని అందుకోని యెడల గురువుకు గాని, లేదా నీ చైత్యపురుషుని ఆదేశములను సలహాలను విని వాటికి విధేయమైగాని నడచుకోవాలి.

*

శ్రీమాతృవాణి

సమర్పణా విధానము

మనిషి బుద్ధిద్వారా గాని లేక భక్తిద్వారా గాని తనను తాను దైవానికి సమర్పించుకుంటాడు. దైవమే సత్యము అనే గట్టి నమ్మకము కలిగి దైవము వినా జీవితము దుర్భర మనిపించవచ్చు. లేదా హృదయావేశముతో దైవము నందు శరణు జొచ్చుటయే జీవితానికి ఏకైక మార్గము అని అనిపించవచ్చు. చైత్యావేశముతో 'నేను నాకు చెందను. నా జీవితపు బాధ్యతనంతా దైవానికి అప్పచెప్పుటయే ఏకైక మార్గము' అని భావించవచ్చు. తదుపరి ఆత్మ సమర్పణము....

*

సమర్పణ ఈ విధంగా మొదలవుతుంది. "దైవసేవయే నా పరమార్థము. నా జీవితమంతా దైవానికే సమర్పితము. నా ప్రయత్నమంతా దివ్యజీవనాన్ని సిద్ధింప జేసికొనుటకే" అనే తీర్మానము మొదటి మెట్టు. కాని అంతటితో సరిపోదు. నువ్వు తీర్మానించుకొన్నప్పటికీ, నీ జీవితమంతా దైవానికే ధారపోస్తానని నిశ్చయించుకొన్నప్పటికి, అడుగడుగునా నీ జీవితంలోని ప్రత్యంశములోను దీనిని అమలుపరచ వలసిందే. ప్రతి క్షణమూ, ప్రతి కదలికలోను నీవు దైవానికి చెందిన వాడివి అని ధృవపరచుకుంటూ పోవాల్సిందే. నువ్వేది ఆలోచించినా సరే – ఆ ఆలోచించటంలోను, ఏ పనిచేసినా సరే – ఆ పని చేయటంలోను దైవానుభూతిని పొందుతూ ఉండాల్సిందే. అనగా దివ్యచైతన్యమే నీ ద్వారా పనిచేస్తుందన్న మాట. ఇక 'నేను, నాది' అనే వేమియు ఉండవు. అన్ని విషయాలు దైవమునుంచే వస్తాయి. కాబట్టి మళ్ళీ వాటిని దైవానికే ఇచ్చివేయాలి. నువ్వా స్థాయికి జేరినప్పుడు చిన్న విష

యమూ పెద్ద విషయమూ అనే తారతమ్యముండదు. మామూలుగా నువ్వు లెక్కచెయ్యని ఎంత అల్పమైన విషయమైనప్పటికి అది ముఖ్యమే అవుతుంది. అదీ దైవకార్యమే అన్న మాట. దాని ద్వారా నీకు దైవానుభూతి, దైవసాక్షాత్కారము కలుగవచ్చు కూడాను.

ఈ విధమైన నివేదితా భావముతో సాధనను కొనసాగించాలి. *దైవము నీ చెంతనే ఉండి నీ పనులను ఆయనే చూస్తున్నట్లుగా భావించాలి. ఆయనే నీకు శక్తి నిచ్చి నీ ద్వారా ఆయనే పనిచేస్తున్నాడనే సత్యమును మరచిపోకూడదు.* నీ కదలికలన్నీ ఆయనకు సమర్పించుకో. నీ ఆలోచన లొక్కటే కాదు. భోజనము చేయటం లాంటి మామూలు విషయాలు కూడ ఆయనకు అర్పించవలసిందే. నువ్వు తింటున్నప్పుడు దైవమే నీ ద్వారా తింటున్నాడని భావించాలి. ఈ విధంగా నీ జీవితాన్నంతా ఏక త్రాటిమీద నిలిపినప్పుడు ఇక నీలో విభజన ఉండదు. ఐక్యమే భాసిస్తుంది. నీలోని ఒక భాగము దైవదత్తముకాగా మిగిలిన భాగములు మామూలు జీవితంలో మునిగిపోయి ఉండవు. నీ జీవితమంతా దైవోన్ముఖమై సాధనా పరిపుష్టమై క్రమక్రమంగా రూపాంతరీకరణము చెందగలదు.

*

ఈ విధంగా ఆత్మనివేదనము సర్వవిధములుగా ఎప్పుడు పరిపూర్ణమౌతుందో అప్పుడు నీ సత్త్వమంతయు పూర్ణాహుతికి సిద్ధమైనట్లే. సాధన ఈ శిఖరస్థాయికి అందుకున్న తర్వాత ఇక నీ సమస్యలన్నీ తీరిపోయినట్లే. అంతా చాలా సాఫీగా గడిచిపోతుంది. అయితే ఈ విధమైన సమగ్ర సమర్పణా స్థాయిని అంత తొందరగ అందుకోలేవు. ఒకటి రెండు రోజులు తీవ్రమైన అనుభూతి కలిగి నీ కటుల అనిపించవచ్చును. "ఇక నేను చేయవలసినదేమియు లేదు. సాధన దానంతటు అదే సాగిపోతోంది కదా" అని నీవు ఏమాత్రము నిర్లక్ష్యము చేసినా వెంటనే నువ్వు అక్కడే ఆగిపోతావు. దీనికో కారణమున్నది. నీలో సాధన కనుకూలమైన విషయములు కొన్ని అయితే దానికి వ్యతిరేకమైనవి కొన్ని ఉంటాయి. ఈ రెండింటికి ఘర్షణ జరుగుతూ ఉంటుంది. ఒక

విభాగము దైవానికి సమర్పితమైనప్పుడు మిగతా విభాగములు తలెత్తి 'మా సంగతేమిటి' అని గొడవ చేస్తాయి.

*

ప్రశ్న: మెదడుతో ఆలోచిస్తూ ఉన్నప్పుడుగాని, ఏవిధమైన పనైనా చేస్తున్నప్పుడుగాని మనం దైవాన్ని మరచిపోతాం ఎందుకని?

నీ చేతనలోని విభిన్నభాగాలన్నీ దైవోన్ముఖము కాలేదు కాబట్టి. నీ మనస్సులో దేవుడు ఇంకా స్థిరపడలేదు కాబట్టి. స్థిరపడినట్లయితే నీవు నీ మనస్సులో గాని, మానసిక వ్యాపారాలలో గాని ఎంత నిమగ్నమైపోయినప్పటికి దైవసాన్నిధ్యమును నీవు పొందుతూనే ఉంటావు. దైవము నీకు తోడుగా ఉండి నీకు సాయపడుతున్నట్లు అనుభూతిని పొందుతూనే ఉంటావు.

నువ్వు మెదడుతో పనిచేస్తున్నా సరే, చేతులతో పని చేస్తున్నా సరే – ఈ రెండింటికి మంత్రం ఒక్కటే – దైవమును స్మరించుకోవాలి. దైవానికి సమర్పించుకోవాలి. నువ్వే పనిచేసినా సరే 'కృష్ణార్పణం' అనుకొని చేయాల్సిందే. ఇది నీకు చక్కటి క్రమశిక్షణ, రక్షణ కూడాను. ఎందుకంటే దైవం పేరుమీద చేసినప్పుడు నీకు చెడ్డపనులుగాని తప్పులుగాని రావు.

*

మన గమ్యమేమిటి అనే ప్రశ్న ఇక మిగిలి ఉన్నది. అది పరమ చైతన్యము. దైవము లేనిదే నీవు ఏ పనీ చేయలేవు. నీకు చేతులాడవు. దేవుడు లేకపోతే నీకు ఆధారం లేనట్లే. ఆ శక్తి కూడ దైవము దగ్గర నుంచే రావాలి. బావిలో నీళ్ళు లేకపోతే నీకు నీళ్ళు ఎక్కడ నుంచి వస్తాయి. దైవము నీ చెంత లేకపోతే నీకు జ్ఞానము, శక్తి ఎక్కడి నుంచి వస్తాయి? ఇట్టి పరిపక్వ స్థితియే నీ గమ్యము. అంతవరకు నీ జీవితము దాని కోసం సిద్ధము చేసుకొనుట మాత్రమే.

ఈ విధంగా పరాకాష్ఠకు చేరిన సాధకుడు దైవ సాన్నిధ్యము లేకుండా ఏ పని చేయలేడు. ఒక వేళ దైవము వినా పని చేసినప్పుడు నీకేమి తప్పుగా అనిపించకపోతే నీలోని ఆ విభా

గము ఇంకను దైవానికి అర్పించబడ లేదన్న మాట. మామూలు మనుషుల పరిస్థితి – దేవుడు అక్కర్లేని వాళ్ళ సంగతి అంతే కదా. కాని దైవం కోసం తహతహలాడే మనిషి సంగతి వేరు. నీవు దైవముతో సంపూర్ణంగా, సర్వాంగీణంగా ఐక్యత చెందినప్పుడు ఒక్క క్షణమైనా గూడా దైవం నీతో లేకపోతే నువ్వు చచ్చిపోతావు. ఎందుకంటే ఇక నీ జీవిత సర్వస్వము, నీ ఆధారమంతా దైవమే. ఆయనే నీకు ప్రాణం. ఆయనే లేకపోతే ఇంకేమియు లేనట్లే.

*

ఉదాహరణకు, నీవు నీ జీవితాన్ని దైవానికి అర్పణచేయడానికి నిశ్చయించావనుకో. నీవు అలా నిర్ణయించుకున్నప్పుడు, ఇంతలో అనుకోకుండా ఏదో ఒక దుస్సంఘటన ఎదురౌతుంది. దాని ఫలితంగా చలించి ప్రతిఘటిస్తావు. అంతకుముందే కదా, "నా జీవితం దైవానికే చెందుతుంది" అని అనుకున్నావు. అయినప్పటికీ హఠాత్తుగా ఈ దుస్సంఘటన జరిగితే, నువ్వు ఎదురు తిరుగుతావు. అలాకాకుండా నీ అర్పణకు బద్ధుడవై ఉండాలనుకుంటే, ఈ విషాద సంఘటనను సైతం ఆ దైవంముందు అర్పించి, "నీ యిచ్ఛయే నెరవేరుగాక; నీవు ఆ విధంగా నిర్ణయిస్తే అదే జరగనీ" అని విధేయతతో చెప్పాలి. ఇది హృదయపూర్వకంగా, అప్రయత్నంగా జరుగవలసినది కనుక చాలా కష్టం. సమర్పణ లక్షణం అలా ఉండదు. స్వల్పవిషయాలలోకూడ నీవనుకున్నది జరుగకుండా, నీ ప్రయత్నం ఫలించకుండా, ఇంకొకటి జరిగినప్పుడు, వెంటనే వ్యతిరేకించి, 'అది అలా కాకూడదు' అనే రీతిలో ప్రతిఘటించే బదులు, నీవే గనుక పూర్ణసమర్పణ చేసుకొని ఉన్నట్లయితే, కడు ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంటావు. నిన్ను నీవు సమర్పించుకున్నావు కాబట్టి, ఏ పరిస్థితి వచ్చినా ఆ విధంగానే శాంతం వహిస్తావు. అది ఒకరకంగా జరిగితే బాగుండదనే ఉద్దేశ్యం నీకు ఒకవేళ ఉన్నప్పటికీ, అలా కాకుండా ఇంకొక రకంగా జరిగినా అదికూడ బాగానే ఉన్నట్లు నీవు తెలుసుకుంటావు. ఉదాహరణకు, నీ కాలాన్ని, శక్తిని, సంకల్పాన్ని వినియో

గించి, ఏదో జరుగుతుందని చాలా రోజులు కష్టపడి నీకోసం కాకుండా దైవానికే సమర్పించి ఒక పనిని నీవు చేస్తావు. అంత కష్టపడి, ఎదురు చూచినది పూర్తిగా వ్యతిరేకంగా అయినప్పటికీ, నీ సమర్పణము నిజమైనదైతే "బాగుంది, ఫర్వాలేదు; నేను చేయ గలిగినదంతా బాగానే చేశాను. ఇక, అది ఎలా జరగాలో నిశ్చయించేది ఆ దైవమే. ఆయన ఏది నిశ్చయిస్తే అదే నాకు ఇష్టం, అని అనుకుంటావు. అలాకాకుండా, నీకు ప్రగాఢము, స్వతస్సిద్ధమునైన సమర్పణభావము లేకపోతే, నీవు "ఇది ఏమి? నేను నా కోసమని కాకుండా దైవంకోసమని ఎంతో కష్టపడి చేస్తే ఈ విధంగా జరిగిందేమిటి.... చేసినదంతా నిష్ప్రయోజనం" అనుకుంటావు. వందలో తొంభైతొమ్మిది విషయాలలో నీవు ఇలాగే అనుకుంటావు. నిజమైన ఆత్మసమర్పణ చాలా కష్టం.!

*

ప్రాణకోశం సహకరించడానికి ఒప్పుకుంటే (అదే ఘనం), అది తన యావచ్ఛక్తినీ ఉపయోగించి పనిచేయదలచుకుంటే, అట్టి సందర్భంలో సైతం, పని సక్రమంగా అవుతుందనీ సానుకూలమవుతుందనీ ఒక ప్రత్యాశ అడుగున ఎక్కడో దాగి ఉంటుంది. అది నీ విధేయతనంతనూ పూర్తిగా ఆవరించి వేస్తుంది. ఈ విధమైన ప్రత్యాశ అహంభావంతో కూడిన వ్యక్తిగత విషయం; ఇది విధేయతను మరుగుపరచడంవల్ల నీకు చేసిన తప్పు తెలియదు.

నీవు ఏ పనిచేస్తున్నాసరే నీ మనస్సూ, నీ ప్రాణిక శక్తులూ, దాని ద్వారా ప్రయోజనాన్ని పొందాలని చూస్తాయి. సంతృప్తి, సంతోషం, నీపై నీకు కలిగే సదభిప్రాయం మొదలైనవన్నీ అవి పొందే ప్రయోజనాలు. మనని మనం మోసగించుకోకుండా ఉండడం కష్టమే!

*

నువ్వు దైవానికి సమర్పించుకున్న విషయాలను గురించి నువ్వే జ్ఞాపకం పెట్టుకున్నట్లయితే వాటిని ఆయన గుర్తు పెట్టుకోవాల్సిన అవసరముండదు! ఒక వేళ వాటిని గురించి నువ్వు ఇతరు

లతో మాట్లాడినా, వారికి చెప్పినా ఆ సమర్పణ నీ అహంకార రక్కసికి చేసావన్న మాట – దైవానికి కాదు.

*

ప్రశ్న: సమర్పణ అనగా సేవాభావంతో నీ కర్మలను సమర్పించు కోవటమే కదా!

కర్మాచరణ చక్కటి క్రమశిక్షణా మార్గమే నేను కాదంటల్లేదు. అయితే ఒక సంగతి నువ్వు గుర్తుంచుకోవాలి. యంత్రము వలె భక్తిభావం లేకుండా చేతనారహితంగా పనులు చేయటం యోగం కానేరదు. అదికాదు. కేవలం చేయటం మాత్రమే కాదు.

అన్నిటి కంటె ముఖ్యమైన విషయము నీ ప్రకృతి. నీ ఉనికి, నీ స్వభావము. నీవు సమర్పింప వలసినది వీటినే. ఎందుకో తెలుసా? అవి మారాలి కాబట్టి. అంతే కదా మరి. నీ ప్రకృతే కదా మారవలసినది. కాబట్టి నీవు సమర్పించవలసిన ముఖ్యమైన వస్తువు నీ వ్యక్తిత్వమే, నువ్వే. ప్రతి మనిషికి తన ప్రత్యేక లక్షణాలు – అర్థం చేసుకుండే తీరు, బాహ్యాస్పర్శలకు స్పందించే విధానము, ప్రత్యేకమైన ఫీలింగ్స్, అభివృద్ధిపొందే పద్ధతి, జీవితంపట్ల తన దృష్టి, జీవితం నుంచి తను కోరే ప్రయో జనాలు – ఈ లంపటాల సంపుటినే తప్పని సరిగా నీవు సమ ర్పించుకోవాలి. దివ్యజ్యోతిని నీలో కాహ్వానించుకొని నిన్ను పరి వర్తింప చేసుకోవాల్నంటే నీ మానసిక జీవితాన్ని, మిగిలిన జీవనవిధాన్నానంతటిని సమర్పించుకోవాలి. *ఈ విధంగా చేసిన ప్పుడు నీ అంతరంగికాన్నంతా దేవునికి విప్పి చూపించినట్టుగా అవుతుంది.* దానికి ఎటువంటి చికిత్స చేయాలో ఆయనకు బాగా తెలుసు. నీ లక్షణాలలో మంచివేవో చెడ్డవేవో వేటిని మార్చాలో వేటిని సత్యానుగుణంగా మలిచి దైవప్రకటనకు యోగ్యమైన మాధ్యమంగా తయారు చేయాలో ఆయనకు బాగా తెలుసు. *అందుకనే నేను నొక్కి చెబుతున్నాను – నువ్వు చేసే పనుల కంటే నీ వ్యక్తిత్వాన్నంతటినీ సమర్పించుకోవటం చాలా ముఖ్యమైన విషయం. నువ్వు చేసే పనుల కంటే (పనులు*

ముఖ్యమే నేను కాదనటం లేదు) నీ వ్యక్తిత్వమే వెయ్యిరెట్లు ముఖ్యమైనది.

అనువాదం: అరవిందార్చన; ఎ.వి.ఆర్. శాస్త్రి; ఎ. ప్రభావతి; ఆర్.ఎల్.ఎన్.శాస్త్రి, ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

విభాగం: II

సాధనకు అవసరమైన అయిదు అంతర్గుణాలు

యోగసాధనలో ఆత్మార్పణం అత్యావశ్యకమైన ప్రప్రథమ నిబంధన అంటారు శ్రీఅరవిందులు. అయితే దీనిని యోగసాధనకు కావలసిన పెక్కు లక్షణాలలో ఇది కూడా ఒకటేలే అని భావించకూడదు. ఇది శరణాగతి – యోగసాధనకు అనివార్యమైన తొలి మెట్టు. పరిపూర్ణంగా ఆత్మార్పణం చేసుకునే కృతనిశ్చయం లేకుండా ఎవ్వరూ యోగసాధన ప్రారంభించ లేరు. ఆత్మార్పణం పరిపూర్ణం కావాలంటే ఈ క్రింది లక్షణాలు అన్నీ ఉండి తీరాల్సిందే.

మొట్టమొదట "ఆత్మార్పణ" పూర్ణయోగానికి తప్పనిసరి. "అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ" – అనే దృఢ సంకల్పం కావాలి. మార్గాంతరమే లేదు. మరి ఇదొక్కటే దారి.

తర్వాత మాత్రం తప్పనిసరిగా అయిదు సుగుణాలు, యోగ్యతలను పొందాలి:

1) *చిత్తశుద్ధి లేదా పారదర్శకత్వము* (sincerity* or transparency) 2) *విశ్వాసం లేదా నమ్మకం (దైవం పై సహజమైన నమ్మకం)* 3) *భక్తి లేదా కృతజ్ఞతాభావం* 4) *ధీరత్వం లేదా ఆకాంక్ష లేదా అభీప్స* (aspiration) 5) *సహనము లేదా నిలకడ*

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

* కొన్ని ఆంగ్ల పదములను శ్రీమాతారవిందులు విశేషార్థములలో వాడినారు. అన్ని పదములకు తెలుగులో సమానార్థకములు దొరకవు. వాటి వివరణను చూసిన యెడల ఆయా అర్థములు స్పష్టమగును. అట్టి వివరణలను ఈ పుటలలో పొందుపరచాము.

చిత్తశుద్ధి లేక పారదర్శకత్వము
(Sincerity or Transparency)

'సత్యమే జయము' అనే నానుడి యోగదృష్టిలో చాలా విశేషార్థాన్ని సంతరించుకుంటుంది. సత్యమనగా యథార్థము. నిన్ను నీవు యథార్థదృష్టితో చూసుకున్నప్పుడు నీలోని అయథార్థ లక్షణాలన్నీ బయట పడతాయి. అనగా మనిషిలో మామూలుగా వుండే ప్రియాప్రియములు రాగద్వేషాలు మొ॥. వాటన్నిటిని చిత్తశుద్ధితో పునీతము గావించి దైవేచ్ఛకు విధేయముగా చేయాలి. నీ చేతనలో మార్పు రావాలి. ఈ మార్పు ఎలా వస్తుంది? అంతరంగిక ప్రక్షాళనమే నీ నిరంతర వ్యాపకము కావాలి. ప్రతినిమిషము నీ ప్రత్యంగము దివ్యావేశంతో పులకితం కావాలి. దోషాలను పరిహరించాలి. ఏ మాత్రం కపటము గాని దాపరికము గాని లేకుండా దైవానికి నీవు చక్కటి ఉపకరణము కావాలి.

— సంపాదకుడు

అమ్మ మాటలలో

యోగసాధనలో అన్నిటి కంటె చిత్తశుద్ధి అతి ప్రధానమైనది. ఎందుకంటారా? చిత్తశుద్ధి లేనిదే అభివృద్ధి పథం వైపుగా ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. కాబట్టి ప్రప్రథమంగా ఉండవలసినది, ఎప్పుడూ కావలసినదీ కూడా అదే.

ఇక్కడ చిత్తశుద్ధి అనే మాటకు ప్రత్యామ్నాయంగా మరొకమాట అనుకోవచ్చు. అదే *పారదర్శకత్వము*. దీనిని గురించి కొంచెం వివరిస్తాను.

చిత్తశుద్ధికి గీటురాయి

నా ఎదుట ఒక మనిషి ఉన్నాడనుకోండి. అతనిని చూస్తూ ఉంటాను. అతని కళ్లల్లోకి చూచినపుడు ఆ వ్యక్తి చిత్తశుద్ధి లేక స్వచ్ఛత కలవాడు అయినప్పుడు ఆతని నేత్రద్వారముల ద్వారా లోలోపలికి చొచ్చుకొని వెళ్లగలిగి ఆతని అంతరంగాన్ని దర్శించ గలుగుతాను. సరిగ్గా ఇలాటి అనుభవమే మరొకటి – ఇంకో వ్యక్తిని చూచినప్పుడు – ఒక మేఘం క్రమ్ముకున్నట్లు కనిపించి ఇంకా

అలాగే చూస్తూంటే అడ్డంగా ఒక తెర, దాని తర్వాత ఒక అడ్డు గోడ అగుపించి పిదప నల్లగా ఏదో క్రమ్ముకుని ఉన్నట్లు కనిపిస్తుంది. వీటిని అతిక్రమించి చిన్న చిన్న రంధ్రాల లోనుంచి ఆ వ్యక్తి అంతరంగ దర్శనం చేసే ప్రయత్నం చేసినా – చూడ గలిగే దేముంటుంది? నా ఎదురుగా ఒక ఇనుప తెర అడ్డుగా ఉన్నట్లు కనిపించినా ఆశ్చర్యపడనవసరము ఉండదు. మరి దట్ట మైన ఇనుపతెరలాటిది అడ్డుగా ఉన్నప్పుడు ఆతని అంతరంగం ఎలా కనిపిస్తుంది? ఇంతకీ తేలినదేమిటి? ఆ వ్యక్తి చిత్తశుద్ధి లోపించినవాడు అనే కదా? ఇంకా దీనినే ఆలంకారికంగా చెప్పాలి అంటే ఆ వ్యక్తి పారదర్శకత లేదా పరిశుద్ధత లేదా స్వచ్ఛత లేని వాడు అనే చెప్పాలి. అదీ! అసలు విషయం.

*

జీవుడు పరమోన్నత చైతన్యస్థితిని సాధించి ఆ స్థాయికి చేరు కోవాలి. తదనుగుణంగా తన కార్యకలాపములన్నిటినీ – వాటి స్థాయిని పెంపు చేసుకుంటూ తీర్చిదిద్దుకోవాలి. ఇదే చిత్త శుద్ధికి అర్థం – పరమార్థం.

సమైక్య సమరసభావాలతో, చిత్తశుద్ధి వ్యక్తిని బలోపేతం చేస్తుంది. వ్యక్తి శరీరభాగాలలో, కదలికలలో అంతటా ఇవి పరి వ్యాప్తమయేలా చేస్తుంది. కేంద్రంగా ఉన్న "దివ్యచిత్తము"నకు ఇవి లోబడి పరిభ్రమణం చేస్తూండేటట్లుగా కూడ చేస్తుంది.

21 ఫిబ్రవరి, 1930

చిత్తశుద్ధి పురోగమన శీలమైనది అనే సంగతి ముందు తెలుసు కోవాలి. జీవుని పురోగమన వికాసాలతోపాటు అదే విధంగా విశ్వ వికాస పరిణామంతో పాటుగా చిత్తశుద్ధి కూడా నిరంతరాయంగా పరిపూర్ణతను సంతరించుకుంటూనే ఉంటుంది. దీనికి అంత మంటూ లేదు. పురోగమనం ఎప్పుడు నిలిచిపోతుందో అప్పుడు చిత్తశుద్ధిలో మార్పు తప్పనిసరి. ఫలితం – నిన్నటి చిత్తశుద్ధి రేపటికి వంచనగా పరిణమిస్తుంది.

సర్వ వస్తువులను సమాదరించ వలెను

పరిపూర్ణమైన చిత్తశుద్ధిని సాధించా లంటే నీలో ఏకోశంలోను ఉండ

కూడని లక్షణాలు కొన్ని ఉన్నాయి. అవి – వ్యక్తుల పట్ల వస్తువులపట్ల మొగ్గుచూపడం, కోరికలు, ఆకర్షణా వికర్షణలు, సానుభూతి, ద్వేషము, వ్యామోహము, అసహ్యము మొ॥ ఉండకూడదు. వస్తువులపట్ల సమ్యక్‌దృష్టి కలిగి ఉండాలి. అలాటప్పుడు ప్రతిదీ అది ఉండవల్సిన నిర్ణీతస్థానంలోనే ఉంటుంది. అన్ని విషయాల పట్ల సమాన వైఖరి కలుగుతుంది. సత్య దృక్పథం ఏర్పడుతుంది. ఇలాంటి కార్యక్రమాన్ని సాధించడం మానవునికి అంత తేలిక కాదు. తాను దివ్యత్వాన్ని సిద్ధింప చేసుకోవాలని ముందు నిశ్చయించుకోవాలి. అప్పుడే వ్యక్తి తనలోని వైరుధ్యాలనుంచి విముక్తిని పొందగలుగుతాడు. అంతవరకు అంటే అంతర్గత వైరుధ్యాలు తనలో చోటు చేసుకొని ఉన్నంత కాలమూ కూడ వ్యక్తి పరిపూర్ణంగా చిత్తశుద్ధిని సాధించలేడు. అంతేకాదు. తన తాలూకు మానసిక, ప్రాణిక, శారీరక క్రియాకలాపాలన్నీ తనకు తెలియకుండానే వక్రిస్తాయి. శారీరక వ్యాపారాలు అని నొక్కి వక్కాణిస్తున్నాను. ఎందుచేతనంటే ఇంద్రియాలు కూడా వక్రిస్తాయి కాబట్టి. దృష్టి, శ్రవణము, రుచి, భావన ఇవన్నీ కూడా ఉన్నవి ఉన్నట్లుగా కాకుండా తమ కామనలకి అనుగుణంగా ప్రవర్తిస్తాయి. నీలో ఇష్టాయిష్టాలు, ఆకర్షణవికర్షణలు ఉన్నంతకాలం విషయాల తాలుకు స్వస్వరూపాలను దర్శించలేవు. నీ కామనల తాలూకు ప్రతిస్పందనల రంగుటద్దాలలో నుంచే వ్యక్తులను వస్తువులను దర్శిస్తావు. ఇంద్రియ ప్రవర్తనలన్నీ సక్రమమార్గంలో సాగవు. వక్రిస్తాయి. మరి అలాగే నీ భావాలు ఆలోచనలు అనుభూతులు కూడాను. *కామెర్లరోగికి లోకం అంతా పచ్చగానే కనిపిస్తుంది కదా!*

నీలో తప్పని సరిగా ఉండవలసినవి – నిర్మోహము, నిర్మమకారము. అప్పుడే నీ దృష్టి, ఆలోచన, అనుభవము భావన సక్రమంగా సరళంగా ఉంటాయి. ఇది సాధించకలగడమనేది అంత తేలికైన విషయం కాదు. నీలో సమ్యక్ దృష్టి సమ్యక్ భావన లేనంత వరకూ నీ అవగాహన అసమగ్రం గాను దోష పూరితంగాను ఉంటుంది.

అలాటప్పుడు చిత్తశుద్ధి లోపించక ఏమౌతుంది?

> *మనసా వాచా కర్మణా అపశ్రుతి పనికిరాదు*

చిత్తశుద్ధి కలిగి ఉండటమనేది అత్యున్నత దశ. కాగా తెలివితక్కువతనంగా చేసే వంచన లెన్నో! సామాన్యంగా ఇవి అందరికి తెలిసినవే. వాటి ప్రసక్తి అనవసరమే అయినా కొన్నిటిని ప్రస్తావిస్తాను. త్రికరణ శుద్ధి లేకపోవడమనేది ప్రత్యేకంగా చెప్పుకోవాలి. మనసులో ఒకటి మాట వేరొకటి; ఒకటి చేస్తూన్నట్లు నటిస్తూ మరొకటి చేయడం; నిజమైన కోరికను మనసులో దాచుకొని వేరొకటి బహిర్గతం చేయడం వగైరా. అసలు ఏమాత్రము నిజం లేని పచ్చిఅబద్ధాల సంగతి సరేసరి. ఒక ఫలితాన్ని ఆశిస్తూ ఆ లోచనతో గడుసుగా మరేదో పనిచేస్తూండటం — ఈ మేళవింపులు, కలగాపులగపు మాటలు, చేష్టలు — ఈ పరస్పర వైరుధ్యాలన్నిటికీ నీలో నీవే తావు ఇచ్చినవాడవు అవుతావు. ఇదొక స్పష్టమైన ఆత్మవంచన; పచ్చిమోసం. చూచేవాళ్లకు బాహాటంగా స్పష్టంగా అగుపిస్తూనే ఉంటుంది. దాచుకుందామన్నా దాగే వ్యవహారాలు కావు ఇవి.

కొన్ని మోసాలు, వంచనలు చాలా సున్నితంగా ఉంటాయి. బహిర్గతం కావు. కొంచెం కష్టపడితేనే గాని తెలియవు. నీ లోని రాగద్వేషాలు, సహజంగా నీ అవగాహనను నిర్దేశిస్తాయి. నీ బుద్ధి వాటికి లోబడి ప్రవర్తిస్తుంది. నీ ఇష్టాయిష్టాలకు అనుగుణంగానే వ్యక్తుల పట్ల, విషయాల పట్ల అనురక్తి విరక్తులు నీకు తెలియకుండానే నీలో ఏర్పడుతాయి. అలాటప్పుడు నీలో చిత్తశుద్ధి ఘోరంగా లోపించినట్లు కదా! అంటే నీకు తెలియకుండానే నిన్ను నీవు వంచించుకుంటావు. కలుషితమైన నీ మనస్సు ఈ వంచనాపూరిత వ్యవహారాలతో కుమ్మక్కు అవుతుంది. వ్యక్తి స్థాయిని బట్టి ఇంద్రియాల ప్రవర్తన బట్టి మోసాలు వంచనలు రకరకాలుగా మారుతూ ఉంటాయి. స్వార్థము, కామన — ఇవే వంచనలకు మూలం.

> *పక్షపాతము ఏ కోశమునా ఉండకూడదు*

అహంకారము, దానిలోంచి పుట్టిన వికారాలు, కోర్కెలు, వాటి వైకల్యాలు – వీటి నుంచే వంచనలు, మోసాలు ఉద్భవిస్తాయి.

నిజం చెప్పాలంటే, వ్యక్తి అహంకారపూరితుడై ఉన్నంత కాలం తానెంత గింజుకున్నా చిత్తశుద్ధి సాధించడం తన వశం కాదు. అహాన్ని తప్పనిసరిగా అధిగమించాలి. దివ్యచిత్తానికి తన్ను తాను పరిపూర్ణంగా అర్పణ కావించుకోవాలి. ఇందులో దాపరికాలకు, బేరసారాలకు, బేరీజులకు ఏమాత్రం అవకాశం ఉండకూడదు. అంతవరకు పరిపూర్ణంగా చిత్తశుద్ధి సాధించడం అసాధ్యమే!

> *చిత్తశుద్ధియే యోగానికి ఉపకరణము, మార్గము, గమ్యము*

అలాగని చిత్తశుద్ధి సాధించే ప్రయత్నం విరమించుకోమనికాదు దీని తాత్పర్యం. "సరే! ముందు ఈ 'అహం' నా నుంచి తొలగిపోనీ! తర్వాత చిత్తశుద్ధి గురించి ఆలోచిద్దాం!" అని తెలివితక్కువగా అనుకోకూడదు. నిర్ణయాలు తలక్రిందులు చేయకూడదు. చిత్తశుద్ధి సాధన ఇతోధికంగా పురోగమిస్తూనే ఉండాలి. ప్రయత్నం స్వచ్ఛంగా ఉండాలి. అహం అంతర్ధానం కావటానికి చిత్తశుద్ధి ప్రాతిపదిక కావాలి. ప్రయత్నం ఎప్పుడూ మానకూడదు. పరిశుద్ధమైన దివ్యసాధనకు చిత్తశుద్ధి మాధ్యమం; ఆధారము; బాట; లక్ష్యము. చిత్తశుద్ధి వినా పొరపాట్లు అనివార్యం. ఆ పొరపాట్లు నీకూ ఇతరులకూ కూడ హాని కలుగ చేస్తాయి. ఇక నిరంతరమూ ఆ చేసిన పొరపాట్లు సరిదిద్దుకుంటూ పోతూండటంతోనే సరిపోతుంది. ఇక మరి సాధనకి సమయం ఎక్కడి నుంచి వస్తుంది?

అదీ గాక చిత్తశుద్ధి కలిగి ఉండటంలో అపరిమితమైన ఆనందం ఉంది. చిత్తశుద్ధితో చేసే ప్రతికార్యాన్ని అంటిపెట్టుకొని తగిన పురస్కారం ఎప్పుడూ ఉండనే ఉంటుంది. జీవుడు నిష్కళంకుడై ఉన్నతుడై తేలికగా పైపైకి ఎదుగుతూ ఉన్నట్లు భావిస్తాడు. అమితమైన స్వేచ్ఛను అనుభవిస్తాడు. లేశమాత్రమైనా అసత్యమును కూడా సహించలేనివాడు అవుతాడు. ఉజ్వలంగా భాసిస్తాడు.

చిత్తశుద్ధే వ్యక్తికి భద్రత రక్షణ; మార్గదర్శి; చివరికది రూపంతరీకరణ శక్తి కూడాను. ఇన్ని మాట లెందుకు? దివ్య జీవన సౌధము లోనికి అడుగిడ గలిగే పసిడి వాకిలి చిత్తశుద్ధి!

*

అతిమానస శక్తులతో నిరంతర సంపర్కము

ఇది సఫలీకృతం అవటానికి కావల్సినది చైతన్యంలో సమూలమైన పరివర్తన. అతిమానస శక్తులతో జీవితం సన్నిహితమై మమేకము కాగలగేటంతగా మార్పు రావాలి. ఇది ఇలా నిరంతరాయంగా తప్పనిసరిగా కొనసాగుతూనే ఉండాలి. అప్పుడే జీవునికి అంతర్గత ముక్తి, స్వేచ్ఛ సిద్ధిస్తాయి. *ప్రతి క్షణము ఈ దివ్యకార్యక్రమములోనే నిమగ్నమై ఉండాలి. బ్రతుకు అంతా, శరీరభాగాలలో ప్రతి అణువు కూడా అతిమానస దివ్య శక్తులతో సమైక్యమై ఉండాలి.* తర్వాత రాబోయే పరిణామాల సంగతి ఆలోచించవలసిన అవసరము రానేరాదు. విశ్వబాహుళ్య శక్తులు, వాటి అభివ్యక్తీకరణలు – వీటి లీలావిశేషాలతో ప్రమేయం పెట్టుకునే అవసరమే జీవునికి కలుగదు. కావలసినదల్లా ఒక్కటే! దివ్య ఆనంద, సత్య, శక్తి, కాంతులతో విడని నిరంతర బంధం, అనుబంధం. మరోమాటు అంటున్నాను విడని బంధం. ఆ దివ్య సత్య శక్తి కాంతుల వలన కలిగే అనిర్వచనీయమైన దివ్యానందం.

అదీ చిత్తశుద్ధి అంటే! మిగిలిన వ్యవహారాలన్నీ అనుకరణలు. ఎవరికి వారు తమ కోసం తాము ఆడుకునే నాటకం. చిత్తశుద్ధి లేనప్పుడు మరి ప్రతీ చర్య నాటకమే కాక, మరే మౌతుంది?

స్వీయ స్వచ్ఛతలో పరిపూర్ణతను ఇతోధికంగా సంతరించుకుంటూ ముందుకు పోతూ ఉండాలి. "ఇదిగో! చూడండి! ఉంటే ఇలా నాలా ఉండాలి!" అంటూ బడాయిగా డంబాలు పలుకకూడదు. చిత్తశుద్ధి అనేది స్వచ్ఛందంగా ఉండాలి; సహజ సుందరంగా భాసించాలి. అలా కాకపోతే అది నాటకమే!

ఇదీ చిత్తశుద్ధి అంటే! (ఇదే ముక్తి, వ్యక్తి దివ్యభవిత్యం కూడా)

*

[చిత్తశుద్ధికి హృదయ నైర్మల్యానికి కర్కశమైన కఠోరమైన పద్ధతులు పనికి రావని, బహు సున్నితము సూక్ష్మము అయిన విధానాల ద్వారానే ఇది సాధ్యపడగలదని శ్రీఅరవిందుల వారు వివరించారు]

సూక్ష్మ ప్రక్రియలు అనగా బహిః గోచరములు కానివి. మానసికంగా ఆచరణ యోగ్యమైన ఆంతరంగిక ప్రక్రియలు, విధానాలు. హృదయంలో దృష్టి కేంద్రీకరణము, ఆత్మసమర్పణ, చిత్తశుద్ధి – ఈ అంతరంగసాధనాల ద్వారానే చైతన్యంలో మార్పు తీసుకొని రావటం సుసాధ్యం. అంతరంగ పరిశుద్ధతకు, పరివర్తనకు బాహ్యాప్రవర్తన కూడా సహకరించే విధంగా ఉండాలి. కాని బాహ్యాప్రవర్తనలో ఎంత మార్పు వచ్చినా అంతశ్శుద్ధి, చిత్త నైర్మల్యము లేకపోతే అది నిష్ప్రయోజనమే అవుతుంది. ఫలితం దక్కదు. *అంతర్వ్యాపారమంతా కూడా పరిశుద్ధ చిత్తప్రవృత్తితో కనుక సాగిస్తే బహిర్వ్యాపారం కూడా పరివర్తన చెంది తగినరీతిలో సహకరిస్తుంది. అనుకూలిస్తుంది. సంస్కరణ మరింత వేగిరమౌతుంది.* హృదయ నైర్మల్యానికి చిత్తశుద్ధి కలిగి ఉండటం అత్యంత ఆవశ్యక లక్షణం. ఆత్మవంచన పనికిరాదు. దైవము దగ్గర, గురువు దగ్గర దాపరికాలు ఉండకూడదు. ఋజువర్తనము కావాలి. సత్యాసంధత, ముక్కుకుసూటిగా పోయే చిత్తస్థైర్యం ఉండాలి. ఈ ప్రధాన లక్షణాలు లేకుండా చిత్తశుద్ధి సాధ్యపడదు.

*

చిత్తశుద్ధి అంటే ఋజువర్తనము ఒక్కటే కాదు. అంతకంటె కూడా ఇంకా ఉన్నతమైనది – విశదంగా చెప్పాలంటే – త్రికరణశుద్ధి. నీ మనసు, భావము, మాట నీ దృఢ చిత్తవృత్తికి అధీనమై ఉండి తదనుగుణంగా ప్రవర్తిస్తూ ఉండాలి. సాధకుడు పూర్తిగా దైవానికి అధీనుడై దైవోపకరణంగా మారి దైవత్వంలో మమేకమై ఉన్ననాడు నీ జీవాత్మ దివ్యపరమాత్మకు అధీనమై ఉంటుంది. దివ్యత్వమే ధ్యేయమై తన ఆకాంక్ష దివ్య ఆకాంక్షగా

మూలంగవల్ల, ఫలితంగా దివ్యప్రేరణ మినహా మరి యే ఇతర ప్రేర ణలు ఆలోచనలు దరిచేరవు.

*

మనసులోని అంగాంగము కూడా మహోన్నత దివ్య ఆకాంక్షకు వ్యతిరేకంగా ప్రవర్తించేందుకు నిరాకరించడమే చిత్తశుద్ధి యొక్క పరమ లక్షణము.

*

దివ్యసత్యమునే ఆకాంక్షించడం, దివ్యమాతకు నిన్ను నీవు పరి పూర్ణంగా సమర్పణ కావించుకోవడం, వ్యక్తిగత కోర్కెలు, వ్యామో హాలు దరికి చేరనీయక దివ్య ఆకాంక్ష ఒక్కటే కలిగి, నిరహం కారంగా జీవిత కార్యకలాపాలన్నిటినీ దైవార్పణం కావించి చేసే ప్రతిపనీ కూడా దైవ నివేదనంగా అర్పించుకుంటూ ఉండటం — ఈ దివ్యలక్షణాలు నీ చిత్తశుద్ధిని నిరూపిస్తాయి. ఇవే నీకు దివ్య జీవన సోపానాలు.

*

కావల్సినది ఒక్కటే. నీ శారీరక మానసిక కార్యకలాపాలన్నిటికీ చిత్తశుద్ధి కేంద్రమవాలి. శరీరంలోని ప్రతి అవయవ కదలిక చిత్త శుద్ధికి లోబడి ఉండాలి. ఎట్టి ప్రతికూల పరిస్థితిలో కూడా సత్య మును విడనాడ కూడదు. తప్పుని సరిగా, పట్టుపట్టి సత్యసాధన, సత్యశోధనల కోసమై నిర్విరామంగా పరిశ్రమించాలి. అంతకు మించి మరోటి ఉండకూడదు. అలాటప్పుడు అపరిమితమైన ఆత్మ వివేకము ఆత్మావలోకన జ్ఞానము కలుగతాయి. దివ్యకాంతి నీలోకి దిగుతుంది. అందుకు తగినట్లుగా నీవు నీ కవాటములను తెరచు కొని ఉంటావు. అనృతమంటే రోత పుడుతుంది. ఫలితంగా జీవి తమంతా పరిశుద్ధమై దివ్యంగా వెలుగొందుతుంది.

*

మొత్తం దీని కంతటికీ పరమ లక్ష్య, లక్షణ సాధనమొక్కటే! అది పరిపూర్ణ సామరస్య పూర్వకమైన చిత్తశుద్ధి (complete harmo-nised sinserity) ఈ పరిస్థితిని ప్రసాదించ గలిగేవి నీలోని ప్రగాఢమైన ఆకాంక్ష, పైనుంచి దిగి వచ్చే దివ్యకృపాకటాక్షములు.

అనువాదం: కర్రా వెంకటేశ్వరులు

విశ్వాసము

శ్రీఅరవిందుల ప్రవచనములు

యోగము ఒక దీర్ఘప్రయాణము లాంటిది. చాలో ఓర్పుతో ముందరకు సాగిపోతూవుంటే అనుభూతులు కలుగుతూ వుంటాయి. ముందర ఏం జరుగబోతున్నదో మనిషికి తెలియదు కాబట్టి విశ్వాసము చాలా అవసరము. మనస్సుకు తెలియక పోయినా ఆత్మకు తెలుసు. ఎటువంటి సూచనా లేకపోయినా మనస్సు నమ్మక పోయినా ప్రాణికము తిరగబడి సహాకరించకపోయినా ఆత్మవిశ్వాసము నిన్ను ముందరకు తీసుకుపోతుంది.

*

సత్యము ఇంతవరకు ఆవిష్కారము కాకపోయినా, సిద్ధి ఇంతవరకు కలుగక పోయినా, మానవ చైతన్యంలో అవి ప్రతిబింబిస్తూనే వుంటాయి. తత్ఫలితమే విశ్వాసము.

*

ఆంగ్లములో faith అనే మాట మనము 'శ్రద్ధ' అనే మాటకి సమీపార్థంలో వాడుతున్నప్పటికి దానికి సరిసమానం కాదు. నిజానికి అది పరమాత్మ మన మీదకు ప్రసరించే వెలుగు. అతిమానసభూమిక మన మీదికి, మన నిమ్నప్రకృతి మీదికి ప్రసరించే సందేశము. నిమ్నభూమిక నుండి బయటపడి తనను తాను అధిగమించి ఉన్నత భూమికలకు అధిరోహించుటయే దాని ఉద్దేశము. ఈ సందేశాన్ని, ఈ ప్రభావాన్ని గ్రహించి ప్రభావితులయ్యేదెవరు? నీ మనస్సు కాదు. హృదయము కాదు. ప్రాణికము కాదు. సత్యము నెరిగి తన కర్తవ్యమును భవిష్యత్తును తెలిసిన నీ అంతరాత్మ.

*

రామకృష్ణ పరమహంసను గ్రుడ్డినమ్మకము మంచిదేనా అని ఎవరో అడిగేరు. అసలైన నమ్మకమంటే అదే. తార్కికజ్ఞానం వలన గాని రుజువులు ద్వారా గాని నిరూపించబడిన దాన్ని విశ్వాసము అనరు. అది మరియొక విషయము.

*

"దేవుడు నిజముగానే వున్నాడు. ఆయనను వెతికి కనిపెట్టటమే అభిలాషనీయము; జీవితంలో దీనికి సరిసమానమయిన వస్తువు గాని ఇంతకంటె గొప్పవస్తువు గాని ఇంకొకటి లేదు" అనే విశ్వాసమే మన యోగానికి ప్రాతిపదిక. ఎవరికైతే అటువంటి నమ్మకముంటుందో వారు ఆధ్యాత్మిక జీవితానికి పెట్టిపుట్టారన్న మాట. అయితే అట్టి వాని బాహ్యస్వభావము ఇందుకు వ్యతిరేకంగా వుండవచ్చు. అతని ప్రకృతి తీవ్రంగా నిరోధించి మొర్రో మొర్రో అని విలపించవచ్చు. దీర్ఘకాలం తన్నుకోవచ్చు. ఎన్ని వైపరీత్యములు సంభవించినప్పటికి అతనికి ఆధ్యాత్మిక జీవితంలో విజయం తథ్యం.

*

మనిషి ఎంత అజ్ఞాని అయినప్పటికి, అర్భకుడు అయినప్పటికి, పొరపాట్లు చేసినప్పటికి, దుష్టశక్తులు ఎదిరించి నప్పటికి, పరాజయమే కలుగుతుందని తోచినప్పటికి, "ఇట్టి పరిస్థితులన్నిటి ద్వారా దేవుడు నన్ను తన మార్గంలోనే నడిపిస్తున్నాడు" అనే గట్టి విశ్వాసముండి తీరాలి. ఆ మనిషి ఏం జరిగినా సరే చెక్కుచెదరడు. నిరుత్సాహపడడు. అతనిలో సమత్వము రాణిస్తుంది. ఏం జరిగినా, ఎట్టి విపత్తు సంభవించినా, ఇవన్నియు మార్గములో అనుభవమయ్యే మామూలు విషయములే కదా అని అనుకుంటాడు. సమతభావము స్థిరపడిన తర్వాత విశ్వాసము మరింత గాఢమై అతిమానస చైతన్య (supramental consciousness) శక్తులను గ్రహించి క్రియాశీలము గావించగలడు. ప్రస్తుత వ్యవహారమును, పరిమితులను, అతిక్రమించి విశ్వాతీత దైవము యొక్క నిర్దేశములను పాలించగలడు.

వైశ్వాన్విత దైవము (cosmic divine) యొక్క శక్తి స్థానిక పరిస్థితుల వలన పరిమితమై ఉంటుంది. విశ్వాతీత దైవమును అందుకున్నప్పుడు ఆ పరిమితులను దాటిపోవచ్చును.

*

శ్రీమాత ఉవాచ:

మానవమాత్రులలో సంపూర్ణ విశ్వాసము సహజముగా భాసించదు. అది భగవంతుని కృపాకటాక్షముల వలన మాత్రమే సాధ్యము. అప్పుడు నీ అంతరంగంలో ఒక ద్వారం తెరుచుకుంటుంది. అక్కడి నుంచి నువ్వు పరమసత్యమును దర్శించి స్పర్శించగలుగుతావు.

అజ్ఞానాంధకారంలో మునిగి ఉన్న మానవుని పరిస్థితి ఘోరాతి ఘోరము. అట్టి పరిస్థితిలో విశ్వాసము ఎక్కణ్ణుంచి వస్తుంది? అది దైవసాన్నిధ్యము వలననే సాధ్యమవుతుంది. దానిని చీకటి శక్తులతో పోరాడి నిన్ను గెలిపించేందుకై అరుదెంచిన దివ్యశక్తిగా గుర్తించాలి.

*

అసలు విశ్వాసమంటే ఏమిటి? నీలో దైవమున్నాడు అనే గట్టి నమ్మకము నీకున్నప్పుడు ఆ దైవం నీకు కనపడాలి కదా? అనగా విశ్వాసము కేవలం మనసులోనే కాకుండా మనిషినంతా ఆవహించి ఉద్దీపింప జేయాలి. కాని అంతటి గాఢమైన విశ్వాసము నూటికి కోటికి ఏ ఒక్కరిలోనో కాని భాసించదు. ఒక్కొక్కరికి ఒక్కొక్కదాంట్లో నమ్మకముంటుంది. నీలో దైవసాన్నిధ్యమున్నదని గట్టి నమ్మక మున్నట్లయితే ఆ విషయము తక్షణం నీ అనుభవంలోకి రావాలి కదా. ఇది నీకు స్పష్టంగా అర్థమయిందని తలుస్తాను. నీకు నమ్మకమున్నది కాని అనుభూతి లేదు అనగా నీ నమ్మకంలో రంధ్రాలున్నాయన్న మాట. అంతే కదా మరి. ఎప్పుడైతే నువ్వు నమ్మిన విషయాన్ని ప్రత్యక్షపరచలేవో అప్పుడు దానికి కారణాలేమిటో అన్వేషించాలి. 'ఔరా నా విశ్వాసమెంత బూటకమైనది. నన్ను నేనే మోసపర్చుకుంటున్నానన్న మాట' అని నీ ఆత్మను శోధించటం మొదలుపెట్టు. నీ లోపల ఎన్నెన్ని దోషములు దాగి ఉన్నయ్యో ఎన్నెన్ని చిన్న చిన్న కోరికలు నక్కి ఉన్నయ్యో గమనించు. బాహాటంగా కాకుండా ఎక్కడో లోలోపల ఒక చిన్న కోరిక దాగి వుంటుంది. నీకు తెలియకుండానే నిన్నా

చిస్తుంది. "ఇటు చూడు నువ్వు చాల గొప్పవాడివి. నన్ను తృప్తి పరిచావంటే నీ అధికారం పెరిగి గొప్పవాడివవుతావు" అంటుంది.

*

"నేను సంపూర్ణంగా భగవంతుడున్నాడని విశ్వసిస్తున్నా, కనపడ డేమి?" అని ఎంత మొరపెట్టుకొన్నా కానరాకపోడానికి కారణం, విశ్వాసలోపమే.

దీనికి మూడే కారణాలు – మొదటిది దైవశక్తి మీద సంపూర్ణ విశ్వాసం లేకపోవడం, రెండోది దైవత్వపు మంచితనము మీద, మూడవది నీపై భగవంతుడు ఉంచిన నమ్మకం మీద, నమ్మకం లేకపోవడం:

"నేను దైవాన్ని సంపూర్ణంగా విశ్వసిస్తాను. నాకు, నా చుట్టు ప్రక్కల జనాలకు, యావత్ప్రపంచానికి, సహాయం చేస్తు న్నాడు కదా! ఇదంతా దైవసంకల్పం చేతనే జరుగుతున్నది" అంటూ తమ తర్కం ప్రయోగించి నమ్ముతారు. కాని ప్రపం చంలో, చుట్టు ప్రక్కల జరుగుతున్న ఘోరమైన, భయంకరమైన పరిస్థితులను గమనించి, "అసలు దేవుడే ఉంటే ఇలా ఎందుకు జరుగుతుంది? లేదా దేవుడు ఉన్నా అతడు మహాక్రూరుడు, రాక్ష సుడై ఉండాలి, లేకపోతే, యీ రక్తపాతం, అన్యాయాలు ఎలా జరుగుతాయి" అనేది వారి వాదనలో మొదటి అంశం.

"నేను దైవమున్నాడని నమ్మేను – కాని నాకు కన్పిస్తున్న ఈ ప్రపంచంలో ఎక్కడ చూచినా కష్టాలే కనబడుతున్నాయి. ముఖ్యంగా నేను ఏం సుఖపడుతున్నాను. నా పొరుగు వారే నా కంటె నయం. నేను భగవంతుణ్ణి నమ్ముకున్నానే. మరి నన్ను ఎందుకు కష్టపెడుతున్నట్లు? దైవం కృపాసాగరం, సర్వ సమ ర్థుడు, మంచికి మారుపేరు అంటారే! అయినా నా బ్రతుకు యిలా నాశనమైపోతున్నదేమి? నాకెందుకు మంచి చెయ్యడు? నిజంగా దేవుడు శక్తి హీనుడు", అని వాపోయే లక్షణం – రెండవ కారణం

ఇక మూడవది – అతివినయం అనుకొని, తమను తామే నిందించుకొనేవారు. "నేను భగవంతుని నమ్మేను. కాని భగవంతుడే నన్ను నమ్మలేదు. నేను చేతకాని వాడినని, అతనికి

ఎందుకూ పనికిరాని వాడినని నన్ను విడిచి పెట్టేశాడు – కనుక ఇంతటితో దైవం కోసం పెనుగులాట వదిలేసుకోడం ఉత్తమం"
ఇదీ వరస –

కనుక దేవుని కృపాకటాక్షముల యందు సంపూర్ణ విశ్వాసం, అర్పణ, అంకితం, చిత్తశుద్ధి ఉంటేనే కాని దైవనిర్ణయం తెలుసు కొనలేము – ఆ బాటలో నడువ లేము.

*

పసివాని నిష్కల్మషత్వము, అమాయకత్వం, దైవానుగ్రహానికి సాధనాలు:

పసివాని తలపులో, అది జరగదేమో అనే సంకోచం ఉండదు. తన కోరిక నెరవేరుతుందనే నమ్మకం సంపూర్ణంగా ఉంటుంది. దైవానుగ్రహంపై అలాంటి విశ్వాసం ఉండాలి. స్వస్వరూప దర్శన కాంక్ష, లేదా భగవద్దర్శనం పొందాలనే తీవ్రమైన తపన లేక ఆకాంక్ష ప్రధాన విషయం – కాని ఊగిసలాడే మనస్తత్వం, ప్రవృత్తులు ఆ ఆకాంక్షను పడతోస్తాయి.

ఊగిసలాట అంటే, నమ్మకం అపనమ్మకం – స్థిరత అస్థిరత – గెలుపు ఓటమి – ఆశా నిరాశ – కలగలుపుగా, ఒక దాని వెంబడి మరొకటి పనిచేస్తూ, నీ ఆకాంక్షను ఎండమావిగా మార్చుతాయి. అంటే చిత్తశుద్ధి లేదని అర్థం.

పసివారికి, ఏదీ అసంభవం అని తోచదు. వారి అమాయకత్వమే వారికి శ్రీరామరక్ష – వెరపు లేదు – ఓటమి లేదు – కోర్కె తీరేవరకు వేచి ఉండటమే వారి సహజ లక్షణం – కాని పిల్లల మీద పెద్దల నిరాశ, నిస్పృహాలు రుద్దజూస్తేనే ఇబ్బంది.

పిల్లల నమ్మకం ఎంత సునిశ్చితం, దృఢం అయినదో తెలుసుకోడానికి ఒక ఉదాహరణ – పిల్లలకి ఓ చిన్న దెబ్బ తగిలితే, చాలా తేలికగా తీసుకుంటారు. "ఇదేం చేస్తుంది అదే మానిపోతుంది", అని మరి ఆ దెబ్బ గూర్చి పట్టించుకోరు. ఆ విశ్వాసమే ఆ గాయాన్ని మాన్పేస్తుంది!

దైవానుగ్రహం కోసం, దివ్యశక్తి కోసం, చిత్తశుద్ధితో, నమ్మకంతో, దృఢదీక్షతో, మన ప్రయత్నం తప్పక నెరవేరుతుం

[illegible] [illegible]తో వేచి ఉండాలి. ఓర్పుతో కనిపెట్టుకొని ఉండాలి. గుడి తలుపు తెరచుకొనేటప్పుడు, అక్కడ కాచుకొని ఉన్న వారికి దర్శనం, ప్రసాదం లభిస్తాయి. తలుపు తెరుచుకోడానికి [illegible] కొంత వ్యవధి ఉంది కదా, ఈలోగా మరో పని చూచు కొని రావచ్చునని గుడి వదలి వెళ్లే వారికి దర్శనం లేదు – ప్రసాదం లేదు. కనుక పసివారి నమ్మకంలాంటి విశ్వాసం ఉన్న వారికి అనుగ్రహం లభిస్తుందని భావించాలి.

స్వేచ్ఛానువాదం: రంగనాథ ఆత్రేయ; ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

భక్తి లేక కృతజ్ఞత

భక్తి అనగా మానవుడు భగవంతునికోసం పొందే ఆవేదన. మొదట మానవప్రేమ లాగే ఆరంభమైనప్పటికి చేతనలో మార్పు వచ్చినప్పుడు అదికూడ దివ్యప్రేమగా మారుతుంది. అది మానవ ప్రేమ వంటిది కాదు. కేవలం నీ మదిలోనే కాదు. హృదిలోనే కాదు. అణువణువునా నిరంతరం అది నీలో అనుభూతమవుతూ ఉంటుంది. వస్తువులలోను, మనుషులలోను దర్శనమవుతుంది. నీ వల్లభుడు నీలో నిరంతరం నివసిస్తాడు! ఇక నీదంటూ ఏమీ లేదు. ఎందుకంటే నీ మనస్సు, మనస్సులోని ఆలోచనలు, హృదయంలోని ఆవేదనలు, ఒకటేమిటి నీ సమస్తమైన ఉనికిని ఆయన తనదిగా చేసుకున్నాడు. – సంపాదకుడు

శ్రీఅరవిందుల ప్రవచనాలు

- భక్తి అంటే – దైవంపట్ల శ్రద్ధ; ప్రేమ; ఆరాధన. అనంతం కోసం ఆత్మ పొందే వ్యథ.
- తనకంటె గొప్పదాన్ని పూజించుట, ఆరాధించుట; తనను దానికి సమర్పించుకొనుట.
- భక్తి యొక్క పరిపక్వత అనగా తనను తాను పూర్తిగా సమర్పించుకొనుటయే.

• భక్తి అనేది మనస్సుతో గుర్తించే విషయము కాదు. అది హృదయ పరిపక్వత. ఆత్మానుభూతి. చైత్యపురుషుడు జాగృతమై ప్రాధాన్యత సంతరించుకున్నప్పుడు కలిగే స్థితే భక్తి.

ప్రశ్న భక్తిని పరిశుద్ధము పరిపూర్ణము గావించుట ఎలా?

ముందు మనస్సును శాంతింపచేయి. ఆ ప్రశాంత స్థితి లోంచి నిశ్చలంగా ఆత్మ ద్వారములు తెరచి అమ్మని వేడుకో!

మానసిక ఉద్వేగం నిన్ను వేధించకుండా చూసుకో! అమ్మశక్తి వల్ల నీ హృదయ కమలం వికసించే వరకు అలా చేస్తూ ఉండు. చేస్తూనే ఉండు. అలా చేస్తూ ఉంటే నీ హృదయంలో భక్తి వికసిస్తుంది.

*

దైవాన్ని ప్రేమ ద్వారా సమీపించాలంటే ఆ ప్రేమ దివ్యమై ఉండి తీరాలి. మొదట మానవ ప్రేమగాను, భక్తిగాను వివిధ రూపాలు సంతరించుకున్నప్పటికి హృదయపు లోతుల్లోను, ఉన్నతోన్నతాల్లోను అది చైతన్యంగా మార్పులు పొందితే అందు లోంచి శాశ్వతమైన ప్రేమ పెరుగుతుంది. అదే జరిగిందా — మానవప్రేమ బాహాటంగానే దివ్యప్రేమగా పరివర్తనమౌతుంది.

దివ్యప్రేమ మూలము ఆంతరంగికము

అయితే ఈ మానవప్రేమను ప్రదీపితం చేసే శక్తులు మాత్రం రకరకాలు. చైత్యప్రేమ (psychic love) అనేది ఒకటుంది. అది అంతరాంతరాల్లోంచి పుట్టుకొస్తుంది. అంతరాత్మ దివ్యానందంతో సంగమించినప్పుడు మాత్రమే అది ఆవిర్భవిస్తుంది. దానిని ఒకసారి అనుభూతి చెందామా — ఇక అది అలానే ఉండిపోతుంది. దానంతట అది అలా కొనసాగుతూనే ఉంటుంది. బాహ్యామైన సంతృప్తులపై ఆధారపడకుండా దానికదే స్వంతంత్రంగా ఉంటుంది. బాహ్యాకారణాలకు తల ఒగ్గదు, తగ్గదు. ఒత్తిళ్ళకు, ఒప్పందాలకు లొంగనే లొంగదు. సద్యస్ఫూర్తితో సునాయాసంగా తనను తాను సమర్పించుకుంటుంది.

అభిలాషలకు గాని, నిరాశకుగాని, కలహాలకుగాని, కోపతాపాలకు గాని అది చెక్కు చెదరదు.

అన్ని విభాగాలు దివ్యప్రేమకు ఉపకరణాలే

ఎంతసేపూ ఆంతరంగికాలింగనం కోసం నిదానంగా సదా ఒత్తిడి చేస్తూ ఉంటుంది. కాబట్టి అది సరియైన ఉత్తమమైన ప్రేమ, భక్తి. అలా అని మానవుని ప్రాణికం, భౌతికంతో సహా ఇతర భాగాలు దానిని అభివ్యక్తీకరించడంలో ఉపకరణలుగా ఉపయోగపడవని అనుకోకూడదు. ప్రేమగురించి గాని చివరికి దివ్యప్రేమ గురించి గాని పరమార్థం గ్రహించి అనుభూతి చెందడంలో వాటి పాత్ర లేదని భావించకూడదు. దివ్యప్రేమను సంపూర్ణంగా వ్యక్తీకరించడంలో అవి అత్యుత్తమ పరికరాలే! అందులో సందేహం లేదు. అయితే వాటిని మాత్రం తప్పుడు విధంగా కాకుండా సక్రమమైన పద్ధతిలో మనం ఉపయోగించుకోవాలి.

చైత్యప్రేమకు పూజాపునస్కారములు కూడా సాధనములే

ప్రాణికంలోనే ప్రేమ రెండు రకాలుగా ఉంటుంది. అందులో ఒకటి ఆనందమయం. అంతేకాదు. విశ్వాసమైనది, సమృద్ధమైనదీ ఔదార్యం గలది కూడాను. పైగా బేరసారాలకి అతీతమైనది, విద్వేష రహితమైనదీను. అది అంతరాత్మతో సారూప్యం, తాదాత్మ్యం కలిగి ఉండి, దివ్యప్రేమను వ్యక్తీకరించే సాధనం అవుతుంది. స్వచ్ఛమైన, సక్రమమైన, అనువైన ఏ లౌకిక అనుభూతినీ ఆత్మప్రేమగాని, దివ్యప్రేమగాని అలక్ష్యం చేయదు. దానిపై అది అసలు ఆధార పడనే పడదు. అసలు సాధనాలు ఏవీ లేకపోయినా – అది క్షీణించదు – ఎదురు తిరగదు. దానిని వినియోగించుకుంటే ఎంతో ప్రేమతో ఎంతో విశ్వాసంతో ప్రకటితమౌతుంది. కాబట్టి శారీరక సాధనాలను దివ్యప్రేమతోను, భక్తితోను ఉపయోగించుకోవాలి. అంతేగాని మానవ బలహీనతలకు అనుకూలంగా వాటిని మారనీయకూడదు. సక్రమమైన స్ఫూర్తితో చేసినంత సేపు, వాస్తవమైన ప్రయోజనానికి వినియోగించినంత కాలం ఆ సాధనాలు

దివ్యత్వాన్ని సంతరించుకోవడానికి, కాంతిని స్వీకరించి అంతరాత్మతో సామీప్యం పొందడానికి ఉపకరిస్తాయి.

*

నిరపేక్షమైన దివ్యప్రేమకు రాధ ఒక చక్కని తార్కాణం. తన ఉన్నత ఆధ్యాత్మికభూమికనుండి లౌకికంవరకు సర్వస్వం దివ్యమయం చేసుకొని స్వీయసమర్పణతో పూర్తిగా మంత్రముగ్ధమైన వ్యక్తి ఆమె. దివ్య ఆనందాన్ని ఆమె తన పార్థివ శరీరంలో కూడ వహించి పదార్థానికిగూడా ఆనందాన్ని ఆపాదించ గలిగింది.

*

ఈ సగుణ (ఇష్టదేవత) ఆరాధనా భావాన్ని విశ్వవ్యాప్తం చేయడానికే ఈ సంపూర్ణ భక్తియోగ మార్గం! దీనివల్ల భక్తిభావం బహుళంగా అల్లుకుని దైవంపట్ల వ్యక్తిగతమైన సంబంధం ఏర్పడుతుంది. మనసా, వాచా, కర్మణా నిత్యం ఆ భావం స్థిరపడడానికి, స్వీయసమర్పణతో సంపూర్ణ శరణాగతి స్థితిని పొందడానికి ఇది దోహదం చేస్తుంది.

వస్తువులలో కూడా దైవం సాక్షాత్కరిస్తాడు!

ఆ భావం బలీయమైతే దైవం మనకు సమీపంలోనే మసులుతున్నట్టు అనిపిస్తుంది. *మనతోను, మనలోను ఆయన, ఆయనతోను, ఆయనలోను మనం అనే భావం కలుగుతుంది.* ఈ విధమైన ఆరాధనకు నిత్యమననం (సర్వవిషయాల్లోను ఆయన్నే స్మరించడం), దర్శనం (సర్వత్రా సర్వవేళలా ఆయన్నే చూడగలగడం) అవసరం. భౌతికపరమైన వస్తువుల్ని చూసినప్పుడు వాటిల్లో మనం దివ్యప్రేమ భావాన్ని అనుభూతి చెందగలుగుతాం. మనం మనుషుల్ని, జీవుల్ని చూసినప్పుడు వారిలో మనం దైవాన్ని చూడగలగాలి. ఆయన రూపాలుగా మనం ఏర్పరచుకున్న సంబంధాలతోనే మనం వారిని భావించ గలగాలి.

అటువంటి సందర్భాలలో ఈ పదార్థప్రపంచం అవధుల్ని దాటితే మనకు ఇతర స్తరాల జీవులతో సంబంధాలు ఏర్పడతాయి. అయితే ఈ రకమైన భావం, ఈ దృక్పథం వాస్తవమని మనస్సుకి బాగా నాటుకోవాలి.

భౌతిక విషయాలకు, ప్రత్యక్షంగా కనిపించే వాటిని మాత్రమే అంగీకరిస్తూ, సాధారణ, అశాశ్వత అనుబంధానికి అల వాటుపడింది మానవ మనస్సు. మన మనస్సులో అంతర్గతంగా సహజంగా ఉన్న దైవాన్ని విస్మరించడం కూడా మనస్సుకు సహజమైన అలవాటే. తప్పించలేని ఈ అలవాటును జాగ్రత్తగా మనకు ఉన్నతిని కలిగించేలా మలచుకోవాలి. మొత్తం దేవతల్లో మనం ఆరాధించే దేవుణ్ణి ఒక్కణ్ణే మనం హృదయంలో దర్శించ గలగాలి. మన సర్వేంద్రియాలు ఆ విధంగా అనుభూతిచెందాలి.

మనం మన ఆధ్యాత్మిక అనుబంధాన్ని ఇలా విస్తరించు కుంటూ పోతే అంతా దైవమయం అనే స్థాయికి చేరుకోగలు గుతాం. చైతన్యమయమైన ఆయన ప్రోత్సాహంవల్ల మనం ఈ ప్రపంచాన్ని ఎటువంటి అవాంతరాలు లేని పద్ధతిలో చూడగలు గుతాం. దైవసాన్నిధ్యాన్ని ఆత్మపరంగానే కాకుండా వస్తుపరంగా (objective) సైతం విశ్వజనీనమైన ఒక బాహ్యావాస్తవంగా అది [illegible]గలుగుతుంది.

> *నీ శరీరం దేవునికి ఆవాసం*

ఆంతరంగికంగా మనం ఆరాధించే రూపం మన మనోనేత్రానికి కనిపిస్తుంది. *ఆయన మన మనోమందిరంలో వసిస్తాడు. తన సాన్నిధ్య మాధుర్యాన్ని మన హృదయానికి తెలియజేస్తాడు.* ఆయన మన హృదయ శిఖరాల్లో ఉండి మన మనస్సుకి, జీవితానికి సంబంధించిన అన్ని కార్యకలాపాల్లో స్నేహితునిగా, యజమానిగా, ప్రేమికునిగా మనతో ముచ్చటి స్తాడు. పైనుండి మనల్ని ఆయనలో కలుపుకుంటాడు. సుస్థిర మైన ఈ అంతర్గత సంసర్గమే ఆనందం. దీన్ని మరింత సన్నిహి తంగా, శాశ్వతంగా నిర్విరామంగా చేసుకోవాలి.

> *నిత్యకృత్యాలలో కూడా ఆయనే భాసిస్తాడు*

మనం సాధారణ వ్యాపకాల నుండి వైదొలగి ఆరాధన ద్వారా పొంద గలిగే ప్రత్యేక సమయాలకు మాత్రమే ఇది పరిమితం కాకూ డదు. మన మానవ కార్యకలాపాలను ప్రక్కన పెట్టాలని అను

కొనేకూడదు. ఆలోచనలు, ప్రేరణలు, అనుభూతులు, కార్యకల
పాలు అన్నీ ఆయన అంగీకారం ప్రకారమే జరగాలి.

సరే! ఆ స్థితికి మనం ఇంకా చేరుకోలేకపోతే ఎలా...?

అప్పుడు ఏం చేయాలంటే –

దేవునితో పూర్తిగా తాదాత్మ్యం

ఆ విశ్వాత్మ మనలోకి మరింతగా దిగివచ్చి, తన శక్తి, కాంతి, జ్ఞాన ప్రేమ, ఉత్సాహంతో అంతట వ్యాపించి ఉండేందుకు వీలుగా మనం ఆకాంక్షించి ఆయనక సమర్పించుకోవాలి. ఇలా చేస్తే చివరకి మన ఆలోచనలు, అన భూతులు, ప్రేరణలు, క్రియలు అన్నీ ఆయన నుండి పురోగవి స్తాయి. అవి దివ్యబీజాలై అంకురాలై, క్రమంగా రూపుదిద్దుకు టాయి. ఫలితంగా మనం ఆయనలోని భాగమేనని, అంతర్గతంగ తెలుసుకోగలిగే స్థాయికి ఎదుగుతాం. అప్పుడు మనం ఆరాధించ దేవుని ఉనికికి, మన జీవితానికి మధ్య అసలు తేడాయే ఉండదు

*

గురువుగా దేవునికి శిష్యత్వం, తండ్రిగా భగవంతునికి పుత్రత్వం మాతృమూర్తిగా జగత్కర్త వాత్సల్యం, దివ్యసఖునిగా కరచాలన సహచరునిగా ఆయనపట్ల సంతోషం, జతగానిగా జగన్నాటక సూత్రధారితో క్రీడ, యజమానిగా జగన్నాధునికి ఆనందకరమైన దాసత్వం, దివ్య విటునిగా ఆయన మధురప్రేమ – ఈ పరవ సప్తకం మానవుని శారీరక జీవితంలోని పరమానందానుభూతి.

వీటన్నటిని హరివిల్లు రంగుల అనుబంధంగా ఒకేచో మేళవించు. అప్పుడు నీకు వేరే ఏ స్వర్గమూ అక్కర్లేదు. నువ్వు అద్వైత భావనకు సైతం అతీతంగా ఉండగలుగుతావు.

*

శ్రీమాత ప్రవచనములు:

నీ ప్రకృతంతా కృతజ్ఞతామయమైపోవాలి

భక్తితో పాటు నిత్యం ఉండవలసిన మరో అంశం ఉంది. అది కృతజ్ఞతా భావం (విశ్వాసం). అద్భు తమైన కృతజ్ఞతా భావం భగవంతుడు నిజంగా ఉన్నాడన

...న్ని కలిగించి ఉదాత్తమైన ఆనందాన్ని నీలో నిలుపుతుంది. ... ప్రపంచం యొక్క బాహ్యాస్వరూపం ఘోరాతిఘోరంగా ఉండొచ్చు. కాని అది భగవంతుని ఆవాసము. భగవంతుడు ఉన్నాడన్న ఉదాత్త సత్యంతో ప్రతిసారీ ప్రత్యక్షంగానో, పరోక్షం ...నో నిన్ను అనుసంధానం చేస్తూ ఉంటుంది. నీ హృదయం ఉదాత్తమైన చిక్కని ఆనందంతో నిండి పోతుంది. అటువంటి విశ్వాసం (కృతజ్ఞతా భావం) అన్నిటి కంటె అతిరుచికరమైనది.

విశ్వాసం (కృతజ్ఞతాభావం) ఇచ్చేటంత ఆనందాన్ని ...దీ ఇవ్వలేదు – పక్షుల కిలకిలారావాలు విన్నప్పుడు, అంద...న పుష్పాలు వికసించినప్పుడు, ఓ పసిపాపను చూసినప్పుడు అందమైన సూర్యాస్తమయాన్ని దర్శించినప్పుడు నువ్వు ఈ ...వంతో ముగ్ధుడవైపోతావు.

ప్రపంచంలోని దైవానికి జేజేలు

ఇలా ఇంకా ఎన్నెన్నో...! ఏదైతేనేం "ఈ ప్రపంచం వెనకాల దివ్యమైనది ఏదో ఒకటి ఉంది. ఈ ప్రపంచంలో నిజం ...నే దేవుడున్నాడు", అనే భావం హఠాత్తుగా నీకు కలుగుతుంది. ఈ రకమైన ఆవేశం చాలా లోతైె నది. చాలా తీవ్రమైనది.

విశ్వాసం (కృతజ్ఞత) లేని భక్తి ఖచ్చితంగా అసంపూర్ణమని నేను కనుగొన్నాను. భక్తితోపాటు విశ్వాసం ఉండితీరాలి.

*

దేవుడు మనని దగ్గర దారిలో నడిపిస్తాడు

స్వార్థం ముసురుకున్నప్పటికి, అజ్ఞానం ఆవరించినప్పటికి, అపోహలు అతిశయించినప్పటికి, అహంకారం అధికమైనప్పటికి, ఆఖరికి ఎదురు తిరిగినప్పటికి వాటిని ...చేయకుండా భగవంతుడు ప్రతివారిని సులువైన దగ్గరి దారిలో ...గమ్యానికి నడిపిస్తున్నాడు. అటువంటప్పుడు దివ్యమైన ...యున కృపను మరిచిపోకుండా విశ్వాసం (కృతజ్ఞతా భావం) ...ో ఉండాలి కదా!

అహంకారాన్ని అంతం చేయడానికి, అంధకారాన్ని తరిమి కొట్టడానికి కృతజ్ఞతాభావం వలన రగిలేజ్వాల మన హృదయంలో నిత్యం వేడిగా, మధురంగా, ప్రకాశంగా జ్వలిస్తూ ఉండాలి.

సాధకులను వారి వారి గమ్యంవైపు దగ్గిర దారిని నడిపించే ఆ పరమాత్ముని కృపాసాగరానికే ఈ కృతజ్ఞతా జ్వాల. ఆయన కరుణను తెలుసుకోగలిగి దానికి మనం ఎంత ఎక్కువగా విశ్వాసం చూపితే – గమ్యం చేరుకునే మార్గం అంత చేరువ అవుతుంది.

*

ప్రార్థించడానికో, దేవుని నుండి దేనినో యాచించడానికే కాకుండా తనను తాను సంపూర్ణంగా సమర్పించుకోవడానికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి, ఉదాత్తమైన దానిని కోరుకోడానికి, శరణు పొందడానికి – ఇటువంటి నిజమైన భావంతో చర్చికిగాని, ఆలయానికి గాని వెళ్లేవారు – చాలా తక్కువమంది, అతితక్కువ మంది ఉంటారు – వారిని వేళ్ళపై లెక్కపెట్టవచ్చు.

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

ధీరత్వము లేక అభీప్స (ఆకాంక్ష)

యోగమనగా దైవశక్తిని మానవ శరీరంలోనికి కొనివచ్చి క్రియాశీలము గావించుట. దైవశక్తి మానవశక్తి వంటిది కాదు. అగ్ని, విద్యుచ్ఛక్తి మొ॥ మానవునికి పరిచితములు. కాని దైవశక్తి బ్రహ్మాస్త్రము వంటిది. మన అణ్వాస్త్రములు దాని ముందర గడ్డిపోచలు. ఆ శక్తి మానవుని సాధారణ ప్రకృతిని మార్చి దివ్యప్రకృతిగా పరిణమింప జేయగలదు. అంతటి మహత్తరమైన శక్తిని గ్రహించుటకు మానవుడు యోగ్యుడు కావలెను. తన ఉనికినంతా భగవంతుని సమక్షమున విప్పి అప్పచెప్పవలెను. ఆ మహాశక్తికి ఏ మాత్రం భయపడకూడదు. దేవుని మీద భారం వేసి ధైర్యస్థైర్యములతో నిలబడుట ఎంతో

సాధనలో అసుర శక్తులు నిన్ను పట్టుకొని పీడించ
పూర్వము ఋషులు యజ్ఞ యాగాదులు తలపెట్టిన
అసురులు వాటిని భంగపరచుట మనకు తెలిసిన విష
నేటి పరిస్థితి కూడ అంతే. విపత్తులు సంభవించిన
ఆత్మ సమర్పణమే మనకు శ్రీరామరక్ష.

— సంపాదకుడు

అమృత వాక్కులు:

సిద్ధికి అంగాలున్నాయనీ అందులో ఈ ధైర్యమొకటనీ గుర్తు.... కానీ ఈ ధైర్యమంటే ఆత్మప్రస్థానానురక్తి. ఈ ప్రస్థానమొక మహాప్రస్థానం – ప్రయాణం – ఒక సాహస యాత్ర. జైత్రయాత్ర. దీనియందభిలాష. అభిరుచి. ఇదే అభీప్స. అంటే నీకు తెలియకుండా సంపూర్ణంగా నిన్నాక్రమించి బరచుకొని నడిపిస్తుంది. ఇక్కడ లెక్కలుండవు. ప్రమాలుండవు. వెనకడుగు వేయనీయని ఒక ప్రబల యోగాగ్ని. అదొక కరదీపిక. కాగడాగా నిన్నా ఆత్మాధ్వంలో ముందుకు తీసుకొనిపోతుంది. పరమేశ్వర సమ్మేళనమే లక్ష్యముగా ఈ జైత్రయాత్రలో అది నీకు మార్గదర్శకమైనది. ఈ మెక్కడికి? ఈ అడుగు ఎక్కడ పడుతుందన్న చింతన గనీయకుండా సత్యదర్శన పర్యంతం ముందుకు తీసుకొని ంది. ఎక్కడకు? ఎందుకు? – అన్న ప్రశ్న కలిగిందంటే ముందుకు సాగిపోలేవన్న మాట. ఉన్న చోటనే ఉంటావు. తుంది అన్న భయం నుండి ఆ ప్రశ్నలుదయిస్తాయి....

ధీరత్వం లేదా ధైర్యం – విషయాభిలాషల వెంట పరు జీవాత్మ లేదా జీవుడు అధీరుడు. ఏకాగ్రత లేని వాడు. త్మానురక్తి లేదా ఆత్మోన్ముఖమైన జీవాత్మ ఏకాగ్రమై మే లక్ష్యముగా గలది. ఈ బెదరనితనం పేరు ధీరత్వం. ంటే ఆధ్యాత్మయుద్ధ వీరుడు. అంతరయుద్ధ వీరుడు. బాహ్య యుద్ధ వీరుడు. సాధారణ నరుడు రాజు. ఆత్మజయమే లక్ష్యముగా వ్యక్తి ఋషి. యోగి. ఇదే ఆత్మరతి. దివ్యత్వమే లక్ష్యంగా కల

తీవ్రతపన. వెనుతిరగనీయని ఆత్మ ప్రయాణానురక్తి అభీప్స, ధైర్యం.

*

మనిషిలో అత్యంత అవంశుద్ధాంశం భయం. ఇది అసురశక్తుల ప్రభావంతో మనిషిని ఆశ్రయించి భౌతిక వాతావరణంలో దివ్యత్వానికి వైరుధ్యం కల్పిస్తుంది. కనుక యోగాన్వేషణ కలవారు దీనిని దరిచేరనీయ రాదు. తమ శక్తియుక్తులతో – ఓర్పుతో – దాని నీడను కూడా పడనివ్వరాదు. యోగపథంలో ప్రయాణించే వ్యక్తి ఈ క్షుద్ర-అల్ప-బలహీన-జుగుప్సావహమైన భీతిని జయించాలి. అది నీలో నిన్ను ముడుచుకొనిపోయేటట్లు చేస్తుంది. యోగ మార్గంలో ప్రయాణించే వానికి కావలసినదేమంటే శ్రద్ధ, ఆత్మార్పణ, వ్యాపార దృష్టి లేకపోవటం. (భగవంతుని అది కావాలనీ – ఇది కావాలనీ అడగటమే వ్యాపారం) రక్షణ రాదేమోనన్న భీతి – ఋజువులు కోరుకోకపోవటం – ఇలాంటి లక్షణాలుండాలి.

నీవేది చేస్తున్నా నీ లక్ష్యం నుండి క్షణం ఏమరుపాటుండరాదు. ఈ మహాప్రస్థానంలో చిన్నవీ – పెద్దవీ అన్న భేదముండదు. ప్రతిదీ సమానమే. నీ లక్ష్యం చేరుకోవటానికి తోడ్పడేదీ కావచ్చు. జాగు చేసేదీ కావచ్చు. అన్నం తినే ముందు కొన్ని క్షణాలైనా నీ లక్ష్యశుద్ధి – సిద్ధిపై మనస్సును కేంద్రీకరిస్తూ – నీవు తినే అన్నంలో ప్రతి మెతుకూ నీ లక్ష్యానికి కావలసిన శక్తినీ – శ్రద్ధనూ – ఓర్పునూ – ప్రయత్న స్థిరత్వాన్నీ కల్గించాలని ప్రార్థించు. ఆ అన్నం నీకు ప్రయాణంలో కావలసిన ఓర్పునూ – ఓపికనూ కల్గించాలని కోరుకో, ప్రార్థించు. నిద్రించే ముందు అలాగే కొన్ని క్షణాలు నీ ఆత్మాభిరతి రూపమైన అభీప్స పై మనస్సును లగ్నం చేసి ధ్యానించు. నీ అలసిన నరాలకు శక్తి రావాలని, నీ మెదడుకు శాంతి లభించాలని – నీవు మేల్కొన్నాక నీలో కొత్త జవసత్త్వాలను కలిగేటట్లుగా ధ్యానించు. తిరిగి నీ మహాప్రస్థానం తేజోవంతం కావాలని కోరుకొంటూ ధ్యానించు.

[illegible]క పని చేసే ముందు అలాగే నీ సంకల్పం మీద [illegible]ను లగ్నం చేయి. ఆ ధ్యానబలం నీ మార్గాన్ని సుగమం [illegible]లని, నిర్విఘ్నంగా సాగాలనీ సంకల్పించి ధ్యానించు.

నీవు సంభాషించే ముందు – నోటి నుండి మాటలు [illegible]ముందు – ఆ శబ్దాలపై ఏకాగ్రంగా మనస్సును నిలుపు. ఏవి [illegible]మో వాటిని పెదాల నుండి రాలనివ్వు. నీ మహాప్రస్థానికి [illegible]గపడే మాటలే రాలనివ్వు. శబ్దప్రసరణపై బుద్ధి జాగృతం [illegible]. గుర్తుంచుకో.

ఒక్క మాటలో – నీ లక్ష్యాన్ని విస్మరించవద్దు. సత్యా[illegible] ఒక మహా కాంతివిహంగములాగా నీ కనుల ముందు [illegible]లి. నీవు చేయబోయే ప్రతి పనిలో అదే కదలాలి. నీ సర్వ [illegible]లను దాని రెక్కలే కప్పాలి.

*

[illegible] సంవేదన (aspiration) ఒక మహోత్కంఠ. వాడియైన బాణం [illegible] దూసుకొనిపోవాలి. సునిశ్చిత అవగాహనను సంకల్పించు. [illegible] వివేకంతో సత్యంలో లీనమైపో. ఔను. ఆ ఉత్కంఠతో (aspiration) నీవిది చేయాలి. నీ సత్య సంకల్పం – ఉత్కంఠ – [illegible] అలా – అలా – పైకి పైపైకి ఎగిరిపోవాలి. త్రివిక్ర[illegible]గా పెరగాలి. క్షణక్షణ ప్రవర్ధమానం కావాలి. అలా పెరిగి [illegible] ఆ లక్ష్యాన్ని – ఏం చెప్పాలబ్బా – ఆ! అక్కడొక ఆవరణ ([illegible])[1] ఇనుపద్వారంలాగా అడ్డుగా వస్తుంది. అది నిన్ను

---

[1] [illegible] (ఆవరణ) విషయం ఈశావాస్యంలోది.
[illegible]యేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖం
[illegible] పూషన్న పావృణ సత్య ధర్మాయ దృష్టయే (15)
[illegible]న్ని ఒక కాంతిమంతమైన బంగారు మూత మూసింది. నీవు [illegible] తొలగించు. ఓయీ! పోషకుడా! ఆ సత్యధర్మ దర్శనం చేస్తావు.
[illegible] కర్షే! యమ సూర్య ప్రాజాపత్య వ్యూహారశ్మాన్ సమూహా
[illegible] తే రూపం కళ్యాణ తమం తత్తే పశ్యామి
[illegible] సా పురుషః సోఽ హామస్మి (16)

లోపలకు పోనివ్వదు. అప్పుడు నీవనుకోవచ్చు. – "ఈ ఉత్కంఠ వల్ల ఏమి ఒరిగింది? దీనివల్ల ఏమి ప్రయోజనం? ఈ ద్వార భేదన మెలాగ? – కుదరదే" అని.

కానీ నీకు తెలుసా? రాతి పై పడ్డ నీటిబొట్టు సంగతి – ఒక చిన్న చప్పుడుతో చెదిరిపోతుంది కానీ అది ఆ రాతిని పై నుండి క్రిందిదాకా ఉలిలాగా దొలిచివేస్తుంది. నీ ఉత్కంఠ అలాంటి నీటిబొట్టు. క్రిందపడటానికి బదులుగా పైకి చిమ్ముతుంది. కనుక ఆ కొంచెం పైకి చిమ్మటం వల్ల అది తాడిస్తుంది. కొడుతుంది. లక్ష్యాన్ని ఛేదిస్తుంది – ఒకనాటికి కాకపోయినా మరోనాటికైనా ఆ తొలచిన రంధ్రం నుండి ఒక్కసారిగా పైకుబుకుతుంది. ఆ మూతను ఛేదిస్తుంది. కన్పించిన మహాకాంతిలో ప్రవేశిస్తుంది. అప్పుడంటావు ఓ! నాకు తెలిసిందీ అని. నీ మహాప్రస్థానం ఆ మహాజ్యోతిర్దర్శనంతో[2] శుభాంతమౌతుంది.

కనుక అన్వేషణకు కావలసింది చెదరని ధైర్యం. దృఢ సంకల్పం. భగవత్సమాగమోత్కంఠ. అది ఊర్ధ్వమార్గగామి. అంతే కాని అక్కడని ఇక్కడని వ్యర్థంగా సంచరించదు. వ్యర్థమైన వానిని కోరుకోదు.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు

పోషకుడా! ప్రధాన ఋషీ! నియమించేవాడా! జ్ఞానసూర్యుడా! సకల జీవులకు తండ్రీ! చెదరిన నీ కిరణాలను ఏక ముఖంగా చేయి. నీ కళ్యాణ రూపాన్ని చూస్తాను. అక్కడున్న పురుషుడెవరో అతడే నేను.

[2] 2-3-1958 న అమ్మకు కలిగిన అనుభవంలో ఈ ఇనుపకవాట భేదన విషయం వస్తుంది. అతిమానస దివ్యలోకానికీ – భౌతిక ప్రపంచానికి నడుమ – రెంటినీ వేరు చేసే కవాటమే "ఈశ" లోని బంగారుమూత. దానిని భేదించాననీ – వెంటనే ఒక దివ్యకాంతి ధారావర్షం లాగా లోకంలోకి కురవటం మొదలైనదని తల్లి చెప్పింది.

చూ. ఏప్రిల్ 1958 బులెటిన్

తితీక్ష లేదా సహనం

యోగమనగా నీపై నీవు విజయం సాధించుట. సాధనా మార్గంలో నీలోని బలహీనతలు దుర్గుణాలు తగుల్తూ ఉంటాయి. వాటన్నిటిని నీవు జయించాలి. కాని మనిషిలో పాతుకుపోయిన గుణాలు అంత తేలికగా తొలగిపోవు. మొండి చెట్లల్లే మళ్ళీ మళ్ళీ బయటకు వచ్చి 'మేమింకా ఉన్నాము' అని తలెత్తుతయి. వాటిని పూర్తిగా వదిలించుకునేందుకు చాలా ఓర్పు పట్టుదల తప్పనిసరిగా వుండాలి. అచంచలమైన విశ్వాసము, మొండిధైర్యము అత్యంత సహనము అనివార్యములు. నీ అహంకారపు ప్రకృతినంతా దైవానికి విప్పి అప్ప చెప్పాలి. అప్పుడు దాని సంగతంతా ఆయనే చూసుకుంటాడు. క్రమేపి నీ నిమ్నప్రకృతినంతా మెరుగు పరుస్తాడు. తన శక్తితో నీకు అండగా నిలిచి నిన్ను పరివర్తింపజేస్తాడు. బాధ్యతనంతా తనే వహిస్తాడు. ఆయన శక్తికి ఒదిగి యుండుటయే నీవు చేయవలసిన పని.

— సంపాదకుడు

అమ్మ అమృత వాక్కులు:

నేనింకా ఒక లక్షణం చేరుస్తాను. ఇంతవరకు మనం నాల్గే చెప్పుకున్నాం కదా. దానికి ఓర్పు-తితీక్షను చేర్చాలి. ఎందుకంటే మీరు కష్టాలను ధైర్యంతో ఎదుర్కోకపోతే — పట్టుదలతో ప్రయాణించకపోతే — సమర్థతతో కష్టాలను గుప్పిట బట్టకపోతే — ఎదురు దెబ్బలంటే నీలో లోపాలే కనుక వాటిని పుక్కిటబట్టి చప్పరించకపోతే నీ ప్రయాణం మధ్యలో ఆగిపోకుండా సాగిపోలేవు. ఈ ప్రయాణంలో ఒక మలుపెదురౌతుంది. ఆ మలుపు ఏమంటే నీకు అలవాటైన సాధారణ జీవితం కనుమరుగౌతుందే — అది. అక్కడ నుండి నీవు నీ లక్ష్యం వైపుకు సాగిపోకుంటే గమ్యం చేరుకోలేవు. ఆ మలుపు చాలా ముఖ్యం. ఎందుకంటే చాలా మంది ఆ మలుపులోనే జారిపోతారు కనుక.

దీని భౌతిక రూపం పట్టుదల. అదే విషయం పలుమార్లు ప్రారంభించవలసి వస్తుందని నీవు నిర్ణయించుకోకపోతే —

చాలామంది నా దగ్గరకు దుఃఖంతో వచ్చి "నేననుకొన్నాను పని పూర్తయిందని – కానీ మరలా మొదటికొచ్చింది." కానీ వారింకా శతాధికంగా ప్రయత్నించాలని – సహస్ర విధాలుగా ప్రయత్నించాలని చెబుతాను. నీవొక అడుగు వేస్తే రెండడుగులు వెనక్కు తీసుకోవలసి రావచ్చు. దారిలో విఘ్నాలనేకం కనుక. సమస్య పరిష్కృతమైనది గదా ఇక ఫర్వాలేదులే అని అనుకొంటారు. కానీ సమస్య మరలా తలెత్తుతుంది. వేరే రూపంలో కావచ్చు కానీ రావటం తప్పదు. కనుక నీవు ప్రతిజ్ఞ చేయాలి. ఎన్నిసార్లయినా ఎదురు తిరుగనివ్వు. అన్నిసార్లు తిరిగి ప్రయత్నిస్తానని. ఇలా చేయకపోతే యోగమార్గ ప్రయాణం దుర్గమం.

ప్రధానంగా కావలసిన దేమంటే సహనము పట్టుదల. దీనిని ఎలా వివరించుకోవాలి? అదొక రకమైన ఆంతర హాస్యము. అది శుభంకరమైనది. దాని వల్ల నీలో కలిగే అధైర్యము, దుఃఖము అణగారిపోతాయి. చిరునవ్వుతో కష్టాలను ఎదుర్కోగల స్థైర్యం లభిస్తుంది. ఇంగ్లీషులో దీనిని వ్యక్తీకరించే అందమైన మాట ఒకటి వున్నది. ఛీర్‌ఫుల్‌నెస్. అంటే కష్టాలు, దుఃఖాలనన్నింటిని సంతోషంతో ఆస్వాదించడం. ఈ గుణం నీలో అభివృద్ధి పొందితే, నీవు ఈ యుద్ధంలో విజయాన్ని సాధించగలవు. ఎదురయ్యే అనేక దుష్టశక్తులను జయించి వెలుగుబాటలో నడచిపోగలవు.

ఏది ఏమైనా సరే నేను ముందుకు పోతానన్న స్థైర్యం నీలో పెంపొందించుకోవాలి. దుఃఖాన్ని సహించడమనేది ఒక గొప్ప శక్తి. వ్యతిరేక శక్తులెన్నున్నా ఈ తితీక్ష లేదా సహనం నీకు ఊతకోల కావాలి. ఈ ఊతకర్ర సాయంతో ఈ ప్రయాణంలో ఎన్ని కష్టాలు ఎదురైనా నీవు ఆ పరమసత్య స్థానాన్ని చేరుకోగలవు. ఇంతకంటే మరొక మార్గం లేదు. మరొకడు నీకు సాయపడడు. అదే విజయ సాధనం.

*

శ్రీఅరవిందుల అభిభాషణం:

ఆచరణలో ఈ పద్ధతి అహంకార నిరాసమన్న మరొక రూపాన్ని ధరిస్తుంది. ఈ అహంకార నిరసన తన కంటే పైనున్న తత్త్వాన్ని

శరణు పొందటం. ఇది చూడడానికి చాలా సులభంగా కన్పిస్తుంది గాని చాలా క్లిష్టమైన సాధన. దీనికి ఆకాశమంత విశ్వాసము, సముద్రమంత ధైర్యము, వీటన్నిటి కంటే భూదేవికున్నంత ఓర్పు వుండాలి. ఎందుకంటే ఇందులో మూడు భూమికలున్నాయి. చివరిది కేవల ఆనందభూమిక. అహంకారాన్ని ఈశ్వరునితో సమావేశపరచటమనేది ఎంతో శ్రమతో కూడిన పని. మానవులలో వున్న క్షుద్ర ప్రకృతి స్వభావం ఉపశమనం పొంది ఆ స్థానంలో దివ్యకర్మ ప్రవేశించి దానిని ఉదాత్త ప్రకృతిగా పరిణామం పొందించాలి. మనిషిలోని క్షుద్ర స్వభావాలు పరమేశ్వరార్పితములై దివ్యప్రవృత్తిగా పరిణామం పొందడం. కనుక దీనికెంతో పరిశ్రమ, సాధన అవసరమవుతున్నాయి. నిజానికి మనలో తెరచాటున మనకు తెలియకుండానే ఒక దివ్యశక్తి గుప్తంగా వుంటుంది. మన జీవనయాత్రలో ధైర్యాన్ని శ్రద్ధను ఓర్పును కల్గిస్తూ వున్నది. ఇదే మాటను ఒక ప్రాచీన న్యాయం వివరిస్తుంది. పరమేశ్వరుని కారుణ్యం అంధునకు దృష్టిని ఇస్తూ, కుంటివానిని కొండలు దూకిస్తుంది. మనలో వున్న బుద్ధి, విశ్వంలో వున్న న్యాయసూత్రాన్ని గుర్తిస్తుంది. హృదయం మాత్రం మనకు చిరంతన స్నేహితుడైన విశ్వయజమానిని, జగజ్జననిని గురించి గానం చేస్తుంది. వీరిద్దరే ఎత్తుపల్లాల జీవితంలో సుఖసంతోషాలను కలిగించేవారు కనుక. కాబట్టి ఒక రకంగా ఈ మార్గం కత్తిమీద సాము. మరొక రకంగా సాధనా ప్రయోజనాల దృష్ట్యా సులభమైనది, శుభమైనది.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు

మానవజాతిని ఆధ్యాత్మిక ప్రాతిపదికపై పునర్నిర్మాణము గావించుటయే భారతీయ భావన

శ్రీఅరవిందులు

ప్రశ్నోత్తరాలు:

ఏకాగ్రత (concentration) అంటే ఏమిటి?

మధురమైన ప్రియమాతా! నేను సంభాషణలలో చదివాను: "ఏకాగ్రత (concentration) మాత్రమే నిన్ను లక్ష్యానికి జేరుస్తుంది" ధ్యానసమయాన్ని సాధకుడు పెంచాలా?

ఏకాగ్రత అంటే ధ్యానం మాత్రమే కాదు. బాహ్య వ్యాపకము ఏదైనప్పటికి మనిషి ఏకాగ్రత మట్టుకు చెక్కుచెదరగూడదు. అసలు ఏకాగ్రత అంటే ఏమిటో నీకు తెలుసా?

నీ యావచ్ఛక్తి, యావత్సంకల్పమూ, యవదాకాంక్షా దైవత్వంవైపు నీ చేతనలో భగవంతుని పరిపూర్ణ సాక్షాత్కారం వైపు మాత్రమే మరలి ఉండుట.

*

నిర్ణీతమైన కొన్ని ఘడియల ధ్యానంకన్నా ఎల్లప్పుడూ ఏకాగ్రమైన, అంతర్ముఖీనమైన వైఖరిని కలిగి యుండుట చాలా ముఖ్యం.

*

శారీరకంగా చేతులతో పని చేస్తూకూడా పూర్తిగా ఏకాగ్రతతో వుంటూ, దైవంతో సంయోగం జెందగలమని నాకు అనుభవం కల్గింది. కాని దీనికి కాస్త సాధన అవసరం. వ్యర్థమైన సంభాషణలను విడిచి పెట్టడం చాలా ముఖ్యం. పని కాదు, నిరర్థకమైన సంభాషణే దైవాన్నుండి మనల్ని దూరం చేస్తుంది.

*

హాయిగా కుర్చీలోనే కూర్చొని, నీటి కెరటాలపై తమాషాగా మెరిసే వెన్నెల గూర్చి ఆలోచించడమే అంతకంటె మంచిది.

అసలు ఆలోచించడ మెందుకు? ఏ ఆలోచనా లేకుండా, భగవంతుని కటాక్షమునే కాంక్షిస్తూండటం ఇంకా మంచిది.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

ఆరోగ్యం:

పని – అలసట

నీకిష్టంలేని పని చేసినప్పుడు నీవు తేలికగా అలసి పోతావు. అదే నీ కిష్టమైనది అయితే, అదే నీ ప్రగతికి సాధనము, దైవమే నీకు ఆధారము అనే నమ్మకమున్నట్లయితే ఇక నీకు అలసట అనేదే వుండదు. ఒకవేళ నిజంగానే అలసిపోయి విశ్రాంతి కావలసి వచ్చినప్పుడు కూడా నీవు కేవలం వినోదం కోసం ఆట పాటలతో కాలక్షేపం చేసి నీ చేతనను దిగజార్చకూడదు. చేతనలో ఒక అంతస్తు పైకి ఎక్కాలి. అక్కడే నీకు తగినంత శాంతి వెలుగు మళ్లీ పని చేసేందుకు అవసరమైన శక్తి దొరుకుతాయి.

– సంపాదకుడు

కొంతమంది పనులు చేసి అలసిపోతారు కాని దీనికి అసలు కారణం – వాళ్లకు ఆ పనుల యందు ఆసక్తి లకపోవుటయే. అయితే సాధన చేయువారికి ఇష్టాయిష్టాల ప్రసక్తి వుండరాదు. అన్ని పనులు, సాధనకు సమానమైన ఉపకరణములే. అంకిత భావముతో చేయవలసినదే. 'ఇది దైవకార్యము' అనే తత్పరతతో నీ ప్రాణం పెట్టి చెయ్యాలి. అప్పుడు నీ కిష్టంలేని పనంటూ ఏమి ఉండదు. ఎంత చిన్న పనైనా ఇంకా ఇంకా బాగా చెయ్యాలనే తపనతో చేసినప్పుడు నీ ఆసక్తి కూడా మరింత పెరుగుతుంది. ఈ తపన, ఉత్సాహము లోపించినప్పుడు నీవు ఎంత గొప్ప కార్యాన్ని నిర్వహించినప్పటికి సాధన దృష్ట్యా దాని ప్రయోజనము శూన్యమే.

*

నువ్వు ఏ పని చేసినా తేలికగా అలసిపోతున్నావంటే నీకు అభివృద్ధి పొందాలనే కాంక్ష లేదన్న మాట.

*

నీ జీవితానికి దైవమే ఆధారము. నీకు ఎటువంటి సహాయము కావలసి వచ్చినా దానిని దైవమొక్కడే అందించగలడు, అని మొట్టమొదటే నీవు నీ మనస్సులో స్థిరపరచుకోవాలి. అప్పుడిక నీవు అలసట చెందటమనే ప్రశ్నే రాదు.

*

ఒక వైద్యశిఖామణి 'కుయే' సిద్ధాంతం[3] ప్రకారం "నేను అలసి పోను. అలసిపోను. దైవము నన్ను సంరక్షిస్తూండగా నా కలసట ఎక్కడిది" అని అనుకోవాలి.

*

నీ కండరాలను కొన్నాళ్లు ఉపయోగించకపోతే చప్పబడిపోవు? మితిమీరి పనిచేయడం ఎంత హానికరమో అసలు పనిచేయక పోవడము కూడ అంత హానికరమే. అతివృష్టి అనావృష్టి రెండూ పనికీ రావు.

*

చూడు బాబూ నువ్వు తలనొప్పి, అలసట మొ॥ అన్నిటిని వది లించుకొని ఆరోగ్యంగా వుండాలి. తగిన వ్యాయామం అభ్యసిం చాలి. నిద్రాహార విషయములలో జాగ్రత్తగా వుండాలి. క్రమ శిక్షణ పాటించాలి. కాని నువ్వు ఈ నియమాలను లక్ష్యపెట్టనంత కాలం నిన్ను బాగు చేయటం చాల కష్టం.

*

చాలామంది మేధావులు విరామ సమయంలో చాలా మొరటుగా సంస్కార హీనులుగా ప్రవర్తిస్తారు. ఎందుకని? వినోదం కోసం అట్లా చేస్తారుట. కాని అది చాలా తప్పు. నిజమైన విశ్రాంతి కావాలంటే నువ్వు క్షుద్రవ్యాపారాలకు (వ్యసనాలు మొ॥) పాలు పడి నీ చేతనను దిగజార్చుకో కూడదు. నీకు నిజమైన విశ్రాంతి, వికాసము ఉన్నత చేతనలోనే లభిస్తాయి. క్రిందికి దిగితే బుద్ధి మాంద్యము, అలసటలే నీ గతి. మరొక విషయము. నువ్వు క్రిందికి దిగివచ్చి క్షుద్రచర్యలకు పాల్పడినప్పుడల్లా ఆ మాలి న్యాన్ని నీ అవచేతనలో పేర పెడుతున్నావు. అదంతా నీ కాళ్ల చుట్టూ పెనవేసికొని బంధంగా తయారవుతుంది. దీన్నంతా తరు వాత వదిలించుకోవలసి వస్తుంది. ఇదీ ఇందులోని సూక్ష్మము. దీనిని అనుభవరీత్యా తెలుసుకోవాలి. అప్పుడుగాని ఇతరులకు బోధించలేవు.

---

[3] ఆత్మవిశ్వాసము ద్వారా చికిత్సను పొందుట అనే 'కుయే' సిద్ధాంతము.

అయితే పిల్లలకి ఈ విషయాలు ఎవరు బోధిస్తున్నారు? Relaxation పేరుతో పిల్లలు ఏం చేసినా పెద్దవాళ్లు పట్టించుకోరు. పిల్లలు అలసట నుంచి తేరుకోవాలంటే వాళ్లకీ విషయాలు నేర్పాలి. *చేతనలో పై స్థాయికి అవరోహించినప్పుడే, ఆ ఉన్నత సోపానములోనే తగినంత విశ్రాంతి లభిస్తుంది. మనశ్శాంతి, వెలుగు, విశ్వశక్తులు నీ అనుభవంలోకి వస్తాయి. క్రమక్రమంగా నీ జీవిత లక్ష్యమైన సత్యమును స్పర్శించి దర్శించ గలుగుతావు. ఆ* స్పర్శతో నీ అలసట తీరిపోతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహ శాస్త్రి

ఓ చిన్న కథ

ఇప్పుడు నేను తప్పక విజయం సాధిస్తాను

మీకు ఓ చిన్న కథ చెపుతా వినండి. చాలా కాలం క్రిందట చిల్లికాసులు ఉండేవి కావు. (ఈ రోజుల్లో ఉన్నాయనుకోండి) ఆ రోజుల్లో ప్రజల్లో ఒక మూఢ విశ్వాసం ప్రబలంగా ఉండేది. చిల్లి కాసులు అదృష్టాన్ని తెస్తాయని, తలపెట్టిన కార్యక్రమాలు విజయవంత మౌతాయని నమ్మేవారు. దానికి సంబంధించిందే ఈ కథ.

పూర్వం ఒక కార్యాలయంలో ఓ ఉద్యోగి ఉండేవాడు. జీవితంలో తనకు కలసి రాకపోవటం వల్ల ఏమీ సాధించలేక పోయి బీదవాడయి పోయినాడు. ఒక రోజున అతనికి ఒక చిల్లి కాసు కనపడింది. దాన్ని అతడు వెంటనే జేబులో వేసుకొని తనకు అదృష్టం పట్టబోతుందని, జీవితంలో కలిసొస్తుందని అతనికి ధైర్యం వచ్చింది. అనుకున్నట్లే అతన్ని అదృష్టం వరించింది. త్వరత్వరగా జీవితంలో బాగా పైకి ఎదిగాడు. ఉద్యోగంలో పై స్థాయిని అందుకున్నాడు. బాగా డబ్బు సంపాదించాడు. అందరూ అతన్ని చూచి ఆశ్చర్యపడ్డారు. అతను చాలా బాగా పనిచేస్తా

డని, ఏ సమస్యకైనా ఇట్టే పరిష్కారం కనిపెడతాడని, అందరూ చెప్పుకోవటం మొదలు పెట్టారు. అతనికి మంచిగుర్తింపు వచ్చింది.

అయితే అతను మాత్రం ప్రతి ఉదయం కోటు వేసుకున్న పుడు జేబులోని చిల్లికాసు తడుముకొని భద్రంగానే ఉందని నమ్మి ధైర్యంగా ఉండేవాడు. కాని, ఉన్నట్లుండి కొన్ని సంవత్సరాల తరువాత ఒక రోజు తనూ తన భార్యా ఉదయం అల్పాహారం తీసుకొంటుండగా, తన చిల్లికాసును చూచుకోవాలని అతనికి అనిపించింది. "ఎందుకండీ, దాన్ని చూడటం అనవసరంగా" అని భార్యామణి వారించబోయింది. కాని అతను మాత్రం, "సర్లే, నన్ను ఒకసారి చూడనీ" అంటూ జేబులోని చిన్న సంచిని తీసి చూడగా అందులో చిల్లికాసు లేదు! చిల్లులేని కాసు కనపడింది!

"ఆహా! ఇది నా కాసు కాదు, ఏమయింది? నా చిల్లికాసు ఎవరు మార్చారు?" అని వాపోయాడు. దానికి అతని భార్య, తనే ఒకరోజు కోటు శుభ్రం చేద్దామని దులిపినపుడు, ఆ నాణెం కిటికీలోంచి ఎటో పోయిందనీ, ఎంత వెతికినా దొరకలేదనీ, తన కసలు జేబులో ఆ నాణెం ఉందని తెలియక పోవడం వల్ల అలా జరిగిందని చెప్పింది. ఎవరో దాన్ని తీసికొనిపోయి వుంటారని భావించి, తన భర్త బాధపడతాడని మరొక నాణెం జేబులో ఉంచానని నవ్వుతూ సర్ది చెప్పింది. అయితే అతను మాత్రం ఇన్నాళ్ళూ తన చిల్లికాసు తన దగ్గరే భద్రంగా ఉందని ధైర్యంతో, విశ్వాసంతో ఉంటూ ఉన్నాడు. అంతే.

చూడండి, నమ్మకము, విశ్వాసము ఎంతముఖ్యమో. విశ్వాసము, నిరంతర కృషి, ధైర్యము మనల్ని నడిపిస్తాయిగాని. చిల్లికాసులు కావు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె.ఆర్.ఎల్. నరసింహారావు

భారతదేశము దైవేచ్ఛను పరిపాలించి, ఆధ్యాత్మిక శిఖరము నధిష్ఠించి, ప్రపంచానికి సత్యమును, ఐక్యానికి మార్గమును చూపించగలదు. — *శ్రీమాత*

మహిళా విభాగం:

స్త్రీ పై బిగించిన శృంఖలాలు.... (స్త్రీ గురించి)

(నిరోద్‌బరన్ లేఖపై శ్రీఅరవిందుని వ్యాఖ్యలు)

గ్రీస్, రోమ్ దేశాలలో మధ్య యుగాలలో స్త్రీలకు అధికంగా స్వేచ్ఛ ఇవ్వబడింది. విశిష్టరూపంలో వారికి కొన్ని ఆదేశాలు ఉండేవి. కాని వారు సమున్నతమైనదేదీ సాధించలేక పోయారని అనుభవంగల ఒక వైద్యశాస్త్ర నిపుణుడు వ్రాశాడు. బోలోగ్నా, నేపుల్స్ వంటి ఇటాలియన్ విశ్వవిద్యాలయాలలో 17 వ శతాబ్దం నుండి వైద్యరంగంలో మహిళా ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ, శాస్త్రరంగంలో కూడా పురోగతికి వారేమీ తోడ్పడలేదు.

గ్రీస్‌లో స్త్రీలు – హిటారీలు మినహా – వంటింటి బానిసలు. మగవారిని సంతోషింప చేయడానికి మాత్రమే వారికి విద్యాబుద్ధులు నేర్పేవారు. రోమ్‌లో స్త్రీలు ఇంటిలోనే వుంటూ, ఉన్ని దుస్తులు అల్లేది. అదే ఆమెకు గొప్ప పొగడ్త. రోమన్ సామ్రాజ్యంలో కొద్ది కాలంపాటు మాత్రమే స్త్రీకి మరికొంచెం స్వేచ్ఛ లభించింది. కాని ఆమెకు ఎన్నడూ పురుషునితో సమాన స్థానం ఇవ్వలేదు. నీవు పేర్కొన్న వైద్య నిపుణుడు అవివేకి, అజ్ఞాని.

అయితే మరి, చిత్రకళ, సంగీతం, సాహిత్యాం వంటి రంగాలలో రోసాబోన్హర్ మినహా మరే స్త్రీ కూడా ప్రథమస్థానం పొందలేదు. ఆమె కూడ గెడ్డం గీసుకొని మగవాడిలాగ దుస్తులు ధరించాల్సి వచ్చింది.

ఎంత గొప్పవాదన! ఒక వైపు సహస్రాబ్దుల సాంప్రదాయం, మరోవంక అరుదైన స్థితిగతులు! రాజ్యము, వాణిజ్యం, పరిపాలనా రంగాలలో పురుషులకన్న ఎక్కువ శక్తి సామార్థ్యాలతో మహిళలు పనిచేశారు. తమ పాటవాన్ని ఋజువు చేసుకొన్నారు. వారి సంగతి ఏమిటి? ఈ రంగాల నిర్వహణకు మెదడు అక్కర లేదా? చేతకాని దద్దమ్మలు ఆ పని చేయగలరా?

అయితే అది జనుల అభిప్రాయమే అంటారా?

అది బహుశా మగవారి అభిప్రాయమై యుండవచ్చు.

మరో రంగంలో వారు దేవతలు. దాని నెవరూ కాదన లేరు. చావుబ్రతుకులు, రోగాలు, దుఃఖము, ఆవేదనలు కలిగినప్పుడు వారికి వారే సాటి. మేధలో కాకుండా హృదయంలోనే వారు జీవిస్తారన్నది సుస్పష్టం. కేవలం మానవప్రేమ కోసం ఆత్మ పరిత్యాగం చేసుకొన్న అమర విషాదాంత సంఘటనలు చరిత్ర నిండా ఉన్నాయి!

అంటే అర్థం మగవారు ప్రధానంగా వారినుండి కాంక్షించింది అదే – తమకు సేవికలుగా, వంటకత్తెలుగా, నర్సులుగా, పిల్లల్ని కనే యంత్రాలుగా, పెంచి పోషించే వారిగా, తమ కామవాంఛ లను తీర్చే వారిగా పురుషులు వారిని పరిగణించారు. అదీ వారి వ్యాపకం. జీవితంలో వారి లక్ష్యం. దానికి వారి శారీరక స్వభా వాలు అలవాటు పడిపోయాయి. "వారిపై శృంఖలాలు బిగిసినప్ప టికీ ఇతరత్రా వారు సాధించింది అంతా యాదృచ్ఛికమే" అని సగర్వంగా నవ్వుతూ, ఆమె ప్రకృతి పురుషునికన్నా బలహీ నంగా ఉండటమే దానికి కారణం అని పురుషుడు అంటాడు.

స్త్రీపురుషుల మధ్య విభేధాలకి కారణం ఏదైనప్పటికి, ప్రేమ కోసం స్త్రీలు మరింత పూర్తిగా లేక తేలికగా తమ వ్యక్తి త్వాన్నే పణంగా పెడతారన్నది అబద్ధమని ఎవరూ వాదించ లేరు. వారి బలమైన నిండు హృదయం అందుకు కారణమా? వారి మెదడు బలహీనమైనదా (అది నిజమైతే?)

యుగయుగాలుగా అందుకే వారికి శిక్షణ ఇవ్వబడింది – అదీ కారణం – బానిసత్వం, వ్యక్తిత్వత్యాగం, మగవారి దయాదాక్షి ణ్యాలపై ఆధారపడడం వారి ఖర్మ. అదే వారికి ఆ శిక్షణ ఇచ్చింది. కాని అది వారికి మరొక రకమైన అహంకారం వదిలిపెట్టింది. – అదే వారి ఆధ్యాత్మిక అవరోధం. అభిమానం వెనుక, నిరాహార దీక్షల వెనుక గల అహంకారం అది.

మెదడుతో కాకుండా హృదయంలోనే వారు జీవించడం చేత, వారి బాట సులభమైనదని చెప్పవచ్చునా?

ఈ విస్పష్ట వాదనలన్నీ మానసిక విశ్లేషణలు. మానసిక విశేష ణలు ఎంత విస్పష్టమైనా అవి నిజం కావు. సైన్సు, తత్వశాస్త్రం ప్రస్తుతం ఈ అభిప్రాయాన్నే వెల్లడించాయి. కాని మానవ జీవితం ఇటువంటి విశ్లేషణలకు లొంగే విషయం కాదు.

యోగప్రక్రియలో స్త్రీలకు ఒక ప్రయోజనం వున్నట్లు తోస్తుంది. వారిలో కామవాంఛ పురుషులలో వున్నంత బలీయంగా లేదు.

ఈ విషయంలో ఒక విశ్వజనీన సూత్రం లేదు. స్త్రీలలో పురుష లంతగా కామవాంఛలు ఉండవచ్చును. అంతకన్నా ఎక్కువే ఉండ వచ్చును. కాని పురుష సంయోగం ఇష్టపడని స్త్రీలు చాలామంది ఉంటారు. పురుషులలో కామవాంఛ లేనివారు అరుదు. లక్షలాది పురుషులలో ఒక శుకమహర్షి[4] కాని చాలామంది డయానాలు, పల్లాస్ ఎథీనీలు (Dianas, Pallas Athenes) ఉన్నారు. కన్య అనేది నిజానికి స్త్రీవాద ఆశయం. చిరంతన బ్రహ్మచర్యం అంటే పురు షులకు తిరస్కార భావం. పురుషులు కనుక స్త్రీలలో కామప్రవృ త్తిని బలవంతంగా ప్రేరేపించకపోతే చాలామంది స్త్రీలలో ఆ వాంఛ మేలుకోవడం జరగదు. కాని పురుషులలో అది చాలా అరుదు. ఈ దృక్పథానికి మరో పార్శ్వం ఉంది. మొత్తానికి మగ వారికన్నా స్త్రీలలో శారీరకంగా కామప్రవృత్తి తక్కువే. కాని ప్రాణికమైన వాంఛ సంగతి ఏమిటి? పురుషుని పొందాలని, పురు షునిచే పొందబడాలన్న ఆకాంక్ష మొ॥ లక్షణాలు.

కామినీ కాంచనాలను విడిచి పెట్టాలని రామకృష్ణ పరమ హంస ఎల్లప్పుడూ తన శిష్యులను కోరుతుండేవారు. ఎందు చేత? బుద్ధుడు కూడా అంత నిగ్రహాన్ని చూపాడు.

---

[4] మహాభారతంలో వ్యాసుని కుమారుడు శుకమహర్షి అస్ఖలిత బ్రహ్మ చారిగా, పరమ పవిత్ర అంతరంగుడైన యోగిగా ప్రఖ్యాతి చెందాడు. అప్సరసలు నగ్నంగా స్నానం చేస్తున్నప్పుడు శుకుడు అటుగా వెళ్ళాడు. కాని దేవతలు అతనికి కనిపించకుండా ఏ వస్త్రాలతోను తమను ఆచ్ఛా దించుకో లేదు. వ్యాసుడు అటు వెళ్తున్నప్పుడు వారు హఠాత్తుగా వస్త్రాలతో కప్పుకొన్నారు. వ్యాసునికి స్త్రీల మధ్య వెళ్తున్నానన్న స్పృహ కలిగింది.

ఇది పాతకాలం నాటి సన్యాస ధోరణి. పురుషగతమైన కామోద్రేకమే దీనికి కారణం. పురుషులు స్త్రీలను నరక ద్వారాలుగా చూస్తారు. నిజానికి ఆ ద్వారాలు తమలోనే బార్లగా తెరుచుకొని ఉంటాయి. అయినా వాళ్ళు స్త్రీలనే నిందిస్తారు.

స్వర్గం నుండి పురుషుడు చ్యుతి పొందడానికి స్త్రీ కారణం కాదా?

అది కామంవల్ల కాదు.వినూత్న అనుభవం, జ్ఞానం పొందాలన్న స్త్రీ ఆకాంక్షే దానికి కారణం.

అనువాదం: కె. యజ్ఞన్న

తల్లితండ్రులకు:

పిల్లల్ని పెంచటం ఎలా?

పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పటం ఎలా? చాలామంది తల్లిదండ్రులు, కారణాలు ఏమైనా గానీయండి – ఈ ముఖ్యమైన విషయాన్ని గురించి ఆలోచించరనే చెప్పాలి. వాళ్లని ప్రపంచంలోకి తీసుకురావటం, వారి తిండీ బట్టా ఆరోగ్యం లాంటి భౌతిక అవసరాలు తీర్చటంతో పిల్లల యెడ తమ బాధ్యత తీరిపోయిందనే అనుకొంటారు. ఆ తరువాత పిల్లల్ని బడికి పంపి విద్యార్జన బాధ్యత ఉపాధ్యాయులకు అప్పగించేస్తారు.

కొంతమంది తల్లిదండ్రులు మాత్రం అలా కాదు. వారికి పిల్లలు నిజమైన విద్యావంతులు కావటం ముఖ్యం. అలా పిల్లలు విద్యావంతులు కావటానికి వారు ఎంతైనా కృషి చేస్తారు. ఆ విధంగా కృషి చేసే వారిలో కూడా కొద్దిమంది తల్లిదండ్రులకు ఒక విషయం అవగతమౌతుంది. అదేమిటంటే? మనం పిల్లలకు విద్యగరపటం అంటే ముందుగా మనం విద్యావంతులం కావల్సి వుంటుందన్నదే. అలా తల్లిదండ్రులు ముందుగా వారు చైతన్యవంతులై ఆత్మాధికారాన్ని సాధించినట్లయితే తమ బిడ్డలను అపమార్గంలో నడిపించే అవకాశమే ఉండదు. అన్నిటికన్నా విద్యా

బోధనను పటిష్ఠం చేసే మార్గం ఏదంటే సోదాహరణ విధానమే. ఎవ్వరైనా బోధించేది తామే పాటించకపోతే పిల్లలకు ఎన్ని చక్కటి మాటలు చెప్పినా, ఎంత తెలివైన సలహాల నిచ్చినా వాటి ప్రభావం మృగ్యమే అవుతుంది. నిజాయితీ, నీతిమంతనం, నిష్కాపట్యం, ధైర్యం, నిష్పక్షపాతము, నిస్వార్థత, ఓర్పు, సహనము, పట్టుదల, శాంతము, మౌనము, నిగ్రహము యివన్నీ కూడా కేవలం అంద మైన ఉపన్యాసాలవల్ల కాక ఆచరించి చూపటం వల్లనే అధికాధి కంగా బోధించటం అన్నది సాధ్యమౌతుంది.

తల్లిదండ్రులుగా మీరు ఒక ఉన్నత ఆదర్శంవల్ల ప్రచో దితులై నడుచుకున్నట్టయితే మీ బిడ్డ కూడా అదే ఆదర్శాన్ని కొంచెం కొంచెంగా తనలో యిముడ్చుకుని, ఆ పై అలవోకగా తత్సంబంధమైన సుగుణాలని తన నడవడిలోనూ, స్వభావం లోనూ ప్రకటింప చేస్తుంది. సహజంగా పిల్లలు తల్లిదండ్రుల ఎడ గౌరవాభిమానాలతో పాటు ఒక ఆరాధనా భావాన్ని కలిగి వుంటారు. వారికి తల్లిదండ్రులు మరీ పనికిమాలిన వారైతే తప్ప, దైవసమానులుగా తోపించి వారిని సాధ్యమైనంత మేర అనుకరిం చటానికే ప్రయత్నిస్తారు.

ఏదో కొద్దిమందిని మినహాయిస్తే, తమ యొక్క లోటు పాట్లు, ఉద్రేకాలు, బలహీనతలు, నిగ్రహరాహిత్యం అనేవి తమ పిల్లలపై ఎంతటి దుష్ప్రభావాన్ని కలిగిస్తాయో తల్లిదండ్రులు ఊహించలేరు. మీ బిడ్డ చేత మీరు గౌరవింప బడాలంటే ముందుగా మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. తరువాత ప్రతి క్షణం గౌరవప్రదంగా మీరు జీవించాలి. పిల్లల యెడ ఎన్నడూ కఠినంగాను ఆధిక్యభావంతోనూ, కోపోద్రిక్తతతోనూ ప్రవర్తించ కండి. మీ బిడ్డ మిమ్మల్ని ఏదైనా సందేహనివృత్తి కోసం ప్రశ్నించి నప్పుడు దానికి జవాబును పిల్లలు అర్థం చేసుకోలేరన్న కుంటి సాకుతో దాటివేయకండి. మీరు సరియైన పద్ధతిలో శ్రమ తీసు కుని చెబితే తప్పకుండా బోధపరచగలరు. ఎల్లవేళలా సత్యం పనికి రాదు అనే నానుడి వుంది. కానీ నేను చెబుతాను. 'ఎల్ల వేళలా

నిజం పలకడమే మంచిది' అని. అయితే ఏవిధంగా చెబితే వినే వారి మనస్సుకు హత్తుకుంటుందో ఆ కిటుకు మీరు గ్రహించాలి.

మొదటి దశలో అంటే పిల్లవానికి పన్నెండు పధ్నాలు గేళ్ళ వయసు వరకూ అతని మనస్సు అపరిపక్వంగా వుండి గహనమైన సైద్ధాంతికమైన విషయాల్ని ఆకళింపు చేసుకొనే సామర్థ్యం కలిగి వుండదు. అయినా అటువంటి విషయాల్ని కూడా అర్థం చేసుకునే విధంగా బొమ్మలు, చిత్తరువులతోనూ. ప్రతీకలు, కథలూ, దృష్టాంతాలు మొదలైన మనోశిక్షణా విధానా లతో బోధపరచవచ్చు. కొంత వయసు వచ్చినా కూడా పిల్లల వలె అమాయకంగా ఉండేవారికి మాత్రం కథలతోనూ, కల్పనల తోను ఆసక్తి కలిగించే కబుర్లతోనూ బోధపరచవలసి ఉంటుంది. వారి విషయంలో సాధారణ బోధనా పద్ధతుల కంటె పై విధా నమే మెరుగైనది.

మూలం: శ్రీమాత

అనువాదం: అల్లు వెంకట అప్పారావు

వందేమాతరం:

భారతదేశాన్ని సముద్ధరించే సమున్నత "ప్రయోజనం"

భారతదేశం మీదికి రానున్న అల్లకల్లోలాల అలజడి నుండి మనని రక్షించేది ఒక్కటే – ఈ దేశం సాధించవలసిన పరమ ప్రయోజనంలో విశ్వాసం – భారతదేశాన్ని నిర్వీర్య స్థితి నుండి ఉద్ధరించగల ఒక "మహత్తర ప్రయోజనం" లో సుస్థిరమైన, అచంచలమైన విశ్వాసం. భారతదేశ ప్రాచీన జీవన, వైభవాల పునర్వికాసం, పునర్నిర్మాణం కోసం పోరాడటానికి సుస్థిరమైన, అచంచలమైన వజ్ర సంకల్పం, – అవే మనం ధరించే రక్షా కవచం. స్వరాజ్యమే జీవన కవచం, స్వరాజ్యమే చోదకశక్తి, స్వరాజ్యమే చీకటిలో మనల్ని నడిపే ధృవతార, మార్గజ్యోతి. ఈ

దేశానికి సామాజిక విప్లవం అవసరమా? తప్పకుండా అవసరమే. ఎందుకంటే పురాతన, సనాతన, అచంచల, అవ్యయ భారతీయ వైభవాన్ని చాటేందుకు పాత రూపాలు సరిపోవు. ఏమాత్రం అభి వ్యక్తం చేయలేని భావ స్వరూపాలకు కట్టుబడిన జాతి స్వరాజ్య ఆదర్శాన్ని సాధించలేదు. భారతదేశపు మహాద్భుత సౌందర్యం తిరిగి నూతనాలంకారాలతో శోభించి, తిరిగి ప్రదీప్తం కావాలంటే, ఆమె తన పాతకాలపు జీర్ణవస్త్రాలకు ఉద్వాసన చెప్పాలి.

ఆమె కొత్తగా అభివ్యక్తం కావడానికి తన భౌతిక రూపాన్ని మార్చుకుని తీరాలి. ఏ మార్పు అయినా వస్తే ఆమె సెకండ్ హేండ్ యూరోప్‌గా మారిపోతుందని భయపడ నవసరం లేదు. ఆమె వ్యక్తిత్వం ఎంత మహనీయమైనది అంటే అటువంటి పతనం సంభవించే అవకాశం ఏమాత్రం లేదు. ఆమె ఆత్మ ప్రశాంతం, స్వీయ పరిపూర్ణం – ఆమె అటువంటి మూర్ఖత్వానికి పాల్పడదు. ఆమె ప్రాచీన పారిశ్రామిక జీవన సౌధం అందమైనదే, కాని సంకుచితమైనది. అది పారిశ్రామిక, వాణిజ్య రంగాల విశృంఖలత్వాన్ని అనుమతించదు. ఆర్థిక విప్లవం మళ్ళీ అనివార్య మైతే స్వేచ్ఛాయుతమైన, పరిపూర్ణమైన జాతీయ జీవన పారిశ్రా మిక పాటవానికి మరింత మహనీయమైన పరిధి, విస్తృతమైన శాఖలు అవసరమవుతాయి. ఆర్థిక విప్లవం ప్రస్తుతం యూరప్‌లో మానవాళి ఉదాత్తభావాన్ని కించపరిచింది. కాని అటువంటి విప్లవం మనల్ని కూడా రుగ్మతలతో నింపి, అస్తవ్యస్తమయ్యే సామాజిక స్థితికి దారితీస్తుందని మనం భయపడవలసిన అగత్యం లేదు.

భారతావని తన ప్రాణము, తన అమృతత్వ రహస్య మైన దివ్యప్రబోధాన్ని ఇంతవరకు ఏనాడు మరిచి పోలేదు. వ్యవస్థీకృతమైన స్వార్థపరత్వం, క్రౌర్యం, లోభత్వాలకు ప్రతి రూపంగా ఆమె మారే ప్రసక్తే లేదు. ఈ స్వార్థపరత్వం, క్రౌర్యం, లోభత్వాలకే యూరప్‌లో 'పరిశ్రమ' అనే గొప్ప పేరు పెట్టు కున్నాయి పాశ్చాత్య దేశాలు.

భారతదేశం అందుకు అనువైన పరిస్థితులను తానే సృష్టించుకుంటుంది. ఈనాటి సోషలిజం వృధా పోరాటం సాగించి ఆవిష్కరించలేని నూతన వ్యవస్థ రహస్యాన్ని తను కనుగొని భారతావని ప్రపంచాన్ని, ఆత్మను (ఆధ్యాత్మికతను) ఏ విధంగా సమన్వయం చేయాలో మరొకసారి ప్రపంచ ప్రజలకు బోధించనున్నది.

మనం ఈ సత్యాన్ని గ్రహిస్తే, మన కోసమే కాకుండా, ప్రపంచం కోసం అవసరమయిన ఒక మహనీయ, అతిప్రధానమైన పరివర్తన (transformation)ను ఇప్పుడు జరుగుతున్న సంఘటనలలో మనం చూడ గలిగితే, మనం నిరసిస్తున్న ఈ కాల తరంగాలలోకి ఎటువంటి భయం, అపోహలు లేకుండా మనం దూకాలి. *భారతదేశం ప్రపంచజాతులన్నింటికీ గురువు. ప్రగాఢమైన మనోరుగ్మతలకు, వైకల్యాలకు గురియైన మానవాత్మకు ధన్వంతరి వంటిది ఆమె.*

ప్రపంచ మానవ జీవితాన్ని వినూతన పథాలలో తీర్చి దిద్దడానికి, మానవాత్మకు శాంతిని పునరుద్ధరించడానికి భారతదేశం మరోసారి చొరవ తీసుకోవలసిన తరుణం ఆసన్నమైనది. అదే ఆమె భవితవ్యం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

కుమారోదయం


(A Strong Son of Lightning)

మహాశక్తిధరుడు – విద్యుత్కుమారుడు
దివ్యాద్భుత జవోపేత – జ్వలదగ్ని చరణాలతో
పృథ్వీ చైతన్యంలో – అవతరించాడు

ఒక గర్భకోశంలో జ్యోతిస్సంభవమై
ఉరుము శక్తి మానవాకృతిలో నిండిపోయినది

స్వర్గప్రశాంత వేగం – మధు మహత్తూ
అకలుషిత భావోత్కంఠ
శక్తి రెక్కలు కట్టుకొని మట్టిపై వ్రాలింది.
దేవతా సమూహమంతా – ఒకే మృణ్మయ శరీరాన్ని
ఆలయంగా చేసుకొని – ఒకే నామం ధరించింది
ఉత్తాల చలన తరంగం – మసకబారిన
విశ్వగోళాన్ని కుదిలించింది
స్వప్నించే ప్రతి సంతోష ముద్రలో
ప్రాణశక్తి అరుణ పల్లవమై చలించింది
జీవశక్తితో జగత్తు నందనవనమై
కాలచక్రాలను కరగతం చేసుకొన్నది సముద్రం
మానవాత్మ తిరిగి – మహిత వేగులైన
దేవతలు వాడుకొనే
జలత్ కాంతి రథమైనది.
అత్యున్నత శిఖర లక్ష్యాలపై – జడివాన రెక్కల దారుల్లో
అతడు శక్త్యస్త్రాన్ని సంధిస్తే
పురాతన శిలాఫలకాలు – పెనుసవ్వడిలో రాలి
ప్రకృతి ప్రాచీన మృతి భిత్తిక
పెళ్లలై నేలకూలింది.
యౌనవ తారుణ్యంలో – ఆలోచనల్లో – అగ్నుల్లో
దైవం క్రొత్త పెండ్లికొడుకై కొలువు దీరాడు.
మృణ్మయాధరాలపై – హిరణ్మయనాదం
మురళిపై సరిగమలై విరిసింది
నిర్మలోషః కాంతిపుంజం ముగ్గుల్లో
హృదయం తాండవిస్తున్నది.
వాయువొక జలతారు వస్త్రం
శ్వాసమొక సంతోషవీచిక
జీవితం సుందర బృందావన హేల.

అనువాదం: ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు



ప్రాణప్రదాత సత్యజ్యోతి

అఖిల

అఖిల భారత పత్రిక

నవంబరు 2000



శ్రీఅరవిందులు – శ్రీ తిలక్ మొదలగు జాతీయ నాయకులతో

పార్టీలు లేని ప్రభుత్వము

ఈ దేశాన్ని నేటి కష్టాల బారి నుండి తప్పించటమెలా? శ్రీఅర విందులు ఈ సమస్యను తన భవిష్యనేత్రముతో దర్శించి దానికి పరిష్కారమును సూచించారు.

ఇది రాజకీయాల కతీతమైన విషయము. ఏ పార్టీ మంచిది అనే ప్రశ్న కాదు. ఒక పార్టీతో మిగతా పార్టీల వాళ్ళు కలియరు గదా. దీనికి మార్గమొక్కటే. ఈ దేశపు వ్యవస్థను రాజకీయాల కతీతంగా తీర్చిదిద్దాలి. రాజకీయాలలో దెబ్బలాటలు తప్ప మరేమి ఉండవు. పరిస్థితి చాలా దరిద్రంగా తయారయింది. పరిస్థితులు అంతకంతకూ ఇంకా దిగజారిపోతాయని శ్రీఅరవిందులు హెచ్చ రిస్తూనే ఉన్నారు. ఈ యుగాంతములో ప్రళయము లాంటిది సహజమే కదా. మన మిప్పుడు నూతన యుగములో ప్రవేశించ బోతున్నాము. ఈ పాతకాలపు విధానాలు ఇక పనికిరావు. దాని స్వరూపము వేరుగా ఉంటుంది.

రాజకీయాలెప్పుడూ పార్టీలకు, వారి సిద్ధాంతాలకు ముడి బడి ఉంటాయి. మనకు కావలసినది ఈ సంకుచిత పార్టీలకు అతీతమైన విధానము. పార్టీ అనగా కొన్ని సిద్ధాంతములకు కట్టుబడి ఉండుట. అది ఒక పెట్టె లాంటిది. నువ్వు ఆ పెట్లో కూర్చుంటావన మాట (మదర్ నవ్వుతూ). దాంట్లోంచి బైటకు రాలేవు. "మేము ఏ పార్టీకి చెందము. ఒక్క భారతదేశానికే చెందు తాము. పార్టీలు లేని ప్రభుత్వాన్ని ఏర్పరుస్తాము" అని చెప్పే ధీరులెవ్వరైనా ఉంటే ఎంత బాగుంటుంది!

చైతన్యాన్ని పార్టీల కతీతమైన ఉన్నతస్థాయికి లాగాలి.

అప్పుడు ఏ రాజకీయ పార్టీకి జెందని కొంతమంది మను షులు కనుక ముందుకు వచ్చినట్లయితే అద్భుతంగా ఉంటుంది. వారిది నిజంగా ముందు చూపే – భవిష్యత్తులో నిర్వహించవల సిన కర్తవ్యము. నేటి ఈ సంక్షోభమంతా దానికి దారితీసేందుకే. పాత పార్టీవిధానానికి స్వస్తిచెప్పి ముందంజ వేయాలి. పార్టీలు లేని ప్రభుత్వము అన మాట – ఆహా ఎంత అద్భుతం!

శ్రీమాత

విషయసూచిక

ప్రాణప్రదాత సత్యజ్యోతి

దివ్యవ్యాసాలు

24 నవంబరు సిద్ధి దినము

ఇతర వ్యాసాలు

జీవితము యొక్క నిజ లక్ష్యము

దైవసాయుజ్యమునకు అంకితమై పోవుటయే మానవ జీవితము యొక్క పరమార్థము.

*

దైవమును ఎరుగుటయే మానవ జీవితము యొక్క లక్ష్యము.

*

నీ అంతరాంతరాలలోని దైవమును శోధించి, కనిపెట్టి, ఆయనకు సమర్పించుకొనుటయే జీవితము యొక్క అసలు ఉద్దేశ్యము. ఈ విధంగా చేసిన యెడల నీ జీవితానికి ఆయనే సారథ్యము వహిస్తాడు. ఇక నీకు ఏ సమస్యలు ఉండవు. ఎందుకంటే ఇక నీ యొక్క సమస్తమైన సందర్భములను, కర్మలను, ఫీలింగ్స్‌ను, ఆయనే వహిస్తాడు.

*

జీవితానికి ఒక ప్రయోజనమున్నది.

అది దైవమును కనుగొని ఆయనను సేవించుటయే.

దేవుడు చాలా దూరంగా ఎక్కడో ఆకాశంలో ఉంటాడనుకుంటున్నావేమో. అదేం కాదు. ఆయన నీలోనే ఉంటాడు – నీ ఆలోచనలకు, ఫీలింగ్స్‌కు ఆవల. *దైవమే నీకు శాంతిని, సమర్థతను ఇవ్వగలడు. నీ సమస్యలను కూడ పరిష్కరించగలడు.*

*

దైవమును అన్వేషించుటయే ఈ జీవితానికి అర్థం. దైవము దొరికినప్పుడు జీవితోద్దేశ్యము నెరవేరినట్లే.

*

సుఖము కోసం ప్రాకులాడుట జీవన లక్ష్యం కాదు.
విధిని నిర్వహించుటయే సాధారణ జీవితము యొక్క లక్ష్యము.
దైవమును సిద్ధించుకొనుట ఆధ్యాత్మిక జీవన లక్ష్యము.

*

సుఖం పొందేందు కోసం జీవించ వలదు. దైవమును సేవించు టకై జీవించినచో నీకు కలిగే ఆనందము అంతా ఇంతా అని చెప్పనలవి గాదు.

*

మనకు కావలసినది వ్యక్తిగత ముక్తి గాదు – నిశ్శేషంగా, నిరపేక్షంగా దైవానికి సమర్పించుకొనుట.

*

కొంతమందికి "దైవము" అనే మాట నచ్చక పోవచ్చు.
దైవమనగా ఏదో వింత వస్తువు అనుకుంటారేమో. అదేం కాదు. మనమార్జించవలసిన జ్ఞాన సర్వస్వము, సంపాదించ వలసిన శక్తంతయు, చూపించవలసిన ప్రేమంతయు, అన్ని రంగముల లోను సాధించవలసిన ఘనత అంతయు, పొందవలసిన సంతోష మంతయు, జ్ఞానదీప్తి అంతయు, ఇంకా మనకు తెలియని కొంగ్రొత్త వైభవ మంతయు ఇంకా ఎన్నెన్నో అద్భుతములు – ఇవన్నియు దైవము యొక్క రూపములే.

*

దైవమంటే ఏమిటో తెలియదుగదూ? నువ్వు నిశ్చలంగా కూర్చుని ఆలోచించినప్పుడు లోలోపల కలిగే ఆకాంక్ష.

*

మనందరం కోరుకొనే మహదానంద స్థితియే దైవము

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

నిన్ను నీవు భగవంతునికి ఆత్మార్పణము చేసుకోవాలి. అపారమైన ఆయన కృపాకటాక్షముల మీదనే ఆధారపడాలి.

శ్రీమాత

మానవునిలోనిదైవము – విశ్వములోనిదైవము

ప్రతి జీవిలోను దైవమున్నాడు. కాని సృష్టిలో మనిషంత బలహీనుడు లేడు! మనిషిలో ఉన్నంత దివ్యత్వమూ మరొక జీవిలో లేదు.

*

నిజం చెప్పాలంటే మనందరము దైవమే. కాని ఆ సంగతి మనకు తెలియదు. ఆ తెలియని వస్తువునే 'నేను' అనే పేరుతో పిలుస్తాము.

*

నిన్ను నీవు అధిగమించటంలోనే నీ గొప్పతన మున్నది. అటుల చేసిన యెడల నీవు దైవమే అవుతావు.

*

ప్రశ్న: దేవుడు అన్నిట్లోను ఉంటాడా? చెత్తకుండీలో కూడా ఉంటాడా?

ఈ విశ్వమంతా దైవము యొక్క అభివ్యక్తియే. ఆయన ఆవిర్భావమే – అచేతనతో మొదలై క్రమక్రమంగా చైతన్యోన్ముఖంగా పెరుగుతాడు.

దైవము ఒక్కొక్క భూమికలోను ఆ భూమికకు తగిన రీతిలో అభివ్యక్తమౌతాడు. భౌతిక భూమికలో సౌందర్యము, మనస్సులో జ్ఞానము, ప్రాణికంలో శక్తి, చైత్యభూమికలో ప్రేమ ద్వారా ప్రకాశిస్తాడు.

మనము యోగము ద్వారా పైకి వెళ్ళినప్పుడు ఈ నాలుగు లక్షణములు సంగమించిన ఒక మహా చైతన్యము – సర్వవ్యాప్తమై, సర్వమును తనలో ఇముడ్చుకొని ఉన్న మహాచైతన్యము అనుభూత మౌతుంది.

సృష్టి లీల కోసమే ఈ మూల చైతన్యము ఇన్ని రూపములుగా విభక్తమౌతుంది.

*

ప్రపంచంలో ఎన్ని అద్భుతాలున్నాయో చెప్పలేము.

మన అహంకారము యొక్క ఇరుకు సందులను దాటి పోయినప్పుడు ఆ అద్భుతములను మనం దర్శించగలుగుతాము. క్షణక్షణం మారుతున్న ఈ ఎండమావులను కాక అక్షరమైన దైవమును, సర్వత్రా భాసించే ఏకైక దైవమును గురించి తలచుట, దర్శించుట – ఆహా! ఎంతటి మహాభాగ్యమో చెప్పలేను.

*

భగవంతుని కృపా కటాక్షాలకు అవధులు లేవు. ఈ మిథ్యా రూపాలలో, ఈ ఘోరమైన ప్రపంచంలోని ప్రత్యణువులోను కూడా తన సత్యమును నిక్షిప్తము చేసినాడు.

*

సృష్టిలోని ప్రతి వస్తువు దైవమును గురించి ఘోషిస్తూనే ఉంటుంది. నీ హృదయాంతరాలలో విన్నట్లయితే ఆ ఘోష నీకు వినపడుతుంది కూడ!

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

దేవునితో మానవుని సంబంధము

భగవంతుని కటాక్షము అత్యద్భుతము.

ఆయన సరసుడు, హాస్యచక్రవర్తి! ఆయన విన్యాసముల లోను, నీ జీవిత సన్నివేశాలలో కూడ ఏవో తమాషాలు చేసి నీతో ఆడుకుంంటాడు.

*

భగవంతుడు నిన్ను ఏ క్షణమైనా దర్శించవచ్చును కాబట్టి ఆయనను ఆహ్వానించేందుకు నువ్వెప్పుడూ తయారుగా ఉండాలి. అయితే నువ్వనుకున్న సమయానికి ఆయన రాక పోవచ్చు. అది ఆయన ఇష్టం. అందుకని నువ్వు మట్టుకు నిర్లక్ష్యంగా ఉండరాదు.

దేవునికి కూడ అందరికి మల్లె తన మనస్సును మార్చుకుండే హక్కు ఉన్నది.

*

మన న్యాయశాస్త్రం ప్రకారము నేరము చేసిన వారిని శిక్షించాలి. కాని భగవంతునిది ఇంత కంటె గొప్ప న్యాయము. కృపాకటాక్షములే ఆతని న్యాయరీతులు. ఇట్టి న్యాయము ఉన్నది కాబట్టే ప్రపంచము ఈ బాధల కోర్చుకోని సత్యము వైపు, ప్రేమ వైపు పయనించ గలుగుతోంది.

*

ప్రశ్న: దేవుడు నేరస్థులను శిక్షిస్తాడా? ఆయన అసలు ఎవరినైనా శిక్షించ సాధ్యమేనా?

దేవుని దృష్టిలో న్యాయాన్యాయాలుండవు. మనమనుకున్నట్టుగా ఆయన మెచ్చుకోటం గాని శిక్షించటం గాని చేయక్కర్లేదు.

నువ్వు చేసే ప్రతి పనికి సత్పరిణామాలుగాని దుష్పరిణామాలుగాని ఉంటాయి.

పని చేసే తీరుతెన్నులను బట్టి నువ్వు భగవంతునికి దగ్గిరగాని దూరం గాని అవుతావు. అదే దాని ఫలితము.

*

మానవమాత్రులు దేవుణ్ణి వదులుకోగలరేమో గాని దేవుడు మట్టుకు మనుషులను త్యజించడు. అది అసంభవము.

*

దేవుడు నీ కోసం క్రిందికి దిగివచ్చి నిన్ను సమీపించవచ్చు. కాని నువ్వు కొంచెం పైకి వెడితేనే గాని ఆయన రాకను గుర్తించలేవు.

*

దేవుణ్ణి అర్థం చేసుకోవాలంటే నువ్వు దైవమే కావాలి.

దైవమొక్కడే కేవలము – మిగిలినదంతా సాపేక్షితమే. కాని అందరిలోను దైవమున్నాడు గనక అందరూ ఆ కేవల పదార్థాన్ని (absolute) తమలో ధరించే ఉంటారు.

*

నీ నిజరూపము నీ అగాధాలలో ఉంటుంది. దానిని నీవు ప్రాప్తించుకోవాలి.

*

"నాకు దేవుణ్ణి గురించి అంతా తెలుసు" అని ఎవరు చెప్ప గలరు? కాని ఆయన అందరిలోను ఉన్నాడు. *ఆత్మ యొక్క నిశ్చల స్థితిలో ఆయన మాటల ప్రతిధ్వని వినబడుతుంది గూడా.*

*

నీ అహంకారమును వదిలించుకొని ఎంత పరిశుద్ధ మౌతావో దేవునితో నీ మైత్రి అంత స్పష్టంగాను గాఢంగాను ఉంటుంది.

*

నీ చేతనా స్థాయి పెరిగినప్పుడు, ప్రేమా సామరస్యములు పెరిగి నప్పుడు దేవుడు గూడ నీకు చాలా దగ్గరవుతాడు.

*

దేవుణ్ణి తెలుసుకోవాలంటే హడావుడి, తొందరపాటు పనికిరావు. ప్రేమ సామరస్యముల ద్వారానే నీవు ఆయనను చేరగలవు.

*

దైవానికి సమర్పించుకొనుట, దైవము నుండి స్వీకరించుట, దైవమే యగుట, దైవమును ప్రసరింప జేసి, వ్యాపింప జేయుట ద్వారా దైవ మానవుల మధ్య 'దాంపత్యం' కొనసాగుతుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

నా మాటలను నువ్వు సరిగ్గా అర్థం చేసుకొనేం దుకు ప్రయత్నించాలి. అవి మహిమాన్వితములు. వెనక నువ్వు అర్థం చేసుకోవాల్సింది చాలా ఉంటుంది.

శ్రీమాత

దేవుడు నీతోటే ఉంటాడు

నువ్వు ఒంటరిగా లేవన్న సంగతి ఎప్పటికి మరచిపోకూడదు. ఆయన నిన్నంటి పెట్టుకొనే ఉండి నీకు సాయపడుతూ, దారి చూపిస్తూ ఉంటాడు. నిన్ను ప్రేమతో చూసుకొని, నీకు శక్తి నిచ్చి, నిన్ను సంతోషపెడుతూ ఉంటాడు. నీకు ఒంటరితనము ఎంత ఎక్కువైతే నీ మనస్సు అంత నిర్లిప్తమై, నీ దగ్గరే ఉన్న ఆయనను అంత స్పష్టంగా గుర్తించ గలుగుతావు. *చివరగా ఓ మంత్రం – నీవు ఆయనను నమ్ముకొని హాయిగా నిశ్శంకగా ఉండు. ఆయనే నీకన్నీ చేసి పెడతాడు.*

*

నీ కేది కావలన్నా దేవుడే ఇస్తాడు. నీ అవసరాలన్నీ ఆయనే తీరుస్తాడు.

*

నువ్వు కేవలం నీ ఇంద్రియాల మీద ఆధారపడక్కర్లేదు. ఎందు కంటే దేవుడే నీకు వెలుగు చూపిస్తాడు. ఆ వెలుగులో నీవు యథార్థాన్ని చూడగలవు. జ్ఞానాన్ని, సిద్ధిని పొందగలవు.

*

దైవం వినా అంతా మిథ్య, అనృతము, దుఃఖమయము. నిజమైన అసలైన జీవితము, వెలుగు, ఆనందములు దైవసన్నిధిలోనే సంభ విస్తాయి. దైవముతోనే పరమశాంతి కలుగుతుంది.

*

నీకు బలం ఎక్కడి నుండి వస్తుంది? దైవమే నీకు కావలసినంత బలమును సమకూర్చగలడు. ఆయన సాయంతో నువ్వు జయించ లేనిది ఏదీ ఉండదు. రాత్రి అంతా నిశ్శబ్దంగా ఉన్నప్పుడు నువ్వు దేవుని మృదుమధురమైన కంఠమును వినగలుగుతావు.

*

దైవవాక్కు నిన్ను దీవించి సుఖపెడుతుంది. నిన్ను సమాధాన పరచి, నీలో ఒక దీపమును వెలిగించి, నీ కళ్ళ ముందర తెరను తొలగించి అనంత జ్ఞానమును ప్రసాదిస్తుంది.

దేవుడు ఎక్కడో దాక్కుని లేడు. మనలో సజీవంగా కార్య శీలియై ఉన్నాడు. అటువంటప్పుడు ఏమవుతుందో బాబోయ్ అనే బెడదఎందుకు? నీలో ఉన్న దైవమే నీ చెయ్యి పట్టుకొని నిన్ను నడిపిస్తున్నప్పుడు నీవు భయపడ కూడదు. రాబోవు సన్నివేశములను ప్రశాంతంగా ఎదురు చూడు.

*

దైవము నీ దగ్గిరే ఉన్నప్పుడు ఓటమి అంటూ ఉండదు. ఆయన ఓటమిని గెలుపుగా మారుస్తాడు. ఆ దివ్యజ్యోతి ముందర చీకటి పటాపంచలై పోతుంది. ఆయన ఎదుట అంధకారానికి తావు లేదు.

*

మనిషి చేసే ప్రతి చర్యలోను కంగారు, తొందరపాటు కన పడుతూ ఉంటాయి. కాని దేవుడు నీతో ఉన్నప్పుడు నీకు శక్తితో పాటు శాంతి కూడ లభిస్తుంది. అప్పుడు నువ్వు ఎంత కష్టమైన పని చేసినా కూడ నెమ్మదితనాన్ని పోగొట్టుకోవు. స్థైర్యముంటుంది. అన్ని పరిస్థితులలోను సుఖసంతోషములే రాణిస్తాయి.

*

అందరి కంటే నమ్మకమైన స్నేహితుడు ఎవరు? దేవుడే. ఎప్ప టికి నీకు తోడుగా ఉండి, శక్తినిచ్చి, ఆధారమై, మార్గాన్ని చూపి స్తాడు. ఆయనవెలుగు చీకటిని పటాపంచలు చేస్తుంది. గెలుపు తథ్యం.

*

నువ్వు పిలిచినప్పుడు దైవము ఒక్కడే తప్పకుండా పలుకుతాడు. *నిన్ను ఎప్పటికి ప్రేమిస్తాడు. అందుకని నువ్వు ఒక్క దైవాన్నే ప్రేమించు.* ఆయన నిరంతరం నీ తోటే ఉంటాడని వేరే చెప్ప నక్కర్లేదు!

*

ఒకే వ్యాపకము, ఒకే లక్ష్యము, ఒకే సంతోషము అదేమిటి? దైవమే.

దృష్టినంతా నీ మీదనే కేంద్రీకరిస్తే అయోమయాంధకారములే నీ గతి. దైవం మీద కేంద్రీకరించినప్పుడు పవిత్రమైన జీవితము, అభివృద్ధి, సిద్ధి నీ భాగ్యములు.

*

జీవితానికి ఒకే ఒక మంత్రం. నువ్వు దైవానికి మాత్రమే చెందిన వాడివి. ఆయన కోసమే పని చేస్తావు. అన్నిటికంటే ముఖ్యంగా ఆయన వద్దనుంచే నీకు కావలసిన శక్తిని, శాంతిని, తృప్తిని ఆశిస్తావు. ఆయన కటాక్షము అనంతము. *నీకు అవసరమైన సామగ్రినంతా చేకూర్చి నిన్ను సాధ్యమైనంత త్వరలో గమ్యానికి చేర్చగలడు.*

నీ ఆలోచనలన్నీ – ఒక్క ఆలోచనలే కాదు – ఫీలింగ్స్, పనులు, ఆశయాలు అన్నీ కూడ దైవోన్ముఖంగా, ఆయన మీదనే కేంద్రీకరించి జరగాలి. మనకు దక్షత, రక్షణ ఆయనే.

*

ఒక నది సముద్రం వైపు ఎట్లా పారుతుందో అదే విధంగా మన తలపులు, ఆవేశములు – ఒకటేమిటి – మొత్తం వ్యవహారమంతా దేవుని వైపే ప్రవహించాలి.

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

మార్గము

జీవితంలో ఎప్పుడూ మంచిచెడులు రెండూ ఎదురవుతూనే ఉంటాయి. ఈ రెండింటి మధ్య, మంచి నెంచుకోవటంలోనే ఉంది. మానవుని తెలివి. సత్యాసత్యముల మధ్య, జ్యోత్స్నాంధకారముల మధ్య, పురోగమన తిరోగమనముల మధ్య, ఆరోహణావరోహణముల మధ్య జరిపే నిరంతర పోరాటమే జీవితం. ప్రతి ఒక్కరు వారికేం కావాలో స్వేచ్ఛగా తమ ఇష్టానుసారం ఎంపిక చేసుకోవచ్చు.

ప్రతి మనిషి జీవితంలోను తనకు మేలైన ఉచ్చస్థితి కావాలో అధఃపాతాళంలో కూరుకుపోవాలో నిర్ణయించుకుండే క్షణం ఒకటి వచ్చి తీరుతుంది. ఇక్కడో కాలు, అక్కడో కాలు పెడితే కుదరదు. ఒక వేళ అట్లా చేసావో నీ జీవితం చితికిపోతుంది.

*

నీకు ఆధ్యాత్మిక మార్గం తప్ప వేరే గత్యంతరం లేదనిపించి నప్పుడే ఈ జీవితాన్ని ఎంచుకుంటావు.

*

ముందర నీ మనస్సుతో అర్థం చేసుకుంటావు. తరువాత కొంచెం కొంచెం ఆచరణలో పెట్టటం ప్రారంభిస్తావు. అప్రమత్తుడవై నీకు తెలిసిన సిద్ధాంతాలను నిత్య జీవితంలో పాటించటమే ముఖ్యం. అపుడిక ఏ విధమైన విఘ్నము రాదు. సాధన నిరాటంకముగా సాగిపోతూనే ఉంటుంది. ముందుకు సాగిపోవటమే గాని వెనక్కు మళ్ళే ప్రశ్నే లేదు.

*

ప్రతి మానవునికి ఆధ్యాత్మికమైన ఘటన ఉంటుంది. అయితే అది కొద్ది కాలంలో ఫలిస్తుందా లేక దీర్ఘకాలం పడుతుందా అనే విషయము అతని నిశ్చయాన్ని బట్టి ఉంటుంది.

నీ నిశ్చయాన్ని సర్వవిధాలా పాటించాల్సిందే.

*

సాధకుడు = యోగనియమాలను అనుసరించేవాడు.
సాధన = యోగాభ్యాసము.
యోగము = దైవంతో సాయుజ్యము – అనగా ఈ సమాగమానికి మార్గము

*

ప్రపంచమంతా కూడా క్రమక్రమంగా పరిణామము, రూపాంతరీకరణము (transformation) జెందుతోంది. *యోగము నభ్యసించి నప్పుడు ఈ ప్రక్రియ నీలో వేగాన్ని పుంజుకుంటుంది.*

*

యోగమంటే సన్యాసం కాదు. జీవితంతో విరోధమూ కాదు. జీవితంతో దానికి పొందిక ఉన్నది.

*

మనిషికి క్రమశిక్షణ అనివార్యము. అది లేని మనిషి పశువుతో సమానం. మనిషి నిజమైన ఉన్నత జీవితాన్ని కాంక్షించి దానికి అవసరమైన క్రమశిక్షణను పాటించినప్పుడే నిజమైన మనిషి అవుతాడు. అటుల కావలనన్నచో తన క్షుద్రప్రకృతిని, కోరికలను జయించాలి.

*

కొండగుహల్లోకి వెళ్ళి సాధన చేయటం అంత తేలిక అని నేను అనుకోను. అక్కడ మనిషిలోని కపటత్వం దాగి ఉంటుంది అంతే. బయటకొచ్చేసరికి బండారం బయట పడుతుంది. బహుశ కొండగుహల్లో నిన్ను నీవు యోగివే అని భ్రమపడవచ్చు. కాని నిజజీవితంలో నువ్వు ఆ విధంగా ఎవరిని మోసపుచ్చ లేవు – అది నీ సిద్ధికి గీటురాయి.

*

పూర్ణయోగానికి సమతౌల్యము, నైశ్చల్యము, శాంతము చాలా ముఖ్యమైన విషయాలు. అందుకని అప్రమత్తంగా ఉండాలి. – బాధా దుఃఖములను కొనితెచ్చుకో రాదు.

*

నువ్వు కావాలని సన్యాసిలాగ ప్రవర్తించటం మంచిది కాదు. నిర్లిప్తత, నిరాడంబరత్వము నీ ఆంతరంగిక పరిస్థితులైనప్పుడే అవి మంచి గుణాలు.

*

ప్రశ్న: నేను కొంతసేపు ఏకాంతంగా ఉండాలా?
మౌనము, ఏకాంతము పాతయోగాలకు చెందిన విషయాలు.

నిత్యకృత్యములో, నిత్యజీవితంలో, కర్మలను ఆచరిస్తూ ప్రపంచంలో దైవకార్యాన్ని నెరవేర్చుటయే యోగము.

నీ అంతరంగంలోకి చూసుకొని ఏది కావాలో నాకు చెప్పు.

ఏ పనీ చెయ్యకుండా, ఎవరితోను సంబంధం లేకుండా ఉండటం అంత మంచిది కాదు. అంతగా కావాలంటే కొంతకాలం అలా ఉండవచ్చు. కాని అంతరంగికంగా నిర్లిప్తమై, పూర్తిగా దైవం వైపు తిరిగి అన్నిటికి దైవం మీదనే ఆధారపడి ఉండటమే ముఖ్యము.

మూలం: శ్రీమాత

అనువాదం: డా॥ ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

కర్మయోగం

యోగసాధనకు ఒక పని యొక్క విలువ ఆ పని యొక్క గొప్ప తనం మీద ఆధారపడి ఉండదు. కర్మి యొక్క చేతనాస్థాయిని బట్టి ఉంటుంది.

నువ్వు చేసే పని కంటే ఆ పనిని ఎటువంటి చేతన (బుద్ధి) తో చేస్తున్నావో అనేదే ముఖ్యం. ఎంత చిన్న పనైనా సరే నిజచైతన్యంతో కనక చేసినట్లయితే అది చాల లాభదాయకము.

*

యోగదృష్టిలో నువ్వు ఎంత పని చేసావో అనే దాని కంటే ఎట్లా చేసావో అనేదే చాల ముఖ్యం.

*

నువ్వు చేసే పని కంటె ఆ పనిని ఏ ఉద్దేశ్యంతో (చైతన్యంతో) చేసావో అన్నదే ముఖ్యం.

*

ఆధ్యాత్మిక జీవితానికి నువ్వు చేసే పనులకంటే ఆ పనులు చేసే విధానము, ఆ పనులలో నీవు నిక్షేపించే చైతన్యమే ఎక్కువ ముఖ్యం. నువ్వు దేవుణ్ణి జ్ఞాపకం పెట్టుకొని ఏం చేసినా కూడా అదంతా దైవము యొక్క అభివ్యక్తిగానే పరిణమిస్తుంది.

నువ్వు చేసే పనులన్నీ దైవానికి ఆహుతమైనప్పుడు ఇక కొన్ని పనులు ఎక్కువ, కొన్ని పనులు తక్కువ అనే ప్రశ్నే లేదు. ఉండవు. సేవాతత్పరతతో చేయు ప్రతి కార్యము దైవకార్యమే.

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

దివ్యవ్యాసాలు:

శ్రీమాత ఎవరు?

మనం ఎవరిని శ్రీమాత అని అర్చిస్తున్నామో ఆమె సర్వ సృష్టినీ ఆవరించే దివ్యచైతన్యము. ఏకమే అయినా బహుముఖము. అతి విస్తృతమైన స్వతంత్రమైన మేధాశక్తికిగానీ, వేగవంతమైన మనస్సునకు గానీ ఆమెను అనుగమించటం అసాధ్యం. తాను సృష్టిలో సర్వమునకు అతీతంగా నెలకొన్న భగవంతుని చైతన్యము, తాను ఒప్పుకొని – అభివ్యక్తం కావటానికి అంగీకరించిన – అందుకో గలిగిన నిర్వచనీయమైన పరిమిత స్ఫూర్తి, క్రియారీతి గలిగిన దేవాతారూపాల ద్వారా ఆమె స్వరూపాలను కొంచెమైనా గ్రహించటానికీ, అనుభవించటానికీ వీలు అవుతుంది.

ఈ విశ్వాన్నీ మనలనూ ధరించే చైతన్యశక్తితో ఏకీభావాన్ని స్పర్శ లోనికి తెచ్చుకునే మార్గంలోకి నీవు ప్రవేశించినప్పుడు శ్రీమాత మూడు విధాల ఉనికిని నీవు గ్రహించగలవు. ఆద్యపరాశక్తి విశ్వాతీతమైన సృష్టికీ అవ్యక్త పరతత్త్వానికీ అనుసంధానం కలిగిస్తుంది. వైశ్వక సృష్టి సంబంధమైన ఆ మహాశక్తి సమస్త ప్రాణులనూ సృష్టించి, నిలబెట్టి, తాను ప్రవేశించి, సహకరించి – ఇలా లక్షలాది రీతులలో ప్రవర్తిస్తుంది. వైయక్తిక రూపంలో ఈ రెండు అఖండ శక్తులను ధరించి వాటిని మనకు సన్నిహితము చేస్తుంది. మానవ వ్యక్తిత్వానికి దివ్యశక్తికీ నడుమ మధ్యవర్తిగా అలరారుతుంది.

పరమమైన విశ్వాతీత శక్తి యైన శ్రీమాత ప్రపంచానికి వెలుపలగా ఉంటూ తన మూల చైతన్యంలో పరాత్పరుని నిలిపి ఉంచుతుంది. తానొక్కతయే పరమశక్తికి స్థానమై, అనిర్వచనీయ మైన ఉనికి గలిగి, వ్యక్తం కావలసిన సత్యశక్తులను ఆహ్వానిస్తూ నిలువరించుతూ, తన అనంత చైతన్య రోచిస్సులో గుప్తపరచ బడి ఉన్న వాటిని అవతరింప జేస్తుంది. తన సర్వశక్తిమయ సీమాతీత స్థితినుండి ఈ విశ్వంలో ఒకానొక శక్తి రూపాన్ని, శరీరాన్నీ కల్పించి ఇస్తుంది. పరాత్పరుడు ఎల్లప్పుడు ఆమెలో అనంత సచ్చిదానంద రూపంగా వ్యక్తం అవుతాడు. ఆతడు ఆమె వలన ద్వంద్వ చైతన్య రూపంలో శివశక్తులుగా, ద్వంద్వ తత్త్వంలో పురుష ప్రకృతులుగా – అనేక స్తరాలలో ఆమె హేతువుగా దేవతలుగా వారి శక్తులుగా, మన మెరిగిన లోకాల లోనూ, ఎరుగని వాటిలోనూ అభివ్యక్తం అవుతాడు. ఇదంతా పరాత్పరునితో ఆమె లీల. ఇదంతా ఆమెలోని శాశ్వత రహస్యాల, అనంతాద్భుతాల ఆవిష్కారమే. అంతా ఆమె దివ్య చైతన్య శక్తి లోని అంశమే అగుట చేత అంతా ఆమెయే. ఆమె పరమమైన నిశ్చయం లేకుండా, ఆజ్ఞ లేకుండా ఇక్కడైనా మరోచోటనైనా ఏదీ ఉండే వీలు లేదు. ఆమె సృజనాత్మక ఆనందంలోని పరమ సంకల్పం బీజ రూపకరణం లేకుండా ఏదీ రూపొందే అవకాశం లేదు.

విశ్వజనని, మహాశక్తి పరాత్పరుని నుండి తన అతీత చైతన్యం ద్వారా పొందిన ఆదేశాలను పరిపాలిస్తుంది. తాను సృష్టించిన జగత్తుల లోనికి ప్రవేశిస్తుంది. ఆమె ఉనికి దివ్యశక్తి చేత, సర్వ రక్షక తత్త్వం చేత సంతోషంలో నిలిపి బలపరు స్తుంది. అది లేకుంటే జగత్తులు నిలువ లేవు. అదియే ప్రకృతి. ఆమె యొక్క అత్యంత బాహిరమైన క్రియాత్మక అభివ్యక్తి. తన శక్తులను విధానాలను ఒక క్రమంలో నెలకొల్పుతుంది. దానిలో తాను ప్రవేశించి జీవనగతిలో స్ఫుటమయ్యే, అనుభవంలోనికి వచ్చే కదలికలను కార్యయోజనాలను ఆదేశిస్తుంది. విశ్వాతీత మాత్రంశంగా, సృష్టి చేతనగా ఆ మహాశక్తి యొక్క లీలగా ప్రతి

లోకంలోనూ, ఆయా లోకాల వ్యవహారాల ప్రతినిధిగా ఆమె దర్శనమిస్తుంది. ప్రతి అంశమూ ఆమె సంకల్పంలో దర్శించిన, తన ఆనందంలో సృష్టించుకున్న, హృదయంలో సమకూర్చు కున్న శక్తి సౌందర్యాల సమాహారమే.

కాని ఆమె సృష్టిలో ఎన్నో స్తరాలు ఉన్నవి. దివ్యశక్తి సోపానాలు ఉన్నవి. మనం వీటిలో భాగమే. ఈ సృష్టి యొక్క శిఖరం మీద అనంత సత్తా చేతనానందాల శక్తుల పైన ఆమె సాక్షాత్తుగా సీమాతీత శక్తిగా నెలకొని ఉంటుంది. అక్కడ అందరు జీవులు అనిర్వచనీయ పూర్ణతతో, అవికారమైన ఏక తతో ప్రవర్తిస్తూ ఉంటారు – ఆమె తన బాహువులలో వారిని క్షేమంగా ధరిస్తుంది కనుక. మనకు సన్నిహితంగా నిర్దుష్టములైన అతిమానసలోకాలు ఉన్నవి. అక్కడ ఆమె అతిమానస మహా శక్తి. ఆమె సర్వతోముఖ సంకల్ప విజ్ఞానాల మూర్తి. అక్కడ ఆమె కార్యాలు సహజ పరిపూర్ణతతో భాసిస్తాయి. అక్కడ అన్ని కదలికలూ సత్యమునకైన సోపానాలే. అక్కడ అందరు జీవులూ దివ్యరోచిస్సు యొక్క చేతనలూ, రూపాలూ, శక్తులు. పరమమైన గాఢమైన ఆనందము యొక్క అనుభవ సముద్రాలూ, ఉప్పెనలూ, తరంగాలు. కాని మనం నివసించే ఈ లోకాలు అజ్ఞానమయం. మూలం నుండి విడిపోయిన మనఃప్రాణ, భౌతిక చేతనల చేత నిర్మింపబడ్డాయి. వీటికి, వీటి పరిణామానికి ఈ భూమి ప్రధాన మైన విశిష్టకేంద్రం. దీన్ని కూడా అయోమయం, సంఘర్షణ, అపరిపక్వత కలిగిన దీనిని విశ్వజనని ధరిస్తున్నది. ఇది కూడా మహాశక్తి చేత రహస్య లక్ష్యం వైపుగా నిర్దేశింపబడి సాగి పోతున్నది.

శ్రీమాత మహాశక్తిగా ఈ త్రిపుటమైన అజ్ఞాన జగత్తు నకు అతిమానసలోక కాంతి, సత్యజీవనము, సత్యసృష్టికీ నడుమ నిలచి ఉంటుంది. నడిమి స్తరాల మీదుగా, దాన్ని క్రిందకు దింపవలసి ఉంది. జంట నిచ్చెనలాగా పదార్థపు అచేతన లోనికి అనంత శక్తి వైపుగా ప్రాణమై, చైతన్యమై, మనస్సై వికసించేందు కోసం మరల పైకి అధిరోహించటానికి అనువుగా ఉంటుంది.

విశ్వంలో సంభవించ వలసిన ప్రతి అంశమును, భౌమ జగత్ప రిణామాన్ని నిశ్చయించి, దాని కోసం తాను చూచి, భావించి తన నుండి పొంగెత్తిస్తుంది. దేవతలందరికీ పైన నెలకొని ఉంటుంది. తన శక్తులు, వైయక్తిక అభివ్యక్తులు తన ముందర కార్యనిమిత్తం నిర్ణయించి తనలోని వారి అభివ్యక్తులను జోక్యం కల్పించుకోవటానికీ, పాలించటానికీ, పోరుసల్పటానికీ, జయిం చటానికీ నడిపించటానికీ వైయక్తిక సమిష్టి రేఖలను నిర్దేశించ టానికీ క్రింది జగత్తులకు పంపుతుంది. ఈ ఆంశిక అభివ్యక్తులు అనేక దేవతారూపాలు, వ్యక్తిత్వాలు. వాటిని యుగయుగాలుగా జనులు అనేక నామరూపాలతో అర్చించారు. ఈ అంశల ద్వారా ఆమె తన విభూతుల శరీరాలను మనస్సులను నిర్మించుతుంది. ఈశ్వరుని విభూతుల మనస్సులను, రూపాలను కూడా తాను రూపు కట్టిస్తూనే ఉంటుంది. తన శక్తి, గుణము, ఉనికి వీటి ఒకానొక కిరణము మానుష చైతన్య రూపాంతరంగా ఈ భౌతిక జగత్తులో తాను అభివ్యక్తమయ్యే వీలు కల్గి ఉంటుంది. పృథ్వి మీది సన్నివేశాలన్నీ ఒక రూపకం వలె యోజితములై ప్రదర్శి తము లవుతున్నాయి. విశ్వ దేవతాగణమంతా తనకు సహాయం కాగా, తానొక వేషధారియై నటిస్తుంది.

పై నుండి సర్వమున్ను జగన్మాత పరిపాలించడమే కాదు; ఆమె ఈ క్రింది మూడు అధోలోకములకు గూడ అవతరించును. ఇక్కడి సర్వవస్తువులున్నూ అవిద్యాప్రవృత్తులు సైతము నిరాకారమైన అవ్యక్తాధికారమందున్న ఆమెయే; సూక్ష్మాకృతిలో ఆమె సృష్టియే; ఆమె ప్రకృతి దేహమే; ఆమె ప్రకృతి శక్తియే. అవి అట్లు ఎందుకున్నవంటే – గూఢమైన ఈశ్వరాజ్ఞచేత ప్రేరేపింపబడి, అనంత కాలములో నిర్వహింప వలసిన ఒక కార్యసిద్ధి కొరకు ఆమె ఈ గొప్ప యజ్ఞమునకు సమ్మతించి, అజ్ఞానము యొక్క జీవ, రూపములను వ్యాజముగా ధరించుటచేతనే.

ఇదిగాక స్వయముగా కూడ జగన్మాత తమస్సులోనికి అవతరించినది – దానిని జ్యోతిలోనికి తీసుకొని పోవుటకు;

అసత్య భ్రాంతుల లోనికి అవతరించినది – దానిని సత్యమైన ర్చుటకు; మృత్యువులోనికి అవతరించినది – దానిని అమరజీవన ముగా మార్చుటకు; నిరంతరచింతాక్రాంతమగు సంసారక్లేశము లోనికి అవతరించినది – తుదకు దానిని స్వీయపరమానంద పారవశ్యములోనికి మార్చివేయుటకే. తన బిడ్డలపై మహత్తర మైన, గాఢమైన ప్రేమ జగన్మాతకున్నది కాబట్టే ఇట్టి అజ్ఞాన వేషమును ధరించుటకు ఆమె సమ్మతించినది. అసత్యాజ్ఞాన శక్తుల దూషణవ్యధలను వహించుటకు ఒడంబడినది. మృత్యు వగు జన్మద్వారముల నుండి పోవుటకు సహించినది. ప్రపం చమునందలి దుఃఖములు, ఆవేదనములు, బాధలు తనపై వేసు కొని అనుభవిస్తున్నది. ఇట్లు చేయుటకు కారణము దానిని జ్యోతి, ఆనందము, సత్యము, అమరత్వమునకు ఉద్ధరించవచ్చు ననియే. పురుషయజ్ఞమని చెప్పబడే మహాయజ్ఞము ఇదే. దీర్ఘ ముగా ఆలోచించిన ఇదియే ప్రకృతి యొక్క సంపూర్ణహోమము, జగన్మాత మహాత్యాగము.

విశ్వమును నడిపించేటప్పుడూ, జగల్లీలను నిర్వహించే టప్పుడూ జగన్మాత శక్తులలోను మూర్తులలోను ప్రధానమైన నాల్గు అంశలు విశదమగుచున్నవి.

అందొకటి ప్రశాంత వ్యాపకత్వముతోను, అఖండ జ్ఞానముతోను, శాంతదయాళుత్వముతోను, అపరిమిత కారు ణ్యముతోను, అప్రతిమాన మాహాత్మ్యముతోను, సార్వభౌమ త్వముతోను కూడిన మూర్తి.

ఇంకొకటి మనసత్త్వము, అప్రతిహతోద్రేకము, వీర భావము, అకీర్ణేచ్ఛ, ప్రచండవేగము, లోకముల నుగ్రూతలూగించ గల శక్తి – ఇవిగల శక్తిరూపము.

మూడవది విశదమగు, మధురమగు, అమృతమూర్తి; సౌందర్యము, సామరస్యము. ఇంపైన సమగతి, వీటియొక్క గాఢ రహస్యముతోను, నానావిధాపూర్వ సూక్ష్మసంపదలలోను, అని వార్యాకర్షణముతోను మోహనశృంగారముతోను ఆ మూర్తి తేజ రిల్లుచున్నది.

జగన్మాత గాఢసంపూర్ణ శక్తితోను, శ్రద్ధవంతము దోష రహితము అగు కార్యముతోను, ప్రతి విషయమందును నిరాడంబరమగు సరియైన సంపూర్ణత్వముతోనూ నాల్గవ మూర్తి కూడియున్నది.

జ్ఞానము, సత్త్వము, సామరస్యము, సంపూర్ణత్వము – ఇవియే ఆ మూర్తుల వేరువేరు గుణములు. ఈ శక్తులనే అవి తమతోగూడా ప్రపంచములోనికి తీసుకొనివచ్చి మానవ వేషము ధరించి తన విభూతులలో ఈ శక్తులను వెల్లడిచేయుచున్నవి. జగన్మాత ప్రత్యక్ష ప్రభావమునకు తమ జడస్వభావమును వికసింప చేసుకొనగలవారిలో, వారి వారి ఆధ్యాత్మికాభివృద్ధి ననుసరించి ఈ శక్తుల నామె స్థాపించును. ఈ నాల్గు శక్తులను మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే దివ్యనామముల పేర్కొందుము.

పరిణామ ప్రక్రియ మనిషితో అంతం కాదు. మనస్సే దాని మకుటం కాదు. అతిమానస పరిణామము (The supramental change) ఈ భూలోక చైతన్యం లోని అనివార్యమైన అంశము. అది దైవశాసనము. దానికాదేశము పైనుంచి రావాలి. ఇక్కడ క్రియాశీలము కావాలి. స్థిరపడాలి. ఈ మార్పుకు నాంది క్రింది నుండి పైకెగసే పిలుపు. పైనుంచి క్రిందికి దిగివచ్చే దివ్యజ్యోతి. ఆ జ్యోతిని మనిషి గుర్తించ గలగాలి. ఆ మార్పుకు అంగీకరించాలి. మనిషి పిలుపుకు పరమాత్ముని అనుగ్రహామునకు శ్రీమాతయే మధ్యవర్తి. అందుకు సమర్థవంతురాలు. మూతను తొలగించి, ఆచ్ఛాదమును ఛేదించి పాత్రను తయారు చేయుట మానవమాత్రున కతీతమైన విషయము. ఒక్క శ్రీమాత శక్తియే ఆ బృహత్కార్యమును సాధించగలదు. అజ్ఞానము, అసత్యము, దుఃఖము, మృత్యువులతో నిండిన ఈ లోకము లోనికి జ్ఞానమును, సత్యమును, దివ్యజీవనమును, అమరానందమును తీసుకొని రాగలదు.

మూలం: శ్రీమాత

అనువాదం: ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య; స్వామి శుద్ధానంద భారతి; చింతాదీక్షితులు 'జగన్మాత' నుండి

రూపాంతరీకరణము

నీవు ఈ అద్భుతమైన మార్పును, పరివర్తనాన్ని – ఈ రూపాంతరీకరణాన్ని పొందే ఏకైక మార్గము – శ్రీమాత నీలో తన ప్రక్రియల్ని నిర్నిరోధంగా సాగించేందుకు వీలుగా, నిన్ను నీవు ఏమాత్రం జంకూ బొంకూ లేకుండా శ్రీమాత చేతుల్లోకి, ఆమె శక్తులకు సమర్పించుకోవాలి. *ఆమె నిన్ను తన ఇచ్ఛ వచ్చినట్లు మలచుటకు వీలుగా నీ ప్రకృతినంతా నవనీతమువలె మృదువుగా జేసుకోవాలి. శుద్ధచైతన్యము, అంతులేని సమర్పణ భావము నీలో భాసించాలి.* ఎందుకంటె నీలో ఆమె చేయు ప్రక్రియలకు నీ అనుమతి సహకారములు కావాలి. నీ మనస్సులోనే కాకుండా, నీ హృదయము, ఆత్మ, జీవితంలోనే కాకుండా, నీ శరీర కణాలలో కూడా శ్రీమాత చేయు కార్యములకు అంగీకారం ఉండాలి. నీకు తెలియకుండా తెర వెనుకనుంచి కూడ ఆమె పనిచేయగలదు. అయితే నీవు జాగృతమై నీ సమస్తమైన చేష్టలలోను, జీవనంలోను కూడ ఆమెతో సజీవమైన సంపర్కము కలిగి వుండటం వేరు.

దీనికి మార్గము? నీ మనస్సు యొక్క సామర్థ్యము పరిమితము. అది గ్రుడ్డిది, మొండిది. తన లక్ష్మణరేఖను దాటిపోలేదు. దీనికి తగిన చికిత్స శ్రీమాతయే చేయగలదు. కాబట్టి నువ్వు శ్రీమాత చెప్పిన మాట వినాలి. నీ వ్యక్తిత్వమంతా ఆమె చేతిలో వెన్నపూస వలె మెత్తగా అయిపోవాలి. రొట్టిపిండిలాగ ఆమెచేత పిసకబడి నూతనరూప మివ్వబడాలి. ఆమె నిన్ను ఉద్దీపింపజేసి నీ మనస్సులో జ్ఞానదీపం వెలిగింప జేస్తుంది. ఆమె చేయు ప్రక్రియలను నీవు ప్రశ్నించకూడదు. ఆమెకు ఎదురు తిరగ కూడదు. ఇది నీ ప్రాణికమునకు బాధాకరముగా తోచవచ్చును. దానికి రుచించక పోవచ్చును. అందుకని దైవశక్తికి ఎదురు తిరగ వచ్చును కూడ. కాని నీవు అట్టి ప్రయత్నమును ప్రతిఘటించాలి. నీ భౌతిక చైతన్యముకూడ అతి స్తబ్ధము, అసమర్థము, అజ్ఞానాంధకారములలో పడి కొట్టుకుంటూ ఉంటుంది.



The Mother

అది చాలా మందబుద్ధి. మారటం మహాకష్టం. కాని మన యోగానికి అది కూడ మారాలి. ఈ పాషాణాన్ని మచ్చిక చేసి కరిగింప జేయాలి. మెత్తపరచి పరివర్తనాశీలము గావించాలి. *పూర్ణయోగంలో ఎట్టి మినహాయింపులు లేవు. మనిషిలోని భౌతికపదార్థము కూడా మారవలసిందే. దీనికి మంత్రమో? సమర్పణే. నీ బాహ్యాభ్యంతరములను నిస్సంకోచంగా, నిశ్శేషంగా శ్రీమాతకు సమర్పించుకొన్నప్పుడు నీలో ఎల్లెడల చైతన్యము మేలుకొంటుంది.* పైనుంచి వచ్చే జ్ఞానధార, జ్యోతిశ్శక్తుల పాతము, సౌందర్య సామరస్యముల ప్రవాహములు నీలోకి దిగి, అన్ని మూలలలోకి చొచ్చుకొనిపోయి వాటిని ప్రదీప్తము జేసినప్పుడు ఆ విభాగములన్నిటికి నూతన వేషధారణ, రూపాంతరీకరణము సంభవిస్తాయి. ఆఖరికి ఈ కట్టె – భౌతిక శరీరము కూడ జాగృతమై, చైతన్యోద్దీపనము పొంది, పైనుంచి దిగివచ్చే అతిమానస చైతన్యాన్ని గ్రహించి, తన అంగాంగములందు ఆ శక్తి చొచ్చుకొనిపోవుట వలన దివ్యప్రేమానందభూతులను పొందుతుంది.

చర్మ చక్షువులది మసక దృష్టి. మానవ మనస్సునకు పాక్షిక జ్ఞానమే తప్ప పూర్ణజ్ఞానము లేదు. కాని పరాశక్తి (Divine Shakti) అటుల గాదు. *ఆమె అన్ని పరిస్థితులను చక్కగా గమనించి ఎక్కడ ఏది చేయాలో అది చేస్తుంది. అయితే ఇది మనస్సుకు అర్థంకాని విషయము. ఆమె ఎప్పుడు ఏ దారి తొక్కుతుందో తెలియదు.* ఆ పరాశక్తిది బహుదేవతాముఖత్వము. ఏ దేవతచే ఎప్పుడు ఏ పని చేయిస్తుందో, ఎప్పుడు నిలిపి వేస్తుందో, ఎప్పుడు మెరుపు మెరిసినట్లుగా మిరుమిట్లు గొలుపుతూ పని చేస్తుందో, ఎప్పుడు నిశ్చలంగా ఉంటుందో, ఎప్పుడు ఏ సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తుందో నీ కర్థం కాదులే. *పైనుంచి ఒక వెలుగు క్రిందికి దిగివచ్చి ఒక్క తృటిలో అనేక కార్యములను ఎటుల నిర్వహించునో అనే విషయము మానవమేధకు అతీతము.* అందుకని నీ ఆత్మ ద్వారములను తెరచి పెట్టు.

ఆత్మదృష్టితో ఆమెను గమనించు. చైత్యస్ఫూర్తితో ఆమె పనులను గుర్తించు. చైత్యనేత్రము మాత్రమే వాటిని గుర్తించగలదు.

ఈ ప్రక్రియ నీలో జరుగుతున్నప్పుడు నీ మానవ మనస్సుతో దానిని విమర్శించ కూడదు. ఎందుకంటే మానవదృష్టి చాలా సంకుచితము. దివ్యమాత నీలో జరిపే దివ్యప్రక్రియలను అది అర్థం చేసుకోలేదు. మానవమేధ కతీతమైన విషయాలను కూడ తన తెలివితేటలతో వివేచించి తను అనుకున్న విధంగా జరగాలనుకుంటుంది. మెరుపులు మెరుస్తూ ఎదురుగా ప్రత్యక్షమై ఏవేవో అద్భుతాలు (మిరకిల్స్) చేస్తేనే అది దేవుడు అని నమ్ముతుంది. కాని శ్రీమాత ఇక్కడ ఈ అజ్ఞానమయ లోకంలో ఏ పని ఏవిధంగా చేయాలో ఆమెకు బాగా తెలుసు. ఆమె కేవలం ఆకాశంలోనే కాకుండా క్రిందికి దిగివచ్చి క్రియాశీలమైంది. ఆమె పని చేసే విధానం మానవమేధ కతీతము. అయితే ఒక్కొక్కప్పుడు తన పూర్ణదృష్టిని మనుమలకు కూడ ప్రసాదిస్తుంది. మానవమనస్సు ప్రార్థించిన ప్రకారము, ప్రాణిక ప్రయత్నము ననుసరించి, చైత్యపురుషుని ఆకాంక్ష, భౌతికప్రకృతి నిబంధనల కణుగుణంగా తన రూపాంతరీకరణ కార్యమును నిర్వహిస్తుంది. పరమ చైతన్యము విధించిన నిబంధనల ననుసరించి, చిక్కుముడులను విప్పుకుంటూ, సమస్యలను పరిష్కరించుకుంటూ పోతుంది.

సాధకుడు ఒక సంగతి గుర్తుంచుకోవాలి. ఈ సృష్టి అసురశక్తులచే పరిపాలింపబడుతున్నది. ఇది వాటి రాజ్యము. మానవుడు ఆ నిర్బంధములకే విధేయుమై వాటినే నమ్ముకుంటాడు. అతనిని దివ్యశక్తి మెల్లిమెల్లిగా ఒప్పించి గమ్యానికి జేర్చాలి. *"ఇంత మెల్లిగా ఎందుకు చేయాలి, తొందరగా ఎందుకు చేయకూడదు?"* అని *అనిపించవచ్చు. ధర్మమును అతిక్రమించుట వీలు గాదు. శీఘ్ర పరివర్తనమును మనిషి తట్టుకోలేడు.* దివ్యచైతన్యము ప్రతి నిముసము నిన్ను వెయ్యి కళ్ళతో చూస్తూ నీ చేత ఒక్కొక్క అడుగు ఆచితూచి వేయిస్తుంది.

అతిమానసము నీలోకి దిగివచ్చినప్పుడు, నీ ప్రకృతి అతిమానసీకరణమైనప్పుడు, నీలో ఆ శక్తి అతిమానసస్థాయిలో పని చేయగలదు. *నీకొక హెచ్చరిక. కేవలం నీ మనస్సు మీద ఆధారపడ్డావో శ్రీమాత నీ యెదట సాక్షాత్కరించినా కూడ నువ్వు కనుక్కోలేవు. నువ్వు నీ ఆత్మనేత్రంతో చూడాలి. అది మనస్సువలె మోసపోదు. సత్యమును వెంటనే గుర్తిస్తుంది. నువ్వు దివ్యశక్తిని నమ్ముకోవాలి.* నీలో కొన్ని దివ్యాంశములు నీకు తెలియకుండానే లోపల దాగి ఉంటాయి. నువ్వు చేతులు కట్టుకొని నిన్ను శ్రీమాతకు అప్పచెప్పుకున్నప్పుడు ఆమెయే నీలోని దివ్యగుణములను వెలికి తీస్తుంది. అప్పుడు నీకు సరియైన దైవస్ఫూర్తి కలిగి నీ మానవప్రకృతి దివ్యప్రకృతిగా పరివర్తనమౌతుంది. నీలో దివ్యలక్షణాలు ప్రవృద్ధమై నీవు దివ్య మానవునిగా పరిణమించెదవు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: రాయప్రోలు లక్ష్మీనరసింహా శాస్త్రి

24 నవంబరు, 1926 సిద్ధి దినమును గురించిన సమాచారము

74 సంవత్సరాల క్రిందట నవంబరు 24 నాడు శ్రీఅరవిందులు అధిమానస సిద్ధిని పొందేరు (Descent of the overmind). దేవుడు (శ్రీకృష్ణుడు – ఆయనకు నువ్వేపేరు పెట్టినా సరే) భౌతిక పదార్థంలోకి దిగివచ్చాడు. నవంబరు 24 నాడు సంభవించిన ఆ సిద్ధి వలన అతిమానసము (Supermind) దిగి వచ్చేందుకు తగిన పరిస్థితి ఏర్పడింది. దానిని సాధించేందు కోసం శ్రీఅరవిందులు ఏకాంతంలోకి వెళ్లిపోయి ఘోరతపస్సులో నిమగ్నమై పోయారు

24 నవంబరు, 1926 న అక్కడ ఉన్న శిష్యుల పేర్లు: (బహుశా ఒకటి రెండు పేర్లు ఇందులో లేకపోవచ్చు. హార్థన్ బక్షి అనే ఆయన ఊళ్లో లేడేమో).



Sri Aurobindo at Pondicherry

Standing (l. to r.): Nogen, Dumont, Moni (Suresh Chakravarty)
Sitting (l. to r.): Bejoy Nag, Sri Aurobindo, Nolini Kanta Gupta

1. బిజయ్ కుమార్ నాగ్ 2. నళినీకాంత గుప్త 3. కె. అమృత 4. మోని (సురేష్ చక్రవర్తి) 5. పవిత్ర (ఫిలిప్ బార్‌బియర్ సెయింట్ – హిల్లర్) 6. బరీంద్ర కుమార్ ఘోష్ 7. దత్తా (మిస్. హాడ్గసన్) 8. కె. రాజంగమ్ 9 సత్యేన్ 10 ఎ.బి. పురాణీ 11. లీలావతి (పురాణీగారి భార్య) 12. పూనమ్‌చంద్ 13. చంపాబెన్ (పూనమ్ చంద్‌గారి భార్య) 14. రజనీకాంత్ పలిట్ 15. డా॥ ఉపేంద్రనాథ్ బెనర్జీ 16. చంపక్‌లాల్ 17 కనైలాల్ గంగూలీ 18. ఖితీష్ చంద్ర దత్ 19. వేలూరి చంద్రశేఖరం 20. పూజాలాల్ 21. పురుషోత్తమ్ పటేల్ 22. రతి పలిట్ 23. రాంభాయి పటేల్ 24. నానీ బాల.

అనువాదం: రాయప్రోలు లక్ష్మీ ప్రసాదమ్మ

24 నవంబరు, 1926 నాటి విశిష్టత
(శ్రీఅరవిందునితో నిరోద్‌బరన్ ఉత్తర ప్రత్యుత్తరాలు)

మరొక విషయాన్ని గురించి వివరించ వలసిందిగా ఇవాళ నేను మిమ్మల్ని కోరుతున్నాను. నవంబరు 24 వ తేది విశిష్టత ఏమిటో విస్పష్టంగా చెప్పండి. ఆ రోజును గురించి విభిన్న వ్యక్తులకు విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. అతి మానస అవతారం మీలోకి దిగివచ్చిందని కొందరంటున్నారు.

వట్టి చెత్త! ఎవరి అభూత కల్పన అది?

మీరు అంతకంతకు అధిమానసీకృతం చెందారని మరి కొందరు అంటున్నారు.

ఓహ్! అది నిజానికి దూరమే అయినా అందులో కొంత నిజం లేకపోలేదు.

ఆ రోజున మీరు అతిమనస్సు (Supermind) ను సాధిం చారనే నేను అర్థం చేసుకున్నాను.

మా వైపు నుండి అటువంటి ప్రస్తావన ఏదీ లేదే.

ఆ రోజున మీరు అతిమనస్సును సాధించకపోతే, దానిని గూర్చి మాట్లాడడం గాని, తెలుసుకోవడంగాని ఎలా సంభ వమైంది మీకు?

బాగు బాగు! ఇదేమి న్యాయమండి. ఒక దానిని సాధించక ముందు దానిని గూర్చి నీకేమీ తెలియదా?

ఎందుకంటే నేను దానిని దర్శించాను. దానితో సంబంధం ఏర్పడింది. ఓ తర్క కిశోరమా! దానిని సాధించడం అనేది వేరే విషయం.

కొన్ని భాగాలు అతిమానసీకృతం అవుతున్నట్లు మీరు చెప్పారు కదా?

అతిమానసీకృతం చెందడం వేరు. అతిమానసాన్ని సాధించడం వేరు.

మీరు అతిమనస్సును సాధించలేదని ప్రకటన చేసి చాలా మందిని భయవిహ్వలుల్ని చేశారు.

హే ప్రభూ! భౌతికంలోకి అతిమనస్సును తీసికొని రావడానికి నేను ప్రయత్నిస్తున్నానని పదే పదే చెప్తూ వచ్చాను. నా మాటలు అర్థం కాలేదా? మీరంతా ఏమనుకుంటున్నారు? 1926, నవంబరు 24 న అతిమనస్సును నేను సాధించివుంటే, గత తొమ్మిది సంవత్సరాలుగా అది భూమ్మీద ఉండేవుండాలి కదా!

మీరు ఆ రోజున నిద్ర, ఆకలి, రోగాన్ని జయించారని 'దత్త' మాటల్ని బట్టి అర్థం అవుతున్నది. మరి ఏ అధికా రంతో ఆమె ఆ ప్రకటన చేశారు?

ఆ మహోజ్వల ప్రకటన గూర్చి నాకు తెలియదు. దైవత్వం (కృష్ణుడనండి, దైవసాన్నిధ్యం అనండి, మీ ఇష్టం, ఏ పేరుతో నైనా పిలవండి) భౌతికంలోకి దిగి వచ్చిందని చెప్పబడింది. అతిమానస అవతరణ కోసం మరింత కృషి చేయడం కోసం, నేను బాహ్యా ప్రపంచంనుండి ఏకాంతంలోకి వెళ్తున్నట్లు కూడా ప్రకటించబడింది. నవంబరు 24 నే అంతా సాధించివుంటే, ఇక సాధించడానికి భూమి మీద ఏం మిగిలింది? అతిమానసం భూమ్మీద ఉంటే, ఏ ఉజ్వల ప్రయోజనం కోసం నేను ఏకాంతంలోకి వెళ్ళాలి? అంతే కాకుండా ఇవన్నీ ఒక్క రోజులో సాధించబడతాయా? 'దత్త' ఏమైనా పలికి ఉంటే, భవిష్యత్ దర్శన పారవశ్య క్షణంలో పలికి ఉండాలి. వర్తమానంలో భావి దృశ్యం ఆమెకు సాక్షాత్కరించి ఉండాలి!

నేను నిలబడి ఉన్నాను. కాని దేనినీ బహిర్గతం చేయ లేదు. ఒక క్షణం నిలబడడానికి నాకు వ్యవధి ఉంది. కాని నా మనస్సు లేదా నా అధిమనస్సు ఎంత ఆలోచనా "గర్భితం" అయినప్పటికీ, నేను దేనినీ బహిర్గతం (deliver) చేయ లేదు. (deliver, pregnant అనే మాటలలో శ్రీఅరవిందుల సూక్ష్మ హాస్యం గమనార్హం) కాని ఎంత తర్క బుద్ధి! ఎవరైన ముందుగా అతిమానసీకృతం కావాలా? అటు పిమ్మటే అతిమనస్సును గూర్చి తెలుసుకోవడం సాధ్యమవుతుందా? ఆహా! ఎంత తర్కం? అయితే నాకు వ్యవధి ఉన్నప్పుడు మరోసారి దానిని తప్పక బహిర్గతం (deliver) చేస్తా.

1935, ఆగస్టు 29

మీరు వాగ్దానం చేసినట్లు అతిమనస్సును గూర్చి ప్రకటించవలసిందిగా మిమ్మల్ని కోరేందుకు నాకు సువర్ణావకాశం వచ్చింది. మీకు అది జ్ఞాపకం ఉందనుకుంటాను. మీకు గుర్తు లేకపోతే, ఇదీ ప్రశ్న! నవంబరు 24 వ తేదీ విశిష్టత ఏమిటి? అధిమానస సిద్ధా! (overmind) అతిమానస సిద్ధా? (supermind) మరేమిటి?

భౌతికంలోకి శ్రీకృష్ణుడు అవరోహించాడని మీరేదో అంటున్నారు. శ్రీకృష్ణుడు మీలోకి అవరోహించాడని కొందరు అంటున్నారు. మీరు భౌతిక పదార్థం కాదు. మీరు భౌతిక పదార్థమా? స్పష్టంగా అర్థం కావడం లేదు.

ఎందుకు కాకూడదు? నేనెందుకు భౌతిక పదార్థం కాకూడదు? నాలో కొంత పదార్థం ఉందని కనీసం నువ్వు ఒప్పుకుంటావు కదా! నాలో ఉన్న పదార్థానికి బయట ఉన్న పదార్థానికి సంబంధం ఉన్నదన్న సత్యాన్ని నీవు కాదన లేవు. (క్వాంటం సిద్ధాంతం సంగతి అలా ఉంచు). బయట ప్రపంచంలోని పదార్థంతో కలుస్తూ, అనివార్య విస్తరణతో కృష్ణుడు కానీ, అధిమనస్సు కానీ, దానితో సమానమైన మరేదైనా కానీ – నా పదార్థంలోకి దిగితే, భౌతికంలోకి అవతరించిందన్న ప్రకటనలో అస్పష్టత ఏముంది? తర్కం ఏమంటుంది?

1935, సెప్టెంబరు 15

1926, నవంబరు 24 న శ్రీకృష్ణుడు భౌతికంలోకి అవతరించాడు.

శ్రీకృష్ణుడు అతిమానస తేజస్సు కాదు. శ్రీకృష్ణుని అవతరణ అంటే అతిమనస్సు అవతరణకు సంసిద్ధం చేసే అధిమానస దైవత్వపు ఆగమనం మాత్రమే. అధిమనస్సు, అతిమనస్సు ఒకటి కావు. శ్రీకృష్ణుడు ఆనందమయుడు; ఆయన అధిమనస్సు ద్వారా పరిణామానికి తోడ్పడుతాడు. పరిణామాన్ని ఆనందం వైపు నడిపిస్తాడు.

29-10-1935 *శ్రీఅరవిందులు*

24 నవంబరు, 1926 – సిద్ధి దినము

ఆ రోజు యొక్క ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1908-09 సంవత్సరంలో శ్రీఅరవిందులు కారాగారంలో పొందిన అనుభవాలనూ, వారి 1926, నవంబరు 24 నాటి అనుభవాలనూ జోడించాల్సి ఉంటుంది. అంతేగాక శ్రీఅరవిందులు తన వ్యక్తిగత సాధన గురించి 1920 లో శ్రీ బరీన్‌కు వ్రాసిన విషయాలను కూడ లెక్కలోనికి తీసుకోవాలి.

1910 లో తాను పుదుచ్చేరికి రాకముందు 1920 ఏప్రిల్‌లో శ్రీ బరీన్‌కు వ్రాసిన లేఖలో తన యోగస్థాయి "ప్రాథమిక" మైనదిగాను, "ప్రారంభ దశకు చెందినది" గాను వర్ణించారు. అంటే అది అతిమానస యోగంలో ప్రాథమిక స్థాయి. ఆ లేఖలో ఇలా వ్రాసి ఉంది. "మనలో ఉన్న జగద్గురువు అపుడు నా మార్గాన్ని ఆసాంతం నిర్దేశించారు – మొత్తం సిద్ధాంతాన్నీ, ఆ యోగంలోని దశాంగాలను వివరించారు. ఈ దశాబ్దకాలం (1910-1920) అనుభవం ద్వారా వారు నాచే అభివృద్ధి చేయిస్తూన్నారు. కాని అది ఇంకా పూర్తి కాలేదు.

"మనం ఊర్ధ్వముఖంగా ఎదగనిదే – అంటే అతిమానసస్థాయిని చేరనిదే ప్రపంచపు అంతిమ రహస్యాలు ఏమాత్రం అవగతం కావు, అది ఉత్పన్నం చేసే సమస్య అపరిష్కృతంగా మిగిలి పోతుంది.

"ఇది అంత తేలిగ్గా జరిగే మార్పు కాదు. ఈ పదిహేను సంవత్సరాల తర్వాతకూడా నేను అతిమానస స్థాయిల్లోని అట్టడుగున ఉన్న మూడవ దశను మాత్రమే చేరుకోగలుగుతున్నాను. దాని కంటె క్రింది స్థాయి కార్యక్రమాలను అందులోనికి తీసికొనే ప్రయత్నం చేస్తున్నాను. అయితే ఈ సిద్ధి పూర్తి అవగానే భగవంతుడు నా ద్వారా ఇతరులకు ఈ సిద్ధిని చాల స్వల్ప ప్రయత్నంతోనే ప్రసాదించగలడనే నమ్మకం నాకుంది. అప్పుడు నా అసలు కార్యక్రమం మొదలౌతుంది. విజయం కోసం నేనేమీ అసహనంతో లేను. దైవం నిర్ణయించిననాడు జరిగేది జరుగు

తుంది. తొందరపాటుతో రంగంలోకి దూకే ఉద్వేగం నాకు లేదు. ఒకవేళ నేను విజయం సాధించకపోయినా నేనేమీ చలించను. ఎందుకంటే ఈ కార్యం నాది కాదు, దైవానిది. దేవుడు నన్ను నడిపించినట్లుగా నడుస్తానుగాని మరెవరి మాటా విననూ.

"వందల, వేల కొద్దీ శిష్యులను నేను కోరటం లేదు. సంకుచితమైన అహంకారాన్ని క్షాళన చేసికొని, భగవంతుని సేవలో పరికరాలుగా మారగల వారు ఒక వందమంది ఉంటే చాలు.

"తానే పరిపక్వంకాని వాడు ఇతరులనెలా పరిపక్వం గావించగలడు?"

దీని ద్వారా మనం తెలుసుకునేది ఏమిటంటే శ్రీఅరవిందులు పాండిచ్చేరి వచ్చేనాటికి తన మార్గాన్వేషణలో తడుముకోవటం లేదనీ, వారి మార్గం వారిముందు నిర్దేశింపబడిందనిన్నీ. 1910 తర్వాత వారి యోగం భగవంతుని అధీనం లోనికి వెళ్ళింది. సాధన క్రమంలోని దశాంగాల ద్వారా అది వారికి గోచరించింది. మానసిక స్థాయికి పైనున్న అతిమానస స్థాయి యొక్క ఉనికిని వారు అంత కాలము గమనించియే యున్నారు. 1920 నాటికి వారు అతిమానస చైతన్యంలోని అట్టడుగు స్థాయికి ఎదగడంలో విజయం సాధించారు. అంతేకాక వారి ప్రకృతి సిద్ధమైన కదలికలన్నీ అందులోనికి చేర్చుకొని యున్నారు.

కాని వారు ఏదో చేసి తీరాలని తొందర పడటం లేదు. అజ్ఞానపు మానవ సాధనాలతో కాక ఊర్ధ్వచేతననుండి మాత్రమే పనిచేయాలనేది వారి కోరిక. అతిమానస అవతరణ పరిపూర్ణంగా స్థిరపడితే, అందరూ దానినుండి తేలికగా అతికొద్ది ప్రయత్నంతోనే లాభాన్ని పొందగలరనే నమ్మకం వారికి ఉన్నది.

ఈ విధంగా అతిమానస సిద్ధికోసం తన తపస్సు కొనసాగిస్తూ ఉండగా, దైవానుగ్రహమో అన్నట్లు శ్రీమాత వారి ఆంతరంగిక ఆధ్యాత్మిక సాధనలో భాగస్వామి లయినారు. 1926 ప్రారంభంనుండి ఆశ్రమంలోని శిష్యులకు శ్రీమాత మార్గదర్శకులుగా ఉంటూ ఉన్నారు. ఇద్దరు, ముగ్గురు మహిళా సాధ

కులు కూడా ఉండేవారు. వారు శ్రీమాత దగ్గరకు ధ్యానం కోసం వెడుతూ ఉండేవారు. 1926 ఆగస్టు నుండి శ్రీమాత వద్దకు వచ్చే సాధకుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. శ్రీఅరవిందులు క్రమేణా ఏకాంతవాసం లోనికి వెళ్ళటం, శ్రీమాత సాధకుల అంతర్గత సాధనకు, ఆశ్రమ బాహ్యాజీవన నిర్వహణకు మార్గ దర్శకత్వం వహించటం సహజంగానే, అప్రయత్నంగా జరిగి పోయాయి. ధ్యానాలు రోజు రోజుకీ తీవ్రతరంగాను, ఏకాగ్రం గాను అయిపోయినాయి. శ్రీఅరవిందులు సాయంవేళల్లో బయట కూర్చోవటానికి రావటం నానాటికీ ఆలస్యం అవటం మొదలు పెట్టింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ మార్పు లన్నిటినీ ఎవరూ అసహజంగా భావించలేదు. కాని శ్రీమాతా రవిందుల ఈ బృహత్తర కార్యక్రమంలో సాధకుల పాత్ర చెప్పు కోదగినది. ఆశ్రమ వాతావరణంలోని బాహ్య, అంతర్గత పరివర్త నకు వారంతా సాక్షీభూతంగా ఉన్నారు.

1926 ఆగస్టు 15 కు కొద్దిగా ముందు, ఆ తర్వాత జరిగిన సాయంకాల ప్రవచనాల ధోరణి పరికిస్తే అతిమానసా నికి, సాధారణ మనసుకూ మధ్యన ఉన్న లంకె ప్రాధాన్యతను సంతరించుకొంటుంది. దీనినే శ్రీఅరవిందులు అధిమనస్సు (Overmind) అని పేర్కొన్నారు. 1920 లో శ్రీ బరీన్‌కు శ్రీఅరవిం దులు లేఖ వ్రాసిన నాటినుండి జరిగిన ఆరు సంవత్సరములలో శ్రీఅరవిందులు ఊర్ధ్వచేతనల వైపుగా ఎంత ముందుకు వెళ్ళారో అదేవిధంగా దాన్ని ప్రకృతి వైపుకు దించటానికి కూడా అంతే కృషి చేశారనేది స్పష్టమౌతుంది. 1926 నవంబరు ప్రారంభంలో శ్రీఅరవిందుల సాయంకాలపు ప్రసంగాలు అనేకమార్లు దివ్య చైతన్యపు అవరోహణకు గల అవకాశాలు, దాని ప్రక్రియ అనే అంశం వైపు మళ్ళేవి. ఈ సంభాషణలవల్ల చాలామంది సాధకు లకు ఈ అవరోహణ దగ్గరలోనే ఉందనే భావన కల్గింది. దేవ తలు భూమిపైకి దిగే అవకాశం ఉన్నది" అనేది స్పష్టం అయింది. "దివ్యజీవనం" (The Life Divine) లో శ్రీఅరవిందులు ఊర్ధ్వమానసస్థాయి, చేతన, దేవతలను గూర్చి స్పష్టమైన వివరణ

ఇచ్చియున్నారు. 1926 సం॥ నవంబరు 24 న సంభవించిన అవరోహణను అర్థంచేసి కోవటానికి సహాయపడే కొన్ని వాక్యాలను ఈ క్రింద పొందుపరుస్తాను.

"మూలసత్త్వము (Reality) యొక్క శక్తులను మనం అనేక దేవతా రూపాలుగా భావించగలిగితే, అధిమనస్సు (over-mind) అనేకవేల దేవతా స్వరూపాలను క్రియలో ప్రవేశపెట్టగలదు. వారిలో ప్రతివారు తనదైన ప్రపంచం ఒకటి సృష్టించుకోగల శక్తి గలిగి ఉంటారు. అయితే ఆ లోకాలు పరస్పరానువర్తితమై, సంబధీకృతమై, అనుబంధాలు కలిగి ఉంటాయి. వేదములలో ఇలాంటి దైవములకు చెందిన అనేక సమీకరణాలు ప్రస్తావించబడినాయి. ఆ దేవతలంతా ఒకే సత్తకు చెందినవారని చెప్పబడ్డారు. అయినా ప్రతి దేవత తానే సత్త యొక్క అసలు రూపం అయినట్లుగాను మిగతా దేవుళ్ళంతా తనలోనే ఇమిడి యున్నట్లున్నూ ఆరాధింపబడ్డారు. కాని ప్రతి దైవం ఒక ప్రత్యేక దైవం. అయితే ఒక్కొసారి సహదైవాలతో కలసి వర్తిస్తూ ఉండటం, లేక వారికి వ్యతిరేకంగాను, వేరుగాను ప్రవర్తిస్తూ ఉండటం కద్దు. అయితే అతిమానస స్థాయిలో ఈ భిన్నత్వం అంతా ఒక సామరస్యపూరిత లీలలా గోచరిస్తుంది. అధిమనస్సులో ఈ మూడు స్థితులూ స్వతస్సిద్ధమైన అభివృద్ధి, పరిణామశీలత కలిగిన విభిన్న స్థితులుగాను, లేక మిగిలిన స్థితులతో కలసి ఇంకా అధికతరసంయుక్తత గలిగిన సామరస్య పూరిత శక్తి గలవిగాను కూడా ఉంటాయి. ఏకమాత్ర సత్త వలెనే చైతన్యము మరియూ శక్తి కూడ – ఒకటైన చైతన్యమే, స్వతంత్ర ప్రతిపత్తిగలిగిన అనేక చైతన్య విజ్ఞానరూపాలుగా ప్రభవిస్తుంది. ప్రతి ఒకటీ తనదైన సత్యమార్గాన్ని యథార్థ్యం చేసే దిశగా పయనిస్తాయి. విభిన్న ముఖాలు కలిగి కూడా ఒక్కటిగా ఉండగలిగిన యథార్థభావన తనకు గల విభిన్న ముఖాలుగా విచ్ఛిన్నమై, ఒక్కొక్కటి స్వయం ప్రతిపత్తిగల స్వయంభువు కాగల భావనాశక్తిగా అవుతాయి. ఒకటిగానున్న చిచ్ఛక్తి నుండి స్వతంత్రమైన శతసహస్రశక్తులుగా విడుదల అవుతాయి. వీటిలో ప్రతిదీ తనను పరి

పూర్ణం గావించుకోవటానికి గాని, అవసరమైతే, స్వప్రయోజ నార్థమైగాని, ఇతర శక్తులపై ఆధిపత్య నాయకత్వములను సంత రించుకొని వాటిని లోబరచుకోటానికి గాని హక్కు కలిగి యుంటుంది. అదే విధముగా సచ్చిదానందము కూడ వివిధములై ఆనందశకలాలుగా విడిపోగలదు. కాని ఈ వేర్వేరు ఆనంద శకలాలు స్వతంత్రమైన పరిపూర్ణ స్థితిని చేరుకోగలగటంగాని, సర్వసత్తా స్థితిని సాధించటంగాని చేయగలిగి ఉంటాయి. ఈ విధంగా ఊర్ధ్వచేతన ఒకటిగా నున్న సచ్చిదానంద స్థితికి అనం తములైన అవకాశములను కల్పిస్తుంది. ఇవన్నీ అనేకమైన లోకా లుగా ప్రభవించటం గాని, ఒకటిగా చేరి ఒకే లోకంగా వర్తిస్తూ నిరంతరం మార్పుచెంద గల లీలలద్వారా తమ సృష్టిని, ప్రక్రి యను, గమనాన్ని, పరిణామాన్ని నిర్దేశించుకోగలిగి ఉంటాయి".

"(అధిమనస్సులో) ప్రతి దైవానికి సత్తలోగల ఇతర దైవాల స్థానము తెలిసి ఉంటుంది. ప్రతిభావన ఇతర భావనలను, ఉనికిలో వాటికిగల స్థానాలను అంగీకరిస్తుంది. ప్రతి శక్తి ఇతర శక్తుల యాథార్థ్యాన్ని, ఫలితాలను ఒప్పుకొంటుంది. ప్రత్యేకమైన సాఫల్యతను సిద్ధింపచేసుకొన్న ఏ ఆనందస్థితిగాని, అనుభవము గాని, ఇతర స్థితులను లేక అనుభవములలోని ఆనందాన్ని త్రోసి రాజనటంగాని, నిషేధించటంగాని చేయదు. ఊర్ధ్వమనస్సు అనేది విశ్వసత్యము యొక్క నియమము. విశాలము, అనంతము అయిన విశ్వసౌజన్యతయే దాని ఆత్మ. పరిపూర్ణ చలనశీలత, మరియు ప్రత్యేక చలనశీలత్వము దాని శక్తి."

సూచనప్రాయమైన వ్యక్తిగత అనుభవం వల్లనైతేనేమి, ఆశ్రమ వాతావరణ ప్రభావం వల్ల నైతేనేమి ఊర్ధ్వచేతన యొక్క అవరోహణ త్వరలో సంభవించగలదన్న భావన చాలమంది సాధకుల (శిష్యుల) మనసులలో బలపడసాగింది. ఆశ్రమము యొక్క బాహ్య స్వరూపంలో పెద్ద మార్పులు సంభవించగలవని చాలామంది భావించారు. సాయంకాలం కూర్చోటానికి శ్రీఅరవిం దులు సాధారణంగా వచ్చే 4.30 గంటలు క్రమంగా ఆరు, ఏడు లేక ఎనిమిది అవుతూ ఉండేది. ఒక రోజు రాత్రి రెండుగంట

లకు రావటం ముందెన్నడూ లేనిది! శ్రీఅరవిందుల శక్తులన్నీ ఊర్ధ్వచేతనను అధిరోహింప జేయటానికే వినియోగింపబడుతు న్నాయనీ, వారొక లిప్తకాలం కూడ మిగతా వాటికై మరలిం చటంకాని, వృథాచేయటం గాని జరగటం లేదనేది స్పష్టం అవు తుంది. శిష్యులతో బాహ్య సంబంధం కలిగి యుండటం అవస రమై యున్నప్పటికీ, తన అంతర్గతమైన పరిశ్రమకు అధిక సమయం అవసరమై యుండటంవల్ల, శ్రీఅరవిందులు వారితో గడపటం కష్టతరం అవుతూ వచ్చింది.

వారి బృహత్తర కార్యక్రమం ఏమీ తెలియనివారు, వారు దైవకార్యంలో ఎంత నిజాయితీతోనూ, ఏకాగ్రతతోనూ ఉండేవారో కొంచెం కూడ గ్రహించలేరు. నిజానికి బయట వ్యక్తులు వారి మహత్తర ప్రయత్నాల ఆచరణీయ ఫలితాలను గురించి సందేహపూరితంగా ఉండేవారు. వారి ఆధ్యాత్మిక కార్య క్రమాన్ని గురించి గొప్ప ఆశలు నిర్మించుకున్న నిజమైన ఆరాధ కులు సైతం నిరాశపడజొచ్చారు. శ్రీఅరవిందులవారు అఖండ మైన పరబ్రహ్మాను వెతుకుతూ ఏ ఊషరక్షేత్రాల్లోనో దారితప్పి ఉంటారనీ, అనంతంలోని అర్థంకాని ఆవృత్తుల్లో చిక్కుకొని ఉంటారనీ, తమ అజ్ఞానంవల్ల భావించేవారు! శ్రీఅరవిందులు ఈ భూమిపై పట్టు వదిలివేశారని, వేదనాపూరితమైన మానవాళి యొక్క తీవ్రమైన, అత్యవసరమైన సమస్యలను పట్టించుకోవటం లేదనీ నమ్మారు. అలా కాకపోతే వారి దివ్యమైన మరియు ఉపశ మనం కల్గించే సహాయం కోసం అంతగా అలమటించే మానవా ళికి సహాయం చేద్దామని తొందరపడకుండా ఉంటారా? దివ్యమ యిన అట్టి సహాయం అపుడు కాక మరెపుడు అవసరమౌతుంది?

కాని, పైకి కనుపించే అసంబద్ధతలు అలా ఉండగా అదృష్టవశాత్తు వారి సాన్నిహిత్యంలో నివసించే కొద్దిమంది మాత్రం శ్రీఅరవిందులు భూమ్మీద ఆవిష్కరింపబూనే ఆ ఊర్ధ్వ శక్తి ఆచరణ యోగ్యమైన ఫలితాలను ఇచ్చే సమర్థత కలిగి యుండటమేగాక, నిజంగానే అలాంటి ఫలితాలనే ఇస్తూ ఉన్న దని బాగుగా గమనించారు. ఊర్ధ్వశక్తితో శ్రీఅరవిందులకు గల

సంబంధం, తాదాత్మ్యత ఎలాంటివంటే వారి సామీప్యంలోగాని, దూరంగా గాని ఉన్న వారిని సైతం ఆ శక్తితో ఓ సంబంధం కలిగేలా చేసేవారు. వారి సహాయంతో శారీరక రుగ్మతలు నయంచేసుకొన్న సందర్భాలు ఉంటూ ఉండేవి. పరబ్రహ్మ మార్గంలో దారి తప్పారన్న మాట నిజం కాకపోవటమేగాక, అందుకు భిన్నంగా మారి మార్గాన్ని రోజు రోజుకూ మరింత స్పష్టంగా చూచేవారు. ఆ అవరోహణ భూమ్మీద సంభవించటం సృష్టిలో తప్పనిసరియైన మరియు సహజమైన పరాకాష్ఠ అని భావించేవారు.

శ్రీఅరవిందులు కంటె మరెవరికీ మానవాళిపై ఎక్కువ సానుభూతిగాని, ఆవేదన గాని లేవనేవి వారి శిష్యులకు తెలుసు. వారి నుండి మానవాళికి జాలువారుతున్న నిశ్చల, సుస్థిర సహాయాన్ని వారు కొన్ని సందర్భాలలో గమనించారు కూడ. అశ్వపతిని గూర్చి శ్రీఅరవిందులు "సావిత్రి" లో వ్రాసిన "అతని ఆత్మ యొక్క నిశ్చలత్వం శ్రామిక ప్రపంచానికి తోడ్పడింది" అనే వాక్యాన్ని చదివినపుడు, ఇది శ్రీఅరవిందులు స్వానుభవమే అన్న భావన వారికి తర్వాత కలిగింది. "ప్రయోజకత్వం" అని అందరూ అతిగా చెప్పుకొనేది మరొకటి ఉందా? "మీ సమస్యలు పరిష్కారం చేస్తాను" అనే ప్రగల్భం, సమస్యలు పరిష్కరిస్తుందా? నిజంగా శాశ్వతంగా తీరక పోవటం గాని, పాక్షికంగా తీరటం గాని జరిగి, కర్తకు అసత్యపు తృప్తి మరియు అసత్యపు ఆత్మసంతృప్తి కలగటం గాక మరేమౌతుంది? నిజానికి మాయా కల్పిత సంతృప్తి యొక్క భ్రమలో పడనంత దృఢమైన పట్టు ఈ ప్రపంచంపై వారికి ఉన్నది.

వారి దృష్టిలో "కర్మసు కౌశలం" అంటే ఉన్నతమైన సత్యచేతన నుండి వర్తించటమే. ఊర్ధ్వచేతన భౌతిక భూమికకు దిగనంతకాలం, అంతే కాదు స్థూలపదార్థ చేతనలోనికి దిగనంత వరకు తాను బాహ్యా కార్యక్రమాలను ప్రారంభించాలని వారు కోరటం లేదు. ఆ విధంగా మాత్రమే 'దైవాన్ని సంపూర్ణంగా తనలో వ్యక్తం చేసుకోగల నూతన జీవనం' రూపొందుతుంది.

మానవ సమస్యలకు అంతిమ పరిష్కారం, వారు ప్రారంభించిన ఆధ్యాత్మిక కార్య క్రమంలో మాత్రమే ఉంది.

రోజులు, నెలలు, సంవత్సరాలు గడచిపోయాయి. శ్రీఅర విందులు తన కార్యక్రమం ప్రారంభించటానకి ఏమాత్రం తొందరపడటం లేదు! ఊర్ధ్వశక్తి దిగిరావటానికి గల అవకాశా లను వారు ఇంతకాలమూ సిద్ధం చేస్తూ ఉన్నారు. అలాంటి ఎట్టి ప్రయత్నానికైనా, అజ్ఞాన శక్తులనుండి రాగల నిరోధం సహ జంగా చాల తీవ్రమైనది. దేహ కణాలను, ఆ దివ్య తేజఃప్రసారా నికి తెరచి యుంచటం కోసం బ్రహ్మాండమైన కార్యక్రమంలో వారు నిమగ్నమై యున్నారని, దీనికి అచేతన నుండి తీవ్ర నిరోధం ఎదుర్కొన వలసి వస్తున్నదని వారే ఒక సాయంత్రం తమ ప్రసంగంలో తెలిపారు. (మహాబలాఢ్యుడైన వాడు మాత్రమే భరించగల ఈ శ్రమ) లేక అతికష్టమైన ఈ శ్రమ శ్రీఅరవిందులు తనకోసం కాక సర్వమానవాళి కోసమే చేపట్టారనీ, పరిణామ క్రమంలో మానవుడు ఒక క్రొత్త పుంత తొక్కటం కోసం ప్రయ త్నించారనీ భావించినపుడే "సావిత్రి" లోని ఈ క్రింది వాక్యాలు వారికే తగినవని అనిపిస్తుంది. "The world unknowing, for the world she stood".

అందువలన, శ్రీమాతారవిందుల కృప వలన వారి శిష్యులు కూడ "అవరోహణ" సామీప్యంలో ఉన్నట్లు భావిం చటం, వారి హృదయాలు ప్రతీక్షతో, ఏకాగ్రతతో నిండి యుండటం సహజమే మరి.

1926 నవంబరు నుండి "ఊర్ధ్వశక్తి" యొక్క ఒత్తిడి భరించరానిదిగా ఉండేది. చిట్టచివరకు నవంబరు 24 న శ్రీమాత అనేక సంవత్సరాలుగా ఎదురు చూచిన ఆ విశేష దివసం రానే వచ్చింది. సూర్యుడు దాదాపు అస్తమించాడు. అందరూ తమ తమ పనులమీద వెళ్ళారు. కొందరు సముద్రం ప్రక్కకు వాహ్యా ళికి వెళ్ళారు. ఆ సమయంలో శ్రీమాత అందరినీ సాధారణంగా ధ్యానం జరిగే వరండాలో వెంటనే సమావేశం కావలసినదిగా కబురు పంపించారు. అది అందరికీ చేరటానికి ఎంతోసేపు

పట్టలేదు. ఆరు గంటలకల్లా, చాలామంది సాధకులు అక్కడకు చేరుకున్నారు. అప్పుడే చీకట్లు అలముకొంటూ ఉన్నవి. వరండాలో శ్రీఅరవిందులు తలుపుకు దగ్గరగా ఆయన కుర్చీ వెనుక మూడు చైనా డ్రాగన్లు (నిప్పులు క్రక్కే సరీసృపాలు) గల నల్లని తెర వ్రేలాడుతూ ఉన్నది. ఆ డ్రాగన్లు మూడు ఒకదాని నోట్లో మరొకదాని తోక పెట్టినట్లు చిత్రించబడి ఉన్నాయి. ఆ చిత్రం తెర మొత్తం ఆక్రమించి ఉంది. ఆ తర్వాత మాకు తెలిసింది. చైనాలోని ఒకానొక జోస్యం ప్రకారం ఎప్పుడైతే మూడు డ్రాగన్లూ కలసి ఉంటాయో అప్పుడు సత్యం భూమిపైకి అభివ్యక్తం అవుతుంది. (ఆ డ్రాగన్లే భూమి, మనసు, ఆకాశము) ఈ నవంబరు 24 న సత్యము భూమిపై అవతరిస్తూ ఉన్నది. ఆ తెర ఆ విధంగా ప్రాధాన్యతను సంతరించుకొంటుంది.

శిష్యులంతా వచ్చిన తరువాత ఒక గాఢమైన ప్రశాంతత అక్కడ నెలకొని ఉన్నది. మహాసముద్ర ప్రవాహం వలె పై నుండి ఎగసి పడుతున్న తేజః పుంజం చాలమంది తిలకించారు. తలపై ఏదో అవ్యక్తమైన ఒత్తిడిని అందరూ అనుభవించారు. ఒకానొక విద్యుదావేశం ఆ ప్రదేశాన్ని ఆవరించినట్లు అనిపించింది. ఆ నిశ్శబ్దంలో కేంద్రీకృతమైన ఆకాంక్ష, ప్రతీక్షలతో నిండియున్న ఆ వాతావరణంలో సర్వసాధారణం అయినా అసాధారణం అనిపించే “టిక్” అనే శబ్దం ప్రవేశద్వారపు తలుపు వెనుక నుండి వినపడింది. ఆశ ఉవ్వెత్తున ఎగసి పడింది. వారగా తీసిన తలుపు సందుల్లోనుండి శ్రీమాతారవిందులు దర్శనమిచ్చారు. శ్రీమాత తన కనుసన్నలతో శ్రీఅరవిందులను ముందుకు అడుగిడ వలసినదిగా ప్రార్థించారు. అదే విధంగా ఆమెను కూడ చేయమన్నారు. గంభీరమైన మెల్లని అడుగులతో శ్రీమాత ముందుకు రాగా, శ్రీఅరవిందులు కూడ గంభీరమందయానంతో అనుసరించారు. వారి కుర్చీ ముందుండే చిన్న బల్ల ఆ రోజు లేదు. శ్రీఅరవిందుల కుడివైపున శ్రీమాత ఒక చిన్న బల్లపీట పై కూర్చున్నారు.

పరిపూర్ణ, సజీవ నిశ్చలత – దైవత్వం తొణికిసలాడే సజీవ నిశ్చలత అది. ధ్యానం దాదాపు నలభై ఐదు నిముషాలు కొనసాగింది. ఒకరి తర్వాత ఒకరుగా శిష్యులు శ్రీమాతకు ప్రణమిల్లారు. *శ్రీమాతారవిందులు వారికి తమ దీవెనల నందించారు. ఆ సమయంలో, శ్రీమాత ద్వారా తాను దీవిస్తున్న భావన కలిగేటట్లుగా, శ్రీఅరవిందులు శ్రీమాత వెనుకనుండి తన కుడిచేతిని ముందుకు రానిచ్చారు. అనంతరం అదే మౌనంలో కొద్దిసేపు ధ్యానం జరిగింది.* ఈ ప్రశాంత ధ్యానం, దీవెనల విరామంలో అనేకమంది ప్రత్యేక అనుభూతులు పొందారు. అంతా అయిపోయిన తరువాత ప్రతివ్యక్తీ తామొక దివ్యస్వప్నం నుండి మేల్కాంచినట్లు భావించారు. ఆ వైభవము, ఆ కవనము, ఆ పరిపూర్ణ సౌందర్యానుభూతి వారనుభవించారు. ఏదో వేళ్ళపై లెక్కించగల కొద్దిమంది మాత్రమే శ్రీమాతారవిందుల దీవన లందుకున్న సమయం కాదది – ఆ సమయం (ముహూర్తం) యొక్క ప్రాధాన్యత అంతకంటే బహు విశిష్టమైనది.

It was certain that a Higher Consciousness had descended on earth. In that deep silence had burgeoned forth, like the sprout of a banyan tree, the beginning of a mighty spiritual work. This momentous occasion carried its significance to all in the divine dynamism of the silence, in its unearthly dignity and grandeur and in the utter beauty of its every little act. The deep impress of divinity which everyone got was for him a priceless treasure.

శ్రీమాతారవిందులు లోనికి వెళ్ళారు. దత్తా వెంటనే స్ఫూర్తి పొందారు. "దైవం ఈ నాడు భౌతికం లోనికి దిగారు" అని ఆ మౌనంలోనే, వారన్నారు. నవంబరు 24 కు శ్రీమాతారవిందుల జన్మదినోత్సవాలకు ఇచ్చే ప్రాధాన్యత ఇవ్వాలనేది న్యాయమే. ఎందుకంటే ఆ నాడు వారి ఉద్యమానికి ప్రతీకగా ఊర్ధ్వశక్తి భూమిమీద అవతరించింది. ఏ ఊర్ధ్వమానసమైన

ఆనందచైతన్యం శ్రీకృష్ణునిగా అవతారం దాల్చిందో, అదే చైతన్యం ఈ నాడు భౌతిక పదార్థంలోనికి దిగివచ్చి, అతిమానసావతరణకి దోహదం చేసింది.

తర్వాతకూడ శ్రీఅరవిందులు అనేక సందర్భాలలో దీన్ని గురించి వ్రాశారు. అక్టోబరు 1935 లో ఇలా వ్రాశారు. "అది (24-11-1926) శ్రీకృష్ణుడు భౌతికంలోనికి దిగిన రోజు."

"శ్రీకృష్ణుడు అతిమానస తేజస్సు కాదు. తానుగా తీసికొని రాకున్నప్పటికీ, అతిమానసము, ఆనందము పదార్థంలోకి దిగిరావటానికి రంగం సిద్ధం చేస్తున్న ఊర్ధ్వ మానస దేవతామూర్తియే శ్రీకృష్ణుడు. కృష్ణుడు ఆనందమయుడు. ఆయన పరిణామక్రియను తన ఆనందంవైపుగా నడిపించటానికి ఊర్ధ్వ మానసంద్వారా చేయూత నిస్తాడు."

అనువాదం: కె.ఆర్.ఎల్. నరసింహారావు

ఆరోగ్యపత్రం:

శక్తి యొక్క అక్షయ నిక్షేపము

పుష్టిని పుంజుకోవడం ఎలా?

వ్యక్తి కోల్పోతున్న శక్తిని తిరిగి పుంజుకోవడానికి అనువుగా పోషణ (పౌష్టికాహార) కళలో ఆధునిక విజ్ఞానం ఎంతో గొప్ప ప్రగతిని సాధించింది. అయితే ఈ ప్రక్రియ అనేక ఇబ్బందులతో కూడుకున్నదీ, రకరకాల పరిమితులకు లోనైనదీను. దీన్ని గురించి ఇదివరకే వివరంగా చర్చించి ఉండడంవల్ల ఇప్పుడు దీన్ని ఇక్కడ ప్రస్తావించనక్కర లేదు.

ఈ ప్రపంచమూ, మానవజీవితము ఇదే విధంగా కొనసాగుతున్నంత కాలం ఆహారం అనేది అనివార్యం. అయితే ఇతర

మార్గాలద్వారా బలాన్ని (పుష్టిని) పొందడం ఎలాగో యోగ శాస్త్రానికి బాగా తెలుసు. కాబట్టి యోగశాస్త్రంలో అతిప్రధానమైన రెండు అంశాలను గురించి ముచ్చటించుకుందాం!

మొదటిది ఈ భూమిమీది భౌతిక శక్తులతో సంబంధం ఏర్పరచుకొని ఆ తరగని నిధి నుండి అంటే అక్షయ నిక్షేపం నుండి సత్తువని హాయిగా సంతరించుకోవడం. బాగానే ఉంది. కాని ఆ శక్తులు చీకటి శక్తులు. అవి తేజస్సును ఇవ్వలేవు, చైతన్యాన్ని కలిగించనూ లేవు. పైగా అవి మానవుల్లో పశుత్వాన్ని ప్రేరేపిస్తాయి. అదీ ఇబ్బంది. అయితే ఒకటి మాత్రం నిజం. ఇవి మానవునికీ, భౌతిక ప్రకృతికీ మధ్య ఒక రకం అను బంధాన్ని కలిగిస్తాయి. ఈ శక్తుల్ని సంతరించుకుని వినియోగిం చుకోవడం తెలిసినవారు సాధారణంగా జీవితంలో విజయం పొందగలరు. చేపట్టిన ప్రతీదాన్ని సాధించ గలుగుతారు. కాని వారు బాహ్యాపరిస్థితుల మీద, శరీర ఆరోగ్య పరిస్థితి పైనా ఆధారపడి ఉంటారు. ఆ శక్తులు కూడ అనువైన పరిస్థితులున్న ప్పుడే పని చేస్తాయి. ఏదైనా అవాంతర పరిస్థితి సంభవించి నప్పుడు అవి పనికిరావు.

చిన్న పిల్లలు ఏ ఆలోచనా లేకుండా హాయిగా ఆనం దంగా ఈ శక్తిని వినియోగించుకుంటారు. అలాగే ఈ భౌతిక ప్రకృతినుండి వారు ఈ శక్తిని అప్రయత్నంగానే స్వీకరించ గలుగుతారు. అయితే ఓ ఇబ్బంది ఉంది. వారు ఎదుగుతున్న కొద్దీ వారి మనస్సును వివిధ ఆలోచనలు, సమస్యలు ఆవరి స్తాయి. ఫలితంగా జీవితంలో రకరకాల చికాకులు కలుగుతాయి. ఈ చికాకుల కారణంగా శక్తిని స్వీకరించగలిగే నైపుణ్యం, చైతన్యం క్రమేపీ మొద్దుబారిపోయే ప్రమాదం ఉంది. సరే! దీని సంగతి ఇలా ఉంచుదాం!

రెండోది ఇక రెండో రకం శక్తి నిధి – దీన్ని ఒకసారి కను గొనగలిగామా – ఇక తిరుగు లేదు. తరుగు అసలే ఉండదు. జీవితంలో ఎటువంటి పరిస్థితులు సంభవించినా,

శారీరక పరిస్థితులు ఏ విధంగా మారినా దీనికి క్షయం ఉండదు. సదా అక్షయమే! దీన్ని 'దివ్యం' అని అభివర్ణించవచ్చు.

ఇది నిమ్నలోకాల్లోంచి (inconscient depths) వచ్చేది కాదు. పై నుంచి – ఈ విశ్వానికి, మానవులకు ఆదిమూలమైన దివ్యభూమికల నుండి అందుతుంది. సర్వశక్తిమయమైన, శాశ్వతమైన, శోభాయమానమైన మహా దివ్యచైతన్యం నుండి మనకు చేరుతుంది అది. మన చుట్టూ ఆవరించి అన్ని వస్తువులలో కూడ ఉంటుంది. మరి దానిని గ్రహించే విధానము? దాని కోసం ఆకాంక్షిస్తూ, అది తప్పకుండా లభిస్తుందనే నమ్మకంతో నీ అంతర ద్వారాలను తెరచికోని, నీ చేతనను విస్తరించుకొని, విశ్వచైతన్యంతో ఒకటైనప్పుడు నీవా శక్తిని గ్రహించగలుగుతావు.

జీవితంలో ఒక్కొక్కప్పుడు మానవుని కతీతమైన ఒక శక్తి వచ్చి తన చేత గొప్ప కార్యములను నిర్వహించినట్లు చాలామందికి జరుగుతూనే ఉంటుంది. అట్టి సమయాలలో ఏ పనీ కష్టమనిపించదు. దీనిని బట్టి మనుషులకు చేతకాని పని ఏమీ లేదనిపిస్తుంది. యోగము ద్వారా, ఉచ్చతరమైన శక్తి లభించటం ద్వారా ఏ ఘనకార్యమునైనా మనిషి చేయగలడు.

ఈ శక్తిని సంపాదించే విధానాన్ని పరిశీలిద్దాం! ఇది ఒక రకంగా వ్యక్తిగతం. ఎవరికి వారికే ఓ ప్రత్యేకం. తను ప్రస్తుతం ఉన్న స్థితినుండి తన అవసరాలకు అనుగుణంగా మరో అడుగు ముందుకు వేయడానికి ఇది సహకరిస్తుంది.

అయితే ఈ మార్గం కొంత సుదీర్ఘమైనదే! కొంత మంద గమనం కలది కూడాను. అయితే ఏం? వచ్చే ఫలితం మాత్రం కృషికి తగినదే అవుతుంది. ఈ శక్తి సర్వోత్కృష్టమైనది, అతి పవిత్రమైనది, స్వచ్ఛమైనది.

ఈ సాధనలో అలసట, నీరసం, అనారోగ్యం, వృద్ధాప్యం, ఆఖరికి మరణం – ఇవన్నీ మార్గంలో ఎదురయ్యే ఆటంకాలు మాత్రమే! దృఢసంకల్పంతో వాటినన్నిటినీ అధిగమించవచ్చు!

మూలం: శ్రీమాత

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

సత్యం కోసం తపన

(తనను అడిగిన ఆరు ప్రశ్నలకు శ్రీమాత సమాధానాలు)

1) *భారతదేశాన్ని గురించి మీ సమగ్ర దృక్పథాన్ని ఒక్క ముక్కలో చెప్పమంటే మీరేం చెపుతారు?*

భారతదేశానికి నిజమైన కర్తవ్యం జగద్గురు స్థానమే.

2) *అలాగే, మీరు పరిశీలిస్తున్న ఈ ప్రస్తుత పరిస్థితుల్ని వ్యాఖ్యానించమంటే దానికి ఒక ముక్కలో మీ సమాధానం ఏమిటి?*

ఈ ప్రస్తుత పరిస్థితులు – శాశ్వత సత్యాన్ని మరుగుపరిచే ఓ పెద్ద బూటకం!

3) *మీ అభిప్రాయంలో ఆ సత్యానికి నేటి వాస్తవాలకి మధ్య ఆటంకాలుగా నిలిచే మూడు అంశాలు ఏమిటి?*

అజ్ఞానం, భయం, అనృతం.

4) *స్వాతంత్ర్యం పొందిన అనంతరం భారతదేశం సాధించిన ప్రగతి మీకు సంతృప్తికరంగా ఉందా?*

లేదు.

5) *ఇటీవలి కాలంలోని మన విజయాలలో ప్రముఖమైనది ఏది? అది అంత ప్రముఖమైనదని మీరు ఎందుకు భావిస్తున్నారు?*

సత్యం కోసం తపన ప్రారంభం కావడం. ఎందుకంటే సత్యమే లేకపోతే పునాది పోయినట్లే గదా!

5) అలాగే, మన వైఫల్యాలలో అత్యంత విషాదకరమైనది ఏది? అది అంత విషాదకరమైనదని మీరు భావించడానికి కారణం ఏమిటి?

నిజాయితీ లేకపోవడమే! ఎందుకంటే – నిజాయితీ లేకపోవడం వినాశనానికి దారి తీస్తుంది.

1964, జనవరి 26

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

యోగాభ్యాసమునకు రెండు పద్ధతులు

యోగమును అభ్యసించుటకు రెండు పద్ధతులు కలవు. స్వంత తెలివితేటల మీద, ప్రయత్నం మీద ఆధారపడటం ఒకటి. శ్రీమాత సహాయమును అర్థించుట రెండవది. మానవశక్తి కంటె శ్రీమాత శక్తి ఘనమైనది. నీ మనస్సును, హృదయాన్ని, సర్వస్వము ను శ్రీమాతకు అప్పచెప్పాలి. అప్పుడు ఆమె శక్తితో అవి శక్తి మంతములై సాధన చురుకుగా సాగిపోతుంది. శ్రీమాత యందు విశ్వాసమును ఉంచి, భక్తితో ఆమె నారాధించి, కష్టములు వచ్చి నప్పుడు ఆమెను పిలవాలి. ఈ ప్రక్రియ మొదట్లో కొంతకాలం పట్టవచ్చు. ఎందుకంటే నీ చేతన నూతన రూపం దాల్చేందుకు కొంతకాలం పడుతుంది. శ్రీమాత దానిని జాగ్రత్తగా తయారు చేస్తుంది. ఈ సమయంలో కష్టములు కలుగవచ్చును. వాటిని పట్టుదలతో సాధించవచ్చును. నీలోని విభాగములన్నీ సిద్ధమై నప్పుడు శ్రీమాతయే తన శక్తితో నీ చేతనను పూర్తిగా దైవోన్ముఖము గావిస్తుంది. దైవశక్తి నీలోకి ప్రవేశించుట వలన లోపలి నుంచి పరివర్తనము మొదలవుతుంది. ఆధ్యాత్మికానుభూతులు కలుగుతాయి. జ్ఞానోదయము, దైవసాయిజ్యము సిద్ధిస్తాయి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: రాయప్రోలు లక్ష్మీప్రసాదమ్మ

సమాచార పత్రము

శ్రీఅరవిందో సొసైటీ మహారాష్ట్ర శాఖవారు సమగ్ర విద్యావిధానముపై ఆగష్టు 4-6 తేదిలలో ఒక శిబిరమును నడిపిరి. 700 మంది పాల్గొన్న ఈ శిబిరమును శ్రీ శ్రద్ధాలు రనడే (శ్రీఅరవిందాశ్రమము) నిర్వహించిరి. కాలికట్ (కేరళ) కేంద్రమువారు "శ్రీఅరవిందులు – ఒక పరిచయము" అనే లఘుదీపికను ఆవిష్కరించిరి. విద్యార్థులకు, టీచర్లకు, ఇతరులకు దీనిని ఉచితముగా పంచి

ఈ సంచికలో

ప్రాణప్రదాత సత్యజ్యోతి

మృత్యుభీతి
దాన్ని జయించే నాలుగు విధానాలు

5 డిసెంబరు 1950
అవతార సమాప్తి, మంగళం

అఖిల

అఖిల భారత పత్రిక

డిసెంబరు 2000

విషయసూచిక

ప్రాణప్రదాత సత్యజ్యోతి

దివ్యవ్యాసాలు

ఇతర వ్యాసాలు

పరిస్థితులు ప్రధానం కావు

మన కష్టసుఖాలన్నిటికి బాహ్యాపరిస్థితులే కారణమనుకోవటం పరిపాటి. కాని అంతకంటె మూలమైన 'శక్తి' ఒకటున్నది. మనుషులు ఆ శక్తి యొక్క ప్రభావానికి లోనై వారి ప్రకృతికి అనుగుణంగా స్పందిస్తారు. అట్టి స్పందనలే మనకి బాహ్యాపరిస్థితులుగా పరిణమిస్తాయి. నీ బాహ్యాజీవితమంతా నీ అంతరంగిక పరిస్థితిని ప్రతిబింబిస్తుందని నీకు తెలుసా? బాహ్యాప్రపంచం ఎంత ప్రధానమైనదో నీ అంతరంగిక లోకం అంతకంటే వెయ్యిరెట్లు ఎక్కువ ప్రధానమైనది. అంటే ఈ జీవనరంగానికి 'కంట్రోల్‌రూమ్', లోపల నీ చేతుల్లోనే ఉందన మాట. అందుకని నీ బాహ్యాపరిస్థితులు బాగుపడాల్నంటే మొదట నీ అంతరంగికాన్ని మెరుగు చేసుకో. – సంపాదకుడు

"పరిస్థితులు విషమించినయి, అందుకనే ఇట్లా జరిగింది" అని అందరూ అనుకుంటారు. కాని అది నిజం కాదు. ఒక మహాశక్తి తెర వెనక నుంచి పనిచేస్తూ ఉంటుంది. తత్ఫలితములే ఈ పరిస్థితులు, సన్నివేశాలు.

ఆ శక్తికి ఒక్కొక్కళ్లు ఒక్కొక్క విధంగా, వారి ప్రకృతానుసారంగా స్పందిస్తారు.

*

ఒకాయన తన బాధలను గురించి చాలా జాలిగా విన్నవించుకున్నాడు.

నిజమే పాపం. అయితే "జీవితంలో ప్రతిఒక్కరు వారి వారి పరిస్థితులను (బాహ్యా, ఆంతరంగిక) వారే కోరి తెచ్చుకుంటారు. వారి ఖర్మకు వారే బాధ్యులు" అని నేను నిస్సందేహంగా చెప్పగలను.

*

ప్రతి ఒక్కరు వారి బాధలకు వారే బాధ్యులు.

*

మనిషి తన పరిస్థితులు బాగా లేవని ఫిర్యాదు చేయకూడదు. ఎందుకంటే ఆ పరిస్థితులు ఆతని అంతరంగికం యొక్క ప్రతిబింబములే!

*

జీవితంలో మనిషికి ఎదురయ్యే ఘటనలు, సన్నివేశాలు ఆతని అసలు స్వరూపానికి ప్రతిబింబములు. నీకు పరిస్థితులు ఎదురు తిరిగినయి అని ఎప్పటికి అనుకోకూడదు. నీ ఉనికిని, సంస్కారాన్ని బట్టి నిశ్చయంగా నీకు అవసరమైన పరిస్థితులే కలుగుతాయి. అయితే ఇది మానవునికి అర్థంకాని విషయము. మానవ మేథను మించిన న్యాయము, సత్యము, సూక్ష్మము, లోతైన మరో ధర్మమున్నది. ఈశ్వరుడే మన జీవితానికి సారథ్యము వహించి మన జీవితాన్ని నడిపిస్తున్నాడనే సంగతి ఎప్పుడూ మరవరాదు.

*

మనిషి అంతరంగికస్థాయి – బాహ్యపరిస్థితులు

మనిషికి బాహ్యావిషయాల వలన ఎప్పటికి తృప్తి కలగదు. అంతరంగిక సంస్కారము ద్వారా నిజమైన సంతోషం కలుగుతుంది.

*

నీ బాహ్యాపరిస్థితులన్నీ అంతరంగికంతో ముడిపడి ఉంటాయన్న సంగతి మరచి పోకూడదు. నీకు "ఇక్కడ నచ్చలేదు, మరోచోటికి (పని, శాఖ, ఊరు, మొ॥) పోదాం" అని అనిపించినట్లయితే అంతరంగికంగా నువ్వు ప్రగతి పొందటం లేదన్న మాట. అట్టి అభివృద్ధి చెందినవాడు ఎట్టి పరిస్థితుల లోనైనా సంతోషంగా ఉండగలడు.

అంతరంగిక పరివర్తనము కనక జరిగినట్లయితే దాని కనుగుణంగా బాహ్యాం కూడ మారుతుంది. అంతరంగిక సిద్ధి ద్వారానే బాహ్యాజీవితం సుసంపన్నమవుతుంది.

*

సాధన చేసే వారికి బాహ్యాపరిస్థితులు అంత ముఖ్యం కాదు. వారు ఎట్టి పరిస్థితులలోనైనా శాంతి, సౌఖ్యములననుభవించ గలుగుతారు.

పరిస్థితులు పాఠాలు నేర్పుతాయి

నీలో దాగివున్న బలహీనతలను వెలికితీయుట వలన నువ్వు వాటిని గుర్తించి వదిలించుకోగలవు. అట్టి పరిస్థితులు అందుకే కలుగుతాయి.

*

సాధనలో నీ లోటుపాట్లను చూపించి నీకు తగిన శిక్షణ నిచ్చేందుకు ఒక గురువు అవసరమే. కాని *సరిగ్గా అదే ప్రయోజనము నీ పరిస్థితుల ద్వారా కలుగుతుందని తెలుసుకొని పరిస్థితులు చెప్పే పాఠాలను నవ్వుతూ కృతజ్ఞతతో గ్రహించు.*

దివ్యజీవనం కోసం సాధన చేసేవారికి ఇతరులు ఏమనుకుంటే ఏం? పురజనుల అభిప్రాయాలు వారి కనవసరము.

*

నువ్వు దైవాన్ని నిజంగా ప్రేమించినట్లయితే, మరి ఆ ప్రేమ నీ నడవడిలో ప్రతిబింబించాలి కదా. అన్ని పరిస్థితులలోను నువ్వు నెంపాదిగా, ప్రశాంతంగా వ్యవహరించాలి. *జీవితంలో నీకు ఎదురయ్యే పరిస్థితులన్నీ నీకు పాఠాలు నేర్పేందుకే కలుగుతాయి.* దైవము నీ కోసమే ఏరికోరి కలగజేసిన ప్రత్యేక సన్నివేశాలన్న మాట. ఆ విషయాన్ని నువ్వు గుర్తించుకున్నట్లయితే తొందరగా ముందుకు సాగిపోగలవు.

*

నీకు కష్టాలు కలుగవచ్చు. అగ్నిపరీక్షలే ఎదురుకావచ్చు. అవి దైవానికి దగ్గరదారులని గ్రహించాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

కష్టాలు ఎందుకు కలుగుతాయి?

సాధనలో చేదు అనుభవాలు కలుగుతూనే ఉంటాయి. యోగ మనగా మానవుడు మానవస్థాయి నుండి దివ్యమానవునిగా పరిణమించుటయే. మనిషి తనలోని పాశవిక లక్షణాలు ఒక్కొక్కటి బయటకు వస్తూవుంటే వాటిని యోగశక్తితో జయించి ప్రగతి సాధిస్తాడు. అనగా ఇది మనిషి తనతో తాను జరిపే పోరాటము. అయితే దైవము నీతోటే ఉండి నీకు తగిన శక్తినిస్తాడు గనుక కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కోవాలి.

— సంపాదకుడు

కష్టాలు వచ్చినయి అని విలపించకూడదు

యోగసాధన అనగా ముళ్లమీద నడక, కత్తిమీద సాము అని వేరే చెప్పనక్కర్లేదు. అందుకని సాధనలో ముందుకు పోదల్చుకున్న వారు కష్టాలను లెక్క చేయరాదు. *అవి యోగసిద్ధికి సోపానాలు.* కష్టాలు వచ్చేయని ఫిర్యాదు చేయటం నీ బలహీనతను, కపటత్వాన్ని సూచిస్తుంది.

*

నీకు నీ మీద విసుగ్గా ఉంటే దేవుని సహాయాన్ని అర్థించి మార్పుచెందు. ఒకవేళ నీకంత ధైర్యం లేకపోతే నీ భవిష్యత్తును దేవుని కప్పగించి మెదలకుండా పడివుండు.

కష్టాలు వచ్చినప్పుడు వాటిని నివారించేందుకు ఏమీ చేయకుండా కుయ్యో మొర్రో అని ఏడుస్తూ కూర్చోడం నీ కాలాన్ని, శక్తిని అనవసరంగా వృథా చేసుకోటమే.

కష్టాల నివారణకు ఒక్కటే మార్గం. కోరికల మీద, లౌకిక సౌకర్యాల మీద మోజు, తగ్గించుకోటమే.

*

కష్టాలను గురించి ఆలోచించవద్దు

రేపటి కష్టాలను గురించి నేడే చింతించటమెందుకు?

నీ సాధనను చిత్తశుద్ధితో అభ్యసించి ఫలితాల సంగతి దేవునికి వదిలివేయాలి.

*

ఏ రోజుకా రోజు నీ పనులు చేసుకుంటూ పో. రేపేం జరగబోతోందో అని నేటి నుండి కలవరపడటం ఎందుకు?

*

సాధకునికి ఆతురత పనికిరాదు. *దైవం మీద భారం వేసి నిష్పూచీగా ఉండాలి.* ఆయన కృపాకటాక్షముల మీద నీకు పూర్తి నమ్మకం ఉందా లేదా? నమ్మకముంటే నువ్వే మాత్రమూ ఆతురపడ కూడదు. నువ్వు భయపడితే అది నీ సమర్పణలో లోపమే. నీకు దేవుని మీద విశ్వాసం లేదన్న మాట.

*

నువ్వు కష్టాలను గురించి కనక ఆలోచించావో వాటిని పిలిచినట్లే. అటువంటి ఊహాలు ఉన్నట్లయితే నువ్వు వాటిని (కష్టాలను) ఎదుర్కొని జయించలేవు.

*

నువ్వు సాధన మొదలుపెట్టినప్పుడు హాయిగా స్వేచ్ఛగా బ్రతకటం నేర్చుకోవాలి. అంతేగాని క్షణక్షణం ఏవో ప్రమాదాలు కలుగుతాయని ఊహించుకో కూడదు.

*

కష్టాలను గురించి ఆలోచించావో 'రండి రండి' అని వాటిని నీ వద్దకు ఆహ్వానించినట్లే.

*

నీ కష్టాలను గురించి మరచి పో.
నిన్ను గురించి, నీ అభివృద్ధిని గురించి ఆయనే చూసుకుంటాడు.

*

కష్టాల నెదుర్కొని వాటిని అధిగమించాలి

When you want to make a progress, the difficulty you wished to conquer increases tenfold in importance and intensity in

your consciousness. You have only to persevere. That is all; it will pass away.

*

నేను పదేపదే చేసే హెచ్చరిక – నదురు బెదురు లేకుండా నిశ్చలంగా (quiet) ఉంటే ఎటువంటి కష్టాలనైనా దాటిపోవచ్చు.

*

కష్టాలను చిరునవ్వుతో ఎదుర్కోవాలి గాని విసుగుతో గాదు.

*

ఎటు చూసినా కష్టాలే ఎదురైనప్పుడు ఏం చేయాలో తెలుసా? దేవునికి నీకంటే వెయ్యిరెట్లు బలమున్నది అనే సంగతి జ్ఞాపకం చేసుకోవాలి.

*

దేవుడెక్కడో ఆకాశంలో లేడు. మన మధ్యనే ఉన్నాడు. మన మాయన్ని గుర్తు చేసుకుంటే అన్ని పరిస్థితులను ప్రశాంతంగా ఎదుర్కొనేందుకు మనకి శక్తి నిస్తాడు. నువ్వు ఆయన సాన్నిధ్యాన్ని గుర్తించావో, ఇక నీ కష్టాలు ఎక్కడ ఉంటయి? – మాయమయి పోతయి.

*

యోగికి మామూలు మనిషికి తేడా ఏమిటి. మామూలు మనిషి బాహ్యాపరిస్థితులను బట్టి ప్రవర్తిస్తూ వాటికి స్పందిస్తూ ఉంటాడు. యోగి అటుల గాదు. అంతరంగికంలో సుప్రతిష్ఠితమై దైవం కోసం నిరంతరం ఆకాంక్షిస్తూ ఉంటాడు. నువ్వు కూడ అదే విధంగా ఉండి అన్ని పరిస్థితులను చిరునవ్వుతో ప్రశాంతంగా ఎదుర్కోవాలి.

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

మానవుని బలహీనతలు

భయము

భయమనేది చాల చెడ్డది. అది మనని తప్పుదారి పట్టిస్తుంది.

*

భయం చాల ప్రమాదకరమైనది – పనికిమాలిన వాటిని ప్రముఖమైన వాటిగా ఎత్తి చూపిస్తుంది. గోరంతలు కొండంతలు చేస్తుంది.

*

ఈ బాటపై నడిచేవారు నిర్భయంగా ఉండాలి. నిన్ను భయపెట్టి వెనక్కి మళ్లించే శత్రువులకు లొంగి పోకూడదు. ఈ దుష్టశక్తులను నీ దరి జేరనీయరాదు.

ఈ మార్గం మీద నడిచేందుకు ధైర్యసాహసాలు అత్యావసరం. కపటమనేది పనికిరాదు. సమర్పణ అనేది బేరసారాలు లేకుండా హృదయపూర్వకంగా ఉండాలి. నన్ను రక్షిస్తాడు గనుక నేను దేవుణ్ణి నమ్ముతాను, నాకు రుజువులు చూపిస్తేనే ఆయనను నమ్ముతాను అని అనుకోవటం చాల తప్పు. నీకు కావలసినది ఈ విధమైన సంపూర్ణ విశ్వాసం. అది కనుక నీకున్నట్లయితే నీకే విధమైన ప్రమాదము రాదు.

*

అంతా దైవమయం – దైవం తప్ప అన్యమైన పదార్థం లేనే లేదు. ఇక నీకు భయమెందుకు? దైవం మాత్రమే ఉన్నాడు. నిన్ను భయపెట్టాలని చూసేవన్నీ మాయదారి పన్నాగాలు మాత్రమే.

నువ్వు నిశ్చింతగా ఉండు. నీ బాట నీ ముందర తీర్చిదిద్ది ఉన్నది. నీ జబ్బును గురించి మరిచిపో. పరమశాంతిని నీలోకి తీసుకొని రా. అంతా బాగుపడుతుంది.

*

నీలో తొందరపాటు ఆతురత ఉన్నంత కాలం భయం నిన్ను పీడిస్తూనే ఉంటుంది.

*

అనుమానం లేక సందేహం

అనుమానం పెనుభూతమనే మాట నిజమే. అది నీ ఆత్మను అణగద్రొక్కే విషం.

*

అనుమాన మనేది మన మనుగడకు పరమశత్రువు. కాబట్టి అను మానానికి నీలో లేశమైనా చోటు ఇవ్వ వద్దు.

డిప్రెషన్ (కృంగిపోవుట)

డిప్రెషన్ రాకుండా ఉండాలంటే ఏం చేయాలి? డిప్రెషను వచ్చినా దాన్ని లెక్క చేయరాదు. అది లేనట్టుగానే ఉండు.

*

డిప్రెషన్‌కు అర్థం లేదు. అది మన శత్రువు.

*

ఆ విధంగా కృంగిపోయేది నీ అహం. దానిని సరకు చేయరాదు. స్థిరచిత్తుడవై నీ పనిని చూసుకుంటూ ఉండు. డిప్రెషన్ దానం తట అదే మాయమయి పోతుంది.

*

డిప్రెషన్ వచ్చి "ఇంకేమి వద్దు వెళ్లిపోదాము" అని అనిపించి నప్పుడు నువ్వు ఉదాసీనము వహించి కఠినమైన నిర్ణయములను వేటిని తీసుకోకూడదు. నీ మామూలు కార్యక్రమాన్ని చేసు కొంటూ పోవాలి.

*

మబ్బు తెరలు కమ్మటం, గ్రహణం పట్టటం మనకు మామూలే. రాత్రి తరువాత పగలు రానే వస్తుంది అనే ధీమాతో ఉంటే నువ్వే మళ్లీ తేరుకుంటావు. నీకు నిరంతరం ఏమాత్రం చెక్కు చెదరని శాంతి కావాలంటే నువ్వు దైవానికి, ఆయన చేసే సాయానికి కృతజ్ఞతా మయమై పోవాలి. ఒకవేళ నీ కృతజ్ఞతకు కూడ మబ్బు కప్పివేస్తే నీ చీకటి రాత్రులు దీర్ఘమవుతాయి. దీని కొక్కటే మందు. నీ హృదయం లోని మాలిన్యాలను వదిలించు కొని పరిశుద్ధము కావాలనే జ్వాల నీలో వెలిగిపోతూ ఉండాలి.

అభివృద్ధి పొందాలనే తపన, తీవ్రత, సమర్పించుకోవాలనే ఆర్ద్రత నీలో వెలిగిపోతూ ఉండాలి. చిత్తశుద్ధి (sincerity) కలవారందరి లోనూ ఈ జ్వాల తప్పకుండా వెలిగింపబడుతుంది. కృతఘ్నతతో దానిని చల్లార్చ వద్దు.

*

నా సలహా ఇది: నువ్వు కష్టాలను కోరుకోకుండా ఉంటే వాటంతట అవే నిన్ను వదిలి వెళ్లిపోతాయి. అభివృద్ధి పొందేం దుకు కష్టాలను అనుభవించ నవసరము లేదు. సుస్థిరమైన సమతా భావం కలిగి సంతోషంగా ఉన్నట్లయితే నీ అభివృద్ధికి అవధు లుండవు.

*

ఈ ప్రపంచం అసలే దుఃఖమయం. ఆ దుఃఖాలను నువ్వు ఇంకా పెంచకూడదు.

*

సోమరితనం, అలసట

సోమరితనం చాల ప్రమాదకరమైన జబ్బు.

*

నువ్వు తేలికగా అలసిపోతున్నావంటే నీకు అభివృద్ధి పొందా లనే ఉత్సాహము లేదన్న మాట. నీ అలసటకి కారణం ముందుకు పోవాలనే గట్టి సంకల్పం లోపించుటయే.

నీలో ఒక జ్వాల నిరంతరం వెలిగిపోతూ ఉంటుంది అనే సంగతి ఎప్పుడు మరిచిపోకూడదు.

*

నీకు అలసట ఎప్పుడు వస్తుంది? నీ కిష్టం లేని పనులు చేసినప్పుడు. కాని సాధకునికి ఇష్టాయిష్టాలు పనికిరావు గదా. ఏ పనైనా సరే అది నీ సాధనలో ఒక సోపానమే అనే భావంతో చేస్తే అందులో ఆసక్తి పుడుతుంది. *ప్రతి పనిని ప్రాణం పెట్టి శ్రద్ధతో చేయాలి. "ఇదే నా మనుగడకు చాల ముఖ్యమైన పని" అనే ఆర్ద్రతతో చేసినట్లయితే ఏ పనైనా ఆసక్తిదాయ*

కంగానే ఉంటుంది. ఇల్లు తుడవటంలాంటి మామూలు పనులు కూడ సాధనాదృష్టితో చేసినట్లయితే నీకు మనోరంజకంగానే ఉంటాయి.

ఎంతటి ఘనకార్యమైనా సరే "దీని ద్వారా నేను అభివృద్ధి చెందుతున్నాను" అనే భావన కనక లేకపోయినట్లయితే అది చప్పగానే ఉంటుంది.

*

జీవితానికి అవసరమైన వస్తువులు

ప్రపంచంలో నీవు సాధించవలసిన కార్యాన్ని బట్టి నీ కవసరమైన సామగ్రి అంతా నీకు సమకూర్చబడుతుంది.

అంతరాత్మతో నీ సంబంధం ఎంత గాఢమైతే అంత కచ్చితమైన సాధనాలు నీకు దొరుకుతాయి. పరిస్థితులు అనుకూలిస్తాయి.

*

భోగముల ద్వారా, సంపదల ద్వారా తృప్తి నాశించకు. అప్పుడు నీకు వాటి మీద వ్యామోహం తగ్గిపోతుంది

*

లౌకిక వస్తువులకి నువ్వు బానిస వయిపోకూడదు. ఆధునిక సౌకర్యాలు లేకపోతే జీవితం గడవదా ఏమిటి? అలాగని సన్యాసం తీసుకోను కూడదు. ఒక వస్తువు దొరికినా మంచిదే దొరకక పోయినా ఫరవాలేదు అని ఉదాసీనంగా ఉండాలి. నీకు నిజంగా అవసరమైన వస్తువులు వాటంతట అవే వస్తాయి.

*

నీకు నిజంగా అవసరమున్న వాటినే అడగాలి.

*

వ్యామోహము – పేరాశ

భోగభాగ్యములకోసం ప్రాకులాడకూడదు. నీ సుఖం కోసం కొన్ని సౌకర్యాలు తప్పనిసరి అని అనుకోవటం సాధనకు చాల పెద్ద దెబ్బ.

కోరికల ద్వారా తృప్తి నాశించినట్లయితే నీ లక్ష్యానికి దూరమై పోతున్నావన్న మాటే.

*

నీకీ సంగతి తెలియదేమో. నీ కేదైనా కోరిక ఉన్నట్లయితే నీ మనస్సులో అదే కదులుతూ ఉంటుంది. ఉదా: మిఠాయి మీద ఇష్టమున్న వాని దృష్టి అంతా మిఠాయి మీదనే ఉంటుంది. అతని జీవితమంతా దాని వేటతోనే సరిపోతుంది. అతను దానికి బానిస అయిపోతాడు.

*

శరీరపోషణ కవసరమైనంత ఆహారాన్ని తినాలి. వాపిరికొట్టుగా తినకూడదు.

*

తిండిమీద వ్యామోహము, వాపిరికొట్టుతనము పనికిరావుగాని శరీరానికి అవసరమైనంత భోజనం తప్పకుండా చేయాల్సిందే. తిండి తగ్గించుకోవటంగాని మానివేయుటంగాని పనికిరావు. శరీర పోషణకి, ఆరోగ్యానికి తగినంత ఆహారాన్ని నిర్లిప్తంగా తినాలి.

*

కోరికలు

కోరికలను తీర్చగానే అవి వదిలి పోతాయనుకుంటున్నావేమో – అది చాల పొరపాటు. ఒక కోరికను తీరుస్తే మరో కోరిక తయారవుతుంది. దీని కంతు లేదు. కోరికలను జయించాల్నంటే వాటి అసలు స్వరూపము నువ్వు తెలుసుకోవాలి. వాటి అసలు మూలము నీ అధఃచేతనలో ఉంటుంది. దాంట్లోంచి బయటపడి ఉన్నతచేతనా సోపానమును అధిరోహించినప్పుడు ఇక కోరికలు నిన్ను అంటవు.

*

మానవునికి అధోప్రకృతి సహజమే, దానిని మన్నించటం న్యాయమే అని అనుకోవటం చాల పొరపాటు. అంతకంటే గొప్పదైన మహాప్రకృతి ఒకటున్నది. ఈ పాత ప్రకృతిని వదిలిం

చుకోని దాని స్థానంలో ఒక అద్భుతమైన నూతన జీవితాన్ని స్థాపించటమే మన లక్ష్యము. *నువ్వు నీ పాత ప్రకృతికి బద్ధుడవై ఉన్నంత కాలం అది జరగదు.*

అధోప్రకృతి వలన కలిగే అనర్థాలను గుర్తించి వాటిని ప్రతిఘటించటమే నీ కర్తవ్యము. అంతేగాని వాటికి తలవంచి లొంగిపోకూడదు.

*

ఒక మంచి తీర్మానము: నిన్ను దైవంనుండి దూరం చేసే పను లేవీ చేయవద్దు.

*

కోరికలగోడు వినిపించుకోకుండా, వాటిని ఏమాత్రం తృప్తి పరచకుండా ఉన్నట్లయితే వాటంతటవే తోకముడుచుకొని పారిపోతాయి!

*

కోరికలను తీర్చటం కంటె వాటిని జయించటంలోనే ఎక్కువ సంతోషం ఉన్నది.

*

నిన్ను నీవు జయించుటయే అన్నిటి కంటె గొప్ప విజయము, ఎనలేని ఆనందానికి హేతువు.

*

ముందర నిన్ను గురించి నీవు తెలుసుకో. పిదప నిన్ను అదుపు చేసుకో. దీనికి మార్గము – నిరంతరమైన ఆకాంక్షయే. నీ ఆకాంక్షను ఎంత త్వరగా మొదలుపెడితే అంత మంచిది. సాధన పరిపక్వమైనా కూడా ప్రతి క్షణం నిర్విరామంగా ఈ తీవ్రమైన ఆకాంక్ష కొనసాగవలసిందే.

*

అహం

అది కావాలి, ఇది కావాలి అని మారాము చేయుటమే అహంకారము యొక్క నిరంతర వ్యాపకము. ఆత్మ యొక్క స్వభావము

దీనికి పూర్తిగా వ్యతిరేకము – ఏది దొరికితే అదే మహాభాగ్యమంటూ కృతజ్ఞతా మయమైపోతుంది.

మనకు జరిగే ప్రతి యొక్క ఘటనా, సన్నివేశము ఒక ముఖ్యమైన పాఠం నేర్పేందుకే... ఈ మాయదారి అహంకారాన్ని వదిలించుకుంటేనే గాని మనకి శాంతి ఉండదు. ఇతరులకూ శాంతి ఉండదు. ఒకసారి ఈ అహంకారం విరగడ అయిపోయిందనుకో – అబ్బ, ఇక జీవితమెంత అద్భుతంగా ఉంటుందో చెప్పలేను.

*

కలహాలు

పోట్లాటను నువ్వు మొదలుపెట్టక పోవచ్చు. అయినా సరే – పోట్లాడటం పొరపాటే.

*

ఇద్దరు మనుషులు పోట్లాడుకున్నప్పుడు ఇద్దరిదీ తప్పే.

*

పోట్లాటలలో నువ్వు ఎవరివైపు ఉండకూడదు. వ్యక్తిగతంగా అసలే పోట్లాటలోకి దిగకూడదు. దివ్యశాంతి, సామరస్యము, వెలుగు, ఆనందములను మాత్రమే తలచుకుంటూ, నిన్ను నీవు *పరిశుద్ధము గావించుకుంటూ, దైవానికి ఒక చక్కటి సాధనము కమ్ము.*

*

ఇతరులను తప్పుపట్టే బదులు నీలో కూడ తప్పులున్నాయనే సంగతి మరచి పోకూడదు.

*

నీలోని తప్పులను గురించి నీవు బాధపడవచ్చు. ఆ బాధ ద్వారా వాటిని పోగొట్టుకొనేందుకు గట్టి తీర్మానము చేసుకోవచ్చు.

కాని ఇతరుల తప్పుల వలన కోపం తెచ్చుకోవటం ఆధ్యాత్మిక జీవితపు లక్షణం కాదు.

*

క్షుద్రభావాలు, ఈర్ష్య, కలహాలు, కోపాలు వీటి కతీతంగా ఉండాలి. ఎదటి వారు పరుషమైన మాటలు ప్రయోగించి నప్పటికి నువ్వు చిరునవ్వుతోనే వారికి సమాధాన మివ్వాలి. అటువంటప్పుడు ఏ మాత్రం చలించకుండా నోరు మెదపకుండా ఉండటమే ఉత్తమము.

*

నిందకు, దుష్ప్రవర్తనకు అతీతంగా ఉండటమే మంచిది.

*

శాంతిసామరస్యాలు యోగసాధనకు చాల ముఖ్యమైన విషయాలు. ఎదుటవానిది తప్పు, నీదే ఒప్పు అని వాదించటం ఈ సాధనకు విరోధి.

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

దివ్యవ్యాసాలు

మానవుడు – దివ్యమానవుడు

నేటి వరకు జరిగిన సృష్టికి మనిషే మకుటం. కాని సృష్టి ఇంతటితో ఆగిపోతుందా అనేదే ప్రశ్న. అది మానవమేధ కతీతమైన విషయము. మన మతాలు పురాణాలు దీనిని గురించి ప్రస్తావించ లేదు. కాని మన మిప్పుడొక యుగసంధిలో ఉన్నాము. పరిణామ ప్రక్రియ వేగాన్ని పుంజుకుంటోంది. యోగదృష్టికి రాబోవు నూతన మానవుడు (Superman) గోచర మౌతున్నాడు. అతడు బాహ్యముగా నేటి మానవుని పోలి నప్పటికి అంతరంగికంగా దివ్యజ్ఞానంతో భాసిస్తాడు. నేటి మానవునిలో ఈతని బీజము ఉండనే ఉన్నది. మనిషి తన యావచ్ఛక్తితో ఆకాంక్షించినట్లయితే ఆ దివ్యమానవుడు త్వరలో రాకపోతాడా!

– సంపాదకుడు

మానవత్వంనుండి దివ్యమానవత్వానికి మారడం అంటే స్వీయ అతిక్రమణ, మానవపరిధిని మించిన మరో రూపంగా రూపాంతరం చెందుట. మరో విధంగా చెప్పాలంటే, దానినే స్వయం సంభూతిగా (self-becoming) అభివర్ణించవచ్చును; ప్రస్తుత మానవ స్థితిలో ముకుళితమై ఉన్న దేవతామూర్తి యొక్క వికాసము అని అనవచ్చు.

దివ్యమానవత్వం అంటే మన విషయంలో అది స్వీయ అతిక్రమణే. ఎందుకంటే మనిషి – అతని ఉపరితల ఎరుకను బట్టి, అతని అసలు స్థితిని గూర్చి చెప్పాలంటే – పరిణామ ప్రకృతి రూపకల్పన చేసిన చిన్న, పరిమితమైన, ఇంకా అజ్ఞాత సంవృతమైన, గందరగోళంతో నిండిన రూపంగా భావించాలి. పరిణామక్రమంలో దివ్యమానవత్వాన్ని తీసుకొని రావాలని ప్రకృతి ఉద్దేశిస్తే, మనిషి దివ్యమానవునిగా తనంత తాను పరివర్తన చెందాలి. లేదా అతను కనుక సాధించ లేకపోయినట్లయితే, సాధించడానికి పూనుకొనకపోతే పక్కకు తప్పుకొని, అట్టి సంకల్పం, శక్తి (power) గల మరో, మరింత మహనీయమైన జీవికి దారి ఇవ్వాలి.

కాని దివ్యమానవత్వం మూలతః ఒక స్వయం సంభూతి (ఒక స్వయం పరిణామం – ఒక స్వయం వికాసం); ఎందుకంటే, మనం మనల్నిగా పరిగణిస్తున్నది కేవలం ఒక ఉపరితల మానవుడు, ఒక ఆలోచించే సజీవశరీరం; కాని ఇది ఒక తరంగం ఉపరితలం మాత్రమే. రహస్యంగా మన స్వరూపమైన పూర్తి సముద్రం కాదు.

దివ్యమానవత్వాన్ని తీర్చిదిద్దే యావత్ సాధన సంపత్తి మన రహస్య అంతరాంతరాల లోతులలోనూ, అంతకు మించి మన రహస్య ఔన్నత్యాలలోనూ ఉంది. బాహ్యతత్త్వంలో, ఆకృతిలో, వర్తమాన స్వీయచేతనావస్థలో గోచరంకాని అతిమానవుడూ, అతనిని సాధించే విధానమూ అంతా అతనిలో ఇంతకు ముందే నిక్షిప్తమై ఉన్నది. మరింత మహనీయమైన ఆత్మగా, ప్రకృతిగా మారడానికి మనిషి తానెవరో తెలుసుకోవలసి ఉంది.

(తానెవరో అన్వేషించి తన స్వరూపాన్ని సాక్షాత్కరింప చేసుకో వలసి ఉన్నది).

*

మనిషి ఒక మధ్యంతర జీవియేగాని జీవపరిణామానికి చిట్టచివరి గమ్యం కాదు. భౌమిక అస్తిత్వానికి కిరీటం కాదు. పరిశ్రమించే అనిశ్చిత ఆలోచనలు, ఈ అజ్ఞాన అపరిపూర్ణ, విభక్త చైతన్యం; శ్రమించే ఈ అస్థిర ప్రయోగం; రూపం దాల్చడానికీ పోరాడు తున్న సహస్ర విధానాల ఆవిర్భావానికీ ప్రయత్నాలు జరిగే ఈ క్షేత్రం విశ్వమహాశక్తి యాతనకు చరమాంకం కాదు. మనిషి ఒక పరిశోధనాగారం మాత్రమే. అతనిలో ప్రకృతి తన నిగూఢ, నిక్షిప్త రహస్యం కోసం అన్వేషిస్తుంది. ప్రయోగాత్మక ప్రయ త్నాలు చేస్తుంది. ఆ ప్రయత్నాల సాఫల్యమే ప్రకృతి పరమా వధిగా నిర్దేశితమైంది.

మృగం నుండి మనిషి పరిణమించినట్లు, మనిషి నుండి దివ్యమానవుడు ఆవిర్భవించ నున్నాడు.

*

మనిషి మధ్యంతర జీవి. అతను పరిణామక్రమంలో అంతిమ జీవి కాడు. అతనితో పరిణామం ప్రారంభం కాలేదు. కాబట్టి, అది అతనితో అంతమైపోదు. పరిణామ మహేతిహాసానికి అతను మకుటం కాదు. అత్యున్నత జీవీ కాదు. ప్రకృతి చిట్టచివరి ఫలి తమూ కాదు. మనిషిలో ప్రకృతి తన అత్యున్నత సంభావ్యత లను తీసుకుని రాలేదు. ప్రకృతి అతనిలో తన చైతన్యపు, అస్తి త్వపు సమున్నత శిఖరాలకు చేరలేదు. మనిషి రాక ముందు పరిణామంలో కీటకం, మృగం, అడవిమనిషి వచ్చినట్లే అతని తరువాత దివ్యమానవుడు రావలసిందే.

మనిషి దివ్యమానవునిగా రూపాంతరం చెందగలడు; ప్రస్తుతం ఏది కాదో, దానిగా మారగలడు. అయితే అది సాధిం చాలంటే మనిషి తన మానవ పరిధిని దాటి పోవాలి; ప్రస్తుతం అతని పరిమిత చైతన్యాన్నే అంటిపెట్టుకుని ఉండడంవల్ల పరిణా మంలో తదుపరి సోపానాన్ని అధిరోహించలేకపోతున్నాడు. తనలో

అంతర్గతంగా తేజరిల్లే ఆధ్యాత్మిక దైవత్వాన్ని, తనలోని ఆధ్యాత్మిక దివ్యసంభావ్యతలను సాక్షాత్క రింప చేసుకోవాలి.

ఈ పృథ్వీ ప్రకృతి మహామాయగా పరిణామ ప్రస్థానం ప్రారంభమైనప్పటి నుండి ఒక దైవరూపాన్ని మౌలిక జీవ పదార్థం తనలో బంధించింది. ఒక దైవరూపం, ఒక దైవవిశేషం ఆ సజీవ అద్భుతం నుండి బయటపడడానికి నానా యాతన పడుతున్నది. మహనీయమైన, చిచ్ఛక్తి స్వరూపమైన ఆ దైవ రూపంగా, ఆ దైవవిభూతిగా, ఆ దైవప్రాభవంగా మానవుడు రూపాంతరం చెందాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

మృత్యుభీతి – దాన్ని జయించే నాలుగు విధానాలు

అసలు మృత్యువంటే ఏమిటి? మృత్యువు శరీరానిది. కాని దానిలో అధివసించే ఆత్మది కాదు. ఆత్మ అవినాశి. సమస్త ప్రాణికోటిలోని జీవము ఏకము. దాని రూపాలు అనేకము. మరణాన్ని జయించ దలచుకున్న వారు ఈ విషయాన్ని మరచి పోకూడదు. తమ చైతన్యాన్ని ఈ శాశ్వతమైన జీవపదార్థంతో అనుసంధించుకోవాలి. ఇది మొదటి మెట్టు. ఈ భయాన్ని జయించేందుకు పలు మార్గములు కలవు. ప్రతి మనిషి తన ప్రకృతి కనుగుణమైన విధానాన్ని అనుసరించవచ్చును. మృత్యువు అనివార్యము కదా! మరి దానిని గురించి బాధ పడట మెందుకు అని తార్కికి బుద్ధి చెపుతుంది. తర్కము కాకుండా హృదయావేశము ప్రధానంగా కలవారైతే, వారి హృదయ కుహరంలోని చైత్యపురుషుణ్ణి వేటాడి పట్టుకొని ఆత్మ శాశ్వతత్వాన్ని గురించిన అభిజ్ఞతిని పొందవచ్చు. కొంత

మంది దైవం మీద గాఢమైన భక్తి కలవారు – దేవుని పాదాల చెంతనే శరణాగతిని పొందుతూ ఉంటారు. అట్టి వారు దైవ సంరక్షణలో నిర్భయంగా కాలం గడుపుతూ ఉంటారు. మృత్యువును లెక్క చేయరు. మరి కొంతమంది యోధులుంటారు. వారి నరాలలో క్షత్రియ రక్తం పారుతూ ఉంటుంది. వారు మృత్యువుని గురించి సచేతనంగా పోరాటం సలిపేందుకు వెనకాడరు.

– సంపాదకుడు

మానవుని ప్రగతిపథంలో ఎదురయ్యే అవరోధాల్లోకెల్లా మొత్తం మీద చెప్పాలంటే భయమే అతి తీవ్రమైనదని తేల్చవచ్చు. ఈ భీతి బహుముఖి, బహురూపి. తనకు తనే విఘాతం. అంతేకాదు. సాధారణంగా హేతువుకు అందనిదీ, తర్కానికి లొంగనిదీను. ఒక్కొక్కప్పుడు అకారణంగానే ఈ భీతి ఆవరిస్తూ ఉంటుంది.

భయానికే భయం

రకరకాల భయాలన్నిటిలోకీ మృత్యుభయం చాలా బలమైనది. అతిసూక్ష్మమైనది. ఇది వదిలేది కాదు – అలా వెంటాడూతూనే ఉంటుంది. ఈ మృత్యుభీతి అవచేతనలో బాగా నాటుకుని ఉంటుంది. దీన్ని పోగొట్టుకోవడం అంత సులువు కాదు. ఎందుకంటే ఇది అనేక విభిన్న అంశాల అల్లిక జిగిబిగితో గూడు కట్టుకుని ఉంటుంది. ఆత్మసంరక్షణ, ఏదైనా కొత్తదాన్ని చూస్తే దడ, అనుకోని హఠాత్సంఘటనల వల్ల కలిగే ఆవేదన, ఇవన్నీ మృత్యుభయానికి తోడుదొంగలు.

"మరణమేమీ తప్పనిసరి కాదు – కొన్ని నిబంధనలను పాటించినట్లయితే దానిని జయించవచ్చును" అనే విశ్వాసం అన్నిటి కంటె ప్రధానమైనది. ఇది శరీరంలోని కణ కణాలలో నిక్షిప్తమై ఉంటుంది. అయితే ఈ విజయాన్ని సాధించడానికి భయమే ఓ పెద్ద అవరోధం. ఎందుకంటే – దేన్ని గురించి భయపడతామో దాన్ని సాధించడం అసాధ్యం. మృత్యువంటే భయపడి బెదిరిపోయే వారిని భయమే జయిస్తుంది.

మరి ఈ భయాన్ని అధిగమించడం ఎలా?

దీనికి అనేక పద్ధతులు చేపట్టవచ్చు. అయితే ఈ సాధన మనకు సులువుగా ఉండడానికి తొలుత కొన్ని ప్రాథమిక భావనలు అవసరం.

జీవితమొకటే రూపాలు అనేకం

మొట్ట మొదటిదీ, అతి ప్రధానమైనదీ అయిన భావన ఏమిటంటే – "ఈ జీవితం అనేది ఒకటే! దానికి నాశనం లేదు" అని తెలుసుకోవడం. "రూపాలు మాత్రం అనేకం. అవి అన్నీ క్షణభంగురాలూ, బుద్బుదప్రాయాలూను," అనే ఎరుక మనస్సులో శాశ్వతంగా నాటుకుపోవాలి. అన్నిరూపాలకు అతీతమై స్వతంత్రంగా ఉండే శాశ్వత జీవితంతో ప్రతీవారూ సాధ్యమైనంత వరకు సారూప్యం సాధించాలి. సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోడానికి ఆవసరమైన మానసిక భూమిక దీనివల్ల ఏర్పడుతుంది.

భయాలన్నిటికీ అతీతంగా ఉండాలన్న విషయం ఆత్మకు అవగతమైనప్పటికి, మన శరీరం లోని కణకణాలలో భయ బీజం ప్రచ్ఛన్నంగా ఒదిగే ఉంటుంది; అదృశ్యంగా ఉంటూనే తనంతటతాను బహిర్గతం అవుతూ ఉంటుంది. ఇది హేతువాదానికి అందదు. సాధారణ మానసిక జ్ఞానం దీన్ని కనిపెట్ట లేదు. అంతరాంతరాల్లో, అంధకారంలో ఉండే దీనిని జాగ్రత్తగా పసిగట్టి దానిపై వివాదరహితమైన విజ్ఞానాన్ని ప్రసరింప జేయాలి.

జీవానికి మరణం అనేది అసలు లేనే లేదు, రూపాలు మాత్రమే రద్దు అవుతూ ఉంటాయని కదా మనం తెలుసుకున్నాం. అయితే ఈ రద్దే భౌతిక మనస్సుని భయకంపితం చేస్తుంది. విచారసాగరంలో ముంచుతుంది. అభివృద్ధి చెందే దిశలో నిత్యం రూపం మారే ఈ చర్యను ఏదీ ఆపలేదు. ఈ అభ్యుదయ పరిణామమే మృత్యువును తప్పనిసరి కాకుండా చేస్తుంది. అయితే దీన్ని సాధించడం చాలా కష్టం. దీన్ని సాధించాలంటే కొన్ని నియమాలు ఉండి తీరాలి. వాటిని బహు కొద్దిమంది మాత్రమే సాధించగలరు. అంటే మృత్యు భయాన్ని అధిగమించడానికి అనుసరించతగ్గ విధానం వ్యక్తి లక్షణాన్ని బట్టి, మానసిక స్థితిని బట్టి

ఉంటుంది. ఈ విధానాలను ప్రధానంగా నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. మళ్ళీ ప్రతీ రకంలోను అనేక విభాగాలు. అయితే ప్రతివ్యక్తి తన చికిత్సా విధానము తనే తయారు చేసుకోవాలి.

హేతువాదం

మొదటి పద్ధతి కార్య కారణ సిద్ధాంతానికి సంబంధించినది. ప్రస్తుత ప్రాపంచిక పరిస్థితిలో మృత్యువు అనివార్యమని, పుట్టిన వారు ఎప్పుడో ఒకప్పుడు గిట్టక తప్పదని, దాని సమయం ఆసన్నమైనప్పుడు అది వచ్చి తీరుతుందని, ఆ ఘడియవస్తే ఒక్కక్షణం ఆగడానికి వీల్లేదని ఎవరైనా చెపుతారు. మరణాన్ని కోరుకుంటూ దానికోసం ఎదురు చూసేవారు ఎంత తొందరపడినా లాభం లేదు. ఆ క్షణం కోసం ఆగవలసిందే! అలాగే మృత్యువు అంటేనే భయపడేవారు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది హఠాత్తుగా వచ్చి తీరుతుంది. కాబట్టి మరణఘడియ మనకు తెలియకపోయినా కూడా కచ్చితంగా నిర్ధారణ అయ్యే ఉంటుంది. ఏవో కొన్ని అతీతశక్తులు కలిగి ఉన్నవారు తప్ప మానవమాత్రులు ఎవరూ దాన్ని మార్చలేరు.

మరి, అటువంటప్పుడు, మనం తప్పించుకోలేని దాని కోసం భయపడ్డం అవివేకమని ఈ హేతువాదమే మనకు స్పష్టంగా తెలియ చేస్తుంది కదా! మరెందుకు బెడద? మనం చేయగలిగిందల్లా ఒక్కటే ఒక్కటి – మరణం అనే విషయాన్ని అంగీకరించి, ఎప్పుడు ఏది జరుగుతుందోనన్న విచారం ఏ మాత్రం లేకుండా, ఏ రోజుకి ఆ రోజే, ఏ క్షణానికి ఆ క్షణమే శ్రాయశక్తులా జీవయాత్రను కొనసాగించుటయే. హేతువాద సిద్ధాంతం ప్రకారం నడుచుకొనే మేధావులు ఈ విధానాన్ని అనుసరిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఆత్మావలోకనం

ఆవేశపరులకు మాత్రం హేతువాదం అంత లాభసాటి కాదు. కాబట్టి వారి

విధానాన్ని వారే నిర్ణయించు కోవాలి. ఇటువంటి వారు ఆత్మావలోకనం అనే రెండో విధానాన్ని ఆశ్రయించవలసి ఉంటుంది.

అన్ని ఆవేశాలకు అతీతంగా, మనలో నిరామయమై శాంతిమయమైన అంతారాత్మ లోలోపల ఓ కాంతి నిత్యం దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉంటుంది. అదే నీ చైత్యభానుడు. ఆ కాంతిని తెలుసుకోవడానికి కృషి చేయాలి. ఆ తరువాత దాని మీదే ధ్యాస నిలుపుకోవాలి. ఆ కాంతి నీ అంతరంగం లోనే ఉంది. ప్రగాఢమైన ఆకాంక్షకు దృఢమైన దీక్షను జతచేస్తే దానిని నీవు తప్పక కనుక్కో గలవు. దాన్ని కనుక్కోగలిగావో ఇక అక్షయమైన అనుభూతి స్థాయికి నువ్వు ఎదుగగలవు. ఇంతవరకు ఉన్న, ఇక ముందు కూడ ఉండబోయే శరీరానికి పూర్తిగా అతీతంగా, స్వతంత్రంగా ఉంటావు. నీ అనుభూతులు ఇక దానిపై ఆధారపడి ఉండవు.

నీ ఉనికిని అభివ్యక్తీకరించే ఓ తాత్కాలిక పరికరం మాత్రమే ఈ శరీరం అనిపిస్తుంది. మరణం అంటే లయము కానే కాదు. అది కేవలం ఓ మార్పు మాత్రమే – అని నమ్ముతావు. దాంతో భయాలన్నీ వెంటనే మటుమాయమై పోతాయి. అప్పుడు నిరామయమైన పరిశుద్ధమైన స్వేచ్ఛా మానవునిగా నువ్వు నీ మనుగడను సాగించగలవు.

శరణాగతి ఇది మూడో పద్ధతి – దేవునిపై భక్తి విశ్వాసాలు ఉన్నవారికి, వారి ఇష్టదైవం కోసం తమను తాము సమర్పించుకొనే వారికి అనువైనది. అటువంటి వారు సంపూర్ణంగా దైవంలో భాగమే అయిపోతారు. వారి జీవితం లోని అన్ని సంఘటనలు దైవ నిర్ణయాలే! వారు వాటిని కేవలం పూర్తి విధేయతతోనే కాకుండా కృతజ్ఞతతో కూడా స్వీకరిస్తారు. అటువంటి వారు తమకు సంభవించేవన్నీ తమ ఇష్టదైవానికే అనుకుంటారు. వారికి తమ దైవం పట్ల అనూహ్యమైన ప్రగాఢ విశ్వాసం ఉంటుంది. అంతేకాదు, వారు వారి ఇష్టదైవంతో వైయక్తికమైన సంబంధాన్ని కూడా కలిగి ఉంటారు. తమ అభీష్టాన్ని

ఆ దైవానికి పూర్తిగా అర్పిస్తారు. జీవన సంఘటనలకు, ఆఖరికి మరణానికి సైతం లొంగకుండా పూర్తి స్వతంత్రంగా ఉంటూ భగవంతుని అద్భుతమైన ప్రేమను, రక్షణను వారు అనుభూతి చెందుతూ ఉంటారు.

సంపూర్ణ శరణాగతి భావంతో తమ ఇష్టదైవం పాదాల చెంతనే ఉన్నట్లు వారు నిత్యం అనుభూతి చెందుతారు. భగవంతుని కరకమలాలలో ఊయలలూగుతూ పూర్తి రక్షణను అనుభవిస్తారు. ప్రశాంతం, ఆహ్లాదం, ఆనందం ఆవరించుకుని ఉన్న అటువంటి మహానుభావుల మనస్సులో భయానికి తావు ఎక్కడిది? అయితే అటువంటి యోగాన్ని ఎంతమంది సాధించగలరు?

సాహసం

ఇక మిగిలింది – ఆఖరిది. పుట్టుకతోనే క్షత్రియ లక్షణాలు కలిగి ఉండేవారు – తమ జీవితాన్ని ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించలేరు. శాశ్వతంగా ఉండడం తమ హక్కు అనేది వారి నరనరాల్లో జీర్ణించుకుపోయి ఉంటుంది. ఈ భూలోక జీవితం సంపూర్ణమని, శాశ్వతమని భావిస్తారు. మరణం అనేది ఒక వ్యసనం అని భావించడం వారి నైజం. ఆ వ్యసనాన్ని జయించాలన్న ధ్యేయంతోనే తాము జన్మించినట్టు వారు వ్యవహరిస్తారు.

అయితే దొంగచాటుగా దాడి జరిపే అతి క్రూరమైన సైన్యంతో నిరాశాపూరితమైన పోరాటాన్ని వారు ఈ కృషిలో జరపవలసి వస్తుంది. ఈ పోరాటాన్ని వారు నిత్యం, క్షణ క్షణం కూడా జరపవలసి వస్తుంది. ఎటువంటి పరిస్థితులకైనా తల వొగ్గని సాహసం కలవారే దీన్ని చేపట్టాలి. ఈ పోరాటానికి చాలా పార్శ్వాలు ఉంటాయి. పరస్పరం కలిసిపోయి ఒకదానికి ఒకటి దోహదపడే అనేక స్తరాలపై ఈ పోరాటం ఉంటుంది.

మానసిక పోరాటం: వీటిలో మొట్టమొదట చేయవలసిన పోరు చాలా ఘోరమైనది. అది మానసికమైన పోరాటం. సామూహిక సమిష్టి అభిప్రాయలపై జరిగే సంకుల సమరం. ఈ సమష్టి అభి

ప్రాయం ప్రకృతి ధర్మాన్ని కూడా లెక్క చేయదు. వేలవేల సంవత్సరాల అనుభవం ఈ సామూహిక అభిప్రాయాన్ని ఆవరించి ఉంటుంది. దాంతో అది ఆదేశమై తిరుగులేని నిర్ణయంగా మారిపోతుంది. అది ఎటువంటి మార్పూ లేకుండా అలా కొనసాగుతూనే ఉంటుంది.

"మృత్యువు అనివార్యం. అలా కాకుండా మరోలా అనుకోవడం వెర్రితనమే అవుతుంది" అని ఏకకంఠంతో ఆలపించే ఈ బృందగానం నేటి వరకు సాగుతూనే ఉంది. అప్పటికీ ఓ మహా వైజ్ఞానికుడు "భవిష్యత్తుపై ఆశ" అంటూ మృత్యువుకు వ్యతిరేకంగా ఓ భిన్న స్వరాన్ని ఆలపించడానికి సాహసించాడు కూడా. అయినా సరే! ఆ బృందగానం యథాతథంగా నిరాఘాటంగా సాగుతూనే ఉంది.

ఇక, మతాల విషయాని కొస్తే – "మానవుణ్ణి మర్త్యునిగా సృష్టించాడు కనక మానవులకు భగవంతుడు మృత్యువునే నిర్ణయించాడు" అనే సిద్ధాంతం పైనే చాలా మతాలూ, వాటి శక్తియుక్తులు ఆధారపడి ఉన్నాయి. చాలా మతాలు మరణాన్ని ఓ విమోచనంగా, ఓ మోక్షంగా, ఇంకా కొన్ని సందర్భాలలో అయితే ఓ వరంగా రూపొందించాయి.

వారి ఆదేశం ఏమిటంటే – "సర్వోత్తముడైన భగవంతుని అభీష్టాన్ని నెరవేర్చు! ఎటువంటి భిన్నస్వరాలూ లేకుండా మృత్యువును ఆహ్వానించు. అప్పుడు నీకు శాంతి సంతోషాలు కలుగుతాయి". అయితే మృత్యువును జయించాలనుకునే వారి పట్ల మాత్రం ఈ ప్రబోధాలు ఏమీ ప్రభావం చూపలేవు. ప్రగాఢమైన సత్యంపై ఆధారపడిన వారి వ్యక్తిత్వంపై కూడా ఇవి ఏమాత్రం ప్రభావం చూపలేవు.

అనుబంధాలపై దాడి: ఇక రెండో యుద్ధం. తను సృష్టించుకున్న అనుబంధాలు అన్నిటి పైనా సంగ్రామం. తన ప్రేమపై పోరు. ఎంతెంతో ఓర్పు నేర్పులతోనూ, ఎన్నెన్నో వ్యయప్రయాసలతోనూ నీవు నీ గృహాన్ని నిర్మించుకుంటావు. అలాగే ఉపాధిని సాధించు

రుంటావు. సామాజిక, సాహిత్య, కళారంగాల్లోనో, వైజ్ఞానిక రంగంలోనో, అదీగాకపోతే రాజకీయరంగంలోనో కృషిచేసి ఒక చక్కని వాతావరణాన్ని ఏర్పరచుకుని ఉంటావు. నువ్వు కేంద్రంగా అవీ, వాటి కేంద్రంగా నువ్వూ పరస్పరం ఆధారపడి ఉంటారు. నీ స్వయంకృషితో సమర్థనీయమైన సామాజిక జీవితాన్ని నిర్మించుకుని ఉంటావు. నీ చుట్టూ ప్రజలు, స్నేహితులు, సహాయకులు నీ జీవితాన్ని గురించి తలచుకుంటూంటే – వారందరూ నీ మనుగడలోను, నీ మనస్సులోను, నీ భావాల్లోను ఓ ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించుకొని ఉంటారు.

ఇవన్నీ ఒక్కసారి హఠాత్తుగా తొలగిపోతే నువ్వు భరించలేవు. నీ నుండి ముఖ్యమైన ప్రతీభాగం అదృశ్యం అయినట్లు విలవిల్లాడి పోతావు.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే –

వాటినన్నిటిని వదిలేయమని కాదు. అవి నీ ధ్యేయాన్ని, నీ జీవిత పరమావధిని రూపొందించాయి. కాబట్టి వాటిని అలానే ఉంచి వాటిపై మమకారాన్ని పెంచుకోవడం మాత్రం మానుకో! ఇలా చేస్తే అవి లేకుండానే జీవించగలనన్న భావం నీలో ఏర్పడుతుంది. అవి నీ నుండి తొలగి పోయినా, నువ్వు కొత్త పరిస్థితుల్లో కొత్త జీవితాన్ని పునర్నిర్మించుకో గలవు. దీన్ని గనక నువ్వు నిరంతరం చేయగలిగితే – దాని ఫలితం అవినాశం! శాశ్వతం!

ఈ స్థితిని ఇలా నిర్వచించవచ్చు: ప్రతీ పనిని అత్యంత శ్రద్ధతో, దీక్షతో నిర్వహించగలుగుతూనే నువ్వు వాటి పట్ల కోరికగాని, మమకారంగాని లేకుండా స్వేచ్ఛగా ఉండగలవు. మృత్యువు నుండి తప్పించుకోవాలని నీకు అభిలాష ఉంటే నశించే వాటి వేటితోనూ నీకు అనుబంధం ఉండకూడదు.

మాత్రాస్పర్శలు: అనుబంధాల తరువాత ఇక అనుభోగాలు – జ్ఞానేంద్రియాలకు సంబంధించినవి. వీటినే విషయాలు, మాత్రాస్పర్శలు (sensations) అంటారు. వీటితో యుద్ధం ఏమాత్రం

దయాదాక్షిణ్యాలు లేని యుద్ధం. ఈ యుద్ధంలో ఎదురయ్యే ప్రతిఘటనలు ఓ పట్టాన లొంగేవి కావు. అవి అతిసున్నితమైన బలహీనతను పసిగట్టి, ఎదురులేనిచోటు చూసి దెబ్బతీస్తాయి. నువ్వు ఏవైనా విజయాలు సాధించి ఉన్నా, అవి అన్నీ క్షణ భంగురాలే! ఆ పోరాటాలు మళ్ళీమళ్ళీ నిరవధికంగా జరుగు తూనే ఉంటాయి. నువ్వు ఏ శత్రువు పై విజయం సాధించానని అనుకుంటావో, ఆ శత్రువే తిరిగి మళ్ళీమళ్ళీ నీపై దెబ్బ తీస్తుం డడం జరుగుతూనే ఉంటుంది.

ప్రతీ పరాజయాన్ని, ప్రతీ ప్రతిఘటనను, ప్రతీ వ్యతిరేక తను, ప్రతీ నిరుత్సాహాన్ని ఎదుర్కొని నిలదొక్కుకో గలగడానికి నువ్వు దృఢమైన స్వభావం కలవాడవై ఉండాలి. సడలని సహనశీలివై ఉండాలి. ప్రాపంచిక సంఘటనల్లోను, దైవిక అను భవాల్లోను సదా వైరుధ్యాలతో మనుగడ సాగిస్తూండడం వల్ల నువ్వు నిత్యం తీవ్రమైన సంక్షోభానికి గురి అవుతావు.

శరీరంతో సమరం: మనం ఇప్పుడు పోరాటాలు అన్నిటిలోకి అతిభీకరమైన యుద్ధం దగ్గిరికి వచ్చాము. అది శరీరంతో పోరాటం. ఊపిరి సలపనివ్వని అంతులేని సంగ్రామం ఇది. పుట్టుకతో ప్రారంభమైన ఈ సమరం ఒకవైపు శరీరక్షయం మరోవైపు పరివ ర్తనముల మధ్య ఏదో ఒకటి పరాజయం పొందేవరకు కొనసా గుతూనే ఉంటుంది. ఈ రెండు విభిన్న అంశాల వైరుధ్యం మనలో బాహాటంగా, స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. అయితే వాస్తవా నికి మనం ఈ భూమి మీద పడిన ఉత్తర క్షణం నుంచే వీటి మధ్య సంఘర్షణ జరుగుతూనే ఉన్నది.

ప్రతీ ఆటంకానికి, ప్రతీ రోగానికి, ప్రతీ అంగవైకల్యానికి, ఆఖరికి ప్రతీ ప్రమాదానికి కూడా శరీరక్షయమే కారణమౌతుంది. అలాగే పెరుగుదల, క్రమానుగతమైన ప్రగతి, దాడిని ఎదుర్కొనే ధైర్యం, అనారోగ్యం నుండి కోలుకోవడం, విపరీత పరిస్థితుల నుండి మామూలు పరిస్థితిని తిరిగి పుంజుకోవడం వంటి వాటితో

పాటు ప్రతీ అభ్యుదయ గమనానికి కూడా పరివర్తనా శక్తి కారణమౌతుంది.

చేతన పెరుగుతున్నకొద్దీ ఈ రెండు విభిన్న వ్యతిరేక చర్యల మధ్య సంఘర్షణ ఉగ్రరూపం దాలుస్తుంది. మార్పా? మరణమా? గమ్యాన్ని ఏది ముందు చేరుకుంటుంది? ఏమో! ఏం చెప్పగలం! వేచి చూడవలసిందే!

ఈ భీకర పోరాటం గురించి మరింత వివరంగా చెప్పాలంటే –

ఇది ఒక అంతులేని పెనగులాట.

ఒకవైపు – పునర్నిర్మాణ శక్తిని ఆహ్వానించి, ఆ శక్తిని కణాలు స్వీకరించే సామర్థ్యాన్ని పెంచేందుకై జరిపే నిరంతర దృఢ దీక్ష.

మరోవైపు – పవిత్రతను, సుస్థిరతను ఇవ్వగల ఉన్నత ప్రేరణలు అన్నింటిని ధ్వంసం చేసే వినాశక శక్తుల చర్యలను ఎదుర్కొనే అకుంఠిత మహోద్యమం.

ఇది అదృశ్యంగా జరిగే ఒక మొండి పోరాటం. దీనిలో ఫలితాలు పైకి కనిపించక పోవడం సర్వసామాన్యం. పోనీ కొంత వరకైనా విజయం సాధించ గలిగామా అంటే – దానికి బాహ్యమైన చిహ్నాలు ఏవీ ఉండవు. అలా అనిర్దిష్టంగానే ఉండి పోతాయి.

చేసిన ప్రతీ పనీ మళ్ళీమళ్ళీ చేయవలసి వస్తుంది. అడుగుతీసి అడుగు వేసేసరికి ఎక్కడికక్కడే ఆటంకాలు, అవరోధాలు. ఓ రోజున ఓడించిన శత్రువు మరునాడు మళ్ళీ విజృంభిస్తాడు. సంపూర్ణ విజయం సాధించ గలిగితే మాత్రం విజయం సాధ్యం.

మరి దీనికి ఎంతో కాలం పడుతుంది. వ్యతిరేకశక్తుల బలం పెరుగుతూ ఉంటే ఏళ్ళకి ఏళ్ళు అలా నిర్దాక్షిణ్యంగా కాలచక్రంలో కలిసిపోతూ ఉంటాయి.

అయితే ఒక రక్షకభటుడు వలె నీ చైతన్యం కాపలా కాస్తూంటుంది. నువ్వు అన్నిటిని భరిస్తూ ఉండాలి. నిఘా ఏ

మాత్రం సడలకుండా, సాధించ వలసిన ధ్యేయం పట్ల విశ్వాసం తగ్గ కుండా, ఏమాత్రం భయకంపితుడవు కాకుండా ఉండాలి. నిన్ను ప్రోత్సహించి సహకరించేవాటి నుండి సహాయం పొందుతూ ఉండాలి.

ఇలా ఉంటూ చివరికి విజయం సాధిస్తే అది శాశ్వతమైనదే అవుతుంది.

మృత్యుభయాన్ని జయించే మార్గం మరోటి ఉంది. అయితే అది బహు కొద్దిమందికి మాత్రమే సాధ్యమౌతుంది.

ఇక్కడ దీనిని పేర్కొనడం కేవలం సమాచారం కోసమే. అది ఏమిటంటే –

బ్రతికి ఉండగానే మృత్యు సామ్రాజంలోకి సాహసంగా ప్రవేశించి అక్కడి నుండి తిరిగివచ్చి మళ్ళీ భౌతిక శరీరం లోనే ప్రవేశించాలి. ప్రాపంచిక జీవితాన్ని తిరిగి కొనసాగించాలి. అయితే అటువంటి దానిని సాధించాలంటే – వారు ఉపాసకులై ఉండాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: పున్నమరాజు నాగేశ్వరరావు

1972 డిసెంబరు 30 న శ్రీమాత సంభాషణ

అయితే కొత్త సంవత్సరం వస్తోందన్న మాట....

ప్రశ్న: కొత్త సంవత్సరం గురించి మీకేమనిపిస్తోంది?

(*కొంచెం మౌనం తరువాత*) పరిస్థితులు పతాకస్థాయికి చేరుకున్నాయి. అందుకని, ఒకవైపు నుంచి చూస్తే, వాతావరణమంతా... దాదాపుగా భావింపనలవి కానటువంటి... ఒక తేజస్సు దిశగా పరివర్తన చెందుతున్నట్లనిపిస్తుంటే.... మరోవైపునించి – ఏ క్షణాన్నైనా మరణించ వచ్చుననే భావన.... 'మరణం' కాదు... శరీరం లయం అవవచ్చుననిపిస్తోంది. అందుకని, ఈ రెండు

భావనలూ ఒకేసారి ఓ రకమైన చైతన్యాన్ని కలిగిస్తున్నాయి. (శ్రీమాత తల ఊపుతూ) పాత విషయాలన్నీ కుర్రతనపు చేష్టల్లాగా, పసితనంలా, అజ్ఞానంతో అవివేకంతో ఉన్నట్లనిపిస్తాయి – అంతరంగంలో మటుకు, బ్రహ్మాండంగా, అద్భుతంగా ఉంది.

అందుకే శరీరం – ఈ శరీరం ఒకే ఒక ప్రార్థన చేస్తుంది – అది ఎల్లప్పుడూ ఒకటే.

నిన్ను తెలుసుకుందుకు యోగ్యముగా చేయి,
నిన్ను సేవించుటకు అర్హురాలినిగా చేయి,
నీవు అగుటకు తగినట్లు చేయి.

మౌనంలోనూ – ధ్యానంలోనూ.... వినూత్నంగా – నాలో ఒక అపూర్వమైన అద్భుతమైన శక్తి ఆవిర్భవించడం తెలుస్తోంది. ఏదీ అసాధ్యం కాదు (శ్రీమాత ఆకాశం వైపు చేతులు సాచారు)

(నిశ్శబ్దం)

సరే, మీకేమీ ప్రశ్నలు లేకపోతే.... మీకు నిశ్శబ్దమే.... చేతనాపరిపుష్టమైన నిశ్శబ్దమే కావాలంటే....

ప్రశ్న: కానీ, నే చేసేది సరైనదో కాదో నాకు తెలీదు.

(కొద్దిసేపు మౌనం తర్వాత) సరే, నీవు భగవంతునితో సంబంధం ఏర్పరుచుకోవాలంటే ఏం చేస్తావు?

ప్రశ్న: నన్ను మీ పాదాల వద్ద అర్పించుకుంటాను.

(శ్రీమాత చిరునవ్వు చిందించి అంతర్ముఖులయ్యారు)

అనువాదం: బి. వరలక్ష్మి

ఆరోగ్యపత్రం

జీవితంలో తలవని తలంపుగా ఏదీ జరగదు. పరిస్థితులు పైకి ఎంత ఘోరంగా కనిపించినప్పటికీ అవి నిన్ను ఒక నిర్దిష్టమైన ప్రయోజనం వైపే నడిపిస్తాయి. నీ మనస్సుకావల గల మహా శక్తిని – దేవుణ్ణి నమ్ముకున్నట్లయితే ఆయనే నీకు జీవితంలో ఎదురయ్యే పరీక్షలను తట్టుకుండే శక్తిని, నీ బలహీనతలను జయించే దార్ఢ్యమును ప్రసాదిస్తాడు. నీ జీవితంలో జరిగే సమస్త మైన సంఘటనలు నీకు భగవచ్చైతన్యాన్ని కలగజేసి తద్వారా సమతౌల్యము, ఆరోగ్యము, శాంతి సౌభాగ్యాలను ప్రసాదించేం దుకే ఒక మహాశక్తిచే సమకూర్చబడ్డాయి.

*

జబ్బు చేసినప్పుడు డాక్టర్లు ఏవేవో మందులు ఇస్తారు. కాని రోగి యొక్క విశ్వాసమే ఆ మందు పనిచేసేందుకు మూలకారణము.

దైవానుగ్రహము మీద పూర్తి నమ్మకమున్నట్లయితే నీకే జబ్బులు రావు!

*

భువిపై దైవసామ్రాజ్యాన్ని స్థాపించేందుకు ముఖ్యమైన అవరో ధము ఏమిటో తెలుసా? నీ మనస్సు. తనకే అన్నీ తెలుసు అనే ఈ పొగరుబోతు మనస్సు రాజ్యమేలుతున్నంత వరకు అది (దైవసామ్రాజ్యం) అసంభవం.

*

మానవాళిని ముందర ఈ మనోవైకల్యం నుండి తప్పించాలి. అప్పుడే అంతకంటె అతీతమైన అతిమానస చైతన్యం (Supra-mental consciousness) ఆవిర్భావమై, మనస్సు ద్వారా మనకు దూరమైపోయిన సహజ ఆరోగ్యము తిరిగి చేకూరుతుంది.

*

మనస్సు అనే ఈ బ్రహ్మరాక్షసి మనని డాక్టర్లకి మందులకి బానిసగా చేసింది. రోజు రోజుకి ఈ రోగాల మొండితనం పెరిగి

పోవటం, కొత్త కొత్త రోగాలు పుట్టుకు రావటమే దీనికి కారణం.

ఈ రోగాల పీడ పోవాలంటే నువ్వు మనస్సు యొక్క పెత్తనాన్నుంచి తప్పించుకోవాలి. దానికి మార్గమో? *నిన్ను నీవు దైవానికి సమర్పించుకొని, ఆయన ప్రభావానికి లోనై, ఆయన శక్తిని నీలోకి ఆహ్వానించుటయే.*

*

నేటి కాలంలో మానవునికి మందులే దేవుళ్లు. ఈ పరిస్థితిని మనం బాహ్య సవరణల ద్వారా మార్చలేము. ఒక్క దైవమే అందుకు సమర్థుడు. నువ్వు ఎప్పుడైతే మనస్సు అనే ఖైదులోంచి తప్పించుకొని దివ్యకాంతి కిరణాలలో స్నానం చేసి దైవంతో సంగమించెదవో అప్పుడే ఆయన నిన్ను బాగు చేయగలడు. నీ శరీరం యొక్క సహజమైన సమతౌల్యాన్ని ఆరోగ్యాన్ని ఇవ్వ గలడు.

అతిమానస రూపాంతరీకరణమే (Supramental transformation) శరీరానికి సరియైన చికిత్స.

*

శ్రీఅరవిందులు మన మెటువంటి ఘోరమైన జీవితం గడుపు తున్నామో కళ్లకు కట్టినట్లుగా చూపించారు[1]. ఎందుకో తెలుసా? మనలో 'ఎడతెగని ఆకాంక్షను' ప్రేరేపించి, నిజచైతన్యాన్ని కలి గించేందుకూ, తద్వారా దేవుని సర్వశక్తిమంతత్వంలో పూర్తి విశ్వాసము, విముక్తి కలిగించేందుకు.

మార్చి 1970

మూలం: శ్రీమాత
అనువాదం: ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి

---

[1] శ్రీఅరవిందుల 'మెరుపులు – తళుకులు' అనే రచనలోని 'వైద్యము వ్యాధులు' అనే విభాగాన్ని గురించి శ్రీమాత చేసిన వ్యాఖ్యానం

శ్రీఅరవిందులు:

"నేనిక్కడే ఉన్నాను, నేనిక్కడే ఉన్నాను"

(శ్రీఅరవిందుల నిర్యాణపు వృత్తాంతము)

"అతిమానస తత్వాన్ని అవతరింప జేయుటయే మీ జీవితపు పరమోద్దేశమా?" అనే ఒక సాధకుని ప్రశ్నకు శ్రీఅరవిందులు "అవును" అని సమాధాన మిచ్చారు. అందుకని వారు దీర్ఘాయువుతో చిరకాలం జీవించగలరనే భావం అందరిలోను నాటుకుపోయింది. అటువంటప్పుడు వారు దేహాన్ని చాలించారనే వార్తను అకస్మాత్తుగా వినగానే చాలమంది నిర్ఘాంతపోయారు. కాని తరువాత నిదానంగా ఆలోచించగా శ్రీవారి జీవితం అనుకోని మలుపులు తిరగటం క్రొత్త కాదని వారి కనిపించింది. వారి జీవితం మొదట్నుంచి విచిత్రంగానే నడిచింది. ఏడేళ్ల పసివయస్సు నుండే జన్మభూమికి దూరంగా ఇంగ్లండులో విద్యాభ్యాసము, పాశ్చాత్య సాహితీ సంస్కృతుల ఆకళింపు; భారతదేశం తిరిగి వచ్చాక బరోడాలోను కలకత్తాలోను ఉద్యోగాలు; వాటిని విరమించి స్వాతంత్ర్య పోరాటంలో తలమునకలు; ఆలీపూరు బాంబు కేసులో నేరారోపణ, కారాగారవాసము, విడుదల, కారాగారంలోనే యోగానుభూతులు, వాసుదేవ దర్శనము; దైవాదేశాన్ని అనుసరించి రాజకీయాలకు స్వస్తి, పాండిచేరి ప్రయాణము; ఆధ్యాత్మిక జీవితము, – ఒక నూతన యోగపు ఆవిష్కరణము – అతిమానసము (Supermind), ఒక నూతన సిద్ధి – అధిమానసము (Overmind), ఏకాంతవాసము, వారి గదిలోనే ప్రమాదము, కాలియెముక విరుగుట; దేహత్యాగము. వారి ఆశ్రమము ఒక గొప్ప ఆధ్యాత్మిక శక్తికి నిలయము. శ్రీఅరవిందులే ఆ మహాశక్తికి మూలమూర్తి వారి ప్రసన్నత వలన ఆధ్యాత్మిక అవరోధములు తొలగిపోవుటయే కాక శారీరక రుగ్మతలు నయమగుటకూడ వారి మహిమకు తార్కాణము. మరి అంతటి మహాపురుషుడు మామూలు మనిషి

వలె వ్యాధి సోకి మరణించటం లోని రహస్యమేమిటో వారిని సేవించిన డా॥ నిరోద్ బరన్ గారి వ్యాసంలో చదవండి.

— సంపాదకుడు

> *అనుకోని సంఘటనలు శ్రీవారి జీవితంలో మామూలే*

శ్రీఅరవిందుల జీవితం గురించి, వారి యోగసాధన గురించి ప్రపంచమంతటా ఆసక్తి పెరుగుతోంది అనుకుంటున్నప్పుడు వారు ఈ భౌతిక ప్రపంచంనుండి అదృశ్యమైనారు. స్థూలదృష్టికి ఇది ఒక భయంకరమైన విధిచేష్టితంగా కనిపిస్తుంది కాని వారి జీవితాన్ని పరిశీలిస్తే ఇలాంటి అనుకోని సంఘటనలు ఎన్నోమార్లు సంభవించినాయి. వారి అభిమతానుసారమే ఇట్లా సంభవించిందేమో అనుకోవడానికి వీలుగా వారి ఆధ్యాత్మిక జీవన శిఖరారోహణలో ప్రతి మలుపూ ఇలాంటి ఏదో ఒక అనుకోని సంఘటనతో ముడిపడి ఉంటుంది. వారి జీవితం ఒక సమున్నత స్థితిని చేరుతున్నది అనుకుంటున్న సమయంలోనే వారు రాజాలాంటి I.C.S అవకాశాన్ని త్రోసిపుచ్చి సాధారణ స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగంలో స్థిరపడటం, అక్కడ కూడా ప్రజల అభిమానం చూరగొని వారి కీర్తి నలుదిక్కులా వ్యాపిస్తున్న తరుణంలోనే దాన్నంతా వదులుకొని, తెర వెనుకకి వెళ్లి రాజకీయ రంగంలో అందరినీ ఆశ్చర్య చకితులను చేసే విధంగా అత్యద్భుతమైన కార్యసాధన; జైలుగోడల నీడల్లో నిర్బంధింపబడి కూడ మిరుమిట్లుగొల్పిన క్రాంతి దర్శనాన్ని, మహోన్నత ఆధ్యాత్మిక అనుభవాలని పొందడాన్ని గమనింపవచ్చు. జైలునుంచి విడుదల కాగానే, వారి సముదాత్త త్యాగము, పరిణత మార్గదర్శకత్వముచే మేల్కొన్నజాతి యావద్భారత నాయకత్వాన్ని ఆయనకు అప్పగించడానికి సన్నద్ధమైంది. అదే సమయాన మరోసారి అదృశ్యమై అజ్ఞాతంగా పాండిచ్చేరి ఆశ్రమంలో దీర్ఘకాలం గడిపినారు. 1926 లో వారు ఆధ్యాత్మిక సాధనలో మహోన్నత విజయాన్ని సాధించి, తమ గొప్పదనాన్ని నలుదిక్కులా వ్యక్తం చేసే విజయపతాకను ప్రతిష్ఠింప గలిగారు. కాని శిష్యులందరూ

నిరాశతో నివ్వెరపడగా ఏకాంతవాసంలోనికి వెళ్ళిపోయినారు. అంతేకాదు. ఇప్పుడు అందర్నీ హతాశులను చేసే పెద్ద వ్యాఘాతంగా మనని శాశ్వతంగా వదిలి వెళ్ళిపోయినారు. శ్రీఅరవిందులు ఎప్పుడూ కీర్తినీ ప్రచారాన్నీ కోరలేదు. వారు పొందిన మహోన్నత ఆధ్యాత్మిక విజయాలన్నీ నిశ్చలమైన ఏకాంతంలో సాధించినవే. కానీ వారు ఆ ఏకాంతం నుండి తిరిగివచ్చిన ప్రతిసారీ ఒక గొప్ప కాంతిని, ఒక అద్భుత దీప్తిని, అతివిశాలమైన, శక్తివంతమైన జ్ఞానాన్ని ఈ భూమ్మీదికి తీసుకు వచ్చేవారు.

దుర్ఘటనలు కూడ వారి విషయంలో లక్ష్యసాధనాలే

మహాయోగివైన శ్రీఅరవిందులు ఇతర యోగుల వలె యోగమార్గం ద్వారా స్వచ్ఛందంగా దేహత్యాగం చెయ్యకుండా బాధామయమైన ద్వారం గుండా ఎందుకు నిష్క్రమించినారు? ఏ ప్రయోజనం కొరకు అట్లా చేశారు? అన్న ప్రశ్నలు ఉదయిస్తాయి. ప్రయోజనం లేకుండా శ్రీఅరవిందులు ఏ పనైనా చేస్తారనడం అసంభవం. అసురమైన శక్తి నెదుర్కోవడానికి ఒక్కోసారి వెనక్కు తగ్గవలసివస్తే ముమ్ముందు రావలసిన ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి అలా చేయవలసి వచ్చేదని వారే అన్నారు. జీవిత రహస్యాల నన్నింటినీ తన యోగశక్తితో, మహోన్నత సాధనతో భేదించి యోగేశ్వరుడుగా కీర్తింపబడిన ఆ మహాయోగికి, మృత్యువు భయంకరమూ కాదు, గూఢమైన విషయమూ కాదు, తప్పనిదీ కాదు. సాధారణ మానవుల మాదిరిగానే ఆయన ప్రాణత్యాగం చేశారంటే దానికి ఏదో బలమైన కారణం ఉండే ఉంటుంది. ఆధ్యాత్మిక శక్తిమంతములైన తన భుజస్కంధాలపై మానవాళిని మోస్తూ, తమస్సు నుండి రహస్యాల నన్నింటినీ కైవసం చేసికోవడానికి, తమ యోగాన్ని పరిపూర్ణం చేయడానికే శ్రీఅరవిందులు ఆ నిర్ణయం తీసికొని ఉంటారు. మృత్యుబాధను స్వచ్ఛందంగా అనుభవించినారంటే, తమ పరిపూర్ణ విజయానికి అది మార్గంగా వారు భావించారు. మానవజాతిని సంబోధిస్తూ

"నేను తమశ్శక్తుల దుర్గాన్ని కైవసం చేసుకొని అమృతత్వ స్వర్ణబీజాన్ని మీకోసం తీసుకువచ్చినా" నని చెప్పడానికే అయి ఉంటుంది.

వ్యాధి మొదటి చిన్నెలు

ఈ మహోన్నత త్యాగప్రాధాన్యాన్ని సంపూర్ణంగా మన పరిమితజ్ఞానం అర్థం చేసుకోలేదు. ఐతే ఈ త్యాగాన్ని మన కోసమే శ్రీఅరవిందులు ఉద్దేశించినట్లు శ్రీమాత చెప్పినారు. దీనికి రెండేళ్ళ చరిత్ర ఉంది. రెండేళ్ళ క్రితమే దీనికి చెందిన గుర్తులు బయల్పడ్డాయి. విశాలాకాశంలో ఒక చిన్న మబ్బుతునక లాగా ఉన్న దీని నెవరూ అంతగా పట్టించుకో లేదు. శ్రీఅరవిందులు దీన్ని గూర్చి తెలుసుకోవాలనుకున్నారు. వారి శిష్యుడైన డా॥ పి. సన్యాల్ F.R.C.S (Eng) కలకత్తా నగరంలో గొప్ప సర్జన్‌గా ప్రసిద్ధిపొందిన వ్యక్తి. ఆయన శ్రీఅరవిందుల దర్శనార్థం ఆశ్రమానికి వచ్చిన తరుణంలో దీనిని చూచి ప్రమాదకరమైన చిహ్నంగా గుర్తించినారు. దీన్ని నిర్లక్ష్యం చేయకూడదని ప్రోస్టాటిక్ ఎన్‌లార్జ్‌మెంట్‌గా గ్రహించి తరచుగా మూత్రవిసర్జన చేయవలసి రావడం దాని ప్రథమ లక్షణం అని శ్రీమాతకు, శ్రీఅరవిందులకు తెలియ జేసినారు. ఆ జబ్బు లక్షణాన్ని పెరుగదలనూ ఆయన వివరించి వెంటనే వచ్చే ప్రమాదం ఏమీ లేదని, కాని కనిపెట్టి ఉండవలసిందని మాకు సలహా నిచ్చారు. రాబోయే పరిణామాలను తెలుసుకుంటే ముందరే నివారణోపాయానికి అవకాశం ఉంటుంది. శ్రీఅరవిందులు దానిపై తమ ప్రభావాన్ని చూపుతారు. ఏ విషయాన్నైనా ముందు తెలుసుకొని దాని పరిణామాన్ని గుర్తిస్తే దానిని నియంత్రించడానికి యోగశక్తి ఎక్కువగా పనిచేస్తుందని శ్రీఅరవిందులు చెప్పేవారు. విషయాన్ని తెలుసుకొని బహిరంగంగా పోరాడితే ప్రచ్ఛన్నంగా చీకటి ముసుగులో దాగికొన్న అసురశక్తులు మోహరించి యుద్ధం చేయలేవు. ఈ పోరు పర్యవసానంపై ఎవరికీ సందేహం లేదు. ఐతే శ్రీమాత ఒక సారి "ఇతరులకు సంక్రమించిన భయంకరమైన వ్యాధుల నెన్నిం

టినో వారు కుదుర్చగలిగినా తమ విషయంలో పరిస్థితులు భిన్నంగానూ కష్టతరంగానూ ఉండేవని"అన్నారు.

మేము అనుకున్నట్లుగానే ఒకటి రెండు నెలలలో ఆ వ్యాధి లక్షణాలన్నీ పూర్తిగా తొలగిపోయినాయి. డా॥ సన్యాల్ మలిదర్శనానికి వచ్చినప్పుడు శ్రీఅరవిందులు ఆయనతో ఆ వ్యాధి తననేమీ బాధించడం లేదని, దాన్ని తామే కుదుర్చుకున్నట్లు చెప్పినారు. మా విశ్వాసం దృఢతరమైంది.

'సావిత్రి' కవితాధార

వారు 'సావిత్రి' కావ్యం పై స్ఫూర్తితో ఉత్సాహంతో పనిచేస్తూ ముందుకు సాగి పోయేవారు. అధ్యాయాలని వెంట వెంట సవరిస్తూ ముద్రణకై పంపించేవారు. నాలుగైదు వందల పంక్తులు చెప్పి వ్రాయించే వారు. ఆ పంక్తుల సౌందర్యం, శబ్దముల పొందిక, విశాల విశ్వదర్శనం, వేగం ఎంతో ఆనందాన్ని కలిగించేవి. ఈ విధంగా సాగిపోతే సావిత్రి' కావ్యనిర్మాణం పూర్తి కావడానికి ఎంతోకాలం పట్టదనిపించేది. ప్రతి ఒక్కరూ 'సావిత్రి' కావ్యం ఎందాకా పూర్తి అయింది అని ఆత్రుతతో అడిగే వారు. సావిత్రి ఒక్కటే కాదు, దానితో పాటు ఎన్నో విభిన్న కార్యకలాపాలని తమ అంతఃస్ఫూర్తి ద్వారా శ్రీఅరవిందులు నిర్వహించే వారు. శ్రీఅరవిందులు సంపూర్ణంగా అంతర్ముఖులనీ, జీవితం నుండి సన్యసించిన వారనీ, తమ ముక్తియందు కానీ, తమ శిష్యుల ముక్తియందు కానీ వారి కాసక్తి లేదని కొందరు తప్పుగా విశ్వ సించేవారు. శ్రీఅరవిందులవంటి నిరంతర క్రియాశీలి విషయంలో ఇలాంటి అభిప్రాయం చోటు చేసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగి స్తుంది. వారి జీవితాన్నీ, కఠినతరమైన రాజకీయ కార్యకలా పాలు సాగిస్తూనే వారు పొందిన గొప్ప ఆధ్యాత్మిక అనుభవా లని, ఒకసారి గుర్తు చేసుకుందాం. వారి యోగదీక్షా ఫలితాల్నీ, యోగదీక్షలో కూడా వారు రచించిన మహోన్నత గ్రంథాలనీ గమనించెదము గాక వారికి ఒక్క 'సావిత్రి' మహాకావ్య రచన కాదు, వార్తాపత్రికలని చదవడం, పరిశోధక పత్రికలనీ ఆశ్ర

మానికి సంబంధించినవారు ప్రచురించే వార పక్ష, త్రైమాసిక పత్రికల పరిశీలన, నాలుగైదు భాషల్లో వ్రాయబడే పద్యాలను, వ్యాసాలను, జాబులను చదవడం, ప్రశ్నలకు సమాధానాలను చెప్పి వ్రాయించడం, వీటన్నింటినీ మించి తమ పుస్తకాలని ప్రచురణకు సిద్ధం చెయ్యడం, ఇతరుల రచనల వ్రాతప్రతులను చూడడం, ప్రూఫులు దిద్దడం – ఇవన్నీ వారి నిత్యకృత్యాలు! ఇవి గాక ప్రింటింగ్ ప్రెస్ వారి నియమాలను మన్నించడం, ఆపదలో ఉన్నవారు ఆశీస్సులను కోరుతూ చేసిన ప్రార్థనలను మన్నించి వారికి సాహాయ్యాన్నీ, చేయూతను అందించడం, వీటన్నింటినీ చూస్తే వారు తమపై వేసుకున్న కార్యభారం ఎంత అపరిమితమో స్పష్టంగా తెలుస్తుంది. ఇవన్నీ రెండే రెండు గంటల్లో పూర్తి చెయ్యాలి!

వారిలో ఒక వింత శక్తి

వారిలో ఒక మహత్తరమైన శక్తి ఉండేది. దాన్ని మేం ప్రత్యక్షంగా, అనుభవపూర్వకంగా గమనించాం. ఏదైనా ఒక వ్యాసాన్ని చదవడానికి వారి వద్దకు తీసికొని వెళ్ళినప్పుడు, "దీన్ని నీవు ఇంతకు ముందు చదవ లేదా" అనేవారు. "లేదు, ఇవ్వాళే కదా ఈ వ్యాసం వచ్చింది" అంటే "విచిత్రం, దీంట్లో ఉన్న ప్రతి పదాన్ని నేనిదివరకే చదివినట్లు అనిపిస్తున్నది" – అనేవారు. ఇలా అనేక పర్యాయాలు జరిగింది. ప్రపంచంలో వారు చేసిన పనులను చూచిన వారు వాటిని గూర్చి చెప్పుకోవచ్చు, కాని మహాయోగియైన వారి విశ్వపర్యాప్త క్రియాకలాపాలని ఎట్లా గ్రహించగలం?

'సావిత్రి' మహాకావ్యంలోని చరణాలను చదివినప్పుడు, వారి ఇతర గ్రంథాలను విలోకించినప్పుడు, లేదా వారు అనుగ్రహించినప్పుడు ఇది స్వల్పంగా మనకు అవగతమౌతుంది. బృందావనంలో శ్రీకృష్ణునితో గోపాలకుల మాదిరిగా, ఛలోక్తులనూ పరిహాసోక్తులనూ ఆనందించడమే కాకుండ, ఒక్కోసారి వారితో వాదానికి కూడ దిగేవాళ్ళం, ఎన్నో విషయాలను చర్చించే వాళ్ళం

మాకే సూచన లభింపలేదు. వారు మాకు అతి సమీపంలో ఉన్నప్పటికి చాలా దూరంగా ఉన్నారనిపించింది. వారి నిత్య కృత్యాల్లో మార్పేమీ రాలేదు. 'సావిత్రి' మహాకావ్య రచన వేగం కాస్త తగ్గింది. రెండు సుదీర్ఘమైన అధ్యాయాలలో మార్పులు చేర్పులు చేయడంలో నిమగ్నమైనాం. అప్పటికే 200 నుండి 300 వరకు పద్యపంక్తులను కొత్తగా చేర్చినారు. వారు ఎంత గొప్పగా మార్చేవారు! ప్రతిపదం, ప్రతివాక్యం చివరకి 'కామా', 'ఫుల్ స్టాప్' మొదలైన విరామచిహ్నాలు కూడా నిర్దోషంగా ఉండాల్సిందే. ఒక ఉపసర్గను ఐదుమార్లు మార్చారు. ఒక 'కామా'ను మార్చడానికి అధ్యాయభాగాన్నంతా చదువవలసి వచ్చేది. నా వంటి వాడిలో అది ఒక నూతన దృష్టిని ఆవిష్కరింప జేసింది. కాని పరిమితశక్తితో వారి సమున్నతమైన స్థితిని చేరుకోవడం ఆ భారాన్ని ఈ బలహీనమైన భుజస్కంధాలపై మోసుకోవడం సాధ్యమయ్యేది కాదు. అందుకే ఆ కావ్యంలో ఏదైనా లోటు కనిపిస్తే అది నావంటి వారి ప్రయత్నలోపమే.

ఆ సమయంలోనే కొత్త పుస్తకం ఒకటి కావాలని ముద్రణాలయం వారు కోరినారు. 'భవిష్యకవిత' అనే గ్రంథాన్ని వ్రాద్దామని సంకల్పించి, ఒక అధ్యాయాన్ని వ్రాశారు కూడాను. ఆధునిక కవిత్వంపై కొన్ని పుస్తకాలని పరామర్శించవలసి వచ్చినందున 'ఫ్యూచర్ పొయెట్రీ'ని కొంతకాలం ఆపివేసినారు. 'సావిత్రి' కావ్యాన్ని ప్రారంభిద్దాం అన్నారు. మళ్ళీ ఆ రెండు అధ్యాయాలను సవరించడమే. వ్యాధి తాలూకు చిహ్నాలు తగ్గలేదు, కాని మరీ బాధాకరంగా పరిణమించలేదు కూడా. ఏదో అప్పుడప్పుడు కాస్త మెరుగైనట్లు కన్పించేది. ఐతే వారికది అడ్డంకిగా ఉండేది కాదు. వారు తమ దృష్టిని 'సావిత్రి' కావ్యం పై కేంద్రీకరించినారు. రెండు గంటల కాలాన్ని మాత్రమే ప్రతిదినమూ వారు 'సావిత్రి' మహాకావ్యాన్ని సరిదిద్దడంలో వినియోగించేవారు. అందుకే పని నెమ్మదిగా సాగేది. వారు వాక్యాలను చెప్పి వ్రాయించేవారు. వ్రాయసగానిపై ఆధారపడటం వలన అలా జరుగక తప్ప లేదు. 'బులెటెన్' కు అదే సమయంలో ఒక వ్యాసం కావా

లని కోరినారు. అది కాగానే, ఉత్తరప్రత్యుత్తరాల పని, తది తరంగా వివిధమైన వ్యాసాలు మొదలైనవి ఎంతగా పెరిగిపోయి నాయంటే వారే అన్నారు. "నా నిజమైన పనికి సమయం లేకుండా పోతున్నది" అని.

"సావిత్రి" త్వరగా పూర్తి చేయాలి

కాస్త మార్గం సుగమం కాగానే ఇప్పుడేం చేస్తారో అని నేననుకుం టున్నప్పుడు "సావిత్రి కావ్యాన్ని తీసుకో. దాన్ని త్వరగా ముగించాలి" అన్నారు. "త్వరగా ముగిం చాలి" అన్న మాటలు వినగానే నాకు పిడుగు పడ్డట్లైంది. "త్వరగా ముగించాలా? ఎందుకని?" అని నన్ను నేను ప్రశ్నించు కున్నాను. నా కలవరపాటుకు వారేమీ స్పందించలేదు. 'సావిత్రి' లోని రెండు అధ్యాయాలపై మళ్ళీ పని ప్రారంభమైంది. వారు తొందరగా పని పూర్తిచేయాలని వేగంగా సాగిపోవడం నాకు విపరీతమైన ఆశ్చర్యం కలిగించింది. అది వారి స్వభావానికి పూర్తిగా విరుద్ధం. వారెప్పుడూ నెమ్మదిగా, నింపాదిగా, శాంతంగా, అనంతమైన కాలమంతా తమ అధీనంలో ఉన్నట్లే నిబ్బరంగా తాము తలపెట్టిన ప్రతి పనీ చేయడం వారి స్వభావం. అది సహజంగానే పవిత్రంగానూ గంభీరంగానూ ఉండేది. తరువాత వారి అలమరును తెరచి చూసినప్పుడు 'సావిత్రి' మహాకావ్య వ్రాతప్రతులెన్నో కన్పించినాయి. కొన్ని అధ్యాయాలను నాలుగు, ఐదుసార్లు మార్పులు, కూర్పులు చేసినట్లు కన్పిస్తుంది. ఎన్నో పంక్తులను కొట్టివేసి, క్రొత్త పంక్తులను వ్రాసి, వాటిని మధ్యలో చొప్పించి, బాణం గుర్తులతో ముందు వెనక పంక్తులను సవ రిస్తూ ఒక మహాసంగ్రామంలో సైన్యాన్ని నడిపించినట్లుగా ఉండేది. ఇది తెలిసిన వారికి "త్వరగా ముగించాలి" అన్న పదాలు ఆశ్చర్యాన్ని గొలుపక మానవు. వారిలో అవిశ్రాంత కార్యోత్సాహమూ పరిణతి కాస్త కుంటుపడినట్లు కూడా కన్పి ంచేది. కావ్యంలో అక్కడక్కడా పునరుక్తిగా భాసించే వాటిని కూడా పట్టించుకునేవారు కాదు. ఇలా ఎందుకు అవుతున్నది?

వారి ఓపిక ఎందుకు సన్నగిల్లుతున్నది? వారు ఎందుకంత సీరియస్‌గా ఉంటున్నారు? ఎక్కడో ఏదో లోపం జరిగిందా? వ్యాధి వలననా? ఇట్లాంటి ప్రశ్నలు నా మనస్సును నిరంతరం వేధించేవి.

సరస్వతీ దేవి వారి జిహ్వాగ్రాన నర్తించెనా

ఎట్టకేలకు సావిత్రి మహాకావ్య పునరాలోకనం పూర్తి కావచ్చింది. ఆ రెండు అధ్యాయాలు కొరకరాని కొయ్యలనిపించుకున్నాయి. అత్యద్భుత కావ్య సౌందర్యం ఉట్టిపడే వాక్యాలను అనాయాసంగా సాక్షాత్తూ ఆ వాగ్దేవతే వారి జిహ్వాగ్రాన నర్తించినట్లుగా, 'నిర్వాణం' వంటి కఠినతర విషయాలపై పంక్తులను పలుక గలిగిన అంతటి మహాయోగికి వాక్యవిరామ చిహ్నాల వంటివి కూడా అడ్డుతగిలి ఆపేవి. చివరకి ఆ రెండు అధ్యాయాలను పూర్తి గావించారు. చివరి వాక్యాన్ని సవరించి విరామ చిహ్నాన్ని పెట్టగానే చిరునవ్వుతో "అమ్మయ్య ఇప్పటికిది పూర్తి అయింది" అన్నారు. అది సుదీర్ఘ ప్రయాణానంతరం గమ్యాన్ని చేరిన పథికుని చిరునవ్వులాగా నాకు స్ఫురించింది. నిజానికి ఇంకా గమ్యం చేరినట్లే కాదు. ఇంకా ఎన్నో మైళ్ళు ప్రయాణింపవలసి ఉన్నది. "ఇక మిగిలిందేమిటి?" అన్నారు. "మృత్యుసర్గ, ముగింపు" అన్నాను. "వాటి సంగతి తరువాత చూద్దాం!" అన్నారు పరమశాంతంగా తృప్తిగా. నాకు నిజానికి తృప్తి లేదు. ఎన్నో పంక్తులు పునరుక్తమైనట్లుగా నాకు కన్పించేవి. మనస్సును కలత పెట్టేవి. ఎప్పుడో వారు సవరిస్తారులే అని సమాధాన పడేవాణ్ణి. వారి సునిశిత దృష్టిని అవి తప్పించుకోగలవా? తరువాతి కాలాన మనస్సు శోకావికలమైన వేళ నేను పునురుక్తి దోషదూషితాలు అనుకున్న వాక్యాలు అత్యద్భుత శక్తితో నా ముందు సాక్షాత్కరించినాయి.

A day may come when she must stand unhelped
On a dangerous brink of the world's doom and hers.

*

In that tremendous silence lone and lost
Cry not to heaven, for she alone can help.
She only can save herself and save the world

ప్రపంచప్రళయపు ప్రమాదపుటంచుపై నిస్సహాయంగా
ఆమె నిలువ వలసిన రోజు రావచ్చు.

*

ఏకాకిగా అగమ్యగోచరంగా
ఆ భయంకర నిశ్శబ్దంలో
ఏ దేవుని సాహాయ్యాన్నీ అర్థించకు.
ఆమెయే సహాయం చెయ్యగలదు
ఆమెయే తన్ను తాను రక్షించుకొన గలదు
ప్రపంచాన్ని రక్షింప గలదు

ఈ వాక్యాలు వారి అంతిమ సందేశమూ ఆదేశమూ కావా? అప్పుడు ఆవరించిన శూన్యభావం నెమ్మదిగా తొలగిపోయి, దాని స్థానంలో వారి కుడిభుజం, సాక్షాత్తూ కల్పతరువు అయిన శ్రీమాత కాంతిమంతంగా నెలకొన్నది.

మళ్ళీ వ్యాధి సూచనలు

వారు తలపెట్టిన పునరాలోకనం కానేలేదు. ఆ రెండు అధ్యాయాలూ పూర్తి కాగానే వ్యాధి మళ్ళీ విజృంభించింది. మూత్రం తరచుగా రావడం, దానితో బాధ మొదలైనాయి. ఇలా బాధ కలిగినప్పటికీ ఎంత అసౌకర్యంగా ఉన్నా, వారు తమపనిని ఒక్క క్షణం కూడా మానలేదు. శారీరకమైన బాధమూలంగానైనా వారికి కాస్త విశ్రాంతి లభిస్తుందనుకునే వాణ్ణి. కాని వారు దాన్నేమీ లెక్కచేయలేదు. ఒక అరగంట సమయం దొరికినాసరే, వారు తమ పనికి వినియోగించేవారు. ఎన్నోసార్లు నేను "సమయమైపోయింది" అనే వాణ్ణి. కాని వారు "కొంచెం పని చేద్దాం" అంటూ కార్యంలో నిమగ్నమయ్యేవారు. ఆ కార్యనిరతియే మనకు

'సావిత్రి' మహాకావ్యరూపంగా ఫలించింది. వ్యాధి ప్రబలుతూ ఉంటే మేము ఊరికే చూస్తూ ఉండవలసిందేగాని చేయగలిగిందేమీ లేదనీ, వారే దానికి కావలసిన చికిత్స (యోగశక్తితో) చేసుకుంటారనీ అనుకున్నాం. జబ్బు అలా ఎందుకు తీవ్రతరమౌతున్నదని నన్ను నేను ప్రశ్నించుకునేవాణ్ణి. అది మానవశరీరమే కాని, ఆయన మానవమాత్రుడైన రోగి కాడని మాకు తెలుసు. మన కొలతబద్దలూ, ప్రమాణాలూ భూగోళానికి చెందిన విధి నిషేధాలూ ఇతరగ్రహాలలో వసించే ప్రాణులకు సరిపోనట్లే, వారిని గూర్చిన మా ఊహాపోహాలు కూడా అంతే. వారి శరీరంపై పెత్తనం చేస్తూ అదృశ్యంగా ఉంటూ, దాన్ని పిప్పిచేస్తున్న రోగ లక్షణాలను చూస్తూ వారు తమ యోగశక్తితో వీటన్నింటినీ వెనక్కు నెట్టివేస్తారని అనుకునే వాళ్ళం.

ఇంకా దర్శనానికి దాదాపు పది రోజుల వ్యవధి ఉన్నది. సత్యవ్రత సేన్ F.R.C.S (Eng) అనే సర్జన్ మిత్రుడు దర్శనానికై వచ్చి ఉన్నాడు. ఆయన్ను విచారించగా, ముందు డా॥ సన్యాల్ చేసిన రోగనిర్ధారణను ఆయన కూడా ధ్రువీకరించినాడు. రసగ్రంథి పెరిగినట్లుగా చెప్పినాడు. కొద్దికాలం కనపడకపోయిందిగాని అది పెరుగుతూన్నట్లు తమకు స్ఫురించేదని శ్రీఅరవిందులు అన్నారు. శస్త్రచికిత్సకై శ్రీమాత కాని, శ్రీఅరవిందులు కాని ఆమోదం తెల్పరని ఆయనకు తెలుసు. కాథెటర్ (మూత్రనాళికను) ఉపయోగించాలని అనుకోలేదు. ఏదైనా అట్లాంటి చికిత్స చేయవలసి వస్తే దర్శనం తరువాత చేయవచ్చు ననుకున్నారు. మేము రోగ పురోగమనాన్ని అలా చూస్తూ ఉండిపోవలసి వచ్చింది. ఐతే దాన్ని నిరోధిస్తారన్న విశ్వాసం మాలో సడల లేదు. ఒక రాత్రి మూత్ర విసర్జనం ఆగిపోయింది. డా॥ సేన్‌ని పిలవడానికి నేను క్రిందికి వెళ్ళాను. ఈ మధ్యలో మూత్ర విసర్జన సాఫీగానే జరిగింది. నేను డాక్టర్ని పిలవడానికి వెళ్ళానని తెలిసి "అతనికి పిచ్చెక్కిందా?" అన్నారట. నా పిచ్చి సంగతి ఎలా ఉన్నా వారికి ఆ అడ్డంకి తొలగడం నాకు సంతోషాన్ని కలిగించింది. "ఈయనను అనవసరంగా ఎందుకు బాధ

పెట్టావ్?" అన్నారు. ప్రేమపూర్వకంగా నవ్వుతూ సరదాగా "నాకు రాత్రి ఒక కల వచ్చింది, మూత్ర విసర్జనం సాఫీగా ఔతున్నట్లనిపించింది. మేల్కొని చూస్తే ఈ ప్రతిబంధకం తొలగి పోయింది. అంతకంటే ఏం లేదు. నీకు అర్థమైందా? దీనికోసం మరీ అంత బెంబేలు పడవలసిన అవసరము లేదు" అని కొంత సేపు మాట్లాడారు. తెల్లవారి శ్రీమాతకు ఈ విషయం తెలిసి ఆమె కూడ అలాగే అన్నారు. "శ్రీఅరవిందులతో ఇంత కాలం గడిపినా నీవు భయపడటం మానలేదు". "శ్రీమాతా! శ్రీఅరవిందుల వారిని గూర్చి కదా ఈ భయమంతా" అన్నాను. ఆమె అన్నారు "అందుకే నీవు భయపడాల్సిన అవసరం అసలే లేదు. ఆయన మహోన్నత శక్తి నీ వెంట ఉండి నిన్ను నడిపిస్తున్నదని నీకు తెలియదా? భయానికి ఎంతమాత్రమూ తావు లేదు. శ్రీఅరవిందుల సేవ చేసే భాగ్యం కలిగిన మీకు ఆ ఊసే ఉండనక్కర లేదు". నాకు సిగ్గేసింది, కాని బరువు దించుకున్నట్లైంది.

దర్శనదినములు, ఒక జ్యోతిష్కుని లేఖ

దర్శనం సమీపించింది. అప్పుడే శ్రీఅరవిందులకు పెద్ద జబ్బు చేస్తుందని, అది వారికి ప్రాణాంతకం కావచ్చునీ ఒక జ్యోతిషవిద్వాంసుని నుండి జాబు వచ్చింది. మేము దానిని చూసి నవ్వుకున్నాము. "ఆయనేం వ్రాశారో విచారించినారా? ఆయన కాస్త సత్యాన్ని పట్టుకున్నట్లే అని నాకనిపిస్తుంది" అని శ్రీఅరవిందులు అన్నారు. నేనైతే అది అర్థంలేని మాట అనుకున్నాను. శ్రీఅరవిందులు జ్యోతిషాన్ని అధ్యయనం చేసినారు. ఒక వ్యక్తి గతజీవితాన్ని జ్యోతిషం చెప్పగలుగుతుందనీ, భవిష్యత్తును గూర్చి చెప్పిన విషయాలు యథాతథంగా జరుగక పోవచ్చుననీ, యోగుల విషయంలో చెల్లవనీ వారు తమ విధిని మార్చుకునే శక్తి కలిగి ఉంటారనీ శ్రీఅరవిందులే అనే వారు. కలకత్తావాసి నారాయణ జ్యోతిషి శ్రీఅరవిందులను గూర్చి చెప్పినవన్నీ నిజమైనాయి, ఒక్క విషయంలో తప్ప. అదేమంటే శ్రీఅరవిందులకు 63 వ ఏట జబ్బు చేస్తుందనీ, ఐతే

దాన్ని వారు తమ యోగశక్తితో ప్రమాదాన్ని అధిగమింపవచ్చనీ, తరువాత వారు దీర్ఘకాలం జీవిస్తారనీ చెప్పారు. "అందుకే నే నింకా జీవించి ఉన్నాను" అని నవ్వుతూ అన్నారు. ఈ ప్రపంచ క్షేత్రంలో ఏదీ మార్పురాకుండా సునిశ్చితమై నియతమై ఉంటుం దని వారు ఒప్పుకునే వారు కాదు. అనంతమైన అవకాశాలున్నా యనీ, యోగులు వీటిని మార్చుకో గలుగుతారనీ, తమ విధినీ, ఇతరుల విధులని వారు మార్చగలరనీ వారి ఉద్దేశ్యము. శ్రీఅర విందుల విషయంలో జ్యోతిషాన్ని విశ్వసించడం వట్టి వెఱ్ఱి అని మేము అనుకున్నాం. కాని వారు జ్యోతిష్కునినుండి వచ్చిన జాబునుగూర్చి వివరాలు తెలుసుకొమ్మని అంటే మాకు కాస్త కలవరపాటు కలిగించింది. ఐతే ఆ లేఖలోని విషయాలను విచా రిస్తే ఆ జ్యోతిష్కుడు ఏదో అల్పమైన వ్యాధిని మాత్రమే సూచిం చినాడని తెలిసింది. దాన్ని మేము పట్టించుకోలేదు.

కె.డి.సేథ్నాగారు తమ "శ్రీఅరవిందుల నిర్యాణం" (The Passing of Sri Aurobindo) అనే వ్యాసంలో (చిన్న పుస్తక రూపంలో కూడా ప్రచురితమైంది) ఇలాంటి విషయాన్నే ఒక దాన్ని ప్రస్తావించినారు. దర్శనం మొదలైంది. భక్తిప్రపత్తులతో జనసమూహం ముందుకు సాగుతున్నది. దర్శనాన్ని వాయిదా వేద్దామా అన్న ఆలోచన వచ్చింది కాని, ఇంతమందికి నిరాశను కల్గిస్తుంది కదా అని వారికి అసౌకర్యమైనా అంగీకరింపవలసి వచ్చింది. అంతా సవ్యంగానే గడిచింది. ఆ ప్రశాంతత, నిశ్శబ్ద వాతావరణం, శ్రీమాతారవిందుల సన్నిధి పవిత్రంగానూ, ప్రస న్నంగానూ ఉన్నది. రెండు గంటలు గడిచినాయి. శ్రీఅరవిందు లకు ఆరోగ్యం సరిగ్గా లేదని జనసమూహంలో వార్త వ్యాపిం చింది. వారు త్వరత్వరగా వారి ఆశీస్సులను గ్రహించి, తమ దృష్టికి అతీతమైన శ్రీమాతారవిందుల నిగూఢ తత్త్వానుభూతిని పొందినారు. వారి మనస్సులలో ఉన్న చింత తొలగినట్లైంది. కాని దర్శనం తరువాత వ్యాధి మరొక స్థాయిని కూడా అతి క్రమించి ముందుకు సాగినట్లు స్పష్టమైంది. కాథిటర్‌ను వాడవల సిన తరుణం వచ్చిందని తెలిసింది. డా॥ సన్యాల్‌గారిని వెంటనే

బయలుదేరి రమ్మని తంతిని పంపించినారు. ఇంతకు ముందే బయలుదేరడానికి సిద్ధంగా ఉండవలసిందని వారికి నివేదించి నారు. అత్యవసర పరిస్థితి రావచ్చునని వారికి తెల్పినారు.

శ్రీఅరవిందులు తనను తాను ఎందుకు నయం చేసుకోరు?

కాథెటర్ వలన ప్రతిబంధకం తొలగిపోయిందని మేము కాస్త ఊపిరి పీల్చుకున్నాము. అది ఎంతో కాలం నిలువలేదు. కాథెటర్‌మూలాన ఇన్‌ఫెక్షన్ మొదలై జ్వరం సోకింది. ఇది మాకు భయం, పరివేదన కలిగించింది. డా॥ సన్యాల్ రాకతో మాకు నిబ్బరం చేకూరింది. మేము వారికి అప్పటివరకూ జరిగిన చికిత్సాక్రమాన్ని తెలియజేసినాము. కొంతకాలం క్రితం తాను గుర్తించిన సన్నని వ్యాధిచిహ్నం ఇంతగా విజృంభించి దేహాన్ని యావత్తూ ఎలా వ్యాపించిందని ఆయన విస్తుపోయినారు. శ్రీఅరవిందులు తమ యోగశక్తితో మున్ను తమకు తామే స్వస్థతను చేకూర్చుకున్నారు కదా ఈ సారి వారు తమ యోగశక్తిని విని యోగించలేదా? అని వారు ప్రశ్నించినారు. కాని ఆ ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానం లభించలేదు. భవిష్యన్మానవ జాతి ఉజ్జ్వల భవితవ్యాన్ని దివ్యమైన భాషలో ఉత్తమ ప్రతీకల్లో చిత్రిస్తూ శ్రీఅరవిందులు తమ వ్యాధిని గూర్చి చింతింప లేదో, దాన్ని లక్ష్యం చేయలేదో దానికి తమ సమయాన్ని వెచ్చించ దలచుకోలేదో – ఈ విషయం ఎప్పటికీ అస్పష్టంగానే ఉంటుంది. వ్యాధి కూడ క్రమక్రమంగా అదే సమయంలో వ్యాపించింది. 'సావిత్రి' మహాకావ్యం పూర్తి యగునంత వరకు శ్రీఅరవిందులు ఆ రుగ్మతపై నియంత్రణ కొనసాగించి, ఆ మహాకావ్యం పూర్తి కాగానే ఆ నియంత్రణను తొలగించి ఉండాలి. అప్పటి దాకా మెల్లమెల్లగా వ్యాపిస్తున్న వ్యాధి ఆ కావ్యం పూర్తికాగానే ఒక్క సారిగా విజృంభించడానికి అదొక్కటే మనకు సహేతుకంగా కన్పిస్తుంది. డా॥ సన్యాల్ మంచినమ్మకంతో ఉన్నారు. మాకు కూడా విశ్వాసం దృఢమైంది. ఐతే శ్రీఅరవిందులు సంపూర్ణంగా

అంతర్ముఖులైనట్లు కన్పించింది. వీరి దృష్టిలో అంతర్ముఖీనతయే ఉపయోగకరంగా ఉన్నట్లు భావించినా రనుకోవచ్చును

ఏదో ప్రపంచానికి ప్రధానమైన మహోత్కృష్ట కార్యాన్ని సాధించడానికి తల్లీనులై వారు తమ శరీరాన్ని దాని పాట్లు అది పడుగాక అని వదిలేసినట్లున్నారు. ఆ మహాయోగి శరీరమే సకల బాధా సహిష్ణువై సమున్నత యోగసాధనకు ఉపకరణంగా ఉప యోగపడి సర్వమానవాళికి అమోఘమైన సంపత్తిని తెచ్చిపెట్టిన దని శ్రీమాత వక్కాణించినారు. ఇంతకంటే మహోన్నత యోగ శిఖరాన్ని అధిరోహించడానికి ఆ శరీరమే అడ్డంకుగా నిలిస్తే దాన్ని మార్చుడానికి వారెందుకు వెనకాడాలి? శారీరకమైన బాధ తమ కార్యమునకు అడ్డంకుగా పరిగణించినప్పుడు తమ అతీం ద్రియమైన అమోఘమైన కార్యనిర్వహణకు శరీరరూప ప్రతిబం ధకాన్ని వారు లెక్క చేయలేదు. ఈ మహోగ్ర విపత్తును కూడా తాము తమ కార్యనిర్వహణకు వినియోగించినారు. వారు ప్రతి కూల పరిస్థితులకు తలవంచలేదు. అది వారి స్వభావానికి విరుద్ధం. ఒకవైపు తమ పట్టు సడలిస్తే మరొకవైపు దానికి సరిపడు లాభాన్ని పొందే ప్రయత్నం వారు చేస్తారు. ఆ ప్రయ త్నంలో అపజయం తథ్యమని తెలిసినా తమ సమరాన్ని విరమిం చరు. చివరిదాకా ఉద్యమిస్తారు. "నా ఉద్యమం పరాజయం పొందుతుందని తెలిసినా నేను చివరి క్షణందాకా దానికై యత్నం చేస్తూనే ఉంటాను" అని వారు ఒక జాబులో వ్రాసినారు. భగవ ద్గీతలో బోధింపబడిన నిష్కామ కర్మయే వారి మతము.

'క్రిప్స్' రాయబారము

ఇప్పుడు చరిత్రకు తెలిసిన విషయము ఒకటుంది. అది క్రిప్స్ మిషన్‌కు చెంది నది. క్రిప్స్ మిషన్ భారతదేశాన్ని సంద ర్శించినపుడు శ్రీఅరవిందులు అప్పటి భారతీయ నాయకులంద రినీ దాన్ని స్వీకరింప వలసిందని కోరినారు. దానికి ఆయన శ్రమపడ్డారు. ఒక శిష్యుని తమదూతగా ఢిల్లీకి వెళ్ళడానికి అనుమతించారు కూడా. ఆ దూత వెళ్ళాక వారన్నారు "దీని

వలన ఏమీ ప్రయోజనం లేదు” అని. “అలాంటప్పుడు దాని కోసం మీరింతగా ఎందుకు శ్రమ పడ్డారు” అని మేము ప్రశ్నిస్తే “నేను కాస్త నిష్కమ కర్మ చేసానులే” అని నవ్వుతూ అన్నారు. ఆయన ఎప్పుడూ యింతే. బాహ్యాజీవితంలో కానివ్వండి, అంతర్జీవితంలో కానివ్వండి ప్రతిస్పర్థికి ఎప్పుడూ ఆశ్చర్యం కలిగించే ఎత్తులు వేసే వారు.

ఆధ్యాత్మిక చదరంగం

ఆధ్యాత్మిక చదరంగంలో వారు ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి తమ వ్యాధి విషయంలో అలా చేశారో మనకింకా బోధపడే సమయం రాలేదు. ఆయన మృత్యుసామీప్యాన్ని గమనింపకుండా ఉండరు. దానికై ఆయన పోరాటానికి సిద్ధమై హోరాహోరిగా తలపడినారు. పర్యవసానమేదైనా సరే, దాన్ని స్వీకరించడానికి సమాయత్తమైనారు. మన నియమిత బుద్ధికి అతీతమైన దైవశక్తితో, బలంతో జరుగబోవు పరిణామాన్ని ముందరే గుర్తించి దానికి తగినట్లుగా ఆచితూచి అడుగు వేసినారు. వారు అతి క్లుప్తంగా చేసిన ప్రవచనాల నైజము ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది. వారేదైనా సందేశాన్నికాని, సలహానికాని తమ కార్యక్రమానికి యోగసాధనకు సంబంధించి చివరిసారిగా ఆదేశించినారా అని ఎవ్వరైనా ప్రశ్నించినపుడు “ఔను” “కాదు” అని చెప్పవలసి వస్తుంది – అంటే వారు అంతర్ముఖులైన పిదప ఏ కార్యక్రమాన్నీ చేపట్టలేదు, ఏ వ్యాఖ్యానము చేయలేదు. ఏదైనా మాట్లాడితే వారి జబ్బుకి సంబంధించిన విషయాలు మాత్రమే మాట్లాడేవారు. “ఔను” అని ఎందుకు చెప్పవచ్చునంటే, వారు అంతర్ముఖులగుటకు ముందే ‘సావిత్రి’ మహాకావ్యాన్ని పూర్తి చేసారు. వారి చివరి ఆదేశంగా, వారి మహోపదేశంగా గ్రహింపవలసిన స్వర్ణ పంక్తులు, మేము పునరుక్తులనుకున్న పంక్తులే. ఐతే అవి పునరుక్తులైనా యోగరహస్యానికి అద్దం పట్టే పంక్తులు. వాటి సారాంశం శ్రీమాత శరణాగతి. ఆ మహోదాత్తమైన వాక్యాలను గమనిద్దాం, అర్థం ప్రస్ఫుటమౌతుంది.

A day may come when She must stand unhelped
On a dangerous brink of the world's doom and hers,
Carrying the world's future on her lonely breast,
Carrying the human hope in a heart left sole
To conquer or fail on a last desperate verge.

*

in that tremendous silence lone and lost
Of a deciding hour in the world's fate,

*

Alone she must conquer or alone must fall.

*

Cry not to heaven, for she alone can save.
She only can save herself and save the world.

ప్రపంచవిధి తనవిధి
ఒక శిఖరమైతే దాని ప్రమాదపుటంచుపైన
తన యెదలో ప్రపంచ భవిష్యత్తును భరిస్తూ
ఆ ఏకాకి హృదయంలో
మానవాశా సమూహాన్ని సమగ్రంగా మోస్తూ
నిరాశా శిఖరాంచలాన
జయమో పరాజయమో అనివార్యమైన వేళ
ఆమె నిస్సహాయంగా
నిలబడవలసిన దివసం రావచ్చు

*

ప్రపంచ విధిని నిశ్చయించే ఆ ముహూర్తాన
భీకర నిశ్శబ్దంలో ఏకాకిగా దారీతెన్నూలేక
ఏకాకిగానే ఆమె జయించాలి లేదా
ఏకాకిగానే ఆమె పరాజయం చవి చూడాలి.

*

స్వర్గానికి చేతులు చాపకు
ఆమెయే రక్షింపగలదు
ఆమెయే తన్ను తాను రక్షించుకొని ప్రపంచాన్ని రక్షింపగలదు.

వారి సంతృప్తి, అంతర్లీనత

మృత్యుసర్గను పూర్తి చేయాలని వారు తొందరపడలేదు. వారి ప్రధానకార్యం సమాప్తమైంది. అందుకే సంతృప్తితో మందహాసం చేసినారు. ఏది అత్యంత ప్రధానమైనదో దాన్ని చెప్పగలిగినారు. ఏది ప్రధానం కాదో దాన్ని గూర్చి తర్వాత చూద్దాం అన్నారు సాభిప్రాయంగా. అత్యంత ప్రభావపూరితమైన సందేశాన్ని ప్రసాదించిన తరువాత నెమ్మదిగా వారు అంతర్ముఖులైనారు. వైద్యనిపుణులు దానిని మూత్రవ్యాధి సంబంధమైన అసహజ గాఢనిద్ర (coma) గా నిర్ధారించారు. "కాని శ్రీఅరవిందులు మధ్యమధ్యన లేచి దాహమౌతున్నదని, సమయం ఎంతైనదని అడిగారు, కాని అలాంటి కోమాను నేను వైద్యునిగా నా సుదీర్ఘ అనుభవంలో చూడలేదు" అని డా॥ సన్యాల్ అన్నారు. కోమా ఏ రకానికి చెందిందైతేనేమి, సమస్య జటిలమై కూర్చున్నది. మేము శ్రీఅరవిందుల యోగశక్తి పైనే భారం వేశాం. పర్యవసానం అంత ఆశాజనకంగా కన్పించలేదు. ఎంత విలువైన మందులు, మాత్రలు, ఇంజెక్షన్లు వాడుతూ ఉన్నా వారి యోగశక్తి లేకుండా అవి ఏం పనిచేస్తాయి. మానవమాత్రులం మనం మన ఔషధాలనే వాడుతాం, మంచో చెడో వాటిమీదే ఆధారపడతాం. ఒక అర్ధ శతాబ్దకాలం ఏ ఔషధాన్ని వినియోగింపని ఆ మహాయోగికి ఈ ఔషధాలను, ఇంత శక్తిమంతమైన వాటిని ఎలా వాడటం అన్న సమస్యకూడా మమ్మల్ని వేధించింది. శ్రీఅరవిందులను దర్శించినవారికి వారి శరీరం ఎంత మృదువుగా, పవిత్రంగా, కాంతిమంతంగా ఉండేదో తెలుసు. వారు బల్ల ముందు కూర్చుని వ్రాస్తున్నప్పుడు వారి సుందరమైన హస్తాలు, సన్నవైన వ్రేళ్ళు మానవాతీతకాంతిని కలిగినట్లు స్ఫురించేవి. ఎంతో సుందరమైన పవిత్రమైన ఒక కాంతి ఆ శరీరాన్ని ఆవహించినట్లు తోచేది.

వారు వ్రాసుకుంటున్నప్పుడు చేతులు తలక్రింద పెట్టుకొని దివ్య మాత ఒడిలో శయనించినారా అన్నట్లు ప్రశాంత మందహాసంతో కన్పించే ఆ ఉదాత్త విగ్రహాన్ని నేను ఎన్నిమార్లు చూచి ఉంటాను! అతిమానుష దైవపురుషుడెవరో మానుష రూపాన్ని ధరించి వచ్చినట్లుగా ఉన్న ఆ తేజోమయమూర్తికి, సాధారణ మనుష్యులకు చేసే చికిత్సను చేస్తే అది మాకు అపచారంగా తోచేది. మానవపరిధిలో ఎంత మహావ్యక్తికైనా ఇట్లాంటి పద్ధతి తప్పనిసరి అవుతుంది. అందుకే వారికి బాధాకరమైన ఉపకరణా లను ఉపయోగిస్తూ చికిత్స చేశాం. వారు దానిని దయచేసి అంగీకరించారన్న విశ్వాసంతో, ధైర్యంతో, కాథెటర్ పనిచేయ దనీ, వ్యర్థమనీ, వారు వారించినా ఔషధాలను వాడాలని మేము నిర్బంధం చేసాం, ఆ ఔషధాలపై మాకున్న విశ్వాసం మూలాన. వ్యాధి ముదురుతూ ఉంటే గమనించి వారిని తమ యోగశక్తిని వినియోగింప వలసినదిగా మేము అభ్యర్థించినాం. ఏ వ్యాధి వెనుకనైనా, ప్రతివిషయం వెనుక కూడా ముందుకి నడిపించే శక్తులూ, వెనుకకు లాగే శక్తులూ రెండూ ఉంటాయి. వీటిని సరియైన అజమాయిషీలో నిర్వహిస్తే సత్ఫలితం వస్తుంది. ఇలా ప్రయత్నపూర్వకంగా చేసినవారికి ఇది నిజమని తెలుసు. అందుకే శ్రీఅరవిందులు యోగశక్తివినా ఈ ఔషధాలతో ఎంత ప్రయత్నించినా అది ఉపరితల చికిత్స అవుతుందే తప్ప, తాత్కా లిక ఉపశమనం లభిస్తుందే తప్ప సమూలంగా నయంకాదని మాకు తెలుసు. వారితో ఈ విషయాన్ని ప్రస్తావించినప్పుడల్లా వారి నిశ్శబ్దం మాకు సమస్యగా ఉండేది. అయితే వారు తమ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తున్నట్లుకాని, తమ ఆరోగ్యంకంటే ప్రధాన మైన మానవజీవన పరమోపకృతి కోసం యత్నిస్తున్నట్లుకాని మాకు కన్పించలేదు. ఆ వ్యాధి ప్రబలినకొద్దీ మా బాధ్యత గురు తరమై మా మనస్సులను కలవరపెట్టేది. ఫలితంగా మాకు సాధ్యమైన, లభ్యమైన ప్రయత్నాలన్నింటినీ వారిని రక్షించడానికి చేసితిమి. కాని విధివ్రాత వేరేవిధంగా ఉన్నది. చివరికి పాఠశాల వార్షికోత్సవం దగ్గిర పడింది.

పాఠశాల క్రీడోత్సవాలు

డిసెంబరు 1, 2 తారీఖుల్లో క్రీడావ్యాసాంగాలు, నాటకోత్సవాలు ఈ సందర్భంగా ప్రముఖంగా ఉంటాయి. ఆశ్రమమంతా ఉత్సాహంగా ఆ ఉత్సవాల్లో నిమగ్నమైంది. కాని శ్రీఅరవిందుల గదిలో ఒక విచిత్ర విషాదనాటకం నడుస్తున్నట్లు ఆశ్రమవాసులకి తెలియదు. ఆశ్రమవాసులకు అప్పటిదాకా శ్రీఅరవిందుల ఆరోగ్యస్థితిని వెల్లడించలేదు. ఆ వ్యాధి స్వభావం కూడా అట్లాంటిదే. పైకి ఏమీ కనిపించదు. అందుమూలాన ఆశ్రమవాసులకు వారి అస్వస్థతను గూర్చి తెలియదు. అది గోప్యమైన రహస్యంగా ఉండిపోయింది. ఆ ఉత్సవాలు సమాప్తం కాగానే తెర తొలగిపోయినట్లు, అప్పటిదాకా బలంగా నిరోధింపబడిన వ్యాధి ఒక్కసారిగా పెల్లుబుకడానికి అనుమతి దొరికిందా అన్నట్లు విజృంభించింది. 'అన్నట్లు' అన్న ప్రయోగాన్ని ఎందుకు చేస్తున్నానంటే, 2 వ తేదీ రాత్రి పాఠశాలోత్సవాలు సమాప్తం అయినాయని వారికి తెల్పగానే, సంతోషంగా చిరునవ్వుతో "ఓహో సమాప్తమైందా?" అన్నారు. అది వినినతర్వాత వ్యాధిరూప శత్రువునకు యథేచ్ఛగా ప్రవర్తించడానికి వారు అనుమతి ఇచ్చినట్లైంది. బాహిర ప్రపంచంలో, భౌతికకాయంతో, నిమిత్తం లేని అంతర్ముఖీనతలో వారు నిమగ్నమై పోయినారు.

డిసెంబరు 4 వ తేదీ స్వర్ణాక్షరాలతో లిఖింపదగినది. శ్రీఅరవిందులు సంపూర్ణ జాగ్రదవస్థను పొంది కుర్చీలో కూర్చోవాలని కోరినారు. మేము వారించినా వారు పట్టించుకోలేదు. వ్యాధి తాలూకు లక్షణాలన్నీ మటుమాయమై సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందినట్లు మాకు కన్పించగా, విస్మయంతో ఒకరినొకరు చూసుకున్నాం. ఆయన కుర్చీలో ఆసీనులైనారు.

అకస్మాత్తుగా ఇలాంటి మంచిమార్పు రావడం మాకు ఆనందాన్ని కలిగించింది. ఆశ్చర్యమూ కలిగింది. వారు చివరికి మా ప్రార్థనను మన్నించినారనుకొని మేము సంతోషపడ్డాం. నమ్మలేనంతమార్పు. మా హృదయంలో ఆనందం నిండుకున్నది. కాస్త ధైర్యం కూడగట్టుకొని మళ్ళీ వెనకటి ప్రశ్ననే వారి నడిగాం,

"మీరు ఈ వ్యాధినుంచి విముక్తులు కావడానికి మీ యోగ శక్తిని వినియోగించడం లేదా?" అని. "లేదు" అని వారు స్పష్టంగా మమ్మల్ని హతాశుల్ని చేసే సమాధానమిచ్చారు. మా చెవుల్ని మేము నమ్మలేక మళ్ళీ అదే ప్రశ్న అడిగాం, సందేహానికి తావుండకూడదని. మరీ సుస్పష్టంగా, నిశితంగా మళ్ళీ అదే సమాధాన మిచ్చినారు. "మీరు ఎందుకు మీ శక్తిని ఉపయోగింపరాదు? ఉపయోగింపకుంటే ఈ వ్యాధి ఎలా నయమవు తుంది?" అని మేము ధైర్యంచేసి అడిగినాము. "వివరింపలేను, మీకు అర్థం కాదు" అని సూక్ష్మంగా గూఢార్థ గర్భితంగా సమాధానమిచ్చారు.

వ్యాధి యొక్క మూడు దశలు

అసలు రహస్యం తరువాత విశదమైంది. వ్యాధి క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. మూడు దశల్లో దీని ప్రగతి కన్పిస్తుంది. 'సావిత్రి' మహాకావ్యాన్ని పూర్తి చేయడం, దర్శనం, పాఠశాల వార్షికోత్సవం ఈ మూడు దశలలో ఒకదానికంటె మరొకటి వారి అంతర్ముఖీనతను స్పష్టం చేసినాయి. చివరిదశలో ఒకమారు శ్రీమాత అన్నారు "నేను వారి వద్దకు ఎప్పుడు వెళ్ళినా వారు అతిమానసతేజస్సును ఆవాహనం చేస్తున్నట్లు నాకు కన్పించింది" అని. శ్రీఅరవిందులు తల్లగ్నులైనారని దీని వలన తెలుస్తుంది. శారీరకమైన బాధలను ఉపశమింప చేసే కంటే, తమ శక్తినంతా అతిమహోన్నతమైన కార్యక్రమానికి వినియోగించినారు. మనకా రహస్యం తెలియలేదు, తెలిసికొనే శక్తీ లేదు. వారు తమ శక్తితో తేజస్సును అవతరింపజేసి తమ వ్యాధిని నిర్మూలించుకుంటారనీ, మా అభిమతాన్ని మన్నిస్తారని అనుకున్నాం. వారి నిశితమైన "లేదు" అన్న సమాధానం మా ఆశను పూర్తిగా ప్రతిహతం చేసినా, అది విశ్వాసాన్నికూడా కలి గించింది. ఆ మహాయోగి అస్తమయానంతరమే, వాటి గూఢా ర్థాన్ని స్పష్టంచేసే సంఘటనలు మాకు అనుభూతమైనాయి.

చివరి చూపు


ఒక గంట తర్వాత కుర్చీనుండి లేచి వారు మంచం వద్దకు వచ్చారు. మళ్ళీ వ్యాధి ఒక్కసారిగా వారినావేశించి నట్లుంది. ఆ కొద్ది విరామం తమ నాక్రమింప వస్తున్న మృత్యువుతో పోరాడటానికి అవ కాశం కలిగినట్లు స్ఫురించింది. అంతిమ క్షణానికి అరగంట ముందు వారు కాస్త నీరు త్రాగారు. అందరినీ కృపాపూరిత నేత్రాలతో చూస్తూ సేవనందించిన వారిని గుర్తించి ఆశీర్వదిం చినట్లు వీక్షించి శాశ్వత నిద్రలో లీనమైనారు. అప్పటికీ మాకు తోచలేదు.

This was the day when Satyavan must die.

"సత్యవంతుడు మృతి నందవలసిన సమయమది" అని.

అది మృతదేహం కాదు హిరణ్మయ పాత్ర

ఆ విషాదవార్త వేకువజామునే వ్యాపించింది. వారి శిష్యుల విషా దాన్ని వర్ణించడం సాధ్యం కాదు, దాన్ని ఊహింప వలసిందే. ఆ నిశ్శబ్దరాత్రి శిష్యులంతా ఒకరి వెంట ఒకరు స్వర్గానికి నిచ్చెనమెట్లను ఎక్కి ఎవరూ దర్శింప రాని మహోన్నత సత్యాన్ని సాక్షాత్కరించుకున్నారు. అది మృత్యువు కాదు. పునరుత్థానం కాదు, నిర్వాణ ప్రాప్తి కాదు. ఒక ప్రశాంత గంభీర విశ్రాంతి, శక్తితో నిర్భరమైన మృత్యువు. సౌందర్యకాంతి తొణికిసలాడుతున్న అవయవాలు – వీటిని గమ నిస్తే మృత్యువు ఈ మహాప్రభువు శరీరంలో అమృతత్వాన్ని పొందినట్లనిపించింది, భౌతికకోశంలో సత్యం సాక్షాత్కరించినట్లు. అది శరీరం కాదు. సత్యాన్ని దృశ్యాదృశ్యంగా వెలార్చే హిర ణ్మయపాత్ర. అంతర్దృష్టి కలవారికి సత్యం స్పష్టమైంది. అంతః శ్రుతి కలవారికి వారి హృదయకుహర మధ్యంలో స్పష్టమైన *"నేనిక్కడే ఉన్నాను, నేనిక్కడే ఉన్నాను"* – అన్న నాదం విన్పించింది.



A living Presence deathless and divine,
A Form that harboured all infinity.

ఆ ప్రబుద్ధచైతన్యంలో మనం గమ్యం వైపు పురోగమిస్తున్నాం. మహాయోగి మనకు నిర్దేశించిన గమ్యమది, అంతిమక్షణం వరకూ యత్నించిన గమ్యమది. అది సిద్ధించే వరకూ అవిశ్రాంతంగా శ్రమిస్తానని వాగ్దానం చేసిన గమ్యమది. గమ్యాన్ని స్వాయత్తం చేసికొన్న శ్రీమాత – పరాప్రకృతి మనకు మార్గదర్శకురాలు, మన ఆరాధ్యదేవత. ఆ మహాయోగి అమేయ ఆధ్యాత్మిక తాంత్రిక శక్తితో బాటు తమకు సంక్రాంతం చేయబడిన అతిమానసిక కాంతితో జేగీయమానమైన శ్రీమాత మనలను భవిష్యన్మానవజాతి నమూనాగా తీర్చిదిద్దుతున్నారు. ఆ ఉపద్రవము తరువాత ఆశ్రమాన్ని సందర్శించిన వారికి, ప్రతిసాధకుని హృదయంలో విరాజిల్లుతున్న విజయకాంక్ష ఆ మహోన్నత త్యాగఫలంగా స్ఫుటంగా కన్పిస్తుంది. వారి సమాధి నుండి వేయి వెలుగులు వికసించి మన అంతశ్చైతన్యంలో ప్రవేశించి, పునర్నవంగా తీర్చిదిద్దే పవిత్రాగ్నిశిఖవలె, సముజ్వలంగా శ్రీమాత యందు లీనమై ప్రకాశమానమై సర్వత్రా మనకు అనుభూతమౌతున్నాయి. వారి సాన్నిధ్యం, అడుగుల సవ్వడి, వారి మనోహర కంఠం ఇవన్నీ శరీరంతో నిమిత్తం లేకుండా నిత్యజాగృతంగా మనకు కన్పిస్తాయి. ఒకనాడు ఆ మహోన్నత త్యాగానికి ఫలితం లభిస్తుంది. 'సావిత్రి' మహాకావ్యంలో వారు చిత్రించిన ప్రపంచం యథార్థంగా సాక్షాత్కరిస్తుంది. శ్రీమాతారవిందుల ఆధ్యాత్మిక జీవనాఖ్యాయికలే కదా 'సావిత్రి' మహాకావ్యమంటే! సావిత్రి మహాకావ్యంలో వారు ప్రవచించిన గాథ ప్రపంచ రంగస్థలంపై ఆవిష్కృతమైంది. ఆ నాటక ప్రథమాంకంపై తెరపడ్డది. తరువాతి భాగం తెర వెనుక సమాయత్తమౌతున్నది. భీకర ప్రతిస్పర్థితో సమరం ఇంకా సమాప్తం కాలేదు. భూతలంపై సమరక్షేత్ర పరాజయంలాగ కన్పించినా అతీంద్రియ భూమికలపై యుద్ధం సాగుతూనే ఉన్నది. ఈ యుద్ధం సమాప్తి పొందుతున్న సమయాన తెరదీసిన వేళ మృత్యుపుస్తక పఠనాన్ని ఆకర్షిస్తాం. దీని చరమ ఘట్టం భూలోకంలో ఆవిష్కరింపబడుతుంది. ప్రపంచమంతటా

సమధికోత్సాహంతో దశదిశల్లో ప్రతిధ్వనిస్తూ "నేనిక్కడే ఉన్నాను, నేనిక్కడే ఉన్నాను" అన్న జయధ్వానం మారుమ్రోగుతుంది.

మే, 1951

మూలం: నిరోద్‌బరన్
అనువాదం: ఆచార్య యస్. లక్ష్మణమూర్తి

వందేమాతరం

భారత జనయిత్రి

జనయిత్రీ,
ఓ భారత జనయిత్రీ,
అతిలోక దివ్య రోచిర్నివహం వైపు తొలిసారిగా
మానవ నేత్రాలు మేలుకున్న పుణ్యధాత్రివి నీవు!
ఆసియా ఖండమందు పవిత్ర యాత్రా క్షేత్రానివి నీవు,
మహాశక్తి సంభరిత మహనీయ మాతృభూమివి నీవు!
ఓ విశ్వమాతా! మానవాళికి వేదవేదాంత
తత్వనిధి తొలిప్రదాతా!
మనిషికి మహావిజ్ఞానం, భగవత్ ప్రేమ, దివ్యకళలు,
దివ్యకర్మలు, తెరుచుకున్న మత గవాక్షం
ప్రసాదించినావు తల్లీ!

నేడు దీనస్థితికి దిగజారావని నిన్నెవరు
తూలనాడ సాహసించగలరు ఓ మాతా, భరతమాతా!
ఆత్మజ్ఞానం, ఆరాధన, దివ్యకర్మల మాతృదేవతా,
ఆత్మ అంతర్గత కిరణ పరిపోషకా!

మహనీయ దివ్యగీతాలకే మకుటాయమానమైన
భగవద్గీతను భగవంతుడే నీ జాతికి ఆలపించాడు ఓ జనయిత్రీ!

భగవత్ ప్రేమ సుధాధారలు గ్రోలి మత్తిల్లి నీ పవిత్ర
మృణ్మయ సీమపై చైతన్యుడు నాట్యం చేశాడు.
ఇచట కారుణ్యపు అమర సూర్యబింబాన్ని బుద్ధుడు
వెలిగించాడు.
యువ యోగీశ్వరుడు శంకరుడు నీ దివ్య సందేశం – "అహం
బ్రహ్మాస్మి" – వినిపించాడు.

నేడు దీనస్థితికి దిగజారావని నిన్నెవరు
తూలనాడ సాహసించగలరు ఓ మాతా, భరతమతా!
ఆత్మజ్ఞాన, ఆరాధనా దివ్యకర్మల మాతృమూర్తీ,
ఆత్మ అంతర్గత కిరణ పరిపోషకా!

కాలాతీత వేదమంత్ర నాదాలను ఆర్యద్రష్టలు గానం
చేసిన భారతావని నీవు కాదా?
మేము వారి వారసులం గామా?
ఆ మహిత వారసత్వం ఆయుధశ్రేణిగా ధరించి
ఈ నేలపై శిరస్సులు వంచకుండా నడుస్తాం.
సముజ్జ్వల గతాన్ని సంపదగా పొందిన మేము
ధైర్యవంతులం, గర్వోన్నతులం తల్లీ!

ఆ వెలుగు తగ్గినా, పోగొట్టుకున్నా, ఛిన్నా ఛిన్నమైనా
నీ బిడ్డలమైన మేము, నీ ఘనకీర్తిని ఆలపించే మేము ఎలా
దుఃఖించగలం?

గతకాలపు వైభవోజ్జ్వల సువర్ణదినాల దివ్యాదర్శం
మా కనుల ముందు కదలాడుతున్నది.

మా భవిష్యద్దర్శన జ్వాలల్లో ఒక వినూతన ప్రపంచం
ప్రభవిస్తున్నది
ప్రేమ ప్రపూరిత భారతావని నిర్మాణానికి దీక్ష వహిస్తాం!

నేడు దీనస్థితికి దిగజారావని నిన్నెవరు తూలనాడ సాహసించ
గలరు? ఓ మాతా,
ఆత్మజ్ఞాన, ఆరాధన, దివ్యకర్మల మాతృదేవతా
ఆత్మ అంతర్గత కిరణ పరిపోషకా!

ద్విజేంద్రలాల్‌రాయ్ బెంగాలీ గీతానికి శ్రీఅరవిందుల అనువాదం
తెలుగు సేత: కె. యజ్ఞన్న

సమాచార పత్రం

శ్రీఅరవిందుల సమాధి మీద చెక్కిన శ్రీమాత సందేశము:

డిసెంబరు 9, 1950

మా ప్రభువు యొక్క ఆచ్ఛాదమా! ఇవియే మా అనంతకోటి కృతజ్ఞతాభి వందనములు. మా కొరకు మీరెంతయో శ్రమించిరి. పాటుపడిరి. పోరాటమును సల్పిరి. బాధలను భరించిరి. ఆశా జ్యోతిని వెలిగించిరి. సంకటములను సహించిరి. మా కొరకై ఒక మహాకార్యమును సంకల్పించిరి. నిర్వహించిరి. బాటను ఏర్పర చిరి. కార్యమును సాధించిరి. నీ మ్రోల ప్రణమిల్లి మేము మీకెంతయో ఋణపడి యున్నామన్న సంగతి ఒక్క నిముసమైనా విస్మరించ కుండునట్లు అనుగ్రహింపమని వేడుకొనుచుంటిమి.

డిసెంబరు 5, 2000 నాడు శ్రీఅరవిందుల మహాసమాధి 50 వ వార్షికోత్సవమును ఆశ్రమంలోను, వివిధ శాఖలు, కేంద్రముల లోను ఉచితరీతిని జరుపబడును.

17 నవంబరు, 2000 నాడు ఆశ్రమంలో శ్రీమాత మహాసమాధి యొక్క 27 వ వార్షికోత్సవము జరిగినది. ఉదయం 6 గం॥ లకు సమాధి ప్రాంగణంలో ధ్యానము, 6-30 గం॥ ల నుంచి శ్రీమాత మందిర దర్శనము జరిగినవి. సాయంత్రం క్రీడారంగంలో కవాతు